# నీ జతగా నేనుండాలి

మాలా కుమార్(కమల పరచ)

Nee Jathagaa Nenundaali By Mala Kumar

First Published : November 2023

copies : 500

Price : 175rs / 9.99$

Cover Page : Anu Bulusu

Books Available at : All Leading Book Stores & Smt.
Mala Kumar -7/315-3, Plot no: 6,
Marutinagar, Yusufguda
Hyderabad-500045
prabhatakamalam@gmail.com
Mobile: 9989051913

Printed at : Colour Graphics Hyderabad.


Copy Rights Reserved : Any unauthorised reprint or use of this meterial is prohibited. No part of this book may be reproduced or transmitted in any form or by any means, electronic or mechanical, photocopying, including recording, or by any information storage and retrievel system without express written permission from the author.

# మాతృదేవోభవ - పితృదేవోభవ



**శ్రీ మాడపాటి కృష్ణమూర్తి**
**శ్రీమతి మాడపాటి సీతాదేవి**

# అంకితం



**నాలోని నా సర్వస్వం**
**ప్రియమైన ఏమండీ గారు**
**మేజర్ ప్రభాత్ కుమార్ గారికి**
**ప్రేమతో...**

# నమస్సుమాంజలి

నాకు చిన్నతనము నుంచే పుస్తకాలు చదవటము అలవాటు చేసి, సాహిత్య అభిలాష కలగజేసి, ఈనాడు రచయిత్రిగా అడుగిడటానికి తోడ్పడిన అమ్మ, నాన్నగారు శ్రీమతి. మాడపాటి సీతాదేవి, కీ. శే. శ్రీమాడపాటి కృష్ణ మూర్తి గార్లకు,

పూజ్యులు, నా శ్రేయోభిలాషులు అత్తగారు, మామగారు కీ.శే. శ్రీమతి పరచ అనసూయ, కీ.శే. శ్రీ పరచ కిషన్ రావు గార్లకు...

నా చేయందుకున్న క్షణం నుండి ఈ క్షణం వరకు అన్నివిధాలుగా ప్రతి అడుగులోనూ నాకు అండదండగా వుండి, నన్ను ప్రొత్సహిస్తున్న నా జీవన సహచరులు, శ్రీ. మేజర్. ప్రభాత్ కుమార్ గారికి...

నాతొలి ప్రయత్నం సందర్భంగా నా పాదాభివందనములు.

# కథామాల


| | |
|---|---|
| 01. నీ జతగా నేనుండాలి | – 11 |
| 02. మట్టిలో మాణిక్యం | – 26 |
| 03. దయచేసి సారికారాజ్‌తో మాట్లాడవచ్చా? | – 33 |
| 04. ధీర | – 42 |
| 05. చాందిని | – 56 |
| 06. అలమారా లిఫ్ట్‌తో అగచాట్లు | – 63 |
| 07. చూపులు కలవని శుభవేళ | – 74 |
| 08. అహో లక్ష్మణా!!! | – 79 |
| 09. మనసు తెలిసిన చందురూడా... | – 83 |
| 10. రాధామాధవీయం | – 94 |
| 11. విధివిన్యాసాలు | – 105 |
| 12. గుండెకీ గుబులెందుకు! | – 116 |
| 13. రాజాకీ ఆయేగీ బారాత్ | – 129 |
| 14. మౌనమే నీ భాష! | – 135 |
| 15. సారీ, మర్చిపోయా! | – 139 |
| 16. అత్తకూ అల్లుని మురిపెం! | – 143 |
| 17. అమ్మమ్మకు విడాకులు తప్పాయ్!!! | – 147 |

18. నీయెంటే నేనుంటా - 156

19. పంచవటి - 160

20. HUMAN LIBRARY (హ్యూమన్ లైబ్రరీ) - 166

21. మతం వద్దు, గతం వద్దు, మారణహోమం వద్దు - 170

22. సాలీ ఆధీ ఘర్ వాలీ! - 176

23. వడ్లగింజలో బియ్యం గింజ! - 183

24. వరించి వచ్చిన సిరి - 186

25. సహచరి - 190

26. అయినదిపో... మేమేల పోవలె... పోతిమిపో... - 193

27. సువ్వీ సువ్వీ పాడాలమ్మా!!! - 199

28. అత్త ఉన్న కోడలు ఉత్తమురాలు - 204

29. అమరప్రేమ - 210

30. ఇదేమి గారడీ!! - 215

31 గుండెల్లో గుండె దడ! - 218

32 అమూల్య - 222

33 కరిగిపోయిన కష్టం! - 229

34 ఆశాకిరణ్ - 244

35 నీకై వేచేను! - 248

36 మాయాజాలం - 253

37 శ్రావణసమీరం - 262

38 ఇష్టసఖి - 268

39 హైస్కూల్ స్వీట్ హార్ట్స్ - 275

40 మౌంట్ రష్మోర్‌లో రాధామాధవులు - 281

41 నొప్పింపక తానొవ్వక - 287

42 పలుకరాదుటే చిలుకా - 293

43 ఆత్మీయబంధం - 297

44 వాలుచూపుల వయ్యారి - 309

45 మంచు తుఫాన్‌లో బామ్మా, మనవరాలు! - 312

46 దరిద్రం వదిలింది - 321

47 మహామాయ - 326

48 ఆమె ఎవరు? - 336

49 అత్తగారి బ్లాక్ మనీ - 345

50 మామగారూ - బాంక్ ఎకౌంట్స్ - 351

51 అత్తగారి మాట పట్టుచీరల మూట! - 356

52 కిడ్డీ బాంక్ - 360

53 ఏమండి బడ్జెట్ సమావేశం! - 364

# 1. నీ జతగా నేనుండాలి

హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయం.

లాంజ్‌లో కొత్తపెళ్ళికూతురు గౌరి తల కాస్త పక్కకు వంచి అరమోడ్పులైన కన్నులతో అలసటగా కనిపిస్తోంది. ప్రకాష్ తదేకంగా గౌరినే చూస్తున్నాడు. కుందనపు బొమ్మలాంటి ఈ గౌరిలో ఆ స్తబ్ధతపోయి వసంతం వస్తుందా? శూన్యంలోకి చూస్తున్నట్లున్న ఆ చూపుల్లో ఎప్పటికైనా చురుకుతనం కనబడుతుందా? తను మనసు పడిన ఈ కన్నె పిల్ల మనసు ఎప్పటికైనా తనదవుతుందా? ఆలోచిస్తున్న ప్రకాష్ మనసు గత మూడు వారాలుగా జరిగినదంతా గుర్తు చేసుకుంది.

పెళ్ళిపందిరి పూల సువాసనలతో, సన్నాయి రాగాలతో, పట్టుచీరల రెపరెపలతో సందడిగా వుంది. వెనకనున్న వంటగది నుంచి వంటకాల ఘుమఘుమలు నోరూరిస్తున్నాయి. చిన్నపిల్లలు సందడిగా హాలంతా పరిగెడుతున్నారు. వాతావరణం ఆహ్లాదంగా వుంది.

పెళ్ళితంతు జరుగుతోంది. పెళ్ళికూతురు అలంకరణలో అందంగా, కోమలంగా వున్న గౌరి చేతిలో కొబ్బరి బోండాంతో చిన్నగా వచ్చి పెళ్ళిపీటల మీద సున్నితంగా కూర్చుంది. వధూవరుల మధ్యలో చక్కగా పెయింట్ చేసిన తెరపట్టు పట్టుకున్నారు. తలెత్తి చూసాడు ప్రకాష్. "ఆగుబాబూ చూద్దువుగాని, తొందరపడకు"అని సరసాలాడారు పక్కనున్నవారు. జీలకర్ర, బెల్లం పెట్టాక తెరపట్టు తీసి "వధూవరులు చూసుకోండి" అని పర్మిషన్ ఇచ్చాడు బ్రాహ్మడు. కుతూహలంగా తలెత్తి చూసిన ప్రకాష్ కు తలవంచుకొని కూర్చున్న గౌరి కనిపించింది. గౌరి సిగ్గు చూసి చిన్నగా నవ్వుకున్నాడు. తలంబ్రాల కార్యక్రమంలో, తలంబ్రాలలో ఊరికే చేయి కదుపుతూ కూర్చున్న గౌరిని అందరూ ఆటపట్టించారు. తల ఇంకా కిందికి వంచేసింది. "ఏం వదినా పూలజడ

బరువా? సిగ్గా?" అని వేళాకోళం ఆడింది ఆడపడుచు. పెద్దలంతా వచ్చి వంగిన వధువు తల మీదా, వంగని వరుడి తల మీదా అక్షింతలు వేసారు - వధూవరులు ఈడూజోడూ ముచ్చటగా ఉన్నారని మనసులో తలుస్తూ.

ఎర్రపట్టు చీరలో అందంగా ఉందా? మధుపర్కంలో ఎక్కువ అందంగా ఉందా అని బేరీజు వేస్తున్నాడు ప్రకాష్. గౌరిని ఆగకుండా మురిపెంగా చూస్తున్న అన్నను, "అంతలా చూడకు, మా వదినకు దిష్టి తగులుతుంది" అని ఆటపట్టించింది చెల్లెలు శారద. బిందెలో ఉంగరము, మట్టెలు వేసి తీయమన్నాడు బ్రాహ్మడు. బిందెలో చేయి పెట్టి, ఊరకే కూర్చున్న గౌరిని సాలోచనగా చూశాడు ప్రకాష్. ఓ నిమిషం, 'ఇదంతా సిగ్గేనా లేక ఈ పెళ్ళి తనకు ఇష్టం లేదా?' అన్ని భావన ఓ క్షణం పాటు మనసులో చోటు చేసుకుంది. కానీ క్షణం మాత్రమే!

అలా వధువు నిర్లిప్తత, వరుడి ఉత్సుకతలతో పెళ్ళి తంతులు ఒకటొకటిగా జరిగిపోయాయి.

మొదటిరాత్రి గదిలోకి వచ్చిన కుందనపు బొమ్మలా వున్న గౌరి వైపు ప్రేమగా చూశాడు ప్రకాష్. ఓ క్షణం తటపటాయించి, ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నాడు. అంతే! కెవ్వుమని కేక పెట్టి అతన్ని విడిపించుకొని వెనక్కి తిరిగింది గౌరి. గది తలుపు తీసుకొని, బయటకు పరిగెత్తింది. వెతుక్కుంటూ బామ్మ దగ్గరకు వెళ్ళి, ఆమెను వాటేసుకొని భోరుమంది గౌరి.

ఏమైందో తెలియక పార్వతమ్మ, పరంధామయ్య గాభరా పడ్డారు. "అమ్మీ, నేను గదిలోకి వెళ్ళను" అని వెక్కివెక్కి ఏడవసాగింది. మనవరాలి తల నిమురుతూ భర్త వైపు చూసింది. ఏమి చేయాలో ఒక్క క్షణం ఇద్దరికీ తోచలేదు.

తరువాత నెమ్మదిగా ప్రకాష్ ఉన్న గదిలోకి వెళ్ళాడు పరంధామయ్య. గది మధ్యలో గడ్డం కింద చేయి రాసుకుంటూ ఆలోచనగా నిలబడి వున్నాడు ప్రకాష్. మొహం కందిపోయి ఉంది. "మమ్మల్ని క్షమించండి బాబూ" విన్నపంగా అన్నాడు పరంధామయ్య ప్రకాష్‌తో.

ప్రకాష్‌కి కోపంగా ఉంది. కాని ఆయన ముఖం చూసి ఏమనలేక, "క్షమించటం దేనికి?" అనడిగాడు.

"ఏం చెప్పమంటావు బాబూ, ఇదంతా స్వయంకృతాపరాధం. సమస్య ఇంత తీవ్రమైనదని తెలిస్తే విషయం నీకు ముందే చెప్పేవాళ్ళం. అంతా మేము చేసిన తప్పే." అంటూ గౌరి కథ చెప్పాడు పరంధామయ్య.

***

పరంధామయ్య భార్య పార్వతమ్మ, కొడుకు రాఘవ, కోడలు సుమిత్ర, కూతురు సీత, అల్లుడు రామారావు. అందరిదీ ఆ ఊళ్ళోనే వ్యవసాయము.

గౌరి పుట్టినప్పుడు సీత కుటుంబం యాత్రల్లో ఉన్నారు. తిరిగి రాగానే – "నా కోడలెక్కడా?" అంటూ ఆత్రుతగా లోపలికి వచ్చింది సీత.

"నీ ఇల్లు బంగారం కానూ, ముందు లోపలికి రావే సీతా, కాళ్ళు కడుక్కొని చూద్దువుగాని నీ కోడలిని" అంది పార్వతమ్మ, కూతురు వెనకే వస్తున్న మూడేళ్ళ మనవడు శంకర్‌ని దగ్గరికి తీసుకుంటూ.

తల్లి చెప్పింది త్వరగా చేసి, కోడలి కోసం పరిగెత్తింది సీత. మంచం మీద గులాబి రంగులో ముద్దుగా పడుకొని వున్న పాపాయిని చూస్తూనే ముచ్చటపడిపోయింది సీత. "ఇదిగో వదినా, ఇప్పుడే చెపుతున్నా... ఈ బంగారు తల్లి నా ముద్దుల కోడలు" అంటూ చేతిలోకి తీసుకొని,

ముచ్చటగా చూస్తూ ముద్దు పెట్టుకుంది. ఆమె ముద్దు పెట్టుకుంటూ ఉంటే, అమ్మమ్మ పక్కనుంచి నక్కి నక్కి ఆ చిన్ని పాపాయిని కుతూహలంగా చూస్తున్నాడు శంకర్. "అలా దాక్కుంటావేమిరా, ఇదిగో నీ పెళ్ళాం చూడు!" అని వాడికి చూపించింది సీత. వాడికి ఏమర్థమైందో కాని అమ్మ కుచ్చిళ్ళలో మొహం దాచుకున్నాడు.

సీత హడావుడిని మురిపెంగా చూస్తున్నారు అత్తాకోడళ్ళు. ఇంతలో పొలం నుంచి వచ్చాడు రాఘవ. వస్తూనే చెల్లెలిని, చెల్లెలి చేతిలోని పాపాయిని చూసి, "అప్పుడే నీ చంకనెక్కేసిందా?" అన్నాడు.

"చంకనెక్కుతుందో, నెత్తినెక్కుతుందో! అది మా అత్తా కోడళ్ళ ఇష్టం." అంది సీత పాపను గుండెలకు హత్తుకొని.

"ఏమిటీ? అప్పుడే కోడలనేస్తున్నావ్! నేనేమైనా అన్నానా దీన్ని శంకర్‌కిస్తానని?" అన్నాడు రాఘవ.

"అనకపోతే ఇప్పుడను" అంది తేలికగా సీత.

"వచ్చినప్పటి నుంచీ ఈ మాట తప్ప ఇంకో మాట లేదురా నీ చెల్లెలికి" అంది పార్వతమ్మ కూతురిని మురిపెంగా చూస్తూ.

"సరేలేవమ్మా, ఈ మాత్రం దానికి నేనో, మీ అన్నయ్యో మాట ఇవ్వటం అవసరమా? ఈ ఇంట్లో ఎవరైనా ఎప్పుడైనా నీ మాట కాదన్నారా? మా అమ్మాయి నీ కోడలే!" అంది సుమిత్ర.

రాఘవ ఔననట్లు నవ్వాడు.

"ఈ మాటన్నారు నా మనసు తేలిక పడింది. ఇప్పుడు చెప్పండి నా కోడలికి పేరేమి పెడుతున్నారు?"

అప్పుడే అటొచ్చిన పరంధామయ్య, "అడిగి కోడలిని చేసుకున్నావు. పేరు కూడా నువ్వే పెట్టు." అన్నాడు.

"అయితే గౌరి అని పెడదాము. అప్పుడు నా కొడుకూ కోడలు గౌరీశంకరులు." అంది. అందరూ నవ్వుతూనే తమ ఆమోదం తెలిపారు. చిన్నారి గౌరి తనకూ ఇష్టమేనన్నట్లు అత్త ఒడిని పావనం చేసింది.

***

ఏళ్ళు గడుస్తున్నాయి. గౌరి తన కోడలంటూ తెగ ముద్దు చేసేది.

ఒకసారి గౌరికి మూడేళ్ళప్పుడు –

పిల్లలిద్దరూ తల నిండా ఇసుకతో ఇంట్లోకి వచ్చారు. పెద్దవాళ్ళు వాళ్ళ అవతారాలు చూసి కాస్త చిరాకు పడ్డారు.

"ఇసుకతో పిచ్చుకగూళ్ళు కట్టుకోవాలి కాని ఇలా నెత్తిన పోసుకుంటే ఎలా?" సుమిత్ర గౌరిని మందలించింది.

సీత వెంటనే, "ఇదిగో వదినా! నా కోడలు అభం శుభం తెలియని చిన్నపిల్ల. దాన్నేమైనా అంటే ఊరుకునేదిలేదు. ఏమైనా అనాలనుంటే మీ అల్లుణ్ణను." అంది.

"ఆ అక్కడికి మా అల్లుడు పెద్దవాడులే" అంది సుమిత్ర నవ్వుతూ.

ఆ మాటకి శంకర్‌కు పౌరుషం వచ్చినట్టుంది. "పెద్దవాణ్ణికాకేం. ఇప్పుడే గౌరిని పెళ్ళి చేసుకున్నాను కూడా. తలంబ్రాలు పోసుకున్నాము. కనపడ్డం లేదూ?" అన్నాడు గొప్పగా.

"ఓరినీ భడవా! అప్పుడే పెళ్ళాం కావలసివచ్చిందిరా?" అని మనవడిని దగ్గరకు తీసుకుంది పార్వతమ్మ.

అలా ఆ ఇంట్లో ఆటల్లో, మాటల్లో గౌరీ శంకరుల పెళ్ళి ప్రసక్తి రావటం తరుచూ జరిగేది.

కొన్నాళ్ళకు దిగుబడి సరిగ్గాలేని వ్యవసాయము చేయటము రామారావుకు నచ్చలేదు. పట్నం వెళ్ళి కొందరు స్నేహితులతో కలిసి వ్యాపారం చేయాలనుకున్నాడు. సీత ఆ విషయం తల్లికి చెప్పింది.

"అదేమిటే అయినవాళ్ళనొదిలేసి అంత దూరం వెళతారా? అయినా, కొత్తగా వ్యాపారం మొదలుపెట్టాలంటే చేతిలో డబ్బుండాలి కదా?" అంది పార్వతమ్మ.

"స్నేహితులు సాయం చేస్తామన్నారు. పొలం అమ్మి కొంత డబ్బు తెస్తానంటున్నారీయన. నాన్నను అడగటానికి మొహమాటపడుతున్నారు కాని నాన్న కూడా కొంత సాయం చేస్తే బాగుంటుంది. చేతిలోకి డబ్బులు రాగానే అందరి అప్పులూ తీర్చేస్తాం." అంది సీత.

ఆ మాటలు విన్న సుమిత్ర, "అయితే కట్నం డబ్బు ముందే ఇవ్వాలన్న మాట!" అంది నవ్వుతూ. ఆ మాటల్లో నిష్ఠూరం కన్నా డబ్బిస్తామన్న హామీయే ఎక్కువ ధ్వనించింది.

"అయ్యో అలా అనుకోకు వదినా! వ్యాపారమే కాదు, వీడిని చదివించాలి కదా. ఇక్కడ పల్లెటూరిలో ఏమి చదువుకుంటాడు? వీడిని బాగా చదివించాలని ఆయన కోరిక. ఆ చదువులు మా డబ్బుతో చదివిస్తేనే కదా మాకు తృప్తి? తాత్కాలికంగా మీ దగ్గర డబ్బు తీసుకున్నా అది అప్పు కిందే లెక్క. ఆ అప్పు తీర్చకుండా గౌరిని కోడలు చేసుకుంటే కనుక మేము మా కొడుకును అమ్ముకున్నట్లే లెక్క."

"ఏదో మాటవరుసకు అన్నానే కాని మనం మనం ఒకటే కాని వేరు కాదు కదా. మేము మీకిస్తే అది అప్పుకాదు, నువ్వు మా నుంచి

తీసుకుంటే అది కష్టమూ కాదు” అంది సుమిత్ర.

సీత, రామారావు పట్నానికి బస మార్చారు. అక్కడ ఇల్లు తీసుకొని సంసారం పెట్టారు. శంకర్‌ను స్కూల్లో చేర్చారు. స్నేహితుల వ్యాపారంలో భాగస్వామ్యం తీసుకున్నాడు. రామారావు చాకచక్యమో, సీత అదృష్టమో కాని పట్టిందల్లా బంగారమౌతోంది. మంచి పాష్ లొకాలిటీలో ఇల్లు కట్టుకున్నారు. శంకర్‌ను మంచి కార్పొరేట్ స్కూల్లో చేర్చారు.

ఇక్కడ ఊళ్ళో పార్వతమ్మకు గౌరితోటే లోకం. గౌరికి కూడా బామ్మా తాతల దగ్గరే మాలిమి ఎక్కువ. పరంధామయ్య, పార్వతమ్మని ‘అమ్మీ!’ అని పిలుస్తాడు. అందుకని తనూ బామ్మను, ‘అమ్మీ!’ అని పిలిచేది. నాన్నకి ‘అయ్య’ అని తాతయ్యను, ‘నాన్నయ్యా!’ అని పిలిచేది. పాటలు కూడా ఎక్కడ విన్నా ఇట్టే నేర్చుకునేది. ఏం నేర్చుకున్నా బామ్మకు వెంటనే వినిపించాలి.

ఒకసారి సుమిత్ర, “ఆటలు ఆడీ, పాటలు పాడీ అలిసిపోయానే, తియ్యా తియ్యని తాయిలమేదో తీసీ పెట్టమ్మా?” అని పాడగానే వెంటనే పట్టేసి, బామ్మ దగ్గరకు వెళ్ళింది. బియ్యం ఏరుకుంటున్న పార్వతమ్మ భుజాలపై వాలి, ఊగుతూ ఆ పాట పాడితే పార్వతమ్మ మురిసిపోయి, పదిమందికీ చెప్పుకుంది.

ఆకలేస్తే పార్వతమ్మకు చెపుతుంది. బొమ్మలేస్తే గొప్పగా తీసుకెళ్ళి తాతయ్యకు చూపిస్తుంది.

ఒకసారి పలక మీద రెండు తెల్లటి సున్నాలు గీసి, “పైదేమో చందమామ, కిందదేమో అమ్మ పెట్టే పెరుగన్నం.” అని ఆధునిక చిత్రకారిణిలా వివరణ కూడా ఇచ్చింది.

పరంధామయ్య మురిసిపోతూ, “అమ్మో అమ్మో! వేలెడంతలేవు

ఎన్ని ఊహలే నీకు?" అని ముద్దులాడి, తరువాత తెలిసిన వారందరికీ మురిపెంగా చెప్పుకున్నాడు.

చలాకీగా అందంగా ఉన్న గౌరి నాన్నయ్యకూ, బామ్మకు ముద్దుల మనవరాలు. అమ్మా నాన్నలకు గారాలపట్టి. స్కూల్లో టీచర్లందరికీ ఆమె అంటే చాలా ఇష్టం. రోజూ ప్రార్థనాగీతం దగ్గర నుంచీ ఏ ఫంక్షన్ ఉన్నా గౌరి పాట ఉండాల్సిందే!

మరి చక్కగా బొమ్మలేస్తుందా, తియ్యగా పాడుతుందా! బాగా చదువుతుందా! కాని గౌరికి బోలెడంత మొహమాటం. కొత్తవాళ్ళు కనిపిస్తేనే సిగ్గు. ఇక పలకరిస్తే చెప్పాలా!

పట్నం వెళ్ళాక రామారావు బొత్తిగా ఇటు రావటం మానేసాడు. సీత రాకపోకలు కూడా మునపటి మీద తగ్గాయి. "వ్యాపారం కదా, ఆయనకు అక్కడ ఇంటికి రావటానికే తీరదు. ఇక నా సంగతంటావా... ఇంటి బాధ్యత అంతా నామీద పడిపోయాక ఇల్లెలా కదిలేది? ఏదో మిమ్మల్ని చూడాలనే భ్రమతో అప్పుడప్పుడు వస్తున్నాను... అంతే!" అనేది.

ఓసారి తల్లితండ్రులను చూడడానికి వచ్చిన సీత లంగా జాకెట్లలో, జడగంటలతో వేసుకున్న బారెడు జడతో, అందంగా మెత్తగా వున్న గౌరిని చూసి ముచ్చటపడిపోయింది. "బంగారు తల్లిలా ఉన్నావే!" అని తెగ ముద్దులు కురిపించేసింది. అప్పటికప్పుడు పాలేరును పంపి మొగలిపూలు తెప్పించి, గౌరికి మొగలిపూల జడ వేసింది. పట్టులంగా, జాకెట్ తొడిగించి బోలెడు సరదా పడిపోయింది. 'అసలు సిసలు తెలుగింటి ఆడపడుచు మా గౌరి!' అని మురిసిపోయింది.

"అత్తకు వినిపించవే!" అంటూ పార్వతమ్మ గౌరి చేత పాటలు పాడించింది. బొమ్మలుకూడా చూపించమంది.

"పాటలూ, బొమ్మలూ, అలంకారాలేనా? చదువు కూడా ఉందా?" అంది సీత ముచ్చటగానే.

అంతే గౌరి పరుగున వెళ్ళి తన సెవెంత్ క్లాస్ ప్రోగ్రెస్‌రిపోర్ట్ తెచ్చి అత్తకు చూపించింది.

సీత అందులోని మార్కులను చూసి, "అమ్మో! నీకు బావ కంటే ఎక్కువ మార్కులొచ్చాయే!" అని, పక్క నున్న కొడుకుని చూసి, "దీన్ని చూసి నేర్చుకోరా." అంది నవ్వుతూ.

శంకర్ మొహం మాడ్చుకొని, "చిన్న క్లాసులు వేరు. టెంత్ లో ఇన్ని మార్కులు తెచ్చుకొని చూపించమను... అప్పుడు నేర్చుకుంటాను." అన్నాడు ఉక్రోషంగా.

"నేర్చుకుందుకు మూడేళ్ళు ఆగక్కరలేదు. నీకు సెవెంత్ లో ఇన్ని మార్కులు రాలేదంటే ఇప్పుడే నేర్చుకుంటావు." అని మందలింపుగా అని, "దీనికి బాగా చదువొస్తుంది. పెద్ద చదువులు చదివించండి." అంది తల్లితో.

"ఈ ఊళ్ళో ఉన్నంతవరకూ చదివిస్తామే. పై ఊరికి మాత్రం పంపము. అదేమైనా ఊళ్ళేలాలా, ఉద్యోగం చేయాలా? ఆమాత్రం నా మనవడు దాన్ని చూసుకోలేడా?" అంది పార్వతమ్మ.

"ఏమి వదినా, అది పెద్ద చదువులు చదవకపోతే నీ కోడలిని చేసుకోవా?" నవ్వుతూ అంది సుమిత్ర.

సీత కాస్త తడబడి, "ఇప్పుడు నేను కోడలిని చేసుకోవటమేమిటి? అది పుట్టటమే నా కోడలిగా పుట్టింది" అని సర్దుకుంది.

అప్పటికి ఆ ప్రసక్తి ఆగిపోయింది.

సీత వెళ్ళేటప్పుడు, "ఈ సంవత్సరము వీడు ఇంటర్‌లోకి వస్తాడు. ఆయనకేమో ఇల్లు పట్టదు. బహుశా రెండేళ్ళు ఇటుకేసి రానేమో... వీడికి యం సెట్ అయ్యి ఇంజనీరింగ్‌లో చేరాకే రావటం అనుకో" అంది.

శంకర్ ఇంటర్ పూర్తి చేసి, ఎంట్రెన్స్ పాసై, ఐఐటి మద్రాస్‌లో సీట్ సాధించాడు. కోచింగ్‌లతో ఊపిరి సలపక అతగాడు ఇటువైపు రాలేదు. ఇక ఐఐటిలో చేరాక సెలవల్లో, అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళేవాడు. స్నేహితులతో టూర్స్ కెళ్ళేవాడు. చిన్నారి మరదలు మరుగున పడిపోయింది.

ఎవరికైనా కష్టాలు చెప్పి రావు కదా!

అదే గౌరి విషయంలో నిజమైంది. ఆమెకు పదహారేళ్ళప్పుడు రాఘవను పొలంలో పాము కరిచి, వైద్యసహాయం అందేలోగా కన్నుమూసాడు.

పుట్టెడు దుఃఖంలో సుమిత్ర... 'వారిద్దరిని చూసే దుఃఖపడాలా? లేక తలకొరివి పెట్టాల్సిన చెట్టంత కొడుకుకి తనే తలకొరివి పెట్టాల్సి వచ్చినందుకు దుఃఖపడాలా?' అని తల్లడిల్లిపోయారు పరంధామయ్య, పార్వతమ్మ. "నాన్నయ్యా!" అంటూ చుట్టుకుపోయిన మనవరాలిని చూసి దుఃఖం ఆపుకోలేకపోయారు. భర్తమీద బెంగతో తల్లడిల్లిన సుమిత్ర, పెద్ద కర్మ జరిగేలోగానే భర్త దగ్గరకు చేరిపోయింది. 'నీ భర్త మీద ప్రేమే కాని నీ కూతురి గురించి ఆలోచించలేదా సుమిత్రమ్మా?' అంటూ భోరున దుఃఖించారు పరంధామయ్య దంపతులు.

ఒక రాత్రి సుమిత్ర, పార్వతమ్మ కలలో కనిపించి, "గౌరికి జన్మనిచ్చిన తల్లిని నేను కావచ్చు. కానీ దాన్ని పెంచి పెద్ద చేయాల్సిన తల్లితండ్రులు మీరే..." అని చెప్పింది.

తాము దుఃఖసముద్రములో మునిగితే, గౌరి తట్టుకోలేదని గ్రహించిన పరంధామయ్య దంపతులు తమ బాధను దిగమింగుకున్నారు.

అన్న పోయినప్పుడు చూడటానికి సీత ఒక్కతే వచ్చింది. రామారావు, శంకర్ ఎందుకు రాలేదో పరంధామయ్యకు అర్థం కాలేదు. కానీ వారెందుకో తమను దూరం పెడుతున్నారని అర్థం చేసుకున్నాడు.

సీత కూడా గౌరి గురించి ఎక్కువ మాట్లాడలేదు.

“ఎదిగిన ఆడపిల్లను బయటకు పంపి చదివించటం కష్టం. ఇకమీదట గౌరి ఇంట్లోనే ఉంటుంది” అని పార్వతమ్మ అంటే సీత విని ఊరుకుంది.

గౌరి తాతయ్య, బామ్మల దగ్గరే ఉంటూ అమ్మానాన్నలు పోయిన దుఃఖంనుంచి తేరుకుంది. పరంధామయ్యకు పొలం పనులు, పార్వతమ్మకు ఇంటి పనులు. స్కూలైపోయిన గౌరి ఒక్కతే ఖాళీ!

లేగదూడను చూసినా, పూసినపూవును చూసినా, వీధికుక్క ఈనినా ఆమెకు అదో పెద్దవార్త. తువ్వాయిలూ, తన భరతనాట్యాలూ, చివరకు వీధి కుక్కపిల్లలూ ఆమెకు సహచరులు.

మనిషికి మనిషి కరువైనప్పుడు ప్రకృతిని మించిన సహచరి ఉండదు. ప్రకృతితో సాహచర్యం ఏర్పడినప్పుడు మనిషి తోడు అవసరం ఉండదు.

గౌరికి తన తాతయ్య, బామ్మలు కూడా మనుషుల్లాకాక ప్రకృతిలో భాగమనిపించేవారు.

ప్రకృతితో సహచర్యం చేస్తూనే తన జీవన సహచరుని గురించి కలలు కంటూ ఉండేది. ఆ కలలకు నేపథ్యంగా, “కోడలా!” అన్న సీత

పిలుపు వినిపించేది. ఆ పిలుపును అనుసరించి శంకర్ కనిపించేవాడు.

కాని ఏళ్ళు గడుస్తున్నా శంకర్, సీతలు ఆమె కలలకే పరిమితం అయ్యారు.

శంకర్ బిటెక్ పూర్తిచేసిన వెంటనే అమెరికా వెళ్ళిపోయాడు. ఎప్పుడో ఫోన్లో ఓ మాట తప్ప, సీత ఇటు రావటమే మానేసింది. ఫోన్లోనూ అక్కడి కబుర్లు చెప్పటమే తప్ప, ఇక్కడి కబుర్లు అడగటం మానేసింది.

"గౌరి నా కోడలో... అని తెగ ఇదైపోయేది. ఇప్పుడా మాటే అనదు. మగపిల్లాడి తల్లి కదా బింకంగా ఉందేమో! మనమే వెళ్ళి గౌరీశంకరుల పెళ్ళి ఏర్పాట్లు చూడాలి" అంది పార్వతమ్మ ఒకసారి పరంధామయ్యతో.

ఆయన సరేనని ప్రయాణపు ఏర్పాట్లు చేసుకోనేలేదు... పట్నం నుంచి శుభలేఖ, ఉత్తరం అందాయి.

"మీ మనవడేమో అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీర్గా పనిచేస్తున్నాడయ్యె. 'నేను చదువూసంధ్యాలేని పల్లెటూరి పిల్లని ఎలా పెళ్ళి చేసుకోనమ్మా?' అంటాడు. మీరేమో గౌరిని చదివించలేదయ్యె. దానికి తోడు మీ అల్లుడి వ్యాపారంలో పార్టనర్ వెంకటాచలం వాళ్ళమ్మాయి అమెరికాలోనే పనిచేస్తోందనీ, శంకర్కి అన్నివిధాలుగానూ ఈడూజోడూగా ఉంటుందనీ పిల్లనివ్వడానికి ముందుకొచ్చేడు. ఒక్కతే పిల్ల. అందం, ఆస్తీ, చదువూ, పేరూ అన్నీ ఉన్నాయి. మీ అల్లుడి సంగతి మీకు తెలుసుకదా. శంకర్కూ, ఆ అమ్మాయి అన్నింటా సరిపోయిందంటారు. ఊ అని మర్యాద దక్కించుకోవటం తప్ప నాకు వేరే దారి లేదు. పెళ్ళికొచ్చి మీ మనవణ్ణి దీవించి వెళ్ళండి." అంటూ కూతురూ, అల్లుడూ రాసిన ఉత్తరాలనీ, వాళ్ళు పంపిన శుభలేఖనీ చేతిలో పట్టుకుని, నిశ్చేష్టులై నిలబడి పోయారిద్దరూ.

'నా కోడలు నా కోడలూ!' అంటూ ఆశలు రేపిందీ అదే. ఈ రోజు చదువులేదని, పల్లెటూరిపిల్ల అనీ నెట్టేసింది అదే అని బాధపడ్డారు. విషయం అంతవరకే వాళ్ళకర్థమైంది. మాయామర్మం తెలియని ఓ పసిమనసు ఎంత గాయపడుతుందో వాళ్ళూహించలేదు.

చిన్నప్పటి నుంచి భర్తగా ఊహించుకున్న శంకర్ బావకు వేరే అమ్మాయితో పెళ్ళి అన్న నిజాన్ని జీర్ణించుకోలేక బయట ప్రకృతి, బావ - అదే జీవితంగా ఉన్న గౌరి ఆ ఉత్తరాన్ని ఓ భ్రమగా కొట్టిపారేసింది. ఆమె ఊహలో శంకర్‌కు ఇంకా పెళ్ళి కాలేదు. సీత ఆమెను తప్ప వేరెవరినీ కోడలుగా ఒప్పుకోదు. 'ఎప్పటికైనా బావే తన భర్త, తనవాడు' అని ఊహించుకుంటూ ఊహాలోకంలో ఉండసాగింది. కాని తువ్వాయిలా గెంతులు వేస్తూ ఉండే గౌరి ఒక్కసారి నిశ్శబ్దమైంది. ఎవరితోనూ మాట్లాడదు. అన్నం తినదు.

* * *

"ఊహకీ, వాస్తవానికి మధ్య ఊగిసలాడుతూ, ఆందోళనను భ్రమతో కప్పిపుచ్చుకుంటూ, గజిబిజిగా ఉన్న గౌరిని మామూలు మనిషిగా చేయాలనుకుంటే పెళ్ళి చేయాలనుకున్నాము. ఆ వరుడు శంకర్‌ను మించిన వాడై ఉండాలనుకున్నాము. అలాగే నువ్వు దొరికావు..." అన్నాడు పరంధామయ్య.

ప్రకాష్ ఆయన్నదోలా చూసి, "ఈ కథంతా ఇప్పుడు కాదు పెళ్ళికి ముందు చెప్పాల్సింది" అన్నాడు నిష్ఠూరంగా.

"అని మాక్కూడా ఇప్పుడనిపిస్తోంది బాబూ! ఎందుకంటే పెళ్ళి గురించి చెప్పినప్పుడు గౌరి ఏమీ అనలేదు. పెళ్ళి చూపులకు ఏ రభసా చేయలేదు. పెళ్ళిలోనూ కుదురుగానే ఉంది. కానీ ఇప్పుడు నాకు అర్థం

అవుతోంది. ఈరోజు దాకా అది ఊహల్లో నుంచి బయటపడలేదు. నిన్నది తన బావ శంకర్‌గానే అనుకుంటూ వచ్చింది. కానీ ఏమూలో వాస్తవం తెలియటం వల్ల దానిలో ఉత్సాహం పుట్టక నిశ్శబ్దంగా ఉంది. ఇందులో దాని తప్పేమీ లేదు. చిన్నప్పటి నుంచీ దాని మనసులో బావనే భర్తగా ఊహించుకునేలా చేయటం మాదీ తప్పు. ఇలాగవుతుందని ఊహించక ఈ పెళ్ళిచేసిన మమ్మల్ని క్షమించు. దీనికి నువ్వు ఏ శిక్షవేసినా భరిస్తాం" అని ప్రకాష్ చేతులు పట్టుకున్నాడు.

ప్రకాష్ కాసేపు మాట్లాడలేకపోయాడు.

అతనికిప్పుడు తన మిత్రుని అక్క గుర్తుకొచ్చింది. ఆమెదీ ఇలాంటి కేసే! తమ సరదా కొద్దీ పెద్దవాళ్ళు అనాలోచితంగా ఓ పసిమనసులో నాటిన ప్రేమభావాలు క్రమంగా మహావృక్షమయ్యాక అప్పుడు కూకటివేళ్ళతో పెకలించివేయమంటే, ఆ లేతహృదయం పడిన వేదన అతడికి తెలుసు. సైకియాట్రిస్టు సహాయముతో ఆమెను మామూలు మనిషిని చేసిన తతంగమంతా అతనికి గుర్తుంది.

"పెళ్ళిలో గౌరి ప్రవర్తన చూసి కలవరపడ్డ నా మనసిప్పుడు అసలు కారణం తెలిసి తేలికపడింది. అయితే, మీరు గౌరి చిన్నప్పుడే ఆమెను ఒకరి భార్యగా ప్రకటించటం చాలా పెద్ద పొరపాటు. పెద్దయ్యాక పరిస్థితులు, అభిరుచులు మారిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఈ విషయంలో సీతగారినీ, శంకర్‌నీ తప్పు పట్టలేము. కాని ఆశలు తల్లకిందులైనప్పుడు అందరూ ఒక్కలా సర్దుకుపోలేరు. గౌరిలాంటి సున్నిత మనస్కులకైతే అది చాలా పెద్ద దెబ్బ. అలాంటప్పుడు ఆమె పెళ్ళి విషయంలో మీరు తొందరపడకుండా ఉండాల్సింది. ఆమెకు మరి కొంత సమయము ఇవ్వటమో సైకియాట్రిస్టును సంప్రదించటమో చేయాల్సింది. మీ అదృష్టమల్లా గౌరిని పెళ్ళాడిన నేను తనంత సున్నిత

మనస్కుణ్ణి కాకపోవటం.

నేనిప్పుడు ఆమె సమస్యను అర్థం చేసుకున్నాను. జరిగిందేమో జరిగింది. ఆమెనిప్పుడు నా భార్యగా కాక ఓ పేషంటులా స్వీకరిస్తాను. బొమ్మలేయటం, పాటలు పాడటం ఇలా ఆమెకేదిష్టమో దాన్ని ప్రోత్సహించి, ఆమెలో డిప్రెషన్ తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ప్రేమ పుట్టించి ఆ ప్రేమను పొందే ప్రయత్నం చేస్తాను. అమెరికా వెళ్ళేలోగా ఆమెకు మంచి స్నేహితుడిని కావటానికి ప్రయత్నిస్తాను. అందుకు మీ సహకారం కూడా కావాలి. తరువాత నాతోపాటు ఆమెను అమెరికా తీసుకెళతాను. నా జతగా నీవుండాలి అని నేననకుండా – 'నీ జతగా నేనుండాలి!' అని ఆమె అనేలా మార్చేందుకు ప్రయత్నిస్తాను. నా ప్రయత్నంలో విజయం సాధిస్తాననే నా నమ్మకం. కాకపోతే కాస్త సమయం పట్టవచ్చు. ఓపికతో ఎదురుచూడాలంతే" అన్నాడు ప్రకాష్, పరంధామయ్యతో.

ఆ తరువాత రెండువారాలకు...

గౌరిని కూడా తనతో పాటు అమెరికా తీసుకెళుతున్న ప్రకాష్ ఫ్లైట్‌లో ప్రయాణికుల్ని ఎక్కమంటున్న ఎనౌన్స్ మెంట్ విని ఈ లోకంలోకి వచ్చాడు. మంచులో తడిసిన మల్లెచెండులా ఉన్న గౌరిని అపురూపంగా లేపి, తన అడుగులో అడుగులేయిస్తూ ముందుకు నడిపించాడు.

ప్రకాష్ ప్రయత్నంలో అది తొలి విజయం.

**(జనవరి-2015 రచన మాసపత్రికలో కథాపీఠం పురస్కారం పొందిన కథ)**

# 2. మట్టిలో మాణిక్యం

కళ్ళలోనుంచి మాటిమాటికీ ఊరుతున్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంటోంది శాంభవి. జరిగినది తలుచుకున్న కొద్దీ దుఃఖం ఆగటంలేదు. ఉక్రోషం వస్తోంది. తను పుట్టగానే చనిపోయిన అమ్మ మీద, వదిలేసి వెళ్ళిపోయిన నాన్న మీద, చివరకు తనను ఈ విధంగా పుట్టించిన దేవుడి మీద అసలు ఈ ప్రపంచం మీదే పట్టరాని కోపం వస్తోంది. అంతలోనే ఏడుపు ముంచుకు వస్తోంది. అసలు తన తప్పేముంది? తను పుట్టినప్పుడు తన ముఖాన్ని  చూసేందుకే ఇష్టపడలేదట అమ్మ. నాన్నైతే ఓ చూపు చూసి బయటకు వెళ్ళిపోయాడట. అయినా తన ఈ రూపు తను కావాలని తెచ్చుకుందా?

నల్లగా ఉంటే ఉంది, ఇంత సన్నమేమిటి? బుగ్గ మీద ఇంత పెద్ద నల్లటి మచ్చ ఏమిటి, తన దురదృష్టం కాకపోతే! అమ్మా నాన్న మొహాలు తిప్పుకుంటే అమ్మమ్మ తనను ఎత్తుకుందిట. తొలిచూలు ఆడపిల్ల అమ్మవారు పుట్టింది అని 'శాంభవి' అని అమ్మమ్మే పేరు పెట్టిందిట. తన దురదృష్టం తను పుట్టిన నెలకే అమ్మ చనిపోయింది. నాన్న, 'నాకీ పిల్ల అవసరంలేదు ఏమైనా చేసుకోండి!' అని ఈసడించుకుంటే అమ్మమ్మ తనతో ఊరు తీసుకెళ్ళింది.

ఉన్నంతలో బాగానే పెంచింది. తన రూపాన్ని ఎవరైనా వెక్కిరించినా, చిన్నచూపు చూసినా వారిని దులిపేసేది. ఎవరినీ ఒక్క మాట అననిచ్చేది కాదు, తను కూడా అనేది కాదు. తన వెనకెనుకే తిరుగుతూ తనతో పాటు రామదాసు కీర్తన పాడుతున్న మనవరాలిని చూసి మురిసిపోయింది. 'భగవంతుడు దీని రూపం ఇలా ఇచ్చినా మంచి గొంతు ఇచ్చాడు' అని మురిసిపోయి సంగీతం మాస్టారిని బతిమిలాడి తనకు సంగీతం నేర్పేందుకు ఒప్పించింది. అమ్మమ్మ మీద

ప్రేమతో, సంగీతం నేర్చుకుంటూ, స్కూల్‌కు వెళుతూ ఆనందంగా ఉన్న తనను చూసి విధికి కన్ను కుట్టింది. తను ఐదో తరగతి చదువుతుండగా అమ్మమ్మను తీసుకెళ్ళిపోయింది. అప్పటివరకూ అత్తగారంటే భయంతో ఊరుకున్న అత్తయ్య దుర్గమ్మ తన చదువు, సంగీతం మానిపించేసింది. ఇంట్లో పనిపిల్లను చేసేసింది. మామయ్య రంగారావు ఇదేమీ చూడనట్లు, పట్టించుకోకుండా ఉండిపోయాడు

తలుచుకున్న కొద్దీ ఏడుపు ముంచుకు వస్తోంది. అసలు తన తప్పేముంది? తన మానాన తను పని చేసుకుంటూ, పాటలు పాడుకుంటోంది. అత్త వచ్చి నెత్తి మీద మొట్టేసరికి ఏమి జరిగిందో తెలీక భయపడిపోయింది. "ఏమే, ఎన్నాళ్ళ నుంచి సాగుతోంది ఈ భాగోతం?" అని అరిచేసరికి అప్పుడే గమనించింది, పక్కింటి అబ్బాయి గోడ మీద కూర్చొని తనను చూస్తున్నాడని. దుర్గమ్మను చూసి పారిపోబోయాడు.

"ఆగరా, నీకేమి పని ఇక్కడ? ఎందుకు కూర్చున్నావు?" అని వాడిని దబాయించేసరికి వాడు తడబడిపోయాడు. ఈ గొడవకి పక్కింటావిడ బయటకు వచ్చింది. ఆవిడను చూసి ఇంకా రెచ్చిపోయింది దుర్గమ్మ. "ఏదో పాట పాడుతుంటే వింటున్నాను" అని చిన్నగా గొణిగాడు. "దాని పాట అంత నచ్చిందా, అయితే దాన్ని పెళ్ళి చేసుకోరా, రోజూ వినవచ్చు" అని వ్యంగ్యంగా అంది దుర్గమ్మ. "ఏమమ్మో, నా కొడుకుకు ఆ కాకిపిల్లను అంటగడుదామని చూస్తున్నావా? కాకి గొంతేసుకొని కాకా అని అరుస్తుంటే అదే పాటైపోతుందా?" అని పోట్లాటకు వచ్చింది ఆవిడ. ఇద్దరూ చాలాసేపు అరుచుకున్నారు.

ఆమెతో పోట్లాటలో అలిసిపోయిన దుర్గమ్మ కోపంతో శాంభవి జుట్టు పట్టుకొని, ఇంట్లోకి గుంజుకు పోయింది. "నువ్వు పెద్ద గాయనీమణివని అనుకుంటున్నావా? నీ పాటకు వాడు పడిపోతాడనుకున్నావా?

విన్నావుగా నీది కాకి రూపం, కాకి గొంతు అని ఎట్లా అన్నారో! భోగం వేషాలేస్తున్నావు!" అని అరుస్తూ శాంభవి చెప్పేది వినకుండా, చీపురు తీసుకొని ఇష్టం వచ్చినట్లు బాదింది.

ఇంకా కసి తీరలేదేమో, "నీ ఈ వేషాలతో నా పిల్లలూ చెడిపోతారు. ఇంట్లో నుంచి వెళ్ళిపో..." అని బయటకు గెంటి తలుపేసేసింది. "అత్తా, తలుపుతీయి, ఇంకోసారి పాడను" అని ఏడుస్తూ ఎంత తలుపు కొట్టినా తలుపు తీయలేదు. ఎక్కడికి వెళ్ళాలో తెలీక, గుడికి వచ్చి కూర్చుంది. తలుచుకున్న కొద్దీ దుఃఖం ముంచుకు వస్తోంది. తల మోకాళ్ళలో పెట్టుకొని ఏడుస్తున్న శాంభవి తల మీద ఓ చేయి పడింది.

ఉలిక్కిపడి తల ఎత్తింది. ఎవరో ఒకావిడ ఎదురుగా కూర్చొని వుంది. ఆమె ఎవరన్నట్లు ఆమెవైపు చూసింది. "శాంభవీ, ఏమిజరిగింది. ఎందుకేడుస్తున్నావు?" అని తన పేరుతో అడిగేసరికి శాంభవి ఆశ్చర్యపోయింది. "నువ్వు నాకెలా తెలుసు అనుకుంటున్నావా? నేను మీ వీధి చివర ఇంట్లో వుంటాను. లాయర్‌ను. నాపేరు విమల. నీ గురించి నాకు అంతా తెలుసు. ఎప్పుడూ కళ్ళెత్తకుండా పనులు చేసుకుంటూ ఉండేదానివి. బయటకే రావు. ఈ రోజు ఇక్కడ కూర్చొని ఇలా ఏడుస్తున్నావేమిటి?" అని ఆప్యాయంగా అడిగింది. అమ్మమ్మ చనిపోయిన తరువాత అంత ఆప్యాయత ఎరుగని శాంభవి కరిగిపోయి, విమలకు జరిగిందంతా చెప్పింది.

"మరి ఇప్పుడు ఏమి చేస్తావు? కాసేపు ఇక్కడ కూర్చొని ఇంటికి వెళతావా? లేకపోతే నాతో వస్తావా? నేను సంఘసేవికను కూడా. నీకు ఏదో దారి చూస్తాను." అంది.

శాంభవి విమల చేయి పట్టుకొని, "నాకేమీ తెలియదు. మీరు నన్ను తీసుకెళితే వస్తాను. కాని నేను ఏమి చేయాలి ?" అని దీనంగా అడిగింది.

“ముందు మా అమ్మ దగ్గరకు తీసుకెళుతాను. ఆమె ఒక్కతే వుంటుంది. చేతకానిది. ఆమెకు సహాయంగా ఉందువుగాని.” అంది.

ఇంతవరకూ  ఏ రోజూ ఇంట్లో నుంచి బయటకు వెళ్ళలేదు. ఎప్పుడైనా గుడికి వెళ్ళినా తన రూపం మీద వెక్కిరింతలు, వేళాకోళాలు. వాటితో మనసు పాడై బయటకే వెళ్ళదు. అయినా సమయం ఎప్పుడు దొరుకుతుంది? ఇంటి పని తోటే సరిపోతుంది. అలాంటిది ఈరోజు ఎవరో తెలియని వాళ్ళ ఇంటికి వెళ్ళాలంటే బెరుకుగా వుంది. అయినా తప్పటం లేదు. పరిపరి విధాల ఆలోచిస్తూ విమల వెంట వాళ్ళ అమ్మగారి ఇంట్లో అడుగుపెట్టింది. పెద్దావిడ, ఎదురుగా పడక కుర్చీలో కూర్చొని వున్నారు. శాంభవి గురించి విమల చెప్పగానే చాలా ఆదరంగా మాట్లాడారు. దానితో కొంచెం  భయం తగ్గింది. “ప్రస్తుతము ఇక్కడ వుండు. కొంచెం నువ్వు తేరుకున్నాక నిన్ను చదివించాలా ? ఏదైనా పని నేర్పించాలా? అనే విషయం ఆలోచిస్తాను” అంది విమల. చిన్నగా లక్ష్మమ్మగారి ఇంట్లో అలవాటు పడింది.

చిన్నగా అన్నమయ్య కీర్తన పాడుకుంటున్న శాంభవిని, “ఏదమ్మా, పెద్దగా పాడు, నేనూ వింటాను!” అని అడిగింది లక్ష్మమ్మ. సిగ్గుపడుతూ పాడింది శాంభవి. “ఎంత బాగా పాడావమ్మా!” అని మెచ్చుకుంది లక్ష్మమ్మ. అప్పటి నుంచి రోజూ శాంభవితో పాడించుకొని వింటోంది. ఓరోజు విమల రాగానే శాంభవి పాట గురించి చెప్పింది.

“నాపాటేముంది ఆంటీ? నాది కాకి గొంతు!” అని దిగులుగా అంది శాంభవి.

“ఎవరన్నారు? ఎంత బాగా పాడుతున్నావు! ఇన్ని రోజులూ నిన్ను ఎందులో చేర్పించాలా అని ఆలోచిస్తున్నాను. నిన్ను పాటల పోటీకి పంపుతాను. నీది కాకి గొంతన్నవారే నిన్ను మెచ్చుకునట్లుగా చేస్తాను”

అంది విమల. దిగులుగా వున్న శాంభవి మొహంలో తళుక్కుమని మెరుపు వచ్చింది. శాంభవిని సంగీతం క్లాస్‌లో చేర్పించింది. ఎలాగైనా పెద్ద గాయని కావాలని పట్టుదలగా సాధన చేస్తోంది శాంభవి.

శాంభవితో నాలుగు పాటలు పాడించి రికార్డ్ చేసి, ఆ కాసెట్ 'పాడుతా తీయగా' పాటల పోటీకి పంపించింది విమల. పోటీలో ఎన్నిక కోసం రామోజీ ఫిలిం స్టూడియోకు రమ్మని పిలుపు వచ్చింది. విమలతో కలిసి రామోజీ ఫిల్మ్ స్టూడియోకు వెళ్ళిన శాంభవి, అక్కడవున్న అభ్యర్థులను చూసి, ఒక్క క్షణం భయపడి, విమల చేతిని గట్టిగా పట్టుకుంది. అంతలోనే తన గొంతును 'కాకి గొంతు' అని వెక్కిరించిన అత్తయ్య, పక్కింటి ఆవిడా గుర్తొచ్చారు. పట్టుదల వచ్చింది. ధైర్యం తెచ్చుకుంది. అసలు అంత పెద్ద గాయకుడు యస్. పి బాలసుబ్రమణ్యం ముందు పాడే అవకాశం రావటమే గొప్ప. ఎలాగైనా ఆయనను మెప్పించాలి అనుకుంది. ధైర్యంగా పాడింది. 'పాడుతా తీయగా'లో పాల్గొనేందుకు ఎన్నికైంది. మొదటి మెట్టు విజయవంతంగా ఎక్కిన శాంభవిని అభినందించారు విమల, లక్ష్మమ్మగారు.

అప్పటివరకూ అమ్మమ్మ ముందూ, లక్ష్మమ్మగారి ముందు తప్ప ఇంకెవరి ముందూ పాడలేదు. రేపు స్టేజ్ ఎక్కి అందరి ముందూ పాడబోతోంది. స్టూడియోలో వాళ్ళే కాదు, టీవీల ముందు కూడా ఎంతోమంది తన పాట వింటారు. తలుచుకున్న కొద్దీ ఉద్వేగంగా వుంది. 'ఎలా పాడుతానో' అని టెన్షన్‌గా వుంది. నిద్ర పట్టటం లేదు. అంతలోనే భయం, అంతలోనే 'పాడాలి గెలవాలి' అనే పట్టుదల. చాలా టెన్షన్‌గా గడిచిపోయింది రాత్రి.

"శాంభవి!" అని పేరు పిలవగానే తడబడే అడుగులతో వేదిక మీదకు వెళ్ళింది శాంభవి. వేదిక మీద శాంభవిని చూడగానే ప్రేక్షకులు అబ్బా

అనుకున్నారు. తనను పరిచయం చేసుకొని, మైకు తీసుకొని ఓ క్షణం కళ్ళుమూసుకొని, టెన్షన్‌ను ఆపుకొని "జోరుమీదున్నావు తుమ్మెదా!" అని పాడటం మొదలుపెట్టగానే తన భయాన్ని, ఎదురుగానున్న ప్రేక్షకులను మర్చిపోయి పాటలో మునిగిపోయింది. శాంభవి గొంతెత్తి పాడగానే అందరూ నిశ్శబ్దమైపోయారు. సన్నగా, తీగలా సాగుతూ, మధురంగా ఉన్న ఆ గాన మాధుర్యంలో మునిగిపోయారు. హోరుమంటున్న చప్పట్లతో ఈ లోకంలోకి వచ్చింది.

అన్ని రౌండ్లనూ తృప్తికరంగా పూర్తిచేసింది. ఒకొక్క ఎపిసోడ్‌లో, క్వాటర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ ను విజయవంతంగా పూర్తిచేసి, ఫైనల్స్‌కు చేరుకుంది. ఫైనల్స్‌కు చేరుకునేసరికి శాంభవికి ఎంతోమంది అభిమానులు ఏర్పడ్డారు. 'శాంభవి గెలవాలి!' అని కోరుకునేవారు. శాంభవి. ఎలాగైనా ఫైనల్స్‌లో  గెలుపొందాలని రాత్రి, పగలు ఓ తపస్సులా పాటలను సాధన చేసింది. ఫైనల్స్‌ను ఓ పెద్ద ఆడిటోరియంలో ఏర్పాటు చేసారు.

వివిధ రంగాలలోని ప్రముఖులు చాలామంది ఆ ఫైనల్స్‌కి వచ్చారు. హాల్ అంతా ప్రేక్షకులతో నిండిపోయింది. ఆ అశేషజనవాహినిని చూసి ఓ క్షణం బెదిరింది. కాని తన లక్ష్యం గుర్తు తెచ్చుకొని ధైర్యం తెచ్చుకుంది. పోటీ మొదలైంది. అందరూ తమ శక్తి వంచన లేకుండా చాలా బాగా పాడుతున్నారు. ఎవరు పాడుతుంటే వారే గెలుస్తారు అనుకునేట్లుగా పాడుతున్నారు. అన్ని రౌండ్లూ పూర్తి అయ్యాయి. గెలుపెవరిదా అని అభ్యర్థులంతా టెన్షన్‌గా వేచి చూస్తున్నారు. మొదటి బహుమతి 'శాంభవికి' అని ప్రకటించగానే, 'సరిగ్గా విన్నానా?' అని అనుకుంది శాంభవి. అందరూ అభినందిస్తుంటే 'నిజమే' అనుకుంది. అన్ని రోజుల నుంచి ఆపుకున్న ఆరాటం, దుఃఖం  ఒక్కసారే బయటకు వచ్చాయి. కళ్ళ నుంచి నీళ్ళు కారిపోయాయి. తనను తాను నిలవరించుకుంది.

ఆ కార్యక్రమం చూసేందుకు వచ్చిన సంగీత దర్శకుడు కోటి తన వచ్చే సినిమాలో శాంభవికి అవకాశం ఇస్తున్నట్లుగా ప్రకటించారు. సంతోషం పట్టలేకపోయింది శాంభవి. అక్కడే వున్న యస్. పి. బాలసుబ్రమణ్యం పాదాలకు నమస్కరించింది. మెచ్చుకుంటునట్లుగా ఆయన శాంభవి భుజం తట్టారు.

తను ఈ స్థితికి చేర్చేందుకు ప్రోత్సహించి, తోడ్పడిన విమల పాదాలకు నమస్కరించింది. విమల ఆప్యాయంగా శాంభవిని దగ్గరకు తీసుకుంది. "అభినందనలు శాంభవీ, పట్టుదలగా కృషి చేసావు, గెలిచావు. నాకు తెలుసు, నీకు వచ్చిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని పెద్ద గాయనివి అవుతావు. నీ రూపాన్ని వెక్కిరించినవారే నీ పాటను మెచ్చుకుంటారు. బాహ్యరూపం కన్నా నీలోని కళ గొప్పదని నిరూపించావు.

నువ్వు బాధపడతావని చెప్పలేదు కాని, నువ్వు ఇంట్లో నుంచి బయటకు వచ్చిన కాసేపటి తరువాత మీ అత్తయ్య తలుపు తీసి నీకోసం వెతుక్కుంది. నువ్వు ఏడుస్తూ అక్కడే పడి ఉంటావనుకుంది. నువ్వు లేకపోయే సరికి ఖంగుతింది. ఆడపిల్ల ఎక్కడికిపోయిందో ఏమవుతుందో అన్న దిగులేమీ లేదు, పని చేసేవాళ్ళు లేరే అన్న దిగులు తప్ప. నువ్వు టీవీలో కనిపిస్తున్నప్పటి నుంచి, నిన్ను బంధువుల ఇంట్లో ఉంచి, సంగీతం నేర్పిస్తున్నానని, ఈ పోటీకి తనే పంపిస్తున్నానని అందరికీ చెపుతోంది. ఏదో ఒక రోజు నీ ఆచూకీ తెలుసుకొని నీ దగ్గరికి వచ్చినా వచ్చేస్తారు. నిన్ను వెక్కిరించి, ఎగతాళి చేసి, బాధపెట్టి నిన్ను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టినవారే నీ దగ్గరకు చేరుతున్నారు. అదీ నీ గొప్పతనం, నీ మంచి తనం!" అంటూ ఆప్యాయంగా శాంభవి నుదుటిమీద ముద్దు పెట్టుకుంది విమల.

**(2013 విహంగ వెబ్ మాగ్జిన్)**

# 3. దయచేసి సారికారాజ్‌తో మాట్లాడవచ్చా?

ఉదయాన్నే బాల్కనీలో కూర్చుని, పేపర్ చదువుతూ, కాఫీ తాగుతున్నాడు భాస్కర్. పక్కనే కుర్చీ రోడ్ వైపుకు తిప్పుకొని ఎదురుగా వున్న పార్కును, అందులోని చెట్టు మీది పిట్టలను, ఎదురుగా కరెంట్ తీగ మీద వున్న ఉడతనూ చూస్తూ కాఫీ తాగుతూ మైమరచి ఉంది, అనిత.

కొద్ది క్షణాలు అన్నీ చూసి, ఆనందంగా, "ఏమండీ, కొత్త ఇల్లు..." అని ఏదో అనబోతున్నంతలో లోపలి నుంచి టెలిఫోన్ రింగ్ వినిపించింది. ఫోన్‌లో మాట్లాడటానికి లేవబోతున్న భాస్క ర్‌తో, "ఆగండాగండి, కొత్త ఇల్లూ, కొత్త ఫోనూ, కొత్త ఫోన్... నేను చూస్తా నేను చూస్తా" అంటూ ఉషారుగా లోపలికి పరిగెత్తి ఫోన్ తీసి సుతారంగా, "హలో!" అంది.

అటు నుంచి చాలా మర్యాదగా... "ప్లీజ్ కెన్ ఐ స్పీక్ విత్ సారికారాజ్?" అన్నారు.

"సారీ రాంగ్ నంబర్." అని అతి మర్యాదగా జవాబిచ్చింది.

"ఎవరూ?" అని అడిగిన భాస్కర్‌కు, "ఎవరో రాంగ్ నంబర్! అయినా అదేమిటీ ముందుకు ముందే రాంగ్ నంబర్ వచ్చిందీ?" అని నిరాశ పడిపోయి, అంతలోనే 'పోనీలే!' అనుకుంది. ముందు ముందు జరగబోయే విపత్తును ఊహించలేని అనిత ప్రకృతి ఆరాధనలో మునిగిపోయింది.

***

పొద్దున్నే వంటపనిలో హడావుడిగా ఉంది అనిత. 'టైమైపోతోంది.

ఈ రోజింకా వంట కాలేదు...' తొందరపడిపోతూ, స్టవ్ మీద గిన్నె పెట్టి పోపేసింది. అందులో వంకాయలు వేయబోతుండగా ఫోన్ రింగైంది. భాస్కర్ చూస్తాడని ఆగింది.

కాని భాస్కర్ స్నానం చేస్తున్నాడేమో రాలేదు. ఇహ తప్పక స్టవ్ కట్టేసి వెళ్ళింది.

ఫోన్ తీసి "హలో?" అనగానే, "మేడమ్, సారికారాజ్‌తో మాట్లాడవచ్చా?" అని మర్యాదగా ఎవరో అడిగారు.

"ఎందుకు మాట్లాడకూడదు నాయనా, బ్రహ్మాండంగా మాట్లాడవచ్చు.నువ్వెవరితో మాట్లాడితే నాకేమిటి? కాకపోతే మా ఇంట్లో సారికారాజ్ అని ఎవరూ లేరని ఇప్పటికి, ఈ నెలలో లక్షాతొంభైసార్లు చెప్పి ఉంటాను. కాకపోతే నీ బుర్రకే ఎక్కటం లేదు, నా బుర్ర తింటున్నావు. ఇహ పెట్టేస్తావా ఫోన్?"

"సారీ మేడమ్, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటాము." అని ఫోన్ పెట్టేసారు.

"ఛీ! పొద్దున్నే పని అంతా పాడైపోయింది. ఎవరో ఈ మహాతల్లి ఈ నంబర్ ఎందుకిచ్చింది?" అని తిట్టుకుంటూ వంట ఇంటిలోకి వెళ్ళింది.

***

'ఏమిటో, చూస్తుండగా కాలం గడిచిపోతోంది. ఈ ఇంటికి వచ్చి అప్పుడే ఐదు నెలలై పోయాయి!' అనుకుంటూ మిక్సీలోనుంచి మిరపండ్ల కారం తీసింది.

చింతకాయ ముద్దలో వేసి, మెంతిపిండి, ఇంగువ వేసి బాగా కలిపి

జాడీకి ఎత్తి, గట్టిగా మూత పెట్టి చేతులు కడుక్కుంది.

"హూం, ఈ ఏడాదికి చింతకాయ పచ్చడి పెట్టటమైంది. ఏమిటో ఈ పచ్చళ్ళు లేకపోతే ముద్ద దిగదు. ఏడాదేడాదికి పచ్చళ్ళు పెట్టే ఓపిక అయిపోతోంది" అని స్వగతంగా అనుకుంటూ, నడుము రాసుకుంటూ, పనిలో పనిగా ఓ క్రోసిన్ మాత్ర వేసుకొని వచ్చి మంచం మీద వాలింది అనిత. చాలా అలసటగా ఉందామెకు.

'కళ్ళు మూసుకొని కాసేపు రెస్ట్ తీసుకుంటే సరి!' అని కళ్ళుమూసుకుంది.

"ట్రింగ్... ట్రింగ్" ఫోన్ మోత. లేవాలనిపించటంలేదు. 'ఎవరో అవసరమైతే మళ్ళీ చేస్తారులే!' అని లేవలేదు. అది, 'నిన్ను ఇలా వదలను!' అని ఆగి ఆగి మోగుతూనే ఉంది. "ఎవరు బాబూ ఈ జిడ్డుగాళ్ళు? కొంపదీసి అమ్మ కాదుకదా, నిన్న ఒంట్లో బాగాలేదంటే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను. ఇప్పుడెలా ఉందో ఏమో," అనుకుంటూ గాభరాగా వెళ్ళి ఫోన్ ఎత్తింది.

"మేడమ్, సారికారాజ్‌తో మాట్లాడవచ్చా ప్లీజ్..."

"ఓరి దేవుడా, ఎవరు నాయనా ఈ సారికారాజ్? నాకు ఇట్లా తగులుకుంది. ఇక్కడ ఎవరూ సారికారాజ్ అనే వారు లేరని ఇప్పటి కి ఐదు నెలలుగా మొత్తుకుంటున్నాను. ఐనా సమయం, సందర్భం లేకుండా నాప్రాణాలు తీస్తున్నారు. నాలుగు రోజులకోసారి కాల్ చేసి, 'సారికారాజ్ ఉందా?' అనడుగుతారు. పెట్టేయ్ ఫోన్... ఇంకోసారి చేసావంటే నీ కాళ్ళిరగ్గొడతా!"

"సారీ మేడమ్"

"ఈ సారీలకేమొచ్చెలే, ఏమి చేసుకోను ఈ సారీలను కూరొండుకోనా? అలమారాలో భద్రంగా దాచుకోనా? ఇంకోసారి నా దుంపతెంచకు నాయనా... నీకు పుణ్యముంటుంది."

మూడు ఫోన్లూ, ఆరు అరుపులుగా సారికారాజ్ ఫోన్లతో రోజులెళ్ళిపోతున్నాయి.

'అవునూ ఏమిటీ, ఈ మధ్య సారికారాజ్ కాల్ రాలేదు? ఓరినాయనో ఇదేమిటీ రోజు రోజుకూ నాకూ ఈ సారికారాజ్‌కూ బంధం పెరిగిపోతోంది? ఇలా ఫోన్ రాలేదనుకుంటున్నాను. భాస్కర్ కూడా రోజూ రాగానే, 'నీ ఫ్రెండ్ కాల్ వచ్చిందా?' అని వేళాకోళం చేస్తాడు... హుం...

***

పిల్లలకు, భాస్కర్‌కూ టిఫిన్ పెడుతోంది అనిత.

మనవడు, "అమ్మమ్మా! నేను ఇడ్లీ తినను, బ్రెడ్ ఇవ్వు!" అని మారాం చేస్తుంటే వాడిని, "బ్రెడ్ లేదురా... ఈ పూటకు ఇడ్లీ తిను, మా బాబువు కదూ!" అని బతిమిలాడుతోంది.

"పోనీ అమ్మా వాడిని వదిలేయ్. వాడికాకలేస్తే వాడే తింటాడు" అంటూ ఫోన్ రింగవుతుంటే వెళ్ళింది హాసిని. ఫోన్ ఎత్తి, "ఇక్కడెవరూ సారికారాజ్ లేరండి." అంది.

"నీకూ నాకూ తెల్లారిందీ? ఇంకా ఫోన్ రాలేదేమిటా అని దిగులుపడిపోతున్నాను. తలుచుకుంటే తల కింద ప్రత్యక్షం అయ్యావు తండ్రీ. మీ దుంపలెత్తగ. నువ్వూ, నీ సారికారాజ్ ఏడునెలలుగా ఏలినాటి శనిలా పట్టి పీడిస్తున్నారు కదరా. పిశాచాల్లా పీడిస్తున్నార్రా. పోతార్రోయ్

నరకానికి పోతారు. ఉత్త పుణ్యానికి నన్ను ఏడిపిస్తున్నందుకు ఆ యముడు మిమ్మలిని వేడి వేడి నూనెలో వేసి వేయిస్తాడురా" అని ఆవేశంతో ఊగిపోతున్న అనితను కూర్చోబెట్టి మంచినీళ్ళిచ్చింది హాసిని.

"అవును డాడీ. అసలు ఆ ఫోన్ కట్ చేసి అమ్మకు సెల్ ఫోన్ కొనివ్వు. పీడా వదులుతుంది. లేకపోతే కంప్లైంట్ చేసి, నంబరన్నా మార్పించు. అసలు కోపమే ఎరుగని అమ్మ చూడు, ఎంత కోపం తెచ్చుకుంటోందో. లో బీపీ కాస్తా హై బీపీ అయ్యింది. ఈ విషయమై ఏమైనా చేయాలి డాడీ." అంది హాసిని.

"నేనెప్పటి నుంచో చెప్తున్నానమ్మా, సెల్ ఫోన్ పెట్టుకోమని... వినదు. 'అనవసరంగా ఖర్చు, నాకెవరు చేస్తారు, అమ్మ, హాసిని, చెల్లెలు గీత, ఆడపడుచు రాధ అంతే కదా?' అంటుంది. ఈ ఫోన్ నా పేరు మీద ఉందని సెంటిమెంట్... కట్ చేయించవద్దు అంటుంది." అన్నాడు భాస్కర్.

"అవునూ ఈ ఫోన్ మీ పేరు మీద ఉంది. ఫోన్ వచ్చిన మొదటి రోజే మొదటి కాలే సారికారాజ్‌ది. పైగా రోజూ రాగానే, సారికారాజ్ యోగక్షేమాలు అడుగుతారు. అంటే మీకు ఆ సారికా రాజ్..." అంటూ భాస్కర్ వైపు అనుమానంగా చూసింది అనిత.

"ఏం పిచ్చి పిచ్చిగా ఉందా? ఆ సారికారాజ్ ఎవరికో నేను నంబర్ ఇచ్చానా? నేనిస్తే ఆ పిల్ల చేయాలి కాని ఎవరో ఆ పిల్ల కోసం అడగటమేమిటి?" అని కోపంగా అరుస్తున్న భాస్కర్‌ను చూసి భయపడిపోయింది అనిత.

"ఊరుకో డాడీ... ఏదో రాంగ్ కాల్ కోసం మీరిద్దరూ ఇలా పోట్లాడుకోవటమేమిటి?" అని హాసిని ఆపింది.

పిల్లలిద్దరూ అమ్మమ్మాతాతల గొడవ చూసి బిక్కచచ్చిపోయారు. అందరూ ఆలోచనలో పడ్డారు.

భాస్కర్, "ఎల్లమ్మా!" అని పనిమనిషిని పిలిచాడు.

"నువ్వు మేము రాక ముందు ఇక్కడ ఉన్న వారింట్లో కూడా పని చేసావు కదూ?"

"అవును సార్"

"వాళ్ళింట్లో సారిక అని ఎవరి పేరైనా వుందా?"

"లేదు సార్. అమ్మ పేరు సరిత, ఇద్దరు అమ్మాయిల పేర్లు దివ్య, నవ్య."

"కింద ఎవరో అద్దెకుండేవారు కదా, వాళ్ళ ఇంట్లో ఎవరి పేరైనా సారికనా?"

"లేదు సార్. ఆయమ్మ పేరు రేణుక"

మరి ఈ సారికారాజ్ ఎవరై ఉంటారు? అందరూ ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

"హయ్యో రామచంద్రా! ఏమిచేయాలి ఈ ఫోన్‌ను?" ఫోన్ ఎత్తిపట్టుకొని దాదాపు ఏడుస్తున్న గొంతుతో అంటున్న అనితను చూసి, 'సారికారాజ్ కోసమా?' అన్నట్టు సైగ చేసాడు భాస్కర్.

నిశ్శబ్దంగా ఫోన్ అందించింది. అటు నుంచి, "మేడం ప్లీజ్ కెనై స్పీక్ విత్ సారికారాజ్?" అని చాలా మర్యాదగా వినిపించింది.

అంతే! "లుక్..." రెచ్చిపోయాడు భాస్కర్.

అటువైపు ఫోన్ పెట్టేసారు. ఆయాసపడుతున్న భాస్కర్‌కు నీళ్ళందించింది అనిత.

"ఈ సారి సారికారాజ్ కాల్ వస్తే నువ్వు మాట్లాడకు. నేనుంటే నాకిచ్చేయ్." అన్నాడు. సరేనని తల ఊపింది.

***

"హేమండోయ్, మీరు ఆస్ బూస్ అని ఇంగిలిపీసులో అరిచేసరికి వాడు భయపడిపోయినట్లున్నాడు. ఎంతైనా మొగవాళ్ళ భయం వుండాలి. తొమ్మిది నెలలనుంచి పిచ్చిదానిలా నేనెంత మొత్తుకున్నా వినలేదు. ఇప్పుడు చూడండి ఆ ఫోన్ వచ్చి వారమైంది. ఏలిన్నాటి శని వదిలింది."

ముసిముసిగా నవ్వుతూ టీవీ రిమోట్ అందుకున్నాడు భాస్కర్.

***

"ఎక్స్ క్యూజ్‌మీ మేడం," వరండాలో ఎవరో అమ్మాయి నిలబడి పిలిచింది.

"యస్!" అంటూ బయటకు వెళ్ళింది అనిత.

ఆ అమ్మాయి, "నా పేరు సారికారాజ్" అంది. ఉలిక్కిపడింది అనిత.

ఏడాదిగా ఉన్న బంధం. ఆత్మీయురాలిని చూసినట్లుగా సంబరపడిపోయింది.

"కూర్చోండి!" అని కుర్చీ చూపించింది.

"సారీ మేడమ్, మీ ఫోన్ నంబర్ ఇంతకు ముందు మాది. మేము అమెరికా వెళుతూ ఫోన్ ఇచ్చేసాము, ఆ నంబర్ మీకు వచ్చినట్లుంది. మేము వెళ్ళే ముందు నా పెళ్ళి కోసం బంగారం కొన్నాము. కొంత డబ్బులు ఇవ్వాల్సి ఉండింది. ఈ లోపల మా తాతయ్యకు ఒంట్లో బాగాలేకపోతే ఊరెళ్ళాము. వెళుతూ మా నాన్నగారి స్నేహితుడికి ఆ డబ్బులిచ్చి బంగారం కొట్లో కట్టేయమన్నాము కానీ ఆయన కట్టలేదు. మాకాసంగతి తెలీదు. సంవత్సరం తరువాత వారం క్రితమే ఇండియాకు వచ్చాము. బంగారం కొట్టుకు వెళితే సంగతి తెలిసింది. మీకు తరచుగా కాల్ చేసి అడుగుతున్న సంగతి కూడా తెలిసింది. సారీ మేడమ్, మా మూలంగా మీకు చాలా ఇబ్బంది కలిగింది... క్షమించండి." అంది.

"ఫరవాలేదులేమ్మా" అని మొహమాటంగా అంది అనిత.

"వస్తాను మేడమ్" అని వెళ్ళిపోయింది సారికారాజ్.

"అమ్మయ్య! కథ సుఖాంతమైంది..." అని నిట్టూర్చి, కుర్చీకి ఆనుకొని నిశ్చింతగా కళ్ళు మూసుకుంది అనిత.

"ట్రింగ్... ట్రింగ్..."

కుర్చీలో కళ్ళుమూసుకుని కూర్చుండిపోయిన అనిత ఫోన్ శబ్దానికి కళ్ళు తెరిచింది.

'ఇహ నిశ్చింతగా ఫోన్ తీయవచ్చు భయం లేదు!' అనుకుంటూ ఫోన్ ఎత్తి సుతారంగా, "హలో..." అంది.

"మేడం దయచేసి సారికారాజ్‌తో మాట్లాడవచ్చా?"

"ఇదేమిటి, మళ్ళీ ఈ సారికారాజ్ ఫోన్? అయితే ఇందాక

సారికారాజ్ వచ్చి సంజాయిషీ ఇచ్చింది కలా?" అనుకుంటూ వుండగానే మళ్ళీ చెవిలో రొద...

అటు నుంచి చాలా మర్యాదగా అడుగుతున్నారు... "మేడం సారికారాజ్‌తో మాట్లాడవచ్చా?"

**(ఆగస్ట్-2013 ఆంధ్రభూమి మాసపత్రిక)**

# 4. ధీర

'ఇంకా ధీరజ్ కాల్ రాలేదే?' అనుకుంటూ గడియారం చూసింది రాధ. పదైంది. ఏమిటా అనుకుంటుండగానే సెల్ రింగైంది. ధీరజే.

"హాయ్ మామ్"

"హాయ్ బేటా. నీ కాల్ కోసమే ఎదురుచూస్తున్నాను."

"సారీ మామ్, మెస్‌లో డిన్నరైనాక అందరం ఏవో కబుర్లేసుకుని కూర్చున్నాము... అందుకే ఆలశ్యమైంది."

"సరేలే, ఏమిటీ ఈ రోజు విశేషాలు?"

"అంతా రొటీన్ అంటాననుకున్నావా? హే కాదు. ఓ గుడ్‌న్యూస్. ఏమిటో చెప్పుకో, చూద్దాం."

"నీకు పోస్టింగ్ వచ్చిందా?"

"అరె, ఎలా తెలుసుకున్నావు?"

"అంతకన్నా గుడ్‌న్యూస్ ఏముంటుందిరా? నువ్వు ఎప్పుడెప్పుడు ఆ టెరరిస్ట్ జోన్‌నుంచి బయటకు వస్తావా అని వేయి కళ్ళ తో ఎదురుచూస్తున్నాను. చాలా మంచి వార్త చెప్పావు. ఎక్కడికైంది?"

"ఢిల్లీకి. ఓ వారంలో అక్కడికి వెళతాను."

"ఓసారి ఇటొచ్చి వెళ్ళకూడదూ. నిన్ను చూడక రెండేళ్ళవుతోంది. నిన్ను చూడాలని అనిపిస్తోందిరా."

"అలాగే. వీలుచూసుకొని వస్తాను. ఇహ ఉండనా, డ్యూటీకి

టైమవుతోంది. గుడ్‌బై."

"అదేమిట్రా గుడ్‌బై అంటావు? గుండె దడదడ లాడిపోతోంది."

"అబ్బ ఏమిటమ్మా? వాకే సారీ గుడ్‌నైట్."

"గుడ్‌నైట్." అని చెప్పి, 'అమ్మయ్య, అక్కడి నుంచి బయట పడుతున్నాడు. ఓ వారమైతే వాడు రాకపోయినా నేను వెళ్ళి చూడవచ్చు...' అనుకుంటూ లైట్ ఆర్పింది.

కళ్ళు మూసుకుంటే నిద్ర రావటం లేదు. తొందరలోనే కొడుకును చూడబోతున్నదంటే మనసంతా ఉద్వేగంగా వుంది. 'చిన్ని కన్న అక్కడేమి ఇబ్బంది పడుతున్నాడో ఏమో... ఏదీ బయటకు చెప్పడు... అంతా గోపీ పోలికే. రూపంలో, స్వభావంలో అంతా తండ్రే...' అనుకుంటూ ఉంటే గోపీని మొదటిసారి చూసింది గుర్తొచ్చింది.

***

ఆ రోజు పెళ్ళివారు చూడటానికి వస్తున్నారు తొందరగా రమ్మని చెప్పాడు తాతయ్య. వారం క్రితం పెద్దవాళ్ళు వచ్చి చూసి వెళ్ళారు. వాళ్ళకు నచ్చిందిట. 'వచ్చేవారం మా అబ్బాయి సెలవు మీద వస్తున్నాడు వచ్చాక వస్తాము' అని చెప్పారట.

"అప్పుడే పెళ్ళేంటి తాతయ్యా? పరీక్షలైపోనీ..." అంటే, "ఎంతమ్మా... మూడునెలలే కదా చదువు? పెళ్ళైనా పూర్తి చేయచ్చులే..." అన్నాడు. మంచి సంబంధం అట. తొందరగా సైకిల్ తొక్కుతోంది. ఇంతలో ఎదురుగా వస్తున్న కూరల ముసలమ్మని, వెనక నుంచి వస్తున్న సైకిల్ అబ్బాయి గుద్దాడు. ఆమె మీద పడబోతుంటే సైకిల్ పక్కకు తిప్పింది. పడబోతున్న సైకిల్‌ను రెండు చేతులు వచ్చి, గట్టిగా పట్టుకొని

ఆపాయి. తన చేతుల మీద పడ్డ ఆ చేతులు ఎవరివా అని తలెత్తి చూసి, అక్కడ కనిపించిన అతనికి “థాంక్స్ అండి” అని చెప్పి, సైకిల్ స్టాండ్ వేసి, కిందపడ్డ ముసలమ్మను లేపింది. ఆమె బుట్టలో నుంచి కింద పడ్డ కూరలను ఏరి, బుట్టలో వేస్తూ, “ఏమైనా దెబ్బ తగిలిందా అవ్వా?” అని అడిగింది.

“దొంగసచ్చినోడు కళ్ళు కనపడటంలే” అని తిట్టుకుంటూ చిన్నగా లేచింది అవ్వ. ఈ లోపల అక్కడికి శిరీష, సుమిత్ర వచ్చేసారు, “ఏమైందే?” అంటూ.

“ఆ పోకిరీవెధవే, నా మీదకు అవ్వను పడేసాడు. సమయానికి ఆయన పట్టుకోబట్టి కాని, లేకపోతే ఏ కాలో, చేయో విరిగేది.”

“వాడిని పట్టుకొని నాలుగు పీకుదామంటే వినవు. భయపడతావు.”

“అబ్బ వదిలేయవే శిరీ, రోడ్ మీద గోలెందుకు? పద.” అంది రాధ జడవెనకకు వేసి, సైకిల్ తీసింది.

క్రీమ్‌కలర్‌కు ఎర్రంచున్న లంగా, క్రీమ్‌కలర్ జాకెట్, ఎర్రటి వోణీ, రెండు పొడగాటి జడలతో, చామనచాయ అయినా, అందంగా ఉందనుకుంటూ మైమరచి, ఆమెనే చూస్తున్న అతను జడ వచ్చి కొట్టుకోగానే ఉలిక్కిపడ్డాడు. అదేమీ గమనించని రాధ ముందుకు వెళ్ళిపోయింది.

“నిన్ను రక్షించాడనా జడతో కొట్టావు? ఎలా చూస్తున్నాడో చూడతను?” నవ్వుతూ అంది సుమిత్ర. “అవునా?” అంటూ వెనక్కి తిరిగింది. స్కూటర్ పట్టుకొని అతను ఇటే చూస్తుండటంతో, “బాబోయ్. స్కూటర్ మీద వచ్చి అరుస్తాడేమో... పదండే...” అని భయంగా స్నేహితులను తొందర పెట్టింది.

పెళ్ళివాళ్ళు వచ్చారు. "జాగ్రత్తగా కూర్చో భయమేమీ లేదు. పెళ్ళి కొడుకు ఆర్మీలో కాప్టెన్. చెప్పాను కదూ," అంది అమ్మ వైదేహి.

చెప్పావన్నట్లు తలూపుతూ, తడబడే అడుగులతో హాల్‌లోకి నడిచింది రాధ. మొదటిసారి కట్టిన చీర పాదాలకు అడ్డం పడుతోంది. ఇంకో పక్క భయం. ఎలాగో చిన్నగా వచ్చి కూర్చుంది. "ఇతని పేరు గోపాల్." అని రాధకు, "మా మనవరాలు రాధ. బిఏ మూడో సంవత్సరం చదువుతోంది." అని అతనికి పరిచయం చేసారు తాతయ్య.

తలెత్తి చూసిన రాధకు నవ్వుతూ తననే చూస్తున్న, బజార్‌లో సైకిల్ పట్టుకున్న అబ్బాయి కనిపించాడు. అంతే... గొంతు తడారిపోయింది. భయంతో తల వంచి చేతి వేళ్ళను చూసుకోసాగింది. వాళ్ళేమి అడిగారో, తనేమి చెప్పిందో... ఎలాగో పూర్తిచేసుకొని వచ్చి గదిలో పడింది. మిలిట్రీ పెళ్ళికొడుకని అమ్మ, నాన్న, తాతయ్య సంతోష పడుతున్నారు. బామ్మే గొణుగుతోంది. 'ఏమైతే ఏమి? ఈ పెళ్ళి కుదరదు!' అనుకుంది.

రాధ అంచనాలను తల్లకిందులు చేస్తూ అబ్బాయికి అమ్మాయి నచ్చిందని కబురు వచ్చింది. బామ్మ మిలిట్రీ అబ్బాయని గొణుగుతుంటే అందరూ నచ్చ చెప్పారు. "గుండె మీద జడతో కొట్టి పడేసావే..." అని శిరి, సుమి ఆటపట్టించారు. ముళ్ళపూడివారి 'రాధాగోపాళం' గుర్తొచ్చారు రాధకు.

స్నేహితుల వేళాకోళాలతో, సరదాలతో, బంధువుల ఆశీర్వాదాలతో పెళ్ళి కన్నుల పండుగగా జరిగింది. నునుసిగ్గులతో అత్తవారింట అడుగుపెట్టింది రాధ. పది రోజులు గోపాల్ ప్రేమతో, అత్తవారి ఆప్యాయతలతో పది నిమిషాలలా గడిచిపోయాయి. సెలవలు పూర్తి కావటంతో, రాధ పరీక్షలయ్యాక వచ్చి తీసుకెళతానని చెప్పి, వెళ్ళిపోయాడు గోపాల్.

అదేమిటో... పెళ్ళికి ముందు, 'పరీక్షలు కాకుండా పెళ్ళేమిటి?' అని గునిసిన రాధ, గోపాల్ తలుపులలో, ఎప్పుడెప్పుడు పరీక్షలైపోతాయా అని ఎదురుచూసింది. ఎదురు చూసిన క్షణం రానే వచ్చింది. రాధ పరీక్షలైపోగానే వచ్చాడు గోపాల్. రెండు నెలలు సెలవలు గడిపి, రాధను తీసుకొని కలకత్తా బయలుదేరాడు.

అమ్మనూ, నాన్ననూ, తాతయ్యను, బామ్మను వదిలి వెళ్ళాలంటే చాలా బెంగగా అనిపించింది. బామ్మకైతే కళ్ళనీళ్ళు ఆగటం లేదు. 'పిచ్చితల్లి! అంత దూరంలో ఎలా ఉంటుందో... ఏమో!' అని ఒకటే కలవర పడిపోతోంది. బామ్మను చూస్తుంటే రాధకూ ఏడుపుముంచుకొస్తోంది. ఈ జీవితానికీ, ఆర్మీ జీవితానికీ చాలా తేడా వుంటుంది అన్నాడు గోపాల్. 'ఎలాగో... ఏమో' అని దిగులు పడిపోతోంది. ఇంకో వైపు, 'గోపాల్ ఉన్నాడు కదా...' అని ధైర్యం. అందరూ స్టేషన్ చేరుకున్నారు. రైల్లో ఎక్కే ముందు అప్రయత్నంగా అత్తగారికి, మామగారికీ దండం పెట్టింది. గోపాల్ కూడా రాధతో పాటు పెట్టాడు. "మీ అమ్మానాన్నగారు, బామ్మా తాతగారికీ పెట్టండి" అన్నారు మామగారు. ఇద్దరు వాళ్ళకూ దణ్ణం పెట్టారు. రైలు కూతేసింది. అందరికీ చేతులూపి రైలెక్కారు. మూడు రోజులు ప్రయాణించి కలకత్తా చేరారు.

స్టేషన్‌లో రైలాగగానే ఇద్దరు జవానులు పరిగెత్తుకుంటూ వచ్చారు. స్టిఫ్ గా నిలబడి, గోపాల్‌కు సెల్యూట్ చేసి సామానులన్నీ దింపారు. జోంగాలో ఎక్కించారు. వాళ్ళతో గలగలా హిందీలో మాట్లాడుతున్నాడు. ఈ హడావుడి అంతా కళ్ళు విప్పార్చుకొని చూస్తూ ఉంది రాధ. జోంగా ఓ ఇంటి ముందు ఆగింది. "ఇది మా ఫ్రెండ్ వాళ్ళ ఇల్లు. వాళ్ళు రెండు నెలలు సెలవ మీద వెళ్ళారు. మనకు క్వాటర్ దొరికేవరకూ ఇక్కడే ఉంటున్నాము. భయపడకు, వాళ్ళు వచ్చేలోపల మనకు క్వాటర్ దొరుకుతుందిలే." అని నవ్వాడు గోపాల్.

ఇల్లంతా తెరిచే వుంది. పడకగదులు కూడా తీసే వున్నాయి. ఇలా తెరిచి ఉంచి వెళ్ళారంటే  మనమేమి, వాళ్ళ వస్తువులు పాడుచేస్తామా? పోగొడుతామా? అని, “మన క్వాటర్‌లోకి వెళ్ళేవరకు మన సామానులేమీ తీయనవసరం లేదులే!” అన్నాడు.

స్నానమదీ అయ్యేసరికి పక్కింటి మేజర్ జగన్నాథం వాళ్ళు పూరీలు, ఆలూ కూర పంపారు. మూడు రోజుల ప్రయాణం. ఇంటి నుంచి తెచ్చుకున్న పూరీలు, కొబ్బరి పచ్చడి, పులిహోర మొదటి రోజే అయిపోయాయి. మిగతా రెండు రోజులు రైల్లో దొరికేవి తినలేక పోయింది. పండ్లతో గడిపేసింది. పూరీలు, కూర చూడగానే ప్రాణం లేచి వచ్చింది. ఆవురావురుమంటూ తినేసింది. వాళ్ళే మధ్యాహ్నం భోజనానికి పిలిచారు. తమిళియన్ బ్రాహ్మిన్‌లు. ఇంకేం సాంబారుతో హాయిగా తినేసింది. మిసెస్ జానకీ జగన్నాథం చాలా ఆప్యాయంగా మాట్లాడింది.

రాత్రి కొత్త పెళ్ళికూతురు రాధకు, ‘స్వాగత పార్టీ’ని స్విమింగ్‌పూల్ పక్కన ఏర్పాటు చేసారు. చక్కగా లైట్లతో ప్రాంగణమంతా అలంకరించారు. మ్యూజిక్ బాండ్ వాళ్ళు మంచి పాటలను వాయిస్తున్నారు.

వెళ్ళేముందే గోపాల్ చెప్పాడు, “ఎవరైనా వచ్చి డాన్స్ కు పిలిస్తే, సున్నితంగా, ‘సారీ!’ అని చెప్పు. అంతేగాని భయపడిపోకు” అని. డాన్స్ ఏమిటా అనుకుంది. తీరా చూస్తే డాన్సింగ్ ఫ్లోర్ మీద ఆడ మగ జంటలుగా డాన్స్ చేస్తున్నారు. మగవాళ్ళ అందరి చేతుల్లో గ్లాసులున్నాయి. కూల్‌డ్రింక్ తెచ్చి ఇచ్చాడు గోపాల్. “నాకు వద్దు తాగను” అంది. తాగకపోయినా, “అలా పట్టుకొని కూర్చో!” అని చెప్పి వెళ్ళాడు. ఎవరెవరో వచ్చి మాట్లాడిస్తున్నారు. వాళ్ళు ‘మిసెస్

గోపాల్' అంటూవుంటే గమ్మత్తుగా అనిపిస్తోంది. అందరినీ గమనిస్తూ, మాట్లాడించిన వారికి చిరునవ్వులు చిందిస్తూ కూర్చుంది. ఆడవాళ్ళంతా బాగా మేకప్ చేసుకున్నారు. రకరకాల హేర్ స్టైల్స్ వేసారు. జరీ కుట్టిన షిఫాన్ చీరలు కట్టారు. తనొక్కతే ఏ మేకప్ లేకుండా, పట్టుచీరతో, జడతో ఉంది. 'బాబోయ్! ఇలా పెదాలకు బుగ్గలకు రంగులు పూసుకుంటే తాతయ్య చంపేస్తాడు!' అనుకుంది. పార్టీ పూర్తయ్యేసరికి రాత్రి రెండైంది. 'హమ్మయ్య!' అనుకుంది.

అది మొదలు రోజులు వేగంగా గడిచిపోసాగాయి. ఓ రోజు 'లేడీస్ మీటింగ్' అని పిలిచారు. మెస్‌లో అందరు ఆఫీసర్ల భార్యలు వచ్చారు. అంతా రాధను అభిమానంగా పరిచయం చేసుకున్నారు. "ఇదంతా నీ జుట్టే!" అని రాధ జడను చూసి ఆశ్చర్యపోయారు. ఇక్కడ అంతా మేకప్‌లో వున్నారు. నెలకోసారి ఇలా కలుసుకుంటారట. ఆటలు ఆడారు. పాటలు పాడారు. భోజనాలు చేసారు... సరదాగా గడిచిపోయింది.

కమాండెంట్ కపూర్ భార్య, మిసెస్ నీనా కపూర్ ప్రతి నెలా రమ్మని రాధను ఆహ్వానించింది. ఇలాగే నెలకోసారి, జవాన్ల, జేసివోల భార్యలతో కూడా కలుస్తారట. అది వెల్ఫేర్ సెంటర్ మీటింగ్ అంటారట. అక్కడ వాళ్ళతో టేబుల్ క్లాత్ లు, నాప్కిన్స్, చీరలు వగైరా వాటి మీద ఎంబ్రాయిడరీ చేయిస్తారట. స్వెటర్లు అల్లిస్తారట. అవన్నీ దీపావళి రోజు 'దివాలీ మేలా' అని పెట్టి అమ్ముతారట. అప్పుడు వచ్చిన డబ్బులను కుట్లు, అల్లికలు చేసిన వారికి కొంత, వెల్ఫేర్ సెంటర్ ఖర్చులకు కొంతా ఇచ్చి, మిగిలింది 'జవాన్స్ వెల్ఫేర్ ఫండ్' కు ఇస్తారట. 'బాగానే ఉందే...' అనుకుంది. అప్పుడప్పుడు జవాన్ల ఇండ్లకు వెళ్ళి వాళ్ళ సమస్యలు తెలుసుకుంటారట. 'షోగ్గా తయారవటము, పార్టీలు ఎంజాయ్మెంటే కాకుండా ఇలా కూడా చేస్తారన్నమాట!' అనుకుంది. తనూ అందులో చేరింది. ఎంఏలో చేరింది. రోజూ కాలేజ్‌కు వెళ్ళటం, ఇంట్లో వంట,

సాయంకాలం పార్టీలు, లేడీస్ మీటింగులు, వెల్ఫేర్ సెంటర్ మీటింగ్స్... చాలా తొందరగా రోజులు దొర్లిపోతున్నాయి.

టు బెడ్ రూం ఫ్లాట్ ఎలాట్ చేసారు. 'ఇది నా సొంతం. దీనికి నేను మహారాణిని' అనుకుంటే గర్వంగా వుంది. ఓరోజు, "మా ఫ్రెండ్ ఖన్నా భార్యను తీసుకొస్తున్నాడు. వాళ్ళకు ఇల్లు ఎలాట్ అయ్యే వరకూ మనతో ఉంటారు" అన్నాడు గోపాల్. 'అవునా! వాళ్ళు ఎలాంటి వాళ్ళో, ఎన్నిరోజులుంటారో...' అని కొంచెం భయపడ్డది.

అనుకున్న రోజు కాప్టెన్ ఖన్నా, మిసెస్ పరిమళ ఖన్నా వచ్చారు. వాళ్ళకూ ఈ మధ్యే పెళ్ళైందిట. మిసెస్ ఖన్నా అంటుంటే, "అలా పిలవకు, 'పరీ' అని పిలు!" అంది. తను ఏర్‌హోస్టెస్‌గా పని చేసిందిట. పెళ్ళైందని వదిలేసిందిట. "రాధీ, నువ్వు లైట్ మేకప్ చేసుకుంటే బాగుంటావు. నీ జుట్టు ఎంత బాగుందో... దాన్ని కాస్త బాక్ కోంబింగ్ చేసి స్టైల్ చేస్తే ముద్దుగా ఉంటుంది తెలుసా? పార్టీలకు చీర ఇలా బిగుతుగా కట్టుకుంటే బాగుంటుంది" అంటూ రకరకాల స్టైల్స్ నేర్పించింది. లైట్‌గా మేకప్ వేసుకొని, బిగుతుగా చీరకట్టుకున్న రాధను చూసి గోపాల్ సంతోషపడిపోయాడు. 'కొంచెమైనా మారాలి, తప్పదు' అనుకుంది రాధ. 'పరి' దగ్గర కొత్త కొత్త వంటలునేర్చుకుంది. వాళ్ళున్న రెండు నెలలు సరదాగా గడిచిపోయాయి.

పరీకి పాపాయి పుట్టింది. అంత బుజ్జిపాపను ఊయలలో చూస్తుంటే చాలా ముద్దుగా అనిపించింది. "ఏంటీ అంతగా చూస్తున్నావు? నీకూ ఇంకో మూడు నెలల్లో వస్తుందిగా!" అంది పరి. "తెల్లగా, బొద్దుగా ముద్దుగా ఉంది. పాపాయిని నాకిచ్చేయ్ పరీ!" అని రాధ నోటిలోనుంచి పూర్తి కాకుండానే, "అమ్మో... నేనివ్వను!" అని గబుక్కున ఎత్తుకున్నాడు ఖన్నా. "ఆ... జాగ్రత్త!" అంటూ కొద్దిగా పైకి లేచింది పరి. వాళ్ళను

చూసి ముసిముసిగా నవ్వుకున్నారు రాధాగోపాల్.

మధ్యాహ్నం భోజనమయ్యాక, యూనీఫాంను మార్చని గోపీని చూస్తూ, "బట్టలు మార్చరా?" అడిగింది. ఏదో ఆలోచనలో ఉన్నట్లుగా ఉండిపోయాడు గోపి. కొద్దిసేపటి తరువాత, "రాధీ! కల్నల్ అర్జున్ తమ్ముడు ఆనంద్ నీకు తోడొస్తాడు. ఈ రోజు రాత్రి హైదరాబాద్ వెళ్ళు" అన్నాడు.

"ఎందుకని? ఇక్కడ మిలిట్రీ ఆసుపత్రిలో వసతులు బాగుంటాయి, ఇక్కడే డెలివరీకి ఉండమన్నారు కదా. వచ్చేవారం అమ్మా, బామ్మా వస్తున్నారు కదా?"

మాట్లాడలేనట్లు రాధ తలను దగ్గరకు తీసుకున్నాడు. గొంతులో ఏదో ఉండ చుట్టుకున్న భావన. "రాధీ, మేమంతా బార్డర్‌కు వెళుతున్నాము."

"దేనికి?"

"పై నుంచి ఆర్డర్స్ వచ్చాయి."

"ఎప్పుడు వస్తారు?"

"తెలీదు. అందుకే నిన్ను వెళ్ళమంటున్నాను." అంటూ రాధ ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకొని దీర్ఘంగా చూసాడు.

"రాధీ, పాప పుట్టినా, బాబు పుట్టినా నీలాగ పిరికివాళ్ళను చేయకు. ధైర్యవంతులుగా చేయి. నీ ఈ నవ్వుతున్న మొహమే నాకు ఎప్పటికీ గుర్తుండాలి."

"అయ్యో అదేమిటండీ అలా మాట్లాడుతున్నారు?"

“ఏమీ లేదులే...” అని తమాయించుకున్నాడు.

ఇంతలో జోంగా వచ్చింది. బయటకు వచ్చారు. అందరూ ఇళ్ళల్లోనుంచి బయటకు వచ్చి ఉన్నారు. కాంప్ బయట చాలా వెహికిల్స్, ఒకదాని వెనుక ఒకటి ఆగి ఉన్నాయి. అందరూ చూస్తుండగానే కాన్వాయ్ వెళ్ళిపోయింది. కాన్వాయ్ లోని చివరి వెహికిల్ కనుమరుగయ్యేవరకూ చూసారు. మిసెస్ నీనాకపూర్, ఇంకొందరు... ఏడుస్తున్న జవాన్ల భార్యలను ఓదారుస్తున్నారు. అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఉన్న కొత్త పెళ్ళికూతురు ఆర్తీ ఛటర్జీ పెద్దపెట్టున ఏడవసాగింది. రాధకు అర్థం కాలేదు. పక్కనున్న మిసెస్ గుప్తాను అడిగింది ఏమిటని.

“అయ్యో బార్డర్‌కు వెళ్ళటమంటే నీకు తెలీదా? వీళ్ళంతా యుద్ధానికి వెళ్ళారు.”

“నాకు గోపీ చెప్పలేదే?”

“అలా చెప్పరు. మనమే అర్థం చేసుకోవాలి. వీళ్ళల్లో ఎంత మంది తిరిగి వస్తారో...” అంటుండగానే గొంతు పట్టుకు పోయింది మిసెస్ గుప్తాకు.

ఇంట్లోకి వచ్చిన రాధకు ఏమీ తోచలేదు. ఓసారి మాటల్లో గోపి, “ఎప్పుడూ పార్టీలూ, సరదాలే కాదు, డిఫెన్స్ లో వుంటే యుద్ధాలూఎదుర్కోవాలి...” అన్నది గుర్తొచ్చింది. అంతకు వారం క్రితమే పరి పాపాయిని తీసుకొని పుట్టింటికి వెళ్ళింది. కాంప్‌లో అందరూ ఆడవాళ్ళే మిగిలారు. కాపలాకి కొంత మంది జవాన్లు వున్నారు. మధ్యాహ్నం ఎలా గడిపిందో తెలీదు. సాయంకాలం అన్నీ సర్దుకొని ఆనంద్ వెంట హైద్రాబాద్ బయలు దేరింది.

టీవీలో, పేపర్లలో ఎక్కడ చూసినా యుద్ధం వార్తలే. గుండె

చిక్కబట్టుకొని వింటోంది రాధ. ఆ రోజు ఒంట్లో కాస్త నలతగా అనిపిస్తోంది రాధకు. 'ఆసుపత్రికి తీసుకెళదామా?' అనుకుంటున్నారు. బామ్మ, రాధ పక్కన కూర్చొని నడుము రాస్తోంది. ఇంతలో "టెలిగ్రాం!" అని వినిపించింది. రాధ ఒక్క ఉదుటున లేచి ఆ టెలిగ్రాం అందుకుంది, వణికే చేతులతో. "మీ భర్తగారు కాప్టెన్ గోపాల్ మరణించారని తెలుపటానికి విచారిస్తున్నాము." అని చదివి, "నో!" అని పడిపోయింది రాధ. అందరూ పరుగెత్తుకుంటూ వచ్చారు. రాధ చేతిలోని టెలిగ్రాం చదివి, నిశ్చేష్టులయ్యారు. "నో నో... ఇది అబద్ధం!" అంటూ ఏడుస్తున్న రాధను పట్టలేకపోయారు.

ఆ హడావుడిలోనే రాధకు డెలివరీ అయింది. బాబు పుట్టాడు. వాడిని చూసి అందరూ ఏడుపే. కాని రాధకు మాత్రం ఓ నిర్లిప్తతఏర్పడింది. ఎలాంటి ఏడుపు లేకుండా వుంది. కొడుకు పుట్టాడన్న సంతోషం కాని, భర్త మరణించాడన్న దుఃఖం కాని ఏవీ కలగనంతగా మనసు మొద్దుబారిపోయింది. బాధ కరగటం లేదు. ఎవరెవరో వస్తున్నారు. సాంత్వన వచనాలు చెపుతున్నారు. ఏవీ తలకెక్కటం లేదు. కొడుకును ఒడిలో పెట్టుకొని అలా శూన్యంలోకి చూస్తూ వుంటుంది.

"ఇలా ఐతే ఎలా అమ్మా ? బాబును చూసుకోవటానికైనా ధైర్యం తెచ్చుకో తల్లీ." అంది వైదేహి.

'అవును... బాబైనా పాపైనా నీలాగ పిరికిగా పెంచొద్దు అన్నాడు కదా, గోపి." అనుకొని కొడుకును చూసుకుంది.

ఇప్పటికే తన మూలంగా పెద్దవాళ్ళు బాధ పడుతున్నారు. ఇంకా వాళ్ళను బాధ పెట్టకూడదు అనుకొంది.

ఎమ్మే పూర్తిచేసి కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. కొడుకు ధీరజ్‌ను

మంచి స్కూల్‌లో చేర్పించింది. వాడికి యూనీఫాంలో వున్న డాడీ ఫోటో చూస్తే గొప్ప ఆరాధన. అది వాడు వాడి ఫ్రెండ్స్ కు గొప్పగా చూపించుకుంటూ ఉంటాడు.

ఇంటర్ పరీక్షలయ్యాక ఓ రోజు, ఒక ఉత్తరం తీసుకొని, అమ్మ దగ్గరకు వచ్చాడు.

"అమ్మా! నీకొక సంగతి చెపుతాను. ప్లీజ్ కోపం తెచ్చుకోవద్దు."

"కోపమెందుకు కన్నా? చెప్పు."

"నేను నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరుదామని యు. పి. యస్. ఈ పరీక్షలు వ్రాసాను. పాస్ అయ్యాను. ఇంటర్వ్యూకు రమ్మని లెటర్ వచ్చింది."

ఏమనాలో తోచలేదు రాధకు.

"ప్లీజ్ మామ్. నాకూ డాడీలా ఆర్మీ ఆఫీసర్ కావాలని ఉంది."

చెమర్చుతున్న కళ్ళను తుడుచుకొని, "నీ ఇష్టం కన్నా" అంది.

ధీరజ్ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాడు. పూనాలో యన్. డి. యే లో చేరాడు. పూర్తైన రోజు యూనీఫాం వేసుకొని తల్లి ముందు స్టిఫ్ గా నిలబడి, "గుడ్‌మార్నింగ్ మాం" అని సెల్యూట్ చేస్తే, కలకత్తా వెళ్ళిన మొదటి రోజు, గోపీ యూనిఫాం వేసుకొని వచ్చి తన ముందు నిలబడి "గుడ్మార్నింగ్ మేడమ్" అన్నది గుర్తొచ్చి, గుండెలో బాధ సుళ్ళు తిరిగింది. ధీరూ తలను రెండు చేతులతో దగ్గరకి తీసుకొని, నుదుటి మీద ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంది.

రెండేళ్ళుగా కాశ్మీర్ దగ్గర టెరరిస్ట్ జోన్‌లో పని చేస్తున్నాడు. టెన్యూర్

అయిపోయింది. ఇంక వారంలో మారుతాడు.

సికింద్రాబాద్ పని మీద వచ్చినప్పుడు ఖన్నా వచ్చి కలిసిపోతూవుంటాడు. పరి పిల్లల చదువుకోసమని ఢిల్లీలో ఉండిపోయింది. కోర్‌డే ఫంక్షన్ ఐనప్పుడల్లా ఆహ్వానం పంపుతారు. గోపీతో సరదాగా పాల్గొనాల్సిన ఫంక్షన్‌లకు వార్‌విడోగా వెళ్ళటం ఇష్టం లేక వాళ్ళు ఎంత పిలిచినా వెళ్ళదు. ఓసారి ఖన్నా వచ్చినప్పుడే, "వార్ మెమోరియల్ చూద్దువుగాని రా" అని బలవంతాన తీసుకెళ్ళాడు. ఆ వార్ మెమోరియల్‌ను తడుముతుంటే గోపీని ముట్టుకున్నట్లుగా అనిపించి, దుఃఖం ఆపుకోలేక దాని దగ్గర కూలబడిపోయింది. ఆ రోజే అనుకుంది, ఇంక ఎప్పుడూ ఇటువైపు రాకూడదని.

తాతయ్యా, బామ్మా పెద్దవాళ్ళైపోయారు. అమ్మానాన్నా కూడా చేతకాకుండానే వున్నారు. అందరికీ తన గురించే దిగులు.

సుదీర్ఘమైన 23 సంవత్సరాల జ్ఞాపకాలతో రాత్రి గడిచిపోయింది. తెలవారుతున్నట్లుగా పక్షుల కిలకిలారావాలు వినిపిస్తున్నాయి.

ఇంట్లో అందరూ లేస్తున్న అలికిడి వినిపిస్తోంది. లేచి కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ కలపాలని వంటింట్లోకి వెళ్ళింది. అందరికీ దీపు పోస్టింగ్ గురించి చెప్పింది.

"పోనీలేమ్మా, ఇప్పటికైనా నీ మనసు కుదట పడుతుంది" అన్నారు.

ఈ రోజు వెళ్ళి అత్తయ్యగారినీ, మామయ్యగారినీ కూడ చూసిరావాలి. దశరథుడి లాగా నలుగురు కొడుకులు అని ఎవరైనా అంటే పొంగిపోయేవారు మామయ్యగారు. అందులో ఒక కొడుకును పోగొట్టుకున్నారు. వాళ్ళకీ ధీరు అంటే ప్రాణం. 'మనవడు వస్తున్నాడన్న శుభవార్త చెప్పాలి. సంతోషపడతారు' అనుకుంది.

కాఫీ గ్లాస్ తీసుకొని బయట చెట్లలోకి నడిచింది.

***

**(ఫిబ్రవరి 2014 -స్వప్న సకుటుంబ సపరివార మాసపత్రిక)**

# 5. చాందిని

గుప్పిళ్ళు రెండూ మూసుకొని, తలకు రెండుపక్కలా పెట్టుకొని, ఉయ్యాలలో అమాయకంగా నిద్రపోతున్న బుజ్జిపాపని తదేకంగా చూస్తున్నాడు శ్రీహర్ష. పక్కన మంచం మీద పడుకొని వున్న శ్రీదేవి నవ్వుతూ, "మీ అమ్మాయికి దిష్టి తగులుతుంది" అన్నది.

ఆ మాట వినిపించుకోకుండా, "ఎంత ముద్దుగా వుంది పాపాయి. చందమామలా వుంది. అందుకే నా పాప పేరు చాందినీ" మురిపెంగా అన్నాడు శ్రీహర్ష.

"అదేమిటి, నార్త్ ఇండియన్ పేరు పెడతారా?" అని ప్రశ్నించింది శ్రీదేవి.

"నార్త్ ఇండియన్ పేరైతే ఏమి? పెట్టకూడదా? అయినా పేరును బట్టి కులము, నార్త్ ఇండియనా, సౌతిండియనా అని తెలవాల్సిన అవసరమేమిటి? నాకిష్టమైన పేరు నేను పెడతాను." అన్నాడు హర్ష.

బారసాల రోజు బియ్యములో, 'చాందిని' అన్నపేరును చూసి, "ఈసారి కొడుకు పుడితే, 'చాంద్మా' అని పేరు పెడతావా?" అని స్నేహితులు వేళాకోళం చేసారు శ్రీహర్షను. "చాందినీ, చాంద్మా అన్నీ ఈ చాందినీనే నాకు. ఇంకెవరూ వద్దు. చాందినీనే గొప్పగా పెంచి, బాగా చదివించి ఐఏయస్ ఆఫీసర్‌ను చేస్తాను" అని గర్వంగా చెప్పాడు శ్రీహర్ష.

న్యూస్‌పేపర్‌లో ఏవో అండర్‌లైన్‌లు చేస్తున్న, తీక్షణంగా ఆలోచిస్తున్న శ్రీహర్షను, "ఏమిటి హర్షా, రెండు రోజుల నుంచి తెగ ఆరాటపడుతున్నావు ?" అని అడిగింది శ్రీదేవి.

"చాందినీని ఏ స్కూల్‌లో చేర్చాలా అని మంచి స్కూల్స్

వెతుకుతున్నాను." అన్నాడు హర్ష.

"అంత ఆలోచన ఎందుకు? ఇప్పుడు మూడేళ్ళే కదా... పక్కనున్న స్కూల్‌లో చేరుద్దాము. ఫస్ట్ క్లాస్‌కు వచ్చాక ఏదైనా పెద్ద స్కూల్‌లో చేర్పొచ్చు." అంది దేవి.

"అలా కాదు ముందునుంచి మంచి కార్పొరేట్ స్కూల్‌లో చేరుస్తే పునాది బాగుంటుంది. అయ్యేయెస్ అంటే మాటలా? ముందు నుంచీ బాగా చదివించాలి."

"కార్పొరేట్ స్కూళ్ళంటే ఫీజులు లక్షల్లో వుంటాయి. అవేకాక పై ఖర్చులు చాలా వుంటాయి. మనం అంత భరించగలమా? పైగా చాందినీని డేకేర్‌లో ఉంచొద్దు, మనమే చూసుకోవాలి అని నా ఉద్యోగం కూడా మానిపించావు." సందేహపడింది శ్రీదేవి.

"ఏం ఎందుకు భరించలేము? నా సంపాదనంతా దాని కోసమేకదా! "అతిశయంగా అన్నాడు హర్ష.

అనుకున్నట్లుగానే మంచి, కార్పొరేట్ స్కూల్‌లో చాందినీని చేర్చాడు. కూతురు కాలు కిందపెడితే అరిగిపోతుందేమోనన్నంత గారాబం చేస్తాడు. ఆఫీసు నుంచి రాగానే చాందినీ కనిపించాలి. ప్రతిరోజూ తప్పకుండా చాక్లెట్ తేవాల్సిందే! "నీ ఒక్కడికే కూతురున్నట్లు మరీ గారాబం చేస్తున్నావు హర్షా. అది అంత మంచిది కాదు." అని అప్పుడప్పుడు మందలిస్తుంటుంది శ్రీదేవి. కాని దేవి మాటలు లక్ష్య పెట్టడు.

శ్రీహర్ష నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి క్లాసూ మంచి మార్కులతో పాస్ అవుతూ పదవతరగతికి వచ్చింది చాందిని.

"చాందినీ!" అని పిలుస్తూ చాందిని గదిలోకి వచ్చింది శ్రీదేవి.

అమ్మను చూడగానే తత్తరపడుతూ లాప్‌టాప్‌ను మూసేసింది చాందిని. దేవి కూడా ఏదో ధ్యాసలో వుండి అంతగా పట్టించుకోలేదు. కాని అలా రెండుమూడు సార్లు తను గదిలోకి వెళ్ళగానే, చాందిని హడావుడిగా లాప్‌టాప్ మూసేయటము గమనించి, "చాందినీ ఏమి చూస్తున్నావు?" అని అడిగింది.

"ఏమీ లేదమ్మా" అంటూ గాభరా పడిపోయింది చాందిని.

చాందినీ తత్తరపాటు చూసి అనుమానంగా లాప్‌టాప్ తీసి చూసింది శ్రీదేవి. అక్కడ నగ్న చిత్రాలు దర్శనమిచ్చాయి!

"చాందినీ ఇవి చూస్తున్నావా?" నివ్వెరపోతూ అడిగింది.

"నేను ఓపెన్ చేయలేదమ్మా నిజం, ఈ మధ్య లాప్‌టాప్ ఓపెన్ చేయగానే అవే వస్తున్నాయి." అని ఏడుపు గొంతుతో చెప్పింది చాందిని.

"నువ్వు తీయకపోతే అవే ఎలా వస్తాయి?" అంటూ హిస్టరీ తీసి చూసింది. అక్కడ ఈ సైట్ ఓపెన్ చేసినట్లుగా ఏమీ కనిపించలేదు. 'మరి ఈ చిత్రాలు ఎలా వస్తున్నాయి?' అని ఆలోచనలో పడింది దేవి.

ఎంత ఆలోచించినా ఏమీ తెలీలేదు. పోనీ హర్షను అడుగుదామా అనుకుంది. అడిగితే హర్ష బాధపడతాడో, ఎలా రియాక్ట్ అవుతాడో అనుకొని టెక్నీషియన్‌ను పిలిచి అడిగింది.

"మీ ఇంట్లో ఎవరో ఈ సైట్ రెగ్యులర్‌గా చూస్తున్నారు. అందుకే వస్తోంది." అని చెప్పి వెళ్ళాడు.

ఇంట్లో వున్నది ముగ్గురమే, నేను చూడటంలేదు. చాందినీ చూడటంలేదు. మరి హర్ష చూస్తున్నాడా? హర్ష అలాంటివి చూడడే...

అని ఆలోచనలో పడింది శ్రీదేవి. అయినా ఓసారి అడిగి చూద్దాం, అడిగినట్లూ వుంటుంది, చెప్పినట్లూ వుంటుంది అనుకొని శ్రీహర్షతో "హర్షా, చాందినీ లాప్‌టాప్‌లో నగ్న చిత్రాలు వస్తున్నాయి. అదేమో, 'నాకు తెలీదు నేను చూడటం లేదు, ఆ సైట్ ఎందుకో ఓపెన్ అవుతోంది' అని ఏడుస్తోంది. టెక్నీషియనేమో మీ ఇంట్లో ఎవరైనా రెగ్యులర్గా చూస్తున్నారేమో, అందుకే ఆ సైట్ కూడా వస్తునట్లుంది అన్నాడు. ఎవరు చూస్తున్నారంటావు? ఏమై వుంటుందంటావు?" అని అడిగింది.

"ఎవరు చూస్తారు?" విసురుగా అని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు శ్రీహర్ష.

అర్ధరాత్రి గబుక్కున మెలుకువ వచ్చింది శ్రీదేవికి. పక్కన శ్రీహర్ష లేడు. పక్క గదిలో దీపం వెలుగుతోంది. ఎవరా అని వెళ్ళి చూస్తే శ్రీహర్ష లాప్‌టాప్‌ను దీక్షగా చూస్తూ కనిపించాడు. దగ్గరగా వెళ్ళి చూసింది. చాలా సీరియస్‌గా నీలి చిత్రం చూస్తున్నాడు. నిర్ఘాంతపోయింది. "హర్షా ఇదేమిటి?" అని ఆవేదనగా అడిగింది. నవ్వి, తిరిగి చిత్రం చూడటంలో మునిగిపోయాడు. కోపం పట్టలేక లాప్‌టాప్ మూసేసి, "ఈ అలవాటేమిటి? నీతో సాయంకాలం చెప్పినప్పుడు కూడా నువ్వు మాట్లాడలేదు. ఇది చాందినీ భవిష్యత్తు మీద ఎంత దెబ్బతీస్తుందో గ్రహించుకోలేవా?" అని అరిచింది.

"అనవసరంగా గొడవ చేయకు దేవీ. ఇక్కడి నుంచి వెళ్ళిపో." అని తిరిగి అరిచాడు.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు హర్షా, నువ్వీ అలవాటు మానేయి. లేకపోతే ఈ పిచ్చి సినిమాలు చూసి నువ్వే పర్వర్టెడ్‌గా మారిపోతావో! ఏ అఘాయిత్యం చేస్తావో!" అని గట్టిగా అరిచింది శ్రీదేవి.

“ఏం మాట్లాడుతున్నావు నువ్వు?” అంటూ కోపం పట్టలేక శ్రీదేవి చెంప ఛెళ్ళుమనిపించాడు శ్రీహర్ష.

“నన్ను కొడతావా? దారి తప్పున్నది నువ్వు. నీ ముద్దుల కూతురిని గురించి కూడా ఆలోచించటంలేదు. ఇక ఈ ఇంట్లో ఓ క్షణం కూడా వుండను. తెల్లవారగానే చాందినీని తీసుకొని ఇంట్లో నుంచి వెళ్ళిపోతాను. ఆ తరువాత నీ ఇష్టం నువ్వేమైనా చేసుకో” అని అక్కడి నుంచి వెళ్ళిపోయింది శ్రీదేవి.

ఓ చేత్తో సూట్‌కేసును, ఓ చేత్తో చాందినీని పట్టుకొని ఇంట్లో నుంచి వెళ్ళిపోతున్న శ్రీదేవిని నిశ్చేష్టుడై చూస్తూ, నోట మాట రాక అలా నిలబడిపోయాడు హర్ష.

బయటకు వచ్చిన శ్రీదేవి ఓ క్షణం సాలోచనగా నిలబడిపోయింది. చాందినీని పుట్టింట్లో వదిలి, శ్రీహర్ష స్నేహితుడు మోహన్ దగ్గరకు వెళ్ళి, పరిస్థితి వివరించింది. ” మోహన్, ఎలాగైనా శ్రీహర్షను ఈ వ్యసనం నుంచి బయటపడేయాలి. దానికి నువ్వే సహాయం చేయాలి ప్లీజ్. ”అన్నది.

“చిన్నగా హర్షతో మాట్లాడి, మా కజిన్ సైకాలజిస్ట్ రామ్ దగ్గరకు తీసుకెళతాను. నువ్వు ధైర్యంగా ఉండు.” అని మోహన్ హామీ ఇచ్చాడు.

శ్రీహర్షకు శ్రీదేవి, చాందినీ లేని ఇల్లు శూన్యంగా వుంది. ఎటుచూసినా వాళ్ళిద్దరే కనిపిస్తున్నారు. చాందినీ నవ్వులూ, ఆటలు, కబుర్లు గుర్తొస్తున్నాయి. ఆఫీస్‌నుంచి రాగానే డాడీ అని అల్లుకుపోయే చాందినీ లేక మనసంతా దిగులుగా భారంగా వుంది. అలా అని నీలి చిత్రాలు చూసే అలవాటును మానుకోలేకపోతున్నాడు.

మూడీగా ఉన్న శ్రీహర్షను చూసి, మోహన్ ఏమీ తెలీనట్లు, “ఈ

మధ్య అలా ఉంటున్నావేమిరా? దేవి వూళ్ళోలేదా?" అని అడిగాడు. బిడియపడుతూ తన సమస్యను చెప్పుకున్నాడు శ్రీహర్ష.

"నీకు నిజంగా ఈ అలవాటు మానేయాలని ఉందా?" అని అడిగాడు మోహన్.

"ఉందిరా... కానీ, మానటం నావల్ల కావటం లేదు." విచారంగా చెప్పాడు శ్రీహర్ష.

"అయితే మా కజిన్ రామ్ అని సైకాలజిస్ట్ వున్నాడు. అతనిని కలుద్దాము. ఏదో ఒక ఉపాయము చెపుతాడు." అన్నాడు.

మరునాడు ఇద్దరూ రామ్ దగ్గరకు వెళ్ళారు.

"అసలు మీకీ అలవాటు ఎలా వచ్చింది?" అని అడిగాడు రామ్.

"ఓ సారి ఏదో సినిమా కోసం వెతుకుతుంటే అనుకోకుండా కనిపించింది. క్యూరియాసిటీతో చూసాను. అప్పటి నుంచి ఎంత కంట్రోల్ చేసుకుందామనుకున్నా ఉత్సుకతను ఆపుకోలేక అదే సైట్‌కు వెళుతున్నాను. "

"మీకు బలంగా మానేయాలని ఉంటే నాలుగైదు సిట్టింగ్స్ లో కౌన్సిలింగ్ చేస్తే తగ్గిపోతుంది." అని చెప్పాడు రామ్.

"అలాగే తప్పక వస్తాను." అన్నాడు శ్రీహర్ష.

శ్రీహర్ష క్రమం తప్పకుండా రామ్ దగ్గరకు సిట్టింగ్స్ కు వెళ్ళాడు. రామ్ కౌన్సిలింగ్‌తో నెమ్మది నెమ్మదిగా నీలిచిత్రాలు చూడాలనే కోరిక తగ్గసాగింది. చిన్నగా పూర్తిగా మానేసాడు. చాందినీని చూడాలనే ఆరాటం! కాని శ్రీదేవిని కలవాలంటే ఏదో సంకోచం! ఎటూ తోచక

దిగులు పడుతున్నాడు. శ్రీహర్షను గమనిస్తున్న మోహన్ ఓరోజు శ్రీదేవికి కాల్ చేసి, "శ్రీహర్ష కౌన్సిలింగ్ తీసుకున్నాడు., నీలి చిత్రాలను చూసే అలవాటును మానేసాడు. ఎంతైనా కూతురంటే ప్రేమ కదా, పాపం కూతురికోసం కష్టపడ్డాడు. ఇప్పుడు అతనిని జాగ్రత్తగా చూసుకోవాలి." అని చెప్పాడు.

భర్త మారినందుకు శ్రీదేవి చాలా సంతోషించింది.

అదేరోజు శ్రీహర్ష ఇంటికి రావటానికి ముందే చాందినీని తీసుకొని ఇంటికి వచ్చేసింది.

శ్రీహర్ష ఆఫీస్‌నుంచి రాగానే "డాడీ!" అంటూ అల్లుకుపోయింది చాందిని. "ఐ లవ్ యు డాడీ. ఐ మిస్ యు డాడీ!" అంది.

"ఈవెన్ ఐ టూ మిస్ యు." చాందినీని దగ్గరకు తీసుకుంటూ గద్గద కంఠముతో అన్నాడు శ్రీహర్ష.

ఇద్దరినీ చిరునవ్వుతో చూస్తూ ఉండిపోయింది శ్రీదేవి!

**(తండ్రి - తనయ అనే అంశం మీద తండ్రీకూతుళ్ల అనుబంధం గురించి మాలిక పత్రికకు వ్రాసిన కథ)**

# 6. అలమారా లిఫ్ట్‌తో అగచాట్లు

గేట్ తీసుకొని లోపలికి వచ్చిన అరుంధతి, ఎదురుగా ఉన్న లిఫ్ట్ వైపు చూసి, నిట్టూరుస్తూ అక్కడున్న కుర్చీలో కూర్చుంది. సెల్ తీసి రింగ్ చేసింది. "హాయ్ అరుంధతీ! ఎప్పుడు బయిలుదేరుతున్నారు?" అడిగింది పార్వతి.

"వచ్చేసాను. మీ పార్కింగ్ ఏరియాలో ఉన్నాను."

"ఓ ఐదు నిమిషాల్లో వచ్చేస్తున్నాను. పోనీ పైకి వచ్చేయకూడదూ."

"ప్లీజ్ పార్వతీ, మీకు తెలుసుగా నా ప్రాబ్లం?"

"ఓకే ఓకే, కూర్చోండి... వచ్చేస్తున్నాను."

మళ్ళీ ఓసారి ఎదురుగా తలుపులు మూసుకొని వున్న లిఫ్ట్ వైపోసారి చూసి, 'హుం దీన్ని ఎవరు కనిపెట్టారో కాని నా దుంపతెగిపోతోంది. దీని వలన నానా అగచాట్లు పడాల్సి వస్తోంది' అని విసుగ్గా అనుకొంటూ ఆలోచనల్లోకి జారిపోయింది, అరుంధతి.

కనీసం కటకటాల లిఫ్టైనా బాగుండేది అది ఆగిపోతే బయట వున్నవాళ్ళు కనిపిస్తారు. ఎవరినైనా పిలిచేందుకు వుంటుంది. గాలి వస్తుంది. అదేమిటో దాన్ని బాన్ చేసారట! ఇప్పుడు అన్ని చోట్లా తప్పనిసరిగా అలమారా లిఫ్ట్‌లు పెడుతున్నారు. దీని దుంపతెగ మనం లోపలికి వస్తుండగానే దాని టైం ఐపోతే టక్కున తలుపు మూసుకుంటుంది. ఎవరో ఒకరు తలుపు పట్టుకుంటారు అందరూ ఎక్కేదాకా. అదో ప్రహసనమైతే, తలుపు మూసుకోగానే లోపల చుట్టూ గట్టి స్టీల్ తలుపులు తప్ప ఇంకేమీ కనిపించవు. ఊపిరి ఆడదు. అసలు కదులుతోందో లేదో కూడా తెలీదు. అంతా బాగానే ఉంటారు తనకు మటుకు అది ఆగి తలుపు

తెరుచుకునేవరకూ గుండెలదురుతూవుంటాయి.

పార్క్ లో వాకింగ్ ఫ్రెండ్ అన్నమాచార్యకీర్తన పాడితే, “చాలా బాగా పాడారండీ. ఎక్కడైనా నేర్చుకున్నారా?” అని అడిగింది తను. “అవునండి” అంది ఆవిడ. పైగా తనకు అంతకు ముందు పాడటము కూడా రాదని, మాష్టారుగారు బాగా నేర్పించారని కూడా చెప్పింది. ఎప్పటి నుంచో తనకూ అన్నమాచార్యకీర్తనలు నేర్చుకోవాలని, హాయిగా పాడుకోవాలని కోరిక. తనూ నేర్చుకోవాలని ఉత్సాహపడి, ఆవిడనడిగి అడ్రెస్ తీసుకుంది. ఇంటికి దగ్గరే. ఆయన, పిల్లలు వెళ్ళిపోయాక పనయ్యాక, మధ్యాహ్నం అంతా ఖాళీనే! హాయిగా నేర్చుకోవచ్చు అనుకుంది. నేర్చుకుంటున్నానని ఇప్పుడే ఎవరికీ చెప్పొద్దు. ‘నీకు సా... పా... అంటమే రాదు నువ్వేమి నేర్చుకుంటావు నీ మొహం?’ అని వెక్కిరిస్తారు. ఎలాగూ తను వెళ్ళి వచ్చింది కూడా ఎవరికీ తెలియదు. బాగా నేర్చుకొని పాడి వినిపించి సర్ప్రైజ్ చేయాలి అని నిశ్చయించుకుంది. ఆ రాత్రంతా తను పాడటం బాగా నేర్చుకున్నట్లు, మాష్టారుగారు తనను ప్రోగ్రాములకు కూడా తీసుకెళ్ళి పాడించినట్లూ, అందరూ మెచ్చుకుంటుంటే ఆయన, పిల్లలు, ‘ఇదంతా ఎప్పుడు సాధించావు?’ అని ఆశ్చర్యంగా చూస్తున్నట్లూ బోలెడు కలలు.

మరునాడే ఆ అడ్రెస్ వెతుకుంటూ వెళ్ళింది. ఇల్లు సులభంగానే కనిపించింది. హూం ఆతరువాతే అసలు కష్టాలు మొదలయ్యాయి. మాష్టారుగారి ఇల్లు పైన నాలుగో అంతస్తులో. కింద మూడంతస్తులూ షాప్‌లకిచ్చారు. బిల్డింగ్ వెనక వైపున పైకి వెళ్ళేందుకు లిఫ్టూ, మెట్లు వున్నాయి. పైగా అలమారా లిఫ్ట్! చిన్నగా మెట్లెక్కేందుకు వెళ్ళింది. ఎక్కడి నుంచి వచ్చాడో సెక్యూరిటీ అతను, “మేడమ్... లిఫ్ట్ పని చేస్తోంది. మీరు లిఫ్ట్‌లో వెళ్ళవచ్చు” అన్నాడు.

ఒక్క నిమిషం అతని వైపు చూసి "నువ్వు వస్తావా నాతో?" అని అడిగింది.

ఆమె వైపు విచిత్రంగా చూసి, "పదండి మేడం." అన్నాడు.

లిఫ్ట్‌లోకి వెళ్ళి తలుపు మూసుకోగానే కాళ్ళూ చేతులూ వణికిపోయాయి. గుండెను అరచేత్తో పట్టుకొని ఎలాగో పైకి చేరుకుంది. మాష్టారుగారితో మాట్లాడి క్లాస్‌లో చేరింది. ఓ పది మంది విద్యార్థులు ఉన్నారు. అందరూ గృహిణులే. దాదాపు తన వయసు వారే. 'అమ్మయ్య! ఫరవాలేదు' అనుకొంది. ఆ రోజు క్లాస్‌ముగించుకొని ఎలాగో కిందికి దిగింది.

మరునాడు తొందరగా పని ముగించుకొని పదింటికల్లా క్లాస్‌కు చేరుకుంది. లిఫ్ట్‌కు, మెట్లకూ మధ్య నిలుచొని పైకీ, కిందికీ చూస్తూ ఆలోచనలో పడింది. అంతా బాగానే వుంది కాని ఈ లిఫ్ట్‌తో చావొచ్చిపడిందే, ఏమి చేయటం? లిఫ్ట్ దాకా వెళ్ళింది కాని ఎక్కే ధైర్యం చేయలేకపోయింది. నిన్నేదో ఉత్సాహంలో అలమార లిఫ్ట్‌లోనుంచి పైకి వెళ్ళింది కాని ఇప్పుడు దాన్ని చూడగానే గుండె గుభిల్లుమంది. ఎలా నాలుగో అంతస్తుకు వెళ్ళటము? పైకీ కిందికి చూస్తోంది... ఇంతలో సెక్యూరిటీ గార్డ్ వచ్చి, "క్యా చాహియే మేడం?" అన్నాడు.

నిన్నటి అతను కానట్లున్నాడు.

"ఫోర్త్ ఫ్లోర్ కో జానా హై."

"ఇదర్ లిఫ్ట్ హై మేడం".

"యే ఏకీ హై క్యా?" (పక్కన తనలాంటివారి కోసం కటకటాల లిఫ్ట్ ఏమైనా పెట్టారేమో అన్న ఆశతో అడిగింది.)

అతను విచిత్రంగా చూసి "హా మేడం" అన్నాడు.

"షాప్స్ కే అందర్సే ఎస్కలేటర్ సే జాసక్తే క్యా?"

"నై. క్యోం మేడం యే లిఫ్ట్ మే జావోనా?"

ఏం చెబుతుంది అతనికి? ఓ రెండు రోజులైతే అదే అలవాటు అవుతుందనుకొని, తన వైపు వింతగా చూస్తున్న సెక్యూరిటీ గార్డ్ ని పట్టించుకోకుండా, అసలు ఈ అలమారా లిఫ్ట్‌లు ఎవరు కనిపెట్టారు? హాయిగా కటకటాల లిఫ్ట్‌లైతే బాగుంటాయి కదా అని తిట్టుకుంటూ ఆపసోపాలు పడుతూ నాలుగు అంతస్తులూ ఎక్కి వెళ్ళి, కాసేపు ఆయాసం తీర్చుకోవటానికి వరండాలో కుర్చీలో కూర్చుంది. ఇంతలో లోపలి నుంచి ఒకావిడ వచ్చి, "అదేమిటి ఇటునుంచి వచ్చారు? అటు లిఫ్ట్ ఉంది కదా!" అని అడిగింది. నవ్వి ఊరుకుంది తను.

చిన్నగా క్లాస్‌లో అందరూ పరిచయం అయ్యారు. క్లాసయిపోగానే మెట్ల వైపు నడుస్తున్న తనతో, "ఇటు లిఫ్ట్ ఉందండి!" అన్నారు ఎవరో. వినిపించుకోనట్లు వెళ్ళిపోయింది. మరునాడు మెట్లెక్కుతుంటే ఎవరో, "అమ్మా, అమ్మా!" అని గట్టిగా పిలిచారు. "ఏమిటీ?" అని వెనక్కి తిరుగుతే వెనికింటి పనిమనిషి, "ఇటు లిఫ్ట్ ఉందమ్మా!" అంది. మొహమాటంగా నవ్వి మెట్లెక్కి వెళ్ళిపోయింది. రోజూ ఇదో గోలైపోయింది. వెనికింటి వాళ్ళో, పక్కింటి వాళ్ళో పిలిచి, అరిచి మరీ చెప్పటం తను తిరిగి చూడకుండా హుస్సో అనుకుంటూ, 'జనాభాకు మరీ ఇంత పరోపకార బుద్ధి ఎక్కువైందేమిటి?' అని విసుక్కుంటూ ఎక్కటం. రెండు రోజులు గడిచాయి, తనకు కొంచెం ఫ్రెండ్ అయిన లక్ష్మితో, "ఈ లిఫ్ట్ ఆగిపోతే ఎలాగండి? ఏదైనా బాకప్ ఉందా?" అడిగింది.

"జనరేటర్ ఉందండి. కాకపోతే ఒక్కోసారి జనరేటర్ పని చేయకపోతే కష్టం. ఓసారి ఇలాగే అయ్యింది. మాష్టారుగారి అల్లుడు లిఫ్ట్‌లో ఉండగా ఆగిపోయింది. లిఫ్ట్ ఆగగానే ఫస్ట్ ఫ్లోర్‌లోకి దిగి తలుపు తెరుచుకుంది." అంది.

"అమ్మయ్య. లిఫ్ట్ ఆగితే కింది ఫ్లోర్‌కు వెళ్ళి తలుపు తెరుచుకుంటుంది కదా, ఐతే పర్వాలేదు." అని ఊపిరి పీల్చుకుంది తను.

"అవుననుకోండి, కాని బయటకు ఎలా వస్తారు?" అడిగింది లక్ష్మి.

"అదేమిటి?" తెల్లబోయింది తను.

"అవును కదా, లిఫ్ట్‌కు షాప్‌ల వైపు ఏ ఫ్లోర్‌లోనూ తలుపులు లేవు. గోడలే వున్నాయి. ఇటువైపు చిన్న బాల్కనీలా కట్టారు. మాష్టారుగారింటి బాల్కనీలో తప్ప మిగితా మూడు అంతస్తులూ ఇటువైపున్న చిన్న బాల్కనీల్లోకే తలుపులు వున్నాయి. అంత ఎత్తునుంచి ఎలా దిగుతాము?" అడిగింది లక్ష్మి.

"ఎందుకలా కట్టారు? ఆయన ఎలా బయటకు వచ్చారు?" ఆతృతగా అడిగింది తను.

"ఇది మాష్టారుగారి సొంత స్థలం కదండి. మూడు ఫ్లోర్‌లూ వాళ్ళే కట్టి షాప్‌లకు ఇచ్చారు. వీళ్ళ కోసం లిఫ్ట్ ఇటువైపు పెట్టుకున్నారు. షాపులకు వచ్చేపోయేవాళ్ళంతా లిఫ్ట్ వాడుతే లిఫ్ట్ పాడవుతుందనేమో లేకపోతే ప్రైవసీ వుండదనో మరేమో నాకు తెలీదు, అటువైపు లిఫ్ట్ కాకుండా గోడ కట్టారు. అల్లుడుగారిని నిచ్చెన వేసి దింపారు. మొదటి అంతస్తేగా?" అని ముగించింది లక్ష్మి.

'నా తల్లే చెప్పావు కాదూ, అదే ఏ మూడో అంతస్తులోనో ఆగితే

నిచ్చెనా అందదు. ఏమోలే నేను లిఫ్ట్ ఎక్కబోయానా?' అనుకుంది తను. అనుకుందేకాని ఇంటికి వెళ్ళినా అదే ధ్యాస. రాత్రి భోజనాలయ్యాక అలాగే కలత నిదురబోయింది.

చిన్నగా వెలుతురు వస్తోంది. లిఫ్ట్‌లో లైట్ సరిగ్గా వెలుగుతున్నట్లులేదు. ఆ రోజు మరీ నడుం నొప్పి కాళ్ళ నొప్పులు ఉండటంతో తప్పక లిఫ్ట్ ఎక్కింది. ఇంతలో ఆ గుడ్డి వెలుతురు కూడా పోయింది. చుట్టూ చీకటి... భయంతో నోరు పిడచకట్టుకుపోయింది.

ఎవరినైనా పిలుద్దామన్నా నోరు పెగలటం లేదు...

ఇంతలో లిఫ్ట్ రయ్ రయ్‌న కిందికి జారసాగింది. "అమ్మో హెల్ప్ హెల్ప్" కెవ్వ్ కెవ్వ్‌న అరిచింది.

గబుక్కున లిఫ్ట్ ఆగి దఢాల్‌మని తలుపు తెరుచుకుంది. అదురుతున్న గుండెతో బయటకు పరిగెత్తి చుట్టూ చూసింది. భూమి ఎక్కడో కింద కనిపిస్తోంది. అక్కడి నుంచి నిచ్చెన వేసి దిగు దిగు అని పిలుస్తున్నారు. ఎట్లా దిగుతుంది? తనకు నిచ్చెన అందటం లేదు... "ఏమండీ, ఏమండీ!" అని అరిచింది.

ఎక్కడి నుంచో కిరణ్, "అరుంధతీ, అరుంధతీ!" అని పిలుస్తున్నాడు. కుదుపుతున్నాడు. కళ్ళు తెరిచి చూసింది. వళ్ళంతా చెమటలు కారుతున్నాయి. శరీరం భయంతో వణికిపోతోంది. ఒక్క క్షణం తనెక్కడుందో అర్థం కాలేదు. కిరణ్ అరుంధతిని చిన్నగాలేపి కూర్చోబెట్టి మంచి నీళ్ళు ఇచ్చాడు. పక్క గది నుంచి పిల్లలు పూజ, ప్రవీణ్ పరిగెత్తుకుంటూ వచ్చారు. చిన్నగా తేరుకొని చుట్టూ చూసింది అరుంధతి. తను లిఫ్ట్‌లో లేదు, ఇంట్లోనే ఉంది. లేచి కూర్చోబోయింది. నడుము కలుక్కుమంది. "ఏమైంది?" అందరూ కంగారుగా అడిగారు.

"ఏమీలేదు ఏదో పీడకల!" అంది అప్పటికి తేరుకున్న అరుంధతి.

కాని తెల్లారి లేచి భారంగా పెడకాళ్ళేస్తూ, నడుస్తూ వుంటే అంతా గాభరాపడ్డారు. "ఏమైంది? మొహం కూడా పీక్కుపోయింది. డాక్టర్ దగ్గరకు వెళదామా?" అని వేధించేసారంతా. "అమ్మో డాక్టర్ దగ్గరికే! ఇంకేమైనా ఉందీ? ఏమని చెబుతుంది? ఏమీ కాలేదు, ఏదో కాస్త వాతావరణం మారింది కదా, కాస్త ఒళ్ళు నొప్పులు అంతే..." అని చెప్పి ఒప్పించేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఇలా రోజూ "నాలుగంతస్తులు మెట్లెక్కుతున్నాను" అని చెబితే ఇంకేమైనా ఉందా? అప్పటికీ ఆ రోజు ఓపిక తెచ్చుకొని క్లాస్‌కు వెళ్ళింది. కాని క్లాస్‌లో కూర్చోవటం కాదే! ఒకటే నీరసం. ఇదంతా భరించలేక ఈసురోమంటూ, "అన్నమయ్యా నా అపరాధాన్ని మన్నించు. నీ కీర్తనలు శ్రావ్యంగా పాడుకునే అదృష్టం నాకు లేదు" ప్చ్... కచేరీలూ... శాలువాలూ... చప్పట్లూ కళ్ళ ముందు కదలాడుతుంటే దీనంగా వాటికేసి చూస్తూ, అన్నమయ్యను అటకెక్కించేసింది.

ఓరోజు పొద్దున్నే ప్రాణస్నేహితురాలు సుధ ఫోన్‌చేసి, "మా అమ్మాయి శ్రావణి పెళ్ళి కుదిరింది. సాయంకాలమే నిశ్చితార్థం, గ్రాండ్ హోటల్‌లో" అని సంబరంగా చెప్పింది.

తనూ సంతోషపడిపోతూ, "హోటల్‌లో హాల్ ఎక్కడుంది, కిందనే కదా!" అని అడిగింది.

నీరసంగా, "కాదు ఐదో అంతస్తు. నాకు వెంటనే నువ్వు గుర్తొచ్చావు కాని అల్లుడుగారు అక్కడే కావాలన్నారు. అందుకని తీసుకోక తప్పలేదు" అంది సుధ.

"మరి... మరి... లిఫ్ట్?" అంటూ నసిగింది తను.

"నీ లిఫ్ట్ భయం తగలెయ్య. ప్రపంచంలో రోజూ కొన్ని కోట్ల మంది లిఫ్ట్ ఎక్కుతున్నారు నువ్వొక్కదానివే కాదు." కసురుకుంది సుధ.

"అది కాదు సుధా ప్లీజ్ ఈసారికి నన్నొదిలేయవే. పెళ్ళికి వారం రోజులు మీ ఇంట్లోనే ఉంటానుగా ప్లీజ్ ప్లీజ్." అని బతిమిలాడింది తను.

"పెళ్ళి సంగతి అప్పుడే చూసుకుందాము. ఈ రోజు రాకపోయావో నీతో ఈ జన్మలో మాట్లాడను." అని బెదిరించి తను చెప్పేది వినిపించుకోకుండా ఫోన్ పెట్టేసింది!

'మొండిది అన్నంత పనీ చేస్తుంది. తప్పించుకునే దారి లేదు దేవుడా!' అనుకుంటూ వెళ్ళింది. హోటల్‌లోకి వెళుతూనే కిరణ్ లిఫ్ట్ వైపు నడుస్తుంటే అనుసరించింది. "సార్ ఈ లిఫ్ట్ ఆగిపోయింది. అటువైపు ఇంకోటి ఉంది, అందులో వెళ్ళండి!" అన్నాడు అక్కడ ఉన్న వెయిటర్.

కళ్ళు పెద్దవి చేసి, "లిఫ్ట్ ఆగినప్పుడు అందులో ఎవరైనా ఉన్నారా?" భయం భయంగా అడిగింది.

"నీకెందుకు? అటు పద..." అని కిరణ్ తనను లాక్కెళ్ళాడు. లిఫ్ట్ దాకా వెళ్ళాక, "మీరు లిఫ్ట్‌లో రండి నేను మెట్లెక్కి వస్తాను." అని గబగబా మెట్లెక్కింది. కిరణ్ తనను అనుసరించాడు." ప్లీజ్ మీరు లిఫ్ట్‌లో రండి." బతిమిలాడింది. కాని కిరణ్ మాట్లాడకుండా వెనకే వచ్చాడు. ఆపసోపాలు పడుతూ ఐదంతస్తులూ ఎక్కారు. లోపలికి వెళుదామంటే తలుపు వేసేసి వుంది! ఎంత కొట్టినా ఎవరూ పలకలేదు. సుధ నంబర్‌కు కాల్ చేసింది, హడావుడిలో సెల్ ఎక్కడపడేసిందో తీయలేదు! తన దగ్గర సుధది తప్ప ఇంకెవరి నంబరూ లేదు. చుట్టూ చూసింది. మెట్ల మీద లైట్ డిమ్‌గా వుంది. అంతటా నిశ్శబ్దం! 'అమ్మో కిరణ్ వెంట రాకపోతే...' తలుచుకుంటేనే వణుకొచ్చేసింది.

ఏమి చేద్దామన్నట్లు కిరణ్ వైపు చూసింది. భుజాలు ఎగరేసి వెనకకు తిరిగాడు. 'శ్రీరామచంద్రా నారాయణా ఎన్ని కష్టాలు పెట్టావురా నాయనా?' అనుకుంటూ ఐదంతస్తులూ దిగి లిఫ్ట్ ఎక్కారు. 'ఈ పని ముందే చేస్తే బాగుండేదిగా!' అన్నట్లు చూసాడు కిరణ్. మొహం తిప్పుకుంది. పైకి వెళ్ళాక తనను చూసి, "కాస్త నవ్వు మొహం పెట్టు. అంత దిగులుగా ఆపసోపాలు పడుతూ వుంటే అందరూ ఏమైనా అనుకొంటారు." హెచ్చరించాడు కిరణ్. 'నవ్వు మొహమా అయ్యో రామా!' అని నిట్టూర్చింది.

అదిగో అప్పట్నించీ ఈ లిఫ్ట్ భయం ఇంకా ఎక్కువయింది అని విసుగ్గా అనుకొంటూ ఆలోచనల్లోకి జారిపోయింది.

"అమ్మా ఎవరమ్మా? ఇక్కడ కూర్చున్నారు ?"

"నేను ఫోర్నాట్ ఫోర్ అమ్మగారి కోసం వచ్చాను. నువ్వెవరు ?" అడిగింది.

"నేను ఇక్కడ వాచ్‌మాన్ భార్యను. ఇక్కడెందుకు కూర్చున్నారు? లిఫ్ట్ బాగానే వుంది. వెళ్ళండమ్మా " అన్నది వా. భా.

అబ్బా... వా. భా ను పట్టించుకోకుండా, 'ఈ పార్వతి గారు ఎప్పుడు వస్తారో! ఈ లోపల శారదగారికి కాల్ చేసి విష్ చేస్తే పోలే?' అనుకుంటూ సెల్ తీసింది.

"హలో అరుంధతి గారూ, చెప్పండి?" అటునుంచి శారద మాట్లాడింది.

"మీ కథకు బహుమతి వచ్చింది కదా, కంగ్రాట్యులేషన్స్ అండి." అన్నది అరుంధతి.

"థాంక్స్ అండి అరుంధతి గారు. నేను ఒక ఫంక్షన్‌కు వచ్చాను. ఇక్కడ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాను. తలుపులు తీస్తున్నారు. ఇంటికి వెళ్ళాక మాట్లాడుతాను. ఏమనుకోండి ప్లీజ్."

"దేవుడా" తలకొట్టుకుంది. "అమ్మా!" పిలిచింది వా. భా.

హుం మొదలైంది, ఇహ ముసుగులో గుద్దులాట ఎందుకని, "నాకు లిఫ్ట్ అంటే భయం. అందుకని ఇక్కడే కూర్చున్నాను. పార్వతమ్మ ఇప్పుడే వస్తారు." అని చెప్పింది.

"భయమెందుకమ్మా? నేను తీసుకెళుతాను. నా చేయి పట్టుకోండి. అమ్మ వచ్చేసరికి ఎంతసేపు అవుతుందో. ఎండలో ఎందుకు?" అంది.

'ఇదీ అందరు చెప్పే మాటే మేమున్నాము, మా మధ్యలో ఉండు, మా చేయి పట్టుకో, కళ్ళు మూసుకో సింగినాదం జీలకర్రా!' అనుకొంటూ " మీ లిఫ్ట్ మధ్యలో ఆగదా?" అందరినీ అడిగే ప్రశ్నే అడిగింది.

"లేదమ్మా ఆగదు. కరెంట్ పోగానే జనరేటర్ వేస్తాము." అంది వా. భా.

"మరి జనరేటర్ పాడవుతే?"

"లిఫ్ట్ ఒక అంతస్తు దిగి తలుపు తెరుచుకుంటుంది."

"లిఫ్ట్ ఎప్పుడూ పాడవలేదా?"

"లేదమ్మా. కాకపోతే అప్పుడోసారి లిఫ్ట్ పని చేసే ఆయన లిఫ్ట్‌లో వుండగా పాడైంది. పది నిమిషాలకు బాగై తెరుచుకుందనుకో" చావు కబురు చల్లగా చెప్పింది వా. భా.

అంతా బాగానే ఉంటుంది,ఈ 'కాకపోతే' తోటే తనకు ఈ అలమారా లిఫ్ట్ అగచాట్లు!

మహాభారతంలో అస్తమానం, "పరంతూ.. "అంటూ విదురుడు భీష్ముడితో అన్నట్టు ఈ లిఫ్ట్ భయం కాదు కానీ అందరూ "కాకపోతే..." అన్నమాట మటుకు మహబాగా ప్రయోగిస్తున్నారు!

***

**(05-05-2015 - యామిని వెబ్ మాగ్జిన్)**

# 7. చూపులు కలవని శుభవేళ

“ఏందిరా యాద్గిరీ పండినవ్? డాక్టర్ సాబ్ ఇంటికి బోలే?” స్టూడియోలోకి వస్తూ, బెంచి మీద పడుకొని ఉన్న యాదగిరి ని అడిగాడు, వెంకటేశ్.

“లేదన్నా కడుపుల నొస్తోంది. నువ్వొచ్చినంక చెప్పి ఇంటికి బోదమని పండుకొన్నా.” జవాబిచ్చాడు యాదగిరి.

“బయట తినొద్దురా అంటే వినవ్. ఏం తిన్నవురా?” అడిగాడు వెంకటేశ్.

“ఏం తినలేదన్నా.” మూలుగుతూ జవాబిచ్చాడు.

“మరి డాక్టర్ సాబ్ ఇంటికి రఘు బోయినాడురా?” అడిగాడు వెంకటేశ్.

“లేదన్నా, వాడి తాత దినాలని ఊరెళ్ళిండు.”

“ఎన్ని సార్లు దినాల కెళుతాడురా?” విసుక్కుంటూ. ” శ్యాం ఏడి? వాడెళ్ళిండా?” అడిగాడు.

“లేదన్నా వాడి అమ్మకు బాగలేదట, దవఖానాకు తీసుకెళ్ళిండు.”

“ఓరినీ దుంపలెత్తెగ, అందరికీ ఈ రోజే ఏమొచ్చిందిరా?” కంగారు పడిపోయాడు వెంకటేశ్.

“అన్నా ఇగనేనింటికి బోతా.” ముక్కుతూ, మూలుగుతూ వెళ్ళిపోయాడు యాద్గిరి.

ఇంక తప్పదన్నట్లు తనే వీడియో తీసుకొని, పని కుర్రాడు సాయిని

బతిమిలాడి బామాలి వెంట తీసుకొని వెళ్ళాడు. పెళ్ళి హాల్‌లో కెమెరామాన్ శేషు వెనక వరసలో దిగాలుగా కూర్చొని వున్నాడు!

"ఏమైందన్నా అట్లా ఉన్నావు?" అని అడిగాడు వెంకటేశ్.

"మా పోరగాళ్ళందరూ రాకుండా తప్పించుకున్నారు. ఎందుకా అనుకున్నాను, ఇక్కడికొస్తే తెలిసింది, ఇక్కడ అందరికీ కళ్ళకలకలు వచ్చాయి. కనిపిస్తలే, అందరూ నల్లకళ్ళద్దాలు పెట్టారు." అన్నాడు శేషు.

"హోరినీ ఇందుకా మా పోరగాళ్ళు కూడా తప్పుకున్నారు." ఆశ్చర్యపోయాడు వెంకటేశ్.

ఇంతలో పెళ్ళి తంతు మొదలైందని వీళ్ళను రమ్మని పిలిచారు. ఏమైనా మనం తప్పించుకోలేము కదా అని ఒకరినొకరు దీనంగా చూసుకుంటూ, తమతమ సరంజామా సర్దుకొని లేచారు.

సన్నాయి వాళ్ళు శ్రావ్యంగా వాయిస్తున్నారు. మల్లెపూల సువాసనలు గాలిలో తేలి వస్తున్నాయి. చిన్నపిల్లలంతా కళ్ళద్దాలు సర్దుకుంటూ సరదాపడిపోతూ హాలంతా పరుగులుపెడుతున్నారు. హాలంతా సందడి సందడిగా వుంది. ఒకరిమాట ఒకరికి వినిపించకపోయినా గొంతు పెంచి మరీ గలగలా మాట్లాడేసుకుంటున్నారు. అతిథులు ఒకరొకరుగా వస్తున్నారు. హాల్ బయట నల్ల కళ్ళద్దాలు అమ్ముకుంటున్న అతనిని చూసి ఆశ్చర్యపోతున్నారు. 'ఏ పెళ్ళి హాలు ముందైనా బూరలు, బూజు మిఠాయి లాంటివి అమ్ముకుంటారు. కాని ఇక్కడ ఏమిటీ నల్ల కళ్ళద్దాలు అమ్ముతున్నారు?' అనుకుంటూ లోపలికి వస్తే అంతా కళ్ళ జోళ్ళతో కనిపించారు.

"అదేమిటండీ, ఈ పెళ్ళి లో నల్ల కళ్ళద్దాలు పెట్టుకోవాలని ఏమైనా డ్రెస్ కోడ్ ఏమైనా పెట్టారా?" వింతగా పరంధామయ్య, వెంకట్రావును

అడిగాడు.

"అబ్బే లేదండి. ఊళ్ళో కళ్ళకలక వుంది కదా, పెళ్ళింట్లో అందరికీ వచ్చింది. ఇక్కడేదో లాభసాటి బేరం అనుకొని కళ్ళజోడు షాప్ వాడు మొత్తానికి ఇక్కడే అమ్మకాలు మొదలు పెట్టాడు. ఎందుకైనా మంచిది మీరు ఓటి పెట్టుకోండి. మీకు రాకుండా వుంటుంది." అన్నాడు.

భోజనాల దగ్గర అందరిని కనుక్కుంటూ తిరుగుతోంది సుభద్ర. మామ్మగారు సుభద్రను పిలిచి "అమ్మాయ్ కొత్త నెక్లెస్ కొన్నావుటే, చూపించు" అంది.

"లేదు మామ్మా జాకెట్‌కు నెహ్రూ కాలర్ పెట్టించుకున్నాను. దాని మీద ఎంబ్రాయిడరీ చేసుకున్నాను. అది నీకు కళ్ళద్దాలలో నుంచి నెక్లెస్‌లా కనిపిస్తున్నట్లుంది." అంటూనే అటుగా చేతిలో ఐస్క్రీం తో వెళుతున్న చింటూని రెక్క పట్టుకొని ఆపి, "వెధవా ఇది ఎన్నో ఐస్క్రీంరా?" అని గదమాయించింది.

"అమ్మా నీకు కనిపిస్తోందా?" ఆశ్చర్యంగా అడిగాడు చింటూ.

"ఏరా నాకు కనిపించదనుకొని ఇన్ని తినేస్తున్నావా? వెధవా మళ్ళీ ఐస్క్రీం దగ్గరకు వచ్చావంటే నాలుగు తగిలిస్తాను." అని కోపం చేసి వాడిని వదిలేసింది.

పెళ్ళి కూతురిని తీసుకొచ్చి పీటల మీద కూర్చో పెట్టారు. మధ్యలో తెర పట్టారు. ముహూర్తానికి ఇంకా సమయము వుందని పెద శాస్త్రులుగారు ఏవో మంత్రాలు చదువుతున్నారు. ఇదే సందని పెళ్ళికొడుకు గోపీ తెరను కొంచెం  కిందికి దించబోయాడు. చిన్న శాస్త్రులుగారు తెర పట్టుకొని, " అయ్యా పెళ్ళికొడుకు గారూ మీరలా చూడకూడదు!" అన్నాడు.

"శాస్త్రులుగారూ, ఈ నల్ల కళ్ళద్దాల వారు, అసలు పెళ్ళికూతురినే తెచ్చారో, ఇంకెవరినన్నా తీసుకొచ్చారో ఓసారి చూడనీయండి." అన్నాడు గోపీ.

"పెళ్ళికుమార్తె గారి అన్నయ్య మీ స్నేహితులేనట కదా? వారు పొరపాటు ఎందుకు పడతారు?" అని ప్రశ్నించాడు చిన్న శాస్త్రులు గారు.

"అదేనండి సమస్య. ముందే వాడికి పెళ్ళికాకుండా నాకైతోందని కుళ్ళుకుంటున్నాడు. ఇప్పుడు పొరపాటు చేసాననటానికి వీలు చిక్కింది. మీకు తెలీదండి, పెళ్ళికూతురు మారిపోతే నా కొంప కొల్లేరవుతుంది. నన్ను చూడనీయండి."

"అయ్యా పెళ్ళికొడుకు గారూ, మీరలా పేచీలు పెట్టకూడదు."

"ఏమిటీ నేను నిన్ను చూసి కుళ్ళుకుంటున్నానా? నాకు తోచలేదు ఏ ఎత్తుపళ్ళు, మెల్లకన్ను ఉన్నదాన్నో తేవాల్సింది తిక్క కుదురేది." పెళ్ళికూతురు అన్న సుధీర్ పోట్లాటకు దిగాడు.

"ఊ ఊ ఇక సమయమైంది. పెళ్ళికొడుకుగారూ మీ చేయి ఇలా ఇవ్వండి " అంటూ చేయి అందుకున్నారు పెద్దశాస్త్రులవారు.

"అయ్యో అయ్యో నేను పెళ్ళికుమారుడిని కాదండి. వాడి తండ్రిని. శాస్త్రులు గారు కాస్త జాగ్రత్తగా గమనించి చేయండి. లేదా మీ కళ్ళ జోడు తీసేయండి." అని కొంచెం కోపంగా అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అయ్యా క్షమించండి. కళ్ళజోడు తీస్తే కష్టం కదండి. జాగ్రత్తగానే ఉంటాను లెండి." అని వధువు, వరునితో జీలకర్ర, బెల్లం పెట్టించి తెరతీసారు శాస్త్రులు గారు.

"బాబూ పెళ్ళికొడుకుగారూ, అమ్మా పెళ్ళికూతురుగారూ మీరిరువురూ ఒకరినొకరు చూసుకోండయ్యా. ఈ శుభముహూర్తాన మీ చూపులు కలవాలి." అన్నారు శాస్త్రులు గారు.

గోపీ, రేఖా కళ్ళద్దాలు తీసారు. ఒకరినొకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళూ ఎర్రగా నిప్పు కణికలలా ఉన్నాయి. కళ్ళద్దాలు తీయగానే కళ్ళ నుంచి జలజలా నీరుకారి మసకగా అయిపోయాయి.

"ఏ చూపులు కలవటమో, అసలు చూడటమే కష్టమైపోతోంది. సన్నాయి వాళ్ళూ! 'చూపులు కలసిన శుభవేళా' అని కాదయ్యా, 'చూపులు కలవని శుభవేళా...' అని వాయించండి." అని గొణిగాడు పెళ్ళికొడుకు!

***

**(8-5-2015 - గోతెలుగు. కాం వెబ్ మాగ్జిన్)**

# 8. అహో లక్ష్మణా!!!

"వదినగారూ మీకు పిండి రుబ్బటం వచ్చా?" అడిగాడు ఆనంద్.

గులాబ్ జామూన్ నోట్లో పెట్టుకోబోతున్న స్పూన్ అలాగే పట్టుకొని, "వచ్చండి. ఎందుకు అడుగుతున్నారు?" ప్రశ్నించింది సుమతి.

"మరేమీ లేదు. నా పర్స్ లో డబ్బులు పెట్టుకోవటం మర్చిపోయినట్లున్నాను." ఖాళీ పర్స్ చూపిస్తూ బిడియంగా అన్నాడు ఆనంద్.

"అయ్యో, ఇప్పుడెలా?" కంగారు పడింది సుమతి.

"ఏముంది, హోటల్ వాడికి చెప్పి పప్పురుబ్బటమే. నాకైతే రుబ్బటం రాదు. మీరు రుబ్బుతుంటే కావాలంటే పక్కనుంచి తోయగలను. ముందే చూసుకోవాల్సింది. ఉందనుకున్నాను. సారీ!" దీనంగా అన్నాడు ఆనంద్.

"ఉండండి నా దగ్గర ఉన్నాయేమో చూస్తాను." అని తన పుస్తకాల బాగ్‌లో నుంచి పుస్తకాలన్నీ తిరగేసింది. అక్కడక్కడ చిల్లరతో ఐదురూపాయలు దొరికాయి. "అమ్మయ్య! ఐదురూపాయిలు దొరికాయి. బిల్ పే చేసేయండి." నిట్టూరుస్తూ ఆ డబ్బు ఆనంద్‌కు ఇచ్చింది సుమతి.

ఇద్దరూ హోటల్ బయటకు వచ్చి బస్టాండ్ వైపు నడిచారు.

"సారీ... సారీ... వదినగారూ. మీరు చాలా నీరసంగా ఉంటే భోజనం చేద్దామని పిలిచాను. ఆ తొందరలో పర్స్ లో డబ్బులున్నాయో లేవో చూసుకోలేదు. ఇప్పుడు బస్‌లో ఏం వెళుతారు? రండి నా స్కూటర్ మీద దింపేస్తాను."

"వద్దు లెండి. మధ్యలో పెట్రోలైపోతే, స్కూటర్ నాతో తోయిస్తారు." నవ్వుతూ అంది సుమతి.

"అయ్యో లేదండి. పోనీలెండి బస్ టికెట్‌కు డబ్బులు ఉన్నాయా?" అడిగాడు ఆనంద్.

ఉన్నవన్నీ ఊడ్చి హోటల్‌లో ఇచ్చేసింది. ఏం చెప్పాలో తెలీలేదు సుమతికి.

"ఒక్క నినిమషం" అని పక్కకు వెళ్ళి, అక్కడున్న స్నేహితుడినడిగి, ఒక్క రూపాయి తెచ్చి ఇచ్చాడు. ఆనంద్.

'అమ్మయ్య' అనుకొని ఆనంద్‌కు 'బై' చెప్పి అప్పుడే వచ్చిన బస్ ఎక్కింది సుమతి.

లోపలికి వచ్చిన సుమతితో, "సుమా, అన్నం తిందువుగాని రా" పిలిచింది సరస్వతి.

"వద్దమ్మా, నేను మా లక్ష్మణస్వామితో తిన్నాను." జవాబిచ్చింది సుమతి.

"లక్ష్మణస్వామా? అతనెవరు?" కొంత గాభరాగా అడిగింది.

"అబ్బ అంత కంగారెందుకమ్మా! నా కాబోయే మరిదిగారు ఆనంద్."

"అతనెక్కడ కలిసాడు?" ఆశ్చర్యంగా అడిగింది సరస్వతి.

"వాళ్ళ కాలేజీ మా కాలేజీ పక్కనే కదా, అప్పుడప్పుడు బస్టాప్‌లో కలుస్తుంటాడు. ఈ రోజు లాబ్ లో కాస్త పనెక్కువై, బాగా ఆకలేసి

నీరసం వచ్చింది. నీరసంగా బస్టాప్‌లో బస్ కోసం వెయిట్ చేస్తూ ఉంటే వచ్చాడు. నాకు నీరసంగా వుందని పక్కనున్న హోటల్‌కు తీసుకెళ్ళాడు. ఇద్దరం లంచ్ చేసాము. చాలా, ఇంకా వివరంగా చెప్పాలా?" విసుగ్గా అంది సుమతి.

"ఊ. బాగానే ఉంది... కాని ఆ అబ్బాయి తోనైనా పెళ్ళికి ముందు అంతగా కలవకు. బాగుండదు" అంటూ ఇంకా ఏమో చెప్పబోయింది సరస్వతి.

"అబ్బా సోది ఆపమ్మా!" అంటూ సుమతి వినిపించుకోకుండా లోపలికి వెళ్ళిపోయింది.

నలభై సంవత్సరాల తర్వాత హోటల్లో డిన్నర్ తింటూ గులాబ్ జామూన్ నోట్లో పెట్టుకోబోతున్న సుమతికి తన పెళ్ళి కాకముందు మరిది తనని జోక్ చేసిన విషయం గుర్తొచ్చి నవ్వుకుంది.

"ఏమిటక్కా, మీలో మీరే నవ్వుకుంటున్నారు?"

అరుణ ప్రశ్నతో ఉలిక్కిపడి ఆలోచనల నుంచి తేరుకొని, "నలభై ఏళ్ళ క్రితం మీ ఆయన చేసిన నిర్వాకం గుర్తొచ్చి" నవ్వింది సుమతి.

"ఏమిచేసారు?" ఆసక్తి గా ప్రశ్నించింది అరుణ.

ఆ రోజు సంగతి చెప్పి, "అమ్మో అమ్మో! నా దగ్గర ఎలాగో డబ్బులు వుండబట్టి కాని, లేకపోతేనా నాతో పప్పు రుబ్బించేవాడు." అంది సుమతి.

"మీరు మరీనూ వదినగారు, మీరు రుబ్బుతుంటే నేను పక్క నుంచి తోస్తానని చెప్పాను కదా" అమాయకంగా అన్నాడు ఆనంద్,

"నీ మొహం! వాడి దగ్గర డబ్బులు లేకపోవటమేమిటి? నాదగ్గర, నాన్న దగ్గర తెలీకుండా ఒకళ్ళకి తెలీకుండా మరొకళ్ల దగ్గర పడుతుండేవాడు. ఏరా ఆనంద్, నిజం చెప్పు ఆ రోజు నీ దగ్గర డబ్బులు లేవా?" దబాయించాడు అర్జున్.

"అన్నయ్యా, ఏదో కాబోయే వదినగారు కదా అని కాస్త జోక్ చేసాను అంతే." నవ్వాడు ఆనంద్.

"హమ్మో! ఎంత ఖతర్నాక్! మీ పుట్టినరోజని పార్టీ ఇస్తానని ఈ ఫైవ్ స్టార్ హోటల్‌కు తీసుకొచ్చారు. ఈ రోజైనా మీరు బిల్ కడతారా? నాతో కట్టిస్తారా?" ఉక్రోషంగా అడిగింది సుమతి.

"ఇన్నేళ్ళైనా వదినగారికి ఉక్రోషం తగ్గలేదు." నవ్వుతూ వెయిటర్ తెచ్చిన బిల్ తీసుకుంటూ వదినగారిని ఉడికించాడు ఆనంద్.

"పదమ్మా అరుణా, మనం పోదాం. ఈ వదినా మరిదీ బిల్ కడతారో పప్పు రుబ్బుతారో !" లేచాడు అర్జున్.

***

**(జూన్ 21 - 2015 - గోQతెలుగు.కాం వెబ్ మాగ్జిన్)**

# 9. మనసు తెలిసిన చందురూడా...

చేతిలోని నవలను మూసి టైం చూసుకుంది వర్ష. ఎనిమిదిన్నర కావస్తోంది. 'ఇంకో అరగంటలో వూరు చేరుతాము. ఆఫీస్ మానే అవసరం లేదు, వెళ్ళిపోవచ్చు' అనుకుంటూ ఎదురు సీట్ వైపు చూసింది. ఎదురు సీట్‌లో ఉన్న అతను లాప్‌టాప్‌లో పని చేసుకుంటున్నాడు. 'ఎక్కినప్పటి నుంచీ లాప్‌టాప్‌లో తల దూర్చే వున్నాడు మహానుభావుడు' అనుకొంది. ఇంతలో సెల్ రింగైంది. అమ్మ. "ఊ, చెప్పు!" అంది.

"వర్షా, నేను చెప్పిన సంగతి మర్చిపోకు. ఈ సంవత్సరం ఎట్లాగైనా నీ పెళ్ళి..."

"అబ్బా! అమ్మా... నేను అక్కడికి వచ్చినప్పటి నుంచి, ఆరు గంటల క్రితం వరకూ చెబుతూనే వున్నావు. నేనూ 'ఇప్పట్లో పెళ్ళి చేసుకోను, ఇంకో రెండేళ్ళు నన్ను జాబ్ చేసుకోనీయండి' అని చెబుతూనే ఉన్నాను. ఇంకా ఈ టాపిక్ ఆపేయి!" విసుగ్గా అంటూ కాల్ కట్‌చేసి సెల్ పక్కన పడేసింది.

ఎదురు సీటబ్బాయి తలెత్తి చూసి, వెంటనే లాప్‌టాప్‌లోకి తల వంచేసాడు. "ఛీ! ముందూ వెనుకా చూసుకోకుండా గట్టిగా మాట్లాడినట్లున్నాను. అంతా అమ్మ మూలంగానే... ఎప్పుడూ ఒకటే గోల." అని తనమీద తానే చిరాకు పడిపోయింది.

రైలు ఆగింది. బాగ్ తీసుకొని హడావుడిగా ముందుకు కదిలింది. "ఏమండీ!" పిలుపు విని వెనకకు తిరిగింది. ఎదురు సీట్ అబ్బాయి. ఇప్పటి వరకూ మంచివాడిలా ఫోజ్ కొట్టాడు, ఇప్పుడేమో వెంటబడ్డాడు అనుకుంటూ, "ఏమిటి?" అంది చిరాగ్గా!

"ఇది మీ సెల్లా?"

'ఓ... అమ్మతో మాట్లాడి విసుగ్గా పక్కనపడేసి, మర్చిపోయింది!' అనుకొని, "థాంక్స్ అండీ!" అని సెల్ తీసుకొని వడివడిగా ముందుకు కదిలింది.

త్వరత్వరగా తయారయ్యి బ్రేక్‌ఫాస్ట్ కోసం వెళ్ళింది. నీళ్ళు కారుకుంటూ వున్న ఉప్మాను చూడగానే నీరుకారిపోయింది. ఇహ లాభం లేదు, ఈ హాస్టల్‌లో వుండి, ఈ పిచ్చి తిండి తింటూ బతకటం కష్టం, ఏదైనా రూమో, చిన్న ఇల్లో చూసుకోవాలి తప్పదు అనుకొంది. లంచ్ బ్రేక్‌లో స్నేహితురాలు అర్పితతో తన సమస్య చెప్పుకుంది.

"మా ఇంట్లో మేడమీద ఓ గది వుంది. ఓ అబ్బాయి వుండేవాడు. ఈ మధ్యే పెళ్ళి చేసుకొని, వేరే ఇల్లు చూసుకొని మారిపోయాడు. నీకేమైనా నచ్చుతుందేమో చూడు. కాకపోతే ఒకటే గది. అందులోనే వంట చేసుకోవాలి." అంది అర్పిత.

"ఫరవాలేదు, సర్దుకుంటాను. సరిపోకపోతే అప్పుడు చూసుకుందాము. మరి మీకేమీ ఇబ్బంది కాదా?" అడిగింది వర్ష.

"మాకేమి ఇబ్బంది? పైగా ఇద్దరమూ కలిసి ఎంచక్కా ఎంజాయ్ చేయొచ్చు." అంది అర్పిత.

సాయంకాలం అర్పితతో కలిసి, వాళ్ళ ఇంటికి వెళ్ళింది. గది నచ్చింది. అర్పిత అమ్మ సుభద్ర గారు చాలా ఆప్యాయంగా మాట్లాడారు. నిశ్చింతగా ఉండొచ్చు అనుకొని, "ఈ వీకెండ్ వచ్చేస్తాను" అని చెప్పింది.

డ్రాయింగ్ రూములో కూర్చొని ఇద్దరూ కాఫీ తాగుతూ కబుర్లు

చెప్పుకుంటూ ఉండగా ఓ అబ్బాయి వచ్చాడు. పొద్దున రైల్లో తన ఎదురుగా కూర్చున్న అబ్బాయి. 'ఇదేమిటి ఇక్కడకు వచ్చాడు?' గాభరా పడిపోయింది వర్ష.

"మా అన్నయ్య అర్ణవ్. అన్నయ్యా నా కొలీగ్, ఫ్రెండ్ వర్ష. ఇక ముందు మన మేడ మీద గదిలో ఉండబోతోంది." అని ఒకరినొకరికి పరిచయం చేసింది అర్పిత.

"పొద్దున రైల్లో చూసాను మీ ఫ్రెండ్‌ను. కలిసి ప్రయాణం చేసాము." నవ్వుతూ చెప్పాడు అర్ణవ్.

"అవును... నా సెల్ మర్చిపోతే తెచ్చి ఇచ్చారు." అంది వర్ష.

***

అనుకున్నట్లుగానే ఆ వీకెండ్ అర్పిత వాళ్ళ ఇంటికి షిఫ్ట్ అయ్యింది. పెద్ద గది, విశాలమైన టెరస్, ఉయ్యాల, వరుసగా అందంగా పేర్చిన పూల కుండీలు... చాలా నచ్చేసింది.

"రాగానే వంట పెట్టుకోవద్దు ఈ పూటకు మాఇంట్లో తినేసేయ్!" అని పిలిచారు సుభద్ర గారు. భోజనాల దగ్గర అర్పిత నాన్నగారు ప్రభాకర్‌గారు పరిచయమయ్యారు. అభిమానంగా కొసరి కొసరి మరీ వడ్డించారు సుభద్రగారు. "అసలు నువ్వు విడిగా వండుకోవటమెందుకమ్మా? మా ఇంట్లోనే తిను" అన్నారు ప్రభాకర్‌గారు. ఎంత వారు అభిమానంగా పిలిచినా బాగుండదనుకొని సున్నితంగా వారించింది. ఆ ఇల్లు, ఆ ఇంట్లోని వారి అభిమానం చాలా నచ్చాయి. వెంటనే అమ్మకు కాల్ చేసి చెప్పింది. ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయింది.

ఉదయమే లేచి, తల స్నానం చేసి, తల తుడుచుకుంటూ టెరస్‌లోకి

వచ్చింది. పిట్ట గోడ దగ్గర నిలబడి యథాలాపంగా కిందికి చూసింది. పైపుతో మొక్కలకు నీళ్ళు పడుతూ అర్ణవ్ కనిపించాడు. ఇంకా స్నానం చేయనట్లున్నాడు. నైట్‌డ్రెస్ తెల్ల పైజామా, కుర్తాలో వున్నాడు. జుట్టు కొద్దిగా చెదిరి మొహం మీద పడుతోంది. ఎందుకో తలపైకెత్తి చూసాడు. అక్కడ వర్ష కనిపించగానే, 'గుడ్‌మార్నింగ్!' అని చిన్నగా నవ్వాడు. ఒక్కసారిగా గుండె ఝల్లుమంది వర్షకు.

జాగింగ్ చేసి వస్తూ, వరండాలో కూర్చొని వున్న అర్పిత, వర్షలను చూసి, "ఏమిటీ, పొద్దున్నే ఇద్దరూ అలా కూర్చున్నారు?" అని అడిగాడు అర్ణవ్.

"చిన్న ప్రాబ్లం అన్నా..." అంది అర్పిత.

"ఏమిటో నేను తెలుసుకోవచ్చా?" అడిగాడు అర్ణవ్.

వర్ష వైపు చూసింది అర్పిత. చెప్పమన్నట్లు తల ఊపింది వర్ష.

"నిన్న సాయంకాలం నుంచీ ఎవరో ఒకటే కాల్ చేసి వర్షను విసిగిస్తున్నారు అన్నయ్యా"

"ఏమని?" ప్రశ్నించాడు అర్ణవ్.

"హలో అనగానే, 'ఈ ఫోన్‌నుంచి కాల్ వచ్చింది, మీరేనా చేసింది?' అంటాడు, కాదంటే వినడు. రాత్రంతా చేస్తునే ఉన్నాడు. సెల్ ఆఫ్ చేద్దామంటే వాళ్ళ అమ్మ కాల్ చేస్తారేమో తీయకపోతే కంగారు పడతారని ఆఫ్ చేయలేదు. సైలెంట్ మోడ్‌లో వుంచింది. ఐనా న్యూసెన్సే కదా." అని వివరణ ఇచ్చింది అర్పిత.

"అయినా దీనికింత ఆలోచన ఎందుకు? ఆ నెంబర్‌ను బ్లాక్

చేయొచ్చుకదా?” అన్నాడు అర్ణవ్.

ఇద్దరూ మొహాలు చూసుకొని, ఓహ్ అని తల మీద చిన్నగా తట్టుకున్నారు. “అదేమిటో... బుర్ర పని చేయలేదు అన్నయ్యా!” అంది అర్పిత.

“మీ సెల్ ఎవరికైనా కాల్ చేసుకోవటానికి ఇచ్చారా?” వర్షను అడిగాడు అర్ణవ్.

“నిన్న సాయంకాలం, ‘నా సెల్‌లో కార్డ్ ఐపోయింది. మా నాన్నకు కాల్ చేసుకొని ఇస్తాను’ అంటే రాముకు ఇచ్చాను. నేను చెక్ చేసాను, వాళ్ళ నాన్నకు చేసిన కాల్ ఒక్కటే వుంది.”అన్నది వర్ష.

అప్పుడే రింగైంది వర్ష సెల్. “వాడే” అన్నది వర్ష.

“ఇటివ్వండి నేను చూస్తాను.” అని సెల్ తీసుకొని ఆన్‌చేసి, “హలో!” అన్నాడు.

“నిన్న ఈ నంబర్‌నుంచి మాకు కాల్ వచ్చింది. మీరేనా చేసింది.?” అని అడిగాడు అవతలి వ్యక్తి.

“మేము కాదు. అసలేమిటి మీ ప్రాబ్లం?” అడిగాడు అర్ణవ్.

“కొద్దికాలంగా మా చెల్లెలి సెల్‌కు కాల్ వస్తోంది. నంబర్‌లు మార్చి మార్చి చేసి విసిగిస్తున్నాడు. నిన్న సాయంకాలం ఆరు గంటలకు ఈ నంబర్‌నుండే చేసాడు. ఈసారి ఎట్లాగైనా వాడిని పట్టుకోవాలని చూస్తున్నాను.”

“ఈ నంబర్‌నుంచి ఎవరూ చేయలేదు. అయినా మీరంటున్నారు కాబట్టి కనుక్కుంటాను.” అని పెట్టేసాడు.

అక్కడే ఏదో సర్దుతున్నట్లుగా, అటూ ఇటూ తిరుగుతున్న పనబ్బాయి రామూని పిలిచాడు.

"ఈ కాల్ ఎవరు చేసారురా నిజం చెప్పు?" అని గద్దించాడు.

"నేనే చేసాను సారు" తల వంచుకొని వణుకుతూ చెప్పాడు.

"మరి ఆ కాల్ లేదే?" ఆశ్చర్యంగా అడిగింది వర్ష.

"ఏముంది డిలీట్ చేసి వుంటాడు. పదరా పోలీస్ స్టేషన్‌కు." దబాయించాడు అర్ణవ్.

"సారీ సార్. నేనూ, ఆ అమ్మాయి ప్రేమించుకుంటున్నాము. నా నంబర్‌నుంచి చేస్తే వాళ్ళ వాళ్ళకు తెలుస్తుందని వేరే వేరే సెల్‌ల నుంచి చేస్తున్నాను. నిన్న వాళ్ళ అన్నయ్య చూసేసరికి నేను సతాయిస్తున్నానని అబద్ధం చెప్పింది. సారీ మేడం." ఏడుస్తూ చెప్పాడు రాము.

"ఓరినీ... అప్పుడే ప్రేమేమిటిరా నీకు?" విస్తుపోయింది అర్పిత.

"వీడి సంగతి నేను చూసుకుంటాను. యు రిలాక్స్." అని రాముని తీసుకొని వెళ్ళిపోయాడు అర్ణవ్.

***

ఆ సంఘటన తరువాత అర్ణవ్, వర్షలలో స్నేహం పెరిగింది. మాటలు కలిసాయి. అపై మనసులు కలిసేందుకు ఎక్కువ రోజులు పట్టలేదు! ఇరువైపుల పెద్దలకూ అభ్యంతరం లేకపోయింది.

అర్ణవ్ కోరిక ప్రకారం దగ్గర బంధువులు, స్నేహితుల మధ్య, క్లుప్తంగా శాస్త్రీయంగా వివాహం జరిగింది. ఇంకా రెండు సంవత్సరాలు

జాబ్ చేస్తూ ఎంజాయ్ చేయాలి అనుకున్న సంగతి మర్చేపోయింది వర్ష!

సూట్‌కేసు సర్దుకోవటములో వర్షకు సహాయము చేస్తూ, "భలేదానివే! టెనెంట్‌గా వచ్చి ఓనర్‌వి అయిపోయావు" అని వర్షను వేళాకోళం ఆడుతూ, అక్కడే ఉన్న తల్లితో, "ఇదేమిటమ్మా, అన్నయ్య మరీ ఇంత సింపుల్‌గా పెళ్ళి చేసేసుకున్నాడు? అన్నయ్య పెళ్ళంటే ఎంత సందడి ఉండాలి? అస్సలు హడావుడి లేదు, సరదాలు లేవు. కనీసం ఫస్ట్‌నైట్ అన్నా బోలెడు గొడవ చేద్దామనుకున్నాను. అదీ లేకుండా ఊరి ప్రయాణం పెట్టుకున్నారు. మల్లెల పందిరి మంచం లేదు, తెల్లచీర లేదు. అయినా నువ్వేమిటే మరీ అంత బుద్ధిగా అన్నయ్య చెప్పినట్లు వినేసావు? నువ్వెక్కడో పిచ్చిమాలోకానివి." కినుకగా అంది అర్పిత.

కూతురి మాటలు నవ్వుతూ వింటూ కోడలివైపు చూసింది సుభద్ర. వర్ష ముఖంలో కూడా కొద్దిగా అసంతృప్తి కనిపించింది.

"అంటే వీడియో సుబ్బారావు కోసం పెళ్ళి చేసుకోలేదంటావు" నవ్వుతూ అంది సుభద్ర.

ఇద్దరూ ఫక్కున నవ్వుతూ సుభద్ర వైపు చూసారు.

"అయినా పెళ్ళంటే నీ ఉద్దేశం ఏమిటి వర్షా?" అడిగింది సుభద్ర.

ఒక్క నిమిషం ఆలోచించి, "పెళ్ళంటే ఇరుజీవితాల కలయిక, ఇరు హృదయాల కలయిక. జీవితాంతము ఒకరి కొకరు తోడు, నీడ" పరవశంగా చెప్పింది వర్ష.

"ఇరు జీవితాలే కాదు, ఇరు కుటుంబాల కలయిక కూడా! పెళ్ళి ఆర్భాటంగా చేసుకున్నామా, క్లుప్తంగా చేసుకున్నామా అన్నది ముఖ్యము కాదు. వివాహములో జరిపించే తంతులలోని పరమార్థం గ్రహించాలి,

అర్థం చేసుకోవాలి. జీలకర్ర, బెల్లం ఒకరి శిరస్సు మీద మరొకరిని ఉంచి, ఒకరినొకరు చూసుకోమంటారు. మనకు కనిపించకుండా వున్న, కనుబొమల మధ్య ఉన్న రంధ్రం ద్వారా, శిరస్సు మీద వున్న బ్రహ్మరంధ్రములోకి ఒకరి నుంచి ఒకరికి ఆకర్శణ శక్తి ప్రవేశిస్తుంది. ఆ బ్రహ్మరంధ్రాన్ని  తెరిపించే శక్తి జీలకర్ర, బెల్లం మిశ్రమానికి ఉంది. అందుకే ఒకరి శిరస్సుమీద ఒకరు ఉంచే సాంప్రదాయము ఏర్పాటు అయ్యింది. అలా ఒకరినొకరు చూసుకుని, ఆకర్షణ శక్తిని ప్రసరించుకోవటమే సుముహూర్తము.

'ధర్మార్థకామములలో ఏనాడూ ఈమె తోడు విడిచి పోరాదు. నిండునూరేళ్ళు ఈమెకు నీడవై నిలిచి కాపాడు' అని నాతి చరామిలో వరునితో చెప్పిస్తారు.

నా జీవితానికి ఆధారమైన ఈ సూత్రాన్ని నీ మెడలో ముడి వేస్తున్నాను, నీ మెడలో నున్న ఈ సూత్రము నా శాంతిసౌఖ్యములకు సందేశము, క్షేమము అని 'మాంగల్య తంతునానేన మంత్రము, మంగళసూత్రము' లోని అర్థము.

ఇలా ప్రతి దానిలోని అర్థమును గ్రహించుకొని మసులుకోవాలి. ఆలుమగలుగా స్త్రీ, పురుషుల అనుబంధం మిగిలిన అన్ని బంధాలకంటే ప్రత్యేకమైనది. ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవలసి వస్తుంది. ప్రేమలో పడటం తేలికే. ప్రేమలో నిలబడటం కష్టం. ప్రేమను నిలుపుకోవటము కష్టం. అందుచేత పరిస్థితులు తారుమారైనప్పుడు మీకు మీరుగా సరిదిద్దటానికి గట్టిప్రయత్నం చేయాలి. మంచి అనుబంధంలో పట్టువిడుపులు, నిజాయితీ, మనసు పెట్టి పని చేయటం, నమ్మకం ముఖ్యమైన విషయాలు. ఇద్దరూ కలిసి మెలిసి పని చేసుకున్నప్పుడే మంచి అనుబంధం ఏర్పడుతుంది. అన్ని గొడవలకూ కారణం అహం.

ఆ అహాన్ని వదిలేయాలి. పట్టువిడుపులు వుండాలి. అప్పుడే ఒకరికి ఒకరు తోడునీడగా, బాసటగా నిలుస్తారు. తాము ఒంటరివారము కామని, తనకోసం తోడు ఒకరున్నారని ఆనందం పొందుతారు." అని ముగించింది సుభద్ర.

"మీ మాటలను ఎప్పుడూ గుర్తుంచుకుంటాను అత్తయ్యా" అంటూ సుభద్ర కాళ్ళకు నమస్కరించింది వర్ష.

"దిగులు పడకు అర్పితా, నీ ముచ్చట కూడా తీర్చుకుందువులే." నవ్వుతూ అంది సుభద్ర.

అందరూ రాత్రి తొమ్మిది గంటలకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. "రాత్రి పూట ఇబ్బంది పడుతూ మీరంతా ఎందుకమ్మా మేమన్నా విదేశాలకు వెళుతున్నామా? వారం రోజులలో వచ్చేస్తాముగా!" అని అర్ణవ్ అన్నా సుభద్ర వినిపించుకోలేదు. సామానులు బోగీలో పెట్టించేందుకు వెళుతున్న అర్ణవ్ ను ఆపి, "నువ్వు అమ్మనాన్నలతో మాట్లాడు అన్నయ్యా. నేను పెట్టిస్తా" అని అర్ణవ్ తో అని సామాను లోపలికి తీసుకెళ్ళింది అర్పిత. కొద్దిసేపు తరువాత కిందికి దిగింది అర్పిత.

స్టేషన్‌కి వచ్చిన అమ్మా నాన్నలతో మాట్లాడుతున్న వర్ష, "ఇంత సేపు ఏమి చేసావు?" అడిగింది వర్ష.

"అమ్మ ఓ పని చెప్పిందిలే, అది చేసివస్తున్నాను" అని కన్ను కొడుతూ చిలిపిగా అంది అర్పిత.

ఆశ్చర్యంగా చూసింది వర్ష!

రైలు బయలుదేరబోతోందని విని, అర్ణవ్, వర్ష రైలెక్కారు. ఇద్దరూ

తలుపు దగ్గర నిలబడి అందరికీ చేతులూపారు. అర్ణవ్ తలుపు దగ్గరే ఉండగా, వర్ష కూపే దగ్గరకు నడిచింది. కూపే తలుపు దగ్గర నిలబడి లోపలికి చూడగానే, "వావ్..... బ్యూటీఫుల్" అన్న మాటలు వర్ష నోటి నుంచి అప్రయత్నంగా వచ్చాయి.

కూపేలో లైట్లు తీసేసారు. చుట్టూ ఐదు కాండిల్స్, మధ్యలో అగరొత్తులు వెలిగించే ఏర్పాటు వున్న ఇత్తడి కాండిల్ స్టాండ్‌లో, ఐదు కొవ్వొత్తులూ, మధ్యలో అగరొత్తులూ వెలిగించి వున్నాయి. స్టాండ్‌కు పాలిష్ చేసినట్లున్నారు బంగారంలా మెరిసిపోతోంది. పక్కకున్న బెర్త్‌కు పై బెర్త్‌నుంచి మల్లెపూల దండలు అందంగా అలంకరించారు. కిటికీకి, తలుపుకు కూడా అందంగా మల్లె దండలు చుట్టి ఉన్నాయి. కొవ్వొత్తుల వెలుగు, ప్లాట్‌ఫామ్‌మీద నుంచి వస్తున్న దీపాల వెలుగులలో, అగరొత్తులు, మల్లెల సువాసనలతో కూపే అద్భుతంగా ఉంది.

వర్ష ముందుకు అడుగు వేయలేక, తడబడిపోయింది. ఈ రైలు, తమను కొత్త బంగారు లోకములోకి తీసుకెళుతున్న పూలరథంలా అనిపించి, బుగ్గల్లోకి వెచ్చని ఆవిరి వచ్చి, చీర మీది గులాబులతో పోటీ పడింది. "అమ్మ చెప్పిన చిన్న పని చేసి వస్తున్నాను" అన్నది అర్పిత. 'ఇదా అత్తయ్య చెప్పింది' అనుకొన్నది వర్ష. ఎంతబాగా చేసింది! మనసంతా సంతోషముతో నిండిపోయింది. చెప్పలేని భావాలు ఉక్కిరిబిక్కిరి చేసాయి. మనసంతా చెప్పలేని మధురభావాలతో నిండిపోయింది. అలా ఓ విధమైన ట్రాన్స్ లో నిలబడి ఉన్న వర్ష భుజం మీద చేయి పడటంతో ఉలిక్కి పడింది.

కూపే లోపలకు చూసి, "ఫెంటాస్టిక్" అన్నాడు అర్ణవ్. రైలు ప్లాట్‌ఫామ్‌ను వదిలింది. బయట నుంచి వస్తున్న గాలికి సన్నగా కదలసాగాయి కొవ్వొత్తుల జ్యోతులు. కిటికీలోనుంచి సన్నగా చంద్రుని

కిరణాలు పడసాగాయి. రైలు లయబద్ధంగా నడవసాగింది. కిటికీలో నుంచి వీస్తున్న గాలికి కొవ్వొత్తులు ఒకటొకటిగా ఆరిపోయాయి. బయట నుంచి అప్పుడప్పుడు దీపాల వెలుగు వస్తోంది. కూపే చీకటి వెలుగుల సమ్మేళనములో అద్భుతంగా ఉంది. కిటికీలో నుంచి మబ్బులతో దోబూచులాడుతూ మసక మసకగా వున్న చందురుని చూసి, 'మనసు తెలిసిన చందురుడా మసక వెలుగే చాలులేరా!' అని చిన్నగా కూనిరాగం తీసింది వర్ష.

***

**(వివాహబంధం యొక్క గొప్పతనాన్ని తెలియజేసే కథ-**
**16-6-2015 - మాలిక వెబ్ మాగ్జిన్)**

# 10. రాధామాధవీయం

లైట్ బ్లూ కలర్ ఫుల్ హాండ్ షర్ట్, డార్క్ బ్రౌన్ కలర్ పాంట్‌లో పచ్చటి రంగులో, ఆరడుగుల ఎత్తుతో అందంగా వున్నాడు మాధవ్. షర్ట్ని పాంట్ లోపలికి దోపి, సరిచేసుకొని, బెల్ట్ పెట్టాడు. షర్ట్ చేతి బటన్స్ పెట్టుకుంటూ, "తాతయ్యా నేను రెడీ!" అని ఓ కేకేసాడు.

లోపల గదిలో పల్లవి తయారవుతూ, "తాతయ్యా నేనింకా రెడీ కాలేదు, ఐదు నిమిషాలు... వచ్చేస్తున్నా!" అంది. మంచం మీద పడుకొని పల్లవిని గమనిస్తోంది రాధ. మాధవ్ అంత పచ్చగా కాకపోయినా తెల్లగా, ఐదడుగుల నాలుగంగుళాలతో, సన్నగా, కోమలంగావుంది, ఆకుపచ్చకు ఎర్ర అంచున్న పట్టులంగా, ఆకుపచ్చ జాకెట్, ఎర్రవోణీ వేసుకుంది. జడ చక్కగా లావుగా, పొడుగ్గా వుంది. నుదుటన దోసగింజ ఆకారంలో బొట్టు దిద్దుకొని, 'కాటుక పెట్టుకోనా, వద్దా?' అని ఆలోచిస్తోంది. రాధవైపు చూసి, "రాధీ కాటుక పెట్టుకోనా? మరీ ఓవర్‌గావుంటుందా?" అని అడిగింది.

ఆ ప్రశ్న పట్టించుకోకుండా, "అమ్మలూ, మీరంతా ఎక్కడి కెళుతున్నారే?" అని ప్రశ్నించింది రాధ. "అదేమిటే తెలీనట్లు అడుగుతున్నావు? అన్నయ్య పెళ్ళి చూపులకు వెళుతున్నాము కదా" అంది పల్లవి. పల్లవి వైపు సాలోచనగాచూసింది రాధ. ఇంతలో బయట నుంచి రమాదేవి, "అమ్మలూ, ఇంకా కాలేదా? తాతయ్య తొందర పడుతున్నారు" అని పిలిచింది. "ఒక్కనిమిషం వస్తున్నానమ్మా," అంది పల్లవి. ఏదో నిశ్చయానికి వచ్చినట్లు లేచి, ముందు గదిలోకి వచ్చింది రాధ. అక్కడ తాతయ్య రాఘవయ్య గారు, మాధవ్, మామయ్య విష్ణుమూర్తి, అత్తయ్య రమాదేవి తయారై, పల్లవి కోసం ఎదురుచూస్తున్నారు.

రాధ చరచరా మాధవ్ ముందుకు వెళ్ళి, "బావా, నేనెట్లా వున్నాను?"

అని అడిగింది. ఒక్క క్షణం మాధవ్ తడబడి, రాధ వైపు చూసాడు. మంచి రంగు, ఐదడుగుల ఆరంగుళాలు, పెద్ద జడతో, ఎరుపుమీద పసుపు చుక్కలున్న లంగా జాకెట్ మీద పసుపు రంగు వోణీతో అందంగా వుంది రాధ. వచ్చీరాని నవ్వుతో, "చాలా అందంగా ఉన్నావు" అన్నాడు. ఇక ఆపుకోలేనట్లు ముందుకు వెళ్ళి మాధవ్ కాలర్ పట్టుకొని, "మరైతే ఎందుకు ఇంకో అమ్మాయిని చూడటానికి వెళుతున్నావు? నీకు నేను పనికి రాలేదా?" అని అడిగింది.

అనుకోని ఈ పరిణామానికి అక్కడ వున్న అందరూ ఉలిక్కి పడి రాధ వైపు ఆశ్చర్యంగా చూసారు. మాధవ్ నిశ్చేష్టుడైనాడు. మాధవ్‌ను వదిలేసి, అక్కడే వున్న సోఫాలో కూర్చొని రెండు చేతులతో ముఖం కప్పుకొని రోదించసాగింది రాధ. ఎవరికీ ఏమి మాట్లాడాలో తోచలేదు. లోపలి నుంచి జానకమ్మ, పల్లవి గబగబా బయటకు వచ్చారు. మాధవ్ వెనుదిరిగి తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడు.

జానకమ్మ రాధను పొదివి పట్టుకొని, "ఏమిటమ్మా ఇది?" అని అడిగింది.

"అమ్మమ్మా, తాతయ్యా నన్ను చిన్నప్పటి నుంచి పెంచారు. అయినా మీకు కూడా నేను పనికిరాలేదు కదూ. మామయ్యా 'నా బంగారుతల్లివే' అంటావు ఎప్పుడూ, నీకూ నేను కనిపించలేదు." అంటూ అమ్మమ్మ చేతిని విదిలించుకొని పరిగెత్తుతూ గదిలోకి వెళ్ళితలుపేసుకుంది.

ఏమి చేయాలో, ఉండాలో వెళ్ళిపోవాలో తెలీకుండా నిలబడి ఉన్న మధ్యవర్తితో, "నాకు హఠాత్తుగా బిపీ పెరిగిందని, అందుకని రాలేకపోతున్నామనీ మళ్ళీ ఎప్పుడు వచ్చేది చెపుతామనీ పెళ్ళివాళ్ళకు చెప్పండి." అని చెప్పి అతనిని పంపించివేసాడు రాఘవయ్య.

రాధ వెనకనే పల్లవి పరిగెత్తుతూ వెళ్ళింది. అప్పటికే రాధ తలుపేసేసింది. "రాధీ! తలుపు తీయి" అని తలుపు కొట్టసాగింది పల్లవి. రాధ పలకలేదు. తలుపు తీయలేదు. ఏమి అఘాయిత్యం చేసుకుంటుందోనని అంతా హడలిపోయారు. "తలుపు తీయి బుజ్జీ, నీతో నేనుమాట్లాడాలి" అని బతిమిలాడాడు రాఘవయ్య. ఇంతలో విష్ణుమూర్తి వెళ్ళి మాధవ్ తలుపు తట్టాడు. "నాన్నా, నన్ను కాసేపు వదిలేయి"అన్నాడు మాధవ్. చాలాసేపు బతిమిలాడాక తలుపు తీసింది రాధ. కాని ఎవరికీ మాట్లాడే అవకాశం ఇవ్వక, కళ్ళకు అడ్డంగా చేతులుపెట్టుకొని పడుకుంది. ఆ రాత్రి అందరికీ భారంగా గడిచింది.

పొద్దున్నే రాఘవయ్య, రాధతో "నువ్వు ఈ రోజు నారాయణ తాతయ్య ఇంట్లో వుండు. సాయంకాలం నేను వచ్చి మాట్లాడుతాను." అన్నాడు. 'తను చెప్పేది చెప్పింది. ఇంక నిర్ణయం ఏమి తీసుకోవాలో వాళ్ళు చూసుకుంటారు' అనుకొని దిగులుగా, రెండు వీధుల అవతల వున్న నారాయణ తాతయ్య ఇంటికి వెళ్ళింది. అక్కడ తాతయ్య, లీలమ్మ బామ్మా ఏమీ మాట్లాడలేదు. 'బహుశా తాతయ్య వాళ్ళకు చెప్పి ఉంటాడు' అనుకొంది రాధ.

దాదాపు పది గంటలు కావస్తూ ఉండగా, రాధ అమ్మ వైదేహి, నాన్న వెంకటేశ్వరరావు, వరంగల్ నుంచి వచ్చారు. "ఏమైంది బాబాయ్, మామయ్య మమ్మల్ని వెంటనే రమ్మని ఫోన్‌చేసాడు. సాయంకాలం రాధకు పెళ్ళిచూపులని చెప్పాడు" అని నారాయణ మూర్తి ని అడిగాడు శ్రీనివాసరావు.

"ఏమోరా మాకూ తెలీదు. రాధను ఈ రోజు మీ ఇంట్లో ఉండనీయమని పంపాడు. మాకూ పెళ్ళి చూపులనే చెప్పాడు. వివరాలు చెప్పలేదు." అన్నారు నారాయణమూర్తి గారు.

వెంకటేశ్వరరావు, విష్ణుమూర్తి ట్రాన్స్ఫర్‌ల మీద ఊరూరా తిరుగుతూ వుంటారని, రాఘవయ్య, జానకమ్మ కొడుకు పిల్లలు, మాధవ్, పల్లవి, కూతురు పిల్లలు రాధ, శ్రీరాంలను తమదగ్గరే వుంచుకొని చదివిస్తున్నారు. మాధవ్ చదువు పూర్తి చేసుకొని, నాలుగేళ్ళుగా డిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. రాధ, పల్లవి బి.యస్.సి మూడో సంవత్సరం చదువుతున్నారు. శ్రీరాం ఇంటర్ ఫైనల్‌లో వున్నాడు. తల్లితండ్రులు వారం పదిరోజులకోసారి వచ్చి చూసిపోతూవుంటారు. చిన్నప్పటి నుంచీ రాఘవయ్య, జానకమ్మల దగ్గరే పెరగటం వల్ల పిల్లలందరికీ వాళ్ళ దగ్గర చాలా చనువు.

మాధవ్‌కు పెళ్ళిచేయ తలపెట్టారు. పెళ్ళిచూపులకు వెళుతుండగా ఇలా రాధ బయటపడింది. ఎవరికీ ఏమి మాట్లాడాలో తెలీక అంతా నిశ్శబ్దంగా వున్నారు. సాయకాలం, పెళ్ళిచూపులకు పదమని బయలుదేరదీసాడు రాఘవయ్య. అంతా నారాయణరావు గారింటికివచ్చారు. అక్కడ వాళ్ళూ అంతా తయారుగానే వున్నారు. కొద్దిసపయ్యాక ఇక ఆగలేక, “బావా పెళ్ళివాళ్ళు వస్తారని కబురు పెట్టావు, ఎప్పుడొస్తారురా?” అని నారాయణరావు, రాఘవయ్యను అడిగాడు.

“ఏం బావా మేము పెళ్ళివాళ్ళలా కనిపించటము లేదా? నా మనవడు పెళ్ళికొడుకులా లేడా? పెళ్ళికూతురును చూపించరా ?” అని ఎదురు ప్రశ్నించాడు రాఘవయ్య.

అందరూ తెల్లబోయారు. అంతా ఒక్కసారిగా శ్వాస విడిచారు. అప్పటి వరకూ బిక్కమొహముతో కూర్చున్న పల్లవి, లోపలికి పరుగెత్తి, రాధను వెంట బెట్టుకొచ్చింది.

“రాధా, నీకు బావను పెళ్ళిచేసుకోవటం ఇష్టమేనా?” అని అడిగాడు

రాఘవయ్య.

"తాతయ్యా" అంటూ ఒక్క పరుగున వచ్చి తాతయ్య ఒడిలో మొహం దాచుకొని, ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేసింది రాధ. రాధ తలనిమురుతూ, కూతురు, అల్లుడి వైపు చూసి, "మీకిష్టమేనా?" అని అడిగాడు.

"వాళ్ళిద్దరికీ, మీకూ ఇష్టమైతే మాకేమీ అభ్యంతరం లేదు" అన్నాడు వెంకటేశ్వరరావు. అందరూ సంతోషంగా మాట్లాడటం మొదలు పెట్టారు.

అప్పటి వరకూ నిశ్శబ్దంగా వున్న మాధవ్, "దయచేసి అందరూ ఒకసారి నా మాట వినండి. నాకు పెళ్ళి చేద్దామని అనుకోగానే, తాతయ్య, నాన్న రాధను చేసుకోమని అడిగారు. కాని నేనే సంశయించాను. రాధ నచ్చక, ఇష్టం లేక కాదు. ఇప్పటికి నాలుగుతరాలుగా మన ఇంట్లో మేనరికాలే జరుగుతున్నాయి. మేనరికాలైతే పిల్లలు కొన్ని సందర్భాలలో అవలక్షణాలతో పుడతారని అపోహ ఉంది. అదృష్టవశాత్తు మనింట్లో ఇప్పటివరకు పిల్లలెవరూ లోపాలతో పుట్టలేదు. అందుకని మాకు ఆరోగ్యమైన పిల్లలు పుడతారని గ్యారంటీ ఏమీలేదు. అవకరంగా పుట్టిన పిల్లలను భరించే శక్తి నాకు లేదు. నేను ఛాన్స్ తీసుకోను. పిల్లలు కావాలనిపించినప్పుడు ఏ అనాథాశ్రమంనుంచో పిల్లలను తెచ్చుకొని పెంచుకుంటానే కాని కనను. రాధా, అత్తయ్యా, మామయ్యా మీకందరికీ ఇది ఇష్టమైతే, రాధను పెళ్ళిచేసుకోవటం నాకేమీ అభ్యంతరం లేదు. బాగా ఆలోచించుకోండి. అమ్మా, నాన్నా! మీరూ ఆలోచించండి. తాతయ్య కు నేను ఇదే చెప్పాను. మీకూ చెపుతున్నాను." అన్నాడు.

అందరూ నిశ్శబ్దమైపోయారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ వుండిపోయారు. "రాధకు అభ్యంతరం లేకపోతే మాకేమీ అభ్యంతరం లేదు." అన్నాడు వెంకటేశ్వరరావు. వెంటనే, "నాకేమీ అభ్యంతరం లేదు." అనేసింది రాధ.

"అసలు వాళ్ళు మీకిద్దరికే లేని అభ్యంతరం మాకేమి ఉంటుంది? వీలైనంత తొందరగా పెళ్ళి చేసేద్దాము." అన్నాడు నారాయణరావు.

మరునాడే నిశ్చయతాంబూలాలు తీసుకున్నారు. పదిహేను రోజులలోనే ముహూర్తము కుదిరి వైభవంగా పెళ్ళి చేసారు. వాళ్ళ పెళ్ళికి వచ్చిన మాధవ్ స్నేహితుడు ప్రణవ్‌కు పల్లవి నచ్చటముతో, ఇరుపక్షాల వారి అనుమతితో పల్లవి, ప్రణవ్‌ల వివాహం కూడా తొందరలోనే జరిగిపోయింది. అనుకోకుండా కూతురికి కూడా మంచి సంబంధం కుదిరి, పెళ్ళి జరిగిపోవటంతో విష్ణుమూర్తి, రమాదేవి సంతోషించారు.

మాధవ్ ఢిల్లీనుంచి హైదరాబాద్‌కు వచ్చేసాడు. పిల్లలు నలుగురూ కళ్ళెదుటే వుండటం రాఘవయ్య, జానకమ్మలకు ఆనందం కలిగించింది. రాధ, పల్లవి, బియెస్సీ చేసి, యమ్మెస్సీ కూడా పూర్తి చేసారు.

పల్లవి నెల తప్పిందని తెలిసి, శ్రీరాం తరువాత ఇన్ని సంవత్సరాలకు ఇంట్లోకి చిన్ని పాప వస్తోందని తెలిసి పెద్దలంతా సంతోషించారు. పల్లవికి మూడో నెల రాగానే దొంగ చలిమిడి పెట్టి తీసుకొచ్చారు. ఐదోనెల సీమంతం చేసారు. పుట్టింటా అత్తింటా గారాబాల బాల అయ్యింది. పల్లవికి జరుగుతున్న సంబరాలు, గారాబాలు చూస్తుంటే వద్దు వద్దనుకుంటూనే రాధ మనసులో దిగులేస్తోంది. తనకు ఇలాంటివేవీ జరగవు కదా అని ఎక్కడో ముల్లు గుచ్చుకున్నట్లుగా వుంటోంది. 'పల్లవిని చూసి అసూయ పడుతున్నానా? బావ ముందేచెప్పాడు. తను బావ కావాలనుకుంది. ఇక ఈ వేదన ఎందుకు?' అని తనకు తానే నచ్చజెప్పుకుంటోంది.

ఉదయం పూజచేసుకునేటప్పుడు, "స్వామీ గొడ్రాలికే పాపనిస్తావంటారే, నేను గొడ్రాలిని కాదు కదా ఓ మంచి బాబును ఇవ్వలేవా?" అని వేడుకుంటుంది. మళ్ళీ 'కావాలనుకున్నప్పుడు బాబునో

పాపనో తెచ్చుకోవచ్చు కదా హాయిగా!' అనుకుంటుంది. అంతలోనే ఎంతైనా తన కడుపులో మోసి, మురిపెంగా కన్న వాళ్ళతో సమానంగా కారుకదా. ఎవరో పిల్లలు తన పిల్లలనుకునే విశాలత్వం తనలో ఉందా? రకరకాల ఆలోచనలతో సతమతమైపోతోంది. రోజురోజుకు సొంతపాప కావాలనే కోరిక మొగ్గ తొడిగి, పుష్పించి ఫలమైంది.

పల్లవికి చక్కదనాల పాప పుట్టింది. పాలు తాగేటప్పుడు, నిద్రపోయేటప్పుడు తప్ప మిగతా సమయాలలో పాప 'తన్వి 'రాధ దగ్గరే ఉంటోంది. మరీ తన్వికి అంతగా అతుక్కుపోయిన రాధను చూసి మాధవ్, రాఘవయ్య, జానకమ్మ 'పల్లవి పాపను తీసుకొని వెళ్ళిపోయాక రాధ ఎలా ఉంటుందా?' అని కలవరపడుతున్నారు. ఓ రోజు, "రాధా! మనం పాపాయిని తెచ్చుకుందామా?" అని అడిగాడు. "ఇప్పుడే వద్దు" అని తల అడ్డంగా తిప్పింది. అనుకున్న రోజు రానే వచ్చింది. తన్వికి మూడో నెల రాగానే అత్తింటికి వెళ్ళిపోయింది పల్లవి.

పల్లవి వెళ్ళిపోయినప్పటినుంచి డల్‌గా వుంటున్న రాధతో, "ఏదైనా ఊరికి వెళ్ళి వద్దాం, మార్పు ఉంటుంది" అని అడిగాడు మాధవ్. కాని రాధ అందుకు సుముఖత చూపించలేదు. రోజురోజుకు నీరసిస్తోన్న రాధను జానకమ్మ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళింది. మూడోనెల వచ్చిందని, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, వాడవలసిన మందులు వ్రాసి ఇచ్చింది డాక్టర్. అందరికీ ఈ వార్త విని సంతోషించాలో, విచారపడాలో తెలీలేదు ఎవరికీ. మాధవ్‌కు ఎలా చెప్పాలో అని తడబడిపోయారు రాఘవయ్య, జానకమ్మ. కొంత సంతోషంతో, కొంత భయంతో పడుకుండిపోయింది రాధ. 'బావ ఏమంటాడో, అబార్షన్ చేయిస్తాననడు కదా?' అని కలవరపడిపోతోంది. మాధవ్ ఇంటికి వచ్చేవరకూ ముగ్గురు దడదడలాడుతూ కూర్చొని వున్నారు.

తాతయ్య చెప్పిన కబురు విని నోట మాట రానట్లుగా నిలబడి పోయాడు మాధవ్. ఏమీ మాట్లాడకుండా పడకగదిలోకి వెళ్ళి పడుకొనివున్న రాధను చూసాడు. మనసు ఓ వైపు సంతోషిస్తుంటే భయం మరోవైపు లాగుతోంది. పడుకొని, కళ్ళకు అడ్డంగా పెట్టుకున్న చేతికింద నుంచి మాధవ్‌ను భయం భయంగా పరిశీలిస్తోంది రాధ.

బట్టలు మార్చుకుంటూ, "చేసిందంతా చేసి, ఇప్పుడు భయపడతావెందుకు? దేవుడు ఏది రాసిపెడితే అదే జరుగుతుంది. కానీయ్, ఏది ఎలా ఉన్నా భరిద్దాం. డాక్టర్ ఏమన్నది?" అని అడిగాడు. 'అమ్మయ్య!' అనుకొన్నది రాధ.

వార్త విని ఉత్సాహంగా పల్లవి, ప్రణవ్ వచ్చారు. ఇల్లంతా సందడి సందడి చేసేసారు. తన్వి ఊఊఊ ల తో అత్తకు తన సంతోషం తెలిపింది. వాళ్ళను చూసి కొద్దిగా తేరుకుంది రాధ. రాధా మాధవ్‌లకు ధైర్యం చెప్పారు. అప్పటికప్పుడే బజారు నుంచి చక్కటి పాపాయి పోస్టర్‌లు తెచ్చి రాధ గదిలో అలంకరించింది పల్లవి.

నెలలు గడుస్తున్నాయి. ప్రతిరోజూ పల్లవి మధ్యాహ్నం తన్వితో సహా వచ్చి కాసేపు కూర్చొని వెళుతోంది. పల్లవితో రోజూ తన భయాలు చెప్పుకుంటోంది రాధ. "వెంకటేశ్వర స్వామి మనకు అన్యాయము చేయడు. నీకు చక్కటి పాపాయి పుడుతుంది. అంతా శుభమే జరుగుతుంది. ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించు. నెగిటివ్ ఆలోచన మనసులోకి రానీయకు." అని ధైర్యం చెబుతున్నది పల్లవి.

ఎవరి భయాలతో, సంతోషాలతో పని లేని కాలం గడిచి, ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. రాధ లేబర్‌రూమ్‌లో నొప్పులుపడుతోంది. అందరూ బయట ఆత్రంగా ఎదురుచూస్తున్నారు. మాధవ్ బాధ వర్ణనాతీతంగా వుంది. ప్రణవ్ చేయి గట్టిగా పట్టుకొన్నాడు. చాలా టెన్షన్‌గా వున్నాడు.

"నాకూ సొంత పిల్లలు కావాలని మనసులో వుందేమో, అందుకే వేసక్టమీ చేయించుకోలేదు. తప్పంతా నాదే బావా. ఎలాంటివాళ్ళు పుడతారో! రాధ ఈ గండం గడిచి బయట పడుతుందంటావా ? రేపే వెసక్టమీ చేయించుకుంటాను. ఇంక ఈ టెన్షన్ నేను భరించలేను." అని రకరకాలుగా బాధపడుతున్నాడు.

"అయినా మాధవ్, ప్రపంచంలో అవలక్షణాలతో ఉన్న పిల్లలందరూ మేనరికాలవాళ్ళకే పుట్టారా? మేనరికం కాని వారికి పుట్టలేదా? మన ఫ్రెండ్ మురళికి మెదడు ఎదగని బాబు పుట్టాడు. మురళికి, సుధకు ఎక్కడా బీరకాయపీచు చుట్టరికం కూడా లేదు, మరి దానికేమంటావు? మేనరికాలకు అవలక్షణాల పిల్లలు పుడతారు అని పూర్తిగా నమ్మకం ఉంటే మన గవర్నమెంట్, సతి, బాల్య వివాహం, కన్యాశుల్కం, వరకట్నం లాంటివి నిషేదించినట్లు మేనరిక వివాహాలు కూడా నిషేధించేది. అది అనుమానమే కాని నూరుశాతం నిర్ధారణ కాదు. అవకాశం ఉంది అంటున్నారు. అంతే. అవలక్షణాలతో పిల్లలు పుట్టటానికి రకరకాల కారణాలు ఉంటాయి. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందింది. మీరు ముందునుంచీ డాక్టర్ల పర్యవేక్షణలోనే ఉన్నారు. ఎప్పటికప్పుడు అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గా ఉన్నాయి. కాబట్టి భయపడకు... అంతా మంచే జరుగుతుంది." అని ప్రణవ్ ధైర్యం చెప్పాడు.

లోపలినుంచి 'కేర్'మని వినిపించింది. మాధవ్ ఉలిక్కిపడి ప్రణవ్‌ను గట్టిగా పట్టుకొని కళ్ళు మూసుకొన్నాడు. అలా ఎంతసేపున్నాడో... "అన్నయ్యా, కళ్ళు తెరువు. ఇటు చూడు. బాబు." అని పల్లవి మాట వినిపించింది. అయినా కళ్ళు తెరిచి బాబును చూసే ధైర్యం చేయలేకపోయాడు.

"ఒరే మాధవ్ చూడరా, నీ కొడుకు ఎంత ముద్దుగా ఉన్నాడో."

బొమ్మ మాటలకు కూడా చూసే ధైర్యం లేకపోయింది. ప్రణవ్ బలవంతాన మాధవ్‌ను పక్కకు జరిపి. మాధవ్ చేతులు గుంజి ముందుకు పెట్టాడు. పల్లవి ఆ చేతులలో బాబును పడుకోబెట్టింది. చిన్ని శరీరం మెత్తమెత్తగా చేతికి తగులుతుంటే, చిన్నగా కళ్ళు తెరిచి చూసాడు. బాబు బుజ్జిగా ముద్దుగా వున్నాడు. గబగబ చేతులు, కాళ్ళు, చెవులు, కళ్ళు అన్నీ పరిశీలనగా చూసాడు. అన్ని అవయవాలూ వున్నాయి. "పైకైతే అన్నీ ఉన్నాయి" అన్నాడు.

"నీ మొహం! శుభ్రంగా వున్నాడు. ఇంకేమీ మాట్లాడకు. అందరినీ హడావుడి పెట్టావు..." అని తాతయ్య కసురుకున్నాడు.

నర్స్ వచ్చి బాబును లోపలికి తీసుకెళ్ళింది. రాధను తీసుకొచ్చి గదిలో పడుకోబెట్టారు. "బాబు ఏడి?" అని నర్స్‌ను అడిగాడు మాధవ్.

"పీడియాట్రీషియన్ వచ్చారు. చెకప్ చేస్తున్నారు. కాగానే తీసుకొస్తాము." అని చెప్పి వెళ్ళిపోయింది నర్స్. కొద్దిసేపటి తరువాత బాబును తీసుకొచ్చింది నర్స్. వెనకనే, గైనకాలజిస్ట్, పీడియాట్రీషయన్ వచ్చారు. మాధవ్‌తో పీడియాట్రీషియన్, "బాబు పూర్తి ఆరోగ్యంగా వున్నాడు. మీరు భయపడవలసిందేమీ లేదు." అని చెప్పాడు. "శారీరకంగా ఐతే అన్నీ అవయవాలు వున్నాయి, కాని..." అంటూ భయం భయంగా ఆపేసాడు మాధవ్.

"అన్ని సక్రమంగా ఉన్నాయనే అనుకుంటున్నాను." అని నవ్వుతూ చెప్పి, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి డాక్టర్లిద్దరూ వెళ్ళిపోయారు.

తన వైపే చూస్తున్న రాధ దగ్గరకు వెళ్ళి, బాబును ఒక చేతిలోకి, రాధను ఒక చేతిలోకి, తీసుకున్నాడు. ఇన్ని రోజుల టెన్షన్ కన్నీళ్ళ రూపంలో బయటకు వచ్చింది. రాధ కళ్ళనుంచి కన్నీళ్ళు జలజలా రాలాయి.

"బాలింతను, పసివాడిని ఒళ్ళో పెట్టుకొని ఈ కన్నీళ్ళేమిటిరా?" అంటున్న జానకమ్మతో పాటు అందరూ ఓ విధమైన ఉద్వేగానికి గురయ్యారు. పసివాడినే చూస్తున్న రాధామాధవ్‌లకు బాబులో వెంకటేశ్వరస్వామి అభయ హస్తం, చిరునవ్వుతో కనిపించాడు. "బాబుకు శ్రీనివాస్ అని పేరు పెడదాము" అని రాధా, మాధవ్ ఇద్దరూ ఒకేసారి అన్నారు.

ముద్దుగా, ఆరోగ్యంగా అందరి గారాల బాలుడిలా పెరగసాగాడు శ్రీనివాస్...

***

ఇరవై ఒక్క సంవత్సరాల తరువాత...

పోలీస్ ఎకాడమీ ప్రాంగణం అంతా కోలాహలంగా, సందడిగా వుంది. అప్పుడే ట్రైనింగ్ ముగించుకున్న కేండిడేట్స్‌కు పాసింగ్ ఔట్పరేడ్ ముగిసింది. స్టిఫ్‌గా మార్చ్ చేసుకుంటూ వచ్చి, "హాయ్ మామ్, హాయ్ డాడ్" అంటూ అమ్మకూ, నాన్నకు సెల్యూట్ చేసాడు శ్రీనివాస్.

సంతోషంగా శ్రీనివాస్ నుదురు ముద్దాడి, "బావా, అవలక్షణాలతో పిల్లలు పుడతారని తెగ భయపడ్డావు. చూడు నా కొడుకు పోలీస్ ఆఫీసర్ అయ్యాడు. ఇప్పుడేమంటావు?" మాధవ్‌తో అన్నది రాధ. "ఏమంటాను తల్లీ. నా కాలర్ పట్టుకొని మరీ నా మెడలు వంచావు. ఇప్పుడు పోలీస్ ఆఫీసర్ తల్లివైయ్యావు."

తల్లిదండ్రులనిద్దరినీ చెరో చేత్తో దగ్గరకు తీసుకొని, వాళ్ళిద్దరి మధ్య ఒదిగిపోయాడు శ్రీనివాస్!

***

**(13-8-2015 – యామిని వెబ్ మాగ్జిన్)**

# 11. విధివిన్యాసాలు

చదువుతున్న పుస్తకంలోనుంచి తలెత్తి, వేళ్ళు విరుచుకుంటూ ఉంటే ఎదురుగా లలిత విచారంగా కూర్చొని కనిపించింది వసుధకు. వసుధ లలిత చేతిని తట్టి, 'ఏమిటీ సంగతి?' అన్నట్లు సైగ చేసింది. లలిత ఉలిక్కిపడి, బయటకు వెళదామన్నట్లు లేచింది. వసుధ తన పుస్తకాన్ని రాక్‌లో పెట్టి లలితను అనుసరించింది.

లెక్చరర్ జాబ్ నుంచి రిటైరయ్యాక, ఇంట్లో పనంతా ముగిసాక మధ్యాహ్నం లైబ్రరీలో గడపటం అలవాటు చేసుకుంది వసుధ. లలితతో అక్కడే లైబ్రరీలో స్నేహం కలిసింది. ఇద్దరికీ పుస్తకాలు చదవటం ఇష్టం. దానితో లైబ్రరీలో చదవటమయ్యాక, ఇంకో పుస్తకం ఇంటికోసం తీసుకొని, లైబ్రరీ ఆవరణలోని చెట్టు కింద కూర్చొని, కాసేపు పుస్తకాల గురించి చర్చించుకోవటం ఇద్దరికీ అలవాటు అయింది. చాలా అరుదుగా సొంత విషయాలు మాట్లాడుకుంటారు. ఇది గత కొద్ది కాలంగా సాగుతోంది.

ఇద్దరూ పున్నాగ చెట్టుకింద, బెంచ్ మీద కూర్చున్నారు. అప్పుడప్పుడు చెట్టు మీద నుంచి పున్నాగపూలు రాలుతున్నాయి. వాటి సువాసన సన్నగా గాలిలో తేలి వస్తూ, చుట్టూ ఉన్న చెట్ల నుంచి గాలి వీస్తూ, పరిసరాలు చాలా ఆహ్లాదంగా ఉన్నాయి. కాసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా  కూర్చున్నారు.

చివరకు, "నన్ను కూడా గమనించకుండా అలా మూడీగా కూర్చున్నావు, ఏమిటి సంగతి?" అని అడిగింది వసుధ.

"నీకు తెలుసుగా వసూ, నాకు ఒక్కడే కొడుకని, వాడీ మధ్య సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పెద్ద కంపెనీలో మంచి సాలరీతో చేరాడని, వాడికి పెళ్ళి

సంబంధాలు చూస్తున్నామని...” అని ఆగింది లలిత.

“ఊ, తెలుసు. ఏదైనా మంచి సంబంధం వచ్చిందా?” అడిగింది వసుధ.

“సంబంధాలకేమి, బోల్డు వస్తున్నాయి. వాడే నా నెత్తిన నిప్పులు పోసాడు.” కోపంగా జవాబిచ్చింది లలిత.

“ఏమిటీ ఎవరినైనా ప్రేమించాడా? ఈ మధ్య ఇది మామూలైపోయింది కదా, దానికి విచారమెందుకు?” అంది వసుధ.

“మామూలు ప్రేమైతే విచారమెందుకు?” చికాకుగా అంది లలిత.

“మరి కులాంతరమా? ఖండాంతరమా? ఖండాంతరం కూడా ఈ మధ్య ఎక్కువగానే జరుగుతున్నాయిగా...” అంది వసుధ.

“అదైనా బాగానే ఉండును. ఎలాగో అడ్జెస్ట్ అయ్యేవాళ్ళం. ఇద్దరు పిల్లలున్న విధవరాలిని పెళ్ళి చేసుకుంటాడట. వీడికేమైనా కాలొంకరా? కన్నొంకరా? అందగాడు, పెద్ద ఉద్యోగస్థుడు. ఒక్కగానొక్క కొడుకు. ఆమెనే పెళ్ళి చేసుకుంటాడట. లేకపోతే అసలు పెళ్ళే చేసుకోడట. ఇదేమి పోయేకాలమో! ఆ పిల్ల ఎవరో బాగానే బుట్టలో వేసుకుంది.” కసిగా కన్నీళ్ళతో అంది లలిత.

లలిత వైపు సాలోచనగా చూసి, “ఏమిటట, ఆ అమ్మాయిని ఉద్ధరిస్తాడటనా?” అడిగింది వసుధ.

“కాదుట, ప్రేమట. అదేమి ప్రేమో మరి.” కోపంగా అంది లలిత.

“ఓ” నిశ్శబ్దంగా ఆలోచనలో పడింది వసుధ. ఇద్దరూ కాసేపు మౌనంగా కూర్చున్నారు.

"నేను చెప్పేది నమ్మలేకపోతున్నావా వసూ, మాట్లాడటం లేదు." అడిగింది లలిత.

దానికి జవాబివ్వకుండా, "నేనొకటి చెపుతాను వింటావా, లలితా!" అడిగింది వసుధ.

"ఊ, చెప్పు." అనాసక్తిగా అంది లలిత.

***

"బామ్మగారూ!" అని పిలుస్తూ లోపలికి వచ్చిన వసుధకు వంట ఇంటి గడపమీద కూర్చున్న యువకుడు కనిపించాడు. కొద్దిగా నల్లగా, మోటుగా ఉన్నాడు. లైట్ క్రీమ్‌కలర్ పైజామా, కుర్తా వేసుకొని ఉన్నాడు.

అతను వసుధ పిలుపుకు తలెత్తి చూసాడు. చామనచాయ, కోల మొహం, పెద్ద కళ్ళు, చిలకాకుపచ్చకు ఎర్ర అంచున్న పరికీణీకి, చిలకాకుపచ్చ జాకెట్టూ, ఎర్రవోణీ వేసుకున్న ఓ అమ్మాయి, చేతిలో ఓ గిన్నెతో చిలకలా నిలబడి కనిపించింది.

నిస్సంకోచంగా తనను నిలువెల్లా పరీక్షగా చూస్తున్న అతనిని చూసి, కొద్దిగా బిడియంగా కదిలింది వసుధ.

ఇంతలో తులసికోట దగ్గర, పిడకలమీద పాలు పొంగిస్తూ మాఘపాదివారం పాట పాడుకుంటున్న విఘ్నేశ్వరమ్మ, వసుధను చూసి, "రామ్మా వసూ... వీడు నా మనవడు వివేక్. యుద్ధ విమానాలను తోలుతాడని చెప్పానే, వాడే వీడు" అంది.

"అబ్బ ఏమిటమ్మమ్మా, ఎడ్లబండిని తోలుతానన్నట్లు చెపుతావు." కొద్దిగా కినుకగా అన్నాడు వివేక్.

అతను అన్న విధానానికి ఫక్కున నవ్వింది వసు.

విఘ్నేశ్వరమ్మ కూడా నవ్వి, "ఏదోలేరా... ఈ అమ్మాయి వసుధ. యం. ఏ చదువుతోంది. ఈ మధ్యనే మన పక్క వాటాలోకి వచ్చిన హెడ్మాస్టర్‌గారి అమ్మాయి." అని పరిచయం చేసి, "మీ అమ్మ పాలు పొంగించటం అప్పుడే పూర్తి చేసిందా, ప్రసాదం తెచ్చావు?" అని వసుధతో అంది.

"అయిందండి" అని ప్రసాదం గిన్నె అక్కడ పెట్టి వెళ్ళిపోయింది వసుధ. వసుధ వెళ్ళిన వైపే చూస్తున్న మనవడితో, "ఏరా, అమ్మాయి ఎలా ఉంది? మాట్లాడనా?" నవ్వుతూ అంది, విఘ్నేశ్వరమ్మ.

"అబ్బా, అమ్మమ్మా! ఎన్ని సార్లు చెప్పాను, నేను పెళ్ళి చేసుకోనని? నా ఉద్యోగానికి పెళ్ళి చేసుకొని ఇంకో అమ్మాయిని బలి ఇవ్వలేను." విసుగ్గా అన్నాడు వివేక్ కానీ గొంతు కొంచెం బలహీనంగానే ఉంది.

"ఏమైందిరా నీ ఉద్యోగానికి? దేశానికి సేవచేస్తున్న వీరజవానువి. పల్లెటూరి అమ్మాయైనా చదువుకుంటోంది, తెలివైంది. కాస్తో కూస్తో అందమైంది. మనకు తెలిసిన కుటుంబలోని అమ్మాయి. అడుగుతాను" అంది విఘ్నేశ్వరమ్మ.

"నా ఉద్యోగం సంగతి చెప్పు. తల్లిదండ్రులకూ, ఆ అమ్మాయికి అభ్యంతరం లేకపోతే, అమ్మకూ నాన్నకూ మీకూ అందరికీ నచ్చితే నాకు ఓకేనే." నవ్వుతూ అన్నాడు వివేక్.

ఈ మాటలన్నీ అటు వైపు గోడ పక్కనే ఉన్న వసుధకు వినిపిస్తూనే ఉన్నాయి. ఓసారి వివేక్ రూపాన్ని గుర్తు తెచ్చుకుంది. కొద్దిగా మోటుగా ఉన్నా, బాగానే ఉన్నాడు. బహుశా బార్డర్‌లో తిరుగుతూ ఉండటం వల్ల చలికి మోటు తేలి ఉంటాడు అనుకుంటూ ఉంటే బుగ్గల్లోకి వెచ్చని ఆవిరి

వచ్చింది.

"అక్కా... అక్కా!" అరుచుకుంటూ వచ్చిన విహారి అరుపుతో ఈ లోకంలోకి వచ్చి, "ఏమిటిరా?" అని అడిగింది.

"అక్కా! పొద్దున పక్కింటి మామ్మగారి మనవడు వచ్చాడు. అతను ఫైటర్ పైలెట్ తెలుసా? నేను ఇప్పుడే మాట్లాడి వస్తున్నాను. మిలిటరీలో చేరాలంటే యన్. డి. యే అని ఉంటుందిట. అక్కడ సెలెక్ట్ అయ్యి, కోర్స్ చేస్తే డైరెక్ట్ గా మిలిటరీ ఆఫీసర్ అవ్వచ్చుట. నాకా వివరాలన్నీ చెపుతానన్నారు. పరీక్ష వ్రాసేందుకు సహాయం చేస్తానన్నారు." ఆరాధనగా అన్నాడు విహారి. వాడికి ఎప్పటినుంచో మిలిటరీలో చేరాలని ఆశ.

వాడి కోరిక తీరే దారి కనిపించిందని సంబర పడిపోతున్నాడు.

వసుధ తల్లిదండ్రులు విశ్వేశ్వరరావుగారు, విశాలమ్మగారితో విఘ్నేశ్వరమ్మ తన మనవడి సంగతి చెప్పింది. ముందుగా అతని ఉద్యోగం గురించి ఆలోచించారు వారు. కాని వసుధ, "ప్రమాదమన్నది ఎక్కడైనా జరగవచ్చు. యుద్ధంలోనే జరగాలని లేదు. నాకు ఇష్టమే" అనటంతో వారి పెళ్ళికి ఒప్పుకున్నారు. వివేక్ తల్లి తండ్రి వినోదారావు, విమలమ్మ ఇన్నాళ్ళకు మంచి అమ్మాయితో, కొడుకు పెళ్ళికి ఒప్పుకోవటంతో, తమ కోరిక తీరుతున్నందుకు ఉప్పొంగిపోయారు. అందరి ఆమోదంతో వివేక్, వసుధల పెళ్ళి వైభోగంగా జరిగిపోయింది.

ఇన్ని సంవత్సరాలుగా ఫీల్డ్ పోస్టింగ్‌లో ఉండటముతో ఫామిలీ స్టేషన్‌కు పోస్టింగ్ వచ్చి, కుటుంబాన్ని తీసుకెళ్ళేందుకు పర్మిషన్ వచ్చింది. ఇల్లు దొరికింది. వెంటనే వసుధను తీసుకెళ్ళాడు వివేక్. వసుధకు మిలిటరీ జీవితం కొత్తైనా వివేక్ సహాయంతో అక్కడ

అలవాటుపడుతోంది. చుట్టు పక్కల ఆఫీసర్ల భార్యలతో పరిచయం చేసుకుంది. ముఖ్యంగా వివేక్ చిన్ననాటి నుంచి స్నేహితుడు, ప్రస్తుతం సహోద్యోగి అయిన వాల్మీకి చాలా దగ్గరయ్యాడు. "నువ్వు నాకంటే చిన్నదానివి, స్నేహితుడి భార్యవు... నిన్ను అందరిలా మిసెస్ వివేక్ అనో, భాభీ అనో పిలవను, వసూ అనే పిలుస్తాను" అని పరిచయమైన మొదటిరోజే చెప్పేసాడు.

"నువు పెళ్ళిచేసుకో, నాకు తోడు వస్తుంది." అనేది వసు. వాల్మీకి నవ్వి, ఊరుకునేవాడు. ఎక్కడికెళ్ళినా ముగ్గురూ కలిసేవెళ్ళేవాళ్ళు. ఆనందంగా సాగుతున్న వారి జీవితనౌకలోకి బబ్లూ విపుల్ వచ్చి చేరాడు. బబ్లూ వచ్చిన ఏడాదిన్నరకే బబ్లీ విజిత వచ్చేసింది. బబ్లీ వచ్చిన ఆరునెలలకు, "ఇక్కడకు వచ్చి మూడేళ్ళవుతోంది, ఇహ పోస్టింగ్ రావచ్చు!" అనుకుంటూ ఉండగా బంగ్లాదేశ్ వార్ వచ్చింది. కాంప్‌లో ఉన్నవారంతా యుద్ధానికి వెళ్ళారు. అప్పుడే యన్.డి.యేలో కోర్స్ ముగించుకొని జాయినింగ్ కోసం సెలవల్లో ఉన్న విహారి అక్క దగ్గరకు సహాయంగా వచ్చాడు.

అంతటా యుద్ధవాతావరణం కనిపిస్తోంది. కాంప్‌లో అందరూ గంభీరంగా ఉన్నారు. అప్పుడప్పుడు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడే వార్త వినవలసి వస్తుందోనని అంతా గుండె గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. అన్ని కుటుంబాల ఆడవాళ్ళు ఒకరికొకరు తోడుగా ఉంటున్నారు. ఒంటరిగా ఉండలేని కొత్తగా పెళ్ళైన వాళ్ళు పుట్టింటికి వెళ్ళిపోయారు.

అంతటా నిశబ్దంగా, అప్పుడపుడు పిల్లల కేకలతో ఉంటోంది కాంప్. అందరినీ పలకరిస్తూ, అందరితో కలివిడిగా తిరుగుతోంది వసుధ. ఎవరికేమి కావాలో అడిగి తెలుసుకుంటోంది. ఎయిర్‌మెన్‌ల భార్యల

దగ్గరకు వెళ్ళి వాళ్ళకు ధైర్యం చెపుతోంది. కాంప్ అంతా ఒక్కతై తిరుగుతూ అందరినీ కలుపుకుంటూ తన భయాన్ని మర్చిపోగలుగుతోంది. ధైర్యంగా ఉంటోంది. ఏ ఎయిర్‌మెన్ అయినా చనిపోయాడని వార్త వస్తే అతని భార్యను ఓదార్చి, వాళ్ళవాళ్ళకు తెలిపి, ఆమెను ఇంటికి పంపే ప్రయత్నం చేస్తున్నది. వసుధను చూసి మిగతా ఆఫీసర్ల భార్యలు కూడా వాళ్ళ వాళ్ళ యూనిట్ జవాన్ల భార్యలకు అండగా నిలబడుతున్నారు. కాంప్ అంతా భయం భయంగా శ్మశాన నిశబ్దంతో ఉంది. అందరూ ఎపుడే వార్త వినవలసి వస్తుందో అని భయపడుతున్నారు. ఇంతలో యుద్ధం ముగిసిందని వార్త వచ్చింది. అందరూ ఊపిరి పీల్చుకొని, తమవారి కోసం ఎదురు చూస్తున్నారు.

వివేక్ కోసం ఎదురు చూస్తున్న వసు నెత్తిన పిడుగు పడింది. వాల్మీకి విచారంగా వివేక్ యూనీఫాం తెచ్చి వసు చేతిలో పెట్టి నిలబడ్డాడు. ఒక్క క్షణం ఏమి జరిగిందో తెలీలేదు వసుకు. అర్థం కాగానే యూనిఫాం చేతిలో పట్టుకొని గదిలోకి వెళ్ళి తలుపేసుకుంది. యూనీఫాంను అరచేతుల్లోకి తీసుకొని అందులో మొహం దాచుకుంది. తను కాపురానికి వచ్చిన మొదటి రోజున యూనీఫాం వేసుకొని వచ్చి స్మార్ట్‌గా సెల్యూట్ చేసిన వివేక్ కనిపించాడు. దుఃఖం పొంగుకొచ్చింది. అలా ఎంతసేపు రోదిస్తూ ఉండిపోయిందో తెలీదు.

బయటనుంచి విపుల్, విజితల ఏడుపు వినిపించింది. వాల్మీకి, విహారి తలుపు కొడుతున్నారు. శోకదేవతలా తలుపు తీసిన వసును చూసి ఇద్దరూ భోరుమన్నారు. తమను తాము నిలవరించుకున్నారు. బబ్లూ, బబ్లీలను వసుకు అందించాడు విహారి. 'నీకు నేను సపోర్ట్‌గా ఉంటాను' అన్నట్లు అక్క పక్కన నిలబడ్డాడు. తమ్ముడి భుజం ఆసరాగా చేసుకొని నిలబడ్డది వసుధ.

కాలం ఎవరికోసమూ ఆగదు. ఎవరి సుఖదుఃఖాలతో దానికి పనిలేదు. అలా సాగిపోతూనే ఉంటుంది. ఎంత తమ్ముడు ఆదరంగా చూసుకుంటున్నా ఎంతకాలమని వాడిమీద ఆధారపడాలి? ఓరోజు వాడికీ పెళ్ళవుతుంది, వాడి కుటుంబాన్ని, అమ్మానాన్నలను చూసుకోవాలి. ప్రస్తుతము పెళ్ళి కాలేదు కాబట్టి క్వాటర్ దొరకదు. బయట ఇల్లు తీసుకోవాలి అన్నీ సమస్యలే! తనను తాను నిలవరించుకొని హైదరాబాద్ వచ్చేసింది. కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరి అమ్మానాన్నలను దగ్గర పెట్టుకొంది వసుధ.

వాల్మీకిది షార్ట్ సర్వీస్ కమీషన్ కావటం వల్ల యుద్ధం కాగానే మిలిట్రీ నుంచి రిటైరై హైదరాబాద్ వచ్చి వేరే ఉద్యోగంలో చేరాడు. ఇంక ఇంటిపట్టునే ఉంటున్నావు కదా పెళ్ళిచేసుకోమని సంబంధాలను తేసాగారు తల్లిదండ్రులు. ఎన్ని సంబంధాలు వచ్చినా తన మనసులో ఉన్న అమ్మాయిలా ఎవరూ కనిపించలేదు. అందుకని పెళ్ళిని వాయిదావేస్తూ వచ్చాడు.

ప్రతి రోజూ సాయంకాలము, వాల్మీకి వసుధను చూసేందుకు వసుధ ఇంటికి వచ్చేవాడు. కాసేపు వసుధతో కబుర్లు చెప్పి, ఒంట్లో బాగాలేని విశ్వేశ్వరయ్యగారితో కాసేపు గడిపి, పిల్లలతో కొద్దిసేపు ఆడుకొని వెళ్ళటం అలవాటు చేసుకున్నాడు. వసుధ ఒంటరిగా పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవటము, యుద్ధసమయంలో కాంప్‌లో చూపిన చొరవ, పెద్దలకు గౌరవమిచ్చి ఓపికగా వారికి సేవచేయటము చూసిన వాల్మీకికి వసుధను వివాహము చేసుకోవాలని కోరిక కలిగింది. తనకున్న తల్లిదండ్రుల బాధ్యతకు వసుధ తోడ్పాటు దొరుకుతుందని నమ్మకం కలిగింది. తను వెతికే అమ్మాయి వసుధలా ఉండాలనుకుంటున్నాడు కాబట్టే ఇప్పటి వరకూ ఎవరూ నచ్చలేదు అనుకున్నాడు. ఓరోజు సమయము చూసి వసుధతో తన కోరికను తెలిపాడు.

ఒక్కసారి చుర్రుమన్నట్లు చూసింది వసుధ. "నన్ను ఉద్ధరిద్దామనుకుంటున్నారా? నాకు ఎవరి ఆసరా అవసరం లేదు." విసురుగా ఉంది.

"కాదు వసూ. నిన్ను ఉద్ధరించటం కాదు. నీ ఓపిక, తెలివితేటలు నాకు నచ్చాయి. నువ్వు ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కోవడం నచ్చింది. నీకు పెద్దలపట్ల ఉన్న గౌరవం నచ్చింది." అన్నాడు వాల్మీకి.

"అంటే ముందు నుంచీ మీకు ఈ ఐడియా ఉందా?" కొద్దిగా కోపంగా అడిగింది.

"అయ్యో లేదు. ముందునుంచీ నువ్వు నాకు స్నేహితుడి భార్యవే. నేను నీ స్నేహితుడినే! నీకు తెలుసు కదా మా నాన్నకు పక్షవాతం. ఆయనను చూసుకోవాలి. మా వదిన విసుర్లు వాళ్ళు తట్టుకోలేకపోతున్నారు. మా అన్నయ్య పట్టించుకోడు. నేను వాళ్ళను నాదగ్గరే ఉంచుకోవాలనుకుంటున్నాను. నీకు పెద్దల పట్ల ఉన్న గౌరవం, మీ నాన్నగారికి నువ్వు చేస్తున్న సేవ చూస్తుంటే మా అమ్మానాన్నలను కూడా చూసుకోగలవన్న ధైర్యం కలుగుతోంది. నన్నూ పెళ్ళి చేసుకోమని అమ్మా నాన్న అడుగుతున్నారు. కొంత మంది అమ్మాయిలను చూసారు. ఎవరూ నాకు కావలసినట్లుగా అనిపించలేదు. ఎవరో తెలీనివాళ్ళను చేసుకోవటం కన్నా, తెలిసిన దానివి, నా అభిరుచికి, నా మనసుకు నచ్చినదానివి అని నిన్ను ప్రపోజ్ చేస్తున్నాను. నువ్వూ ఆలోచించుకో. మీ పెద్దవాళ్ళను, విహారిని అడుగు. తొందరేమీ లేదు. బలవంతమూలేదు. నేను ఎప్పటికీ నీ స్నేహితుడినే. టేక్ యువర్ ఓన్ టైమ్." అనునయంగా అన్నాడు.

"నేను వివేక్‌ను మర్చిపోలేను. రోజూ తలుచుకుంటాను" అంది వసుధ.

"ఎవరు మర్చిపొమ్మన్నారు? నీతో పాటు నేనూ తలుచుకుంటా!" అన్నాడు వాల్మీకి.

"నాకు ఇంక పిల్లలు పుట్టరు." అంది వసుధ.

"ఫరవాలేదు, బబ్లూ, బబ్లీనే నా పిల్లలు. నువ్వే ఆలోచించుకో నా తరఫు నుంచి అంతా ఓకేనే." నవ్వుతూ అన్నాడు వాల్మీకి. అంతటితో ఊరుకోలేదు వాల్మీకి, విహారికి, విశ్వేశ్వరయ్యగారు, విశాలిగార్లకు కూడా తన నిర్ణయం చెప్పాడు. అందరికన్నా ముందు విఘ్నేశ్వరమ్మగారు మనవరాలిని ఒప్పుకోమని ఒత్తిడి చేసింది. అందరి బలవంతంతో కొంత, ఎదిగే పిల్లలకు తండ్రి అవసరమూ ఉందని కూడాను, కొంత ఇష్టంతోనూ పెళ్ళికి ఒప్పుకుంది వసుధ. ఆ తరువాత వాల్మీకి పెళ్ళి చేసుకున్నందుకు ఏ రోజూ చింతించలేదు. పిల్లలకు వాల్మీకి అసలు తండ్రి కాడని ఎప్పుడూ ఊహలోకి కూడా రానియ్యలేదు వాల్మీకి. వసుధను, పిల్లలను అంత ప్రేమగా చూసుకున్నాడు." అంటూ ముగించింది వసుధ.

***

"అంటే ఇది నీ కథా?" విస్మయంగా అడిగింది లలిత.

"అవును. డెబ్భైలల్లోనే నా ఈ పెళ్ళి జరిగింది. పూర్తిగా సాంప్రదాయ కుటుంబమైన మావాళ్ళు సంతోషంగా ఒప్పుకున్నారు. ఇప్పుడు ఇరవయ్యొకటవ శతాబ్దంలో నువ్వు అభ్యంతర పెడుతున్నావు. ఇద్దరికీ ఇష్టమైతే, సమస్యలు ఏమీ లేకపోతే ఒప్పుకోవచ్చు. ఆలోచించుకో." అంది వసుధ.

"ఒక సంగతి అడగవచ్చా?" మొహమాటంగా అడిగింది లలిత.

"నీ అనుమానం ఏమిటో అడుగు." అంది వసుధ.

"మీ పిల్లలకు తెలుసా?" అడిగింది లలిత.

"తెలుసు. కొంచెం వాళ్ళకు జ్ఞానం వచ్చాక ఓరోజు ఇద్దరినీ కూర్చోబెట్టుకొని అన్ని సంగతులూ చెప్పాడు వాల్మీకి. వివేక్ గురించి కూడా చెప్పాడు. ఇద్దరికీ దేశం కోసం ప్రాణాలర్పించిన తండ్రి వివేక్ అంటే చాలా ఆరాధన, గౌరవం. చిన్నప్పుడే తమను అక్కున చేర్చుకొని, తండ్రి లేని లోటు తెలీకుండా గారాబంగా పెంచిన డాడీ వాల్మీకి అంటే అభిమానం. వివేక్ వర్ధంతి రోజున అందరం కలిసి శ్రద్ధాంజలి ఘటిస్తాము. ఆ రోజు పూర్తిగా వివేక్ తలపుల్లోనే ఉంటాము."అని చెప్పింది వసుధ.

"తండ్రులిద్దరి ఆదర్శంతో విపుల్ కూడా ఫైటర్ పైలట్‌గా చేరాడు. ఈ మధ్య కొద్ది సంవత్సరాలుగా మిలిట్రీ కొన్ని విభాగాలలో అమ్మాయిలను కూడా తీసుకుంటున్నారు కదా, విజిత కూడా ఈ. యం. ఈ విభాగంలో చేరింది."అని కొనసాగించింది. ఇద్దరూ కొద్దిసేపు ఆలోచనల్లో ఉండిపోయారు. చిన్నగా చీకట్లు ముసురుకుంటున్నాయి. అంతటా నిశ్శబ్దంగా ఉంది. పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి. ఆలోచనల్లో నుంచి తేరుకొని కృతనిశ్చయంతో లేచింది లలిత.

"మా అబ్బాయితో మాట్లాడి, అసలు వాడి ఆలోచన ఏమిటో, ఆ అమ్మాయిని ఎందుకు పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాడో వివరంగా తెలుసుకొని, వాడిది సదభిప్రాయమైతే ఈ పెళ్ళికి ఒప్పుకుంటాను." అంది లలిత.

"శుభం" అంటూ లలిత చేతి మీద చిన్నగా తట్టుతూ లేచింది వసుధ.

***

**(16-12-2016 గోతెలుగు. కాం వెబ్ మాగిన్)**

# 12. గుండెకీ గుబులెందుకు!

"అదేమిటి అట్లా కూర్చున్నావు?" బాత్‌రూమునుంచి వస్తూ, మంచం మధ్యలో గడ్డం కింద చేయి పెట్టుకొని మూడీగా కూర్చున్న సుజాతను అడిగాడు అర్జున్.

అతని ప్రశ్నను పట్టించుకోకుండా, "పాపం, మీకు మీ నాన్న అన్యాయం చేసారు కదూ ?" విచారంగా అంది సుజాత.

"మా నాన్న నాకేమి అన్యాయం చేసాడు? పొద్దున్నే లేవగానే నీకా అనుమానం ఎందుకు వచ్చింది?" అడిగాడు అర్జున్.

"మీ అన్నయ్యకేమో తెలివిగల, పనిమంతురాలైన అమ్మాయిని ఇచ్చి పెళ్ళిచేసారు. అందరూ ఆమె తెలివితేటలని మెచ్చుకుంటున్నారా లేదా? మీ తమ్ముడికేమో అదృష్టవంతురాలిని ఇచ్చి చేసారు. అందరూ ఆమె వచ్చినప్పటి నుంచి మీ తమ్ముడి దశ తిరిగిందని అన్నీ కలిసొస్తున్నాయని అంటున్నారాలేదా? మరి మీకేమిటి నాలాంటి తెలివితక్కువదాన్ని, అయోమయాన్ని ఇచ్చి చేసారు?"

"ఏమి చేస్తాం, ఒకొక్కరి తలరాత. అయినా ఇప్పుడనుకొని ఏమిలాభం? ఎందుకిలా చేసాడో అడుగుదామంటే మా నాన్న లేడు." నవ్వుతూ అన్నాడు అర్జున్.

"అంతే కాని, నువ్వూ తెలివిగలదానివే, అదృష్టవంతురాలివి అనరన్నమాట. అంతేలెండి, నేనంటే మీకు అలుసైపోయాను." కోపంగా అంటూ బాత్రూం లోకి వెళ్ళి ధడేల్న తలుపేసుకుంది సుజాత.

ఏదో జోక్ అనుకుంటే, "నిద్ర మంచం మీదే ఈ గొడవేమిటి?" అని బిత్తరపోయాడు అర్జున్.

కాఫీ తెచ్చి ఇచ్చిన సుజాత ముభావంగా ఉండటం చూసి, "ఏమిటి సుజా, జస్ట్ జోక్ చేసాను. అయినా ఇంకా కోపం తగ్గలేదా?" అనునయంగా అడిగాడు అర్జున్.

"మీకు నేనంటే జోక్‌గానే ఉంటుంది. అయినా మీకు నేనంటే ఎప్పుడు విలువ ఉంది గనుక?" ఉక్రోషంగా అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

***

సెల్ రింగవుతుంటే అనాసక్తిగా అందుకుంది, సుజాత.

"హాయ్ అమ్మా, ఏమి చేస్తున్నావు?" అటునుంచి అడిగింది అఖిల.

"చేసేందుకు నాకేమైనా పనా పాడా? బాల్కనీలో కూర్చొని ఏదో ఆలోచించుకుంటున్నాను." అంది సుజాత.

"ఏమాలోచిస్తున్నావు?" అడిగింది అఖిల.

"పొద్దున్నే మీ డాడీతో గొడవైంది. పాత గొడవలన్నీ గుర్తొచ్చి మూడ్ అంతా పాడైపోతోంది. అసలు నేనంటే ఎవరికీ అభిమానం, ప్రేమ, విలువ లేవు. కనీసం నేను పోయాకైనా నా గురించి మంచిగా అనుకుంటారో లేదో!" దిగులుగా అంది సుజాత.

"అమ్మా, అట్లా ఎందుకనుంటావు? పాజిటివ్‌గా ఆలోచించమని నీకెన్ని సార్లు చెప్పాను? గొడవలు కాదు, మంచి సంగతులు గుర్తు తెచ్చుకో" అంది అఖిల.

"మంచి సంగతులా, ఏమున్నాయి?" అంది సుజాత.

"ఏమీ ఎందుకుండవు? నీ చిన్నప్పటి సరదాలు, మేము

పుట్టిన్నప్పటివి, నీ పెళ్ళైన కొత్తల్లోవి, ఇలా గుర్తు తెచ్చుకోవాలే కాని ఎన్నైనా ఉంటాయి." నచ్చచెబుతున్నట్లు అంది అఖిల.

ఏమీ జవాబివ్వలేదు సుజాత.

"ఓకే అమ్మా, పని ఉంది ఉంటాను." కాల్ కట్ చేసింది అఖిల.

అఖిల చెప్పినట్లు సంతోషం కలిగించే విషయాలు ఆలోచిస్తూ ఉంటే, ఒక్కసారి అఖిల చిన్నపాపగా ఉన్నప్పటి సంగతులు గుర్తొచ్చాయి సుజాతకి.

"మా బంగారు తల్లి ఎక్కడుందీ?" చేతిలో వెండిగిన్నె పట్టుకొని, అఖిలను వెతుకుతూ పడకగది లోకి వచ్చింది సుజాత.

మంచం కింద నుంచి, "హంతీ దంతీ సాత్ ఆన్ ఏ వాల్" అని పినిపించింది.

మంచం కిందికి తొంగి చూసింది. మంచం కింద, కాలు మీద కాలేసుకొని దర్జాగా పడుకొని, రైమ్ పాడుతోంది ఏడాదిన్నర అఖిల.

"అమ్మలూ బయటకు రారా, ఆం తిందువుకాని." గారంగా పిలిచింది సుజాత.

"ఊహూ, హంతీ, దంతీ సాత్ ఆన్ ఏ వాల్." అంది ముద్దుగా అఖిల.

"బంగారుతల్లీ బయటకు వచ్చి పాడుకోరా." అని చిన్నగా బయటకు తీసింది.

ఏడాదికే మాటలన్నీ వచ్చేసాయి. దాని వాగుడు చూసి ఎవరూ 'ఏడాది పిల్ల' అని చెబితే నమ్మేవాళ్ళు కాదు. ముద్దుముద్దుగా వస పోసిన

పిట్టలా ఎన్నిమాటలు మాట్లాడేదో బుజ్జిపిట్ట. మురిపెంగా కూతురు గురించి అనుకుంటూ ఉంటే పెదవులమీదికి అలవోకగా చిరునవ్వు వచ్చింది సుజాతకు.

“ఏమిటి మమ్మీ నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?” అన్న అఖిల పలకరింపుకు ఈలోకం లోకివచ్చింది సుజాత. “నువ్వెప్పుడొచ్చావు? నేను చూడలేదు. రా కూర్చో. ఆఫీస్ లేదా?” అడిగింది.

“ఉందమ్మా. ఈ రోజు కొంచం టైముంది, అందుకని ఇటొచ్చాను.” కూర్చుంటూ అడిగింది.

“ఏమీలేదు, నువ్వేగా చెప్పావు, ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచించు. సరదా సంగతులు, మంచి విషయాలు గుర్తు తెచ్చుకో అని. అదే ప్రయత్నం చేస్తున్నాను.” అంది సుజాత.

“గుడ్.” అంది అఖిల.

“నువ్వెప్పుడొచ్చావురా అమ్మలూ? నాకు మీటింగ్ ఉంది వెళ్ళాలి, ఇప్పుడు నీతో మాట్లాడలేను.” అన్నాడు అర్జున్ బయటకు వస్తూ.

“ఫర్లేదు డాడీ! నేను కాసేపు కూర్చొని ఆఫీస్‌కు వెళ్ళిపోతాను.” అంది అఖిల.

“మనం సాయంకాలం పరమేశ్వరావు ఇంట్లో పెళ్ళికి వెళ్ళాలి గుర్తుందిగా?” అని సుజాతకు చెప్పి వెళ్ళిపోయాడు అర్జున్.

కాసేపు తల్లి దగ్గర కూర్చొని కబుర్లు చెప్పి అఖిల కూడా వెళ్ళిపోయింది.

***

సాయంకాలం పరమేశ్వరరావుగారి ఇంటి నుంచి వస్తూ, "పెళ్ళి బాగా జరిగింది కదూ? మనకు బట్టలు కూడా పెట్టారు." అన్నాడు అర్జున్.

"ఊ" అంది ముక్తసరిగా సుజాత.

"ఏమైంది? అలా ఉన్నావు. ఎవరైనా ఏమైనా అన్నారా?"

"నన్నెవరేమంటారు?" విసురుగా అంది సుజాత.

"మరి?" ప్రశ్నార్థకంగా చూసాడు అర్జున్.

"నేను పెద్దదానిగా కనిపిస్తున్నానా? అందరూ ఆంటీ ఆంటీ అనటమే. ఈ ఆంటీ పిలుపు ఏమిటోగాని పూలవాడి దగ్గర నుంచి దగ్గరవాళ్ళు కూడా ఆంటీనే! అంత పెద్దగా ఉన్నారు, వగలు బోతూ ఆంటీ అంటుంటే చిరాకొస్తుంది." చికాగ్గా అంది సుజాత.

"ఓస్, దానికేనా? నేనింకేమిటో అనుకున్నాను." అన్నాడు అర్జున్.

"పైగా ఎక్కడికెళ్ళినా పార్వతీపరమేశ్వరుల్లా ఉన్నారు అని ఓ టాగ్ తగిలించేస్తారు. జరీచీరలు పెడతారు. నేనంత పెద్దపేరమ్మలా ఉన్నానా?" ఉక్రోషంగా అంది సుజాత.

"అబ్బా, దానికీ కోపమేనా? అది మర్యాద. మనకు గౌరవం ఇస్తున్నారు. నీ కిష్టం లేకపోతే ఆ చీరలు కట్టుకోకు." అన్నాడు అర్జున్.

"పెట్టేవాళ్ళంతా మనవాళ్ళు. కట్టుకోకపోతే బాధపడతారు. వెయ్యి రూపాయలకు తక్కువ కాని చీరలు పెడతారు. అలా అవి కట్టుకోలేను, వేరే వాళ్ళకు పెట్టలేను. ఇన్ని కొత్త చీరలుండగా నాకిష్టమైనవి కొనుక్కోలేను." నిస్పృహగా అంది సుజాత.

‘ఇదీ సమస్యేనా?’ అన్నట్లు విచిత్రంగా చూసాడు అర్జున్.

***

పొద్దున్నే సుజాత అరుపులతో మెలుకువ వచ్చింది అర్జున్‌కు. లేచి బయటకు వచ్చి, ఏమైందా అని చూసాడు. సుజాత పనిమనిషి మీద గట్టిగా అరుస్తోంది. లోపలికి వచ్చిన సుజాతతో, “ఏమైంది సుజా, అలా అరుస్తున్నావు?” అని అడిగాడు.

“చూడండి, రెండు రోజులుగా రాలేదు. ఏమైందంటే పిల్లవాడికి జ్వరం అంటూ ఏవో కథలు చెబుతోంది” అంది. “నిజంగానే పిల్లవాడికి జ్వరమేమో” నచ్చచెప్పబోయాడు అర్జున్.

“మీరూరుకోండి మీకేమీ తెలియదు. అయినా పనిమనిషి సంగతి మీకెందుకు?” తీవ్రంగా అంది సుజాత. సుజాత వైపు సాలోచనగా చూసి భుజాలెగరేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు అర్జున్.

***

ఆఫీసుకెళుతూ అఖిలకు కాల్ చేసాడు అర్జున్. “ఏమిటి డాడీ?” అడిగింది అఖిల.

“నువ్వు సాయంకాలం ఆఫీసు నుంచి వెళుతూ ఓ అరగంట నాకు స్పేర్ చేయగలవా?” అడిగాడు అర్జున్.

“అలాగే డాడీ, ఇంటికి వస్తాను.” అంది అఖిల.

“వద్దు. తాజ్‌కు రా. నువ్వు బయలుదేరే ముందు నాకు కాల్ చేయి.” అన్నాడు అర్జున్.

సాయంకాలం తాజ్‌లో కలిసారు అర్జున్, అఖిల. కాఫీకి ఆర్డర్ చేసి, ఏదో ఆలోచిస్తూ ఉన్న అర్జున్ చేతి మీద చిన్నగా తట్టుతూ, “డాడ్, ఎనీ ప్రాబ్లం?” అని అడిగింది అఖిల.

“ఏమీలేదమ్మా... మీ అమ్మ గురించే. ఈమధ్య విచిత్రంగా మారిపోయింది. కోపం ఎక్కువైంది. అయినదానికీ కానిదానికీ కోపం తెచ్చుకుంటోంది. గట్టిగా అంటే ఏడుస్తోంది. అర్థం పర్థం లేకుండా మాట్లాడుతోంది. ఏమి అయ్యిందో అర్థం కావటం లేదు.” అన్నాడు అర్జున్.

“ఏమీలేదు డాడీ, నేనుకోవటము దీనిని ఒకరకముగా ‘మిడిల్ ఏజ్ క్రైసిస్’ అనవచ్చు. ఈ వయసులో చాలా మందికి వస్తుంది. దానికి చాలా కారణాలు ఉంటాయి. అమ్మ విషయములో అకస్మాత్తుగా అమ్మావాళ్ళ నాన్న తాతయ్య చనిపోవటము, తమ్ముడు వినీల్ అమెరికా వెళ్ళటము, నువ్వు, నేను బిజీ అయిపోయి తనతో గడపకపోవటముతో ఒంటరిగా అయిపోయిన ఆలోచన వచ్చి డిప్రెషన్ వచ్చినట్లుంది అనిపిస్తోంది. దానితో కొన్ని భయాలు కూడా ఎక్కువయ్యాయి. మనం ఓర్పుతో తనను మామూలుగా చేయాలి.” అంది అఖిల.

“ఎవరైనా సైకియాట్రిస్ట్ కు చూపిద్దామా?” అడిగాడు అర్జున్.

“అవసరం లేదనుకుంటాను. అంత సీరియస్‌గా ఏమీలేదు. నేను చూసుకుంటాను, మీరు కంగారు పడకండి. కాకపోతే మీరు నా ప్రయత్నం లో సహకరించండి.” అంది అఖిల.

“సరే మరి.” అని వెయిటర్‌కు బిల్ పే చేసి లేచాడు అర్జున్.

***

“హాయ్ అమ్మా!” అంటూ వచ్చింది అఖిల.

"ఏమిటీ పొద్దున్నే వచ్చావు. ఆఫీస్ లేదా?" అని అడిగింది సుజాత.

"ఉంది కాని పొద్దున పనిలేదు. అందుకని నిన్ను చూసిపోదామని వచ్చాను. ఏమి చేస్తున్నావు? బిజీనా?" అడిగింది అఖిల.

"ఆ... నేనేమి బిజీ, డాడీ కూడా ఆఫీస్‌కెళ్ళిపోయారు. ఇక నాకేమి పని ఉంది?" అంది సుజాత.

"ఐతే బయటకు వెళదాం రా" పిలిచింది అఖిల.

"అబ్బ నేను రాను, నాకు ఓపిక లేదు." నిరాసక్తిగా అంది సుజాత.

"ఓపిక లేదనకు, లే... చీర మార్చుకో" అని అలమారాలో నుంచి చీర తీసి సుజాత చేతిలో పెట్టింది అఖిల.

'ఇక తప్పదా?' అని గొణుక్కుంటూ తయారైంది సుజాత.

బజారులో ఓ బిల్డింగ్ దగ్గర కార్ ఆపించి, దిగింది అఖిల. తలెత్తి ఆ బిల్డింగ్ పేరు, 'న్యూ కంప్యూటర్ ఇన్స్టిట్యూట్' అని వ్రాసి ఉన్నది చదివి, "ఇదేమిటి ఇక్కడకు తీసుకొచ్చావు?" అడిగింది సుజాత.

"నిన్ను చేర్పిద్దామని" నవ్వుతూ అంది అఖిల.

"ఇదేమిటి? నేను చేరను." అంటూ కారెక్కబోతున్న సుజాతను చేయిపట్టి ఆపి, పక్కన ఉన్న కాఫీ షాప్‌లోకి తీసుకెళ్ళింది అఖిల. రెండు కప్పులు కాఫీ తీసుకొని ఓ టేబుల్ దగ్గర కూర్చొని సుజాతను కూడా కూర్చోబెట్టింది.

"ఊ... ఇక చెప్పు. కొత్త కొత్తవి నేర్చుకోవటం నీకు ఆసక్తి కదా! మరి కంప్యూటర్ ఎందుకు నేర్చుకోవు?" అడిగింది అఖిల.

"అది ఒకప్పుడు. ఇప్పుడు నాకు దేనిమీదా ఆసక్తి లేదు." అంది సుజాత.

"ఎందుకు లేదు?" అడిగింది అఖిల.

"ఎందుకు లేదు అంటే ఏమి చెబుతాను? లేదు అంతే." ఒక్కసారిగా బరెస్ట్ అయ్యింది సుజాత. "ఈ మధ్య నాకు దేని మీదా ఆసక్తి లేదు. ఏపనీ చేయాలనిపించటం లేదు. చాలా చికాగ్గా ఉంటోంది. సడన్‌గా భయమేస్తుంది. రాత్రిళ్ళు నిద్రపట్టదు. నిద్రపట్టినా పిచ్చి పిచ్చి కలలు. డాడీ నన్నొదిలేసి వెళ్ళిపోతున్నారనిపించి లేచి కూర్చొని డాడీ చేయి పట్టుకుంటాను. ఒక్కసారిగా అందరూ నన్ను వదిలేసి వెళ్ళిపోతున్నారన్న భావన వస్తుంది. గతంలో జరిగిన కొన్ని ఇబ్బందులు గుర్తొచ్చి చాలా బాధ అనిపిస్తుంది. ఏడుపొస్తుంది. ఇలా ఎన్నని చెప్పను? పిచ్చెక్కుతుందేమో అనిపిస్తోంది. ఇలాగే కొన్ని రోజులు ఉంటే నన్ను పిచ్చాసుపత్రిలో చేర్పిస్తారేమో అని భయంగా ఉంది." దిగులుగా అంది సుజాత.

"పిచ్చిలేదు, ఏమీ లేదు ఇదంతా నీ మనసు చేస్తున్న గారడి. దాని గారడీకి లోబడకు. దానితో యుద్ధం చేసి గెలువు. నీకే కాదు కొన్ని సార్లు అందరికీ ఏదో ఒక స్టేజ్‌లో ఇలా శూన్యంగా, గాలి తీసిన బెలూన్‌లా అనిపిస్తుంది. నీ మనసును ఏదైనా వ్యాపకం మీదికి మళ్ళించుకో. బుర్రను ఖాళీగా ఉండనీయకు. హాయిగా కంప్యూటర్ నేర్చుకో." అంది అఖిల.

"కంప్యూటర్ నేర్చుకొని నేనేమి చేయను? ఉద్యోగం చేసే ఓపిక లేదు. కుట్లూ అల్లికలూ మొదలైన వాటి మీద ఇంటరెస్ట్ తగ్గింది. అసలు పుస్తకాలే చదవాలనిపించటం లేదు. ఎట్లా చదివేదానిని!" అంది సుజాత.

తన లాప్‌టాప్ ఓపెన్ చేసి, సుజాత పక్కకు వచ్చి కూర్చొని "కంప్యూటర్ నేర్చుకొని ఉద్యోగమే చేయనవసరం లేదు. వినీల్‌కు నువ్వు ఉత్తరం వ్రాసావనుకో అది వాడికి చేరి, వాడు జవాబిచ్చేసరికి నెల పడుతుంది. అదే మెయిల్ ఇచ్చావనుకో, నిమిషంలో చేరుతుంది. అంతెందుకు, ఇదిగో చూడు, వినీల్ పేరు పక్కన ఆకుపచ్చ చుక్క కనిపిస్తోందా? అంటే వాడు ఆన్‌లైన్ ఉన్నాడన్న మాట. నువ్వు వాడితో ఇప్పుడు ఆన్‌లైన్ మాట్లాడవచ్చు. ఇక్కడ ఉన్నప్పటిలాగే వాడు నీ పక్కనే కూర్చొని పని చేసుకుంటున్నాడనుకో! దీని మెయిల్, ఛాట్ అంటారు.

ఇంకా నీకు ఏదైనా వంటకం గురించి కావాలి, లేదా నీ ఏదైనా మందు గురించి తెలుసుకోవాలనుకున్నావు, ఇక్కడ టైప్ చేయి! నీకు కావలసిన సమాచారం క్షణాలల్లో వస్తుంది. ఇక్కడ తెలుగులో వ్రాయవచ్చు. ఇవి బ్లాగ్‌లు. నువ్వూ ఓ బ్లాగ్ ఓపెన్ చేసుకొని నీకు కావలసింది వ్రాసుకోవచ్చు. మాకు చిన్నప్పుడు చెప్పిన కథలు, నీ కవితలు అన్నీ ఇక్కడ తెలుగులో వ్రాసుకోవచ్చు. ఏ పత్రికల వాళ్ళో పబ్లిష్ చేయనవసరంలేదు. నువ్వే చేసుకోవచ్చు. పదిమందీ చదువుతారు. వాళ్ళ అభిప్రాయాలు చెపుతారు. చూడు ఇవన్నీ తెలుగు బ్లాగ్‌లు. ఇందులో నీ అభిరుచులకు తగ్గవాళ్ళు నీకు స్నేహితులు కావచ్చు. హాయిగా ఇంట్లో నుంచే వాళ్ళ తో నీ అభిప్రాయాలు పంచుకోవచ్చు.

ఇది యూట్యూబ్. ఇక్కడ నీకు కావలసిన పాత సినిమాలు చూడవచ్చు. పాటలు వింటూ చూడవచ్చు. అన్నమాచార్య కీర్తనలు, అమ్మవారి గీతాలు అన్నీ ఉంటాయి. ఇక్కడ నవలలు ఉంటాయి. పత్రికలు ఉంటాయి. న్యూస్‌పేపర్‌లు ఉంటాయి. ఏవైనా చదువుకోవచ్చు. అంతెందుకు ప్రపంచం అంతా ఈ చిన్నిపెట్టెలో ఉంది. చక్కగా సమయం గడిచిపోతుంది." ఒక్కొక్కటీ చూపిస్తూ వివరించింది అఖిల.

ఒక స్నేహితురాలిలా కాఫీషాప్‌కు తీసుకొచ్చి అఖిల మాట్లాడటం చూస్తుంటే, ఈ మధ్య ఎవరో, "నీ బెస్ట్ ఫ్రెండ్ ఎవరూ?" అంటే, "నా పిల్లలు, మా ఏమండీనే నా బెస్ట్ ఫ్రెండ్స్" అని తను చెప్పిన జవాబు గుర్తొచ్చి నిజమే కదా అనుకుంటూ అఖిలను మురిపెంగా చూసుకుంది.

"సరే చూద్దాం. ఇదీ ప్రయత్నిస్తాను" అని అంగీకారం తెలిపింది సుజాత. అఖిలతో పాటు సుజాత ఆ బిల్డింగ్‌లోకి నడిచింది. అక్కడ ఆఫీస్ అని వ్రాసి ఉన్న గదిలోకి నడిచింది అఖిల. అక్కడ ప్రిన్సిపాల్ అని వ్రాసి ఉన్న చోట, కూర్చొని ఉన్న ఆయనతో, "నమస్కారమండి. నా పేరు అఖిల. ఇందాక మీకు కాల్ చేసాను." అంది అఖిల.

"అవును, కూర్చోండి. మీ అమ్మగారిని తీసుకొస్తానన్నారు, ఈవిడేనా?" అని అడిగారు ఆయన.

"అవునండి. అమ్మ కంప్యూటర్ నేర్చుకుంటుంది. బేసిక్ నేర్పిస్తే చాలు." అంది అఖిల.

"చాలా సంతోషమమ్మా. ఈ వయసులో ఆసక్తిగా నేర్చుకుందామని వచ్చారు." అని పక్కన నిలబడ్డ అబ్బాయిని చూపి, "ఇతని పేరు సురేంద్ర. మీకు మిగితా విద్యార్థులతో కాకుండా విడిగా నేర్పిస్తాడు." అని పరిచయం చేసాడు.

"రండి మేడమ్." అని ముందుకు దారి తీసాడు సురేంద్ర.

"నువ్వెళ్ళమ్మా. నేను ఫామ్ నింపి, ఫీజ్ పే చేసి వెళతాను." అంది అఖిల.

సురేంద్రను అనుసరించింది సుజాత. సురేంద్ర ఓ కారిడార్‌లోనుంచి నడిచాడు. ఆ కారిడార్ మసక చీకటిగా ఉంది. అతనిని అనుసరించింది

సుజాత. అతను ఓ గది తలుపులు తీసి లోపలికి వెళ్ళాడు. గది అంతా చీకటిగా ఉంది. అడుగు ముందుకు వేసిన సుజాత చీకటి చూసి ”అమ్మో! చీకటిలో నేర్చుకోవాలా? నేను నేర్చుకోను.” అంది భయంగా.

సురేంద్ర మాట్లాడకుండా తలుపు ప్రక్కనే ఉన్న స్విచ్‌లన్నీ వేసాడు. గదంతా తెల్లని వెలుతురు నింపుతూ, నాలుగు ప్రక్కలా ట్యూబ్‌లైట్లు వెలిగాయి. గది చాలా విశాలంగా ఉంది. కుర్చీలు, బల్లలూ విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా వేసి ఉన్నాయి. ఎదురుగా గోడ మీద పెద్ద తెర కనిపిస్తోంది. సురేంద్ర ఆ తెర దగ్గరకు వెళ్ళి స్విచ్ వేసాడు. తెర మీద ‘వెల్‌కమ్’ అని అక్షరాలు నీలి రంగులో తిరుగుతూ వచ్చాయి. ఆ తరువాత ఆకుపచ్చని పచ్చిక బయళ్ళు, నీలాకాశం, పచ్చికలో మేస్తున్న జీవాలు తెర మీద ప్రత్యక్షం అయ్యాయి. తెరకు ఎడమ వైపుగా కొన్ని గుర్తులు కనిపించాయి. అందమైన ఆ ప్రకృతి దృశ్యం చూడగానే సుజాత మనసు ఆనందంతో నిండిపోయింది. ఓ విధమైన ఉద్వేగానికి గురైంది.

సురేంద్ర, “రండి మేడమ్.” అని పిలిచాడు. ఆ పిలుపు, ఆ ప్రకృతి, గదిలో పరుచుకున్న తెల్లని వెలుతురు తన మనసు పొరలల్లో ఉన్న చీకటిని పారద్రోలి వెలుతురు నిపేందుకు ఆహ్వానంలా అనిపించింది. తన మనసు చేస్తున్న గారడీ నుంచి బయటపడగలను అన్న ఆత్మవిశ్వాసంతో ఆ కొత్తప్రపంచంలోకి అడుగు వేసింది సుజాత.

క్లాసు తర్వాత ఆటో తీసుకుని ఇంటికెళ్లగానే సుజాత తన కూతురుకు ఫోన్ చేసింది. “అఖిలా! నీకు ఇన్ని విషయాలు ఎలా తెలుసు? నా పరిస్థితిని ఎలా అర్థం చేసుకోగలిగావు? చాలా థాంక్స్‌రా.”

“అమ్మా! నేను నీ కూతురుని కాదు... ఫ్రెండ్‌ని కదా. అందుకే నిన్ను అర్థం చేసుకోగలిగాను. అంతే”అంది నవ్వుతూ...

"థాంక్స్‌రా ఫ్రెండ్... మళ్లీ నీతో మెయిల్‌తోనే మాట్లాడతాను. ఫోన్ చేయను."

అఖిల సంతోషంగా ఈ విషయం చెప్పడానికి తండ్రికి కాల్ చేసింది...

***

**(స్నేహబంధం యొక్క గొప్పతనం గురించి మాలిక పత్రికకు వ్రాసిన కథ)**

# 13. రాజాకీ ఆయేగీ బారాత్

ఇంట్లోకి బయటకు తెగ తిరిగేస్తున్నాడు సమీర్. మమ్మీ, డాడీ 'మాకేమీ అభ్యంతరం లేదు మీ తాతయ్యను ఒప్పించు' అని తన మీదే భారం వేసేసారు. కాళ్ళావేళ్ళా పడ్డా మావల్ల కాదు అని చేతులెత్తేసారు. ఇంకో పక్క షీలా చేతిలో తల్వార్ పట్టుకొని, 'మన పెళ్ళి సంగతి ఇకెప్పుడు తేలుస్తావు?' అని సత్యభామలా ఉరిమి చూస్తోంది. తన సెలవలూ అయిపోతున్నాయి. వెళ్ళి డ్యూటీలో చేరాలి. పెళ్ళి చేయకుండా డ్యూటీకి వెళ్ళనిచ్చేది లేదని సంబంధాలు తెగ చూసేస్తున్నాడు తాతయ్య. ఇటు షీలా తల్వార్‌తో, అటు బుర్రమీసాల తాతయ్యతో బుర్ర తిరిగిపోతోంది.

పొద్దుటి నుంచీ మనవడి తిరుగుడు చూస్తున్న పరంధామయ్యగారు ఇక లాభం లేదని "ఏమిటిరా సమీ? ఏమిటి విషయం?" అని అడిగారు.

తాతయ్య పిలిచే సరికి ఇంకాస్త తడబడి, ఆయన కాళ్ళ దగ్గర కూలబడి, "తాతయ్యా, నేను మా కొలీగ్‌ను ప్రేమించాను. ఆ అమ్మాయినే పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను." అని గబగబా చెప్పేసి తీర్పు కోసం తాతయ్య మొహంలోకి చూసాడు.

బుర్ర మీసాలు సవరించుకుంటూ, మనవడిని చూస్తూ, "ఎవరి అమ్మాయి? వివరాలేమిటి?" అడిగాడు.

'అమ్మయ్య, కూల్‌గానే అడుగుతున్నాడు' అని మనసులోనే నిట్టూర్చి, "తన పేరు షీలా. నా కొలీగ్. వాళ్ళు పంజాబీ వాళ్ళు. వాళ్ళ డాడీ మిలిట్రీలో కల్నల్. ప్రస్తుతం ఇక్కడే సికింద్రాబాద్, సిఖ్ విలేజ్‌లో ఉన్నారు" అన్నాడు.

"పంజాబీ వాళ్ళా? ఆ ఉత్తరాది వాళ్ళకు మనకు ఆచార

వ్యవహారాలు కలవవు. అసలే మిలిట్రీ వాడంటున్నావు. ఏమైనా తేడా వస్తే గన్‌తో పేల్చేస్తాడేమో! వద్దులే” అనేసాడు.

అమ్మయ్య తాతయ్య కాస్త సానుకులంగా ఉన్నాడని, “లేదు తాతయ్యా ఆయనకు కాస్త డిసిప్లిన్ ఎక్కువే కాని అంత పని చేయడు. ఐనా అంతదాకా రానీయనులే. నీకెందుకు, ఆ ఉత్తరాదికి, ఈ దక్షణాదికి మధ్యనున్న సూయజ్ కాలవలో ఎట్లాగో అట్లా పారాడుతాలే భయపడకు” అన్నాడు మనవడు ఉత్సాహంగా.

“ఏమిటీ ఉత్తరాదికీ, దక్షిణాదికీ సూయజ్ కాలువా? అసలదెక్కడుంది నీకు తెలుసా? అందులో పారాడుతావా? అంటే.”

‘ఆ సూయజ్ కాలువ ఎక్కడేడ్చిందో గుర్తుండి చస్తేగా! ఏదో ఫ్లోలో వచ్చేసింది’ అని మనసులో తల కొట్టుకొని హడావుడిగా “అదే... అదే... తాతయ్యా, స్విమ్మింగ్ చేస్తా” అన్నాడు.

“అంటే ఈత కొడతవా? వెధవా అసలు ముందు నిన్ను హిస్టరీ, తెలుగు ట్యూషన్‌లో చేరుస్తా పద.”

“తాతయ్యా ప్లీజ్ ప్లీజ్... ఆ ట్యూషన్‌లో తరువాత చేరుతా, నువ్వు తెలుగులో మాట్లాడమంటావని అలా అనేసాను. ప్లీజ్ ప్లీజ్... ముందు షీలాను చూడు తాతయ్యా” ఏడుపు గొంతుతో వేడుకున్నాడు.

“వాడు అంతగా చెపుతున్నాడు కదా ముందు అమ్మాయిని చూద్దాము నాన్నా” అన్నాడు శ్రీకాంత్ పితృహృదయం ద్రవించిపోతుండగా.

‘హమ్మయ్య మొత్తానికి చూపులదాకా వచ్చేసారు. షీలా, తల్వార్ లోపల పెట్టేసుకో’ మనసులో షీలాతో చెప్పేసాడు.

కల్నల్ సుర్జీత్ సింగ్‌గారు మర్యాదగా ఆహ్వానించారు. మిసెస్ సింగ్‌గారు తల మీదుగా కొంగు కప్పుకొని "ప్రణాం దాదాజీ " అని తాతగారి కాళ్ళకు నమస్కారం చేసింది. అబ్బో అనుకున్నారు తాతగారు. తెల్లగా నాజుకుగా ఉన్న షీలాను చూసి, 'ఫరవాలేదు, పిల్ల బాగానే ఉంది' అనుకున్నారు. తల మీదుగా చున్నీ కప్పుకొని తాతగారికి ప్రణామం చేసిన షీలాను చూసి, 'ఫరవాలేదు, వీళ్ళకు పెద్దలంటే మర్యాద ఉంది' అనుకున్నారు.

మిసెస్ సింగ్ టేబుల్ మీద, టి.వీ మీద వేసి ఉన్న క్లాత్ లను, కుషన్ కవర్‌లనూ చూపించి "వీటి మీద ఎంబ్రాయిడరీ షీలానే చేసింది" అని చెప్పింది.

ఇంట్లోకి వెళ్ళగానే ముందు ట్రేలో పెద్ద పెద్ద గాజుగ్లాసులతో చిక్కటి మజ్జిగ ఇచ్చారు. చక్కటి పింగాణీ బౌల్స్ లల్లో అందంగా మిఠాయిలూ, సమోసాలు అమర్చి తీసుకొచ్చింది షీలా. అవి షీలానే చేసిందని చెప్పారు. 'ఐతే వంట కూడా వచ్చన్నమాట. అన్నీ బాగున్నాక, పిల్లాడికి నచ్చాక ఎందుకు వద్దనాలి?' అని పచ్చ జెండా ఊపేసారు. అమ్మయ్య అని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పెళ్ళి పంజాబీ పద్ధతిలో చేయాలని ముచ్చటపడ్డారు కల్నల్ గారు. ఏ మూడ్‌లో ఉన్నారో అదీ ఒప్పేసుకున్నారు తాతగారు.

ఎదురు చూస్తున్న శుభఘడియ వచ్చేసింది.

"ఆరింటికి జయమాల అన్నారు. ఐదైంది. ఇంకా తెమలరేమిటి? పదండి. బరాత్ కోసం గుర్రం పెట్రొమాక్స్ లైట్ల వాళ్ళూ, బాండ్ మేళం వాళ్ళూ వచ్చేసారు. కానీయండి కానీయండి." తాతయ్య అరుపులకు 'వచ్చే వచ్చే' అంటూ సమీర్ మంచి మెరుపుల షర్వాణీ వేసుకొని, చక్కగా

తయ్యారై వచ్చి గుర్రాన్ని చూసి బెదిరిపోయాడు. ఆ గుర్రం 'నీలాంటి వాళ్ళను ఎందరినో చూసానులే' అని ఓ చూపు విసిరింది. ఇప్పుడేమైనా అంటే ఎక్కడ ఆ మిలిట్రీ మామగారు, ఈ బుర్రమీసాల తాతయ్యా తన బుర్ర బద్దలుకొడుతారో అని కళ్ళుమూసుకొని రౌతు సహాయముతో ఎట్లాగో ఎక్కాడు. బాండ్ మేళం వినసొంపుగా వాయిస్తుండగా, ముందు గుర్రం మీద పెళ్ళికొడుకు ప్రాణాలుగ్గబట్టుకొని కూర్చొని, మిగితావారు కార్లల్లో పెళ్ళి హాల్‌కు వచ్చారు.

ఎక్కడా చడీ చప్పుడు లేదు. హాల్ దగ్గర ఎవరూ లేరు. అందరూ కార్లల్లో నుంచి దిగి లోపలకు వెళ్ళారు. డెకరేషన్ వాళ్ళు డెకరేషన్ చేస్తున్నారు. కొంత మంది షామియానా కింద ఊడుస్తున్నారు. కొంత మంది కుర్చీలేస్తున్నారు.

"అసలు ఇదేనా మనం రావలసిన మారేజ్ హాల్?" తాతగారు కొడుకును అడిగారు.

"అవును నాన్నా ఇదే కాని ఎవరూ లేరేమిటి?" అయోమయంగా చుట్టూ చూస్తూ అన్నాడు శ్రీకాంత్.

అప్పటికి చచ్చీచెడి గుర్రం దిగి చెమటలు కక్కుతున్నాడు సమీర్. కోపంతో మండిపడుతూ చిందులు తొక్కుతున్న తాతయ్యను, అయోమయంగా చూస్తున్న మమ్మీ డాడీలను, విడ్డూరంగా చూస్తున్న చుట్టాలను కలియ చూసి, కాస్త పక్కకి వెళ్ళి సెల్ తీసి , "షీలా మారేజ్ హాల్ దగ్గర ఎవరూ లేరేమిటి? మీరంతా ఎక్కడున్నారు? ఎక్కడన్నా మధ్య దారిలో బరాత్‌ను రిసీవ్ చేసుకోవటానికైతే లేరు కదా?" అని అడిగాడు.

"బరాత్‌ను మధ్య దారిలో ఎందుకు రిసీవ్ చేసుకుంటాము?

హాల్‌లోనే చేసుకుంటాము. నేను బ్యూటీ పార్లర్‌లో రెడీ అవుతున్నాను. నువ్వెక్కడున్నావు?" అడిగింది షీలా.

"బ్యూటీపార్లర్లో ఉన్నావా? ఆరింటికే జయమాల అన్నారు కదా. తాతయ్య హడావుడి పెట్టి ఐదున్నరకే తీసుకొచ్చేసాము. మీ వాళ్ళు కూడా ఎవరూ లేరు హాల్‌లో" అన్నాడు తెగ కన్‌ఫ్యూజైపోతూ.

"అదేమిటి అప్పుడే ఎందుకొచ్చారు? బరాత్ హాల్ దగ్గరకు వచ్చాక డాన్స్ చేయాలని మా తమ్ముడు, వాడి ఫ్రెండ్స్ తయ్యారవటానికి మెన్స్ బ్యూటీపార్లర్‌కు వెళ్ళారు. ఆరంటే ఆరుకే వచ్చేస్తారని మాకేమి తెలుసు? బరాత్ రావటానికి కనీసం రెండు గంటలన్నా పడుతుంది కదా! డాన్స్ చేసుకుంటూ రాలేదా మీరు? రయ్యమని పరిగెత్తుకుంటూ వచ్చేసావా?" నవ్వుతూ అంది.

డాన్స్ చేయటమా? 'తాగుబోతు వెధవల్లా రోడ్ మీద డాన్స్ ఏమిట్రా వెధవకానల్లారా అని డాన్స్ కాదు కదా... వెలుతురుండగా పెట్రొమాక్స్ లైట్లు వెలిగించటమెందుకు దండగ?' అని అవీ వెలిగించనీయలేదు తాతయ్య. ఇది చెపితే ఇంకేమన్నా ఉందా?

"ఐనా ముహూర్తం టైముకు ఉండకుండా బ్యూటీపార్లర్‌కు వెళ్ళటమేమిటి? మీ మమ్మీడాడీ కూడా లేరు." అన్నాడు కొద్దిగా ఇరిటేట్ అవుతూ.

"కూల్ సారూ, మాకు ముహూర్తం అంటే 'ఫేరే' అదేనోయ్ బుద్ధూ మీ సప్తపది. అది రాత్రి పదకొండుకు కదా. జయమాల అంటే వరపూజ. మీకు తెలుసేమో వివరంగా అడగలేదు అనుకున్నాము. మొత్తానికి ఆరాటం పెళ్ళికొడులా వచ్చేసావా?" పడీపడీ నవ్వుతూ అంది షీలా.

షీలా నవ్వు వినిపించకుండా కసిగా సెల్ అఫ్ చేసి,

‘వీళ్ళంతా బ్యూటీపార్లర్‌నుంచి ఎప్పుడొస్తారు? అప్పటి వరకూ అందరినీ ఎట్లా సంజాయించాలీ? ఇక ఆ సూయజ్ కాలువలో ఆసియా నుంచి యూరప్‌కు ఈదాల్సిందే! దేవుడా!’ జుట్టు పీక్కున్నాడు.

“రాజా కీ ఆయేగీ బరాత్ రంగేలీ హోగీ రాత్” బాండ్ మేళం వాళ్ళు వాయిస్తున్నారు.

‘వాయించండిరా వాయించండి! అందరూ నన్నే వాయించండి’ పళ్ళు నూరుకున్నాడు. ఇంతలో లోపలికి వచ్చిన కార్‌లోనుంచి దిగిన కల్నల్ గారు, ఆయన తమ్ముడినీ చూసి పళ్ళు నూరటం ఆపి, ఇహ జరగబోయే సీను ఎట్లా ఉంటుందో, ఎట్లా ఉన్నా చూడక తప్పదనుకుంటూ నీరసంగా వాళ్ళ వైపు నడిచాడు!

***

**(ఫిబ్రవరి 2021, హాస్యపు హరివిల్లు మాసపత్రిక)**

# 14. మౌనమే నీ భాష!

"అపూర్వా!" గట్టిగా విని పినిపించిన అత్తగారి పిలుపుకు, అత్తగారి కోసం టిఫిన్ ప్లేట్‌లో సర్దుతున్న అపూర్వ ఉలిక్కిపడింది. ఇప్పుడేగా స్నానం చేయించి, చీర కట్టి, జడేసి, కూర్చోబెట్టి టిఫిన్ తెద్దామని వంటింట్లోకి వచ్చింది! ఇంతలో ఏమి జరిగిందని గాభరా పడుతూ అత్తగారి దగ్గరకు హడావుడిగా వెళ్ళింది. సుభద్రమ్మ మంచం మీద దిండు, దాని మీది కవర్ తీసేసి ఓ పక్కకి పడి ఉంది.

"ఏంటండి?" అని అడిగింది.

"నా చంద్రహారం తీసావా?" గద్దించింది సుభద్రమ్మ కోడలిని.

"నేనెందుకు తీస్తాను? ఎక్కడ పెట్టారు మీరు?" అడిగింది.

"ఎక్కడ పెడతాను? ఎప్పటిలాగే రాత్రి దిండు కవర్‌లో పెట్టాను. ఇప్పుడు వేసుకుందామని చూస్తే లేదు. నువ్వు తప్ప ఈ గదిలోకి ఎవరూ రారు" అంది సుభద్రమ్మ.

ఆ హడావుడికి గదిలోకి వచ్చి "ఏమైందమ్మా?" అడిగాడు శేఖర్.

"నా చంద్రహారం కనిపించటం లేదు. రాత్రి పడుకునేటప్పుడు తీసి దిండు కవర్‌లో పెట్టాను. ఇప్పుడు పెట్టుకుందామంటే లేదు. ఇదో చూడు" అంటూ దిండును, కవర్‌ను విడిగా తీసి చూపించింది సుభద్రమ్మ కొడుకుకు.

"ఏమై ఉంటుంది?" అన్నాడు శేఖర్.

"ఏమౌతుంది? నీ పెళ్ళాం తీసి చెల్లెలికిచ్చింది" కసిగా అంది.

"అపూర్వ చెల్లెలికి ఇవ్వటం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శేఖర్.

"నన్ను బాత్ రూములో కూర్చోబెట్టి చెల్లెలు వచ్చిందని బయటకు వచ్చింది. అదేమో ఏవో డబ్బులు కావాలని ఏడవటము, ఇదేమో దాన్ని సముదాయించటము విన్నాను. నాకెట్లాగూ కనిపించదని నా దిండుకు కింద ఉన్న చంద్రహారం తీసిచ్చింది" అంది కోపంగా అపూర్వ వైపు చూస్తూ.

అత్తగారి అభియోగమూ, శేఖర్ ఆశ్చర్యమూ చూస్తూ నిశ్చేష్టురాలై, నోటమాట రాక నిలబడిపోయింది. మౌనంగా ఉన్న కోడలిని చూస్తూ "చూడు, నంగనాచిలా ఎట్లా చూస్తూ నిలబడ్డదో" అంది సుభద్రమ్మ. శేఖర్ మళ్ళీ దిండునూ, కవర్‌నూ దులిపి చూసాడు. ఎక్కడా లేదు.

"ఎందుకుంటుందిరా? అదెప్పుడో దాటిపోయింది. మీ నాన్న నాకు ప్రేమగా మా యాభయ్యావ పెళ్ళిరోజున చేయించారు. ఆ తరువాత దాటిపోయారు. ఆయన గుర్తుగా రోజూ వేసుకుంటూ, రాత్రిళ్ళు గుచ్చుకుంటోందని దిండు కవర్‌లో దాచుకుంటున్నాను. నాకు తెలుసు దీనికి పుట్టింటివాళ్ళ మీద ఉన్న ప్రేమ. ఇదివరకు కూడా ఇలాగే ఏవో ఒకటి దోచి పెడుతుండేది. ఇప్పుడు నా చంద్రహారానికి ఎసరు పెట్టింది" శోకాలు తీస్తూ పెద్దపెద్దగా అరవసాగింది సుభద్రమ్మ.

పుట్టింటికి సామాన్లు చేరవేస్తుందని సుభద్రమ్మ ఈ మధ్య అప్పుడప్పుడూ అంటూనే ఉంటుంది. కానీ దానికి అపూర్వ ఎప్పుడూ ఏమీ జవాబివ్వదు. ఇప్పుడు దీనికీ ఏమీ జవాబివ్వని భార్యను సూటిగా చూస్తూ, "మీ చెల్లెలు అపర్ణ వచ్చిందా? నిన్ను డబ్బు అడిగిందా? నువ్వు చంద్రహారం తీసిచ్చావా?" అడిగాడు.

"రాలేదు. పనమ్మాయి వచ్చి బయట నుంచే ఈ రోజు తన కూతురి స్కూల్ ఫీజ్ కట్టాలని, మనీ మీరిచ్చారని, ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళింది. అప్పుడు మీరూ ఉన్నారు. మీకు తెలీదా నేనెట్లాంటి దానినో" అంది ఏడుపు, అవమానం కలగలిసిన గొంతుతో అపూర్వ.

"తెలుసు. ఆ చంద్రహారం ఇక్కడే ఎక్కడో ఉంటుందనీ తెలుసు. నువ్వు పుట్టింటివాళ్ళకు ఏమీ చేరవేయటము లేదనీ తెలుసు. అయినా వాళ్ళకు ఇక్కడ నుంచి తీసుకెళ్ళాల్సిన ఖర్మ ఏముంది?" అన్నాడు.

"మరి మీకు తెలిసే అత్తయ్యగారు అన్ని మాటలు అంటుంటే ఊరుకున్నారా?" గొంతుపూడుకు పోతుండగా అంది అపూర్వ.

"నువ్వు ఇవ్వటం లేదని, అమ్మ అనవసరంగా నిన్ను అంటోందనీ తెలుసుగా, మరి నువ్వెందుకు మాట్లాడవు? మౌనంగా ఎందుకూరుకుంటున్నావు? నేనెందుకు నిన్ను సపోర్ట్ చేయాలి? ఎల్లకాలమూ నేనుంటానా నీతో? నీ సమాధానం నువ్వు చెప్పుకోవటం రాకపోతే ఎట్లా? అందుకే నేనేమీ మాట్లాడటం లేదు" అన్నాడు శేఖర్.

ఒక్క నిమిషం ఆగి చిన్నగా, "మామయ్యగారు పోయాక అత్తయ్యగారికి అభద్రతాభావం ఏర్పడింది. పైగా రోజంతా ఏమీ తోచక టీ.వీ లో పిచ్చి సీరియల్స్ అన్నీ చూస్తుంటారు. ఆ కష్టాలన్నీ తనకు ఆపాదించుకుంటున్నారు. వాటిల్లోలా నేను ఆవిడను ఏమైనా చేస్తానని ఊహించుకుంటున్నారు. అందుకే అప్పుడప్పుడు నేనిచ్చిన పాలు తాగాలనిపించటము లేదని మీకో, పిల్లలకో ఇచ్చి తాగమంటున్నారు. మీరు తాగి బాగున్నాక అమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇలా ఎందుకు మాట్లాడుతున్నారో తెలుసు కాబట్టి నేను వాదించటము లేదు. అన్నింటికీ మౌనమే మంత్రం అని మౌనంగా ఊరుకుంటున్నాను" అంటూనే బిత్తరపోయి ఈ మాటలన్నీ వింటున్న అత్తగారిని పక్కకు జరిపి,

దుప్పటి దులిపి, పరుపు పక్కకు జరిపింది. పరుపు కింద చంద్రహారం మిలమిలా మెరుస్తూ ఉంది!

"దిండు కింద పెడుతున్నా అనుకొని పరుపు కింద పెట్టారు" అంటూ చంద్రహారం తీసి, అత్తగారి చేతిలో పెడుతున్న అపూర్వకు ఎంత కాదనుకున్నా అత్తగారి అభియోగానికి కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అది చూసి, "ఇదో ఈ బేలతనమే వద్దనేది. నీకు నువ్వు గట్టిగా ఉండాలి. అన్నీ మౌనంగా భరించక్కరలేదు. మౌనం అన్నిటికీ సమాధానం కాదు" అన్నాడు శేఖర్ మృదువుగా.

'మౌనంగా ఉండవద్దు, మాట్లాడు. దేవుడు నోరిచ్చింది తినటానికే కాదు. మాట్లాడటానికి కూడా' అంటాడు శేఖర్. కానీ ఎవరితోనైనా ఏమని వాదిస్తుంది? ఎవరి వాదన వారిది. వాదనలతో ఎవరినీ నమ్మించలేదు. ఎవరి అభిప్రాయమూ మార్చలేదు. తను ఎంత చెప్పినా అత్తగారు వినేదా? ఎంత యాగీ చేసేది. 'ఎవరేమన్ననూ మారాడబోకు, మగడేమన్ననూ మాట్లాడబోకూ' అని అమ్మ చెప్పిన మాటలు పాటిస్తోంది తను. కాబట్టే ఎప్పుడూ ఎవరితో గొడవలు రాలేదు. కానీ శేఖర్ అన్నట్లు మౌనం అన్ని వేళలా మంచిది కాదు అన్న సందర్భాలు రాకపోలేదు. అయినా తనను తాను కంట్రోల్ చేసుకుంది. మరి తను చేసేది కరెక్టేనా? ఏమో కాలమే జవాబివ్వాలి అని రాయటము పూర్తిచేసి డైరీ మూసింది అపూర్వ.

***

**(తరుణి అంతర్జాల మహిళా మాసపత్రిక)**

# 15. సారీ, మర్చిపోయా!

పార్క్‌లో వాకింగ్ చేస్తున్న కళ్యాణ్ "అరే కల్యాణ్" అన్న పిలుపుకు వెనక్కి తిరిగి చూసాడు. మదన్ కళ్యాణ్‌ను సంభ్రమాశ్చర్యాలతో చూస్తున్నాడు. "హాయ్ మదన్, వాటే సర్‌ప్రైజ్? ఎప్పుడొచ్చావు?" అంటూ మదన్ పక్కనున్న జయంతిని చూస్తూ, "నువ్వూ వచ్చావా?" అని సంతోషంగా అడిగాడు.

"మా పెద్దనాన్న మనవడి పెళ్ళికి వచ్చాము. నువ్వీ ఊళ్ళో ఉన్నావని తెలియదు. ఈ మధ్య మనం కలవక చాలా ఏళ్ళయ్యింది కదా" అన్నాడు మదన్.

"వసంత ఎలా ఉంది?" అడిగింది జయంతి.

"ఈ పక్కనే మా ఇల్లు. రండి మిమ్మల్ని చూసి వసంత కూడా సంతోష పడుతుంది" అంటూ ముందుకు దారి తీసాడు కళ్యాణ్.

మదన్, కళ్యాణ్ ఉద్యోగంలో చేరిన కొత్తల్లో ఒకేచోట ఉండేవారు. అప్పుడే పెళ్ళిళ్ళు కూడా కావాటంతో ఇరు కుటుంబాలు ఒకటిగా కలిసిపోయి చాలా స్నేహంగా ఉండేవారు. రిటైరయ్యాక కలవటం తక్కువయ్యింది. ఆ సంగతులన్నీ మాట్లాడుకుంటూ కళ్యాణ్ ఇంటికి వచ్చారు. వీధి తలుపు తీసి ఉంది. హాల్‌లో టీ.వీ మోగుతోంది. వారిద్దరినీ కూర్చోమని "వసంతా!" అని పిలుస్తూ లోపలికి వచ్చిన కళ్యాణ్, మంచం మీద పడుకొని పైకి చూస్తున్న వసంతను ఆశ్చర్యంగా చూస్తూ "హాల్‌లో టీ.వీ పెట్టి ఇక్కడ ఇట్లా పడుకున్నావేమిటి?" అడిగాడు.

"టీ. వీ పెట్టానా? మర్చిపోయాను" అని లేచింది వసంత.

"మదన్, జయంతి వచ్చారు. రా" పిలిచాడు.

హాల్‌లోకి వచ్చిన వసంతను చూసి, "హాయ్ వసంతా" అంటూ దగ్గరకు వచ్చిన జయంతిని కొద్ది సేపు గుర్తుపట్టనట్లు చూసి, వెంటనే "హలో జయంతి" అని పలకరించింది వసంత.

"ఈరోజు వీళ్ళిద్దరూ ఇక్కడే ఉంటారు. వంట చేసేయి. భోజనం చేసి కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు కళ్యాణ్ ఉత్సాహంగా.

"ఇంట్లో బియ్యం అయిపోయాయి. అయ్యో మీకు చెప్పటం మర్చిపోయా... సారీ" అంది వసంత నొచ్చుకుంటూ.

"ఫరవాలేదు కళ్యాణ్. ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్ళి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తిందాం. పదండి" అన్నాడు మదన్.

పాత, కొత్త కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించారు. వసంత, జయంతి వాష్‌రూమ్‌కు వెళ్ళారు. వాళ్ళు వెళ్ళిన వైపు చూస్తూ, "వసంతకు ఈ మధ్య మతిమరుపు ఎక్కువయ్యింది. తన మతిమరుపుతో నాకు చిర్రెత్తుకొస్తోంది" అన్నాడు కళ్యాణ్.

"కొన్ని సార్లు అందరమూ అలాగే మర్చిపోతుంటాము. దానికి చికాకెందుకు?" అన్నాడు మదన్.

"మామూలు మతిమరుపు కాదు. నువ్వే చూసావుగా, టీ.వి పెట్టి చూడటం మర్చిపోయిందిట. లోపల పడుకుంది. మిమ్మల్నీ గుర్తు పట్టలేదు. మొన్న వంట చేయటానికి స్టవ్ వెలిగించి ఎందుకు వెలిగించిందో మర్చిపోయి బయటకు వచ్చి కూర్చుంది. పక్కింటి వాళ్ళు చూసి స్టవ్ ఆర్పేయలేదని చెప్పారు. ఉండుండి ఏదో ఆలోచనలో పడిపోతుంది. ఒకటా రెండా, ఎన్నని చెప్పను? ఏ పని చెప్పినా 'సారీ మర్చిపోయాను' అంటుంది. నాకు చిరాకు, కొన్ని సార్లు ఇదేమిటి అని డిప్రెషన్ వస్తుంది" అన్నాడు కళ్యాణ్.

"వసంతకు అరవై దాటాయి కదా. కొంత మందికి వయసు వల్ల ఇలా మతిమరుపు వస్తుంది. దిగులుపడకు" అన్నాడు మదన్.

"అంటే కొంపతీసి అల్జీమర్స్ కావచ్చంటావా? ఈ మధ్య ఒకావిడెవరో మా ఇంటికి వచ్చి, 'ఇది మా ఇల్లు. మీరెందుకున్నారిక్కడ?' అని గొడవ పడింది. ఎన్నిసార్లడిగినా ఆమె పేరు కూడా చెప్పలేకపోయింది. ఏమి చేయాలా అనుకుంటుంటే వాళ్ళ అబ్బాయి ఆమెను వెతుక్కుంటూ వచ్చి, ఆవిడకు మతిమరుపు వ్యాధి వచ్చిందని సారీ చెప్పి తీసుకెళ్ళాడు. అట్లా కాదుకదా!" అన్నాడు కళ్యాణ్ భయం భయంగా.

"అట్లా ఎందుకనుకుంటావు? ఈ మతిమరుపుకు చాలా కారణాలుంటాయి. ఈ మధ్య మా మామయ్య కొడుకుకు కూడా ఇలాగే మతిమరుపు వచ్చింది. డాక్టర్‌కు చూపించాము. కొంతమందికి వయసు వల్ల, లేదా కొన్ని హార్మోనల్ డిస్టర్బెన్స్ వల్ల, డైయాబిటిక్, హైబీపీ, కొన్ని విటమిన్స్ లోపం వల్ల, ఇంకేదైనా జబ్బు వల్ల కూడా రావచ్చుట. డాక్టర్ చెప్పాడు" అన్నాడు మదన్.

"మరి దేనితో వచ్చిందో, అసలు వసంతది అల్జీమర్సేనా? ఎట్లా తెలుస్తుంది?" అడిగాడు కళ్యాణ్.

"కొన్ని క్లినికల్ పరీక్షలు, MMSE పరీక్షలు చేసి వ్యాధి ఏ స్టేజ్‌లో ఉందో నిర్ధారిస్తారు. వ్యాధి ప్రారంభదశలోనే ఉంటే కౌన్సిలింగ్ చేస్తారు. అవసరమనుకుంటే మందులు ఇస్తారు. ఈ విషయాలన్నీ నేను మా కజిన్‌తో డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పుడు తెలిసాయి. నువ్వు చెప్పిన దాని బట్టి ప్రారంభదశలోనే ఉంది. నేనుకోవటము వసంతకు వయసుతో వచ్చిందే కావచ్చు. డాక్టర్‌కు చూపిద్దాము. తగ్గిపోతుంది. దిగులు పడకు" అనునయంగా అన్నాడు మదన్.

వసంత, జయంతి వాష్‌రూమ్‌నుంచి రావటంతో వారి సంభాషణను ఆపేసారు. బేరర్ బిల్ తెచ్చాడు. నేనిస్తానంటే నేనిస్తాని వాదించుకున్నాక, వాదనలో గెలిచిన కళ్యాణ్ పర్స్ తీసి చూసి, "వసంతా నిన్న నా క్రెడిట్ కార్డ్ తీసుకున్నావు. మళ్ళీ పర్స్‌లో పెట్టలేదా?" అడిగాడు.

"అయ్యో పెట్టలేదా? సారీ మర్చిపోయానండీ!"

***

# 16. అత్తకూ అల్లుని మురిపెం!

(ఉగాది సందర్భంగా మన కథలూ, మన భావాలు గ్రూప్‌లో, ఒక్క ఆంగ్ల పదమైనా లేకుండా, పూర్తి తెలుగు పదాలతో, 500 పదాలతో, ఉగాది పండుగ మీద కథ రాయమంటే నేను రాసిన కథ.)

***

అమ్మాయి పెళ్ళికాగానే, అమ్మాయి అల్లుడు అమెరికా వెళ్ళిపోయారు. ఈ మధ్యనే ఓ రెండు మాసాలు ఇక్కడి కార్యాలయంలో అల్లుడు భవతోష్‌కు పని ఉందని వచ్చారు. వాళ్ళు వచ్చిన వారానికే ఉగాది పండుగ వచ్చింది. అత్తవారింట్లో ఉన్నారు. ఏదో ఆషాడపట్టీ అని, పుట్టినరోజని, పెళ్ళిరోజని బట్టలు పంపటమేకాని పాపం అల్లుడికి ఏ ముచ్చటా అచ్చటా తీర్చలేదు అని అర్చన తెగ బాధపడి పోతుంటే అవినాశ్ పండగకు అల్లుడిని, అమ్మాయిని వియ్యాలవారినీ ఆహ్వానించాడు. కానీ వియ్యాలవారికి ఏదో పనుందని రాలేమన్నారు. కాస్త నిరాశ పడినా అర్చన మొదటిసారిగా పండుగకు వచ్చే అల్లుడి కోసం హడావిడిగా ఏర్పాట్లు చేయసాగింది. మంచి నువ్వుల నూనె, కుంకుడు కాయలు సిద్ధం చేసి, పనివాడు రామయ్యకు అల్లుడికి చక్కగా నూనె మర్దన చేసి తలంటాలి అని చెప్పి, "రాత్రే వచ్చేయండి ఎంచక్కా తలంట్ల కార్యక్రమం కూడా పెట్టుకోవచ్చు" అంది శైఫాలీతో.

"లేదులేమ్మా, భవ్‌కు రాత్రి కార్యాలయం పని ఉందిట. రేపు పొద్దున్నే వస్తాములే" అన్నది.

ఇంకేమి చేస్తుంది? ఓ నిట్టూర్పు విడిచి ఇల్లంతా కడిగి, ముగ్గులు పెట్టింది. పండుగ రోజు పొద్దున్నే మామిడాకులు కోసి గుమ్మాలకు కట్టి, ఓ రెండు మామిడికాయలూ, వేపపువ్వు మండలూ కోసుకొచ్చి పెట్టాడు

రామయ్య. 'హేమండీ... హేమండీ...' అని తెగ బతిమిలాడితే అవినాశ్ వేపపువ్వు చక్కగా మండల నుంచి వేరు చేసి, ఏరి పెట్టాడు. ఎంతైనా మా ఆయన బంగారం కదా! మురిసిపోయింది. భోజనాలయ్యాక అల్లుడి, అమ్మాయికీ పంచాగం చదివి వినిపిస్తానని ముచ్చటపడిపోయి అవినాశ్ పొద్దున్నే వెళ్ళి పంచాగం కొనుకొచ్చుకున్నాడు. పట్టుబట్టలు కట్టుకొని విభూది రాసుకొని సిద్ధంగా ఉన్నాడు అవినాశ్.

దోసకాయపప్పు, అమ్మాయికి ఇష్టమైన గుత్తివంకాయకూర, లేత మామిడికాయపచ్చడి, పొట్లకాయ పెరుగుపచ్చడి, గుమ్మడికాయ ముక్కలపులుసు, పులిహోర, పాయసం, భక్షాలు చేసింది అర్చన. అవినాశ్, తండ్రి కామేశ్వరరావు కలిసి పూజ చేసారు. ఇంతలోనే శైఫాలీ, భవతోష్ వచ్చారు. పట్టుచీర, ముఖాన బొట్టుతో శైఫాలీ, పట్టు పంచె, లాల్చీలో ఉన్న భవ్ ను చూడగానే "చక్కగా ఉన్నారే అమ్మలూ. మీ ఆయన కూడా పంచె కట్టుకున్నాడే" అని ముచ్చటపడిపోయింది బామ్మ కల్పవల్లి.

"మరి ఉగాది రోజు తెలుగులో మాట్లాడాలి. తెలుగు వారి కట్టూబొట్టూ ఉండాలని తాతయ్య నియమం పెట్టారు కదా! అందుకే నిన్న దుకాణం నుంచి కుట్టి ఉన్న ఈ పంచె కొనుక్కొచ్చాను" అంది శైఫీ.

"ఎంతైనా నా మనవరాలివి అనిపించావే. చక్కగా మీరు కూడా తెలుగు వారిలా పంచె కట్టుకొని రావటము మాకు చాలా సంతోషం బాబూ" అన్నాడు తాతయ్య కామేశ్వరరావు భవ్ వైపు చూస్తూ.

భవ్ గబగబా శైఫీ పక్కకు తీసుకెళ్ళి ఏదో గుసగుసగా అడిగాడు. అవినాశ్ ఉగాది పచ్చడి తీసుకొని అల్లుడి దగ్గరకు వచ్చాడు. అతను లేచి భక్తిగా చేయి పట్టాడు. అవినాశ్ అంతకన్నా భక్తిగా ఉగాది పచ్చడి కొద్దిగా వేసాడు.

శైఫీ ఆదుర్దాగా చూస్తోంది.

అల్లుడుగారు మరీ భక్తిగా కళ్ళకద్దుకొని నోట్లో పోసుకున్నాడు...

అంతే వాక్‌మంటూ నోటికి చేయి అడ్డం పెట్టుకొని కుళాయి దగ్గరకు పరిగెత్తాడు. భళక్ మని ఉమ్మేసి, శైఫీని పక్కకు తీసుకెళ్ళి ఏదో ఆక్రోశించాడు. అవును మరి అతనికి మన ఉగాది పచ్చడి గురించి తెలీదు ఎందుకంటే అతను ఒరియా అతను. ప్రేమ వివాహం!

కొద్దిసేపు నిశ్శబ్దం.

***

అందరూ  తేరుకొని భోజనాల బల్ల దగ్గర చేరారు. వేడి వేడి అన్నం, దోసకాయపప్పు  ప్రేమారా వడ్డించింది అల్లుడుగారికి అర్చన. ఆయనా ప్రసాదం చేదులో నుంచి తేరుకొని పప్పు అన్నంలో కలుపుకొని నోట్లో పెట్టుకున్నాడు.

ముద్ద నమిలి అందరి వైపు దీనంగా చూసాడు.

బిక్కమొహంతో గబగబా కుళాయి వైపు వెళ్ళి, నోరు శుభ్రంగా కడుక్కొని వచ్చాడు. 'మళ్ళీ ఏమొచ్చిందిరా దేవుడా?' అని అందరూ అలా చూస్తూ ఉండిపోయారు. శైఫీని పక్కకు తీసుకుపోయాడు.

"ఇదేమిటమ్మలూ? మిస్సమ్మ సినిమాలో రామారావులా నిన్ను పక్కకు తీసుకుపోయి మాట్లాడుతున్నాడు. అదేమిటో ఇక్కడే చెప్పవచ్చుగా" అన్నాడు కామేశ్వరరావు విస్తుపోతూ.

"తెలుగులోనే మాట్లాడాలని నియమం పెట్టావుగా తాతయ్యా. నీకు తెలుసుగా నా విభుడికి తెలుగు రాదని. నువ్వెక్కడ తిడుతావోనని పక్కకి

తీసుకుపోయి ఆంగ్లంలో ఏడ్చాడు. అమ్మా దోసకాయ పప్పు చేదు చూడకుండానే పప్పులో వేసావా? పప్పంతా చేదు విషంట" అంది శైఫీ రుసరుసలాడుతూ!

"నైవేద్యం పెట్టేవి ముందుగా రుచి చూడకూడదు కదా అందుకని చూడలేదు. సారీ బాబూ" నొచ్చుకుంది అర్చన.

ఆ తరువాత ఏ కూరైనా ఎవరో ఒకరు రుచి చూసాకే, అతను కంచంలో వేసుకొని భయంభయంగానే భోజనం ముగించాడు భవ్. ఆ తరువాత ఉగాది పండగలో తరువాతి కార్యక్రమం పంచాంగ శ్రవణం అని అవినాశ్ ఉషారుగా పంచాంగం తీయగానే వద్దు అన్నట్టు తలూపాడు భవ్.

"ఏదో పని ఉందిట ఇక పోయొస్తాము" అంది శైఫీ.

"అయ్యో అయ్యో అదేమి మాటే వెళ్ళి వస్తాము అను" అని కల్పవల్లి లబలబలాడుతుండగా...

"తాతగాడూ, బామ్మగాడూ పోయి సచ్చేదము" అన్నాడు భవతోష్ చాలా వినయంగా చేతులు జోడించి. బామ్మా, తాతయ్యా, అమ్మా, నాన్నా నిర్ఘాంతపోయారు ఆ వినయవిధేయతలకి!

***

# 17. అమ్మమ్మకు విడాకులు తప్పాయ్!!!

(ఫేస్‌బుక్‌లో సాహితీసమూహము 'మన కథలూ – మన భావాలు'లో ఇచ్చిన 'పల్లెకు పోదాం' అన్న చిత్రానికి నేను రాసిన కథ "అమ్మమ్మకు విడాకులు.")

***

తులసికోట దగ్గర పూజ ముగించి, లేత కనకాంబరం రంగులో ఉన్న నిత్యమల్లెపూలు పచ్చని తులసి ఆకుల మధ్య మెరిసిపోతుండగా, పసుపుకుంకుమలతో, కోటముందు ఉన్న ముగ్గుతో కళగా ఉన్న తులసమ్మను ఓసారి చూసి, నమస్కరించుకొని లేచింది సుభద్ర. కూరగాయల మొక్కలు, తీగలు, పెద్ద వేప చెట్టుతో పచ్చగా ఉన్న విశాలమైన పెరటిని కళ్ళ నిండుగా చూసుకుంటుండగా "సుభా" అని భర్త అర్జున్ పిలుపు బయట నుంచి వినిపించింది. వాకింగ్ నుంచి వచ్చిన అర్జున్‌కు మంచి నీళ్ళ గ్లాస్ ఇచ్చి, బ్రేక్‌ఫాస్ట్ రెడీ అని చెప్పింది. ఇప్పుడే వస్తా అని లోపలికి వెళ్ళాడు.

మూడు సంవత్సరాల క్రితం అర్జున్ ఉద్యోగం నుంచి రిటైరయినప్పుడే సుభద్ర కూడా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంది. కూతురు సుమకు ఇద్దరు పిల్లలు రాకేష్, రమ్య. ఈ మధ్యే అల్లుడికి యు.యస్ లో ప్రాజెక్ట్ వచ్చిందని, బిటెక్ చదువుతున్న రాకేష్ ను హాస్టలో ఉంచి రమ్యను తీసుకొని యు.యస్ వెళ్ళారు. సుమ తరువాత కొడుకు ప్రమోద్, కోడలు ప్రతిమ ముంబైలో సాఫ్ట్ వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నారు. వాళ్ళ పిల్లలు రిత్విక్, కావ్య హైస్కూల్ చదువులో ఉన్నారు. అర్జున్, సుభద్ర వాళ్ళ పల్లెటూరికి వచ్చి స్థిరపడ్డారు.

అర్జున్ ముత్తాత దాదాపు ఎనభై సంవత్సరాల క్రితం కట్టించిన పెద్ద

ఇల్లు వారిది. ఆ రోజులల్లో ఆయన ఐదురూపాయలకే కట్టించారట ఆ ఇల్లు. చుట్టూ విశాలమైన పెరడు, ఇంటి ముందు పెద్ద సింహద్వారము, ఎత్తైన అరుగులు, సింహద్వారము దాటి రాగానే ఎత్తైన మెట్లతో పెద్ద వరండా, లోపల విశాలమైన గదులతో రెండంతస్తుల ఇల్లు అది. అర్జున్ అక్కడికి రాగానే ఆ ఇంటిని, పిల్లలు వచ్చినా ఇబ్బంది పడకుండా అన్ని వసతులతో మార్పులు చేసాడు.

వేడి వేడి మిక్స్ వెజిటబుల్ పరోఠా, పంజాబీ అచార్ ప్లేట్‌లో వేసుకొని దిగులుగా కూర్చున్న సుభద్రను చూసి "ఎమిటీ అట్లా కూర్చున్నావు? తిను చల్లారిపోతాయి"అన్నాడు అర్జున్.

"రాకీకి ఈ పరోఠాలంటే చాలా ఇష్టం. పిచ్చి సన్నాసి హాస్టల్‌లో ఏమి తింటున్నాడో ఏమో! అసలికే కరోనా ఎక్కువ అవుతుతోందని ఇందాకే పేపర్‌లో చదివాను. పిల్లలు ఎట్లా ఉన్నారో" అంది దిగులుగా.

చేతిలో ఉన్న పరోఠా ముక్కను అట్లాగే పట్టుకొని , "ఆమధ్య మనము ఏదో సినిమా చూసాము దాని పేరేమిటి?"అడిగాడు.

'ఇదేమిటి అప్రస్తుత ప్రసంగం? ఇప్పుడీయనకు సినిమా ఎందుకు గుర్తొచ్చింది?' అని ఆశ్చర్యంగా అర్జున్ వైపు చూస్తూ, "ఏ సినిమా ?నాకు గుర్తు రావటం లేదు"అంది సుభద్ర.

"సరే సినిమా పేరెందుకు కాని, అందులో జయసుధ నీలాగే మాటిమాటికి 'పిల్లలూ పిల్లలూ' అంటుంటే ప్రకాశ్ రాజ్ పిల్లలను పిలిచి, 'ఎప్పుడూ మీమీదే ధ్యాస మీ అమ్మకు. మీతో తీసుకొని వెళ్ళండి. నేను విడాకులు ఇచ్చేస్తాను' అంటాడు. చూడు అట్లాగే నువ్వు ఈ రకంగా ఇరవైనాలుగు గంటలూ పిల్లలూ పిల్లలూ అంటూ ఉన్నావంటే నేను నీకు విడాకులిచ్చేస్తాను. హాయిగా వెళ్ళి నీ కొడుకు దగ్గర ఉండు. లేకపోతే

ఏమిటి? రోజూ కంచం ముందు కూర్చొని 'వాడికిది ఇష్టం, వీడికిదిష్టం' అంటావు. వాళ్ళేకేం దొబ్బుడాయ్ బాగానే వండుకొని తింటుంటారు. లేదా కొనుక్కొని తింటారు. వాళ్ళు దూరంగా ఉన్నారనీ బాధపడతావు. నీకు కూడా ఇష్టమయ్యేకదా పల్లెటూళ్ళో ఉందామని వచ్చాము. ఐనా సుభా, కాలమాన పరిస్థితులను బట్టి మనమూ మారాలి. మన పెద్దవాళ్ళు పల్లెటూరి నుంచి పట్నం వచ్చారు. మనము పట్నం నుంచి దేశమంతా తిరిగాము. మన పిల్లలు విదేశాలకు వెళుతున్నారు. వాళ్ళ పిల్లలు గ్రహాంతరం వెళ్ళవచ్చు. మరి ఉద్యోగావకాశాలు ఎక్కడుంటే అక్కడి వెళతారు. అన్నీ అలవాటుచేసుకోవాలి. సద్దుకుపోవాలి. అంతే గాని ఇట్లా దిగులుగా ఉన్నావంటే సీరియస్‌గా చెపుతున్నాను నీకు విడాకులిచ్చేస్తాను" అని తినటం ముగించి లేచాడు.

'బాబోయ్ ఓ చిన్నమాటకు ఎంత పెద్ద స్పీచ్ ఇచ్చారు. నోరు తెరవటం ఆలస్యం స్పీచ్ లే. ఇక జాగ్రత్తగా ఉండాలి' అని చిన్నగా గొణుక్కుంది.

సాయంకాలం పూల మొక్కలకు నీళ్ళు పెడుతూ నిండుగా పూసి ఉన్న చంబేలీ తీగను చూస్తూ, 'సుమకు పూలంటే, పూలజడ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సెలవల్లో ఇక్కడకు వచ్చినప్పుడుల్లా వాళ్ళ బామ్మతో ఏవేవో పూలు తెచ్చి పూలజడ వేయించుకునేది. చివరకు బఠాణీ పూలు కూడా వదిలేది కాదు. వాటితో కూడా జడకు గులాబి రంగు ముత్యాలు చుట్టినట్లు ఎంత అందంగా వేసేవారో అత్తయ్యగారు...' అని స్వగతం అనుకుంటూ 'బాబోయ్ అర్జున్ లేడు కదా' అని చుట్టూ చూసింది సుభద్ర. ప్రహారీ గోడకు అల్లుకొని ఉన్న, బఠాణీ, కాశీరత్నం తీగలను సరి చేస్తూ, ఆటో చప్పుడు వినిపిస్తే బయటకు చూసింది.

మొహానికి మాస్క్, తలకు టోపీ, కళ్ళకు నల్ల కళ్ళద్దాలు, భుజాన

క్యారీబాగ్‌లతో ఇద్దరు దిగి లోపలకు వచ్చారు. ఎవరా వీళ్ళు అని చూస్తుండగానే వాళ్ళ ముసుగులన్నీ ఒకటొకటిగా తొలగించారు. 'హోరినీ రాకీ నువ్వట్రా?' అంటూ చూస్తుంటే, రాకీ వెనక పాంట్, షర్ట్ , చిన్న పోనీటేల్, కళ్ళకు నల్లకళ్ళద్దాలతో ఎవరీ శాల్తీ? కొంపదీసి ఏ అమ్మాయినో అమ్మమ్మా మీరు మమ్మలిని ఆశీర్వదించాలి అని తీసుకురాలేదు కదా వీడు అని అనుమానంతో చూస్తూ దగ్గరకు వెళ్ళబోయింది.

"అమ్మమ్మా దూరం దూరం." అని వెనక్కి జరిగి "మాకు కరోనా అని కాలేజీలు మూసేసారు. హాస్టల్ కూడా మూస్తామన్నారు. అందుకని నీ దగ్గరకు వచ్చేసా. వీడు నా ఫ్రెండ్ సుభాష్ భట్టాచార్య. కొన్ని రోజులేకదా కలకత్తా ఏమి వెళతాడని వాడినీ తీసుకొచ్చేసాను" అన్నాడు నవ్వుతూ.

అమ్మయ్య భట్టిగాడన్నమాట, బతికించాడు లేకపోతే సుమతో ఏమి చెప్పాలా అని ఎంత హడిలిపోయిందో నిమిషం లోనే అనుకుంది. పిల్లలిద్దరికీ గదులు ఏర్పాటు చేసి, భోజనానికి రెడీ చేస్తుండగా "బామ్మా!" అని వినిపించింది. ఎవరా అని చూస్తుండగానే ప్రమోద్, ప్రతిమ, రిత్విక్, కావ్య లోపలికి వచ్చారు.సంతోషంగా పిల్లలను దగ్గరికి తీసుకోబోయింది సుభద్ర.

"నో బామ్మా. నో హగ్స్" అని దూరంగా జరిగారు.

తమ వెనకే ఇంట్లోకి వచ్చిన అర్జున్‌తో "డాడ్ కరోనా మూలంగా లాక్‌డౌన్ పెట్టారు. మాకు వర్క్ ఫ్రం హోమ్. పిల్లలకు ఆన్‌లైన్ క్లాస్‌లు. అందుకని అదైపోయే వరకు మీతో కలిసి ఉండవచ్చు అని ఇక్కడకు వచ్చాము" అన్నాడు ప్రమోద్.

వాళ్ళ మాటలు విని "హాయ్ మామా" అని లోపలి నుంచి వచ్చాడు

రాకీ.

"ఇక సంతోషమా? ఇంకేమి వండిపెడతావో పెట్టు వాళ్ళకు" అన్నాడు అర్జున్ నవ్వుతూ సుభద్రతో.

"ఇదిగో పిల్లలూ, ఇప్పుడే అందరికీ చెపుతున్నాను వినండి, అందరూ దూరం దూరంగా ఉండండి. మాట్లాడేటప్పుడు మాస్క్ లు పెట్టుకోండి. మనము బామ్మాతాతను ఇబ్బంది పెట్టకూడదు. వాళ్ళకు వైరస్ సోకకుండా జాగ్రత్తగా చూసుకోవాలి" అని జాగ్రత్తలు చెప్పాడు ప్రమోద్.

మరునాడు పొద్దున చాకలి వీరమ్మ "అమ్మా ఏదో జబ్బు వచ్చిందని అన్నీ మూసేస్తున్నారట కదా. పట్నంలో ఇంక ఎవరూ రావటం లేదని, ఈ గొడవైపోయేదాకా ఉంటానని వచ్చాడు మా అబ్బాయి రాజు. వాడి డ్రైక్లీనింగ్ దుకాణము మూసేసి పిల్లలతో వచ్చాడు. ఇంక అయ్యగారి ధోతులు, చొక్కాలు వాడే చక్కగా గంజి పెట్టి ఇస్త్రీ చేసిస్తాడు" అని సంబరంగా చెప్పి బట్టలు తీసుకెళ్ళింది.

పల్లెకి వచ్చినప్పటి నుంచి అర్జున్ పాంట్ షర్ట్ మానేసి ఖాదీ ధోవతి, ఖాదీ చొక్కాలు, కండువా వేసుకుంటున్నాడు. వీరమ్మ సరిగ్గా చేయటం లేదని అప్పుడప్పుడు విసుక్కుంటూ ఉంటాడు. "మీరు ధోతి కడితే కట్టారు నన్ను మటుకూ ఏడుగజాల చీర కాసపోసి కట్టుకోమనకండీ బాబు" అంటుంది సుభద్ర నవ్వుతూ.

వేపచెట్టుకింద చిన్న చిన్న టేబుల్స్ వేసుకొని, నులక మంచం మీదా, తులసికోట దగ్గరా ఎవరికి వారు తలో లాప్‌టాప్ పట్టుకొని కూర్చుని పని చేసుకుంటున్న పిల్లలను చూస్తే ముచ్చటగా అనిపించింది. వాళ్ళకు అరటి ఆకులల్లో టిఫిన్ పెట్టి ఇచ్చింది.

"వావ్ ఆసమ్ గ్రానీ"అని ఆనందపడిపోయాడు భట్టి.

అందరిళ్ళ ముందు కొంతమంది లాప్‌టాప్‌తో అరుగు మీద కూర్చొని పని చేసుకుంటూ, కొంత మంది చెవిలో స్పీకర్ పెట్టుకొని, చేతిలో సెల్‌తో అటూ ఇటూ తిరుగుతూ హాయ్ ఆంటీ అని పలకరిస్తున్న పిల్లలకు హాయ్ చెపుతూ "మొన్నటి వరకూ వృద్ధాశ్రమంలా ఈసురోమంటూ ఉన్న ఊరు ఇప్పుడు పిల్లలతో కరోనా పుణ్యమాని కళకళలాడుతోంది. కాని ఆ శోభ ఎన్ని రోజులో" అనుకుంటున్న సుభద్రకు,"మరి వాళ్ళు ఉద్యోగాలు చేసుకోవద్దా? వాళ్ళ పిల్లలు మంచి చదువులు చదువుకోవద్దా? ఇప్పటికైతే సంతోషపడు."అని అర్జున్ చెపుతున్నట్లుగా అనిపించి నవ్వుకుంటూ గుడికెళ్ళింది సుభద్ర.

గుడిలో పరమేశ్వరుని దర్శించుకొని, తీర్థం తీసుకొని వస్తూ దేవాలయ ప్రాంగణంలో ఉన్న బిల్వవృక్షం కిందున్న తిన్నె మీద కూర్చొని లాప్‌టాప్‌లో పని చేసుకుంటున్న అబ్బాయిని ఎవరా అన్నట్లు చూసింది. వెనకే వస్తున్న పూజారిగారు, "మా మనవడండి. నిన్ననే వచ్చాడు. వాడు వచ్చినప్పటి నుంచి వాడిని దగ్గరకు తీసుకుందామని ఆరాట పడిపోతోంది వాళ్ళ బామ్మ. వాడేమో దూరం అంటూ ఇక్కడ కూర్చొని పని చేసుకుంటున్నాడు" అన్నారు.

"అంతేనండి. ఈ కరోనా కూడా మంచికే వచ్చింది లెండి" అని బయటకు వస్తూ, 'నాదీ ఇదే బాధ. మనవళ్ళనూ ఒక్కసారైనా హగ్ చేద్దామని, ముద్దు పెట్టుకుందామని దగ్గరకు వెళ్ళితే చాలు 'దూరం దూరం' అంటూ మాయాశశిరేఖ రేలంగితో అన్నట్లు దూరంగా పారిపోతారు' అనుకొని నిట్టూర్చుకుంటూ ఉంటే "ఇన్ని రోజులూ పిల్లలు దగ్గరలేరే అని బాధ పడ్డావు. ఇప్పుడేమో హగ్ చేయలేదే, ముద్దు పెట్టుకోలేదే అని బాధ పడుతున్నావు. పిల్లలు వచ్చారని సంతోషించు"

అని పక్క నుంచి అర్జున్ మందలించాడు.

"మహాప్రభో నా ఆలోచనలలోకి కూడా వచ్చి స్పీచ్ ఇచ్చేస్తే ఎట్లా సార్! అట్లాగే అనుకుంటాలెండి." తన ఏమండీ ఎప్పుడూ తన మనసులో, తనలో, నీడలా, తన వెనకే ఉండి చూసుకుంటూ ఉంటాడు అని అని మురిపెంగా అనుకొంది.

"తాతా జుట్టు బాగా పెరిగింది. ఎట్లా?" అన్నారు మనవళ్ళు తాతతో.

"మన శేఖర్ ఉన్నాడుగా. ఇంటికి వచ్చి చేస్తాడు. భయపడకండి ఎవరి కటింగ్ కిట్ వాళ్ళదే. ఎట్లా చేస్తాడా అనుకోకండి అతనికి పట్నం లో పెద్దది హేర్ కట్టింగ్ సెలూన్ ఉంది. ఇప్పుడు అక్కడ ఏమీ పని ఉండటం లేదని ఊరికి వచ్చాడు. బాగా చేస్తాడు. మా శెట్టిగారు ఆ కిట్‌లు బోలెడు పెట్టాడు ఆయన దుకాణంలో" అన్నాడు అర్జున్.

"ముందు ఆ జుట్టు పోలిగాడు భట్టీకి చేయించండి. వాడి పోనీటేల్ చూడలేక చస్తున్నాను" అంది సుభద్ర.

శేఖర్ వచ్చి పెరట్లో చెట్టుకింద కుర్చీవేసి ఒక్కొరికి ఎవరికి వారిదే కిట్ పెట్టి నాజూకుగా కట్ చేసాడు. కట్టింగ్ అయ్యాక ఎవరి కిట్ వాళ్ళకు శుభ్రంగా కడిగి, శానిటైజ్ చేసి ఇచ్చాడు. భలే భలే పిల్లలు సరదా పడిపోయారు.

"వావ్ గ్రాండ్‌పా" మరీ సంతోషపడిపోయాడు భట్టిగాడు. వీడికన్నీ ఆసమ్‌లే!

నెల అనుకున్నది అదో ఇదో అని ఐదునెలలు గడిచినా కరోనా పరిస్థితి అట్లాగే ఉంది. తనను తాను శుభ్రపరుచుకుంటున్నట్లుంది

ప్రకృతి. అందుకేనేమో ఈ సంవత్సరము వరుణుడూ సంతోషంగా వాగులూ, కుంటలూ అన్నీ నింపేస్తున్నాడు. వలస కూలీలందరూ పనిలోకి దిగారు. పొలాలన్నీ పచ్చబడ్డాయి. ఊరంతా పచ్చదనంతో , ఇళ్ళన్నీ పిల్లలతో కళకళలాడిపోతున్నాయి.

రాత్రి భోజనాలయ్యాక వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు అర్జున్, సుభద్ర. “అమ్మా కాఫీ ఇస్తావా?” అని వచ్చాడు ప్రమోద్.

లేవబోతున్న సుభద్రతో, “మీరు కూర్చోండి ఆంటీ, నేను తెస్తాను” అంది ప్రతిమ.

“మాకు ఐస్ క్రీం కావాలి అంటూ” వచ్చారు పిల్లలు.

సన్నగా పడుతున్న చినుకుల్లో, వీధి దీపాల వెలుగు పడి, వాక్స్ పూసినట్లుగా అన్ని మొక్కల ఆకులు మెరిసిపోతున్నాయి. పూల సువాసనలు తేలి వస్తున్నాయి. ఆహ్లాదకరంగా ఉన్న ఆ వాతావరణములో పిల్లలతో కలిసి, ఆ వరండాలో కూర్చొని, కోడలిచ్చిన వేడి కాఫీ తాగుతూ, “ఇంతకంటే జీవితము లో కోరుకునేదేముంది? ఎప్పటికీ ఇట్లా ఉంటే ఎంత బాగుంటుంది?” తన్మయంగా అంది సుభద్ర. వెంటనే అర్జున్ వైపు చూసి “మీరిప్పుడు స్పీచ్ ఇవ్వకండి ప్లీజ్” అంది నవ్వుతూ.

“నువ్విట్లా అంటున్నావు కాని అమ్మా, ఇన్నేసి నెలలు బయటకు వెళ్ళకుండా ఇంట్లో ఉంటున్న దంపతుల మధ్య గొడవలవుతున్నాయట. విడాకుల కేసులు ఎక్కువ అవుతున్నాయట” అన్నాడు ప్రమోద్.

“అదేమో కాని మామయ్యా! అమ్మమ్మ విడాకులైతే తప్పి పోయాయి” అన్నాడు రాకీ వాళ్ళంతా వచ్చిన కొత్తల్లో “మీరంతా రాకపోయున్నట్లైతే మీ అమ్మకు విడాకులిచ్చి మీదగ్గరకు పంపేవాడిని” అని తాత అన్న

మాటలు తలుచుకొని.

అందరూ ఒక్కసారే పెద్దగా నవ్విన నవ్వులు పువ్వులై వానజల్లులలో చిరుజల్లులయ్యాయి.

అమ్మయ్య, మొత్తానికి అమ్మమ్మకు విడాకులు తప్పాయి.

***

# 18. నీయెంటే నేనుంటా

(ఫేస్‌బుక్ 'మన కథలు - మన భావాలు' సాహితీసమూహములో ఇచ్చిన చిత్రానికి రాసిన ఈ కథ తరుణి అంతర్జాల పత్రికలో ప్రచురించబడినది.)

***

మొహానికి అంటుకున్న చెమటను చీరకొంగుతో తుడుచుకుంటూ వచ్చి చెట్టు కింద నిలబడి చుట్టూ చూసింది గౌరి. సూర్యుడు పడమటిదిక్కులకు పయనిస్తున్నాడు. ఎరుపు పసుపు కలిసిన ఆరెంజ్ రంగులో మెరిసిపోతున్నాడు. లేత ఆరెంజ్ రంగులో పరుచుకున్న సూర్యకిరణాలతో ఆకాశం ఆరెంజ్, నీలి రంగులలో మనోహరంగా ఉంది. చిరువేడి గాలులు వీస్తున్నాయి. పక్షులు చిన్నగా చప్పుడు చేసుకుంటూ గూళ్ళకు చేరే ప్రయత్నంలో ఉన్నాయి. సంధ్య అందాన్ని పరవశంగా చూస్తూ పొలం వైపు చూసింది. పొలంలో నిలిచి ఉన్న నీటిని కాలవలోకి మళ్ళిస్తూ పక్కనున్న రైతుతో మాట్లాడుతున్నాడు మహేష్. పైకి ఎగదోపి కట్టిన పంచె, తలకు కట్టుకున్న చిన్న రుమాలుతో గమ్మత్తుగా కనిపించాడు. చుట్టుపక్కల ఉన్న పొలాల్లో వీళ్ళ వయసు వాళ్ళే కొంతమంది యువతీయువకులున్నారు. అందరినీ చూస్తుంటే గౌరి మనసు సంవత్సరకాలం వెనక్కు జారుకుంది.

ఒక పేరు ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో, ఒకే టీములో పనిచేస్తున్నారు గౌరి, మహేష్. ఆ టీములో ఉన్న పదిమంది అమ్మాయిలూ అబ్బాయిలూ అందరూ స్నేహంగా కలిసిమెలిసి వర్క్ చేసుకుంటూ, వారాంతంలో ఏదైనా మల్టిప్లెక్స్‌లోనో మరోచోటో ఎంజాయ్ చేస్తుంటారు. అలా ఒక వారాంతంలో అందరూ కలిసి కాఫీ షాప్‌లో ఉండగా "రోజూ పేపర్లో, వార్తలల్లో రైతుల ఆత్మహత్యల గురించి ప్రతిరోజూ పేపర్లలో

వర్షాభావంతోనో, ఆర్థికమైన ఇబ్బందులతోనో ఏదో ఒక కారణముతో రైతులు దయనీయమైన పరిస్థితిలో, ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లుగా చదువుతున్నాము. అందరికీ మనము సహాయపడలేకపోవచ్చు కానీ కొంత మందికైనా మనము సహాయము చేయవచ్చుకదా అని ఈ రోజు పేపర్‌లో ఒక రైతు గురించి చదివితే అనిపించింది” అన్నాడు మహేష్.

“అలాగే చేద్దాము. తలా కొంత మనీ వేసుకొని ఏ పేద రైతుకైనా ఇద్దాము” అన్నాడు శ్రవణ్.

“అలా కాదు. మనం ప్రతి వీకెండ్ ఇలా హోటల్స్‌కు, సినిమాలకూ తిరుగుతూ మనీ, టైం రెండూ వేస్ట్ చేస్తున్నాము. అలా కాకుండా దగ్గరలో ఉన్న పల్లెటూరికి వెళ్ళి, అక్కడి రైతుల పొలంలో పని చేద్దాము. మనకు కూడా వ్యవసాయంలో ఉన్న ఇబ్బందులు తెలుస్తాయి. మనము ప్రత్యక్షంగా చేస్తుంటే ఎవరికే అవసరమో మనకు తెలుస్తుంది. ఎవరికి ఏది అవసరమో అది తెలుసుకొని, ఒకవేళ పంటలు సాగుచేసేందుకు ఏదైనా అవసరమవుతే ఇక్కడ నిపుణులను సంప్రదించి రైతులకు కావలసిన సలహాలు ఇద్దాము. ధనసహాయము అవసరమవుతే మనంతా నువ్వన్నట్లుగా తలాకాస్త వేసుకొని ధనసహాయము చేద్దాము” అన్నాడు మహేష్.

కొంత తర్జనభర్జనల తరువాత ప్రతి వారమూ కాకుండా రెండవ, నాలుగవ శని ఆదివారాలల్లో వెళ్ళేట్టుగా అనుకున్నారు. ఆ విధంగానే దగ్గరగా ఉన్న ఒక పల్లెటూరిని ఎన్నుకొని, అక్కడి పేద రైతుల పొలంలో, రైతులతో పాటుగా పని చేసేందుకు వారిని ఒప్పించారు. అప్పటి నుంచి రెండవ, నాలుగవ శని ఆదివారాలల్లో అక్కడికి వచ్చి పొలంపనులు చేస్తూ రైతులకు సహాయంగా ఉంటున్నారు. ఆర్థికంగా కూడా సహాయపడుతున్నారు. ఊరివాళ్ళు కూడా వీళ్ళను చూసి ముచ్చటపడి

వీరిని ఆదరిస్తున్నారు.

నిన్న, మరునాటి ప్రోగ్రాం గురించి ప్లాన్ చేసుకుంటున్నప్పుడు ఉన్నట్టుండి "రేపు అందరమూ సరదాగా పంచె కట్టుకొని వెళదాము. అమ్మాయిలేమో చక్కగా చీరలు కట్టుకొని పల్లెటూరి అమ్మాయిల్లా తయారవండి" అన్నాడు మహేష్.

'ఇక్కడ నుంచి పంచె కట్టుకొని ఎట్లా వెళదాము?' అంటే 'అక్కడి కెళ్ళి మార్చుకుందాము' అన్నాడు. సరే ఇదీ సరదాగా బాగానే ఉంది అనుకున్నారు అందరూ. అలాగే ఇక్కడికి రాగానే అబ్బాయిలు షార్ట్స్‌నుంచి పంచెల్లోకి మారిపోయారు. అమ్మాయిలు చక్కగా చీర కట్టుకొని తయారయ్యారు. ఆలోచనల నుంచి బయటపడి మహేష్ వైపు చూసింది గౌరి. పొలంలో పనైపోయినట్లుంది రైతుతో కలిసి వస్తున్నాడు మహేష్. మహేష్ అంటే తనకున్న ప్రేమను, అతనితో జీవితాన్ని పంచుకోవాలన్న కోరికను అతనితో చెప్పాలని ఉన్నా చెప్పలేకపోతోంది. మహేష్‌కు తనంటే ప్రేమ ఉన్నట్లుగా అతని కనులు చెపుతున్నాయి కాని మరి ఎందుకు తనతో చెప్పలేకపోతున్నాడో తెలీటం లేదు. అతనికి తనంటే ప్రేమ ఉందా లేక తనూహించుకుంటోందా? ఆలోచనలో ఉన్న గౌరి, మహేష్ తన దగ్గరగా వచ్చి నిలబడగానే తత్తరపాటుగా చూసింది.

ఆకుపచ్చని చీర, ఎర్రని జాకెట్, వాలుజడ, నుదుటన గుండ్రని బొట్టు, మెడలో పూసలపేరుతో అచ్చమైన పల్లెపడుచులా ఉన్న గౌరిని మురిపెంగా చూస్తూ, చేతిలో ఉన్న ముద్దమందారాన్ని గౌరి జడలో పెట్టి, ప్రేమగా గౌరి చెంపలను పట్టుకొని తనవైపు తిప్పుకుంటూ, "నన్ను మనువాడుతావా గౌరమ్మా?" అని అడిగాడు. అప్పటి వరకూ అవే తలపులలో ఉన్న గౌరి సిగ్గుతో ముద్దమందారంలా ముడుచుకుంది.

'హే హే హేయ్!' అని అరుస్తూ స్నేహితులంతా చప్పట్లు కొడుతూ

చుట్టూ చేరారు. రైతులందరూ సంతోషంగా వారితో చేరారు.

"ఆకాశంలోనో, సముద్రం అడుగునో ప్రపోజ్ చేయలేను. పచ్చనైన చెట్లు, నీలి ఆకాశం, ఈ కమ్మనైన మట్టిసువాసనలు, అందమైన ఈ ప్రకృతి మధ్య సూర్యభగవానుని సాక్షిగా ప్రపోజ్ చేస్తున్నాను. ఇలా ప్రపోజ్ చేద్దామనే ఈ డ్రస్‌లో వద్దామన్నాను. ఇదిగో గౌరమ్మా ఇప్పుడే చెపుతున్నాను నేను ఇలా పల్లెటూరి రైతులా కూడా అవతారం ఎత్తుతుంటాను. అమెరికా ఆస్ట్రేలియా ఎక్కడికీ పోను. మరి ఆలోచించుకొని చెప్పు" అన్నాడు మహేష్.

"నీయెంటే ఉంటాను మహేష్ మావా

నీ బాటే నాదీ మహేష్ మావా" అంటూ మహేష్ చేయి అందుకుంది గౌరి.

***

**(తరుణి అంతర్జాల పత్రిక)**

# 19. పంచవటి

(ఫేస్‌బుక్ 'పొన్నాడవారి పున్నాగవనం' సాహితీ సమూహములో 'వృద్ధాప్యం' అనే పదానికి రాసిన చిట్టి కథ 'పంచవటి'.)

***

శాంతి వరండాలో స్తంభానికి ఆనుకొని కూర్చొని, మాఘ చంద్రుని చూస్తోందన్నమాటే కాని ఆలోచనలు ఎక్కడెక్కడికో పోతున్నాయి. మనసు అల్లకల్లోలంగా ఉంది. ప్రశాంత్ దగ్గరకు వెళ్ళిపోయింది. తను ప్రశాంత్‌ను చూసిన మొదటి రోజు గుర్తొచ్చింది.

అంతకు పది రోజుల ముందే శివరావు మామయ్యగారు ఎవరో ఆయన స్నేహితులను తీసుకొచ్చారు. ఒక పెద్దాయన, పెద్దావిడా అత్తయ్య మామయ్య వచ్చారు. ఆ పెద్దాయన తనను ఏవేవో ప్రశ్నలు అడిగారు, న్యూస్‌పేపర్ చదవమన్నారు. గోడకు నిలబెట్టి తన పొడవు ఎంత ఉందో కొలిచారు. ఇంగ్లీష్ న్యూస్‌పేపర్ చదవమన్నారు. ఆయన అవన్నీ ఎందుకు చేయమన్నారో తెలీకపోయినా పెద్దవారు చెప్పినట్లు వినాలి కదా అని ఆయన చెప్పినవన్నీ బుద్ధిగా చేసింది. ఆ పెద్దావిడ వెళుతూ తనకు బొట్టు పెట్టి, చిట్టి చామంతిపూల పెద్ద దండ, కొన్ని పండ్లు తనచేతిలో పెట్టి వెళ్ళింది. ఆ తరువాత అమ్మ చెప్పింది, వాళ్ళు వాళ్ళ అబ్బాయి కోసం తనను చూసేందుకు వచ్చారని, అనుకోకుండా శివరావు మామయ్యగారు ఈ సంబంధం చెప్పారని, హడావుడిగా ఈ పెళ్ళిచూపులు ఏర్పాటు చేసామని, తనకు ముందు చెపితే భయపడుతుందని చెప్పలేదని. 'ఓహో! ఐతే తనకు పెళ్ళిచూపులయ్యాయన్న మాట' అనుకుంది. ఆ తరువాత ఈ రోజు వాళ్ళ అబ్బాయిని తీసుకొని వస్తున్నామని వాళ్ళు కబురు చేసారట. అతని పేరు ప్రశాంత్‌ట. సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగమట. అమ్మ చెపుతుంటే వినీ విననట్లు వింది తను.

పెళ్ళి చూపులలో అతనిని చూడాలంటేనే భయం వేసింది. కాని ఎలాగో ఓరగా చూసింది. తననే చూస్తున్న ఆ అబ్బాయిని చూడగానే తల దించేసుకుంది. ఇద్దరూ ఒకరికొకరు నచ్చటమూ, అన్ని కుదరటముతో పది రోజులల్లోనే పెళ్ళైపోయింది. చిట్టి పొట్టి అలకలు, కోపాలూ, అచ్చట్లూ, ముచ్చట్లతో సంసారం హాయిగా సాగిపోతోంది. ఉద్యోగం చేస్తుండగానే ఊరి చివర వాళ్ళ ఆఫీస్ వాళ్ళు కొంత మంది కలిసి పెద్ద స్థలం కొనుక్కున్నారు. అందులో ఆరువందల గజాల చొప్పున చిన్న చిన్న ప్లాట్‌లా చేసి తీసుకున్నారు. రిటైరయి వచ్చాక ఇక్కడ తనకు మొక్కలంటే ఉన్న ప్రేమతో చుట్టూ స్థలం వదిలేసి మధ్యలో నాలుగు బెడ్‌రూంలు, వంటిల్లు హాల్‌తో విశాలంగా ఇల్లు కట్టుకున్నారు. తనకు కృష్ణుడంటే ఉన్న ఇష్టంతో మగపిల్లలు నలుగురికీ కేశవ, మాధవ, అచ్యుత, మురారి అని, ఆడపిల్లకు సుభద్ర అని పేర్లు పెట్టుకుంది. 'ఈ కాలంలో ఐదుగురు పిల్లలా?' అంటారు అందరూ. కాని మొదటి సారి కేశవ, మాధవ కవలలు పుట్టారు. ఇద్దరు చాలనుకున్నారు కాని ఆడపిల్ల కావాలన్న తన కోరికతో రెండోసారి ప్రయత్నిస్తే మళ్ళీ కవలలే అచ్యుత్, మురారి వచ్చేసారు. అప్పుడు ఆపరేషన్ చేయించుకునేందుకు తన ఆరోగ్యం సహకరించలేదు. ఇదో అదో అనుకుంటూ ప్రశాంత్ కూ వీలు పడలేదు. ఇంకేముంది, బంగారు తల్లి వచ్చేసింది.

ప్రశాంత్‌కు తనంటే వల్లమాలిన ప్రేమ. తనొక చిన్నపిల్లలా చూసుకునేవాడు. తన ఇష్టాలకు, అభిరుచులకు చేయూత నిచ్చేవాడు. ఎక్కడెక్కడి నుంచో తన కిష్టమైన మొక్కలు తెచ్చి నాటాడు. తోటంతా పూల సువాసనలు వెదజల్లుతుంటే, ఆ ఆహ్లాదకర వాతావరణములో బయట మొక్కల దగ్గర పడక కుర్చీలు వేసుకొని కూర్చొని, వెన్నెల్లో ఎన్ని ఊసులు చెప్పుకునేవారు! ఆ మూలనున్న బాదం చెట్టు కింద నులక మంచం వేసుకొని పడుకొని మధ్యాహ్నం నవల చదువుకుంటుంటే ఎంత

బాగుంటుంది అని తననగానే ఎక్కడో నులక మంచం సంపాదించాడు. అదో అక్కడ ఆ పారిజాతం మొక్కను నాటి, అది పెద్దదయ్యాక దాని కింద, రాధాకృష్ణులు, గోమాత ఉన్న విగ్రహం పెట్టించాడు. పొద్దున్నే ఆ ప్రేమికుల మీద పారిజాతాలు నక్షత్రాల్లా రాలి ఉంటే చూసేందుకు ఎంత అపురూపంగా ఉంటుంది! లేచి పారిజాతం కింద ఉన్న రాధాకృష్ణులను చూస్తూ నిలబడింది.

"అమ్మా, ఈ చీకట్లో ఏమి చేస్తున్నావు? లోపలికి రా" అన్న మాధవుడి పిలుపు విని తడిగా ఉన్న కళ్ళు తుడుచుకొని, "వస్తున్నా పద" అని అతనితో లోపలికి వెళ్ళింది.

హాల్‌లో నలుగురు అన్నదమ్ములూ కూర్చొని ఉన్నారు. "అమ్మా ఇటురా" అని కేశవుడు తన పక్కన కూర్చోమన్నట్లు చేయి చూపించాడు. వెళ్ళి కూర్చుంది శాంతి.

"అమ్మా రేపు నీ పుట్టినరోజుకు మేమొక సర్ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వబోతున్నాము" అన్నాడు మురారి ఊరిస్తున్నట్లుగా.

నిరాసక్తిగా పిల్లలవైపు చూసి, కాసేపు కూర్చొని, తన బెడ్‌రూం లోకి వెళ్ళి పడుకుంది. మూసుకున్న కనులలోనుంచి నీరు కారిపోతోంది. రేపు తన పుట్టిన రోజా? తనకసలు గుర్తులేదు. అప్పుడే అకస్మాత్తుగా ప్రశాంత్ తనను వదిలివెళ్ళిపోయి ఐదు సంవత్సరాలైపోయింది. భౌతికంగా తన నుంచి వెళ్ళిపోయాడేమో కాని తను మాత్రం ప్రశాంత్ ను వదలలేదు. తన మనసులో, తన ఆత్మలో అతనినే ప్రతిష్ఠించుకొని, సదా అతని తలపులలోనే ఉంటోంది. ప్రశాంత్ తో గడిపిన జ్ఞాపకాలల్లో బతుకుతోంది. తమిద్దరి ఆశలతో కట్టుకున్న ఈ ఇంటిని వదలలేక పిల్లలు వచ్చి ఎన్ని సార్లు వాళ్ళ దగ్గర ఉండమని పిలిచినా వెళ్ళలేదు. ఐదుగురూ మంచి ఉద్యోగాలు చేసి, తలో మూల పెద్ద పెద్ద విల్లాలు కొనుక్కొని

ఉంటున్నారు. వాళ్ళ పిల్లలు యు.యస్‌లో ఉంటే అప్పుడప్పుడు వెళ్ళి వస్తున్నారే కాని ఇక్కడే సెటిల్ అయ్యారు. ఈ మధ్య తనకే ఆరోగ్యం అంత బాగాలేదు. వయసుతో, ప్రశాంత్ మీది దిగులుతో వృద్ధాప్యం వచ్చేసింది. పనివాళ్ళను పెట్టుకొని ఉంటోంది కాని, ఈ ఇంట్లో ప్రశాంత్ జ్ఞాపకాలను వదిలి వెళ్ళాలని లేదు. సర్ప్రైజ్ గిఫ్ట్ అట ఏముంటుంది?

నాలుగు రోజుల నుంచి కొడుకులు నలుగురూ ఇక్కడే ఉన్నారు. వాళ్ళల్లో వాళ్ళు ఏదో సంప్రదించుకుంటున్నారు. బయట వాళ్ళెవరో వచ్చి ఇల్లంతా కొలుచుకొని వెళ్ళారు. తనకు అర్థం అవుతూనే ఉంది, ఈ ఇల్లు పడగొట్టించి ఫ్లాట్స్ కట్టిస్తారేమో. అంత కంటే ఇంకేముంటుంది. ఇప్పుడు ఇక తనేమీ చేయలేదు. ఒంట్లో శక్తి లేదు. ఒంటరిగా ఉండే ధైర్యం లేదు. 'పంచవటి' అని మురిపెంగా పేరుపెట్టుకున్న తన పంచవటి కూలిపోతోందా? తనూ ప్రశాంత్ తో పాటు ఎందుకు పోలేదు? ఇంకా ఇన్ని సంవత్సరాలు ఎట్లా బతికి ఉంది? పంచవటినీ, ప్రశాంత్ నూ వదలక తప్పదా? కళ్ళల్లో నుంచి నీరు ఊరిపోతోంది.

"అమ్మా హాపీ బర్త్ డే!" అంటూ ఉదయమే ఐదుగురు పిల్లలూ వచ్చి లేపారు శాంతిని. చిన్నగా లేచి, వాళ్ళ అభినందనలను స్వీకరించి హాల్‌లోకి వచ్చింది.

"అమ్మా ఈ ప్లాన్ చూడు." అంది సుభద్ర.

అయిపోయింది... అంతా తను అనుకుంటున్నట్లే జరుగుతోంది అని దిగులుగా ఆ ప్లాన్ ప్రింట్‌ను చేతిలోకి తీసుకుంది.

"అమ్మ గ్రౌండ్‌ఫ్లోర్‌లో నీతో పాటే నేను" అన్నాడు కేశవ.

"అన్న పైన నేను" అన్నాడు మాధవ.

"మనందరి నెత్తిన ఇదో ఈ రాక్షసి" అన్నాడు మురారి సుభద్ర నెత్తిన మురిపెంగా తడుతూ.

"ఇదేమిటీ? మీరేమంటున్నారు?" అంది అయోమయంగా శాంతి.

"ఏమీలేదమ్మా. మన ఇంటి మీదనే మేమందరమూ ఒక్కొక్క ఫ్లోర్ వేసుకుంటున్నాము. మేమైదుగురమూ ఇక్కడే ఒక్కొక్క ఫ్లోర్‌లో ఉంటాము. అందుకే నాలుగు రోజుల నుంచి, మన పంచవటినీ, నీ తోటనూ పాడు చేయకుండా అలానే ఉంచి, మా ఫ్లోర్‌లు కట్టేందుకు ఇంజనీర్‌ను పిలిచి ప్లాన్ వేయిస్తున్నాము. మున్సిపాలిటీ పర్మిషన్ కూడా తెచ్చాము. కాకపోతే కాస్త కట్టటము పూర్తయ్యేవరకూ మా దగ్గర ఉండాలి నువ్వు. పూర్తయ్యాక మనందరమూ కలిసి ఇక్కడే ఉందాము" అన్నాడు కేశవ.

"మరి మీవి అంత పెద్ద పెద్ద విల్లాలు ఏమి చేస్తారు? మీ పిల్లలు వచ్చినప్పుడు వాళ్ళకీ ఇల్లు సరిపోతుందా?" చిన్నగా అడిగింది శాంతి.

"నిన్ను వచ్చి మా దగ్గర ఉండమంటే ఉండవు. ఈ వయసులో నిన్ను ఒక్క దానిని వదలటము మాకు ఇష్టం లేదు. అందుకని పెద్దన్నయ్య ఈ ప్రపోజల్ చెప్పగానే ఒప్పుకున్నాము. మా విల్లాలదేముంది? అద్దెకిస్తాము. లేదంటే అమ్మేస్తాము" అన్నాడు అచ్యుత్.

"పిల్లలు ఇక్కడ ఉండలేకపోతే ఏ ఫైవ్‌స్టార్ హోటల్‌లోనో ఉంటారు. ఐనా ఉండలేకపోయేందుకు ఏముంది? అన్ని వసతులతోనే కట్టిద్దాము" అన్నాడు మాధవ్.

"అవునమ్మా! మేమంతా ఇక్కడే ఉంటే మేమూ ఒకరికొకరము సాయంగా ఉంటాము అని మా ఆయన కూడా ఒప్పుకున్నారు. ఈ ఏర్పాటు మాకందరికీ ఇష్టమే" అన్నది సుభద్ర.

అందరి మాటలూ విన్న శాంతి ఉద్వేగముతో ఏమీ మాట్లాడలేక పోయింది. వృద్ధాప్యంలో తనకు అండగా నిలిచేందుకు వచ్చిన తన పిల్లలను చూసి “ఎవరన్నారు? పిల్లలు తల్లితండ్రులను పట్టించుకోరని? మీరు నిజంగా నా ఈ పుట్టినరోజుకు నా కిష్టమైన, నేను ఊహించని సర్ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు” అంటూ వణుకుతూన్న చేతులతో పిల్లలను ఆప్యాయంగా తడిమింది.

***

# 20. HUMAN LIBRARY

# (హ్యూమన్ లైబ్రరీ)

(ఫేస్‌బుక్ 'మన కథలు - మన భావాలు' సాహితీ సమూహములో 'బంధం నిర్బంధమైన వేళ' అనే పదానికి నేను రాసిన కథ 'హ్యూమన్ లైబ్రరీ'.)

***

"డాడ్ కాఫీ!" సుధాకర్‌కు కాఫీ కప్ అందించాడు వికాస్.

కాఫీ కప్ అందుకుంటూ "మీ అమ్మా ఇంతే. నేను మొహం కడుక్కుని రాగానే కాఫీ ఇచ్చేసేది" అన్నాడు సుధాకర్.

చిన్నగా నవ్వాడు వికాస్. కాఫీ తాగాక ఇద్దరూ సెల్లార్‌లోని జిమ్‌లోకి వెళ్ళారు. ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తూ "మీ మమ్మీ కూడా నాతో పాటు జిమ్‌కు వచ్చేది కానీ..." అంటూ వికాస్ వైపు చూసాడు. వికాస్ కళ్ళు జాలిగా తనని చూస్తున్నట్లనిపిస్తే అప్రయత్నంగా చెప్పటం ఆపేసాడు. ఆ తరువాత మౌనంగా ఎక్సర్సైజ్‌లు ముగించుకొని, పైకి వచ్చారిద్దరు.

వాళ్ళను చూడగానే ముక్త "అంకుల్! ఇడ్లీ, సాంబార్ చేసాను. ఇన్స్టాపాట్‌లో అన్నం పెట్టాను. ఫ్రిడ్జ్‌లో రాత్రి చేసిన క్యాబేజ్ కూర ఉంది. లంచ్‌లోకి ఇంకేమైనా చేయమంటారా?" హడావిడిగా అడిగింది.

"చాలమ్మా ఇంకేమీ వద్దు. అయినా మీరు తినేవే నేనూ తింటాను. నా కోసం ప్రత్యేకం ఏమీ చేయ వద్దని చెప్పానుగా. మీ అత్తగారు కూడా ఇంతే ఏవేవో చేయాలని ఆరాట పడేది" అంటూ ముక్త వైపు చూసాడు. ముక్త మొహం లో కనిపించీ కనిపించని విసుగును చూసి చెప్పటం ఆపేసాడు.

"డాడ్! డోర్ కీ నంబర్ గుర్తుంది కదా. ఏదైనా అవసరం ఉంటే ఫోన్ చేయండి. మీటింగ్‌లో ఉంటే లిఫ్ట్ చేయను. ఒకవేళ ఏదైనా ఎమర్జెన్సీ అవుతే వెంటనే మళ్ళీ చేయండి. రెండు సార్లు చేస్తే నాకు తెలుస్తుంది అర్జెంట్ అని" వికాస్ రోజూలాగే జాగ్రత్తలు చెప్పాడు. చూస్తుండగానే పిల్లలిద్దరూ, ముక్త, వికాస్ బై చెప్పి వెళ్ళిపోయారు. బ్రేక్‌ఫాస్ట్ చేసి, నిశ్శబ్దంగా ఉన్న ఇంటిలో ఉండలేక, కాసేపు వాకింగ్ చేద్దామని బయటకు వచ్చాడు.

దేవి అకస్మాత్తుగా అందనంత దూరంగా వెళ్ళిపోతే, "నువ్వు ఒక్కడివే ఉండవద్దు" అని యు ఎస్ తీసుకొచ్చాడు కొడుకు. తన అలవాట్లకు తగ్గట్టుగానే ఇబ్బంది కలగకుండా కొడుకు, కోడలు బాగానే చూసుకుంటున్నారు. సమయం ఉన్నప్పుడల్లా వికాస్ పక్కన కూర్చొని కబుర్లు చెపుతూనే ఉంటాడు. తను చెప్పేవీ వింటాడు కానీ, ఎప్పుడూ, "గతం ఎందుకు డాడీ? ప్రెజెంట్‌లోకి రా!" అంటాడు. వాడు అట్లా అన్నప్పుడల్లా చిన్నప్పుడు, "డాడ్ కథ చెప్పు" అని వాడు అడగగానే, 'ఏక్ రాజా థా. ఏక్ రాణీ థీ. దోనో మిల్ గయే. కతం కహానీ' అని చెప్పగానే, 'అబ్బా ఎప్పుడూ ఇదే కథా' అని అలిగిన వాడి ముద్దుమొహం గుర్తొస్తుంది. తన చిన్నప్పుడు మా కాలంలో అంటూ తాతయ్య చెప్పబోతే, తను 'అబ్బా తాతా బోర్' అని పారిపోయేవాడు. ఇప్పుడు ఆనాటి తాత ఆరాటం అర్థమవుతోంది. తనూ అలాగే చెప్పాలనుకుంటాడు. ఇప్పుడు తనకు కావలసింది తన భావాలు పంచుకునే మనుషులు. పిల్లలు ఉన్నంతసేపూ బాగానే ఉంటుంది కానీ వాళ్ళు ఆఫీస్‌కు వెళ్ళాక బావురుమనే ఇంట్లో ఒక్కడే ఉండలేకపోతున్నాడు. వెంటవెంట తిరిగే దేవి జ్ఞాపకాలు మనసును చుట్టుముడుతూ ఉంటాయి. మరి ఎట్లా ఈ ఒంటరితనాన్ని జయించటం?

ఆలోచిస్తూ నడుస్తున్న సుధాకర్ ఒక్కసారిగా 'ఏమిటీ ఎంత దూరం

నడిచానూ?' అనుకుంటూ ఆగి చుట్టూ చూసాడు. ఏదో షాపింగ్ ఏరియాలోకి వచ్చినట్లున్నాడు. 'అరె, ఇది నేను రోజూ నడిచే దారి కాదు. ఆలోచనల్లో గమనించకుండా వేరే దారిలో దూరం వచ్చేసాను. ఇప్పుడు తిరిగి వెళ్ళటం ఎట్లా? వికాస్‌కు కాల్ చేయనా?' అని ఎక్కడున్నాడో గుర్తు చెప్పేందుకు పక్కకు చూసాడు. అక్కడున్న బిల్డింగ్ మీద 'Human Library' అని బోర్డ్ ఉంది. వికాస్‌కు కాల్ చేసి, అదేమిటో చూద్దామని ఆసక్తిగా లోపలికి వెళ్ళాడు. అక్కడ Library వాతావరణం ఏమీ లేదు. అక్కడక్కడ వేసి ఉన్న సోఫాల మీద కొంతమంది కూర్చొని మాట్లాడుకుంటున్నారు. అక్కడే ఉన్న రిసెప్షనిస్ట్ దగ్గరకు వెళ్ళి, "ఇదేమి లైబ్రరీ?" అని అడిగాడు.

దానికతను "పుస్తకాలు చదివితే విజ్ఞానం పెరుగుతుంది. కానీ వాటితో పాటు మనుషుల అనుభవాలు చదవగలిగితే జీవితమే బోధపడుతుంది కదా! ఆ ఉద్దేశంతోనే హ్యూమన్ లైబ్రరీ మొదలైంది. మరి మనుషులే పుస్తకాలై మనతో మనసు విప్పి మాట్లాడితే... కథల్ని, బాధల్ని, సంతోషాల్ని, సామాజిక అంశాల్ని మనతో షేర్ చేసుకోగలిగితే... ఇక్కడ మనుషులే పుస్తకాలు. అలా ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికి ఏదో ఒక అంశంపై మాట్లాడే అవకాశం లభిస్తుంది. అయితే ఏది మాట్లాడినా సరే వాదన లేకుండా సున్నితంగా చెప్పాలి. వన్ టు వన్ పద్ధతిలో తమ అనుభవాలను కూడా షేర్ చేసుకోవచ్చు. మీకిష్టమైతే మీరూ రావచ్చు. మీ అనుభవాలూ పంచుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం పది గంటల నుంచి సాయంకాలం అయిదు గంటల వరకు తెరిచి ఉంటుంది" అని చెప్పాడు.

అది వినగానే తమ ఊళ్ళో మధ్యాహ్నం వీధి అరుగుల మీద అమ్మమ్మావాళ్ళు చేరి పచ్చీసు, అష్టా చెమ్మా ఆడుకుంటూ కష్టసుఖాలు చెప్పుకోవటమూ, ఎవరింట్లోనైనా ఏదైనా ఫంక్షన్

జరుగుతున్నా, ఆవకాయలు, వడియాలు పెట్టుకోవాలన్నా అందరూ కలిసి పెట్టుకోవటమూ గుర్తొచ్చాయి. అలాగే సాయంకాలం కాగానే పొలం నుంచి వచ్చాక, రావిచెట్టు కింద ఉన్న రచ్చబండ మీద తాతయ్యావాళ్ళంతా కూర్చొని మాట్లాడుకోవటమూ, వచ్చేపోయే వాళ్ళను కుశలమడగటమూ అన్నీ ఒకదాని వెంట ఒకటిగా, వీధి అరుగు, రచ్చబండ గుర్తొచ్చాయి. ఆ రచ్చబండ మీద, వీధి అరుగు మీద ఎన్నో చర్చలు జరిగేవి. పెళ్ళి సంబంధాలు కుదిరేవి. పేపర్ చదువుతూ రాజకీయాలు మాట్లాడుకునేవారు. అవును ఇవీ ఓ విధంగా వీధి అరుగు, రచ్చబండ లాంటివే. నిజమే మనిషి సంఘజీవి. కష్టంలో సుఖంలో పాలు పంచుకునే తనవారనే ఒకరు ఉండాలి. ఒంటరితనం భరించలేరు. తనకు కావలసింది కూడా ఇదే! ఇక నుంచి రోజూ తనూ ఇక్కడకు వచ్చి అందరితో కలిసి తన ఒంటరితనం పోగొట్టుకోవచ్చు అని సంతోషపడిపోయాడు.

అప్పుడే అక్కడికి వచ్చిన వికాస్ అక్కడి విషయం తెలుసుకొని, డాడీ ముఖంలోని ఆనందం చూసి "డాడ్, మనింటి నుంచి ఇక్కడికి బస్ సర్వీస్ ఉంది. నేను చూపిస్తాను. ఇక నుంచి నీఅంతట నువ్వే ఇక్కడికి వచ్చి నీకు కావలసినన్ని కబుర్లు చెప్పుకోవచ్చు" అన్నాడు సంతోషంగా!

కొడుకు వెంట బయలుదేరుతూ చుట్టూ ఓసారి, సోఫాల మీద కూర్చొని, అక్కడక్కడ నిలబడి మాట్లాడుకుంటూ ఉన్నవారిని చూస్తూ, 'ఈ హ్యూమన్ లైబ్రరీ ఆలోచన ఎంత బాగుంది. తనలా ఒంటరిగా ఉండేవారు ఇలా వచ్చి తమ ఒంటరితనాన్ని అందరితో కలిసి జయిస్తున్నారు. అందుకే మన పెద్దలు ఐక్యమేవ జయతే అన్నారు!' అనుకున్నాడు.

***

# 21. మతం వద్దు, గతం వద్దు, మారణహోమం వద్దు

(ఫేస్‌బుక్ 'మన కథలు - మన భావాలు' సాహితీసమూహములో 'కథ మాది ముగింపు మీది' అని వారు ఇచ్చిన కథకు నేను రాసిన కథ "మతం వద్దు, గతం వద్దు, మారణహోమం వద్దు")

***

"రుబియా! రుబియా!" అంటూ వచ్చిన రాముతో గౌసియా బేగం చెప్పింది... "ఇంక బడికి రాదు బేటా! రుబియాని చదువు మానిపించేస్తున్నాము..." అని.

నిరాశతో తిరిగి వెళ్లిపోతున్న రాముని చూసి బాధగా నిట్టూర్చింది గౌసియా.

ఎలా ఉండే రాము... ఎలా అయిపోయాడు.?

వాళ్ళ నానమ్మ అస్థికలు కాశీలో కలపాలని వెళ్లిన తల్లిదండ్రులు తిరిగిరాని లోకాలకి వెళ్లిపోయారు. రాము అనాథ అయ్యాడు.

బంధువులు కూడా ఎవ్వరూలేరు, రారు. పల్లె వాళ్లే జాలితో పూటకి ఒకరు అన్నం పెట్టేవారు. స్కూల్‌లో తెలుగు మాస్టర్ రాము స్థితికి జాలిపడి ఆపిల్లవాడి చదువు సంగతి తాను చూసుకుంటాను అని చెప్పారు. ఉన్నట్లుండి ఆ మాస్టారు గుండెనొప్పితో పోవడంతో రాము పరిస్థితి మరింతగా దిగజారింది. ఒకరోజు ఊరి చివర చెరువు ప్రక్కన చెట్టుకి ఉరి వేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు..."

దీనికి నేను రాసిన ముగింపు...

***

అప్పుడే అటుగా వస్తున్న రుబియా తండ్రి బాషా "అరెరె బేటా, ఏం చేస్తున్నావు?" అని రామూను దగ్గరకు తీసుకున్నాడు.

"ఊళ్ళోవాళ్ళు ఎన్ని రోజులని నాకు అన్నం పెడుతారు? పని చేసుకుందామంటే, 'చిన్నపిల్లవాడివి నీతో పని చేయించుకుంటే ఇంకేమైనా ఉందా? చైల్డ్ లేబర్ ఆక్ట్ కింద మమ్మలిని జైల్లో తోస్తారు' అంటున్నారు. ఇక నేను ఎట్లా బతకాలి?" అన్నాడు రాము వెక్కిళ్ళుపెడుతూ.

"ఇప్పుడు నాతోరా బేటా. రేపు నేను వకీల్ సాబ్ దగ్గరకు పనిమీద పట్నం వెళుతున్నాను. నిన్ను ఆయన దగ్గరకు తీసుకెళుతాను. ఆ సాబ్ చాలా మంచివాడు. నీకు ఏదో ఒక తోవ చూపిస్తాడు." అన్నాడు రాము తల నిమురుతూ.

మరునాడు రామూను పట్నం వకీల్ సాబ్ దగ్గరకు తీసుకెళ్ళి రామూ విషయం ఆయనకు చెప్పాడు. నుదుట నామాలతో, గంభీరమైన చూపులతో ఉన్న వకీల్ సాబ్ శాస్త్రిగారిని చూసి భయపడ్డాడు రాము. శాస్త్రిగారు రామూ వైపు సాలోచనగా చూసి "ఇక్కడ మా ఇంట్లోనే ఉండనీయి" అన్నారు.

"సాబ్ మీరేమో బ్రాహ్మలు. ఇతనిని మీ ఇంట్లో ఎట్లా ఉంచుకుంటారు? ఏదైనా అనాథాశ్రమంలో మీ పరపతితో చేరుస్తారేమోనని తీసుకొచ్చాను" అన్నాడు బాషా కొద్దిగా సంశయంగా.

"బాషా! మా తాతగారింట్లో ఎంతోమంది వారాల పిల్లలకు భోజనం పెట్టేవారు. మా నాన్నగారు ఒక స్వాతంత్ర సమరయోధుల కాంప్‌కు కమాండర్‌గా ఉండేవారు. రోజూ ఎంతోమందికి మా అమ్మగారు

గుండిగలతో వంటచేసి పెట్టేవారు. అటువంటి కుటుంబంలోని వాడిని కులం, మతం చూస్తానా? ఒక అనాథ పిల్లవాడికి ఆశ్రయం ఇవ్వలేనా?" అన్నారు శాస్త్రిగారు.

శాస్త్రిగారు రామూను బడిలో చేర్పించారు. బడి నుంచి వచ్చాక సాయంకాలం శాస్త్రిగారు వద్దన్నా వినకుండా ఆయన ఆఫీస్‌లో చిన్నచిన్న పనులు చేస్తూ ఆయనకు చేదోడుగా ఉంటూ, బుద్ధిగా ఇంటర్ వరకూ చదివాడు. ఇంటర్ పరీక్షాఫలితాలు వచ్చిన రోజు, "ఏవైనా ఎంట్రెన్స్ పరీక్షలు రాయమంటే నువ్వురాయలేదు. మరి ఇప్పుడు ఏమి చదువుతావు? నీ ప్లాన్ ఏమిటి?" అని అడిగారు శాస్త్రిగారు.

"నాకు మీలాగే లాయర్ కావాలని ఉంది. మీ దగ్గర పని చేస్తూ నేను డిస్టెన్స్ కోర్స్ లో బి.యే చదువుతాను. ఆ తరువాత నైట్ కాలేజ్‌లో చేరి లా చదువుతాను" అన్నాడు రాము.

అదే విధంగా లా చదివి శాస్త్రిగారి దగ్గరే అసిస్టెంట్‌గా చేరాడు. తను ఇంత వృద్ధి లోకి వచ్చేందుకు దారి చూపించిన బాషాకు కృతజ్ఞత చూపించాలనీ, చిన్ననాటి నేస్తం రుబియాను చూడాలని పల్లెకు వెళ్ళాడు రాము. బాషా ఇంటి ముందు విచారంగా కూర్చొని ఉన్న రుబియాను చూసి రుబీయానేనా? అని అనుమానంగా చూస్తూ, "రుబియా, నేను రామూని" అన్నాడు. రుబియా రాముని ఒక్క క్షణం చూసి , ఏమీ మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది. లోపలి నుంచి బాషా, గౌసియా బేగం వచ్చి రామూను చూసి చాలా సంతోషించారు.

"రుబియా ఎందుకట్లా ఉంది?" అడిగాడు రాము.

"ఏమి చెప్పమంటావు రామూ, పోయిన సారి నేను పట్నం వచ్చినప్పుడు చెప్పాను కదా రుబియాకు షాదీ చేసామని. చాలా చక్కగా

ఉన్నాడు, మంచి ఉద్యోగం ఉంది అనుకున్నాము. ఉద్యోగం ఉందని చెప్పినమాట అబద్ధం. ఎవరో బాగా డబ్బున్న ఆమెతో అతనికి ఎట్లా పరిచయం అయ్యిందో, ఆమె వెంట తిరిగి, రుబియాకు తలాక్ చెప్పి, ఆమెను షాదీ చేసుకొని దుబాయ్ వెళ్ళిపోయాడు. రుబియా ఇదో ఎప్పుడూ ఇట్లా విచారంగా కూర్చుంటుంది. చదువు పూర్తి చేయమని చెప్పాము. వినటం లేదు" విచారంగా అన్నాడు బాషా.

కొద్దిగా ఆలోచించి, "మీకు అభ్యంతరం లేకపోతే నేను రుబియాను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు రాము.

అప్పుడే అటుగా వచ్చిన బాషా కొడుకు ఖాసిం, అతని దోస్త్ ఖాన్ " ఏమిటిరా ఏం కూసావ్ మా బహెన్‌ను షాదీ చేసుకుంటావా?" అని చేతిలో కర్రలతో రామూను కొట్టేందుకు వచ్చారు. అటుగా వెళుతున్న కొంతమంది హిందూ యువకులు ఇది చూసి రాముకు అడ్డుగా వచ్చారు. గొడవ జరిగేట్టుగా ఉందని బాషా వాళ్ళను కష్టం మీద ఆపి రామూను పంపించేసాడు.

"బాషా వాళ్ళను కలిసావా? ఏమైంది, అక్కడి నుంచి వచ్చినప్పటి నుంచి అలా దిగులుగా ఉన్నావు?" అడిగారు శాస్త్రిగారు.

జరిగిన విషయం చెప్పాడు రాము.

"నీకు నిజంగా రుబియాను పెళ్ళి చేసుకోవాలని ఉందా? ఎందుకు? ఆమెపై జాలా?" అడిగారు శాస్త్రిగారు.

"అవును చేసుకోవాలని ఉంది కాని జాలితో కాదు. నాకు రుబియా అంటే ఇష్టమైనా నాకే స్థిరంలేదు ఎట్లా అడుగుతాను అని అడగలేదు. ఇప్పుడు ఆమె పరిస్థితి చూసాక ఇంకా ప్రేమ ఎక్కువైంది " జవాబిచ్చాడు రాము.

"అయితే పద" అని రామూతో పల్లెకు వచ్చారు. కార్‌లో నుంచి దిగుతున్న శాస్త్రిగారిని చూసి ఎదురొచ్చాడు బాషా. శాస్త్రిగారు ఖాసింను, ఊరిలోని పెద్దలనూ పిలిపించి "ఎందుకు నీకు రాము రుబియాను పెళ్ళిచేసుకోవటం ఇష్టం లేదు? చదువుకున్న పిల్లలు. మీరు కూడా కులం, మతం అంటూ ఆలోచించవచ్చా? నువ్వు ముస్లింవి, రాము హిందువు కానీ మీ ఇద్దరిలో ఏమి తేడా ఉంది? చిన్నప్పుడు నువ్వు చదువుకున్న గాంధీజీ పాఠం గుర్తులేదా?" అంటూ ఎన్నో విధాలుగా నచ్చజెప్పారు. పెద్దవారి మాట కాదనలేకనో వారి మాటల ప్రభావము వల్లనో ఒప్పుకున్నారు ఖాసిం, ఊరి పెద్దలు.

శాస్త్రిగారు రుబియాను పిలిచి "నీకు రామూను పెళ్ళి చేసుకోవటము ఇష్టమేనా?" అని అడిగారు. ఇష్టమేనన్నట్లు ఆయన పాదాలకు నమస్కరించింది రుబియా.

శాస్త్రిగారి ఆదేశంతో అప్పటికప్పుడు ఊరి కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహం ముందు చిన్న స్టేజ్‌లాగా ఏర్పాటు చేసారు. అక్కడే రామూ, రుబియాలకు దండలు మార్పించారు శాస్త్రిగారు.

బడిపిల్లలతో స్కూల్ మాష్టారుగారు ,

"నారాయణ నారాయణ అల్లా అల్లా

మా పాలిటి తండ్రీ నీ పిల్లల మేమెల్లా:

మతమన్నది గాంధీజీ హితమైతే

మతమన్నది లోకానికి హితమైతే

హిందువులం ముస్లింలము

అందరమూ మానవులం

అందరమూ మానవులం: నారాయణ :

అని పాడించారు.

ఇన్నాళ్ళకు తన కలలు ఫలించాయని విగ్రహంలోని గాంధీ తాత అందరినీ ఆశీర్వదిస్తున్నట్లుగా బోసి నవ్వులు నవ్వారు.

***

# 22. సాలీ ఆధీ ఘర్ వాలీ!

('మన కథలు - మన భావాలు' గ్రూప్‌లో ఇచ్చిన కథకు నేను రాసిన కొనసాగింపూ, ముగింపు. చుక్కలు ఉన్నంతవరకు గ్రూప్‌లో ఇచ్చిన కథ. ఆ తరువాతది నా కొనసాగింపు.)

***

"ఏంటండీ అది? చదవగానే అలా మ్రాన్పడ్డారు!" చేతిలో కాఫీతో వరండాలోకి వచ్చిన విజయమ్మ, రెండు చేతులతో ఉత్తరం పట్టుకుని నించుండిపోయిన భర్త జనార్ధనాన్ని చూస్తూ కంగారుగా అడిగింది, భార్య వైపు అయోమయంగా చూస్తూ...

"అదేంటి విజ్జీ! నిశ్చితార్థం చేసుకున్నాక, మాకు మీ సంబంధం వద్దంటూ ఉత్తరం రాస్తాడేం ఆ నరసింహం?" అన్నాడు అక్కడే ఉన్న కుర్చీలో కూలబడిపోతూ.

"అయ్యో! ఇదేం అన్యాయం అండీ? కారణం ఏంటట?" ఆందోళనగా అంటూ, కాఫీ అక్కడ టీపాయ్ పై పెట్టి, ఆయన మోకాళ్ళపై చేయివేసి, కాళ్ళ వద్ద కూర్చుంది విజయమ్మ.

"అదేం చెప్పలేదే. 'మీ అబ్బాయికి మా అమ్మాయిని ఇవ్వదలుచుకోలేదు. మీతో మాకే సంబంధం వద్దనుకుంటున్నాం.' అని మాత్రం రాసాడు." ఇంకా అయోమయం నుండి తేరుకోని జనార్ధనం.

"హయ్యో! నేను చెబుతూనే ఉన్నా ముందు నుండి! ఈ వేలు విడిచిన చుట్టరికాలంటూ సంబంధాలు ఖాయం చేసుకోకండి, బంధువులన్న మాటేగానీ, ఎప్పుడో పరాయిరాష్ట్రంలో స్థిరపడిన వాళ్ళ గురించి మనకేం తెలీదంటూ...." సన్నగా రాగం తీయటం మొదలుపెట్టింది విజయమ్మ.

"కారణం చెప్పకుండా ఇలా చేయటం ఏంటసలు? ఊరంతా పిలిచి వేడుకగా నిశ్చయం చేసుకున్న సంబంధం. ఇప్పుడు ఎందుకు క్యాన్సిలయిందని అడిగేవారికి మనం ఏం చెప్పాలి? పిల్లాడిలో ఏం లోపం ఉందో అనుకుని ఇకపై మన వాడికి సంబంధాలు వస్తాయా?" ఆందోళనగా అన్నాడతను.

"ఓరి భగవంతుడా! ఇదేం ప్రారబ్ధం మాకు? చక్కని పిల్లాడు. బ్యాంకీ మేనేజరూ, ఒక్కడే కొడుకు. ఉన్న ఒక్క ఆడపిల్ల, అక్కకు పెళ్ళి అయ్యి, పురుళ్ళు, పుణ్యాలు పూర్తయి, బాదరబందీ లేని బతుకు వాడిది. ఒకరిని నొప్పించే మనస్తత్వం కాదు. ఒక్క దురలవాటు లేదు. పైగా మనమంటే పల్లెటూరిలో ఉన్నాం కానీ, వాడు ఉద్యోగం చేసుకుంటూ పట్నంలోనే ఉన్నాడు కదా! ఇక మన పిల్లాడిని వద్దనుకుంటున్న కారణం ఏంటి!?" చిన్నగా శోకాలు మొదలు పెట్టింది విజయమ్మ.

ఆలోచిస్తున్న జనార్దనం కాస్త తేరుకుని, "అర్జంటుగా ఈ సంబంధం కుదిర్చిన మీ తమ్ముడు సూర్యాన్ని, మన అమ్మాయి లావణ్యను, ఆమె భర్తను, మన వంశోద్ధారకుడు రాహుల్‌ను వెంటనే రమ్మని ఫోన్ చెయ్యి. విషయం చెప్పకు. వాళ్ళు వచ్చాక ఏం చేయాలో అంతా కలిసి నిర్ణయించుకుందాం." అన్నాడు ఏదో నిశ్చయించుకున్నట్లు.

***

లావణ్యా, ఆశీష్, సూర్యం హడావుడిగా లోపలికి వచ్చి , బయటనే వరండాలో వెనకకు చేతులు పెట్టుకొని అచార్లూ, పచార్లూ చేస్తున్న జనార్దనాన్ని, కాఫీ కప్ పట్టుకొని లోపలినుంచి వస్తున్న విజయమ్మను చూసి కాస్త స్థిమిత పడ్డారు. అక్కడే ఉన్న కుర్చీలో కూలబడి, "అర్జెంట్‌గా రమ్మని, ఇంకో మాటైనా చెప్పకుండా ఫోన్ చేసావు. అప్పటికప్పుడు వీళ్ళిద్దరినీ కూడా తీసుకొని కార్‌లో వచ్చేసాను ఏమైందక్కా?" అడిగాడు

సూర్యం.

ఏమీ జవాబు చెప్పకుండా భర్తవైపోసారి చూసి లోపలికెళ్ళి, ముగ్గురికీ కాఫీలు తెచ్చి ఇచ్చింది. అప్పటికే జనార్ధనం సూర్యంకు ఉత్తరం చూపించి అతనిపై చెడుగుడాడేస్తున్నాడు. ఇంతలో కార్ వచ్చి ఇంటి ముందు ఆగగానే అటువైపు చూసారు అందరు. కార్ పార్క్ చేసి, పెరిగిన గడ్డం, లోపలికి పోయిన కళ్ళు, పీక్కుపోయిన మొహం, అరచేతికి బాండేజ్‌తో నీరసంగా లోపలికి వచ్చిన రాహుల్‌ను ఆశ్చర్యంగా చూసారు.

"రాహుల్ ఏమైందిరా? అట్లా ఉన్నావేమిటి?" దగ్గరికి తీసుకుంటూ గాభరాగా అడిగింది విజయమ్మ.

"ముందు వాడిని ఫ్రెషప్పై రానీయండి అత్తయ్యా, చెపుతాడు" అన్నాడు ఆశీష్.

లోపలికెళ్ళి వచ్చి మౌనంగా అమ్మ దగ్గర కింద కూర్చుండిపోయాడు రాహుల్.

రాహుల్ జుట్టు ప్రేమగా నిమురుతూ "ఏమైంది కన్నా?" అడిగింది విజయమ్మ.

ఇంక ఆగే ఓపికలేక, "నరసింహం మీ అబ్బాయి మాకొద్దు అని ఉత్తరం రాసాడు." అన్నాడు జనార్ధనం.

అభావంగా తలెత్తి చూసి, తెలుసన్నట్లు తలూపాడు రాహుల్.

"తెలుసా? అసలేమి జరిగింది? నువ్వేం చేసావు?" ఇరిటేటైపోయాడు జనార్ధనం.

"నేను చెప్పలేను. చూపిస్తాను చూడండి." అని పైన తిరుగుతున్న ఫాన్‌ను చూపించాడు రాహుల్. అందరూ ఫాన్ వైపు చూస్తుండగా అది తిరిగీ తిరిగీ వీళ్ళనోచోట ఆపింది!

***

పెళ్ళిచూపులలో చిలకాకుపచ్చ డ్రెస్‌లో చిలకలా కనువిందు చేసి, నిశ్చితార్థం రోజున రాణీకలర్ గాగ్రాలో తన పక్కన రాణీలా మెరుపులు చిందించిన నిషా, కలలో రారమ్మని పిలుస్తుంటే ఆగలేకపోతున్నాడు. 'నిషాకనులదానా నన్ను నిషాలో ముంచేస్తున్నావు' అని పాడుకునే విరహగీతాలు సాంత్వన కలిగించటము లేదు. ఇక ఉండలేక, 'పెళ్ళికి నెలరోజులు సెలవు తీసుకున్నావు, ఇప్పుడు వారం సెలవు కావాలంటే ఇవ్వన'ని చిందులు తొక్కుతున్న పిల్లిగడ్డం బాస్‌ను చేతులూ, గడ్డమూ పట్టుకొని బతిమిలాడి, బాస్‌గారి పెళ్ళిచూపులను గుర్తుతెచ్చి ఊహలలో తేలిస్తే సెలవిచ్చేసాడు. ఛలో ఢిల్లీ అని ఢిల్లీలో నిషా ఇంటి ముందు వాలిపోయి బెల్ కొట్టాడు.

చేతిలో పిల్లితో, జీన్స్ పాంట్ మీద లేత మబ్బురంగు టాప్ వేసుకొని, అలవోకగా జుట్టును వదిలేసి తలుపు తెరిచిన నిషాసుందరిని పరవశంగా చూస్తూ ఉండిపోయాడు. "వావ్, వాటే సర్ప్రైజ్!" అని సంబరపడిపోతూ లోపలికి ఆహ్వానించింది నిషా. నిషాను పరవశంగా, నిషా చేతిలోని పిల్లిని భయంభయంగా చూస్తూ లోపలికి నడిచాడు. మిస్టర్ & మిసెస్ నర్సింహం గారు చాలా ఆదరంగా మాట్లాడారు.

"బేటీ! రాహుల్‌ను నీ గదిలోకి తీసుకెళ్ళు. నేనిప్పుడే పదినిమిషాలల్లో వస్తాను." అని నిషాతో, "రాహుల్ బేటా, లంచ్ చేసి వెళ్ళు. నాకు అర్జెంట్‌గా వెళ్ళాల్సి ఉండి వెళుతున్నాను తొందరగానే వచ్చేస్తాను" అని రాహుల్‌తో చెప్పి నరసింహంగారు బయటకు వెళ్ళారు.

మిసెస్ నరసింహం కాబోయే అల్లుడికి విందు భోజనం ఏర్పాటు చేసేందుకు వంటింట్లోకి వెళ్ళింది. సుతారంగా జుట్టును మునివేళ్ళతో సర్దుకుంటూ ముందుకు వెళుతున్న నిషాను మబ్బుల్లో తేలిపోతున్నట్లుగా అనుసరించాడు రాహుల్.

"వావ్, నీ గది ఎంత అందంగా పెట్టుకున్నావు!" ఎదురుగా పిల్లిపిల్లను ఎత్తుకొని ఉన్న నిషా ఫొటోను చూస్తూ, మనసులోనే 'దేవుడా!' అని తల కొట్టుకుంటూ అన్నాడు.

"ఫొటో బాగుంది కదూ?" మురిపెంగా చేతిలోని పిల్లిపిల్లను నిమురుతూ అంది నిషా.

"ఊ... చాలా బాగుంది. నీ పిల్లి కూడా చాలా అందంగా ఉంది. ఆడపిల్లా మగపిల్లా?" నిషా చేతిలోని పిల్లిని చూస్తూ ఏదో మాట్లాడించాలనట్లు అడిగాడు.

"బేబీ గర్ల్. పేరు తోఫీ. తోఫీ జిజియాజీ కో హాయ్ బోలో." తోఫీని నిమురుతూ అంది నిషా.

చేదుమాత్ర మింగినట్లు ఓ గుటకవేసి " హాయ్ తోఫీ. తోఫీ నాకు సాలీనా. సాలీ ఆధీ ఘర్ వాలీ." అని ఓ ఏడుపునవ్వు నవ్వాడు.

అంతే కోపంతో ముక్కుపుటాలు అదురుతుండగా, "ఆ ఏమిటీ నీకు ఆధీ ఘర్ వాలీ కావాలా?" అని చివ్వున కూర్చున్న చోటు నుంచి లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిలుచుంది.

"నిషా, నిషా సరదాగా అన్నాను సారీ సారీ." అంటూ వెనుకనే వెళ్ళి నిషా చేయి పట్టుకోబోయాడు. ఆ చేయి తోఫీకి తగిలి అది రాహుల్ స్పర్శ భరించలేనట్లు కోపంగా చూసి కదిలింది. ఆ కదలటంలో నిషా

చేతిలో నుంచి జారి, కిటికీలోనుంచి కింద పడిపోయింది. నిషా కెవ్వ్ మని అరుస్తూ కిందికి పరిగెత్తింది. నిషా వెనుకనే రాహుల్ పరిగెత్తాడు. తోఫీది గట్టి ప్రాణమేమో కింద పడ్డా ఏమీ కాలేదు. కాస్త సొమ్మసిల్లింది. నిషా చేతిలోకి తీసుకోగానే కాస్త అటూ ఇటూ కదిలి కళ్ళు తెరిచి ఎదురుగా ఉన్న రాహుల్‌ను గుర్రున చూసింది. నిషా దాన్నెత్తుకొని ఫ్లాట్‌లోకి వెళ్ళిపోయి, వెనుకనే వస్తున్న రాహుల్‌తో, "నీ మూలంగా తోఫీ ఆపదలో పడింది. ఇంక నీ దగ్గర ఉంటే ఏమి చేస్తావో! పైగా ఇంత బుజ్జిదాన్ని ఆధీ ఘర్ వాలీ అంటావా? ఇంక నీ మొహం నాకు చూపించకు." అని తలుపు వేసేసింది.

***

ఆగిన ఫాన్ తిరుగుతోంది.

"పిల్లికే అంత భయమేమిటి రాహుల్. అది నీకు ఆధీ ఘర్ వాలీనా? లంచ్ పోయే, వారం సెలవా పోయే." పొంగివస్తున్న నవ్వును దాచుకునేందుకు సతమతమౌతూ అన్నాడు ఆశీష్.

"అలా జోక్ చేస్తే ఇష్టపడుతుందేమో అనుకున్నాను బావా. కానీ ఇలా జరుగుతుందనుకోలేదు." దీనంగా జవాబిచ్చాడు.

"అదేం జోక్‌రా? అంతా తగలేసావు." విసుక్కున్నాడు సూర్యం.

"అబ్బా మీరుండండి. అంతేగా, పోతే పోయిందిలే. వెధవ పిల్లి గోల మనకెందుకు? మనకసలే పిల్లులూ, కుక్కలు పడవు. అయినా అదేమిటిరా తమ్మూ అలా అయిపోయావు? చేతికి ఆ కట్టేమిటి?" అడిగింది లావణ్య.

"పిల్లిని అలవాటు చేసుకుందామని మా అపార్ట్మెంట్ దగ్గర ఒక పిల్లి పిల్లలను పెడితే దాన్ని ఎత్తుకుందామని పట్టుకున్నాను. పెద్ద పిల్లి వచ్చి

చేతిని కరిచింది. ఇంజెక్షన్ తీసుకొని వచ్చాను. కాని అమ్మా, నాకు నిషా కావాలి" అమ్మ ఒళ్ళో తల దూర్చాడు.

సెల్ రింగవుతుంటే జనార్ధనం ఎత్తాడు. అవతల నుంచి నరసింహం "బావగారూ! ఏమనుకోకండి. పిల్లలేదో పిల్లి కోసం పోట్లాడుకున్నారు. అప్పటికప్పుడు మీ సంబంధం కాన్సిల్ చేసుకోమని నిషా గొడవ చేస్తుంటే ఫోన్‌లో చెప్పలేక ఉత్తరం రాసాను. ఇప్పుడేమో రాహుల్ రోజూ చేస్తున్న ఫోన్ కాల్స్‌కు కరిగిపోయింది. ముందు అనుకున్నట్లుగానే పెళ్ళి చేసేద్దాము." అంటున్నాడు.

అమ్మ ఒళ్ళోనుంచి తలెత్తి , రింగవుతున్న తన సెల్‌ను చూసి, "అమ్మా! నిషా ఫోన్ చేస్తోంది." అని సెల్ ఆన్సర్ చేస్తూ చెంగున బయటకు పరిగెత్తాడు.

వెయ్యి ట్యూబ్‌లైట్ల వెలుగుతో మొహం వెలిగిపోతుండగా నిషాతో మాట్లాడుతున్న రాహుల్‌ను చూస్తూ, "సరే కానీయండి." అన్నాడు జనార్ధనం.

***

# 23. వడ్లగింజలో బియ్యం గింజ!

**('మన కథలు - మన భావాలు'**
**గ్రూప్‌లో ఇచ్చిన చిత్రానికి నేను వ్రాసిన కథ)**

అయిదైంది. ఇంకా మానస కాలేజ్ నుంచి రాలేదేమా అని కూతురి కోసం ఎదురుచూస్తోంది గాయత్రి. గాయత్రి, శ్యామ్‌ల గారాల పట్టి మానస. ఆ సంవత్సరమే బీటెక్‌లో చేరింది. గాయత్రి సన్నగా నాజుకుగా, పొడవాటి జడతో అందంగా ఉంటుంది. మానస తండ్రి పోలికలో కాస్త బొద్దుగా ఉంటుంది. పైగా గాయత్రికి మానస పందొమ్మిదో సంవత్సరము లోనే పుట్టటం వలన ఎక్కువ వయసు తేడా లేక తెలీనివాళ్ళకు తల్లీకూతుర్లలా కాక ఇద్దరూ అక్కచెల్లెళ్ళలా అనిపిస్తారు. అలాగే ఇద్దరూ స్నేహితుల్లానే ఉంటారు. కాలేజీలో చేరిన కొద్ది రోజులకే జడ కత్తిరించుకుంటాన్న మానస కోరికకు శ్యామ్ ముందు గునిసినా, కాలేజీకి వెళుతున్న పిల్ల కాస్త ఫాషన్‌గా ఉండటములో తప్పేమీ లేదని గాయత్రి నచ్చచెప్పటముతో ఒప్పుకున్నాడు.

జుట్టు కత్తిరించటముతో మొదలైన మార్పు చిన్నచిన్నగా డ్రెస్సింగ్‌లో, మాట్లల్లో కూడా తేడాను ఈ మధ్య గమనిస్తోంది గాయత్రి. అది అంతగా పట్టించుకోకున్నా ఈ మధ్య కొంచెం ఆలస్యంగా రావటము కూడా మొదలయ్యేసరికి కాస్త కంగారు పడుతోంది. కాసేపు బైటకీ లోపలికి తిరిగి, డాబా మీదకెళ్ళి సందు చివర దాకా చూసింది. ఎక్కడా కనిపించలేదు. అసలు అనవసరంగా కంగారు పడుతున్నానేమో అని తనకు తానే నచ్చజెప్పుకొని ఆరేసి ఉన్న బట్టలు తీసి మడతపెట్టి, కిందకు వచ్చి అవి పెడదామని మానస గదిలోకి వెళ్ళింది. ఎప్పుడు వచ్చిందో మరి మానస మంచం మీద బోర్లా పడుకొని చిన్నగా ఏడుస్తోంది. అది చూడగానే గాభరా పడి బట్టలు పక్కన పడేసి, మానస పక్కన కూర్చొని

“ఏమైంది బంగారూ?” అని అనునయంగా అడిగింది.

సమాధానం చెప్పకుండా ఇంకా వెక్కిళ్ళు పెడుతున్న మానసను చూసి అనునయించి, బుజ్జగించి అడిగింది.

అమ్మ ఓదార్పుతో కొంచెం తేరుకున్న మానస, “అది కాదమ్మా ఈ మధ్య మా క్లాస్‌కు ఓ కొత్త అమ్మాయి వచ్చిందని చెప్పాను గుర్తుందా?” అని అడిగింది.

“అవును చెప్పావు. ఆ అమ్మాయిని చూడగానే నీకు చాలా నచ్చిందని, నీ అంతట నువ్వే తనను మాట్లాడించానని చెప్పావు. నేను కూడా అసలు నీకు కొత్తవాళ్ళతో మాట్లాడాలంటేనే మొహమాటం. మేము ఎంతో పోరితేనే కాని మాట్లాడవు. అట్లాంటిది ఓ అమ్మాయిని ఫ్రెండ్ చేసుకుందామనుకొని నువ్వే మాట్లాడించావు అని సంతోషపడ్డాను. ఇప్పుడేమయ్యింది?” అని అడిగింది గాయత్రి.

“నేను తనను పరిచయం చేసుకొని, నిన్ను చూడగానే నాకు నీతో స్నేహం చేసుకోవాలనిపించింది అనగానే సంతోషంగా ఒప్పుకుంది. చాలా చనువుగా స్నేహంగా ఉండేది. నన్ను ఇంత పొడుగు జడతో ఉంటే అబ్బాయిలు ఏడిపిస్తారంటే జుట్టు కూడా కట్ చేసుకున్నానా? తను రమ్మంటే కాఫీ హౌస్ కూడా వెళ్ళి, బిల్ కూడా నేనే కట్టేదానిని. ఆలస్యమైతే నువ్వు గాభరా పడతావన్నా, ‘నువ్వేమైనా చిన్నపిల్లవా అమ్మకు భయపడటానికి కూర్చో’ అనేది. నాకూ ఎందుకో తనంటే ఇష్టంగా ఉండేది. అవునా?

అయినా, ఎందుకో రెండు రోజుల నుంచి నేను మాట్లాడించినా ముక్తసరిగా జవాబు చెప్పి వెళ్ళిపోతోంది. మా ఇంకో ఫ్రెండ్‌తో ఎవరితోనో అందిట, ‘మానస నేనేమి చెప్పినా వినటము లేదు, తనని వదిలేసాను’

అని. ఆ అమ్మాయి 'మీద్దరికి ఏమైందే?' అని అడిగింది. నాకు అర్థం కాలేదు. అసలు తను నాకేమి చెప్పింది, నేనేమి వినలేదు? ఈరోజు లంచ్ టైములో అడిగితే ఏమిటేమిటో చాలా రూడ్‌గా మాట్లాడింది. నేను నాకు తెలీకుండానే 'సారీ సారీ' అని చెప్పాను. కాని తను వినిపించుకోలేదు. నేను ఏడుస్తూ వచ్చేసాను. అమ్మా నువ్వు చెప్పు, నేనేమి తప్పు చేసాను?" కన్నీళ్ళతో అడిగింది మానస.

ఏదీ తట్టుకోలేదు. మరీ సున్నిత మనస్కురాలైన మానస ఎంత బాధపడుతోందో అనుకొని చిన్నగా, "కొంత మంది అట్లాగే ఉంటారు. నువ్వు తనకు లేనిపోని గొప్ప అంటగట్టేసరికి తనేదో తెలివికలదానిని, నువ్వేదో తెలివి తక్కువదానివి అనుకొని నీ మీద డామినేషన్ చేయబోయింది. తను మాట్లాడకపోతే ఏం పోయింది? నీకింక వేరే ఫ్రెండ్స్ లేరా? అవన్నీ పట్టించుకోకూడదు. ఇంటి నుంచి బయటకు అడుగు వేసావు. ఇంట్లో ఉన్నట్లుగా బయట ఉండదు. బయటి ప్రపంచములో రకరకాల మనస్తత్వాలవారు ఎదురవుతారు. ఎవరితో ఎట్లా మెలగాలో తెలుసుకొని మెలగాలి. ఎవరికీ అతి చనువు ఇవ్వకు. అసలు నువ్వు ఏమి తప్పు చేసావని తనకు సారీ చెప్పావు? ఇట్లా అనవసరమైన వాటికి దిగులు పడి, మాటిమాటికి సారీ చెపితే నీ ఆత్మస్థైర్యం కోల్పోతావు. మన డిగ్నిటీ మనం నిలుపుకోవాలి. ధైర్యంగా పరిస్థితులు ఎదుర్కోవాలి. పోనీలే జరిగిందేదో జరిగిపోయింది. తను నిన్ను వదిలేసేదేమిటి, నువ్వే తనను వదిలేసేయి. ఇక తనతో మాట్లాడకు. ఇదీ ఒక అనుభవం అనుకో. లే! కాఫీ తాగుదాము" అని కూతురితో అనునయంగా చెప్పి, మనసులో 'ఓస్ ఇంతేనా తను ఇంకేమిటో అనుకుంది. వడ్లగింజలో బియ్యం గింజ... కూతురికి ఇంకా చిన్నతనం పోలేదు' అని చిన్నగా నవ్వుకుంటూ లేచింది, గాయత్రి.

***

# 24. వరించి వచ్చిన సిరి

## *(Tag line: Kaun Banega Crorepati?)*

(ఫేస్‌బుక్ సమూహం 'మన కథలు – మన భావాలు'లో ఇచ్చిన 'నాన్న కోపం తట్టుకోగలిగినవారు ఇంకెవరుంటారు?' అనే వాక్యానికి నేను రాసిన మినీ కథ, 'వరించి వచ్చిన సిరి' (టాగ్‌లైన్: కౌన్ బనేగా కరోర్ పతి?). ఒక క్విజ్ కాంపిటీషన్‌లో వచ్చిన కోటి రూపాయలు ఒక యువకుని జీవితాన్నే మార్చివేసాయి. అదెలాగో చదవండి మరి.

***

పార్క్‌లో చెట్టును ఆనుకొని కూర్చున్న విష్ణు ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి. పూలమ్ముకున్న చోట కట్టెలమ్ముకోలేడు. దూరంగా ఎక్కడికైనా వెళ్ళి కూలోనాలో చేసుకొని బతకగలడు. కానీ వెళ్ళిపోయే ముందుగా ఒకసారి నాన్నను చూసి క్షమాపణ అడగాలి. కాని ఎట్లా? తను చేసిన తప్పు చిన్నదేమీ కాదు. అటెండర్‌గా పని చేస్తున్న నాన్న తనను పెద్ద ఇంజనీర్‌ను చేయాలనుకున్నాడు. ఇంటర్‌కు వచ్చాక, తలకు మించిన భారమైనా మంచి కోచింగ్ ఇన్స్టిట్యూట్‌లో చేర్చాడు. తనే వెంటబెట్టుకొని క్లాస్‌కు తీసుకెళ్ళేవాడు. తను కూడా నాన్న కష్టాన్ని గుర్తించి చక్కగా చదువుకున్నాడు. చదువుతో పాటు, ఏదైనా కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు వెళితే జనరల్ నాలెడ్జ్ కూడా ఉండాలని క్లాస్ పుస్తకాలతో పాటు వివిధ పేపర్‌లూ, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివేవాడు. పాపం నాన్న అవీ ఎక్కడి నుంచో సంపాందించి తెచ్చి ఇచ్చేవాడు. మంచి రాంక్ తెచ్చుకొని మంచి కాలేజ్‌లో ఫ్రీ సీట్ కూడా తెచ్చుకున్నాడు. చివరి సంవత్సరం జరిగిన కాంపస్ ఇంటర్వ్యూలో ఇంఫోసెస్‌లో ఉద్యోగం తెచ్చుకున్నాడు. పరీక్షలైపోయి, ఫలితాలు వచ్చాక బెంగుళూర్ వెళ్ళి ట్రైనీగా చేరాల్సి ఉంది. ఆ సమయములో తన ప్రతి విజయాన్నీ గర్వంగా

చూసుకుంటూ పొంగిపోతున్న నాన్న ఆశలన్నీ కూల్చేసాడు తను. ఆ చివరి రోజులు కళ్ళ ముందు తిరిగాయి.

ఒక సంస్థ, క్విజ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నారనీ, అందులో గెలిచిన వారికి కోటిరూపాయల బహుమతి ఇస్తారని, పాల్గొనదలిచిన వాళ్ళు పేర్లివ్వమనీ నోటీస్ బోర్డ్‌లో పెట్టారు. అది చూసి తనను లెక్చరర్‌లూ, నాన్న, చిన్ననాటి నుంచీ ఉన్న తన ఏకైక స్నేహితురాలు సిరి అందులో పాల్గొనమని ప్రోత్సాహపరిచారు. పాల్గొని కోటిరూపాయలు గెలుచుకున్న రోజున తనే నమ్మలేకపోయాడు ఆ అద్భుతాన్ని. పేపర్‌లన్నీ తన ఇంటర్వ్యూలు పోటీపడి తీసుకొని ప్రచురించాయి. విద్యార్థి సంఘాలు సత్కరించాయి. ఎక్కడి కెళ్ళినా అందరూ చుట్టుముట్టేవారు. ఆ సెలెబ్రిటీ పొజిషన్ తనను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ సందడిలోనే పరీక్షలు రావటమూ, ఫలితాలు తెలియటమూ జరిగిపోయాయి.

ఆ రోజు నాన్న నన్ను పిలిచి, "నువ్వు బెంగుళూర్ వెళ్ళాలి కదా టికెట్ రిజర్వ్ చేసుకున్నావా? ట్రైనింగ్ అయిపోయి ఉద్యోగములో చేరాక, సిరికి నీకూ పెళ్ళి చేద్దమనుకుంటున్నాము. నువ్వు స్థిరపడితే మాకూ సంతోషము" అన్నాడు.

అప్పటికే పేపర్‌లో మీరు ఈ కోటిరూపాయలతో ఏమి చేస్తారని అడగటమూ, తను ఇంకా ఆలోచించుకోలేదని చెప్పటమూ జరిగింది. అప్పటి వరకూ లేని స్నేహితులు చాలామంది తన చుట్టూ చేరారు. 'ఉద్యోగము చేస్తే ఏమి వస్తుంది? హాయిగా నువ్వే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టు' అన్న వాళ్ళ బోధనలు చెవికెక్కాయి. చిన్ననాటి స్నేహితురాలు, నాన్న తోటి అటెండర్, స్నేహితుని కూతురైన సిరి తన కంటికి ఆనలేదు. అందుకే, "నేను ఉద్యోగం చేయను. సాఫ్ట్‌వేర్ కంపెనీ పెడతాను. ఇప్పుడే పెళ్ళి చేసుకోను" అని ఖరాకండీగా చెప్పేసాడు.

"అనుభవము లేకుండా వ్యాపారం ఏమి చేస్తావు? కొన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసి అనుభవం సంపాదించి, కంపెనీ పెట్టవచ్చు. అప్పటి వరకూ ఆ డబ్బును ఇలాగే యఫ్.డీలో ఉండనీయి వాడకు. ఇప్పుడు కాకపోతే రెండేళ్ళయ్యాకనే పెళ్ళి చేసుకో. అంతకు మించి ఆడపిల్ల వాళ్ళు ఎట్లా ఆగుతారు?" నచ్చచెపుతూ అన్నాడు నాన్న.

"ఉద్యోగంలో చేరను. నేను సిరిని చేసుకోను. అంతగా ఐతే సిరి పెళ్ళికి డబ్బులిస్తాను" అన్నాడు పొగరుగా.

నాన్న ప్రళయకాల రుద్రుడే అయ్యాడు. "నువ్వూ వద్దూ, నీ డబ్బులూ వద్దు! ఇంకెప్పుడూ నా కంటికి కనిపించకు" అని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టేసాడు. ఆ తరువాత స్నేహితులు చెప్పినట్లుగా బిజినెస్ పెట్టాడు. "బిజినెస్ చేసేవాళ్ళు, నీలాంటి సెలెబ్రిటీలూ సోషల్‌గా ఉండాలి" అంటూ అప్పటి వరకు చూడని కొత్తలోకాలు చూపించారు. ఆ మత్తు బుర్రకెక్కి విచక్షణాజ్ఞానం లోపించింది. బుర్ర తిరిగి ఈ లోకంలోకి వచ్చేసరికి ఏముంది? కాలం, డబ్బూ అన్నీ కరిగిపోయాయి. స్నేహితులేమయ్యారో తెలీదు. తను ఈ చెట్టు కిందకి చేరాడు. ఇక్కడ ఉండలేక ఎట్లైనా పోయే ముందు నాన్నను చూడాలని, క్షమాపణ అడగాలనీ మరీ మరీ అనిపిస్తోంది. నాన్నకు ప్రియమైన వాడు తనే కోపం తెపిస్తే, ఇక నాన్న కోపం తట్టుకోగలిగేవారు ఇంకెవరుంటారు? తనను నాన్న ముందుకు తీసికెళ్ళేవారెవరు?

"విష్ణూ, నువ్వేనా?"

ఆప్యాయంగా వినిపించిన పిలుపు విని తలెత్తాడు. సిరి ఎదురుగా నిలుచునుంది ఆశ్చర్యంగా చూస్తూ. 'అమ్మయ్య! నాన్నకు సిరి అంటే చాలా ఇష్టం. తనే నన్ను నాన్న దగ్గరకు తీసుకెళ్ళగలదు' అనుకొని సిరి చేయి పట్టుకొని, జరిగిందంతా చెప్పి, తను చేసిన ద్రోహానికి పశ్చాత్తాప

పడ్డాడు.

తన చేతిని పట్టుకున్న విష్ణు చేతిని చూస్తూ, “పద, ఇంటికి వెళుదాము. ముందు కోపం చూపించినా చల్లబడిపోతాడులే... నేను చెపుతానుగా. ఆ సిరి చంచలము కానీ ఈ సిరి కాదు. మరి వరించి వచ్చిన ఈ సిరిని పట్టుకున్న ఈ చేయి వదలవుగా?” అంది నవ్వుతూ.

“ఎప్పటికీ వదలను” అని చేతిని బిగించాడు విష్ణు.

***

# 25. సహచరి

ఉదయము మామూలుగా పని చేసుకుంటున్న జానకి అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయింది. అక్కడే ఉన్న కోడలు రమ్య కంగారుగా భర్త సుధాకర్‌ను పిలిచింది. తల్లిని చూసి కంగారు పడ్డ సుధాకర్ వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళితే వాళ్ళు ఐ.సీ.యూలో ఉంచి వైద్యం మొదలుపెట్టారు. అప్పుడు పొద్దున బ్రేక్‌ఫాస్ట్ చేయగానే ఏవేవో వ్యాపకాలు పెట్టుకొని తిరిగే తండ్రి కోసం ఎక్కడ వెతకాలో అర్థం కాలేదు సుధాకర్‌కు. అదృష్టవశాత్తూ ఆ రోజు తొందరగానే ఇంటికి చేరుకున్న వేణుగోపాలరావు భార్య అనారోగ్యం తెలుసుకొని గాభరాగా హాస్పిటల్‌కు వచ్చాడు. నాన్నను చూసి ఊపిరి పీల్చుకొన్నాడు సుధాకర్. తను బయటకు వెళ్ళేటప్పుడు కూడా, మంచినీళ్ళు, కండువా ఇచ్చి, బయట వరకూ వచ్చిన జానకిని ఇలా ఐ.సీ.యూలో స్పృహ లేకుండా చూసి తట్టుకోలేక పోయాడు వేణుగోపాలరావు. ఒక్కసారిగా వయసు మీద పడినట్లైంది. వణుకుతూ జానకి పక్కనే స్టూల్‌మీద కూలబడ్డాడు. ఐ.సి.యూలో ఉండనీయరని నాన్నకు నచ్చ చెప్పి బయట హాల్‌లోకి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు సుధాకర్. క్షణాలు భారంగా గడుస్తున్నాయి.

వాకింగ్‌లో ఊతం కోసం తీసుకెళ్ళే చేతి కర్ర మీద నిస్త్రాణంగా తల వాల్చిన వేణుగోపాలరావుకు 13 సంవత్సరాల వయసులో తన చేయి పట్టుకొని వచ్చిన చిన్ని పెళ్ళికూతురు జానకి కళ్ళ ముందు నవ్వుతూ కనిపించింది. అన్నయ్య రాఘవకు పుట్టుకతోనే మతి సరిగ్గాలేదు. అతని తరువాత నలుగురు ఆడపిల్లలు. చివరగా తను. తను తన స్నేహితునితో కలిసి పట్నంలో చదువుకుంటుండేవాడు. ఒక రోజు అర్జెంట్‌గా రమ్మని ఊరినుంచి తండ్రి కబురు చేసాడు. అప్పటికే తండ్రి స్నేహితుడైన కరణంగారి అమ్మాయితో తన వివాహము నిశ్చయం చేసి, ముహూర్తము కూడా పెట్టుకున్నారు. గృహప్రవేశము రోజు తన పక్కన పొందికగా

తలవంచుకొని కూర్చున్న తన చిన్నారి సహచరిని చూసాడు. ఎప్పుడూ అలాగే పొందికగా ఉండేది.

తను చదువని, ఆ తరువాత ఉద్యోగం అని పట్నంలో ఉండిపోయినా అత్తగారికి చేదోడుగా పల్లెలోనే ఉండిపోయింది. మతిలేని బావగారిని సొంత కొడుకులా ప్రేమగా చూసుకునేది. వచ్చేపోయే ఆడపడుచులు, బంధువులను అభిమానంగా ఆదరించేది. తను నెలకోసారి చుట్టం చూపుగా వచ్చి వెళ్ళేవాడు. అంత చిన్న వయసులోనే సంసార బాధ్యతలను మోస్తున్న భార్య గురించి తనెప్పుడైనా ఆలోచించాడా? ఏమో మరి గుర్తులేదు. తల్లి, తండ్రి, అన్నయ్య కాలం చేసాక, ఆరుగురు పిల్లలతో పట్నంలో తమ సంసారం మొదలు పెట్టారు. అప్పుడు కూడా ఇంటికి కావలసినవి తెచ్చి ఇవ్వటము  తప్ప ఇంటి గురించి తనేమీ పట్టించుకోలేదు. పిల్లలను స్కూల్‌లో చేర్చటము మటుకే తను చేసాడు అంతే. తను రిటైరయి వచ్చేసరికి పిల్లలందరి పెళ్ళిళ్ళూ అయిపోయి తలా ఒకచోట సెటిలైపోయారు. తనతో పాటు తన ఇంట్లో పెద్ద కొడుకు,కోడలు, వాళ్ళ పదేళ్ళ కూతురు, ఎనిమిదేళ్ళ కొడుకుతో ఉంటున్నారు. ఇప్పుడు కూడా పొద్దున వంట చేసి కొడుకుకు, కోడలికి, మనవడికి, మనవరాలికి టిఫిన్ బాక్స్ లు కట్టి ఇవ్వటమూ తనే చూసుకుంటుంది. ఈరోజు వరకూ తనకు ఇది కావాలి అని ఏదీ అడగలేదు. తను మటుకు ఏదో ఒక వ్యాపకము పెట్టుకొని బయటకు వెళుతున్నాడు.

ఓ రోజు ఒంట్లో కాస్త నలతగా అనిపించి సాయంకాలము బయటకు వెళ్ళలేదు. గదిలోనే పడుకొని ఉండిపోయాడు. ఎందుకో గది బయటకు వచ్చిన తనకు కోడలు తన గదిలో పడుకొని ఉండటమూ, జానకి మనవడు, మనవరాలికి పాలు ఇస్తూ, వాళ్ళకోసం ఏవో స్నాక్స్ తయారు చేస్తూ వంట ఇంట్లో సతమతమవుతూ కనిపించింది. జానకిని చూస్తుంటే, జానకి జానకమ్మగా, అమ్మమ్మగా, బామ్మగా, అత్తగారిగా మారింది కాని

తన జీవనశైలి మటుకు మారలేదు అనిపించింది. తను తన గురించే ఆలోచించాడు ఇన్ని రోజులుకాని, జానకి గురించి ఆలోచించలేదు. ఎంత పొరపాటు చేసాడో అర్థమైంది. ఇప్పుడైనా జానకిని బాధ్యతల నుంచి తప్పించాలి అని జానకిని గుడికి వెళుదాము రమ్మని పిలిచాడు. అప్పుడు జానకి కళ్ళల్లో విస్మయమూ, ఆనందమూ కనిపించింది. కోడలికి పిల్లలను అప్పగించి ఇద్దరూ గుడికి  వెళ్ళారు. అదో అప్పటి నుంచి సాయంకాలము జానకితో కలిసి గుడికి, అప్పుడప్పుడు తెలిసిన వారింటికివెళ్ళటమూ, అక్కడ పరిచయము అయిన తమ వయసు వారితో కలిసి అప్పుడప్పుడు యాత్రలకెళ్ళటమూ, రాత్రిళ్ళు జానకి మనవళ్ళకు చెప్పే కథలల్లో తనూ పాలు పంచుకోవటమూ అలవాటు చేసుకున్నాడు. జానకి కూడా ఇదివరకు కన్నా సంతోషముగా కనిపిస్తుండటము తో తను ఇప్పటికైనా ఎంత మంచి నిర్ణయము తీసుకున్నాడో అర్థమైంది. ఇలా ఆనందముగా సాగిపోతున్న  జీవితములో ఇదేమిటి? జానకిని మళ్ళీ మామూలుగా  తను ఎట్లా చూస్తాడు?

ఇలా మథన పడిపోతున్న వేణుగోపాలరావు చేతి మీద చేయి వేసి "తాతా!" అని పిలిచాడు మనవడు కార్తీక్. నీళ్ళు నిండిన కళ్ళకు కార్తీక్ మసకగా కనిపించాడు.

తాత కళ్ళు తుడుస్తూ "తాతా ఏడవకు. బామ్మకు నయమవుతుంది." అన్నాడు. బాలవాక్కు బ్రహ్మ వాక్కు అన్నట్లు అప్పుడే డాక్టర్ వచ్చి జానకి కళ్ళు తెరిచిందని, ఇక ప్రమాదము లేదని చెప్పాడు.

***

**(చేతికర్ర మీద ఉన్న వృద్ధుని చేతి మీద, ఓ చిన్నారి చేయి ఆసరాగా ఉన్న చిత్రానికి, ఫేస్బుక్ మన కథలు – మన భావాలు' అనే సాహితీ సమూహంలో కథ రాయమని ఇచ్చిన టాపిక్‌కు నేను రాసిన చిట్టికథ.)**

# 26. అయినదిపో... మేమేల పోవలె... పోతిమిపో...

రెండురోజుల నుంచీ జ్వరం అని నాగా పెట్టిన యాదమ్మ పొద్దున్నే వచ్చి గబగబా గిన్నెలు తోముతోంది.

"ఏంటి యాదమ్మా? జ్వరం తగ్గిందా? అంత హడావుడిగా ఉన్నావేమిటి?" అడిగాను.

"అమ్మా, యాప్రాన్ చెరువు దగ్గర యన్. టి. ఆర్ సినిమా షూటింగ్ అట" సంబరంగా చెప్పింది.

"అవునా?" అని పిట్టగోడ మీదుగా బయటకు చూసాను. మా ఇంటి వెనుకనే అనాబ్ షాహీ ద్రాక్షతోటలూ, ఆ పక్కనే యాప్రాన్ చెరువు ఉన్నాయి. ద్రాక్షపండ్ల కాలంలో మా స్నేహితులము , పిల్లలతో ఆ తోటలకెళ్ళి కాసిని తిని, కాసిని కొనుక్కొని, చెరువు ఒడ్డున తిరిగి వస్తుంటాము.

"అక్కడేమీ కనిపించటం లేదుగా?" అడిగాను.

"వస్తారటమ్మా, నేను పోతున్నా" అని వెళ్ళిపోయింది.

ఓ అయిదుసంవత్సరాల క్రితం వరకూ ఎండాకాలం సెలవలల్లో అమ్మ ఒకటో రెండో సినిమాలకు, అవీ గులేబకావళి కథ, జగదేకవీరుని కథ, కృష్ణావతారం లాంటి సినిమాలకే తీసుకెళ్ళేది. పెళ్ళి తరువాత ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో వచ్చే హిందీ సినిమాలే తప్ప తెలుగువి చూడలేదు. అందుకని నాకు యన్.టి.ఆర్ తప్ప ఇంకే హీరో తెలియదు.

లంచ్‌కు ఏమండి వచ్చినప్పుడు "మనింటి వెనుక యన్.టి.ఆర్

సినిమా షూటింగ్ అట. పొట్టిపొట్టి గౌన్లు వేసుకొని కత్తి యుద్ధాలు చేస్తాడేమో! వెళ్ళి చూద్దామా?" సరదాగా అడిగాను.

"పొట్టి గౌన్ల సినిమా కాదుట. కర్ణుడి సినిమాట. ఇక్కడ యుద్ధం సీనులు తీస్తారట. షూటింగ్ చూసేందుకు రమ్మని మాకు ఇన్విటేషన్ పంపారు" జవాబిచ్చారు.

అబ్బా కర్ణుడి పాత్రంటే నాకెంత ఇష్టమో! తప్పకుండా షూటింగ్ చూడాల్సిందే అనుకొని, పని చేసుకుంటూ మధ్యమధ్య పిట్టగోడ మీద నుంచి తొంగి తొంగి చూస్తూ ఉండగా....

చూస్తుండగానే చకచకా గుడారాలు వేసారు. రథాలు, గుర్రాలు, ఏనుగులు బోలెడు వచ్చేసాయి. సైనికులు ఎంత మంది వచ్చారో! యాప్రాన్ చెరువు ఒడ్డంతా యుద్ధభూమిలా మారిపోయింది. ఎంత హడావుడి, ఎంత హంగామా!

మా ఆర్డర్లీ దివాన్‌చంద్, "షూటింగ్ షురూ హోనేవాలా హై. ఛలో బేటీ, బాబా ఘోడా, హాతీ దేఖేంగే" అని పిల్లలిద్దరినీ తీసుకెళ్ళాడు. మూడేళ్ళు కూడా నిండాలేని మా అబ్బాయి కూడా ఘోడా, హాతీ దేఖేంగే అని ఉషారుగా వెళ్ళాడు. అప్పటికే కాలనీలో పిల్లలందరు హాతీ, ఘోడా అని పరుగులు తీస్తున్నారు.

షూటింగ్ మొదలయ్యిందని తెలిసాక మా ఫ్రెండ్స్ మి వెళ్ళాము. మమ్మల్ని చక్కగా రిసీవ్ చేసుకొని ముందు వరుసలో కుర్చీలేసి కూర్చోబెట్టారు. చక్కగా చాయ్, స్నాక్స్ పెట్టారు. స్నాక్స్ వద్దని చాయ్ మాత్రం సుతారంగా తీసుకున్నాము. 'అబ్బా, ఈ చాయ్ కంటే మన లంగర్ చాయ్ బాగుంటుంద'నుకుంటూ అది పారబోయలేక, తాగలేక మింగుతూ యన్.టి.ఆర్ కోసం చుట్టూ వెతుకుంతుంటే, 'యన్.టి.ఆర్‌కు

ఈ రోజు షూటింగ్ లేదు అందుకని రాలేదు' అని చాయ్ అంత చల్లగా చెప్పారు. హుం. నిరాశగానే కాసేపు షూటింగ్ చూసి వచ్చేసాము.

ఆ రోజు యన్.టి.ఆర్ వస్తున్నారని మా దివాన్‌చంద్ కబురు తేగానే, మళ్ళీ పొలోమంటూ వెళ్ళాము. దాదాపు ఇరవై కిలోల బరువు ఉన్న ఆభరణాలు, కిరీటం ధరించి, మంచి మంచి పట్టు చీరలతో పట్టుపంచె... భుజకీర్తులు... ఈ అలంకారాలతో, యన్.టి.ఆర్ దుర్యోధనుని గెటప్‌లో కనిపించారు. 'అమ్మో ఎన్ని నగలో!' అని ఆశ్చర్యపోతూ ఒకరి మొహాలొకరం చూసుకున్నాము. 'అబ్బా ఎంత మేకప్?' అనుకున్నాము. 'అంత మందమైన మేకప్ చేసుకోవాలా? యుద్ధభూమిలో అన్ని నగలు, అవన్నీ అవసరమా?' అని విస్తుబోయాము. నాకు మటుకు మొదటిసారి యన్.టి.ఆర్‌ను నాకిష్టమైన కర్ణుడి పాత్రలో చూడలేదని కాస్త నిరాశ కలిగినా 'రారాజులా ఠీవిగా బాగానే ఉన్నాడులే...' అని సర్దుకున్నాను.

షూటింగ్ విరామసమయంలో ఆయనతో మాట్లాడుదామని వెళితే, మమ్మల్ని మర్యాదగా కూర్చోబెట్టి చాలా సేపు మాట్లాడారు. ఆర్మీ ఆఫీసర్స్ భార్యలమని తెలియగానే మమ్మల్ని చాలా పొగిడారు. దేశసేవ కోసం మేము చాలా త్యాగాలు చేస్తున్నామని పొగిడేస్తుంటే కాస్త సిగ్గు, మొహమాటం అనిపించినా చెప్పొద్దూ దేశరక్షణ భారమంతా మేమే మా భుజస్కంధాల మీద మోస్తున్నంతగా ఫీలైపోయాము. షూటింగ్ అయిపోయాక ఓరోజు విందుభోజనానికి తప్పక రావలెనని ఆహ్వానించారు. అంత పెద్దాయన అంత అభిమానంగా మాట్లాడుతుంటే ఎంత సంతోషమేసిందో!

అక్కడేమో కానీ మా కాలనీలో ఒకటే షూటింగ్ హడావిడి! పనివాళ్ళు నాగాలు పెట్టకుండా యంటీవోడ్ని చూడాలని రోజూ వచ్చి పని చేసి పోతున్నారు. పిల్లలు స్కూల్ నుంచి రాగానే హాతీ, ఘోడా

అంటూ తిండి కూడా సరిగ్గా తినకుండా అటే పరుగులు పెడుతున్నారు. ఇంట్లో చీపురు కట్టలు చెదిరిపోయి పుల్లలు కత్తులుగా, బాణాలుగా మారిపోతున్నాయి. పాత పేపర్లు కిరీటాలుగా తలల మీద నిలబడలేక వాలిపోతున్నాయి. రోజొక కొత్త చీపురు తేలేక కృష్ణ కిరాణా షాప్ నుంచి ఓ అట్టెపెట్టె, రంగురంగుల మెరుపు కాగితాలు తెచ్చి, పిల్లలిద్దరికీ కిరీటాలూ, కవచము, కత్తులు, బాణం తయారు చేసిచ్చాను. అంతే కిరాణాషాప్‌లో పారేయటానికని పెట్టిన అట్టెపెట్టెలన్నీ కిరీటాలు, కత్తులు, బాణాల రుపాంతరం చెందాయి. షూటింగ్ అయిపోగానే మా ఇళ్ళ ముందు కత్తి యుద్ధాలు మొదలు. చీమ చిటుక్కుమన్నా వినిపించేంత భయంకరమైన నిశ్శబ్దంలో ఉండే మా సైనిక్‌పురి వెనక వైపు నుంచి ఏనుగుల ఘీంకారాలూ, గుర్రాల సకిలింపులూ, సాయంకాలం పిల్లల యుద్ధాల అరుపులూ అందులోనే అసలు సిసలు కొట్లాటలు హబ్బో కాలనీ అదిరిపోతోంది!

ఏమండీకి భోజనం వడ్డిస్తూ షూటింగ్ ముచ్చట్లు చెపుతుంటే దివాన్‌చంద్ పిల్లలను తీసుకొని గాభరాగా వచ్చాడు. ఏమిటాని చూస్తే ఇద్దరి ఒళ్ళూ కాలిపోతోంది. వెంటనే యం. ఐ రూంకు పరిగెత్తాము. అప్పటికే మా వాళ్ళు కొంత మంది పిల్లలను భుజాల మీద వేసుకొని ఉన్నారు. ఒక్కళ్ళకు కూడా టెంపరేచర్ 105 / 106 డిగ్రీలకు తక్కువగా లేదు! నర్సింగ్ అసిస్టెంట్స్, డాక్టరమ్మా బిజిబిజీగా ఉన్నారు. బాబును మంచం మీద పడుకోబెట్టి వాళ్ళిచ్చిన ఐస్‌తో నేను స్పాంజింగ్ చేస్తుంటే, ఏమండి మా అమ్మాయిని పట్టుకొని ఇంజెక్షన్ ఇప్పించేందుకు తన వెనుక, ఏమండి వెనుక నర్సింగ్ అసిస్టెంట్ సిరంజ్ పట్టుకొని పరుగులు తీస్తున్నారు. అమ్మలు కళ్ళనీళ్ళతో ఒకరికి ఐస్ స్పాంజింగ్ చేస్తుంటే, నాన్నలు ఇంకోళ్ళ వెనుక గస తీస్తూ పరుగులతో కురుక్షేత్రాన్ని మరిపిస్తోంది యం. ఐ. రూం!

ఓ క్షణం ఐసింగ్ ఆపి, పిల్లల వెనుక యూనీఫాం లో పరుగులు తీసుతున్న నాన్నలను చూస్తే, వాళ్ళ డ్రిల్, క్రాస్ కంట్రీ ఎక్సర్సైజ్ ఎప్పుడూ చూడలేదేమో చెప్పొద్దూ భలే ముచ్చటేసింది. పాకిస్తానోడు కూడా ఇంతలా పరుగులు పెట్టించి ఉండడు. అంతేలే, ఎంతవారలైనా పిల్లల దాసులేగా అనుకొని ఐసింగ్‌లో పడిపోయాను. సూదిమందు ప్రహసనం అయ్యాక, పిల్లలు ఆగమ్మకాకుల్లా ఆ షూటింగ్‌కు ఎండలో పరుగులు పెడుతుంటే, ఆపకుండా కత్తులూ కఠారులూ చేసిచ్చారు అని ఏమండీలు మా మీద తూటాలు వదులుతుంటే, “అసలు ఆ షూటింగ్ ఇక్కడ ఎందుకు అవవలే... అయినదిపో... మేమేల పోవలె... పోతిమిపో....” అని పరిపరి విధముల చింతించితిమి!

(ఇదండీ నా గల్పిక. అసలు గల్పిక అంటే ఏమిటని ఎవరికైనా అనుమానం రావచ్చు. ఏమీలేదండి మీ అనుభవం రాయటమే. అటు కథ కాకుండా... ఇటు వ్యాసం కాకుండా... ఒక్క పాత్రతో స్వగతంలా మాట్లాడించేది లేక కథ చెప్పించేది.)

ఇక ఈ సంఘటన గురించి చిన్న వివరణ ఏమిటంటే, దానవీరశూరకర్ణ సినిమా యుద్ధము షూటింగ్ సైనిక్‌పురి వెనకాల ఉన్న యాప్రాన్ చెరువు దగ్గర జరిగింది. అప్పట్లో అక్కడ ఇళ్ళూ, చెట్లూ ఏమీ లేవు. అంతా ద్రాక్షతోటలు, యాప్రాన్ చెరువు మాత్రమే ఉండేది. సైనిక్‌పురిలో అక్కడక్కడా ఇండిపెండెంట్ హౌసెస్ ఉండేవి. కాలనీ అంతా పెద్దపెద్ద చెట్లు ఉండేవి. మా ఇంటి వెనుకవైపు పిట్టగోడ మీద నుంచి చూస్తే అంతా కనిపించేది. తోటలు, చెరువు కాబట్టి దోమలు చాలా ఉండేవి. పిల్లలకు ఆ దోమలకాటుతో, ఎండ దెబ్బతో మలేరియా వచ్చింది. ఇప్పటి సంగతి నాకు తెలియదు, అప్పట్లో మలేరియా అంటే 105/106 డిగ్రీల జ్వరం వచ్చేది. పిల్లలకు బట్టలు తీసేసి, ఫాన్ ఫుల్‌గా వేసి ఫాన్ కింద నిలబెట్టి, ఐస్‌తో కోల్డ్ స్పాంజింగ్

జ్వరతీవ్రతను తగ్గించేందుకు చేసేవారు. కొసమెరుపేమిటంటే యన్. టి. రామారావుగారు మమ్మల్ని విందుకు ఆహ్వానించినా పిల్లల జ్వరాలతో చాలా మందిమి వెళ్ళలేకపోయాము. కానీ ఆయనతో మాట్లాడటము ఓ మంచి జ్ఞాపకంగా మిగిలిపోయింది. యాప్రాన్ కంటోన్మెంట్ ఏరియా కాకపోయినా మిలిట్రీవాళ్ళ రెసిడెన్సియల్ ఏరియా అని ఆ చుట్టుపక్కలకు సివిలియన్స్ ను పర్మిషన్ లేకుండా రానిచ్చేవారు కాదు. సైనిక్‌పురిలో అప్పుడు సివిలియన్స్ ఇళ్ళు ఉండేవి కావు. అందుకని షూటింగ్ కోసము కూడా పర్మిషన్ తీసుకున్నారు. అందువల్ల అక్కడ మాకు స్పెషల్ ట్రీట్మెంట్ ఇచ్చారు. పిల్లలకు అంత జ్వరాలు ఒక్కసారే అందరికీ వస్తాయా? వగైరా వగైరా ప్రశ్నలు రాకుండా ఈ వివరణ అన్నమాట.

***

**- తరుణి అంతర్జాల వారపత్రిక 12.06.2023.**

# 27. సువ్వీ సువ్వీ పాడాలమ్మా!!!

(ఫేస్‌బుక్‌లోని 'పొన్నాడ వారి పున్నాగ వనం' సాహితీ సమూహములో ఇచ్చిన, 'మన సాంప్రదాయాలు' అనే అంశానికి రాసినదీ కథ.)

***

రియా వెళ్ళి చాలా సేపైంది ఇంకా రాలేదేమిటీ అని వాష్‌రూమ్స్ వైపు వెళ్ళింది శ్రావణి.అక్కడ ఓ కుర్చీలో, మోకాళ్ళు పైకి ముడిచి పెట్టుకొని కూర్చొని, మోకాళ్ళ మీద తలానించి ఏడుస్తున్న రియాను ఆశ్చర్యంగా చూసి "ఏమైంది రియా? ఎందుకేడుస్తున్నావు?" అని కంగారుగా అడిగింది. జవాబివ్వకుండా ఇంకా వెక్కిళ్ళు పెడుతున్న రియాను దగ్గరకు తీసుకొని ఓదారిస్తే, చిన్నగా తన యూనీఫాంకు అంటిన రక్తం మరకలను చూపించి "ఇవి ఎట్లా వచ్చాయో తెలీటం లేదు. ఇప్పుడు ఏమి చేయను? భయంవేస్తోంది... అమ్మ ఏమంటుందో!" పెద్దగా ఏడ్చింది. ఒక్క క్షణం శ్రావణి కంగారు పడింది. వెంటనే ఈ సంవత్సరము స్కూల్ మొదలైనప్పుడు జాగ్రత్తలు చెప్పిన అమ్మ తన స్కూల్ బాగ్‌లో ఎప్పుడూ ఉంచుకోమని ఇచ్చిన చిన్న కవర్ గుర్తొచ్చింది. వెంటనే క్లాస్ రూముకు వెళ్ళి తన బాగ్‌లోని కవర్ తీసుకొచ్చి, అందులోని పాడ్ తీసి, రియాకు ఇచ్చి, అది ఎలా వాడాలో చెప్పింది.

"నీకు తెలుసా ఇట్లా అవుతుందని? నీకు కూడా అవుతుందా?" ఆశ్చర్యంగా అడిగింది రియా.

"నాకు ఇంకా కావటము లేదు కాని మా అమ్మ చెప్పింది, ఎప్పుడైనా కావచ్చుని, కంగారు పడవద్దని... ఇది ఇచ్చి ఎలా వాడాలో చూపించింది. పద మేడమ్‌నడిగి పర్మిషన్ తీసుకొని వస్తాను. ఇద్దరమూ ఇంటికి

వెళదాము” అంది శ్రావణి. తొందరగా ఇంటికి వచ్చిన శ్రావణిని చూసి “ఏమైంది?” కంగారుగా అడిగింది స్వాతి.

“నాకేమీ కాలేదమ్మా. రియాకు పిరియడ్ వచ్చింది. రియాను ఇంట్లో డ్రాప్ చేసి వచ్చాను” అంది.

మరునాడు నువ్వులు, ఎండుకొబ్బరి, బెల్లం కలిపి రోట్లో దంచి, చిన్న చిన్న ఉండలుగా చేసి తీసుకొని, రియాను చూసొద్దామని వెళ్ళింది స్వాతి. “రారా స్వాతీ. చూసావా మా రియా మాకు పనిపెట్టింది.” సంబరంగా ఆహ్వానించింది రియా అమ్మమ్మ. అక్కడంతా సందడిగా ఉంది. రియా తాతగారు, డాడీ, ఇంకా ఎవరెవరో ఉన్నారు. రియా తల్లి దీప పేపర్‌లో ఏదో రాస్తున్నదల్లా, ఆ పేపర్, పెన్ భర్తకిచ్చి, “రా స్వాతీ!” అని లోపలికి తీసుకెళ్ళింది. బెడ్‌రూమ్‌లో మంచం మీద నీరసంగా ముడుచుకొని పడుకొని ఉంది రియా.

“నిన్న స్కూల్‌నుంచి వచ్చినప్పటి నుంచి, నాకెందుకిట్లా అవుతోందని ఏడుస్తూ ఇట్లాగే పడుకుంది. ఏమీ తినటము లేదు. మమ్మీ, డాడీ వచ్చారు. ఈ రోజు ఆంటీ అంకుల్ వస్తారు. పెద్ద ఫంక్షన్ చేయాలని ఏర్పాట్లు చేస్తున్నాము. బయట చూసావుగా, కాటరింగ్ వాళ్ళూ, పూల డెకరేషన్ అందరూ వచ్చారు. షాప్ కెళ్ళి పట్టుచీరా, నగా తేవాలి. ఇంకా బోలెడు పనులున్నాయి. ఇదేమో ఇట్లా ఉంది చూడు.” అంది దీప కాస్త చిరాకుగా.

రియా పక్కన కూర్చొని మృదువుగా రియాను తట్టింది స్వాతి. స్వాతిని చూసి లేచి కూర్చుంది రియా. “రియా నిన్నటి నుంచి ఏమీ తిలేదటకదా! ఇదో నీ కోసం నేను స్పెషల్ స్వీట్ తెచ్చాను తిని చూడు.” అని ఒక చిమ్మిలి ఉండ రియాకిచ్చింది స్వాతి. ముందు కొద్దిగా కొరికి, పూర్తిగా తినేసింది రియా. అది చూసి కాస్త మొహం చిట్లించి

“ఏమిటిది నువ్వుండనా? ఇలా నువ్వుండలు, పసుపు రాయటమూ దూరంగా కూర్చోపెట్టి ఒక బొమ్మ చేతికివ్వటమూలాంటి చాదస్తాలన్నీ మేము మానేసాము. పీరియడ్ వస్తే దూరంగా కూడా కూర్చోము. సెక్స్ ఎడ్యుకేషన్ అని పిల్లలకు అన్ని చెప్పటము నాకు ఇష్టం లేదు.” అంది కాస్త విసురుగా దీప.

దీపవైపు సాలోచనగా చూసి,”సెక్స్ ఎడ్యుకేషన్ అంటే నీ దృష్టిలో పత్రికలల్లో వచ్చే శృంగారకథలూ, సలహాలూ సంప్రదింపులా దీపా? వాటి గురించి మనకెందుకు కానీ, నేను మా శ్రావణికి ముందుగా చెప్పటము గురించి నువ్వు అంటుంటే మాత్రం నేను ఒప్పుకోను. వయసు వస్తున్న అమ్మాయికి తన శరీరంలో జరిగే మార్పుల గురించి ముందుగా తెలియచెప్పటము, తగిన జాగ్రత్త తీసుకోవటము, మన బాధ్యత. తెలుసుకోవటము వాళ్ళ హక్కు. ఈ మధ్య కొంతమంది స్కూళ్ళకు వెళ్ళి ఆడపిల్లలకు Menstruation గురించి వివరిస్తున్నారు. అమెరికాలో మాల్స్ లల్లో, స్కూల్స్ లల్లో, అన్ని పబ్లిక్ ప్లేస్‌లల్లోనూ లేడీస్ వాష్ రూములో సానిటరీ నాప్కిన్స్ ఉంచుతారని విన్నాను. మరి మన దగ్గర ఆ ఏర్పాటు ఉందోలేదో నాకు తెలీదు.

ఇక దూరంగా కూర్చోబెట్టటమంటే వారి చిన్ని శరీరానికి విశ్రాంతి ఇవ్వటము. పసుపు, వేపాకులు వేసి మరిగించిన నీటితో స్నానం చేయించటము, ఈ నాలుగురోజులూ నూనెలో పసుపు కలిపి ఒంటికి రాయటమూ, ఈ మార్పులో సున్నితమైన వారి లేత శరీరానికి ఏ బాక్టీరియా అంటకుండా రక్షణ కవచము ఏర్పరచటము. ఇక నువ్వులూ, బెల్లము, ఎండుకొబ్బరి, పులగము లాంటి వాటితో భోజనము పెడితే సులువుగా జీర్ణము అవుతాయి. అంతే కాదు విటమిన్ సి, విటమిన్ డి, అంటూ నానా రకాల టాబ్లెట్స్ మింగించకుండా ప్రకృతి సిద్ధమైన విటమిన్లను అందిస్తున్నాము. బొమ్మ ఇవ్వటము అంటే ఇప్పుడంటే సెల్‌ఫోన్ లల్లో

రకరకాల ఆటలు ఆడుకుంటూ పిల్లలు బిజీగా ఉంటున్నారు కాని ఆ రోజులల్లో తాటాకుబొమ్మలే కదా ఆడపిల్లలకు ఆటబొమ్మలు. వారికి ఆ సమయములో కలుగుతున్న శారీరక చికాకు, బాధ మీద నుంచి ధ్యాస మళ్ళించి, బిజీగా ఉంచేందుకు ఇచ్చేవారేమో. ముత్తదువులు 'సువ్వీ సువ్వీ' అంటూ రోటిలో బెల్లమూ, నువ్వులూ వేసి రోకలితో దంచటము, పసుపు దంచటము అంటే శుభ్రమైన పసుపు కొమ్ములను రోట్లో దంచి కొట్టిన శుద్ధమైన పసుపు ఒంటికి మంచిదనీ ఇక నువ్వులూ, బెల్లమూ రోట్లో దంచుతే మిక్సీలో కన్నా చక్కగా మెదుగుతాయి అని రోకలితో దంచుతూ, పాటలు పాడుతూనే బోలెడన్ని విషయాలు చెప్పేవారు. ఈ ఫంక్షన్ అనే కాదు, గొబ్బెమ్మైనా, బతకమ్మైనా, పెద్దమనిషి పేరంటమైనా, సీమంతమైనా ఏదైనా ఆ పాటలల్లో జీవిత సత్యాలు, మనము ఎలా మెలగాలో బోధించేవారు.

ప్రతి నెలా స్త్రీలు మూడు నుంచి ఐదురోజుల వరకు ఋతుస్రావం జరిగే సమయంలో బాధ అనుభవిస్తారు. కొంత మందికి విపరీతమైన బాధ ఉంటుంది. పూర్వకాలములో ఉమ్మడికుటుంబాలు, అందరూ పని చేయక తప్పదు. అందుకని మొదటి మూడు రోజులు పూర్తిగా, ఆ తరువాత పై పై పనులు చేసుకోవచ్చని, మామూలుగా చెపితే వినరని ఇలా దూరంగా ఉంచే ఏర్పాటు చేసారు. కాకపోతే, మన పెద్దవాళ్ళు మంచికి ఏర్పాటుచేసిన అన్ని సాంప్రదాయాలలాగే ఇదీ మూర్ఖమైపోయుంది . సువ్వీసువ్వీ అని పాడాలి. మన పిల్లలకు మంచీ చెడూ నేర్పాలి." అని చెప్పి ఒక్క నిమిషం ఆగింది స్వాతి. ఏమీ మాట్లాడలేక ఆలోచనలో పడింది దీప. కొద్దిసేపు కూర్చొని తను తెచ్చిన బాక్స్ రియా చేతిలో పెట్టి లేచింది స్వాతి. "ఇంతసేపు ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగాడు కిరణ్.

"ఏముంది? చాలామందికి ప్రతిదీ చాదస్తం అంటూ ఓ పాట అలవాటైపోయింది. మన పెద్దవాళ్ళు ఆనాటి కాలమాన పరిస్థితులను బట్టి

ఏర్పరచిన ఆచారాలను, సాంప్రదాయాలను ఓ పక్క చాదస్తాలంటూ, అప్పటి పద్ధతి ప్రకారము ఏర్పరచిన కొన్ని మూఢాచారాలను పాటిస్తారు. అవసరమైన వాటిని చాదస్తాలంటూ కొట్టిపారేస్తారు. ఆడంబరాల మీద ఉన్న ఇంట్రెస్ట్ అవసరాల మీద ఉండటం లేదు. ఐనా నాకు తెలీక అడుగుతాను ఏది చాదస్తం? మా తాతగారింటి ముందు గాబు నిండా నీళ్ళు,  పక్కన ఒక చెంబు ఉంచేవారు. ఇంటికెవరొచ్చినా ఆ నీళ్ళతో కాళ్ళు కడుక్కొని లోపలికి వచ్చేవారు. మడితో వంట చేసేది అమ్మమ్మ. మా అమ్మ మేము స్కూల్‌నుంచి రాగానే స్నానం చేసి,  బట్టలు మార్చుకుంటే నే కానీ హార్లిక్స్ ఇచ్చేది కాదు. సారీ కిరణ్, ఇన్ని చెపుతున్న నేను, నువ్వు మార్కెట్ నుంచి తెచ్చిన కూరలూ,  పండ్లూ అన్నీ విడివిడిగా గిన్నెలల్లో చాలా నీళ్ళు పోసి,  అందులో వేసి కడగమంటే విసుక్కునేదానిని. సామాన్లు కూడా కాసేపు బయట ఉంచి లోపల పెట్టమంటే అబ్బా అనేదానిని. ఇప్పుడు కరోనా దయవల్ల నాకే కాదు అందరికీ అర్థం అవుతోంది, అవన్నీ ఎంత మంచి అలవాట్లో..." అంది స్వాతి.

"అన్నీ మంచి అలవాట్లే, నిజమే కానీ ఒకప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా పెద్దలు చెప్పిన పద్ధతులు, సంప్రదాయాల వెనుకనున్న అసలైన అర్థాన్ని తెలుసుకొని వాటిని పాటించాలి అంతేకాని పద్ధతుల పేరిట గుడ్డిగా చాదస్తంగా ఆచరించకూడదు. అవన్నీ ఎవరికివారు తెలుసుకోవలసిందే స్వాతీ. ఎవరికీ చెప్పలేము. ఇక ఆడంబరాలంటావా? అవి ఒకరిని చూసి మరొకరు పోటీలు పడి చేస్తున్నారు. అది వారి స్వవిషయం. మనకెందుకు? నువ్వు చెప్పాల్సింది చెప్పావు. ఇక మన సంగతి చూద్దామా? వేడివేడిగా డిన్నర్ రెడీ. శ్రావణీ, రారా అమ్మలూ! ఆకలేస్తోంది" భార్యను సముదాయిస్తూ, కూతురిని పిలిచాడు కిరణ్.

***

# 28. అత్త ఉన్న కోడలు ఉత్తమురాలు

**(ఫేస్ బుక్ 'మన కథలు- మన భావాలు' సాహితీ సమూహములో ఇచ్చిన 'ముగింపు మాది'కి రాసినది ఈ కథ.)**

***

"నువ్వేనా సాధ్యా? అమాయకంగా పుస్తకాలే ప్రపంచంగా, కాలేజ్, ఇల్లే నీకు తెలిసిన ప్రదేశాలుగా బ్రతికావు. ఎదుటి వారిది తప్పైనా, తలవంచుకుని తప్పుకునే దానివి. ఎం బీ ఏ గోల్డ్ మెడలిస్ట్ వి. చక్కని కుటుంబానికి కోడలుగా వెళ్లావు. అందగాడు, ఆస్తిపరుడు, మంచి ఉద్యోగం ఉన్న విశాల్‌తో పెళ్లి జరిగింది. మేమంతా నీవు ఎంత అదృష్టవంతురాలివో అనుకున్నాం. నోట్లో నాలుక లేని దానివి ఇవాళ ఇలా వీధిలో, ఎవరో తెలియని అమ్మాయిని ఇబ్బంది పెడుతున్నాడని, వాడ్నెవడినో కాలర్ పట్టుకుని, చెంపలు వాయించి, చెడామడా తిట్టేస్తున్నావ్? ఇంత ధైర్యం నీకెలా వచ్చింది? అసలు నీ అవతారం ఏంటిలా మారింది? ఏసీ కార్లో తిరుగుతుంటావనుకున్నా? ఇంత సాధారణంగా, ఆ హ్యాండ్‌బ్యాగ్ వేసుకుని ఈ రోడ్‌పై? ఏంటే ఇదంతా?" ఆపకుండా ప్రశ్నలపై ప్రశ్నలు వేస్తున్న పరిమళ వైపు చూసి, చిన్నగా నవ్వి, "హే... పరీ! నువ్వా! సడెన్‌గా ఐదేళ్ల తరువాత నువ్విక్కడ? వైజాగ్‌లో ఉంటున్నావు కదా నువ్వు? విజయవాడ ఎప్పుడొచ్చావ్? పైగా స్కూటీలో. అంటే ఈ ఊరికి షిఫ్ట్ అయ్యారా? మీ వారు గోల్డ్ బిజినెస్ కదా?" తన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, ప్రశ్నిస్తున్న సాధ్య వైపు చిరాగ్గా చూస్తూ... "ముందు నీ విషయం చెప్తావా?" చిరుకోపంగా అడిగింది పరిమళ.

"హ్మ్... సరే, ముందు మా ఇంటికి పోదాం పద. ఇక్కడికి దగ్గరలోనే ఉంటున్నా. ఈ పక్కనే డే కేర్‌లో నా పాప ఉంది తీసుకుని

పోదాం." అంటూ... ఏ భావం చూపకుండా ముందుకు కదిలిన సాధ్యను అనుసరించింది పరిమళ బుర్రనిండా బోలెడు సందేహాలను మోసుకుంటూ....

సాధ్య అందమైన ఇండిపెండెంట్ ఇంట్లోకి తీసుకెళ్ళింది. అక్కడ తోటలో అక్కడక్కడ పెద్దవారు కూర్చొని ఉన్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు. సాధ్యను చూడగానే మూడేళ్ళ పాప "మమ్మీ" అంటూ వచ్చి సాధ్య కాళ్ళను చుట్టేసింది. లోపల నుంచి ఒక పెద్దావిడ, ఆవిడ వెనుక ఆయా పాప బాగ్‌తో వచ్చారు.

"పరీ, మా అత్తగారు. అత్తయ్యా, మా ఫ్రెండ్ పరిమళ" అని ఒకరికొకరిని పరిచయం చేసిందీ సాధ్య.

కార్ తెచ్చిన డ్రైవర్‌తో "వాసూ నువ్వు ఈ స్కూటీ తీసుకురా" అని సాధ్య డ్రైవింగ్ తీసుకుంది. అంతా ఆశ్చర్యంగా చూస్తూ కార్ ఎక్కింది పరిమళ. ఫ్లాట్ తాళం తీస్తూ 'రా' అని ఆహ్వానించింది సాధ్య. అధునాతనంగా, అందంగా ఉంది ఆ ఫ్లాట్. శ్రావ్యను తీసుకొని పెద్దావిడ లోపలికి వెళ్ళారు. మంచినీళ్ళు ఇచ్చి "ఊ చెప్పు. ఇక్కడికి ఎప్పుడు వచ్చారు?" అడిగింది సాధ్య.

"నా సంగతి తరువాత. సస్పెన్స్ తో చంపక నీ సంగతి చెప్పు ముందు" అంది పరిమళ.

"ఏడాది క్రితం మామగారు సడన్‌గా మాసివ్ ఎటాక్ వచ్చిపోయారు. ఆయన బిజినెస్ ఇక్కడే ఉంది. అత్తయ్యగారు కూడా హైదరాబాద్ వచ్చేందుకు ఇష్టపడలేదు. అందుకని మేమిద్దరమూ మా జాబ్స్ రిజైన్ చేసి ఇక్కడకు షిఫ్ట్ అయ్యాము. మామయ్యగారు అనారోగ్యంతో ఎక్కువగా బిజినెస్‌ను చూసుకోలేక పోవటము వలన కొన్ని అవకతవకలు జరిగాయి.

విశాల్‌కు నా సహాయము కూడా అవసరమైంది. మేమిద్దరమూ ఆఫీస్‌కు వెళితే అత్తయ్యగారు ఒక్కరే రోజంతా దిగులుగా ఉండేవారు. చాలా డీలా పడిపోయారు. ఒక వైపు మామయ్యగారి మరణం, ఇంకో వైపు సడన్‌గా మారిన తన స్టేటస్‌ను తట్టుకోవటం కష్టమైంది. నీకు తెలుసుగా మన సమాజంలో పట్టింపులు పోలేదు. పైకి మాత్రం అందరూ మాకేమీ పట్టింపులేదు అంటారు కాని అదంతా పైపై మాటలే. శుభకార్యాలకు ఏడాదిపాటు పిలవకూడదని దగ్గరి బంధువులే పిలవలేదు. ఇంటికి రమ్మని పిలిచినవాళ్ళు నువ్వు నెలలోపలరా, ఫలానా రోజున రా అనిపిలిచేవారు. అప్పటి వరకూ ఆత్మీయంగా ఉన్నవాళ్ళు మాట్లాడటం తగ్గించేసారు. 'వాళ్ళు మాట్లాడలేదనుకోవటం ఎందుకు? ఏ పనిలో ఉన్నారో మీరు ఫోన్ చేసి మాట్లాడండి' అనే దానిని. 'ఏం మాట్లాడనమ్మా? నాకు మీ మామయ్యగారి మాట తప్ప ఇంకో మాట రావటం లేదు. అదీ మాట్లాడుతుంటే ఏడుపు ఆగటం లేదు. వినే వాళ్ళైనా ఎంతకని వింటారు? ఎవరి పనులు వాళ్ళకుంటాయి' అని ఆవిడా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా గదిలోనే గడపటం మొదలు పెట్టారు.

ఓ రోజు నేనింటికి వచ్చేసరికి గదిలో మామయ్యగారి ఫొటోతో మాట్లాడుతూ గట్టిగట్టిగా ఏడుస్తున్నారు. పనమ్మాయి "రోజూ అలాగే ఏడుస్తుంటారమ్మా" అంది. ఏమి చేయాలా అని ఆలోచిస్తుంటే ఓ సారి మా ఫ్రెండ్ యు.యస్‌లో వాళ్ళ అమ్మను సీనియర్ సిటిజెన్ సెంటర్‌లో చేర్చానని, అక్కడ ఆవిడ వయసు వాళ్ళు ఉంటారని, చాలా యాక్టివిటీస్ ఉంటాయనీ చెప్పింది గుర్తొచ్చింది. అప్పటికే మా ఫ్రెండ్స్ ఇంకొందరు కూడా వారి అమ్మలతోనో, అత్తగార్లతోనో ఈ పరిస్థితిని చూస్తున్నారు. వాళ్ళతో మాట్లాడి మనమే ఒక పిల్లల డేకేర్ లాగా ఈ పెద్దలకు డేకేర్ ఏర్పాటు చేద్దామా అనుకున్నాను. ఇందాక నువ్వు చూసిన ఇల్లు మాదే. ఇద్దరే అంత పెద్ద ఇంట్లో ఉండలేక మా మామగారు అది అద్దెకిచ్చి ఈ

ఫ్లాట్ కొన్నారు. ఆ ఇంట్లోనే లైబ్రరీ, ఇండోర్ గేమ్స్, విశ్రాంతి గది, ఒక పక్క పిల్లలకి డేకేర్ ఏర్పాటు చేసాము. ఒక ఫామిలీ కౌన్సిలర్, క్లర్క్, ఇద్దరు అటెండర్స్, సూపర్వైజర్, పిల్లలకు ఆయాలను ఏర్పాటు చేసాము.

పొద్దున నేను ఆఫీస్‌కు వెళ్ళేటప్పుడు అత్తయ్యగారిని, శ్రావ్యను అక్కడ దింపి వెళుతాను. వచ్చేటప్పుడు వెళ్ళి అక్కడ ఇంకేమైనా కావాలేమో చూసుకొని ఇద్దరినీ తీసుకొని వస్తాను. ఆ పెద్దవాళ్ళందరు ఒకే పడవ ప్రయాణికులు కదా బాగా కలిసిపోయారు. ఇప్పుడు చాలా వరకూ కోలుకున్నారు. ఈ మధ్య అందరూ కలిసి గుడికి, షాపింగ్‌కు వెళుతున్నారు" అని ముగించింది సాధ్య.

"చాలా మంచి పని చేసావు సాధ్యా. మరి బజార్‌లో బాదుడు సంగతేమిటి?" అడిగింది.

"మేము హైదరాబాద్‌లో ఉన్నప్పుడు నేను బస్‌స్టాప్‌లో దిగి ఆఫీస్‌కు వెళ్ళేంత సేపు వెనక ఒక వెధవ పిచ్చివాగుడు వాగుతూ వచ్చేవాడు. ఓరోజు విశాల్‌కు చెప్పాను ఇలా నన్నో వెధవ చికాకు పెడుతున్నాడని. 'ఐతే నన్నేం చేయమంటావు? నా ఆఫీస్ వదిలి నీ వెనుక రానా?' అన్నాడు.

మరునాడు వాడు మళ్ళీ పిచ్చి వాగుడు వాగుతూ వస్తుంటే అప్పటికే విశాల్ సపోర్ట్ చేయలేదని కోపంగా ఉక్రోషంగా ఉన్న నేను వెనక్కి తిరిగి నా చేతిలో ఉన్న పర్స్ తో ఫఢేల్‌మని ఒక్కటిచ్చాను. ఇంటికెళ్ళాక విశాల్‌తో చెప్పాను. 'ఇదే నేను కావాలన్నది. ఎప్పుడూ అన్నో, నాన్నో, భర్తో, ఓ పోలీసో  నీ వెనుక ఉండరు కదా. అవసరమైనప్పుడు కాళికావతారం ఎత్తాలి' అన్నాడు. అప్పటి నుంచి నేనూ విశాల్‌తో వాకింగ్‌కూ, జిమ్‌కు వెళుతున్నాను. కార్ కొనుక్కొని డ్రైవింగ్ నేర్చుకున్నాను. ఈ రోజు బజార్‌లో చిన్న పని పక్కనే కదాని నడిచి వెళ్ళాను. అక్కడ సీన్ నువ్వు

చూసావుగా. ఇక నీ సంగతి చెప్పు” అంది సాధ్య.

“మా మామగారూ పెద్దవారైపోయారు. ఆయన గోల్డ్ బిజినెస్ ఇద్దరు కొడుకులకూ పంచారు. మా బావగారు అక్కడ చూసుకుంటుంటే మేమూ అక్కడే ఎందుకని ఇక్కడ పెడదామని వచ్చాము. చిన్న పని మీద నేను ఇటు వచ్చాను. నువ్వు అనుకోకుండా కలిసావు” అంది పరిమళ.

సాధ్య అత్తగారు ట్రే లో కాఫీ తీసుకొచ్చింది. “అయ్యో మీరు తెచ్చారా అత్తయ్యా, లక్ష్మమ్మ లేదా?” అని నొచ్చుకుంది సాధ్య. లక్ష్మమ్మ పకోడీల ప్లేట్ తీసుకొని వచ్చింది. “ఇందాకటి నుంచి మాట్లాడుకుంటున్నారు. అలిసిపోయుంటారు, తీసుకోండమ్మా” అంది ఆవిడ నవ్వుతూ.

ఎప్పుడూ ధుమధుమలాడుతున్నట్లుగా ఉండే తన అత్తగారు మనస్సులో మెదలగా “మీరెంత మంచివారండీ” అంది అప్రయత్నంగా ఆవిడతో.

“టీ ఇవ్వగానే మంచిదాన్నైపోయానా? అయినా సాధ్య నేను దుఃఖంలోనుంచి కోలుకునేందుకు ఎంత తపన, ఆరాట పడి, నన్ను అమ్మలా చూసుకుంది. దానికన్నా ఇదెక్కువ కాదుగా” అందావిడ ఆప్యాయంగా సాధ్య వైపు చూస్తూ.

“అయ్యో నేను చేసిందేమీ లేదత్తయ్యా. మీరే మాకు చాలా సహాయంగా ఉన్నారు. మీ మూలంగానే శ్రావ్య విషయంలో నిశ్చింతగా ఉన్నాను” అంది సాధ్య.

“అత్తకోడళ్ళు ఒకరినొకరు పొగుడుకోవటం ఆపి కాస్త నాకూ టీ ఇస్తారా?” అంటూ లోపలికి వచ్చాడు విశాల్.

“హలో పరిమళా బాగున్నారా?” పరిమళను పలకరిస్తూ సాధ్య

పక్కన కూర్చున్నాడు.

కాసేపు కూర్చొని ఇంక ఆలస్యం  అవుతోందని లేచి, “విశాల్, మీరిద్దరూ ఈ ఆదివారం మా ఇంటికి రండి. ఆంటీ, మీరూ రండి” అని ఆహ్వానించి వెళ్ళింది పరిమళ.

***

# 29. అమరప్రేమ

"లాలూ దర్వాజ గొల్కొండ కోట కాడ" సల్మాన్ ఖాన్‌లా డాన్స్ చేస్తున్న రాజా, "దుల్ హోంకా సాలియో హరే దుపట్టే వాలియో" ఊగిపోతూ మాధురిలా బ్రౌన్ కలర్ మెరిసే లహంగాను తిప్పుకుంటూ డాన్స్ చేస్తున్న రాణి కళ్ళు కళ్ళు కలిసాయి. డాన్స్ చేస్తూ చేస్తూ సంగీత్ పార్టీ నుంచి తప్పుకొని ఒక మూలకు చేరారు. చేయీ చేయీ కలుపుకొని బోలెడు కబుర్లు చెప్పుకొని మరునాడు సంజీవయ్య పార్క్‌లో కలుసుకుందామని వాగ్దానాలు చేసుకొని వదల లేక వదల లేక విడిపోయారు.

రోజూ కలుస్తూనే ఉన్నా "అభి నా జావో చోడకే యే దిల్ అభీ భరా నహీ."అని పాడుకుంటూ చాలా దిగులుగా విడిపోయేవారు. "రాజా నిను చూడక నేనుండలేను." అని రాణీ బెంగ పడిపోతుంటే "ఉందిలే మంచి కాలం ముందు ముందునా "అని ఓదార్చేవాడు రాజా.

ఆ విధంగా తెలుగులో, హిందీలో సంజీవయ్య పార్క్, ఇందిరా పార్క్ అన్నీ పావనం చేస్తూ విరహగీతాలు పాడుకుంటూ పాడుకుంటూ "పల్నాటి సీమలోని బొబ్బిలి రాజాలా నీ మీసాలు ఎంత పౌరుషంగా ఉన్నాయి రాజా, ఎప్పటికీ తీయనని మాట ఇవ్వు" అని చేయి చాచింది రాణి.

"అలాగే నీ బ్రౌన్ కలర్ లెహంగాలో నువ్వు వస్తుంటే 'వగలాడీ వయ్యారం భలే జోరు'లా ఉంటుంది. నువ్వూ నాకు మాట ఇవ్వాలి ఈ లెహంగా ఎప్పుడూ తీయనని" అన్నాడు రాజా పరవశంగా.

"ఎప్పటికీ తీయకపోతే చెమట కంపు కొడుతుందేమో రాజా! ఐనా నీ కోసం భరిస్తాలే" మాటిచ్చేసింది రాణీ. ఈ విధముగా త్యాగాలు

చేసుకుంటూ ఉండగా  ఉండగా ఓ సాయంకాలం బెల్‌బాటమ్ పాంట్ తో ఓ గెంతు గెంతి, చేయి అలవోకగా జాపి, "రాణీ! నేను బీ.యే పాస్ అయ్యాను. ఇక మనకేమి ప్రాబ్లం లేదు ఇట్టే ఉద్యోగ సంపాదించి నిన్ను పెళ్ళాడేస్తా" అన్నాడు రాజా సంతోషంగా.

"బి.యే ఎందుకు చదివావు రాజా? బీటెక్ ఐతే ఏదో ఉద్యోగం వచ్చేది.ఈ బీ.యేకు ఏమి ఉద్యోగం దొరుకుతుంది?" అంది రాణి విచారముగా.

"నా రాణీ, ఓ నా ప్రేమ రాణీ అట్లా అనకు. నిన్ను రిక్షా తొక్కైనా పోషిస్తాను.నన్ను నమ్ము." అని విషాదముగా పిడికిలి నుదిటికి ఆనించుకొని, ఓ షాల్ కప్పుకొని  ఓ ఎండిన చెట్టుకు తలానించాడు రాజా. (అప్పటికప్పుడు బెల్‌బాటం పాంట్ పోయి షాల్ ఎట్లా వచ్చింది అని పిచ్చి ప్రశ్నలు వేయవద్దు.)

"ఇప్పుడు రిక్షాలు ఎక్కడున్నాయి రాజా? ఎప్పుడో మా అమ్మమ్మ కాలంలో ఏమీ తోచకపోతే రిక్షా టాప్ తీయించుకొని, అలా అలా సుల్తాన్ బజార్ తిరిగి వచ్చేవారట. ఇప్పుడు నీకు రిక్షా ఎక్కడ దొరుకుతుంది?" అంది రాణి మూతి తిప్పుతూ.

"పోనీ ఆటో తోలుతాలే." అన్నాడు ఆశగా.

"ఇప్పుడు ఆటోలైనా ఎవరెక్కుతారు?" అంది రాణి ముక్కు తిప్పుతూ.

"సరేలే కాబ్ తిప్పుకుంటా."

"ఈ కరోనా టైం లో కాబ్ ఎవరెక్కుతున్నారు?" నిరాశపడిపోయింది రాణి.

"మరైతే ఈ విరహగీతాలు ఎన్ని రోజులు పాడుకుంటాము? నేను మా డాడీ అలమారాలో ఉన్న పదివేలు తెచ్చేస్తా. ఏమి చేయను? కరోనా అని అందరికీ డిజిటల్ పేమెంట్ చేస్తున్నాడు. అవే తెస్తా పోదాం" అన్నాడు రాజా.

"ఆ ఐడియా! మా మమ్మీ ఈ మధ్య పెళ్ళిళ్ళకి, ఫంక్షన్‌లకూ వెళ్ళేందుకు, బోలెడు నగలు కొన్నది అవన్నీ డ్రసింగ్ టేబుల్ డ్రా లోనే ఉన్నాయి. అవి తెస్తా, ఇంకా మా డాడీ కూడా పదివేలు తెచ్చి టేబుల్ డ్రా లోనే పెట్టాడు. ఈ మధ్య పనివాళ్ళెవరూ లేరుగా ఎవరు తీస్తారని ఉంచేసారు. అవీ తెస్తా."

"చలో దేఖా మైనే ఏక్ సప్నా , ఫూలోంకే సహర్ మే ఘర్ అప్నా" అని పాడుకుంటూ అన్నీ మూట కట్టుకొని ఓ అర్ధరాత్రి ఇంటి నుంచి పరారై కృష్ణానగర్‌లో తేలారు. వెతికీ వెతికీ ఓ చిన్న గది సంపాదించారు. 'ఇంత చిన్న గదా?' అని గునుస్తున్న రాణీని "చూడు గోడలన్నీ హార్పిక్‌తో కడుగుతారేమో, తళతళా మెరిసిపోతున్నాయి. కింద ఫ్లోర్ లైజాల్ వేసి తుడుస్తారేమో జర్రున జారుడుబండలా జారిపోతూ ఎంత బాగున్నాయో." అని ఓదార్చాడు రాజా.

"అంతేలే ప్రేమ యాత్రలకు బృందావనం, నందనవనమూ ఎందుకు, ఒక బృందావనం సోయగం" అంటూ బ్రౌన్ కలర్ స్విమ్మింగ్ సూట్‌లోకి మారిన రాణీని మురిపెంగా చూస్తూ "ఇంతీ పూబంతీ ముద్దాడుకున్నాయి." అని పాడుకున్నాడు రాజా.

కృష్ణానగర్ అంతా తిరిగినా సినిమాలు తీసేవాళ్ళు లేరు. పైగా లాక్డౌన్. శోభన్‌బాబంత అందగాడూ డీలా పడిపోయాడు. ఇరవై వేలూ అయిపోయాయి. రాణీ నగ తీసిచ్చి, "చాలా నగలున్నాయిగా కరోనా పోయే వరకూ ఇవి అమ్ముకొని బతుకుదాము" అని ఓదార్చింది.

ఈసురోమంటూ వెంట ఒక పెద్దాయనని వెంట పెట్టుకొని వచ్చిన రాజాను ప్రశ్నార్థకంగా చూసింది. "నువ్విచ్చిన గొలుసు వన్ గ్రామ్‌ది ట. అవి కొనరుట. నగల షాప్‌లు తెరిచి ఉన్నాయి కదా అమ్ముదామనుకుంటే ఇలా అయ్యింది. అక్కడ పని చేస్తున్న ఈ పెద్దాయనకు  ఎందుకైనా మంచిదని నీ నగలు చూపిద్దామని తీసుకొచ్చాను" అన్నాడు రాజా.

ఆ నగలన్నీ చూసి, "ఈ మధ్య అందరికీ పెద్ద పెద్ద నగలు పెట్టుకోవాలనిపించి, అన్ని కొనుక్కోలేక, సరదా తీర్చుకోవటానికి ఇలా వన్ గ్రామ్ నగలు కొంటున్నారు. ఇవి ఎవరూ కొనరు." అని పెదవి విరిచి వెళ్ళిపోయాడు ఆ పెద్దాయన.

'ఏమి చేద్దాం?' అని ఆలోచనతో మూతి మీద చేయి పెట్టుకోగానే పెద్ద పెద్ద మీసాలు తగిలాయి. "ఛీ  మింగ మెతుకు లేదు అన్నట్లు వెధవ మీసాలు. మాస్క్ కట్టుకోవటనికి అడ్డొస్తున్నాయి. కట్ చేసి పారేస్తాను." అని కత్తెర తీయబోయాడు.

"రాజా నాకిచ్చిన మాట తప్పుతావా? అబ్బా నీ ఇష్టం మాట తప్పుతావా అంటే ఇట్లా కొడుతున్నావేమిటి?"

"మీసాలు తీస్తానంటే కొడతావెందుకు అబ్బా?"

***

"వెధవ బొద్దింకలు. పొద్దున హిట్ వేసినా చావలేదు. ఒకటికి రెండు తయారయ్యాయి. హిట్‌కు బొద్దింకలు, ఆల్ ఔట్‌కు దోమలు అలవాటు పడిపోయాయి. వాటిని కొట్టి చంపాల్సిందే." అని విసుక్కుంటూ కొబ్బరి చీపురుతో టపాటపా కొడుతోంది రత్న ఆ రెండు బొద్దింకలని. నా కళ్ళముందు మెదిలిన రాజా, రాణీల కథ కరిగిపోయింది.

“అయ్యో రత్నా, వాటిని కొడుతున్నావా పాపం ఇంకా ఒకటాయే రెండాయే పాడుకోనే లేదు. కదిలే కాలమా కాసేపు ఆగవమ్మా అని సీమంతం చేసుకోనేలేదు” అన్నాను.

“ఏంటమ్మా ఏమంటున్నారు? అక్కడే నిలబడి చూస్తున్నారు ఇందాకటినుంచి అని వచ్చా. ఈ బొద్దింకలను చూసి భయపడుతున్నారేమో. చంపేసా. ఇంక తొందరగా స్నానం చేసి రండి, సూప్ చల్లారిపోతుంది.”

***

# 30. ఇదేమి గారడీ!!

"మీ కాంట్రాక్టర్‌గారిని అడిగి, వీడికేదైనా ఉద్యోగం ఇప్పించన్నయ్యా" పొద్దున ఆఫీస్‌కు వెళ్ళుతున్న రాఘవరావును అడిగింది జానకి. ఇంజనీరింగ్ చదివిన అందరిలా అమెరికా వెళతాడని ఆశపడితే అసలుకే ఉద్యోగం దొరకకుండా తిరుగుతున్నాడు జానకి కొడుకు శ్రీకాంత్. ఏదో అమ్మానాన్నా పోరుపడలేక బీటెక్ ముక్కున పెట్టుకొని పాసయ్యాడేకాని, ఉద్యోగం చేయకుండా ఏదైనా వ్యాపారం చేయాలని అతని కోరిక. చదువుకే తెలివితేటలు లేవు ఇక వ్యాపారము ఏమి చేస్తావంటాడు తండ్రి. 'వ్యాపారానికి చదువు అక్కరలేదు లోకజ్ఞానం, బుర్రలో బమ్మిని తిమ్మి, తిమ్మిని బమ్మి చేయగల తెలివితేటలు చాలవా?' అని శ్రీకాంత్ వాదన. తండ్రీకొడుకులను సంభాళించలేక అన్నగారి దగ్గర మొరబెట్టుకుంది జానకి.

"నాతో రారా. మా సార్ సైట్ దగ్గరకు ఒక సూపర్ వైజర్ కావాలన్నారు. అడిగి చూస్తాను. కొన్నిరోజులు ఉద్యోగము చేయి. అనుభవము వచ్చాక వ్యాపారము సంగతి చూసుకోవచ్చు." అన్నాడు రాఘవరావు.

ఆఫీస్‌కు వెళుతూ దారిలో ఉన్న సైట్ దగ్గరకు వెళ్ళారు.అక్కడ ఎవరూ పనివాళ్ళు లేరు. కాసేపు అక్కడే నిలబడి ఆఫీస్‌కు వచ్చారు ఇద్దరు. వరండాలో కంగారుగా అటూ ఇటూ తిరుగుతున్న కాంట్రాక్టర్ గోపాలరావుగారు , రాఘవరావును చూడగానే, "డైరక్టర్‌గారు మన సైట్‌కు సర్ప్రైజ్ చెకింగ్‌కు వస్తారట తెలిసింది. మేస్త్రీ గొడవ పెట్టుకొని పనిలోకే రావటము లేదు.ఇప్పుడేమి చేద్దాము ? ఈ కాంట్రాక్ట్ పోతే చాలా నష్టం మనకు" అన్నాడు.

"అదేమిటి సార్ డైరెక్టర్‌గారు ఎందుకు వస్తున్నారు?" ఆశ్చర్యంగా

అడిగాడు రాఘవరావు.

"ఈ వర్క్ కావాలనుకున్న రామారావు, తనకు రాలేదని ఈర్ష్యతో డైరెక్టర్‌గారికి మన వర్క్ ఆగిపోయిందని చెప్పాడట. ఇంకా ఏమేమి మోసాడో. ఇప్పుడెట్లా?" గాభరాపడిపోతున్నాడు గోపాలరావు.

"మామయ్యా!" పిలిచాడు శ్రీకాంత్.

"నువ్వు కొంచెం ఆగరా, అసలుకే సార్ టెన్షన్‌లో ఉన్నారు. తరువాత అడుగుతాలే. నువ్వింటికి వెళ్ళు. ముందు ఈ గండం గట్టెక్కాలి" అన్నాడు రాఘవరావు.

"అదే మామయ్యా. పని వాళ్ళు లేకనే కదా పని కావటము లేదు. ఇప్పటికి డైరెక్టర్‌గారు వచ్చినప్పుడు పని జరుగుతూ కనిపించాలి అంతేగా! నామీద నమ్మకం ఉంచి నాకు ఓ ఇరవై వేల రూపాయలు ఇవ్వు. మీరిద్దరూ డైరెక్టర్‌గారితో వచ్చేయండి."అన్నాడు.

శ్రీకాంత్ ను కొంచెం అనుమానంగా చూస్తూనే గోపాలరావుగారిని అడిగి ఇరవైవేలరూపాయలు ఇచ్చాడు. ఏమి జరుగుతే అది జరుగుతుందన్నట్లు భగవంతుడి మీద భారం వేసి గోపాలరావుగారు, రాఘవరావు సైట్ దగ్గరకు వెళ్ళారు. సైట్ దగ్గర పని చేస్తున్న కూలీలను 'ఇదేమి గారడీ? ఇంతమంది కూలీలు ఎక్కడ నుంచి పుట్టుకొచ్చారు?' అని ఆశ్చర్యపోయారు. అదే సమయములో డైరెక్టర్‌గారు మందీ, మార్బలంతో వచ్చారు. వారందరినీ కుర్చీలు వేసి కూర్చోబెట్టి , అందరికీ ట్రేలో సాఫ్ట్ డ్రింక్స్ నూ, బిస్కెట్స్ నూ ఇస్తున్న శ్రీకాంత్ ను చూసి 'ఎవరితను?' అని మరీ విస్తుపోయాడు గోపాలరావు. ఏమైతేనేమి డైరెక్టర్‌గారు పనిని చూసి, జరిగిన మర్యాదలకు సంతోషించి వెళ్ళిపోయారు. ఆకస్మిక తనిఖీ విజయవంతంగా ముగిసింది.

అమ్మయ్య అనుకొని, "రాఘవరావూ ఏమిటయ్యా ఇదంతా? ఇతనెవరు?" అని అడిగాడు.

"వీడు నా మేనల్లుడండీ. మీరు సూపర్వైజర్ కావాలన్నారు కదా. వీడికేమైనా ఆ ఉద్యోగం ఇవ్వగలరేమో అడుగుదామని తీసుకొచ్చాను" అని గోపాలరావుగారితో చెప్పి, "ఇదంతా ఎట్లా ఏర్పాటు చేసావురా?" అని శ్రీకాంత్ ను అడిగాడు.

"మేస్త్రీ గొడవ పెట్టుకోవడంతో కూలీలు లేక పని ఆగిపోయిందన్నావు కదా మామయ్యా! మనము వచ్చేటప్పుడు ఈ సైట్ దగ్గర రోడ్ పని చేస్తున్న కూలీలను చూసాను. ఆ మేస్త్రీ దగ్గరకు వెళ్ళి ఒక్క పూటకు మాకు కూలీలు కావాలి, అందరికీ ఒక రోజు జీతం ఇస్తాను అని అడిగాను. ఆ మేస్త్రీ ఒప్పుకొని , అతని కూలీలందరినీ ఇక్కడకు తీసుకొచ్చాడు. అందరూ ఇక్కడ పని చేస్తున్నట్టు హడావుడిగా తిరిగారు. ఇప్పుడే వాళ్ళందరికీ డబ్బులిచ్చి పంపేసాను. డైరెక్టర్గారి వాళ్ళ కోసము సాఫ్ట్ డ్రింక్స్, బిస్కెట్లూ తెచ్చాను. అదే నేను చేసిన గారడీ. అన్ని ఖర్చులూ పోనూ ఇవిగో మిగిలిన డబ్బులు" అని మిగిలిన డబ్బులు రాఘవరావుకు ఇచ్చాడు శ్రీకాంత్.

గోపాలరావుగారు శ్రీకాంత్ కు ఉద్యోగం ఇచ్చేసారని, శ్రీకాంత్ మిగిలాయని ఇచ్చిన డబ్బులకు ఇంకొంత చేర్చి పదివేల రూపాయలు బహుమతిగా కూడా ఇచ్చారని వేరే చెప్పాలా!

***

# 31. గుండెలో గుండె దడ!

**('పొన్నాడ వారి పున్నాగ వనం' ఫేస్‌బుక్  గ్రూప్‌లో ఇచ్చిన, టాపిక్ 'యాత్రలో హాస్యం'కు నేను రాసిన కథ 'గుండెలో గుండె దడ.')**

***

"మీరసలు వచ్చినట్లే లేదు. లింగడు రానూ వచ్చాడు, పోనూ పోయాడు అన్నట్లు చేస్తారు." అని అలేఖ్య గొణుగుతుంటే , "అందుకే అమ్మా మిమ్మల్ని రమ్మనేది. మీరొస్తే హాపీగా అక్క దగ్గర మూడునెలలు, నా దగ్గర మూడు నెలలు ఉండి మనవళ్ళు, మనవరాళ్ళతో ఎంజాయ్ చేయవచ్చు." అన్నాడు దీపక్.

"నాకూ రావాలనే ఉంటుందిరా. మీ డాడీ కూడా అక్కడ బాగానే ఎంజాయ్ చేస్తారు. అంతా బాగానే ఉంటుంది కాని , మధ్యలో ప్రయాణమే ఉంది చూసావూ, మీ డాడీ విన్యాసాలతో, ఎప్పుడెవరికి ఏ ఆపద వస్తుందో, ఎందులో ఈ అభిరాముడుగారు  ఆపద్బాంధవుడిలా దూరిపోతారో అని గుండెలో గుండె దడ పుట్టిస్తుంది." అని వాపోయింది.

"అంతా నీ భయమే కానీ డాడీ మరీ అంత ఓవర్‌గా ఏమీ చేయరు. ఐనా ఈ సారి కాస్త గట్టిగా చెపుతానులే." అని కొడుకు అభయమిచ్చి టికెట్స్ బుక్ చేసాడు.

మనవళ్ళతో కొన్ని రోజులు గడపాలనే కోరిక చంపుకోలేక, "అభీ, ప్లీజ్ ప్లీజ్...  ఎర్‌పోర్ట్ లలో ఏ సాహసమూ చేయకండీ. ఏదీ పట్టించుకోకండీ. ఎవరికి వాళ్ళు వాళ్ళ సంగతి చూసుకోగలరు. అక్కడ గార్డ్ లు కూడా ఉంటారు కదా.  కావాలంటే అక్కడికెళ్ళాక చేసుకోండి ప్లీజ్ ప్లీజ్!" అని  మొగుడిని బతిమిలాడుకుంటూ విమానం ఎక్కి,

హాంగ్‌కాంగ్‌లో పతీసమేతంగా దిగింది. అమ్మయ్య ఇక్కడి వరకు సేఫ్. ఇక్కడ ఉండే ఎనిమిది గంటలు అభిని కనిపెట్టుకొని ఉంటే చాలు, లేకపోతే ఎవరికో ఏదో అవసరం వచ్చిందని, 'సిరికిన్ చెప్పడు' అన్నట్లు బుర్రున ఉరుకుతాడు అనుకొని, "ఏమండీ ఇక్కడే ఉంటారుగా! నేనిప్పుడే వాష్ రూం కు వెళ్ళి వస్తాను." అని అడిగింది.

"అబ్బా పిచ్చిపోరిలా చేయకు. ఇక్కడుండకుండా ఎక్కడికెళతాను?" విసుక్కున్నాడు అభిరాం.

ఐనా అనుమానంగా చూస్తూనే వెళ్ళింది. వాష్ రూం నుంచి హడావుడిగా వచ్చేస్తుంటే కాలు జారి పడబోయింది. అక్కడే ఉన్న హెల్పర్ ఓ ముసలావిడ పట్టుకొని ఆపింది. ఓ 'థాంక్స్' ఆమెకు చెప్పేసి రాబోతుంటే చేయి పట్టుకొని ఆపి కిందపడ్డ హాండ్‌కర్చీఫ్ తీసి ఇచ్చింది. పాపం ఏదో అడుగుతుంటే , 'నీ భాష నాకర్థం కావటము లేదు తల్లీ, హాండ్‌కర్చీఫ్ కంటే ముఖ్యమైనది తప్పిపోకుండా చూసుకోవాలి నన్ను వదిలేయ్ తల్లీ!' అని మనసులో అనుకొని , ఆమెకో దండం పారేసి పరిగెత్తి, బాగ్‌ల దగ్గర నిలబడి దిక్కులు చూస్తున్న అభిని చూసి, 'అమ్మయ్య!' అని ఊపిరిపీల్చుకుంది! అభిరాం కూడా వెళ్ళి వచ్చాక ఫుడ్‌కోర్ట్ వైపు నడిచి, ఒక టేబుల్ చూసుకొని కూర్చున్నారు. "ఏమైనా తిందామా?" అడిగాడు. పోయినసారి వచ్చినప్పుడు ఏర్‌పోర్ట్ లల్లో వెజిటేరియన్స్ ఏమి తినవచ్చో, అందులో ఏమేమి వేయాలని అడగాలో, మనవరాలితో రాయించుకొచ్చిన డైరీని తీసి చూస్తూ, "ఏం తింటావు?" అడిగాడు.

"బర్గర్స్ తిందాము. అందులో అయితే కూరగాయలు, బన్ ఉంటుంది కాబట్టి కడుపు నిండి, మనకు ఫ్లైట్‌లో ఏమైనా తినినేందుకు ఇచ్చేవరకూ ఆకలివేయకుండా ఉంటుంది." అని జవాబిచ్చింది.

ఇద్దరూ బర్గర్స్ తిన్నాక ప్లేట్‌లు ఇచ్చేసి, పేమెంట్ చేసి వస్తానని వెళ్ళాడు. సోఫార్ సో గుడ్! అనుకుంటూ అందరినీ చూస్తూ టైం పాస్ చేస్తోంది అలేఖ్య. సడన్‌గా, 'అరే ఏరీ ఈయన? వెళ్ళి చాలా సేపైంది. బిల్ ఇచ్చి వస్తానని వెళ్ళారు. ఎంతసేపైనా రారు. బిల్ కౌంటర్ దగ్గర లేరు. ఎక్కడి కెళ్ళారు? రెస్ట్ రూముకనుకుందామనుకుంటే, ఇప్పుడేగా అక్కడి నుంచి వచ్చింది! వెతకటానికి ఎక్కడికని వెళ్ళను? పైగా రెండు బాగులు, రెండు హాండ్‌బాగులూ పట్టుకొని ఎట్లా పోను? దేవుడా...' గుండె దడదడలాడుతుండగా ఆంజనేయస్వామిని తలుచుకుంటూ, కూర్చుంది. దాదాపు గంట తరువాత వచ్చాడు. ఏమీ మాట్లా కుండా అభిరాం వైపు చూసింది.

"ఏమిటి అట్లా చూస్తున్నావు? నీకన్నిటికీ టెన్షనే. షాప్ వాడు ఫైవ్ చైనీస్ రూపీస్ ఛేంజ్ ఇచ్చాడు. అదేమి చేసుకుంటాము, మారుద్దామని అన్ని షాప్‌లు తిరిగి ఒక చోట బబుల్‌గమ్ పాకెట్ కొన్నాను. పద అటెళ్ళి లాంజ్‌లో కూర్చుందాము." అన్నాడు తాపీగా బబుల్‌గమ్ నములుతూ.

ఇంకేమంటుంది? "పదండి" అని లేచింది.

ఇంకా ఐదు గంటలు గడవాలి, 'అమ్మో, ఇట్లా వదిలేస్తే లాభం లేదు' అనుకొని, ఏమి చేస్తే బాగుంటుందా అని చుట్టూ చూసింది. లాంజ్‌లో ఛెయిర్స్ అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఓ చోట ప్లగ్‌పాయింట్ కనిపించింది. అమ్మయ్య , "అభీ అటు కూర్చుందామా?" అని అటు తీసుకెళ్ళి, అభిరాం ఐపాడ్ బాగ్‌లోనుంచి తీసి ఇచ్చింది. ప్లగ్‌పాయింట్‌లో సెట్‌చేసుకొని ఐపాడ్ తీసి బ్రిడ్జ్ ఓపెన్ చేసాడు... 'అమ్మయ్య ఇంక పరవాలేదు, శ్రీలక్ష్మిలాగా గంట కట్టక పోయినా ఐపాడ్‌తో కట్టేసాను' అని ఊపిరి పీల్చుకొని, తన బాగ్ ఓపెన్ చేసి, లాప్‌టాప్ తీసి, ఈ నెల రివ్యూ రాద్దామని ఉంచుకున్న నవల కోసం చూస్తే కనిపించలేదు.

చదువుదామని పెట్టుకున్న ఆంధ్రభూమీ కనిపించలేదు. ‘ఈసారి రెండు రోజులముందే అన్నీ సర్దుకున్నాను. లాస్ట్ మినిట్‌లో అభీ అన్నీ అటూ ఇటూ చేసారు!’ అనుకుంటూ ‘నా బుక్స్ తీసారా?’ అంటే ‘ఏమో!’ అన్నారు తల ఎత్తకుండానే. ఓసారి అభిరాం ను చూసి నిట్టూరుస్తూ కాసేపు స్పైడర్ ఆడింది. స్పైడర్ ఆడి విసుగొచ్చి, ఓ కన్ను అభి మీదనే ఉంచి, ఇంకో కంటితో ఎదురుగా ఉన్న ట్రాలీలను, ఎన్ని తెచ్చి పెడుతున్నారు, ఎన్ని తీసుకుపోతున్నారు లెక్క పెడుతూ, కిందనుంచి వెళుతున్న ట్రేన్స్ ఎన్ని వస్తున్నాయి, ఎన్ని పోతున్నాయి చూసుకుంటూ, లాంజ్‌లో వచ్చేపోయేవాళ్ళను చూస్తూ, ఎదురు బోర్డ్ మీద ఫ్లైట్ ఎన్నింటికి, ఏ గేట్ దగ్గరకు వస్తుంది వేసారా చూసుకుంటూ, ఒక కన్నుతో చూడటము కష్టమే ఐనా ఎట్లాగో మానేజ్ చేస్తూ టైం పాస్ చేయగా చేయగా భారంగా ఐదు గంటలు గడిచాయి. మొత్తానికి థర్డ్ గేట్ దగ్గరకు వస్తుందని వేసారు. “పదండి పదండి, మనము 35 నుంచి 3 కు వెళ్ళాలి” అని అభీని లేపింది. అమ్మయ్య ఈ సారి ఐపాడ్ కరుణించింది!

అక్షరాలా లక్ష రూపాయలు తీసుకుంటారు టికెట్‌కు కాని ఆ సీట్లు ఎంత ఇరుకో. అటూ ఇటూ మెసిలేందుకే ఉండదు. కాకపోతే జైన్ ఫుడ్ అని చెప్పారు కాబట్టి భోజనం బాగానే ఉంది. విమానంలో ఏ సాహసమూ చేసే అవసరం ఉండదు కాబట్టి అభి సంగతి వదిలేసి హాయిగా తినటం, నిద్రపోవటమే! 12 గంటల సుదీర్ఘ ప్రయాణం తరువాత శాన్ ఫ్రాన్సిస్కో చేరారు.

***

# 32. అమూల్య

(అమ్మలా ఒక రోగికి పసిపాపకు చేసినట్లుగా సేవ చేసే నర్స్ అంటే చాలా మందికి చులకన భావన. అలా సేవచేయాలనే పవిత్రమైన భావనతో నర్స్ గా చేరిన ఒక అమాయకపు అమ్మాయి, ఒక వలపు వలలోనుంచి ఎలా బయటపడిందో తెలిపేదే ఈ కథ అమూల్య. ఫేస్‌బుక్‌లోని 'మన కథలు - మన భావాలు' సాహితీ సమూహములో ఇచ్చిన నర్స్ చిత్రానికి రాసిన ఈ కథ తరుణి అంతర్జాల మహిళాపత్రికలో ప్రచురించబడినది.)

***

"అమూల్యా... అమూల్యా..."

రాణి పిలుపుతో చేతిలోని మందుల ట్రేను బల్ల మీద పెడుతూ ఏమిటన్నట్లు చూసింది అమూల్య.

"నీ పేషంట్ నిన్ను కలవరిస్తున్నాడు. నువ్వే కావాలట" నవ్వుతూ చెప్పింది రాణి.

నాలుగురోజుల క్రితం ఆక్సిడెంట్ అయ్యిందని ఒంటినిండా దెబ్బలతో, రక్తం కారుతుండగా శరత్ ను తీసుకొచ్చారు. శరత్ ఒక సినీనిర్మాత కొడుకు. రాత్రి స్నేహితులతో కార్‌లో వస్తూ ఆక్సిడెంట్ చేసాడు. అదృష్ట వశాత్తూ వెనుక ఉన్న స్నేహితులకు దెబ్బలు ఎక్కువగా తగలకపోవటముతో శరత్ ను, ముందు కూర్చున్న ఇంకో స్నేహితుని దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆక్సిడెంట్ కాబట్టి కేస్ అవుతుందేమోననీ, పైగా దెబ్బలు కూడా ప్రమాదకరమైనవి కాదు కాబట్టి, నిర్మాతగా ఇప్పుడిప్పుడే పైకి వస్తున్న తనకు ఇబ్బందని శరత్ తండ్రి శరత్ ను అక్కడే ఉంచి ట్రీట్మెంట్ చేయిస్తున్నాడు. అమూల్య

సేవలతో చాలావరకు కోలుకున్నాడు శరత్.

అక్కడికి వచ్చిన అమూల్యను చూసి, "ఎక్కడికెళ్ళావు? నాకు డ్రెస్సింగ్ చేయవా?" అడిగాడు శరత్.

"మీకు మేల్ నర్స్ డ్రెస్సింగ్ చేసి వెళ్ళాడు కదా! ఈరోజు కూడా వేరే నర్స్ రాలేదు. నేను ఇంకో పేషంట్‌ను చూసుకోవాలి. మీరు ఇలా చిన్నపిల్లలలా మారాము చేయకూడదు. మిమ్మల్ని ఈరోజు డాక్టర్‌గారు డిస్చార్జ్ చేస్తానన్నారు. నర్సింగ్ అసిస్టెంట్ మీ ఇంటికే వచ్చి డ్రెస్సింగ్ చేస్తాడు. జాగ్రత్తగా మందులు వేసుకుంటే తొందరగా కోలుకుంటారు" చిన్నగా మందలిస్తున్నట్టుగా అంది అమూల్య.

"ఓ నన్ను ఇంటికి పంపేస్తారా? నేను వెళ్ళను. వెళితే నువ్వు కనిపించవు" అన్నాడు శరత్ అలుకగా.

"బాగుంది నాకోసం ఉండిపోతారా? మీ అమ్మగారు మీకోసం ఎదురు చూస్తున్నారు"నవ్వుతూ అంది.

"మరైతే నేను ఫోన్ చేస్తాను. వచ్చి నిన్ను కలుస్తాను. సరేనా?" ఆశగా అడిగాడు.

'అమూల్యా!' అన్న పిలుపు విని సరేనంటూ వెళ్ళిపోయింది అమూల్య.

పాపం అని కాస్త కరుణ చూపించి ప్రేమగా చూసుకుంటే ఇదో ఇలాగే అభిమానం పెంచుకుంటారు. కొందరు అడ్వాంటేజ్ తీసుకుంటారు. ఈ పేషంట్స్ తో ఇదే ప్రాబ్లం అనుకుంది అమూల్య.

శరత్ డిశ్చార్జ్ అయిన వారం రోజులకు, ఆసుపత్రి గేట్ దగ్గర

గులాబీపువ్వు చేతపట్టుకొని కనిపించాడు. బయటకు వచ్చిన అమూల్యను చిరునవ్వుతో చూస్తూ గులాబీ అందించాడు. అమూల్య ఒక్క క్షణం తడబడి "ఏమిటిది?" అంది.

"గులాబీ. నిన్ను చూడకుండా ఉండలేకపోతున్నాను. ప్లీజ్, అక్కడ కాసేపు కూర్చొని వెళ్ళిపోదాము" కాఫీ షాప్ వైపు చూపిస్తూ రిక్వెస్టింగ్‌గా అన్నాడు. కాదనలేకపోయింది అమూల్య.

ప్రతిరోజూ తను బయటకు వచ్చే సమయానికి గులాబీతో, చిరునవ్వుతో ప్రత్యక్షమయ్యే శరత్ ను చూడగానే అప్రయత్నంగా అమూల్య పెదవులు విచ్చుకునేవి. శరత్ చిరునవ్వుల బాణాలు విరిబాణాలై అమూల్యను కలవరపెడుతున్నాయి. కలవారి బిడ్డడు అతని మీద ఆశ పడకూడదని వివేకం హెచ్చరించేది. వయసు వలపు ముందు వివేకం ఓడిపోయింది. శరత్ తో బయటకు అడుగేసింది. ఆ అడుగు తప్పటడుగని తెలుసుకునేందుకు ఎక్కువ రోజులు పట్టలేదు. భరించలేని ఆవేదన, ధుఃఖం, అవమానముతో, తిరిగి బయట ప్రపంచంలోకి అడుగేసే ధైర్యం లేక, దిక్కుతోచని స్థితిలో ఇంటికి వచ్చింది. కానీ లోపలకు వెళ్ళే ధైర్యం చేయలేక, వరండాలో కూర్చుండిపోయింది. బయటకు ఏదో పని మీద వచ్చిన సరస్వతమ్మ అమూల్యను చూసి ఆశ్చర్యపోయింది. అమూల్య స్థితిని అర్థం చేసుకుంది కానీ ఏమి మాట్లాడలేకపోతోంది.

"ఎవరక్కడా?" అంటూ బయటకు వచ్చాడు మోహనరావు. తలదించుకొని, సన్నగా వణుకుతూ నిలుచున్న అమూల్యను, బొమ్మలా మౌనంగా ఉన్న భార్యను ఓ క్షణం పరికించి చూసి "బయట ఎందుకు భాగోతం? లోపలికేడవండి" అని కోపంగా లోపలికి వెళ్ళిపోయాడు.

అప్పుడు బయటకు వచ్చింది ఏడుపు అమూల్యకు. 'పెద్దమ్మా!' అని సరస్వతమ్మను కౌగలించుకొని బావురుమంది. అమూల్యను పొదివి

పట్టుకొని లోపలికి నడిపించింది సరస్వతమ్మ. తనను ఒక్క మాట కూడా అనకుండా తిరిగి ఆదరించిన పెద్దమ్మా, పెద్దనాన్నలు దేవతలలా కనిపించారు.

లోపలి గదిలోనే కుమిలిపోతూ కూర్చున్న 'అమూల్యా, అమూల్యా' అని పెదనాన్న పిలుపు వినిపించి, చిన్నగా బయటకు వచ్చింది. అక్కడ పెద్దమ్మ, పెదనాన్నతో పాటు గంభీరంగా ఉన్న ఒకాయన కూర్చొని ఉన్నారు.

"తన పేరు అమూల్య. నా భార్య చెల్లెలి కూతురు. రెండు సంవత్సరాల క్రితం మా మరదలు, తోడల్లుడు కరోనాతో పోయారు. అప్పుడు అమూల్యను మా దగ్గరకు తీసుకొచ్చాము. మొన్ననే ఇంటర్ పాసయ్యింది. అమూల్య చాలా సున్నిత మనస్కురాలు. తెలుగులో యం.ఏ చేసి తెలుగు లెక్చరర్గా చేరుదామనుకుంది కానీ కరోనా సమయములో నర్స్‌లు, డాక్టర్‌లు చేసిన సేవ చూసి తనకు నర్స్ కావాలని కోరిక కలిగింది. కాలేజీలు తెరిచేవరకు తన ప్రవృత్తి కాని వృత్తిలో చేరేముందు కొంచము అనుభవము వస్తుందని, అసలు చేయగలదో లేదో తెలుస్తుందని నాకు తెలిసి డాక్టర్ ఆసుపత్రిలో నర్స్‌లకు సహాయము చేసేందుకు చేర్పించాను. అక్కడ చాలా శ్రద్ధగా పని నేర్చుకుంటోంది. పేషంట్స్ తో చాలా ఓర్పుగా ఉంటోందని ఆ డాక్టర్ మెచ్చుకుంటుంటే మురిసిపోయాము. ఇంతలో ఓ త్రాష్టుడు తగిలి, దానిని ముంచిపోయాడు. మన పిల్లని నేనూ కాదంటే బజార్న పడుతుందని లోపలికి రానిచ్చాను. నీకు తెలుసు కదా మేము మా అబ్బాయి దగ్గరకు యు.యస్. వెళ్ళటానికి టికెట్స్ బుక్ చేసుకున్నాము. పోనీ కాన్సిల్ చేసుకుందామనుకుంటే కోడలికి పురిటిరోజులు. మా వియ్యంకుడి ఆరోగ్య సమస్య మూలంగా వాళ్ళు వెళ్ళలేరు. మరి దీన్ని ఎక్కడ ఉంచి వెళ్ళాలో తెలీటము లేదు" అన్నాడు.

ఆయన అమూల్య వైపు చూసాడు. సన్నగా, సుకుమారంగా, అమాయకంగా ఉంది. తల వంచుకొని నిలబడింది. ఈ ఆడపిల్లలు ఎంత అమాయకులు. ఎంత తొందరగా ఎదుటివాడి మాయమాటలు నమ్మి మోసపోతారు అనుకుంటూ "నర్స్‌గా చేయాలని తనకి ఆసక్తి ఉందన్నావుకదా! నర్సింగ్ కోర్స్ లో చేర్పిద్దాము. అసలు నర్స్‌గా రోగులకు సేవ చేయాలనుకోవటము ఎంత గొప్ప ఆలోచన. నర్స్ అంటే ఎవరు అమ్మ. అమ్మలాగా ఒక రోగికి పసిపాపకు చేసినట్లుగా సేవ చేస్తుంది. మన సాంప్రదాయంలో అసలు స్త్రీలను కన్నెత్తే చూడరు. శక్తి స్వరూపిణిగా, అమ్మలా పూజిస్తాము. అమ్మను వేరే దృష్టితో చూడగలమా? మరి అమ్మలా సేవ చేసే నర్స్‌లంటే ఎందుకో మన సమాజంలో కొంతమందికి చిన్న చూపు. మోహన్, నీకు అభ్యంతరం లేకపోతే, మీరు వచ్చే వరకు మా ఇంట్లో ఉంచు. నా క్లినిక్‌లో సహాయం చేస్తుంది" అన్నాడు.

మోహనరావు అమూల్యతో "ఈయన కల్నల్ రావ్. మిలిట్రీలో డాక్టర్‌గా చేసి, ఈ మధ్యనే రిటైరయ్యాడు. ఇంటి దగ్గర చిన్న క్లినిక్ పెట్టి ఫ్రీ సర్వీస్ చేస్తున్నాడు. నా బాల్యస్నేహితుడు. మేము వచ్చే వరకూ వాళ్ళింట్లో ఉంటావా?" అడిగాడు.

అమూల్య చిన్నగా వచ్చి, మోహనరావుకు, కల్నల్ రావుకు పాదనమస్కారం చేసింది.

మోహనరావు, సరస్వతమ్మ యూ.యస్ వెళ్ళారు. అమూల్య కల్నల్ రావు ఇంటికి మారింది. కల్నల్. రావుగారి భార్య సావిత్రిగారి అభిమానంలో కొద్దికొద్దిగా తన అపరాధభావము నుంచి బయటకు వస్తోంది. రోజూ ఉదయము సావిత్రికి ఇంటి పనిలో సహాయము చేస్తుంది. కల్నల్ రావ్ సాయంకాలం క్లినిక్ చూసుకుంటాడు. ఉదయం

మిలిట్రీ హాస్పిటల్‌కు, ఎక్స్ సర్వీస్ మెన్‌కు వైద్యసేవ అందించే ECHS Poly Clinic లో ఉచితముగా సైనికులకు సేవలందిస్తుంటాడు. కల్నల్‌తో పాటు అమూల్య కూడా ECHS, MH (మిలిట్రీ హాస్పెటల్) కు వెళుతోంది. అక్కడ సైనికులను, డాక్టర్‌లను, నర్స్‌లను చూస్తుంటే చాలా ఆరాధనా భావం కలుగుతోంది అమూల్యకు. వారి స్ఫూర్తితో తను కూడ నర్స్ ట్రైనింగ్ చేసి MH లో నర్స్‌లా చేరాలని భావించింది. అందుకే ఓ రోజు కల్నల్. రావు ఖాళీగా ఉన్న సమయములో "సర్, నేను మిలిట్రీలో నర్స్‌గా చేరాలని అనుకుంటున్నాను. దానికి ఏమి చేయాలో మీరు గైడెన్స్ ఇవ్వగలరా? ప్లీజ్" రిక్వెస్టింగ్‌గా అడిగింది.

"మిలిట్రీ హాస్పిటల్‌లో నర్స్‌గా చేయటమంటే మాములుగా సివిల్‌లో చేసినట్లు కాదు. యుద్ధం జరిగేట్టప్పుడు బార్డర్, అంటే యుద్ధం జరిగే చోట కాదు బేస్ హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తుంది. కొన్ని సార్లు ఫారిన్‌వార్ జోన్‌కు కూడా వెళ్ళాల్సి ఉంటుంది. ఈ మధ్య ISIS (ఇరాక్, ఇరాన్ యుద్ధంలో) లో 46 మంది మన నర్స్‌లను ఆపేసారు. వారిని మన ప్రభుత్వం చాలా కష్టంగా తిరిగి తీసుకొచ్చింది. అది వారి అదృష్టం. మరి అలాంటి ప్రమాదాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఒక సైనికునిలా పోరాడాల్సి వస్తుందనుకో! త్యాగాలు చేయాల్సి వస్తుంది. చాలా ఒత్తిడిని ఎదుర్కోవలసి ఉంటుంది. కాకపోతే ఒకటి మటుకు చెప్పగలను, మన మిలిట్రీ హాస్పిటల్‌లో పని చేసే నర్స్‌లకు చాలా గౌరవము ఇస్తారు. ఒక సిపాయి కూడా వారిని చులకనగా చూడడు మన మిలిట్రీలో నర్సింగ్ ఆఫీసరే కానీ చిన్న కేడర్ వారు లేరు. డైరెక్ట్ గా ఆఫీసర్‌గా రిక్రూట్ చేసుకుంటారు. నర్స్‌ను ఓ అమ్మలా గౌరవంగా చూసుకుంటారు. స్త్రీలను గౌరవించాలి అనే మన సాంప్రదాయాన్ని మన మిలిట్రీవారు పాటిస్తారని గర్వంగా చెప్పగలను. జననీ, జన్మ భూమిశ్చ! అన్నది మా నినాదము. మరి ఆలోచించుకో" అన్నాడు.

ఒక్క నిమిషము కూడా ఆలోచించకుండా "నేను చేరుతాను. దానికి ఎలా అప్లై చేయాలో చెప్పండి" అన్నది స్థిరంగా.

"ముందుగా NEET ఎంట్రెన్స్ ఎగ్జాం రాసి పాసవుతే మెడికల్ ఎగ్జాం, ఇంటర్వ్యూ క్లియర్ చేయాలి. అప్పుడు BSN (Bachelor of Science in Nursing) నాలుగు సంవత్సరాల కోర్స్ AFMC (Armed Forces Medical College) పూణే లో చేయాలి. ఇప్పుడు మన సికింద్రాబాద్‌లో కూడా మిలిట్రీ డెంటల్ కాలేజ్ తెరుస్తున్నారని విన్నాను. ఇక ప్రవేశపరీక్ష తెలంగాణాలో సికింద్రాబాద్‌లో, ఆంధ్రాలో వైజాగ్‌లో రాయవచ్చు" అని వివరంగా చెప్పాడు కల్నల్ రావ్.

నాలుగు సంవత్సరాల తరువాత పూణే AFMC ఆవరణలో అమూల్య పాసింగ్ ఔట్ పెరేడ్‌కు ఆహ్వానితులుగా వచ్చారు మోహనరావు, సరస్వతమ్మ, కల్నల్ రావ్, సావిత్రమ్మలు. అమాయకముగా ఒక మోసగాడి వలలో పడి, దారి తప్పబోయి తప్పించుకున్న ఓ చిన్నికూన, ఈ రోజు గర్వంగా, ధీమాగా తలెత్తుకొని పెరేడ్ చేసి బాడ్జ్ ధరిస్తుంటే ఉద్వేగంగా, కనులారా వీక్షించారు. పెరేడ్ తరువాత మార్చ్ చేసుకుంటూ వచ్చి, తన తప్పును క్షమించి, తన జీవితాన్ని సరిదిద్దిన దేవతలు నలుగురికీ భావోద్వేగముతో సెల్యూట్ చేసింది అమూల్య!

***

# 33. కరిగిపోయిన కష్టం!

“అమ్మా... అమ్మా”

ఎక్కడ నుంచో ఎవరో ‘అమ్మా అమ్మా’ అని చిన్నగా తట్టుతూ లేపుతునట్లనిపిస్తే భారంగా కళ్ళు తెరిచింది పంకజం. కొద్ది సేపు తనెక్కడుందో అర్థం  కాలేదు. కొంచెం తేరుకొని చూస్తే పెద్దకూతురు శారద గాభరాగా తనను లేపుతోంది. చిన్నగా లేచి కూర్చుంది పంకజం.

“ఏమయిందమ్మా, ఎనిమిది అవుతున్నా ఇంకా లేవలేదు?” అని అడిగింది శారద.

“రాత్రంతా కడుపులో నొప్పి. అస్సలు నిద్రపట్టేదు. అయ్యో మీకు బడికి ఆలస్యం  అయ్యిందా?” అని నొచ్చుకుంది.

“కాలేదులే. కడుపు నొప్పి చాలా ఉందామ్మా? నెలరోజుల నుంచి ఇబ్బంది పడుతున్నావు” అడిగింది శారద.

“రాత్రి చాలా అనిపించింది. ఇప్పుడు కాస్త నయమేలే. ఉండు తొందరగా వంట చేస్తాను తిని పోండి” అంది పంకజం స్కూల్ యూనీఫామ్‌లో తయారుగా ఉన్న శారదను చూస్తూ.

“నేను వంట చేసాను. నువ్వు లేచి మొహం కడుక్కో. కాఫీ ఇస్తాను. ఈరోజు వంటకు వెళ్ళకు” అంది శారద.

పంకజం తండ్రి ఓ కాంట్రాక్టర్ దగ్గర గుమాస్తాగా చేస్తున్నాడు. ముగ్గురు కూతుళ్ళు. తనకున్నంతలో పెద్ద కూతుళ్ళిద్దరికీ పెళ్ళి బాగానే జరిపించాడు. చదువులో చురుకుగా ఉన్న పంకజాన్ని చదివిద్దామనుకున్నాడు కానీ, రాఘవ తల్లి ఎక్కడో పంకజాన్ని చూసి

ఇష్టపడి కోడలిని చేసుకుంటానని కబురుపెట్టింది. పిల్లవాడు బి.యస్. సీ పాస్ అయ్యాడు. ఓ కాంట్రాక్టర్ దగ్గర సూపర్వైజర్‌గా బాగానే సంపాదిస్తున్నాడు. పంకజానికి సరిపోయేట్టుగా ఈడూజోడూ బాగుంది అని పదవతరగతి చదువుతున్న పంకజం చదువు ఆపేసి రాఘవతో పెళ్ళి చేసాడు. రాఘవ మంచివాడే కానీ తండ్రి చిన్ననాడే పోతే తల్లి కష్టపడి పెంచిందని ఆమె మాట జవదాటడు.  వాళ్ళకు ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు. తన కూతుళ్ళు బాగా చదువుకొని, మంచి ఉద్యోగాలు చేయాలన్న కోరికతో పెద్దదానికి శారద, చిన్నదానికి సరస్వతి అని పేర్లు పెట్టుకుంది పంకజం. శారదకు పదిహేను, సరస్వతికి పదమూడు, చంద్రంకు ఎనిమిది సంవత్సరాలు.

మొగపిల్లవాడు కావాలని సరస్వతి తరువాత వచ్చిన రెండు గర్భాలను, ఊళ్ళో డాక్టర్ దగ్గర స్కానింగ్ చేయించి, ఆడపిల్ల అని అబార్షన్ చేయించింది పంకజం అత్తగారు దుర్గమ్మ. ఇంతా చేస్తే ఆ డాక్టరమ్మ అసలు డాక్టరే కాదట. పట్నంలో ఓ పెద్ద డాక్టర్ దగ్గర పనిచేసేదిట. ఊళ్ళో దొంగ సర్టిఫికేట్‌తో హాస్పిటల్ పెట్టుకొని,  ఇలా డబ్బులు సంపాదిస్తోంది. ఆమె గుట్టు బయటపడి పోలీసులు అరెస్ట్ చేసేటప్పటికే పంకజానికి జరగవలసిన నష్టం జరిగిపోయింది. చంద్రం పుట్టినప్పుడు హైదరాబాద్‌లోనే ప్రభుత్వ ఆసుపత్రిలో కానుపు చేసిన డాక్టర్, ఇంకోసారి గర్భం వస్తే పంకజంకు ప్రమాదమని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేస్తానని అంటే, ‘ఒక్క కొడుకు కొడుకు కాదు, ఇంకో కొడుకు పుట్టనీ’ అని దుర్గమ్మ ఒప్పుకోలేదు.

రాఘవ తల్లి మాట కాదనడు. రాఘవ సంపాదనకు తోడుగా తనూ కాస్త సంపాదిస్తే పిల్లల చదువుకు సహాయంగా ఉంటుందని ఒకరింట్లో వంట చేస్తోంది పంకజం. ఇంకోసారి గర్భం వస్తే తనకు చాలా కష్టం, తను పోతే పిల్లలు ఆగమైపోతారని, అత్తగారికి ఎదురుచెప్పి ఆపరేషన్

చేయించుకునే ధైర్యం లేక, మందుల దుకాణం అతనిని బతిమిలాడుకొని గర్భనిరోధక మాత్రలు తెచ్చుకొని ఈ అయిదేళ్ళుగా వాడుతోంది. నెలరోజులుగా అప్పుడప్పుడు విపరీతమైన కడుపులో నొప్పి వస్తోంది.

ఇప్పటికే రెండురోజుల నుంచి ఈ నొప్పితో పనికి వెళ్ళలేదని పిల్లలు బడికి, రాఘవ పనికి వెళ్ళాక, ఓపిక చేసుకొని వెళ్ళింది పంకజం. చిన్నగా జానకి ఇంటికి వచ్చింది. వచ్చిందే కానీ ఓపిక లేక అక్కడ బాల్కనీలో నీరసంగా కూర్చుండిపోయింది.

అటుగా వచ్చిన జానకి, పంకజాన్ని చూసి "అదేమిటీ? అంత నీరసంగా ఉన్నావు. మొహం పాలిపోయింది. రెండురోజులు పనిలోకి కూడా రాలేదు ఏమయ్యింది?" అడిగింది.

"కడుపులో చాలా నొప్పిగా ఉంది మేడం. ఈ మధ్య అప్పుడప్పుడూ వస్తోంది కానీ మొన్నటి నుంచీ చాలా ఎక్కువగా ఉంది. రాత్రి నొప్పికి తట్టుకోలేకపోయాను" అంది పంకజం కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా.

"అయ్యో అదేమిటీ? డాక్టర్‌కు చూపించుకోలేదా?" అడిగింది జానకి.

"జీతం వచ్చాక వెళుతానమ్మా" జవాబిచ్చింది చిన్నగా.

"నీ మొహం. ఉండు నేను డబ్బులిస్తాను. వీధి చివర ఉన్న డాక్టర్ దగ్గర చూపించుకో" అని కోపం చేసింది జానకి.

"వద్దమ్మా. ఇప్పటికే చాలా తీసుకున్నాను" అభిమానంగా అంది పంకజం.

పంకజం వైపోసారి చూసి, "సాయిబాబా గుడి దగ్గర కొంతమంది

డాక్టర్‌లు ఉచితంగా చూసి, చిన్నచిన్న వాటికి మందులిస్తారట. ఇప్పటికైతే అక్కడ చూపించుకొని మందు తెచ్చుకో" అని పనిమనిషి యాదమ్మను తోడిచ్చి, ఆటోలో పంపింది.

నీరసంగా తిరిగి వచ్చిన పంకజం చూసి "చూపించుకున్నావా?" అడిగింది జానకి.

పంకజం ఏమీ మాట్లాడలేదు. తల వంచుకొని నిలబడింది.

"ఇప్పటికి నొప్పి తగ్గటానికి మందులిచ్చారమ్మా. కానీ స్కానింగ్ చేయించుకు రమ్మన్నారు" జవాబిచ్చింది యాదమ్మ.

లోపల నుంచి డబ్బు తెచ్చి ఇచ్చి, "విజయా డయాగ్నస్టిక్‌కు వెళ్ళి స్కానింగ్ తీయించుకొనిరా. రిపోర్ట్ వచ్చాక ఏమి చేయాలో ఆలోచిద్దాము" అని మళ్ళీ యాదమ్మతో పంపింది.

"గర్భసంచిలో గడ్డ ఉన్నదట, రిపోర్ట్ సాయంకాలం తీసుకొని, పెద్ద డాక్టర్‌కు చూపించుకోమన్నారమ్మా" స్కానింగ్ చేయించి తీసుకొచ్చిన యాదమ్మ చెప్పింది.

ఇంటికి వచ్చి, ఇదేమి ఉపద్రవం వచ్చి పడింది అని బాధపడుతూ కూర్చున్న పంకజం, నీరసంగా వచ్చి తన పక్కన కూర్చున్న రాఘవను ఏమయ్యిందనట్లు చూసింది.

"మా కాంట్రాక్టర్ సర్‌కు నష్టాలొస్తున్నాయట. పనులు మానేస్తున్నానని రెండు నెలల జీతాలిచ్చి పనిలో నుంచి తీసేసారు" జీతం డబ్బులు పంకజంకు ఇస్తూ దిగులుగా అన్నాడు రాఘవ.

కష్టాలన్నీ కట్టకట్టుకొని వచ్చాయి అని ఆలోచిస్తుంటే, ఆ ఒత్తిడికేమో

ఒక్కసారిగా విపరీతమైన కడుపునొప్పి వచ్చి ఉండలు చుట్టుకుపోయింది పంకజం. గాభరాపడిన రాఘవ వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. శారద వెళ్ళి స్కానింగ్ రిపోర్ట్ తెచ్చింది. అది చూసి గర్భసంచీలో గడ్డ ఉందని, ఆపరేషన్ చేయాలనీ, ఇంకా కొన్ని పరీక్షలు రాసి, అప్పటికి నొప్పి ఉపశమనానికి మందులు ఇచ్చింది డాక్టర్. ఆ పరీక్షలకూ, మందులకు, ఆ నెల ఇంటి ఖర్చులకూ రాఘవ జీతం అయిపోయింది. పంకజం నొప్పి చూసి తట్టుకోలేకపోతున్నాడు. వెంటనే పంకజానికి ఆపరేషన్ చేయించాలి. తెలిసిన వారందరినీ అప్పడిగాడు. అంతా సానుభూతి చూపించారే కాని డబ్బులు సర్దలేకపోయారు.

అమ్మానాన్నల పరిస్థితి చూసి, “అమ్మా నీ బదులు నేను వెళ్ళి వంట చేస్తాను. వాళ్ళు జీతం ఇస్తారు కదా” అంది శారద.

శారదను దగ్గరగా తీసుకొని రాఘవతో, “మా సార్ ఏమైనా సహాయం చేస్తారేమో అడగనా? ఇప్పటి వరకూ ఈ ఆలోచన రాలేదు” అంది పంకజం.

జానకి భర్త వీరేన్ సంగతి తెలుసుకొని “మీకు ఆరోగ్యశ్రీ కార్డ్ ఉందా?” అడిగాడు.

“లేదు సార్. తీసుకోలేదు” అంది పంకజం .

“నీకు హెల్త్ ఇన్స్యూరెన్స్ కడతానంటే, వద్దు ఆ అయిదువేలు నాకివ్వండి అన్నావు. మరి ఇప్పుడేమి చేద్దాం?” అడిగాడు వీరేన్.

తనేం చెపుతుంది? ఆ డబ్బు ఉంటే ఇస్తే పిల్లల ఫీజుకూ దానికీ ఉంటుందనుకుంది. కానీ ఇట్లా ముంచుకొస్తుందనుకుందా? “మీరే చెప్పండి ఏమి చేయాలో” అంది జానకి.

"ఈ మధ్య ప్రభుత్వ ఆసుపత్రిలో బాగా చూస్తున్నారు. అక్కడ చేయించుకోవచ్చు. కానీ, మందులకు, టెస్ట్ లకూ చాలా డబ్బు అవసరము అవుతుంది. రేపొద్దున ముఖ్యమంత్రి ఆఫీస్ కు వెళ్ళి, ఏదైనా సహాయము చేస్తారేమో అడగండి. మీతో మా అసిస్టెంట్ రవిని పంపుతాను" అన్నాడు వీరేన్ రాఘవతో.

పంకజం పరిస్థితి చూసి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పదివేలు ఇచ్చారు.

ముందు చిన్న గడ్డ అనుకున్నారు కానీ గర్భసంచీలో చాలా పెద్దగడ్డ ఉంది. పైగా ఓవరీస్ మీద కూడా గడ్డలు వచ్చాయి. అందుకని గర్భసంచీ, ఓవరీస్ అన్నీ తీసేయాల్సి వచ్చింది. నాటుమందులతో అబార్షన్‌లు చేయించుకోవటమూ, వరుసగా అయిదు సంవత్సరాలు గర్భనిరోధక మందులు వేసుకోవటముతో ఈ సమస్య వచ్చిందని చెప్పింది డాక్టర్. అదృష్ట వశాత్తూ అది కాన్సర్ కాలేదు. కొన్నిరోజులు రెస్ట్ తీసుకోవాలంది డాక్టర్.

ఆపరేషన్ గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా చేసారు. అప్పటికి అవసరమైన మందులు కొన్ని ఇచ్చారు కానీ గర్భసంచీ, ఓవరీస్ తీసేయటముతో హార్మోనల్ ఉత్పత్తి ఉండదు. అందువలన కొన్నిరోజుల పాటు డాక్టర్ పర్యవేక్షణలో హార్మోనల్ టాబ్లెట్స్ తీసుకోవాలి. ఇంకా బలమైన ఆహారం, కాల్షియం కోసం పాలు తప్పనిసరిగా తీసుకోవాలి. లేదంటే ఎముకలు గుల్లబారి ఫ్రాక్చర్స్ అయ్యే ప్రమాదం ఉంది అని డాక్టరమ్మ మరీమరీ చెప్పింది. వీటన్నిటికీ, ఇల్లు గడిచేందుకు డబ్బులు కావాలి. ఎంత తిరిగినా చిన్నపాటి ఉద్యోగం కూడా దొరకలేదు. ఏమి చేయాలో తెలియక, పంకజం సలహా మీద వీరేన్ దగ్గరకు వెళ్ళాడు రాఘవ.

"రాఘవా సైనిక్‌పురిలో నాకు తెలిసిన ఒక మిలిట్రీ సార్ వాళ్ళకు నమ్మకంగా ఇల్లు చూసుకునేవాళ్ళు కావాలని అడిగారు.  క్వాటర్ ఇస్తామన్నారు. ఇల్లు, తోట చూసుకోవాలి. పంకజం కోలుకున్నాక మేడంకు వంటలో సహాయము చేసి, సార్ వాళ్ళ అమ్మగారు పెద్దావిడ ఉన్నారు, ఆవిడకు తోడుగా ఉండాలి. ఆవిడ పనులు ఆవిడ చేసుకుంటారు. అందరూ వెళ్ళిపోయాక ఒక్కర్తే ఉంటుందని తోడుకోసం చూస్తున్నారు. ఆ సార్‌కు తెలిసిన కాంట్రాక్టర్ దగ్గర నీకు పని ఇప్పిస్తారు. లేదా నువ్వు డ్రైవింగ్ నేర్చుకుంటే ఆ సార్ దగ్గరే చేయవచ్చు. పిల్లలను కూడా అక్కడే స్కూల్‌లో చేర్చవచ్చు.  మరి నీ ఇష్టం చేస్తానంటే చెప్పు ఆయనకు చెపుతాను" అన్నాడు వీరేన్.

"అంతకన్నా కావలసిందేముంది సర్. వెళతాము" అన్నాడు రాఘవ.

వీరేన్‌కు కృతజ్ఞతలు తెలుపుకొని ఇంటికి వచ్చి సంతోషంగా భార్యాపిల్లలకు చెప్పాడు.

విషయము చెప్పిన తండ్రితో "అమ్మకు నయం అయ్యేవరకు మేడంకు నేను వంటలో సహాయం చేస్తాను నాన్నా" అంది శారద.

"అక్కడ తోట ఉందా? నేను చెట్లకు నీళ్ళుపోసి నీకు సహాయం చేస్తాను" అంది సరస్వతి.

"మరి నేనేమి చేయను?" అన్నాడు చంద్రం.

పిల్లలను మురిపెంగా దగ్గరకు తీసుకున్నాడు రాఘవ. వచ్చిన కష్టం కరిగిపోయిందని తమకు సహాయం చేసిన వీరేన్ దంపతులకు, ఆ దేవదేవునికి నమస్కరించుకుంది పంకజం.

***

**మన కథలు - మన భావాలు సమూహములో ఇచ్చిన చిత్రానికి రాసిన ఈ కథకు వచ్చిన పాఠకుల సమీక్షలు కొన్ని.**

**Narahari Rao**

**కథాసమీక్ష_1**

కథ : కరిగిపోయిన కష్టం!

రచయిత్రి : మాలాకుమార్ గారు.

కథ ఎత్తుగడలోనే పాఠకులకు ఇంట్రెస్ట్ కలిగించేలా రాసారు రచయిత్రి Kamala Paracha గారు.

ఆరంభంలోనే తల్లి మనసు ఏమిటనేది తెలిపేలా చేసింది పంకజం పాత్ర.

తాను అంత నొప్పితో బాధపడుతున్నా పిల్లల కోసం వంటచేయాలనే తాపత్రయ పడటంలో తల్లిప్రేమ ఔన్నత్యం కళ్ళకు కట్టినట్టు చూపించడంలో కృతకృత్యులయ్యారు రచయిత్రి.

కథ ఆద్యంతం పంకజం పాత్రను చక్కగా చిత్రీకరించారు.

కథ మొదట్లో విషయం సూటిగా చెప్పకుండా తల్లీ కూతురు సంభాషణ ద్వారా తెలియపరచడం బాగుంది. పాఠకులకు విషయమేమిటనేది క్లియర్‌గా అర్థం అవుతుంది.

తర్వాత పంకజం పాత్ర నేపథ్యం, కుటుంబ వాతావరణం అంతా క్లుప్తంగా వివరించేసారు రచయిత్రి.

కథ నడకలో ఎక్కడ కూడా బోర్ కొట్టకుండా ముందుకు సాగడమనేది విశిష్టంగా చెప్పుకోవాలి.

ఇంటరెస్టింగ్ సంఘటనలు, మలుపులులాంటివేమీ లేకుండా కథను కథగా కొనసాగించడం... పాఠకుల మనసులను చూరగొనేట్లు కథను చెప్పడంలో రచయిత్రి నేర్పరితనం బయట పడుతుంది.

కథ అంటే నా దృష్టిలో జీవిత చిత్రణ.

ఈ కథలో దిగువ మధ్య తరగతి జీవితాలను కథ పట్టు సడలకుండా సహజంగా చిత్రీకరించారు.

కథలోని ప్రతి పాత్ర చిత్రణ వాటి హద్దుల్లోనే ఉండటం కథకు మరింత వన్నె తెచ్చి పెట్టింది.

ముఖ్యంగా కథలో విలన్లంటూ ఎవరూ లేరు.

కేవలం పరిస్థితులే ప్రతినాయకులుగా కనిపిస్తాయి ఈ కథలో.

కథలో అత్తమ్మ పాత్ర దుర్గమ్మ విలన్‌గా కనిపించినా ఆమెనూ తప్పు పట్టడానికి లేదు... కొన్ని పాత్రల స్వభావాలే అంత!

ఆ కాలపు వాళ్ళు అలానే ఆలోచిస్తాను... అందులో కొడుకు జీవితం బాగుపడాలనే స్వార్థం కనిపిస్తుందంతే!

కోడలి పరిస్థితి ఏమి? ఆమె ఆరోగ్యం సహకరిస్తుందా? ఇలాంటివన్నీ ఆ పాత్రకు పట్టవు.

ఆ పాత్ర చేస్తున్నది ఒప్పు అని నేననడం లేదు... ఆ పాత్ర స్వభావాన్ని బట్టి ఆ పాత్ర నడచుకుంటుందంటున్నాను.

జీవితంలో మనకు ఎందరో తారస పడుతుంటారు... ఎవరి ఆలోచనలు వారివే!

అందరూ మనలా ఆలోచించాలని లేదు కదా!

అందరిలా మనమూ ఆలోచించలేం కదా! అలానే ఈ కథలోని పాత్రల ఆలోచనావిధానం వేటికవే ప్రత్యేకమే!

రాఘవకు భార్యపైన ప్రేమ ఉన్నా తల్లి మాటను గౌరవించడం అతని గుణం. దాన్ని తప్పు పట్టలేం. అలా అని అతను ఒప్పని చెప్పలేం. కొందరు మనుషులంతే... అలానే ప్రవర్తిస్తుంటారు.

కథ చివర్లోకి వచ్చేసరికి భార్యపై అతనికున్న ప్రేమ అతని చర్యల్లో మనకు కనిపిస్తుంది.

పాజిటివ్ ఎండింగ్ బాగుంది.

నేను, నా ఆలోచనలు అన్నీ నార్మల్‌గా పాజిటివిటీ వైపుకే దారి తీస్తుంటాయి... అలా ఈ కథ నాకు పాజిటివ్ ఎండింగ్ పరంగా నచ్చింది.

జీవితాల్లో మన చుట్టూ ఉన్న పరిస్థితులను మనం ఏ విధంగా తీసుకుంటాం? అవి మనకు ఏం నేర్పుతాయన్నది ఎవరికైనా వారి వారి సంస్కారంపై ఆధారపడి ఉంటుంది.

కుటుంబానికి సాయంగా ఉండాలని... తమకు తోచిన రీతిలో సాయమందించాలని ఆలోచించడం...

వీటన్నిటిపై ఆ పిల్లల పెంపకం ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.. అంటే ఆ క్రెడిట్ అంతా పంకజానికే వెళ్తుంది.

ఇలా కథను సహజాతి సహజంగా చిత్రీకరించడం నాకు బాగా నచ్చింది. కథ నాకు బాగా కనెక్ట్ అయింది.

అంటే రచయిత్రి కథ ద్వారా ఏం చెప్పాలనుకున్నది నా వరకూ చేరింది.

చివరిగా ఒక మంచి కథను అందించిన రచయిత్రి గారికి అభినందనలు.

#నరహరి_రావు_బాపురం.

అనంతపురము.

**Lalitha Rayaprolu**

**కథాసమీక్ష_1**

ఈ విభాగంలో అందరి కథలు ఒకదాన్ని మించి, ఒకటి ఉన్నాయి.

ఒకే కథని సమీక్షించాలనే నిబంధనకి లోబడి, కమల పరచ ఉరఫ్ మాలా కుమార్ గారు వ్రాసిన 'కరిగిపోయిన కష్టం' అనే కథని సమీక్షించడం జరిగింది.

ఏదో రెండు, మూడు లైన్ల కామెంట్ రాయడం తప్పిస్తే, సమీక్ష ఎప్పుడూ రాయలేదు.

ఇదే మొదటిసారి కనక, ఏమైనా తప్పులు ఉంటే, రచయిత్రికి, నిర్వాహకులకు ముందస్తు క్షమార్పణలు.

ఆడపిల్ల మొదటిసారి వ్యక్తురాలయినప్పటి నుండీ, కడుపునొప్పి ఓర్చుకోవడం తప్పదన్నట్టు తల్లులు నేర్పిస్తారు. టాబ్లెట్స్ వేసుకుంటే,

ఇంకో రకం కాంప్లికేషన్స్ వస్తాయని, వేసుకోనివ్వరు.

పెళ్ళయితే, తగ్గుతుందని, డాక్టర్ చెప్పిందని కూడా కొందరి నోట విన్నాను.

ఇంక పురిటి నొప్పులు బిడ్డ పుట్టేముందు పడితే, సిజేరియన్ నెప్పులు తరవాత పడాలని కూడా ప్రిపేర్ అవుతాము.

వీటి వల్ల, ఆడవాళ్ళకి కడుపునొప్పి రాగానే, సర్వ సాధారణంగా డాక్టర్ దగ్గరికి వెళ్ళే ప్రసక్తే ఉండదు. కమల గారి కథ కొద్దిగా పాత కాలానికి చెందినది.

ఈ కాలంలో ఎవరూ, అన్ని అబార్షన్లు చేయించుకోరు. ఆ కాలంలో అత్తగారి మాట చెల్లేది.

ఒక కొడుకు కొడుకూ కాడు.ఒక కన్ను కన్నూ కాదు అని అందరి పెద్దవాళ్ళల్లాగే అత్తగారు శాసించి, నాటు వైద్యురాలి దగ్గర, అబార్షన్లు చేయించింది. ఆ బాధ పడలేక, పంకజం గర్భనిరోధక మాత్రలు వాడుతోంది. కడుపునొప్పి తట్టుకోలేక,పంకజం నీరసంగా కూర్చుంటే,

తను వంట చేసే ఇంటావిడ జానకి, బలవంతంగా డాక్టర్ దగ్గరికి పంపిస్తే, యూట్రస్‌లోనే కాకుండా, ఓవరీస్‌లో కూడా గడ్డలు ఉన్నాయని, తెలిసింది. ట్రీట్‌మెంట్‌కి డబ్బులు కావాలి.

భర్త రాఘవకి అప్పుడే ఉద్యోగం పోయింది.

ఎలా ఖర్చులు తట్టుకోవాలా అని ఆలోచిస్తుంటే, జానకి భర్త వీరేన్ సాయం అడుగుదామని, పంకజం చెప్పిన సలహా మేరకు, జానకి భర్త వీరేన్‌ని సంప్రదిస్తే, హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే బాగుండేది అన్నాడు.

అతను సలహా ఇస్తే, ముఖ్యమంత్రి ఆఫీసుని సంప్రదించారు. అక్కడ కొంత సాయం అందింది

చివరికి, ప్రభుత్వ ఆస్పత్రిలో, పంకజానికి ఆపరేషన్ జరుగుతుంది. పంకజం మందులకి, బలమైన ఆహారానికి, ఇల్లు గడవడానికి, అన్నింటికీ డబ్బులు కావాలి. వీరేన్ చూపించిన ఇంటికి, సకుటుంబంగా వెళ్ళడానికి పిల్లలు సైతం ఓటు వేస్తారు.

వాళ్ళు కూడా తలో పనీ చేస్తామని, ఉత్సాహంగా ముందుకి వస్తారు. రాఘవ్ డ్రైవింగ్ నేర్చుకుంటే, బాగుంటుంది అని వీరేన్ మంచి సలహా ఇస్తాడు.

పంకజం జీవితం కాస్త గాడిలో పడుతుంది. ధనం పుష్కలంగా ఉండి, అండలేని వారు చాలా మంది ఉంటారు. వాళ్ళు ఉండడానికి ఇల్లు ఇస్తారు. తిండి, బట్ట దొరుకుతుంది.

పిల్లలు ఎంత చదువుకుంటే, అంత చదివించగలరు.

చిన్న కుటుంబాల వారు చిన్నతనం అనుకోకుండా అలాంటి ఇళ్ళల్లో పన్లు చేస్తే, బాగుంటుంది అన్న సందేశం నాకు బాగా నచ్చింది.

రచయిత్రి శ్రీమతి కమల పరచ గారికి మరొక్కసారి అభినందనలు.

***

Vijayalakshmi Varanasi

#కథాసమీక్ష_1

'కరిగి పోయిన కష్టం'

మాలాకుమార్ గారి కథకి సమీక్ష వ్రాయబూనడం నిజంగా గొప్ప సాహసమే... అంత పెద్ద రచయిత్రి కదా అని వెనకంజ వేసాను. కానీ ఆ కథలోని ఔచిత్యం నన్ను నిలవనియ్యలేదు

తనకి కడుపు నొప్పి వచ్చినప్పుడు డబ్బు గురించి ఆలోచనతో నాటు వైద్యాలు చేయించుకున్న ఓ సగటు ఇల్లాలు, ముదిరిపోయిన జబ్బుతో పడిన బాధ ఎంతో కూలంకషంగా చర్చించి పాఠకులకు అటువంటి తప్పులు తెచ్చిపెట్టే అనర్థాలు చాలా బాగా హైలైట్ చేసారు.

అత్తగారి మూర్ఖపు పట్టుదలకి భార్య అంత నష్టపోతున్నా, తల్లి ప్రేమకు విలువ ఇచ్చిన రాఘవ ఉదాసీనత్వం... రెండో పిల్లవాడి కోసం చూడమన్నప్పుడు, భార్య ఎదిరించినా ఆమెకి సపోర్ట్ ఇవ్వడము అతనిలోని మార్పు... సహజంగా రాశారు.

కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా, మనసంటూ ఉంటే. మార్గము తప్పకుండా దొరుకుతుందని చాలా బాగా హైలైట్ చేశారు

ఒక చిరుద్యోగి అయిన భర్త , భార్యకి మాటలతో కాక మూటల్తో మాత్రమే ట్రీట్ కావాల్సిన జబ్బు వస్తే, భార్య తెచ్చే డబ్బు ఎంత అవసరమైనా, ఆమె ఆరోగ్యమే తనకి మొదటి అక్కర అని వెంటనే ఉద్యోగం మానిపించాడు చూడండి... ఆ భర్త ఎంతటి ప్రేమికుడో తెలియచెప్పింది.

ఉన్న చిన్న ఉద్యోగము కూడ పోయినా పరిస్థితులపట్ల విసుగు,

నిస్పృహ చెందకుండా తన యజమాని ద్వారానే ఒక ఉపాధి వెతుక్కోవటం పాజిటివ్ వైబ్స్ ని వెదజల్లింది.

పిల్లల్ని ఎంత బాగా పెంచారో... కష్ట సమయంలో ఆదుకున్నారు.. అది చాలా ఓదార్పుగా ఉన్నది, ఉపాధి సంపాదించుకోవడం, సమస్యని ధీరోదాత్తగా ఎదుర్కోవడము గురించి ఎంతో చక్కగా చెప్పారు.

అత్తగారి హఠం కొంతమటుకు నిరసిస్తే బాగుండేది... కానీ పరిస్థితులు ఎల్లవేళలా మనచేతులో ఉండవు... ఎంతో గడ్డు పరిస్థితులైనా పిల్లల్ని అంత ప్రేమగా బాధ్యతగా పెంచారు. కుటుంబ నేపథ్యం బాగుంటే ఎంతటి కష్టాన్నైనా దాటవచ్చునని చాలా బాగా చెప్పారు.

ఇంకా చాలా చాలా బాగా నచ్చింది నాకు... నామాటలకందనంత...

శ్రీమతి మాలాకుమార్ గారు! నా ఈ సాహసాన్ని, స్నేహభావముతో సహిస్తారు కదూ..

ఇంకా ఎంతో బాగా వ్యాఖ్యానించ తగ్గ కథ మీది.

మాలాకుమార్ గారు మీకు అభినందనలు!

***

# 34. ఆశాకిరణ్

**(పొన్నాడ మూర్తిగారు వేసిన చిత్రానికి ఓ చిన్న సరదా కథ. ఇది తరుణి అంతర్జాల మహిళావారపత్రికలో ప్రచురించబడినది.)**

***

ఆశ, కిరణ్ ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్‌లోనే ప్రేమలో పడిపోయారు. ఒక వైపు చదువు, ఇంకో వైపు కిరణ్ కు ఇష్టమైన శోభన్‌బాబు సినిమాలు చూస్తూ, ఆడుతూపాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేసారు. ఇద్దరికీ GRE లో మంచి స్కోర్ రావటముతో యు.యస్‌లో మంచి యూనివర్సిటీలో యం.యస్‌లో సీట్ వచ్చింది. అదృష్టవశాత్తూ ఇద్దరికీ ఒకే యూనివర్సిటీలో రావటముతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాకపోతే ఓ చిక్కు వచ్చి పడింది. ఇద్దరి ఇళ్ళల్లోనూ వారి ప్రేమను ఆమోదించినా, ఆశ తాతయ్య మటుకు పెళ్ళి చేసి పంపాల్సిందేనని పట్టుబట్టారు. పెళ్ళి చేసుకొని జంటగా వెళ్ళితే చదువు గంట కొడుతుందేమోనని భయం. చేసుకోకుండా ససేమిరా పంపనని తాతయ్య భీష్మించుకొన్నాడు. నాన్న తాతయ్య మాట జవదాటడు. తాతయ్యను ఒప్పించుకో అని వదిలేసాడు. ఆ విషయమై చర్చించుకునేందుకు కిరణ్ కు ఇష్టమైన శోభన్‌బాబు సినిమా 'ఏమండీ ఆవిడ వచ్చింది'కి వచ్చారు ఇద్దరు. కిరణ్ కు శోభన్‌బాబు సినిమాలంటే ఉన్న పిచ్చి ఇష్టంను, కిరణ్ మీద ఉన్న పిచ్చిప్రేమతో బలవంతాన భరిస్తుంది ఆశ.

"నా మీద నమ్మకం లేదా ఆశా?" పాప్‌కార్న్ నములుతూ, మెడలో శోభన్‌బాబు స్టైల్‌లో వేసుకున్న స్కార్ఫ్ ను సవరించుకుంటూ అడిగాడు కిరణ్.

'నువ్వంటే నమ్మకంలేక కాదు బాబూ, నువ్వు చూసే ఈ ఇద్దరు పెళ్ళాల ముద్దుల మొగుడు శోభన్‌బాబు సినిమాల మీద నమ్మకం లేదురా నాయనా!' అని మనసులో అనుకొని, "ఏమి చేద్దాం కిరణ్? తాతయ్య పెళ్ళి కాకుండా పరాయి మొగవాడి వెంట పంపటం మా ఇంటావంటా లేదు అని వప్పుకోవటము లేదు" అంది ఆశా కాస్త దిగులుగా.

ఎంగేజ్మెంట్ చేసుకున్నాక కూడా పరాయి మగవాడినవుతానాని ఆవేశపడ్డా చేసేదిలేక ఆశా మెడలో మూడు ముళ్ళూ వేసి, జంటగా విమానమెక్కాడు కిరణ్.

అమెరికా బయలుదేరే ముందు రాయల్ టాకీస్ గల్లీలో వెతుక్కొని తెచ్చుకున్న, శోభన్‌బాబు సినిమా కాసెట్లు, వి.సి.ఆర్ కింద సద్దుతున్న కిరణ్ తో "ఈ కాలం వాళ్ళలాగా రాం చరణ్, జూనియర్ యన్.టీ. ఆర్ సినిమాలు కాకుండా ఈ శోభన్‌బాబు సినిమా పిచ్చి ఎట్లా వచ్చిందిరా మగడా? పైగా బాబా జమానాగాడిలా ఈ వీసీఆర్, కాసెట్లూ ఏమిటీ? హాయిగా లాప్‌టాప్‌లో చూడవచ్చుగా!" అడిగింది విసుగ్గా ఆశా.

"మా బాబాయి, ఆయన ఫ్రెండ్స్ కు శోభన్‌బాబు సినిమాలంటే, శోభన్‌బాబులాగా స్టైల్ కొట్టటమంటే ఇష్టం. శోభన్‌బాబు సినిమా రిలీజ్ అవగానే చూసేవారు. ఒక్కడే వెళితే చదువుకోకుండా సినిమాలు చూస్తున్నాడని మా డాడీ కోపం చేస్తారని, నన్ను క్రికెట్ ఆడించటానికి తీసుకెళుతున్నానని డాడీకి చెప్పి, మా బాబాయి నన్ను తీసుకెళ్ళేవాడు. అయినా లాప్‌టాప్‌లో చూస్తే ఏం మజా ఉంటుంది. ఇలా సెట్ చేసుకొని చూస్తే భలే ఉంటుంది. అయినా శోభన్‌బాబు భలే అందగాడు తెలుసా" పరవశంగా అన్నాడు కిరణ్ మెడలో స్కార్ఫ్ స్టైల్‌గా సద్దుకుంటూ.

"మీ బాబాయ్ పుణ్యమా బాబూ ఇది? నువ్వూ అంతటి అందగాడివే బాబూ, అందుకే నాకిన్ని తిప్పలు" అంది నిష్ఠూరంగా ఆశ.

“పోనీలే అప్పుడప్పుడు ఇంగ్లీష్ సినిమాలు చూద్దాం” తనను శోభన్‌బాబంత అందగాడన్నందుకు సంతోషపడిపోతూ కాస్త కన్సెషన్ ఇచ్చాడు.

ఇంట్లో ఈ గోల. కాలేజ్‌కి వెళితే ఫ్రెండ్స్ అందరూ ‘ఆంటీ ఆంటీ’ అని పిలిచి ఏడిపిస్తారు. తనకొక్కదానికే పెళ్ళయ్యింది మరి. వాళ్ళంతా హాయిగా బాచులర్ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు. అదో గోల. తను కూడా వాళ్ళతో పాటు ఎంజాయ్ చేయకుండా తొందరపడి పెళ్ళి చేసుకున్నానా అని కొన్నిసార్లు విరక్తి వచ్చేస్తోంది ఆశాకి. ఇవన్ని వదిలేసి హాయిగా ఇంట్లో కూర్చుందామా అనుకుంటుంది. కానీ ఏమాటకామాటే చెప్పుకోవాలి కిరణ్ తనను చాలా ముద్దుగా చూసుకుంటున్నాడు. వాళ్ళ అమ్మ దగ్గర వంట కూడా నేర్చుకున్నాడేమో కొన్ని ఐటమ్స్ రుచిగా వండి ప్రేమగా తినిపిస్తాడు. ఇంటి పనుల్లో సహాయం చేస్తాడు. ఒక్క ఆ శోభన్‌బాబు సినిమాల పిచ్చి తప్ప వేరే ఏ అలవాటూ లేదు. గుడ్‌బాయ్. పైగా మాస్టర్స్ చేస్తే కాస్త మంచి ఉద్యోగం వస్తుంది కానీ బాచులర్ డిగ్రీతో ఏమొస్తుంది? అందుకే శోభన్‌బాబు గోల, ఆంటీ గోల ఏదో తట్టుకుంటోంది.

క్లాస్ అయిపోయాక ఎందుకో నీరసంగా అనిపిస్తుంటే ఇంటికి వచ్చేసింది. పుస్తకాలు పక్కన పడేసి మంచానికి అడ్డంగా పడుకున్న ఆశాను చూసి ఏమయ్యిందంటూ గాభరా పడ్డాడు కిరణ్.

“ఎందుకో కాస్త నీరసంగా అనిపిస్తోంది. చాలా నిద్ర వస్తోంది” జవాబిచ్చింది ఆశ.

“నీకు ఇష్టమని గులాబ్ జామూన్‌లు చేసాను. రెండు తిను. కాసేపు ఇంగ్లీష్ సినిమా చూడు” అని బౌల్‌లో గులాబ్ జామూన్లు తెచ్చి ఇచ్చాడు. వీసీయార్‌లో ఇంగ్లిష్ సినిమా పెట్టాడు.

గులాబ్ జామూన్ నోట్లో పెట్టుకుంటూనే కడుపులో తిప్పినట్లైయి వాష్ రూంలోకి పరిగెత్తింది ఆశా. వాంతి చేసుకొని గోడకు ఆనుకొని నిలబడింది. ఏదో ఆలోచన వచ్చి, పొట్ట మీద చేయి వేసుకుంది. పొట్టలో ఏదో బుజ్జిగా కదిలిన భావన కలిగింది. అంటే అదేనా? నిస్త్రాణంగా వచ్చి మంచం మీద వాలిపోయింది. ఇహ నుంచి తనను ఫ్రెండ్స్ అమ్మమ్మా అని ఏడిపిస్తారా? తన చదువు అటకెక్కినట్లేనా? సంతోషించాలా? బాధ పడాలా?

"ఏమిటీ పడుకున్నావు? సినిమాలో మాంచి హాట్ హాట్ సీన్లు వస్తున్నాయి చూద్దాం రా" దగ్గరికి వచ్చి ఉత్సాహంగా పిలిచాడు కిరణ్.

"నీ సినిమా పిచ్చి తగలెయ్య. శోభన్‌బాబు సినిమాలు చూపించి ఆయనంత అందగాడివి నీకూ ఇద్దరు పెళ్ళాలు కావాలేమో, ఎప్పుడు నేను 'ఒరేయ్ ఆవిడొచ్చిందిరా!' అని పిలవాల్సి వస్తుందేమోనని హడలగొట్టించి పెళ్ళి చేసుకున్నావు. హాట్ హాట్ సీనులంటూ ఇంగ్లీష్ సినిమాలు చూపించి అమ్మను చేసావుగదరా" అంటూ పుస్తకాలతో కిరణ్ నెత్తిన రెండంటించింది ఆశ.

ఇంక ఇంతటితో వాళ్ళ తిప్పలేవో వాళ్ళు పడతారుకానీ మనమిక వాళ్ళని వదిలేద్దాం.

***

# 35. నీకై వేచేను!

ఓ చెట్టు కింద బస్ ఆపాడు డ్రైవర్. అందరితో పాటు అక్షిత కూడా దిగి చుట్టూ చూసింది. అది ఒక పల్లెటూరిలా ఉంది. ఎదురుగా పాకలాంటి హోటల్ ఉంది. దిగిన వాళ్ళంతా అక్కడికి వెళుతున్నారు. తన పక్కన ఎవరో మాట్లాడినట్లుగా ఉంటే పక్కకు చూసింది. ఒక పెద్దావిడ బస్ ప్రతి కిటికీ దగ్గరా ఆగి లోపలకు తొంగి చూస్తోంది. బస్ చుట్టూ తిరిగి చూసి ఏదో గొణుగుతుంటే, "ఏమి కావాలండీ?" అని అడిగింది అక్షిత. ఆవిడ అక్షితకు జవాబివ్వకుండా ఏదో గొణుగుతూ ఇంకా వెతుకుతోంది.

"మీ ఆయన ఈ రోజు కూడా రాలేదా?" నవ్వుతూ ఓ పిల్లవాడు అడిగాడు.

ఆమె ఏమీ జవాబివ్వకుండా చిన్నగా వెళ్ళిపోతోంది. ఆమెను చూస్తూ, "ఎవరీమె?" అని అడిగింది ఆ పిల్లవాడిని.

"ఓ పిచ్చిది. రోజూ వచ్చి వాళ్ళాయన కోసం బస్‌లో వెతికి వెళ్ళిపోతుంది" అన్నాడు పెద్దగా నవ్వుతూ. ఆ పిల్లవాడిని అదిలిస్తూ, "అమ్మణ్ణీ! మీ ఆయన వస్తే నేను చెపుతానన్నాను కదా, ఎందుకొచ్చావు? ఇంటికి వెళ్ళు" అన్నాడు ప్రయాణికులకు కాఫీ ఇస్తూ, పాక హోటల్ ముందున్న కాఫీ బండి అతను ఆమెతో.

"ఎవరీమె?" అతనిని అడిగింది అక్షిత కాఫీ తాగుతూ. అతను కాఫీ కలుపుతూ అక్షిత ప్రశ్న వినిపించుకోలేదు. పక్కన పిల్లల అరుపులు వినిపిస్తే అటు చూసింది అక్షిత. కొంతమంది పిల్లలు రాళ్ళతో ఆమెను బెదిరిస్తూ నవ్వుతూ, గోలగోలగా అరుస్తున్నారు. వాళ్ళనుంచి తప్పించుకుంటూ ఆమె కాలు మెలికపడి కింద పడిపోయింది. అక్షిత చప్పున వెళ్ళి ఆమెను లేవదీసింది.

అక్షితకు ఆమెను చూస్తే పిచ్చిదానిలా అనిపించలేదు. ఏదో పోగొట్టుకున్నదానిలా ఉంది. ఆమెను లేవదీసి, పట్టుకుంటూ "అమ్మా మీ పేరేమిటి?" అని మెత్తగా అడిగింది. ఆమె జవాబు ఇవ్వకుండా అక్షితను పట్టించుకోకుండా  ముందుకు నడిచి తూలిపడిపోబోయింది. అక్షిత ఆమెను పట్టుకొని నడిపిస్తూ, "మీ ఇల్లెక్కడ?" అని అడిగింది కానీ ఆమె దానికీ జవాబివ్వలేదు. అక్షిత ఆమెను చిన్నగా నడిపిస్తూ ఆమెను అనుసరించింది.  ఆమె ఒక ఇంటి ముందుకు రాగానే ఒక పెద్దాయన వచ్చి ఆమె చెయిపట్టుకొని లోపలికి తీసుకెళుతూ "అమ్మణ్ణీ, నేను వస్తానన్నాను కదా! అట్లా వెళ్ళిపోయావేమిటి?" బుజ్జగింపుగా అంటూ, అమ్మణ్ణి చేయి పట్టుకొని లోపలికి నడిపిస్తూ, అక్షిత వైపు ఎవరన్నట్లు చూసాడు.

అక్షితకు ఏమి చెప్పాలో తెలియలేదు. చిన్నగా మాటలు కూడగట్టుకుంటూ, "నేను ఈ బస్‌లో దిగాను. అక్కడ ఈవిడ ఎవరికోసమో వెతుకుంతుంటే, పిల్లలు ఏడిపించబోయారు. తను పడిపోతే, లేపి తీసుకొచ్చాను. ఈవిడ భర్త కోసం వెతుకుతున్నారు. ఎందుకో, ఏమి జరిగిందో తెలుసుకోవచ్చా?" అడిగింది.

"నువ్వు జర్నలిస్ట్ వా?" అడిగాడు.

"కాదు టూరిస్ట్ ను" జవాబిచ్చింది.

ఓ క్షణం అక్షితను నిశితంగా చూసి, "లోపలికి రా" అని పిలిచాడు. అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుంటూ చుట్టూ చూసింది. గోడకు ఒక మిలిట్రీ అతని ఫొటో ఉంది. ఆ ఫొటో వైపు చూస్తుంటే ఆ పెద్దాయన అక్షిత ఎదురుగా కూర్చుంటూ "చెప్పమ్మా? ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"నా పేరు అక్షిత. నేను ఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నాను.

అప్పుడప్పుడు పర్యాటక ప్రదేశాలకు వెళ్ళటము నా హాబీ. అక్కడ చూడదగిన ప్రదేశాలతో పాటు, చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు కూడా వెళుతుంటాను. అలా అక్కడి బస్‌లల్లో, రైళ్ళల్లో పర్యటిస్తే, అక్కడివారి జీవన విధానము తెలుస్తుందని అక్కడంతా బస్‌లల్లోనే తిరుగుతుంటాను. అట్లాగే రెండురోజుల క్రితం కేరళలోని పర్యాటక ప్రదేశాలు చూద్దామని వచ్చాను. కొచ్చిన్‌లో విమానము దిగి, అక్కడ చూడవలసినవి చూసి, చుట్టుపక్కల గ్రామాలను చూద్దామని బస్‌లో వచ్చాను. ఇక్కడ బస్‌స్టాప్‌లో వీరు బస్‌లో భర్త కోసం వెతుకుతుంటే ఆసక్తిగా అనిపించి, విషయమేమిటో తెలుసుకుందామని అడుగుతున్నాను. మీకు అభ్యంతరమైతే వెళ్ళిపోతాను" అంది.

ఆయన చిన్నగా నిట్టూర్చి, "నా పేరు రాజన్. తను మా అక్క అమ్మణ్ణి. మా బావగారు మిలిట్రీలో పని చేసేవారు. ఒక సారి సెలవల్లో ఊరు వచ్చినప్పుడు పెద్దల నిర్ణయం ప్రకారం అక్కను పెళ్ళి చేసుకున్నారు. సెలవలు అయిపోయాక, అక్కడ క్వాటర్ అలాట్ అయ్యాక అక్కను తీసుకెళుతానని చెప్పి, డ్యూటీలో చేరేందుకు వెళ్ళారు. బావగారు వెళ్ళిన కొద్దిరోజులకే తూర్పు, పశ్చిమ పాకిస్తాన్‌ల యుద్ధములో, తూర్పు పాకిస్తానుకు సహాయము చేసేందుకు మన ప్రభుత్వం నిర్ణయించుకోవటముతో బావగారు యుద్ధానికి వెళ్ళాల్సి వచ్చింది. యుద్ధములో విజయము సాధించి, తూర్పు పాకిస్తాన్‌ను బంగ్లాదేశ్ గా ప్రకటించాక, చూసుకుంటే కొంతమంది మన వాళ్ళు పశ్చిమ పాకిస్తాన్ చేతిలో యుద్ధ ఖైదీలుగా చిక్కినట్లుగా తెలిసింది. ఇటువైపు మన వారికి యుద్ధ ఖైదీలుగా చిక్కినవారిని, వారు బంధించిన మన సైనికులను మార్పిడి పద్ధతిలో కొంతమందిని మార్చుకున్నారు. కొంత మందిని వాళ్ళు విడుదల చేయక అక్కడే కారాగారంలో బందీలుగా ఉంచారు. వాళ్ళల్లో మా బావగారు కూడా ఉన్నారు. ఎప్పటికైనా వాళ్ళు

విడుదల చేస్తారని మేము ఎదురు చూస్తున్నాము. అక్క రోజూ అలా బస్‌స్టాప్‌కు వెళ్ళి చూస్తూ ఉంటుంది. ఏళ్ళు గడిచిపోతున్నాయి కానీ బావగారు మాత్రం రాలేదు. కానీ అప్పుడప్పుడు జర్నలిస్ట్ లు అక్కను ఇంటర్వ్యూ చేస్తామని వస్తారు. దాని వలన మాకు ఒరిగేదేమీలేదని ఈ మధ్య ఒప్పుకోవటము లేదు. పైగా వాళ్ళ ప్రశ్నలతో అక్క బాగా డిస్ట్రబ్ అవుతోంది. అందుకే నువ్వు జర్నలిస్ట్ వా అని అడిగాను" అన్నాడు.

అక్షిత తన వెనుక తలుపుకు ఆనుకొని నిలుచున్న ఆమెను చూస్తుంటే ఈ మధ్య తను చదివిన 'The mystery of India's 'missing 54' soldiers' గుర్తొచ్చింది. సీనియర్ జర్నలిస్ట్ మిస్ డోరియా ఈ సైనికుల గురించి తెలుసుకోవాలని, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్లను, సైనికుల బంధువులను ఎంతమందినో ఇంటర్వ్యూ చేసి, పరిశోధించింది కానీ వారి గురించి ఏమీ తెలియలేదు. 1965 యుద్ధములో పట్టుబడినవారు బహుశా మరణించి ఉండవచ్చు. 1971 లో పట్టుబడిన వారిలో కొంతమందిని విడుదల చేసారు. ఇరుపక్షాల ప్రభుత్వాలు సంధి చేసుకొని మార్పిడి పద్ధతిలో విడుదల చేసారు. దగ్గర దగ్గర 600 మందిని విడుదల చేసినట్లుగా పేర్కొన్నారు. అయినా ఇంకా కొంత మంది ఉన్నారనే భావిస్తున్నారు. ఆ సైనికుల భార్యలు, బంధువులు కొంతమంది రెండు గ్రూప్‌లుగా వారివారి ఫోటోలు పట్టుకొని వెళ్ళి పాకిస్తాన్ జైల్‌లో వెతికారు. కానీ ఎవరూ కనిపించలేదు. అయినా తమ వారు అక్కడ జైల్‌లోనే ఉన్నారని తమ నమ్మకం అని గట్టిగా చెపుతున్నారు. మరైతే ఆ 54 మంది సైనికులు ఏమైనట్లు? అంతేనా ఇంకా లెక్క తెలియని వారున్నారా? అంటే సమాధానం లేదు. వారు జైల్లో ఉన్నారా? అసలు వారు బ్రతికి ఉన్నారా? లేదా? అన్నది తెలియలేదు.

ఆలోచనల నుంచి బయటకు వస్తూ "ఈ మధ్య కొంతమంది ఈ సైనికుల భార్యలు, బంధువులు పాకిస్తాన్ వెళ్ళి వారి పర్మిషన్‌తో జైల్లో

వెతికారుకదా! మరి మీరు వెళ్ళి చూడలేదా?” రాజన్‌ను అడిగింది.

“దాని వలన ఏమైనా లాభం జరిగిందా? వారికి వాళ్ళవారు కనిపించారా?” తిరిగి ప్రశ్నించాడు రాజన్.

నిజమే అలా వెళ్ళి వాళ్ళకు అక్కడ మనవాళ్ళెవరూ కనిపించలేదు. నిట్టూరుస్తూ “మీ కుటుంబమూ...” అంటూ అర్ధోక్తిలో ఆపేసింది.

“నా భార్య చనిపోయింది. మా అబ్బాయి, కోడలు పొలంకు వెళ్ళారు. వాళ్ళ పిల్లలిద్దరూ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. మా అక్కకు పిల్లలు లేరు” చెప్పాడు.

తన వెనుక తలుపును ఆనుకొని నిలబడి, తమ సంభాషణను వింటున్న అమ్మణ్ణి వైపు చూసింది. ఎప్పటికైనా తన భర్త శత్రువుల చెర నుంచి విడుదలై తనకోసం తిరిగి వస్తాడని ఎదురుచూస్తున్న ఆమెను చూడగానే గుండె పిండేసినట్లయ్యింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే లేచి వెళ్ళి ఆమెను హగ్ చేసుకుంది. రాజన్ దగ్గర సెలవు తీసుకొని బయటకు వస్తూ, డోరియా అన్నట్లుగా, ‘ఈమె భర్త బతికి ఉన్నాడా? ఈమె నిరీక్షణ ఫలిస్తుందా? ఏమో కాలమే జవాబు చెప్పాలి’ భారమైన మనసుతో వారి వద్ద సెలవు తీసుకుంది.

***

**(తరుణి అంతర్జాల వారపత్రికలో ప్రచురితం)**

# 36. మాయాజాలం

శ్రీరామ్ ఆఫీస్‌కు వెళ్ళాక, బాల్కనీలో కూర్చొని, పేపర్ చదువుతూ, ఒక్కో చుక్కా తాగుతూ  కాఫీని ఆస్వాదిస్తోంది కీర్తన. ఇంతలో సెల్ మోగింది. తీసి "హాయ్ రాధీ పనైపోయిందా? పొద్దున్నే ఫోన్ చేసావు" అంది.

"అమ్మా నేను మల్లమ్మను. రాధికమ్మ కోసం కాఫీ తీసుకొని వెళితే అమ్మ బాత్ రూములో పడిపోయి ఉన్నారు. పాపలు కాలేజ్‌కు వెళ్ళారు. ఇంట్లో ఎవరూ లేరు. అందుకని మీకు ఫోన్ చేసాను" అంది మల్లమ్మ గాభరగా.

"అయ్యో ఇప్పుడే వస్తున్నాను" అంటూనే కార్ కీస్ తీసుకొని, తలుపుకు తాళం వేస్తూ శ్రీరామ్‌కు ఫోన్ చేసి "రామ్, రాధి బాత్ రూమ్‌లో స్పృహతప్పి పడిపోయిందిట. మల్లమ్మ కాల్ చేసింది. నేను వెళుతున్నాను" అని చెప్పింది.

"అయ్యో ఏమైందో, విక్రమ్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళు.  ఏదైనా ఎమర్జెన్సీ అవుతే కాల్ చేయి. నేనూ వస్తాను" అన్నాడు.

రాధికను పరీక్ష చేసి డాక్టర్ విక్రమ్ చెప్పిన మాటలకు కీర్తన తెల్లబోయి చూసింది.

"మీరు చెప్తోంది నిజమేనా విక్రమ్! తను ఇద్దరు టీనేజ్ ఆడపిల్లల తల్లి. నాకు తెలిసినంత వరకూ ఆమె భర్త అర్జున్ చాలా మంచివాడు. పెద్ద కంపెనీలో మంచి పొజిషన్లో ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు లేవు. తన లైఫ్ లో ఎలాంటి ఒత్తిళ్ళు, ఆరళ్ళు లేవు. అలాంటప్పుడు దానికి ఇలా చేయవలసిన అవసరమేం ఉంటుంది??"

"చూడు కీర్తనా! నువ్వు మా శ్రీరామ్ భార్యవి, ఈమె ప్రాణ స్నేహితురాలివి కనుక నీకు పేషెంట్ పరిస్థితిని గురించిన వివరంగా చెప్పాను. ఆమె కుటుంబ పరిస్థితులు ఏంటో కానీ... ఆమె ఖచ్చితంగా డ్రగ్స్ కి అలవాటు పడుతోందని మాత్రం చెప్పగలను. ఈ విషయం ఆమె భర్తకు ఇన్ఫామ్ చేసారా!?" అడిగాడు డాక్టర్ విక్రమ్.

"ఫోన్ కలవట్లేదు, మెసేజ్ పెట్టాను" అంది.

"సరే! ఆమెకు మెలకువ వచ్చేప్పటికీ అటెండెంట్ ఎవరో ఒకరు ఆమెతో ఉండేలా చూసుకో. అసలే తీవ్రమైన డిప్రెషన్‌లో ఉందామె. నేను మధ్యాహ్నం మళ్లీ వస్తాను" చెప్పి వెళ్లిపోయాడు విక్రమ్.

ఆందోళనను అణుచుకోవడానికి ప్రయత్నిస్తూ రాధిక మంచం పక్కనున్న కుర్చీలో కూర్చుంది.

రాధిక, కీర్తన చదువుకునే రోజుల్నించీ మంచి స్నేహితురాళ్లు. కీర్తనకు డిగ్రీ అవుతుండగానే పెళ్ళయిపోవటంతో ఆమె పిల్లలు కీర్తన పిల్లల కంటే పెద్దవాళ్లు. ఆమె భర్త శ్రీరామ్ సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. కీర్తన కూడా ఒక ప్రైవేట్ కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తోంది.

కీర్తన పెద్ద కూతురికి పెళ్ళయింది. నాలుగు నెలల క్రితం కూతురి డెలివరీ కోసం, ఆఫీస్‌లో లాంగ్ లీవ్ తీసుకొని ఆస్ట్రేలియా వెళ్లి వారం క్రితమే వచ్చింది కీర్తన. ఇంకా డ్యూటీలో చేరలేదు. తరచూ స్నేహితురాళ్ళిద్దరూ ఫోన్‌లో సంభాషిస్తూ, ఒకరితో ఒకరు తమ వ్యక్తిగత విషయాలు పంచుకుంటూనే ఉంటారు. ఇద్దరి మధ్య రహస్యాలేం ఉండవు.

'తను ఆస్ట్రేలియాలో ఉన్న ఆ నాలుగు నెలల్లో రాధిక ఇంట్లో ఏమైనా

జరిగిందా!? అయినా తనక్కడున్నా కూడా, అప్పుడప్పుడు తనూ, రాధిక ఫోన్లో మాట్లాడుకుంటూనే ఉన్నారు కదా!? ఒకవేళ నేను కూతురినీ, పాపాయినీ చూసుకునే హడావుడిలో ఉంటానని నాతో ఫ్రీగా ఏదైనా పంచుకోలేక పోయిందా రాధీ!? అయినా ఓ పద్ధతైన సాధారణ ఇల్లాలు అసలిలా డ్రగ్స్ కు ఎలా అలవాటు పడింది!?" ఆలోచిస్తుంటే బుర్ర వేడెక్కింది కీర్తనకు. మనసు మనసులో లేదామెకు.

"డాడీ ఊ... ఊ"

ఆలోచనలో ఉన్న కీర్తన, రాధిక మూలుగుతో ఉలిక్కిపడింది.

"రాధీ... రాధీ..." చేత్తో చిన్నగా తట్టుతూ పిలిచింది కీర్తన.

మత్తుగా కళ్ళు తెరిచి, కాసేపు అయోమయంగా చూస్తూ "కీర్తూ నువ్విక్కడున్నావేమిటే? అసలు నేనెక్కడున్నాను? " అడిగింది.

"మధ్యాహ్నం నువ్వు బాత్రూం లో పడిపోయావని మీ మల్లమ్మ గాభరాగా ఫోన్ చేస్తే, మీ ఇంటికి వచ్చి, నిన్ను శ్రీరాం ఫ్రెండ్ హాస్పిటల్‌లో చేర్చాను" చెప్పింది కీర్తన.

"ఓ" అని ఏదో ఆలోచనలో పడిపోయింది రాధిక. కొద్దిసేపు ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

"అర్జున్ ఊళ్ళో లేరా? ఎప్పుడొస్తారు?" అడిగింది కీర్తన.

"ఢిల్లీలో కాన్ఫరెన్స్ ఉందని వెళ్ళారు. సాయంకాలం వచ్చేస్తారు. కీర్తూ నాకిప్పుడు బాగానే ఉంది. ఇంటికి పోదాము డాక్టర్‌గారిని అడుగుదామా?" అంటూ చిన్నగా లేచి, వెనుకకి ఆనుకొని కూర్చుంది రాధిక.

“వెళ్ళవచ్చు కానీ నీ ఈ పరిస్థితికి కారణం ఏమిటో చెపితేగానీ వెళ్ళనీయరు. అంతేకాదు పోలీస్‌కేస్ కూడా అవుతుందేమో” నిశితంగా రాధికను చూస్తూ అంది కీర్తన.

“పోలీస్ కేసా?” బిత్తరపోయింది రాధిక.

“అవును. నువ్వు డ్రగ్స్ తీసుకున్నావని అన్నారు డాక్టర్ విక్రమ్. అది పెద్ద కేసే కదా? అసలు నీకు ఈ డ్రగ్స్ ఎట్లా అలవాటయ్యాయి? ఎక్కడ దొరికాయి? తెలిసి తీసుకున్నావా? తెలియక తీసుకున్నావా? ఇవన్నీ తెలవాలి వాళ్ళకు. పోలీస్‌కు ఇన్ఫాం చేస్తామన్నారు కానీ నువ్వు లేచాక తెలుసుకొని చెబుదామని ఆగారు. నువ్వు రెస్ట్ తీసుకో. కాస్త తేరుకున్నాక చెబుదువుగానీ” బత్తాయిరసం ఇస్తూ జవాబిచ్చింది కీర్తన.

కళ్ళు కిందికి దించుకొని మౌనంగా రసం తాగుతున్న రాధిక వైపు చూస్తూ, “రాధీ మీ మమ్మీ డాడీలను మర్చిపోలేకపోతున్నావా? నువ్వు ఆ తరువాత ఎప్పుడూ మాట్లాడకపోతే సర్దుకు పోతున్నావనుకున్నాను” రాధిక చేయి పట్టుకొని, మెత్తగా అంది కీర్తన.

ఒక్కసారిగా రాధిక కళ్ళ నుంచి నీళ్ళు జలజలా రాలిపోయాయి. “ఎట్లా మర్చిపోతాను కీర్తూ? నీకు తెలుసు కదా నేను ఒక్కదానినే కూతురునని, మమ్మీడాడీతో నాకు అటాచ్మెంట్ ఎక్కువని. ‘మిమ్మల్ని చూడాలని ఉంది, వెంటనే రండి’ అని నేను హఠం చేస్తే వస్తున్నవాళ్ళ కార్‌కు ట్రక్ ఆక్సిడెంట్ జరిగి ఇద్దరూ అప్పటికప్పుడే మరణించటమూ, వాళ్ళ కోసమని లంచ్ తయారు చేసి ఎదురు చూస్తున్నదాన్ని, వాళ్ళను ఆ విధంగా చూడటం ఎంత షాక్! నేను రమ్మని గొడవ చేయకపోతే వాళ్ళు అప్పుడు వచ్చేవారు కాదుకదా!” భోరున ఏడవసాగింది రాధిక.

గబుక్కున రాధిక తలను తన పొట్టకానించుకొని, నిమురుతూ

"ఆక్సిడెంట్ జరిగిన రెండు నెలలకే నేను ఆస్ట్రేలియా వెళ్ళాల్సి వచ్చింది. నువ్వు కూడా ఆంటీ అంకుల్ గురించి మాట్లాడటమూ, ఏడవటమూ తగ్గించావు. కొద్దికొద్దిగా అలవాటుపడుతున్నావనుకున్నాను కానీ ఇంత బాధపడుతున్నావనుకోలేదు. నేనూ మా అమ్మాయి, పాప సంరక్షణలో పడి నిన్ను అంతగా పట్టించుకోలేదేమో! సారీ రాధీ, వెరీ వెరీ సారీ. అయినా రాధీ నీ బాధ నా దగ్గర దాచాలా? ఇదేనా మన స్నేహానికి అర్థం? పంచుకొని తగ్గించుకునే బదులు డ్రగ్స్ కు అలవాటు పడ్డావా? అసలు అవి నీకు ఎట్లా అలవాటయ్యాయి?" బాధగా, అనునయంగా అంది కీర్తన.

రాధిక చిన్నగా "ఎట్లా చెప్పమంటావు? మనవరాలు పుట్టిన సంతోషములో, హడావిడిలో ఉన్న నీకు రోజూ చెప్పి ఏడవటము నాకు ఇష్టం లేకపోయింది. అప్పటికీ నాతో క్లోజ్‌గా ఉండే మా కిట్టీ ఫ్రెండ్స్ రూపా, శైలజా వచ్చి నన్ను బలవంతాన సినిమాలకు, కిట్టీ పార్టీకి తీసుకెళ్ళేవారు. వాళ్ళకు చెపుదామన్నా ఎన్ని రోజులు ఇట్లా ఏడుస్తావు? ఎవరి సమస్యలు వాళ్ళకు ఉన్నాయి అని విసుక్కుంటారేమోనని, చులకనవుతానని ఎవరికీ చెప్పేదానిని కాదు.

కీర్తూ...రోజూ పొద్దున్నే పిల్లలిద్దరూ కాలేజ్‌కు వెళ్ళగానే కాఫీ తాగుతూ డాడీకి ఫోన్ చేసేదానిని. నేనూ డాడీ ఎన్ని కబుర్లు చెప్పుకునేవారమో! నాకు ఏదైనా సమస్య రాగానే డాడీతోనే చర్చించేదానిని. అమ్మ, 'నువ్వు డాడీ కూతురువే' అని ఉడుక్కునేది. 'అమ్మలూ, నీకోసం టమాటా పచ్చడి చేసానురా. నువ్వు వస్తావా, నేను రానా?' అని మమ్మీ అడిగితే, 'టమాటాపచ్చడి కోసం జూబిలీహిల్స్ నుంచి సికింద్రాబాద్ వెళతావా?' అని అర్జున్ ఏడిపించేవాడు. ఒకటా రెండా ఎన్నని చెప్పను? ఆ జ్ఞాపకాలను, వారి ప్రేమను, ఆ ముద్దూమురిపాలను ఎట్లా మర్చిపోను?" చేతులతో మొహం కప్పుకొని ఏడవసాగింది రాధిక. రాధిక పక్కన

కూర్చుని వీపు మీద సున్నితంగా రాయసాగింది కీర్తన.

కీర్తన ఇచ్చిన మంచినీళ్ళు తాగి, కాస్త తమాయించుకొని, "మా కిట్టీ లో శకుంతల అని కొత్తావిడ చేరిందని చెప్పాను గుర్తుందా కీర్తూ?"

గుర్తుందన్నట్లు తలాడించింది కీర్తన. అర్జున్ పని చేసే కంపెనీ లోని కొంతమంది ఆఫీసర్ల భార్యలు కలిసి ప్రతినెలా కిట్టీపార్టీ చేసుకుంటారు. ఆ నెలలో పుట్టినరోజు, పెళ్ళిరోజు ఉన్నవాళ్ళ తో కేక్ కట్ చేయిస్తారు. కాసేపు ఆటపాటలతో గడిపి, ఏదైనా అనాథాశ్రమంలో అన్నదానం చేస్తారు. ఆ రోజు కిట్టీలో వచ్చిన డబ్బుతో అవసరమున్నవారికి సహాయము చేస్తారు. తనకు అంతగా ఆసక్తి లేనందున ఆ గ్రూప్‌లో కీర్తన చేరలేదు. కానీ వాళ్ళ విశేషాలన్నీ రాధిక చెపుతూ ఉంటుంది. అందంతా గుర్తు తెచ్చుకొని, "అవును చెప్పావు, ఆవిడ చాలా ఆక్టివ్ అనీ, మీ కార్యక్రమాలు అన్నింటిలోనూ చాలా చురుకుగా పాల్గొంటుందని కూడా చెప్పావు. అయితే?" అడిగింది.

"నువ్వు ఆస్ట్రేలియా వెళ్ళాక, నాకు ఇంకా చాలా ఒంటరితనమనిపించేది. కిట్టీపార్టీకి కూడా వెళ్ళాలనిపించేది కాదు. ఆ నెల రూప వచ్చి 'ఎంత సేపని ఇట్లా కూర్చుంటావు?' అని పార్టీకి తీసుకెళ్ళింది. ఆ పార్టీలో శకుంతల 'మీరేమిటి ఇంతలా చిక్కిపోయారు? చాలా డల్‌గా అయ్యారు. జరిగింది చాలా విషాదమే కానీ మీరు దానిలో నుంచి బయటకు రావాలి. ఒంటరిగా ఉండకండి. నలుగురితో కలవండి' అని పార్టీ తరువాత వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళింది. 'మీరు చాలా నీరసంగా ఉన్నారు. ఈ ఎనర్జీ డ్రింక్ తీసుకోండి' అని ఒక జ్యూస్ ఇచ్చింది. అది తాగాక ఆ రోజు రాత్రి చాలా రోజుల తరువాత హాయిగా నిద్ర పోయాను. మనసు తేలికైన భావన కలిగింది. అది మళ్ళీ కావాలనిపించి మరునాడు శకుంతలకు ఫోన్ చేసాను. తను తెచ్చి ఇచ్చింది. బయట

కొనుక్కుంటానంటే అది బయట దొరకదని, చాలా కాస్ట్లీ అని, కావాలంటే తనే తెచ్చిస్తానని తెచ్చి ఇచ్చేది. కొద్దిరోజుల తరువాత అది డ్రగ్స్ ఏమోనని నాకు అనుమానం వచ్చి, ఆ రోజు తాగలేదు.

కానీ శరీరం, మనసు నామాట వినలేదు. చాలా తిక్కతిక్కగా అనిపించి శకుంతలకు ఫోన్ చేసి కావాలని అడిగాను. ప్రతిసారీ తను చాలా డబ్బులు వసూలుచేసేది. నా ఎకౌంట్‌లో ఉన్నవన్నీ కరిగిపోసాగాయి. అర్జున్ గమనించి అడిగితే ఏమి చెప్పాలా అని, అట్లాని మానుకోలేక సతమతమయ్యే దానిని. 'నీ దగ్గర మనీ లేకపోతే మా కంపెనీకి మోడల్‌గా చేయి' అని అడిగింది శకుంతల. దానికి తర్జనభర్జనలు చాలాపడి, ఆ జ్యూస్ తాగకుండా ఉండలేక ఈ రోజు తను రమ్మన్న సమయానికి, పిల్లలిద్దరు కాలేజీకి వెళ్ళగానే వాళ్ళ ఇంటికి వెళ్ళాను. అక్కడ నాకు మేకప్ చేస్తాడని, కెమెరామాన్ అనీ ఇద్దరిని పరిచయం చేసింది. వాళ్ళను చూడగానే నాకు చాలా భయం వేసింది. 'ఇక్కడ డ్రాయింగ్‌రూమ్‌లో వద్దు, బెడ్‌రూమ్‌లోకి వెళుదాము' అని శకుంతల అనగానే ఎందుకో నా మనసు జలదరించింది. 'మళ్ళీ వస్తాను' అని వెనక నుంచి శకుంతల పిలుస్తున్నా వినకుండా ఇంటికి వచ్చేసాను.

అదసలు మామూలు మోడలింగ్ కాదేమో, పైగా బెడ్‌రూములో అంటోంది. అదేమి షూటింగో ఏమో, ఎంత ప్రమాదం నుంచి బయటపడ్డాను అని ఇంటికి వచ్చాక కూడా ఆలోచిస్తుంటే కాళ్ళు గజగజా వణికిపోయాయి. నా తలలో హోరు మొదలయింది. ఒళ్ళంతా వణికిపోతోంది. తిక్కతిక్కగా ఉంది. వెంటనే ఆ ఎనర్జీ డ్రింక్ కావాలి లేకపోతే తట్టుకోలేను అని హైరానా పడిపోతున్నాను. ఎన్నాళ్ళు ఇలాగా? ఆ షూటింగ్ జరిగి ఉంటే? ఆ పాడు డ్రింక్ కోసం ఎంత దిగజారిపోయేదానిని తలుచుకుంటుంటేనే నామీద నాకే అసహ్యం

వేస్తోంది.

ఇట్లా బతకటం దండగ అనుకొని, ఆఫీస్ పని ఒత్తిడి తట్టుకోలేక ఎప్పుడైనా వేసుకోవటానికి అర్జున్ నిద్రమాత్రలు తెచ్చుకుంటే, అందులోనుంచి ఒకటొకటిగా తీసుకొని వేసుకుంటుంటే, 'అమ్మా!' అని పిల్లలు పిలిచినట్లుగా అనిపించింది. చేతిలోకి తీసుకున్న టాబ్లెట్ ను అలా చూస్తూ, 'ఇంత పెద్దదానిని నేనే మా అమ్మానాన్నల మరణం తట్టుకోలేక డిప్రెషన్‌లోకి పోయి డ్రగ్ ఎడిక్ట్ గా మారుతున్నాను. ఇక నేను లేకుండా నా కూతుళ్ళు ఎట్లా ఉండగలరు? ఇప్పుడిప్పుడే లోకాన్ని చూస్తున్నారు. కష్టమైన టీనేజ్‌లోకి వచ్చారు. వాళ్ళు ఏ ప్రలోభాలకూ లొంగకుండా జీవితంలో నిలదొక్కుకునే వరకూ కనిపెట్టి ఉండాల్సిన బాధ్యత నాదే కదా! నా తల్లితండ్రులు నన్ను ఎంత గారాబంగా చూసుకున్నారో నేనూ వాళ్ళను చూసుకోవాలి కదా? ఎంత పొరపాటు చేయబోయాను! భగవంతుని దయవలన అంతగా ఎడిక్ట్ కాలేదు. ప్రయత్నం చేస్తే పోతుంది. ఏదైనా రిహాబిలేషన్ సెంటర్‌లో చేరి నా అలవాటును పోగొట్టుకోవాలి. నేను చావకూడదు' అనుకొని అప్పటికే నాలుగు మాత్రలు లోపలికి పోవటముతో మత్తుగా మూసుకుపోతున్న కళ్ళను బలవంతంగా తెరుచుకుంటూ, టాబ్లెట్స్ వాంతి చేసుకుందామని బాత్రూంలోకి వెళ్ళాను. అంతే ఇప్పుడు ఇక్కడ నిన్ను చూస్తున్నాను" ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ చెప్పింది రాధిక.

"బాధ పడకు రాధీ. నీ తప్పు నువ్వు తెలుసుకున్నావు. ఇప్పుడు మునిగిపోయిందేమీ లేదు. మంచి ట్రీట్మెంట్ తీసుకుందువుగాని. ఈ విషయాలన్నీ అర్జున్‌కు, శ్రీరాంకు, డాక్టర్ విక్రమ్ చెబుదాము" అని కీర్తన అంటుండగానే డాక్టర్ విక్రమ్, శ్రీరాం, అప్పుడే ఢిల్లీ నుంచి వచ్చి, విషయము తెలుసుకొని అక్కడికి వచ్చిన అర్జున్ లోపలికి వచ్చారు.

అర్జున్, రాధిక పక్కన కూర్చొని చేయి పట్టుకొని ఆప్యాయంగా, “నన్ను క్షమించు రాధీ. ఆంటీ అంకుల్ మరణం నిన్ను బాధిస్తుందని తెలిసినా నువ్వు మాములుగా తిరుగుతుంటే కోలుకుంటున్నావనుకొని, నిన్ను అంతగా పట్టించుకోలేదు. ఇక నుంచి నిన్ను వదలను.  ఈ డాక్టర్ చెప్పినట్లుగా మందులు వేసుకొని, వ్యాయామాలు చేస్తుంటే త్వరగా కోలుకంటావు. పిల్లల సెలవల్లో అందరమూ కలిసి హాయిగా ఏదైనా టూర్ వెళుదాము. ఇక ఆ శకుంతల సంగతి మా ఫ్రెండ్ డి.ఐ.జీ కి చెపుతాను. ఆయన చూసుకుంటాడు” అన్నాడు.

పిల్లలతో ప్రేమయాత్ర, ఎంజాయ్ సెకెండ్ హనీమూన్ అని అందరూ థమ్సప్ సైన్ చూపిస్తే సిగ్గుతో అర్జున్ వెనక మొహం దాచుకుంది రాధిక.

***

***(వార్త- ఆదివారం అనుబంధం - 2 జూలై 2023)***

# 37. శ్రావణసమీరం

**(ఫేస్‌బుక్ 'మన కథలు - మన భావాలు' సాహితీ సమూహములో ఇచ్చిన చిత్రానికి రాసినదీ ఈ కథ.)**

***

కాఫీ గ్లాస్ తీసుకొని బాల్కనీలోకి వచ్చింది సమీర. కుర్చీలో కూర్చొని కాఫీ ఒక్కో చుక్కా ఆస్వాదిస్తూ, చుట్టూ చూసింది. వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. చీకట్లు పూర్తిగా తొలిగిపోలేదు. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు చిన్నచిన్న గుంపులుగా అటూ ఇటూ అచార్లూ పచార్లూ చేస్తూ కబుర్లాడుకుంటున్నాయి. మధ్య మధ్య జోకులేసుకుంటున్నట్లు కాసిని చినుకులను రాలుస్తున్నాయి. వీధి లైట్ వెలుతురులో, కరెంట్ తీగల మీద నిలిచిన వాన చినుకులు ఒక్కొక్కటి రప్ రప్ మని పడుతూ తన పాదాలకు ఉన్న పట్టీలోని మువ్వల సవ్వడిలా ఉన్నాయి. మువ్వలను సవరిస్తుంటే కాలివేళ్ళకు కొత్తగా చేరిన మెట్టెలు తళతళా మెరిసాయి.

వాటిని చూసుకుంటూ, అసలు ఈ నెల రోజులు ఎంత త్వరగా గడిచిపోయాయి! అనుకోకుండా డాడీ కొలీగ్ శ్రావణ్ సంబంధం గురించి చెప్పారుట. వాళ్ళను ఇంటికి టీ కి ఆహ్వానించారు. శ్రావణ్, అతని నాన్నగారు సదాశివంగారు, అమ్మ వారాహీ వచ్చారు. తనకు వాళ్ళను చూడగానే, అతని తల్లితండ్రులు కాస్త పెద్దవయసులో కనిపిస్తున్నారే అన్న అనుమానం వచ్చింది. ఆ ప్రశ్న తామెవరూ అడగక ముందే "మాకు పెళ్ళైన చాలా సంవత్సరాలకు ఇక మాకు పిల్లలు పుట్టరు అనుకున్న సమయాని ఇదో వీడు పుట్టాడు" అని చెప్పారు సదాశివంగారు. ఒకరికొకరు నచ్చటమూ, పదిరోజులలోపే మూహూర్తం కుదిరి పెళ్ళికావటమూ జరిగిపోయింది.

మొదటిరోజు అత్తవారింట్లో ఓ గమ్మత్తైన అనుభవం కలిగింది. బామ్మ అత్తవారింట్లో పొద్దున్నే లేవాలి ఇక్కడిలాగా ఆఫీస్‌కు వెళ్ళే ముందు లేచి అమ్మను హడావిడి పెట్టి అరిచినట్లు కాదు. నువ్వే అందరికీ కాఫీ, టిఫిన్‌లు ఇవ్వాలి, ఆఫీస్‌కు వెళ్ళే వరకూ అత్తగారికి సహాయం చేయాలి. అత్తగారు చెప్పిన మాట వినాలి అంటూ బోలెడు రూల్స్ చెప్పింది. అంటే సినిమా ఇల్లాలిలా కొంగుకూడా నెత్తిన కప్పుకొని ఉండాలా అంటే ఓ మొట్టికాయేసింది. అమ్మేమో ఈ పిల్ల ఎట్లా ఉంటుదోనని తెగ బెంగ పడిపోయింది. తను మీరేమీ భయపడకండి, మీది మంచి పెంపకం అని నిరూపిస్తానని వాళ్ళకు అభయ హస్తం చూపించింది. ఇక్కడ చూస్తే పరిస్థితే వేరుగా ఉంది. మొదటిరోజు తను లేచేసరికి ఏడయ్యింది. పొద్దున్నే లేవాలని అయిదింటికే అలారం పెట్టుకుంది మోగలేదా అని చూస్తే అది ఆఫ్ చేసి ఉంది! తను ఆదరాబాదరా ఫ్రెషప్ అయ్యి వంటింట్లోకి పరిగెత్తింది. అక్కడ మామగారు స్టవ్ దగ్గర కాఫీ కలుపుతున్నారు. శ్రావణ్ కూరలు కట్ చేస్తున్నాడు.

ఎక్కడా అత్తగారు కనిపించలేదు. తనను చూడగానే "సమీరా, నువ్వు కాఫీ తాగుతావా?" మామగారు అడిగారు.

"సారీ అంకుల్, లేవటం ఆలస్యం అయ్యింది. నేను కలుపుకుంటాను" మొహమాటంగా అంది తను.

ఇంతలో టీ.వీ సౌండ్, దానితో పాటు "సదా" అత్తగారి పిలుపు వినిపించింది.

"జీ హుజూర్" అంటూ తనకు కాఫీ కప్ ఇచ్చి, ఇంకో కప్ తీసుకొని వెళ్ళారు మామగారు. ఆయన వెనుకే వెళ్ళింది తను. అత్తగారు టీ.వీ. రిమోట్ తిప్పుతూ, ఎదురు టేబుల్ మీద కాలు జాపుకొని కూర్చొని ఉన్నారు. ఆవిడ కాలి బొటనవేలుకు బాండేజ్ ఉంది. తను గాభరా

"అయ్యో ఆంటీ, ఏమయ్యింది?" అడిగింది.

మామగారు లోపలికి వెళ్ళాక లొల్లా అన్నట్లు నాలుకాడించి "ఏమి కాలేదు. నేనే కట్టేసుకున్నాను. అప్పుడప్పుడూ ఇట్లా సదాకు ఝలక్ ఇస్తాను" అంది నవ్వుతూ. పైగా "సాయంకాలం మీరు హనీమూన్‌కు వెళ్ళాలిగా, సర్దుకున్నావా? సర్దుకో పో. వంటిల్లు వాళ్ళిద్దరు చూసుకుంటారులే" అనేసింది!

'వావ్ ఇదేదో బాగానే ఉందే! బామ్మ అత్తగారి మాట వినమంది కదా! అదే చేస్తే పోలా' అనుకుంది తను.

హనీమూన్ హాయిహాయిరే భళా అని గడిపేసి, తిరిగి రాగానే అత్తగారు, మామగారు రిసీవ్ చేసుకోవటానికి వచ్చారు. కార్ తమ ఇంటి సందు కాకుండా పక్క సందులోకి తిరుగుతుంటే అదేమిటీ సొంత ఇల్లన్నారే. కొంపదీసి అద్దె కొంప కాదుకదా! అనుకుంటుండగానే ఈ ఇంటి గేట్ ముందు ఆపారు. దిగి చూస్తే గేట్ పక్కన 'శ్రావణసమీరం' అని నేమ్ ప్లేట్ కనిపించింది.

పజిల్‌గా చూస్తూ లోపలికి రాగానే ఇంటి తాళం చెవులు ఇస్తూ "ఇదో సమీరా ఇది నీ సామ్రాజ్యం. వీడు నీ మొగుడు. నీ మొగుడిని కొట్టుకుంటావో, ముద్దు పెట్టుకుంటావో నీ ఇష్టం. నీకప్పగించేసాను. హమ్మయ్య" అంది.

"అదేమిటి ఆంటీ మనందరం కలిసి ఉండవచ్చు కదా మాకు వేరే ఇల్లెందుకు?" అంది తడబడుతూ.

"మీరెందుకు మాతో పానకం లో పుడకల్లా? మీకు మీరే, మాకు మేమే" అనేసింది.

అత్తాకోడళ్ళను వినోదంగా చూస్తున్నారు శ్రావణ్, సదాశివంగారు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక "నేనేమీ వేరు కాపురం పెడదామనను శ్రావణ్" బిక్కమొహంతో అంది తను.

"నువ్వనలేదు, మనకు ప్రైవసీ ఉండాలని మమ్మీడాడీనే ఈ ఏర్పాటు చేసారు" స్థిమితంగా అన్నాడు శ్రావణ్.

"అది కాదు శ్రావణ్" అని ఆగీ, "అవునూ ఎవరైనా శ్రవణ్ అని పెడతారు కానీ శ్రావణ్ ఏమిటి? ఎప్పుడూ అడుగుదామనుకుంటాను" అని అడిగింది కుతూహలంగా.

"మా అమ్మకు శ్రావణమాసం అన్నా, శ్రావణమాసంలో పడే చిరుజల్లులన్నా, అందులో తడవటమన్నా ఇష్టం. అందుకే పిల్లలు పుడితే నీ పేరు పెడతాను అని శ్రావణమాసానికి మొక్కుకుందిట మా మమ్మీ. అందుకే నాకు శ్రావణ్ అని పెట్టింది" అన్నాడు శ్రావణమంత చల్లగా!

"ఎవరైనా ఏ దేవుడికో మొక్కుకుంటారు కానీ మాసానికి మొక్కుకోవటమేమిటి?" విస్తుబోయింది.

"అదే మరి మా రూటే సెపరేటు" కాలరెగరేసాడు.

ఇల్లు చాలా నచ్చేసింది. ఇంటి చుట్టూ బోలెడు ఆడ, మగ మొక్కలు. మగ మొక్కలు రకరకాల ఆకులతో పచ్చగా, ఆడమొక్కలన్నీ రంగురంగులపూలతో కళకళలాడుతున్నాయి. అంతా బాగానే ఉంది కానీ పొద్దున లేచేసరికి బయట వైపు ఉన్న పూలన్నీ ఎవరో కోసుకుపోతున్నారు. తను వాళ్ళను తిట్టుకుంటుంటే, "ఎందుకు తిట్టుకుంటావు? దేవుడి కోసమేగా కోసుకుపోతున్నారు"అని మందలించాడు శ్రావణ్. ఈ పూల దొంగలు వాళ్ళ సొమ్మన్నట్లు పొద్దున్నే ఓ సంచీ, ఓ కర్ర పట్టుకొని దర్జాగా వచ్చేస్తారు. తన పుట్టింటిదగ్గరా ఇంతే! కోసుకున్నవాళ్ళు

హడావుడిగా కొమ్మలు వంచుతారేమో, ఓసారి కొమ్మ నిండుగా పూలు ఉన్న నందివర్ధనం కొమ్మ విరిగిపోయింది. ఆ రోజంతా మమ్మీ చాలా మూడ్ ఆఫ్ అయిపోయింది. ఈ పూల దొంగలను ఏమి చేయాలో అని నిట్టూరుస్తూ తలెత్తింది. ఇంకా చీకట్లు పోలేదు. కరెంట్ తీగ మీద నీటిబిందువులు ముత్యాలల్లా ఉన్నాయి.

"చినుకు చినుకు అందెలతో, చిటపట చిరు సవ్వడితో

నీలి మబ్బు కురుల ముడిని జార విడిచి, ఒళ్ళు మరిచి

వాన జాణ ఆడింది వయ్యారంగా!"

అని కూనిరాగం తీస్తూంటే గోడ మీద నుంచి ఎవరో గన్నేరు పూల కొమ్మను వంచారు. ప్రాణం విలవిల్లాడింది. గట్టిగా అరుద్దామనుకుంది కానీ శ్రావణ్ మాటలు గుర్తొచ్చి "ఎవరదీ చిన్నగా కోసుకోండి. కొమ్మ విరిగిపోతుంది. ప్లీజ్" అంటూ గబగబా కిందికి దిగింది. పూలు కోస్తున్నాయన ముందుకు వచ్చాడు. పక్క నుంచి ఒకావిడ వచ్చింది. అప్పుడే వాన మొదలయింది. ఆయన చేతిలోని గొడుగు విప్పి ఆవిడకు పట్టాడు. భుజాలకున్న బాగ్‌లల్లో పూలు వేసుకున్నట్లున్నారు. వాళ్ళను చూసి "మీరా పూలదొంగలు?" నోరు తెరిచింది! ఆవిడ చిలిపిగా నవ్వుతూ సమీరకు కన్నుకొట్టింది. గొడుగు కింద ఒకరికొకరుగా సాగిపోతున్న ఆ జంటను చూసి ఆశ్చర్యపోతూ బెడ్‌రూమ్‌లోకి పరిగెత్తి, నిద్రపోతున్న శ్రావణ్ ను లేపి, "పూలదొంగ లెవరో తెలుసా? ఆంటీ, అంకుల్. పూలు అట్లా కోసుకోవటమెందుకు? నన్ను పిలిస్తే లేచి గేట్ తీస్తాను కదా!" అంది వగరుస్తూ!

"నువ్వు గేట్ తీయటమెందుకు? కావాలంటే మమ్మీ గేట్ దూకి వచ్చేస్తుంది. ఎందుకైనా మంచిది నీకు గేట్ దూకటం వచ్చా?" అడిగాడు

శ్రావణ్ ముసుగు కాస్త తప్పించి.

అదిరిపడింది! "ఏమిటీ ఆంటీ గేట్ దూకుతారా? నేను కూడా దూకాలా? ఎందుకు?" అయోమయంగా అడిగింది.

"రాత్రుళ్ళు డ్యూటీ అనీ, లేడీస్ గెట్ టుగెదర్‌లనీ ఆలస్యంగా వస్తే గేట్ ఎవరు తీయాలి? నిద్ర మధ్యలో లేవటం మా ఇంటావంటా లేదు. ఎవరము ఆలస్యంగా వచ్చినా ఎవరినీ లేపము. అందరి దగ్గరా కీస్ ఉంటాయి. చుప్‌చాప్‌గా గేట్ దూకి వచ్చి తాళం తీసుకొని లోపలికి వచ్చేయటమే. నువ్వూ గేట్ దూకటం నేర్చుకో. కాకపోతే దూకేటప్పుడు చుట్టుపక్కల పోలీస్ పెట్రోలింగ్ లేకుండా చూసుకో. మళ్ళీ వాళ్ళు పట్టుకెళ్ళి, నాకు ఫోన్‌చేస్తే నేను నా నిద్ర వదులుకొని రాలేను. మా డాడీ నాకిదే చెప్పారు. నేను నీకిదే చెపుతున్నాను" శ్రావణ్ నింపాదిగా అంటూ మళ్ళీ ముసుగేసాడు.

శ్రావణ్ మాటలు వింటుంటే బుర్ర మొద్దుబారింది సమీరకు. 'నేను గోడలు, గేట్‌లు దూకటం నేర్చుకోవాలా? అదీ పోలీస్ పెట్రోలింగ్‌ను చూసుకొని మరీ దూకాలా? వీళ్ళంతా లేట్‌గా వస్తే గేట్ దూకి వస్తారా? బుద్ధిగా బామ్మాతాతయ్య, అమ్మానాన్నల చాటున ఉన్న నన్ను ఏ అల్లరి, కోతి బాచ్ లో పడేసావురా దేవుడా!' తలపట్టుకుంది సమీర.

***

# 38. ఇష్టసఖి

కాలేజీ ఆవరణంతా కోలాహలంగా ఉంది. ఆరోజే ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు కొంత మంది బెరుకు బెరుకుగా, కొంత మంది ఉషారుగా కాలేజీకి వస్తున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటున్నారు. కాలేజీ వాతావరణాన్ని కుతూహలంగా పరిశీలిస్తున్న అలోక్ "హాయ్" అన్న పలకరింపుతో తిరిగి చూసాడు. లేత నీలిరంగు కుర్తా, జీన్స్ పాంట్‌లో, మొహాన పడుతున్న జుట్టును వెనకకు సుతారంగా నెడుతూ, నవ్వు మొహంతో ఉన్న అమ్మాయిని చూసి, వినీవినిపించకుండా "హాయ్" అన్నాడు.

"నా పేరు వెన్నెల" అన్నది చేయి చాపుతూ.

"నేను అలోక్" అన్నాడు తడబడుతూ చిన్నగా వెన్నెల చేతిని తాకుతూ.

ఆష్ కలర్ టీషర్ట్, జీన్స్ పాంట్, సన్నని మీసకట్టుతో స్మార్ట్ గా ఉన్న ఈ అబ్బాయికి ఇంత బెరుకేమిటో అనుకుంటూ, అలోక్ ను ఎగాదిగా చూస్తూ, "మనదే కాలేజ్ బాస్?" అడిగింది.

"పబ్లిక్ స్కూల్" జవాబిచ్చాడు.

"స్కూల్ పోరగాడివా? పర్లేదులే కాలేజ్ పోరగాడిని చేస్తాం కదే శ్రావ్యా?" నవ్వుతూ పక్కనున్న శ్రావ్యతో అంది.

బాబోయ్ సూపర్ ఫాస్ట్! మనసులోనే భయపడ్డాడు కానీ ఆ సూపర్ ఫాస్ట్ అమ్మాయే అంతకన్నా సూపర్ ఫాస్ట్ గా స్నేహం కలిపేసింది. నెమ్మదస్తుడు, మొహమాటస్తుడు, అందగాడూ అయిన అలోక్ అంటే ఇష్టం ఏర్పడింది వెన్నెలకు. ఆ ఇష్టం ఇంజనీరింగ్ పూర్తయ్యేసరికి

ప్రేమలోకి దింపేసింది. ధనవంతుల ఏకైక గారాలపట్టని మొదట్లో దూరందూరంగా ఉన్నా, వెన్నెల చూపించే ప్రేమ, చనువుతో, వెన్నెలతో పూర్తిగా ప్రేమలో మునిగిపోయాడు అలోక్.

వెన్నెల తండ్రి కృష్ణారావు పెద్ద వ్యాపారస్తుడు. తల్లి వల్లి వివిధ వ్యాపకాలతో బిజీబిజీగా ఉంటుంది. అలోక్ తండ్రి శివరావు పెద్ద పొజిషన్‌లో ఉన్న ఉద్యోగస్తుడు. తల్లి వాణి గృహిణి. శివరావు తల్లి చనిపోతే తండ్రి గోపాలరావు ఒక్కడినే పల్లెలో ఉంచటం ఇష్టం లేక తన దగ్గరికి తీసుకొచ్చేసాడు. పైగా చెల్లెలు శ్రీదేవి, బావగారు రామారావు, మేనకోడలు అవని, పక్క ఇంట్లోనే ఉంటారు. ఒకవిధంగా చెప్పాలంటే సాంప్రదాయ, ఉమ్మడి కుటుంబమే! ఇలాంటి కుటుంబ నేపథ్యాలున్న తమ ఇద్దరికి ఎట్లా కలుస్తుందని అలోక్ వెనకడుగు వేస్తుంటే, వెన్నెలలోని ఆకర్షణ ముందుకు నెట్టింది. వెన్నెల కూడా వచ్చి తండ్రితో మాట్లాడమని ప్రొత్సహించింది. అసలు ముందు అవనిని తన భార్యగా చూస్తున్న తన వాళ్ళను ఎట్లా ఒప్పించాలో తెలియలేదు. ప్రేమించేటప్పుడు గుర్తురానివన్నీ ఇప్పుడు గుర్తొచ్చి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి అలోక్‌ను!

ప్రేమను జయించలేక చిన్నగా తాతయ్యకు చెప్పాడు తన ప్రేమ కథను. గోపాలరావుకు ఒక్క క్షణం తను ఏమి వింటున్నాడో అర్థం కాలేదు. అలోక్ ప్రేమను ఎట్లా ఆమోదించాలి? చిన్నతనము నుంచి అలోక్‌ను భర్తగా భావిస్తున్న అవని ఏమవుతుంది? అన్నీ ప్రశ్నలే! ఆలోచించి, తర్జన భర్జనలు పడి "ముందు వాళ్ళవాళ్ళ అభిప్రాయం తెలుసుకొనిరా. వాళ్ళు సరే అంటే మీ నాన్నతో మాట్లాడుతాను" అన్నాడు మనసును గట్టి పరుచుకుంటూ మనవడితో.

వెన్నెల చెప్పిన ప్రకారం ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాడు అలోక్. కానీ అక్కడ పెద్ద తాళం దర్శనమిచ్చింది. తనని రమ్మని తాళం వేసుకొని

ఎటెళ్ళారు? ఏమి జరిగిందో అర్థం కాలేదు. కాసేపు అటూఇటూ తారట్లాడాడు. ఎంత సేపు ఎదురుచూసినా ఎవరూ రాలేదు. చీకటి పడుతుండగా నీరసంగా ఇంటికి వచ్చేసాడు. ఏమయ్యింది అన్నట్లుగా చూస్తున్న తాతయ్యకు జవాబివ్వక రూములోకి వచ్చి పడుకున్నాడు. ఎంత ఆలోచించినా ఏమి జరిగిందో తెలియటం లేదు. రోజూ ఏదో ఒక చిలిపి పనితో వచ్చే అవని కనిపించటము లేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంటోంది. ఎవరూ మాట్లాడటం లేదు. నాలుగు రోజులు భారంగా గడిచిపోయాయి.

"ఇట్లా ఎన్నిరోజులురా? అసలు ఏమి జరిగిందో చెప్పు" గోపాలరావు మనవడిని బుజ్జగింపుగా అడిగాడు.

కళ్ళకు అడ్డంగాఉన్న చేయిని తీయకుండానే "తెలియదు తాతయ్యా. ఏమీ చెప్పలేదు. ఇంటికి తాళం వేసి ఉంది" అన్నాడు భారంగా.

"ఒకసారి మెయిల్ చెక్ చేయకపోయావా?" అన్నాడు గోపాలరావు.

మంచం మీద నుంచి గబుక్కున లేచి "నాకీ ఆలోచన రాలేదు తాతయ్యా" అంటూనే మెయిల్ ఓపెన్ చేసాడు.

"వాళ్ళది సాంప్రదాయమైన కుటుంబము. మన అలవాట్లు వాళ్ళ అలవాట్లు వేరు. మనం నాన్‌వెజిటేరియన్స్ మి. మరి నువ్వు శాకాహారం తినగలవా? అతను అమెరికాకు వెళ్ళేందుకు ఇష్టపడటం లేదన్నావు. మరి నువ్వు ఆ కుటుంబంలో ఇమడగలవా? ఇలా నాకు చాలా ప్రశ్నలు వేసారు మా డాడీ, మమ్మీ. వాళ్ళు ఎంతమాత్రమూ మన పెళ్ళికి ఒప్పుకోవటము లేదు. బెంగుళూర్ తీసుకొచ్చారు. మా డాడీ ఫ్రెండ్ కొడుకుతో నా పెళ్ళి నిశ్చయించారు. ఈ నెలాఖరున నా పెళ్ళి" అన్న వెన్నెల మెయిల్‌ని చూసి నిశ్చేష్టుడైపోయాడు అలోక్.

కాగలకార్యం గంధర్వులే తీర్చారని మనసులో సంతోషపడుతూ మనవడిని వదిలి బయటకు వెళ్ళాడు గోపాలరావు. శివరావు, వాణికి విషయం చెప్పి "వాడిని అట్లా వదిలేయండి. ఎవరూ ఏమీ అడగకండి" అన్నారు.

***

"అవి నిద్ర మాత్రలు కావు. పని చేయవు. ఇదో ఇవి నిద్ర మాత్రలు. ఓ పది వేసుకున్నావంటే డైరెక్ట్ గా వెళ్ళిపోవచ్చు" చేతిలోని టాబ్లెట్స్ ను నోట్లో వేసుకోపోతున్న అలోక్ ఉలిక్కి పడి తలెత్తి చూసాడు. ఎదురుగా తాతయ్య చేతిలో మందు మాత్రల సీసాతో ఉన్నాడు. చేతిలోని మాత్రలను పడేసి, "తాతయ్యా" అంటూ తాతయ్యను చుట్టుకుపోయి బావురుమన్నాడు.

"నాకు తెలుసురా నువ్విలాంటి పని చేస్తావని. అందుకే నిద్ర మాత్రలు తీసేసి విటమిన్ మాత్రలు వేసాను అందులో. అందరం నిన్ను కనిపెట్టుకొని ఉన్నాము. అటు చూడు మీ అమ్మానాన్నా నీకోసం ఎంత బాధపడుతున్నారో"అన్నాడు గోపాలరావు.

శివరావు, వాణి కళ్ళనీళ్ళతో లోపలికి వచ్చి అలోక్‌ను దగ్గరికి తీసుకున్నారు. "కన్నా ఒక్క నిమిషం కూడా నీకోసం బతికే మా గురించి ఆలోచించలేదా? నిన్ను కాదని వెళ్ళిపోయిన ఆ అమ్మాయి కోసం ప్రాణం తీసుకుంటావా?" కన్నీటితో అంది వాణి.

ఏమీ జవాబు చెప్పలేక తల్లి చేతిలో మొహం దాచుకున్నాడు.

మనవడి పక్కన కూర్చొని, ఆప్యాయంగా తల నిమురుతూ "అన్ని సమస్యలకూ పరిష్కారం ఆత్మహత్య కాదురా! యాభై సంవత్సరాలు ఒకటిగా బతికిన మీ బామ్మ పోగానే నేను ఆత్మహత్య చేసుకున్నానా?

అంతే. జీవితంలోని ఆటుపోట్లను తట్టుకుంటూ కాలంతో పాటూ మనమూ సాగిపోవాలి. ఆగిపోకూడదు." అన్నారు.

"కాలంతో కదలాలి అంటే కాలం కదలటమే లేదు. ఆగిపోయింది. బాధ మర్చిపోలేకుండా ఉన్నాను. ఎంత కాలమని ఇట్లా బతకాలి తాతయ్యా?" దిగులుగా అన్నాడు అలోక్.

"కాలం ఆగిపోలేదురా. దాని మానాన అది కదులుతూ, దాని ధర్మం అది నిర్వహిస్తూనే ఉంది. మనమూ దానితో పాటు కదలాలి. ఒకే చోట ఆగిపోకూడదు. కాలమే అన్ని గాయాలను మాన్పుతుంది. నీకోసం, నీవాళ్ళ కోసం మనసును కుదుటపర్చుకోవాలి" అన్నారు గోపాలరావు అనునయంగా.

"ఊరికే ఆలోచనలతో కూర్చోకు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు అప్లై చేయి. లేదా ఏదైనా ఉద్యోగంలో చేరు. కొంచెం కుదుటపడతావు" అన్నాడు శివరావు.

***

డాబా మీద కూర్చొని లాప్‌టాప్‌లో ఏదో చూసుకుంటున్న అలోక్ వెనుక నీళ్ళు పడి వెనకంతా తడిసిపోయింది. ఈ నీళ్ళెక్కడివా అని తిరిగి చూస్తే అవని చేతిలో బకెట్‌తో నవ్వుతూ కనిపించింది.

"ఏమిటీ అల్లరి?" చిరాగ్గా అన్నాడు అలోక్.

"బావవు కదా నీ దగ్గర కాకపోతే ఇంకెక్కడ అల్లరి చేస్తాను? పోనీ నన్ను పెళ్ళి చేసుకో, అల్లరి మానేస్తాను" జవాబిచ్చింది చిలిపిగా.

అవని వైపు సాలోచనగా చూస్తూ "నన్ను పెళ్ళి చేసుకుంటావా

అవనీ? నేను ఎవరినో ప్రేమించి, విఫలమై ఆత్మహత్య చేసుకోబోయాను కదా! మరి దానిని క్షమిస్తావా?” అడిగాడు.

“పో బావా ఆమెవరో కష్టసఖి మధ్యలో వచ్చింది మధ్యలో పోయింది. నీ ఇష్టసఖిని నేనే కదా! నాపేరే అవని. భూమాతలా ఆలోక్ పొరపాట్లను క్షమించి, భరిస్తానులే” చిలిపిగా నవ్వేసింది.

“కానీ నేను ఇంకో మూడేళ్ళ దాకా పెళ్ళి చేసుకోను. క్లినికల్ సైకాలజీ కోర్స్ చేసి, క్లినిక్ పెట్టుకోవాలనుకుంటున్నాను. నాలాగ ప్రేమలో విఫలమై, పరీక్షలలో ఫెయిలయి, జీవితములో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కోలేక, అమ్మ కొట్టిందనో ఏదో ఒక రకంగా క్షణికావేశంలో ఆత్మహత్యా ప్రయత్నం చేసుకునేవారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని, కాలేజీలకు, స్కూల్స్ కు వెళ్ళి పరీక్షల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో చెప్పాలని ఇలా చాలా ప్లాన్‌లు ఉన్నాయి. అవన్నీ అమలులోకి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల కాలం పడుతుంది. మరి నువ్వు అంత కాలం ఆగగలవా?” అడిగాడు.

“ఇంతకాలం నీకోసం ఆగినదానిని ఇంకొంతకాలం ఆగలేనా? మనకు కాలంతో పనేముంది బావా? కానీ బావా బిటెక్ చదివిన నువ్వు క్లినికల్ సైకాలజీలోకి ఎలా వెళతావు?” కుతూహలంగా ప్రశ్నించింది.

“బిటెక్ చేసాక కూడా క్లినికల్ సైకాలజీలో డిప్లమా, ఆ తరువాత పోస్ట్ గ్రాడ్యుయేషన్, పి. హెచ్. డీ చేయవచ్చు. అమెరికాలో చాలా యూనివర్సిటీలలో ఆ కోర్స్ లు ఉన్నాయి. మన ఇండియాలో కూడా అలా చేసే అవకాశం ఉన్న కాలేజీలు ఎక్కడన్నా ఉన్నాయా అనే చూస్తున్నాను. ఒక వేళ ఇక్కడ లేకపోయినా అమెరికా వెళ్ళి అయినా చేసి వచ్చి, ఇక్కడే నా క్లినిక్ పెడతాను” అన్నాడు దృఢంగా.

***

“అబ్బా ఈ కాలానికెందుకింత తొందర? కొంతసేపు ఆగిపోవచ్చుగా?” హనీమూన్ తొందరగా అయిపోయిందని అలుకగా విమానం కిటికీ లోనుంచి సూర్యుడిని చూస్తూ అన్నాడు అలోక్.

“కొంతకాలం క్రితం కాలం ఆగిపోయిందని దిగులుపడ్డట్లున్నావు. ఇప్పుడేమో కాలం ఆగిపోలేదని దిగులు పడుతున్నావా?” కిలకిలా నవ్వింది అవని.

***

**(వార్త - ఆదివారం అనుబంధం - 1- అక్టోబర్, 2023)**

# *39*. హైస్కూల్ స్వీట్ హార్ట్స్

మేము యు.యస్ వచ్చి వారమయ్యింది. ఇంక జెట్ లాగ్ చాలులే అని వాకింగ్‌కు బయలుదేరాము. కొద్ది దూరం నడిచాక ఒక ఇంటి ముందు అప్రయత్నంగా నా కాళ్ళు ఆగిపోయాయి. అక్కడ లాన్‌లో ఓ పమేరియన్ కుక్కపిల్ల ఆడుకుంటోంది. అది అచ్చు నా కుక్కపిల్ల చుటికీ లాగానే ఉంది. అది మమ్మలిని చూసి, "భౌ... భౌ... భౌ..." అని కొంపలంటుకుపోయేట్లు అరవసాగింది. దాని అరుపులతో "రాకీ..." అని పిలుస్తూ ఒకాయన లోపల నుంచి వచ్చాడు. ఆయనను చూడగానే అచ్చు మా నాన్నగారిలా అనిపించి అలా చూస్తుండిపోయాను. అప్పటికి మా నాన్నగారు పోయి రెండేళ్ళవుతోంది. కళ్ళల్లో నీళ్ళొచ్చేస్తున్నాయి. ఆయన మాకు "హాయ్" చెప్పి "రాకీ" అంటూ ఆ కుక్కపిల్ల దగ్గరకు వెళ్ళాడు.

"పద. ఇంకా అట్లా చూస్తూ ఉంటే బాగుండదు" అన్నారు ఏమండీ.

వెనకెనకకి తిరిగి చూస్తూ "ఏమండీ, ఆయన అచ్చు మా నాన్నగారిలా ఉన్నారు కదూ. అదేమో మన చుటికీ లా ఉంది" అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

"మామయ్యగారు కూడా ఆరడుగుల ఎత్తు, తెల్లగా, తెల్ల జుట్టుతో ఉండేవారు కదా. అందుకని ఆయన మీ నాన్నగారిలా అనిపిస్తున్నాడేమో. తిరిగి వచ్చేటప్పుడు మాట్లాడుదాములే" అన్నారు. కానీ తిరిగి వచ్చేటప్పుడు ఆయన లేరు. ఇంటికెళ్ళాక మా అబ్బాయితో చెపితే "జాగ్రత్త మాతే. ఆ కుక్కను ముట్టుకోకు. లేనిపోని గోల" అన్నాడు.

మరునాడూ ఆ ఇంటి ముందు మళ్ళీ ఆగిపోయాను. నా వాలకం చూసి ఏమండీ ఆయనతో, "మీరు అచ్చం వాళ్ళ ఫాదర్‌లా ఉన్నారని చూస్తోంది. ఆయన రీసెంట్‌గా పోయారు" అని చెప్పారు.

ఆయన బయటకు వచ్చి నన్ను దగ్గరకు తీసుకున్నాడు. ఏమండీ, ఆయనా కాసేపు కబుర్లు చెప్పుకున్నారు. అలా ప్రతిరోజూ వాకింగ్‌కు వెళ్ళినప్పుడు ఆ యింటి ముందు ఆగి, ఆ రాకీనీ, అక్కడ లాన్‌కు నీళ్ళు పెడుతున్న ఆయనని చూడటం, ఆయనతో కాసేపు మాట్లాడటం అలవాటైపోయింది. ఆయన గేట్ లోపల, మేము ఇవతల ఉండే వాళ్ళం. అదేమిటీ రోజూ మాట్లాడుతున్నా, ఆయన పేరు థామస్ అని చెప్పాడే కానీ, లోపలికి రమ్మనడేమిటి అనుకున్నాను. ఆ కొరతా తీరుస్తూ ఓ రోజు లోపలికి పిలిచాడు. అక్కడ ఉన్న లాన్ చెయిర్స్ లో కూర్చున్నాము. రోజూ ఆయనతో కూర్చొని ముచ్చట్లతో కాసేపు గడిపేవాళ్ళము. అలా మూడునెలలు గడిచాయి. ఈ మూడు నెలలల్లో ఆ లాన్ దాటి మేము లోపలికి వెళ్ళలేదు. ఆయన కుటుంబసభ్యులెవరూ కనిపించలేదు. ఇక మేము నాలుగురోజులల్లో తిరిగి వెళుతామని ఆయనకు చెపితే, మరునాడు వాళ్ళింటికి డిన్నర్‌కు ఆరింటికి రమ్మన్నాడు.

“అసలు ఇక్కడ ఎవరైనా హాయ్ తప్ప ఇంకో మాట మాట్లాడరు. మీతో రోజూ కబుర్లు చెప్పటమే కాక, వాళ్ళింటికి డిన్నర్‌కు కూడా పిలిచాడా?” అని మా అబ్బాయి తెగ ఆశ్చర్యపోయి, “ఎంతైనా నీ రూటే వేరు డాడ్” అని మెచ్చుకున్నాడు.

మరునాడు మేము ఒక పూలబుకే తీసుకొని ఆరింటికల్లా వాళ్ళింటికి వెళ్ళాము. థామస్ మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకెళ్ళాడు. లోపల బెడ్‌రూమ్‌లో మంచం మీద ఒక ముసలావిడ పడుకొని ఉంది. ఆవిడకు మమ్మల్ని పరిచయం చేసి “షి ఈజ్ మై వైఫ్ లూసీ” అని ఆవిడను పరిచయం చేసాడు. ఆ వయసులో కూడా లూసీ తెల్లగా, అందంగా, నవ్వు మొహంతో ఉంది. ఆవిడ అంత పెద్దదానిగా ఉంది ఈయనేమో చిన్నవాడిలా ఉన్నాడు అని నేను ఆశ్చర్యంతో చూస్తున్నాను. మమ్మల్ని అక్కడే కుర్చీలో కూర్చోబెట్టాడు.

నా ఆశ్చర్యం గమనించిందేమో "మేము హైస్కూల్ స్వీట్ హార్ట్స్ మి" అంది లూసీ నవ్వుతూ.

నేనింకా అయోమయం మొహం పెట్టాను హైస్కూల్ స్వీట్ హార్ట్స్ అంటే అర్థం కాక.

వాళ్ళిద్దరికీ మాకు అర్థం కాలేదని అర్థం అయ్యింది. థామస్ నవ్వుతూ "మా నాన్న సెకండ్ వర్ల్డ్ వార్‌కు వెళ్ళాల్సి వచ్చింది. అప్పటి వరకూ మానాన్న సంపాదిస్తే, మా అమ్మ మమ్మల్ని చూసుకునేది. మేము పదిమంది పిల్లలము. నాన్న యుద్ధానికి వెళితే అమ్మ సంపాదించవలసిన అవసరం వచ్చింది. అప్పటి వరకూ మా ఇళ్ళల్లో ఆడవాళ్ళు ఇంటిని చూసుకుంటుంటుంటే, భర్తలు సంపాదించేవారు. ఇప్పుడు యుద్ధానికి మగవాళ్ళు వెళితే ఆడవాళ్ళకు సంపాదించి కుటుంబాన్ని చూసుకోక తప్పలేదు. అందుకని మేము ఇంతకు ముందు ఉన్న పెద్ద కమ్యూనిటీ నుంచి వేరే చిన్న కమ్యూనిటీకి మారాల్సివచ్చింది. అక్కడ మా అమ్మలాగే అందరూ హౌస్ వైఫ్స్ ఏవో చిన్నచిన్న పనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తుండేవారు. అక్కడే స్కూల్‌లో చేరాము. అప్పుడు నేను 9th క్లాస్‌లో, మా పెద్దక్క లెవెంత్ లో ఉన్నాము. లూసీ మా పెద్దక్క మేరీ ఫ్రెండ్. లూసీ అక్క కోసం మా ఇంటికి వస్తుండేది. సన్నగా, నాజూకుగా, నవ్వు మొహంతో ఉన్న లూసీని మొదటిసారి చూడగానే ప్రేమించేసాను" అని ఆగాడు థామస్.

"అంత చిన్న వయసులోనే ప్రేమా?" అనుకోకుండా అన్నానే కాని వాళ్ళేమనుకుంటారో అని కాస్త భయం వేసింది.

థామస్ నవ్వుతూ " ఏమో మరి ప్రేమ పుట్టేసింది" అన్నాడు.

"అదేమిటో మేరీ ఇంట్లో థామస్‌ను చూడగానే నేనూ ప్రేమించేసాను.

ఇలా స్కూల్ రోజులల్లో ప్రేమించుకోవటాన్నే 'హైస్కూల్ స్వీట్ హార్ట్స్' అంటారు. కాకపోతే థామస్ ఇంకొంచెం అడ్వాన్స్. నైంత్ క్లాస్‌లోనే ప్రేమించేసాడు. నాకంటే మూడేళ్ళు చిన్నవాడు. మా ప్రేమకు మా వయసులు అడ్డు రాలేదు" అంది నవ్వుతూ.

"మరి నువ్వు నన్ను అంత చిన్న వయసులోనే ప్రేమలో పడేసావు" నవ్వుతూ లూసీతో అని, "నేను 10th కు వచ్చేసరికి లూసీ 12th అయిపోయింది. లూసీ స్కూల్ వదిలి వెళ్ళిపోతోందని, పెళ్ళి చేసుకుందామంటే నాకు పద్దెనిమిది సంవత్సరాలు రాలేదని ఇద్దరమూ చాలా దిగులు పడ్డాము. ఏమి చేయాలో తెలియలేదు. అప్పుడు మా అక్క మేరీనే 'వాడికి చదువు పూర్తయ్యేసరికి పద్దెనిమిది సంవత్సరాలు వస్తాయి. ఈ రెండేళ్ళల్లో నువ్వు ఏదైనా కోర్స్ చేసి ఉద్యోగం సంపాదించుకో. ఆ తరువాత థామస్ కూడా ఏదైనా కోర్స్ చేస్తాడు. ఇద్దరూ సంపాదించుకొని, స్థిరపడి పెళ్ళి చేసుకోండి. ఎంతా మూడేళ్ళే కదా' అని ధైర్యం చెప్పింది. నా స్కూల్ చదువు అయ్యేసరికి లూసీ ట్రేడ్ స్కూల్‌లో నర్స్ ట్రైనింగ్ రెండేళ్ళు చేసింది. నా స్కూల్ అయ్యాక నేనూ ట్రేడ్ స్కూల్‌లో కార్పెంటరీ కోర్స్ చేసాను. ఆ తరువాత పెళ్ళి చేసుకున్నాము. మాకు నలుగురు పిల్లలు. వాళ్ళూ ఎవరికి వారు వేరే వెళ్ళిపోయి, పెళ్ళిళ్ళు చేసుకొని సెటిల్ అయ్యారు" అని చెప్పటం ముగించాడు.

"మరి లూసీ ఇలా..." అని ఆగిపోయారు ఏమండి.

"నాలుగేళ్ళ క్రితం లూసీకి కారు ఆక్సిడెంట్‌లో వెన్నెముక విరిగింది. అప్పటి నుంచి ఇలా బెడ్ మీదనే ఉంది. తను వీల్ చేర్‌లో కూడా కూర్చోలేదు" అన్నాడు థామస్.

"నా అంతట నేను ఏ పనీ చేసుకోలేను. అన్నీ థామసే చేస్తాడు.

నన్ను ఏదైనా సీనియర్ సిటిజన్ హోం లో చేర్చమని చెప్పాను. అయినా వినడు” అంది దిగులుగా లూసీ.

థామస్ లేచి ఆమె పక్కన కూర్చొని, ప్రేమగా ఆమె చేయిని చేతిలోకి తీసుకొని, “ఒకవేళ నేను ఇలాగయితే నన్ను సీనియర్ సిటిజన్ హోం లో చేర్చేదానివా?” అని మాతో “ఇప్పుడు తనకు ఎనభై ఏళ్ళు. నాకు డెభైఏడేళ్ళు. మాది అరవై రెండేళ్ళ ప్రేమబంధం” అన్నాడు. థామస్ చేతిని అందుకొని చిన్నగా ముద్దు పెట్టుకుంది లూసీ. ఆ ప్రేమజంటను అలా చూస్తుండిపోయాను.

ఆ తరువాత నేను కోక్, ఒక ఆపిల్, ఏమండీ వైన్, కొద్దిగా బ్రెడ్ తో డిన్నర్ చేసాము. వారికి థాంక్స్ చెప్పి, ఆప్యాయంగా హగ్ చేసి ఇంటికి బయలుదేరాము.

“అమెరికన్స్ కు పెళ్ళి మీద నమ్మకం ఉండదని, ఊరుకూరికే విడాకులు తీసుకొని వేరే పెళ్ళి చేసుకుంటారని విన్నాము. కానీ వీరేమిటీ వేరుగా ఉన్నారు? ఆయనకు భార్య మీద ఎంత ప్రేమ! ఆవిడకు నాలుగేళ్ళ నుంచి అన్ని సేవలూ చేస్తూ, ఎంత ప్రేమగా చూసుకుంటున్నాడు” అన్నాను ఆశ్చర్యంగా ఏమండీతో దారిలో.

“అలా ఏమీ ఉండదు. అదంతా ఏవో సినిమాలు చూసి, పుస్తకాలు చదివీ మనం ఊహించుకొని నిర్ణయించుకున్నదే. ఇప్పుడు అక్కడా పడని వాళ్ళు విడాకులు తీసుకుంటునే ఉన్నారు. ఏదైనా ఇక్కడింతే, అక్కడింతే అని ఫిక్సైపోకూడదు. అన్ని చోట్లా అందరూ ఉంటారు. అట్లా అమెరికన్స్ మీద ఒక అభిప్రాయం ఏర్పడింది అంతే” అన్నారు ఏమండి.

“ఏమైనా ఈ హైస్కూల్ స్వీట్ హార్ట్స్ గ్రేట్” అన్నాను...

***

(ఈ కథ వివాహబంధం గురించి పొన్నాడవారి పున్నాగవనం గ్రూప్‌లో, శ్రీమతి. వెలగపూడి భారతి గారు నిర్వహిస్తున్న "చిన్నారి పొన్నారి చిట్టి మందారాలూ - చిన్న కథలూ" లో నేను రాసిన 'హైస్కూల్ స్వీట్ హార్ట్స్' కథ, ఇంకా దానిమీద భారతి గారు చేసిన సమీక్ష.

కమలా పరచా గారి కథ "హైస్కూల్ స్వీట్ హార్ట్స్"

విలక్షణమైన కథ. థామస్, లూసీల ప్రేమ కథ. ప్రేమపుట్టడానికి జాతి, మత, కుల వివక్షలు లేనట్టే వయోభేదం కూడా లేదని నిరూపించారు థామస్, లూసీలు.

9వ తరగతి చదివేటప్పుడే అక్క స్నేహితురాలిని ప్రేమించడం.... దానికి అక్క మేరీ సపోర్టు చేయడం అక్కడివారి సంస్కృతికి అద్దం పట్టింది. ఎక్కడైనా మంచితనం, ప్రేమభావాలనేవి మానవ సహజాలుకదా అనిపిస్తాయి. భార్య మంచాన పడితే సకల సేవలు చేసే థామస్ లాంటివారికి నమోవాకాలు. బాల్యంలో కలిగిన ప్రేమ కడదాకా నిలిచి ఉండడానికి ఒక దేశం ప్రాంతం అనే తేడాలేముంటాయి? థామస్ లూసీలు నిజంగా హైస్కూల్ స్వీట్ హార్ట్స్.

చక్కని ప్రేమకథ అందించిన కమలగారికి అభినందనలు. కమలగారు వ్రాసే కథలన్నీ మనతో మాట్లాడుతున్నట్లే ఉంటాయి. చివరి వరకు ఏకబిగిన చదివిస్తాయి. ఎక్కడా కాల్పనికత లేకున్నా పాఠకులను అలరిస్తాయి. అది వారి ప్రత్యేకత అన్నారు భారతిగారు.

భారతిగారూ ఇంత మంచి సమీక్షను చేసిన మీకు ధన్యవాదాలండి.

***

# 40. మౌంట్ రష్మోర్‌లో రాధామాధవులు

(లాంగ్ వీకెండ్ అమ్మాయి, పిల్లలతో కలిసి మౌంట్ రష్మోరా వెళ్ళినప్పుడు, ఆ కొండలూ, ఆ అడవీ, ఆ ప్రకృతి చూసినప్పుడు నా మనసులో రాధామాధవులు మెదిలారు. వారి ప్రేమ అమరం. ఎన్ని యుగాలు గడిచినా మరువలేనిది, మధురమైనది. రాధామాధవులు ఎక్కడుంటే అదే బృందావనం. రాధలో అష్టవిధ నాయికలను చూపించే ప్రయత్నం చేసాను. నా ఆ భావననే ఈ కథగా రూపుదిద్దుకుంది. ఆ కథే మౌంట్ రష్మోరాలో రాధామాధవులు...)

“ఇన్ని సార్లు అడవిలో ఉన్నావు. ఇంకా అడవిలో ఉండాలని కోరికేమిటి? అలనాడు సీతమ్మవారు రామయ్యను కోరినట్టు కోరావు” నవ్వుతూ అన్నాడు మాధవ్.

రాధామాధవ్ అమెరికాకు పిల్లల దగ్గరకు వచ్చి నెల రోజులవుతోంది. లాంగ్ వీకెండ్‌లో రెండురోజులు సరదాగా గడుపుదామని, నార్త్ డెకోటాలోని మౌంట్ రష్మోరాను చూసేందుకు పిల్లలతో కలిసి వచ్చారు రాధామాధవ్. తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతుండగా మాధవ్ ను “మనం కొన్ని రోజులు ఇక్కడే ఉందామండీ” కోరింది రాధ.

“ఆ ఎత్తైన కొండలల్లో, పచ్చని చెట్లు, వాటి మీద కువకువలాడే రంగురంగుల పిట్టలు, అడవంతా పరుచుకున్న అడవిపూల సువాసనలు, చల్లగా వీచే గాలులు. అబ్బ ఎంత అందంగా ఉన్నాయో. ఎవరూ లేని ఏకాంతం లో నువ్వూనేనూ ఒకరికొకరము. ఏమండీ... ఏమండీ... ప్లీజ్... ప్లీజ్ కొన్ని రోజులు ఉందాము” పరవశంగా చుట్టూ చూస్తూ గోముగా అంది.

“ఎవరూ లేకపోవటమేమిటి? అటు చూడు మనం ఎక్కడున్నా ఆ

నలుగురు పెద్దోళ్ళు మనలని చూస్తూనే ఉంటారు”

“పోనిద్దురూ చూస్తే చూసారు లెండి. వాళ్ళ రోజులు గుర్తు తెచ్చుకుంటారు” ముసిముసిగా నవ్వింది.

భార్య కోరిక కాదనలేక, పిల్లలను పంపేసి, జనాలకు దూరంగా, అడవి లోపలికి, అన్ని వసతులు ఉన్న చిన్న కుటీరంలాంటి రిసార్ట్ అద్దెకు తీసుకున్నాడు మాధవ్. ముందు జాగ్రత్తగా కూతురు ఇంటి నుంచి తెచ్చిన సామానులతో, మురిపెంగా తన చిన్ని సంసారం సద్దుకుంది రాధ.

“ఆకులో ఆకునై - పూవులో పూవునై

ఆ అడవీ దాగి పోనా - ఎటులైనా ఇచటనే ఆగిపోనా.”

కూనిరాగం తీస్తున్న రాధతో, “అట్లాగేలే ఉండు. నేను ఇప్పుడే కాసేపు వాకింగ్‌కి  వెళ్ళి వస్తాను” అంటూ ‘నేనూ వస్తాను’ అంటున్న రాధ మాట వినిపించుకోకుండా వెళ్ళాడు మాధవ్. ఉమూ అని ముచ్చటగా మూతి తిప్పుకుంది. ‘మాధవ్ వచ్చే లోపల వంట చేస్తే సరి.  మాధవ్ కు జొన్న రొట్టెలు, ఉల్లి ఖారం, పల్లీ పొడి ఇష్టం. ఈ రోజు అవి చేస్తాను. నాకు మటుకు అన్నం  వండుకోవలసిందే’ అని ఇన్స్టాపాట్‌లో బియ్యం, నీళ్ళు వేసి ఆన్ చేసింది. జొన్నపిండి మైక్రోవేవ్ లో వేడి చేసిన నీళ్ళతో తడిపి, తడి నాప్కిన్ కప్పింది. ఉల్లిపాయలు సన్నగా తరిగి అందులో ఉప్పు, ఖారం, జీరా పొడి, గార్లిక్ పేస్ట్ వేసి మెత్తగా కలిపింది. ‘రోలుంటే బాగుండేది చక్కగా కచ్చాపచ్చాగా దంచేదానిని’ అనుకుంది. ‘వండటమే కాదోయ్ ప్రెజెంటేషన్ కూడా బాగుండాలి’ అనే మాధవ్ మాటలను తలుచుకుంటూ డైనింగ్ టేబుల్ మధ్యలో ఖీరా, టమాటో ముక్కలతో ఉన్న సలాడ్ ప్లేట్‌ను పెట్టి దాని మీద స్ప్రింగ్ ఆనియన్స్, కొత్తిమీరా అలంకరించింది. సోఫాలోని కుషన్స్ ను సద్దింది. బెడ్‌రూమ్‌లో పక్కను

సరి చేసింది. సరి చేయటమే కానీ రోజూ డెక్ మీదేగా పడక అనుకొని నునుసిగ్గుగా నవ్వుకుంది.

ఇంతలో మాధవ్ వచ్చినట్లుగా అనిపించి డెక్ మీదకు వెళ్ళి చూసింది. మాధవ్ రాలేదు కానీ చందమామ చల్లగా నవ్వుతూ కనిపించాడు.

"కొండలలోనా కోనలలోనా - గోగులు పూచే జాబిలీ"

కూనిరాగం తీస్తూ లోపలికి వచ్చి, సర్దినవే మళ్ళీ మళ్ళీ సర్దుతూ, 'ఎక్కడవక్కడ నీట్‌గా లేకపోతే చిరాకు పడుతాడు బాబూ!' అనుకుంది మురిపెంగా.

స్నానం చేసి, తెలుపు మీద  చిన్నచిన్న పసుపురంగు పూలున్న చీర కట్టుకుంది. పొద్దున వాకింగ్ చేస్తుంటే అడవిలో కనిపించిన చిన్న పసుపుపూలు, చిట్టిచేమంతుల్లా ఉన్నాయనీ, మంచి సువాసన ఉన్నాయనీ కోసుకొచ్చింది. అవి దండ కట్టుకొని సిగలో ముడుచుకుంటూ 'కాసిని పూలే దొరికాయి. ఇంకాసిని ఉంటే బాగుండేది' అనుకుంది కాస్త నిరుత్సాహంగా.

'అరే ఇంతసేపయ్యింది. మాధవ్ ఎక్కడికెళ్ళాడబ్బా ఇంకా రాలేదూ!' డెక్ మీదకెళ్ళి చుట్టూ చూసింది. ఎక్కడా కనుచూపు మేరలో కనిపించలేదు. ఏమయ్యింది? ఎక్కడి దాకా వెళ్ళాడు? గాభరా మొదలయ్యింది.  ఏ పులి వాతో పడలేదు కదా. కాదు... కాదు ఇక్కడ పులుండవన్నారుగా. పామా బాబోయ్... మనసు పరిపరి విధాల భయపెడుతోంది. ఎంత వద్దనుకున్నా నెగిటివ్ ఆలోచనలు వస్తున్నాయి. ఎంత చెడ్డదాన్నీ ఈ అడవిలో వంటరిగా ఉందామని కోరాను. తనను తాను తిట్టుకుంటోంది. ఇంట్లోకి బయటకు తిరుగుతోంది. అప్పటి దాకా అందంగా కనిపించిన అడవి భీతి గొలుపుతోంది. లోపల నుంచి బైనాక్యులర్ తెచ్చి చుట్టూ

చూసింది. అల్లంత దూరాన ఎవరో కొండ మీద నుంచి దిగుతున్నారు. 'మాధవ్ నా?' పరికించి చూసింది. దూరం నుంచి తెలియటము లేదు. 'మాధవ్ అయితే ఎవరినో ఎత్తుకొస్తున్నట్లుందే! ఉహూ మాధవ్ కాదు. కొంచెం దగ్గరగా వచ్చాడు. అరే మాధవే! ఎవరినబ్బా అట్లా పొదువుకొని తీసుకొస్తున్నాడు. ఇంకొంచెం దగ్గరగా వచ్చాడు. మాధవే. ఎవరినో ఎత్తుకొని తీసుకొస్తున్నాడు. అమ్మాయిలా ఉందే. ఎవరైనా అమ్మాయి అడవిలో తప్పిపోయి ఈయనగారి కంట పడిందా? అసలుకే పరోపకారి పాపన్న. ఆ... కాదులే. ఇంత చీకట్లో ఏ అమ్మాయి అంత అడవిలోకి వెళుతుంది? ఏ అడవి పిల్లో కనిపించి వల్లో వేసుకోలేదు కదా? అసలుకే అందగాడు! అంతే అయి ఉంటుంది. హుం... మగబుద్ధి!' మసక చీకట్లో ఎవరినో ఎత్తుకొని వస్తున్న మాధవ్ ను గుర్తు పట్టి రుసరుసలాడుతూ లోపలికి వెళ్ళింది.

కొద్దిసేపు తరువాత మాధవ్ లోపలికొచ్చి, ఆయాసపడుతూ, సోఫాలో కూర్చుంటూ, "రాధా! మంచి నీళ్ళివ్వు" అడిగాడు.

మంచినీళ్ళందిస్తూ, "ఇంత సేపు ఎక్కడికెళ్ళారు?" కోపంగా అడిగింది.

"అడవిలో ఓ గర్ల్ ఫ్రెండ్ దొరికిందిలే. దాన్ని తీసుకొని వస్తున్నాను" అన్నాడు ధుమధుమలాడుతున్న రాధ మొహం వినోదంగా చూస్తూ.

మాధవ్ చెంప మీద ఉన్న గాటును చూస్తూ "అక్కడేమైంది?" అనుమానంగా అడిగింది.

"నా గర్ల్ ఫ్రెండ్ గోటితో గీరింది" అన్నాడు తమాషాగా.

కోపం ఆపుకోలేక సోఫా లో ఉన్న కుషన్ మాధవ్ మీదికి విసిరి బయటకు వెళ్ళింది. అక్కడ...

డెక్ మీద వేసి ఉన్న తెల్లని పరుపు మీద, వత్తుగా పరిచి ఉన్న చిన్నిచిన్ని పసుపుపచ్చని పూలు వెన్నెల్లో పచ్చగా మెరుస్తున్నాయి!

"ఈ పూలు చాలా?" వెనక నుంచి అడిగాడు మాధవ్.

"మీరు వీటి కోసం వెళ్ళారా? అయితే మీరు ఎత్తుకొస్తున్నట్లున్నది ఈ పూలున్న సంచీనా?" ఆశ్చర్యంగా అడిగింది.

"మరి ముద్దుల పెళ్ళాం కోరిక తీర్చాలిగా. ఇన్ని పూలు కావాలంటే ఎక్కడెక్కడో వెతకాల్సి వచ్చింది."

"మరి ఆ చెంప మీది గాటు?" ఇంకా అనుమానం తీరని రాధ అడిగింది.

"పూలు కోస్తుంటే ఓ కొమ్మ గీరింది. ఈ కొమ్మకు కాకుండా ఇంకే కొమ్మకుంటుంది నన్ను ముట్టుకునే ధైర్యం?" చిలిపిగా అన్నాడు.

"పాపిష్టిదాన్ని. మిమ్మల్ని అనుమానించాను. నా కోసం ఇంత కష్టపడ్డారా?" నీళ్ళు నిండిన కళ్ళతో, రుద్ధకంఠంతో దగ్గరగా వచ్చి తన చీర కొంగుతో ఆ గాటును సుతారంగా తుడుస్తూ అంది రాధ .

"ఈ రాధమ్మ చూసావా Theodore Roosevelt అంతలోనే ప్రేమ, అంతలోనే గారాబం, అంతలోనే అనుమానం, అంతలోనే విరహం. భలే అమ్మాయే." అన్నాడు George Washington.

"పాపం ఆ మాధవుడు ఎట్లా వేగుతున్నాడో ఈ పిల్లతో" జాలి పడ్డాడు Thomas Jefferson, Abraham Lincoln వైపు చూస్తూ. Abraham Lincoln గంభీరంగా తలపంకించాడు.

"మీరే కాదు నేనూ చూస్తున్నాను వీళ్ళను" అన్నాడు ఆకాశంలో

మేఘాల చాటున, తారలతో దోబూచులాడుతున్న చందమామ.

"ఏయ్ పెద్దాయనల్లారా చాల్లే చూసింది. ఇక అటు తిరగండి" రాధను ప్రేమగా దగ్గరికి తీసుకుంటూ వాళ్ళను గదమాయించాడు మాధవ్.

"రాధకు నీవేరా ప్రాణం, రాధా హృదయం మాధవనిలయం"

మాధవ్ ను ప్రేమగా అల్లుకుంది రాధ.

ఇలాంటి ప్రేమకథలెన్నో చూసిన ఆ కొండ, ఆ కోన ముసిముసిగా నవ్వుకున్నాయి.

***

**(ఈ కథ "ప్రకృతి వర్ణనలతో, అందమైన ఆహ్లాదకరమైన కథ వ్రాయమని "పొన్నాడవారి పున్నాగవనం" ఫేస్‌బుక్ గ్రూప్‌లో ఇచ్చిన టాస్క్ కు రాసాను.)**

# 41. నొప్పింపక తానొవ్వక

"వచ్చావా!? ఎక్కడున్నావే!?" అంది జానకి ఫోన్ చెవిదగ్గర పెట్టుకుని.

"ఇదిగో ఈ కుడివైపుకు చూడు. నిన్ను నేను చూస్తున్నా. గేట్ వద్ద నాకు కనిపిస్తున్నావ్ నువ్వు." చేయూపుతూ అంది శారద.

"ఆ... కనిపించావ్! ఆగు వస్తున్నా" అటువైపు నడిచింది జానకి.

జానకి, శారద చిన్నప్పటి నుండీ మంచి స్నేహితులు. ఒకే వీధిలో ఇళ్లు. ఒకే స్కూల్. ఒకే కాలేజ్.

మనస్తత్వాలలో భిన్నత్వం ఉన్నా అభిరుచులలో ఏకత్వం, ఒకరిపై ఒకరికి గల అభిమానం, వారి మధ్య ఎప్పుడూ విభేదాలు రానివ్వ లేదు. ఇద్దరూ పోటీ పోటీగా చదివేవారు. క్లాస్‌లో మొదటి రెండు స్థానాలు వీరివే.

శారద ఉన్నత మధ్య తరగతి నుండి వస్తే, జానకిది దిగువ మధ్యతరగతి. అవేవీ వారి అన్యోన్య స్నేహానికి అడ్డు కాలేదు.

డిగ్రీ అయ్యాక జానకికి ఓ చిరుద్యోగితో వివాహం చేసేసాడు పోస్ట్ మాస్టర్‌గా పని చేసే ఆమె తండ్రి.

శారద తరువాత పీజీ చదివి మంచి ప్రభుత్వ రంగంలో గెజిటెడ్ హోదాలో ఉద్యోగం సంపాదించుకుంది. ఆపై పెళ్ళై ఆ ఊరి నుండి ఆమె కూడా వెళ్ళి పోయింది.

అలా ఇద్దరూ పెళ్ళిళ్ళై విడిపోయారు. ఎవరికి వారు తమ పిల్లలు, భర్త, ఉద్యోగం, సంసారం గొడవల్లో తలమునకలయ్యారు.

చాలా ఏళ్ల తరువాత తమ అరవైల వయసులో, తీరిక దొరికి, కాలేక్షేపం కోసం, తమ సాహిత్యాభిరుచిమేరకు, ఓ సాహిత్య ప్రధాన గ్రూపులో చేరి, అక్కడ కామెంట్స్, పోస్టులో ఒకరినొకరు గుర్తుపట్టి, ఫోన్ నంబర్లు ఇచ్చి పుచ్చుకుని, ఇలా ఈ రోజు ఈ పార్క్ లో కలుసుకోవాలని ప్లాన్ చేసుకున్నారు.

అన్ని సంవత్సరాల తరువాత అనుకోకుండా కలుసుకోవటంతో ఆనందంతో కన్నీళ్ల పర్యంతమయ్యి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, కుశల ప్రశ్నలతో ఒకరినొకరు ఉక్కిరిబిక్కిరి చేసుకున్నారు.

ఒకరి చేతిలో ఒకరు చెయ్యి ప్రేమగా పట్టుకుని తీరికగా మాట్లాడుకోవటం మొదలు పెట్టారు.

"మా వారు మా చిన్నవాడికి ఏడేళ్ళుండగా గుండెపోటుతో హఠాత్తుగా పోయారే. ఇద్దరు పిల్లలను చాలా క్రమశిక్షణతో పెంచాను. పెద్దవాడు ఏర్‌లైన్స్ లో, చిన్నవాడు లాయర్‌గా హైకోర్ట్ లో పని చేస్తున్నారు. నీ పిల్లలు!? " తన గురించి చెప్పి జానకిని అడిగింది శారద.

"నాకు ఇద్దరూ కూతర్లేనే. మా వారు రిటైరయ్యాక, కిడ్నీ ఫెయిల్యూర్‌తో కొంత కాలం పోరాడి పోయారు. ఇప్పటికి నాలుగేళ్లైంది. నా పిల్లలిద్దరూ సాఫ్ట్వేర్ కంపెనీలలో మంచి జీతంతో పని చేస్తున్నారు. ఈ సిటీలోనే. వాళ్ళ భర్తలూ అదే ఫీల్డ్." జానకి మనసులోని నిశ్చింత ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"అవునా! ఇంతకూ నువ్వెక్కడ ఉంటున్నావ్!? ఒంటరిగా ఉన్నావా!? నాతో పాటూ ఆశ్రయ గోల్డేజ్ హోం కు వచ్చేయ్ కూడదూ!? నా రూంలోనే ఉందుగానీ. నేనే పే చేస్తాను. చాలా బావుంటుంది అక్కడ. సెపరేట్ ఏ సి గది, విత్ అటాచ్డ్ బాత్రూం. ఆ బిల్డింగ్ చుట్టు పెద్ద

గార్డెన్. ఆర్గానిక్ కూరల పెంపకం. యోగా కేంద్రం, చిన్న దేవాలయం, ఇరవైనాలుగు గంటలూ డాక్టర్స్ అందుబాటులో ఉంటారు, చక్కని, తాజా ఆహారం సమయానికి అందిస్తారు. నేనున్న రూం ఒక్కరికైతే నెలకు ఇరవై నాలుగు వేలు, అక్కడే ఇద్దరుంటే ముప్పై వేలు." ఉత్సాహంగా జానకి రెండు చేతులూ తన చేతిలోకి తీసుకుని అడిగింది శారద.

"అదేంటీ, నువ్వు ఓల్డేజ్ హోంలో ఉన్నావ!?" పట్టలేని ఆశ్చర్యంతో శారదవైపు చూస్తూ అంది జానకి.

"అవును, ఏం? అయినా అక్కడ చాలా సౌకర్యంగా ఉంటుంది. నువ్వూ ఒంటరిగానే ఉంటున్నావని అడిగాను!" చప్పబడిన ఉత్సాహం జానకికి దొరకనివ్వకూడదనే ప్రయత్నం చేస్తూ, చిన్నగా తన చేతులు వెనక్కు తీసుకుంది శారద.

"లేదే. నేను నా కూతుర్ల దగ్గరే ఉంటున్నాను, ఆయన పోయినప్పటి నుండీ. అది సరే! నీ పిల్లలు నిన్నిలా ఒంటరిగా ఎందుకు ఉండనిస్తున్నారు?" అంది జానకి.

శారద తన భావాలు ముఖంలో చూపకుండా... "ముందు నువ్వు చెప్పు. నీ అల్లుళ్ళు నిన్ను తమ వద్ద ఉంచుకోవడానికి ఒప్పుకున్నారా?" ఆసక్తిగా చూసింది జానకి కళ్ళలోకి.

జానకి చెప్పటం మొదలుపెట్టింది.

"మావారి మరణం నేను తట్టుకోలేకపోయాను. డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయాను. అదృష్ట వశాత్తూ మా అల్లుళ్ళిద్దరూ చాలా మంచి వాళ్ళు. నన్ను ఒంటరిగా మా ఇంట్లో ఉండనీయకుండా వాళ్ళ ఇంటికి తీసుకొచ్చారు. అమ్మాయిలిద్దరూ అమ్మల్లా నన్ను కడుపున పెట్టుకొని చూసుకున్నారు. వారి ఆదరణ, ఆప్యాయత, మనవళ్ళు మనవరాళ్ళ

ఆటపాటలతో తేరుకున్నాను. ఇద్దరూ పక్కపక్కనే  ఉండటంతో ఇద్దరి మధ్యా తిరుగుతూ, పిల్లలకు కావలసిన సహాయము చేస్తూ నిశ్చింతగా ఉన్నాను. ఇక నీ సంగతి చెప్పు" అంది జానకి.

"నా సంగతంటే సుదీర్ఘంగా చెప్పాలి. చెప్పానుగా పెద్దవాడు ఏర్‌లైన్స్ లో అదే అమెరికన్ ఏర్‌లైన్స్ లో అమెరికాలో, చిన్నవాడు కూడా అమెరికాలోనే హైకోర్ట్ లో లాయర్‌గా సెటిల్ అయ్యారు. నేను రిటైరయ్యాక వాళ్ళ దగ్గరకు వెళ్ళాను. పిల్లలు అక్కడే వారి దగ్గరే ఉండమని, గ్రీన్‌కార్డ్ కు అప్లై చేస్తామని అన్నారు. నేను కూడా పిల్లల దగ్గర ఉండేందుకు మొగ్గాను. గ్రీన్‌కార్డ్ కు అప్లై చేసే ముందు మూడు నెలలు అమెరికాలో స్థానికంగా ఉండాలి. కోడళ్ళు చక్కగా చేసిపెడుతుంటే,  వీకెండ్స్ లో మాల్స్ కు వెళుతూ ఎంజాయ్ చేస్తుండేదానిని. ఒక పెద్దావిడని వరుసగా మూడునాలుగు సార్లు ఒక స్టోర్‌లో పని చేస్తుండటం చూసాను. 'పాపం! పిల్లలు చూడటం లేదేమో ఈ వయసులో కూడా పని చేస్తోంది' అని అనుకునే దానిని. ఓసారి  ఆపుకోలేక ఆవిడను, "మీరు ఈ వయసులో కూడా పని చేస్తున్నారు. మీ పిల్లలు మిమ్మల్ని చూడరా?" అని అడిగాను. ఆవిడ నా వైపు విచిత్రంగా చూసి,  "పిల్లలెందుకు చూడటం? నా ఆరోగ్యం బాగుంది. నేను పని చేయగలను. ఊరికే కూర్చొని ఏమి చేస్తాను?"  అంది.

నిజమే కదా, ఇరవై సంవత్సరాలు పెంచామని పిల్లల మీద ఆధారపడిపోవటం ఎందుకు? నాకు ఆర్థికంగా కాని ఆరోగ్యపరంగా కానీ ఏ ఇబ్బందీ లేదు. పిల్లలు ఇన్ని సంవత్సరాలుగా అమెరికాలో ఉండి ఇక్కడి జీవన విధానానికి అలవాటు పడ్డారు. నా జీవన శైలి వేరు. నా పద్ధతులు వారికీ, వారివి నాకూ ఇబ్బందిగా ఉండటము గమనిస్తూనే ఉన్నాను. ఇప్పుడు నేను మారలేను. అందుకని వాళ్ళను ఇబ్బంది పెట్టటమూ, నాకోసం వాళ్ళను పద్ధతులు మార్చుకోమనటమూ సబబా?

అందుకే అక్కడే నేను సెపరేట్‌గా ఏదైనా అపార్ట్మెంట్ తీసుకొని ఉందామా అని ఆలోచించాను. కాని అన్ని పనులూ నేను మానేజ్ చేసుకోవటం కష్టం. పోనీ సీనియర్ కేర్ సెంటర్‌లో ఉందామా అంటే, మంచిది, అన్ని వసతులూ ఉన్నదైతే కనీసం నెలకు నాలుగువేల డాలర్స్ కట్టాలి. అంత డబ్బూ కట్టలేను. పిల్లలను అడగటం ఇష్టం లేదు. అలా చాలా ఆలోచించాను.

ఒక రోజు చిన్నవాడు నన్ను కలిసేందుకు వచ్చినప్పుడు 'నాకు పూర్తిగా మీమీద ఆధారపడి ఉండటం ఇష్టం లేదు. అలా అని మీకు దూరంగా ఉండలేను. నేను పిలిస్తే మీరు, మీరు పిలిస్తే నేను పలికే దూరంలో ఉండాలి. మీ ఉద్యోగాలు మానుకొని నాకోసం ఇండియా రమ్మనలేను. ప్రస్తుతం గ్రీన్‌కార్డ్ వద్దు. ఎట్లాగూ పెద్దవాడికి ఫ్రీ టికెట్స్ ఉంటాయి కదా, వాడు వీలైనప్పుడల్లా వస్తూనే ఉంటాడుగా. ఏమి చేయాలో చిన్నగా ఆలోచిద్దాం' అని వాళ్ళను ఒప్పించి ఇండియా వచ్చాను.

ఇప్పటి వరకూ నాకు ఉద్యోగం ఉంది కనుక ఒంటరితనం తెలియలేదు. ఈ హోములో అన్ని వసతులూ ఉన్నాయని చేరాను. నిన్ననే పెద్దవాడు ఫోన్‌చేసి, 'శాంతినికేతన్ అనే పేరుతో అమెరికాలో ఇండియన్ గేటెడ్ కమ్యూనిటీ, ఇండియన్ పెద్దవాళ్లు, యాభైఅయిదు సంవత్సరాలు దాటిన వారి కోసం కడుతున్నారు. పిల్లలకు దగ్గరగా ఉండాలనుకునేవారు అక్కడ ఇళ్ళు కొనుక్కుంటున్నారు. అందులో క్లబ్, ఇండియన్ కిచెన్, కేర్ టేకర్, మెడికల్ కేర్ మొదలయిన వసతులన్నీ ఉన్నాయి. మనకు కావాలనుకున్నవి, అవసరమైనవి పే చేసి వాడుకోవచ్చు. నువ్వే వండుకోవాలనుకుంటే వండుకోవచ్చు. నీ ఇంట్లో నువ్వు ఉన్నట్లుగానూ, నలుగురిలో ఉన్నట్లుగానూ ఉంటుంది. నీకు అలవాటైన భాష, వాతావరణం ఉంటుంది. అందులో నీకూ ఒక ఇల్లు

బుక్ చేస్తాను. ఇక నువ్వు నీ ఇంట్లో మేము పలికే దూరంలో ఉండవచ్చు. ఎక్కడో ఇండియాలో ఒక్కదానివే ఉన్నావన్న టెన్షన్ మాకుండదు' అన్నాడు. వెళుదామనే అనుకుంటున్నాను. నేనే ఇక్కడ ఉండటం లేదు, గబుక్కున నిన్ను రమ్మన్నాను, పైగా నేను హోం లో ఉన్నానంటే పిల్లలను తప్పుగా అనుకుంటావేమో అని తమాయించుకున్నాను" అంది శారద.

"అయితే నొప్పించక, తానొవ్వక అన్నమాట బాగుంది" అంది జానకి.

'ఎంతైనా మన పిల్లలు సినిమా పిల్లలు కాదు మంచి పిల్లలు!' అని హాయిగా నవ్వుకున్నారిద్దరు.

**(మనకథలూ- మన భావాలు సాహితీ సమూహములో 'ముగింపు మాది'కి ఇచ్చిన కథకు నేను కొనసాగించిన కథ. ఇది తరుణి అంతర్జాలవారపత్రికలో ప్రచురించబడింది. ఇందులో నేను ప్రస్తావించిన శాంతినికేతన్ అనే గేటెడ్ కమ్యూనిటీ అమెరికాలో ప్రస్తుతం ఫ్లోరిడాలో ఉంది. అది నేను పేపర్‌లో చదివి ఈ కథలో ఉపయోగించుకున్నాను)**

***

# 42. పలుకరాదుటే చిలుకా

**(ఫేస్‌బుక్‌లోని కథల గ్రూప్ 'మన కథలు - మన భావాలు' సాహితీ సమూహములో ఇచ్చిన చిత్రానికి నేను రాసిన కథ 'పలుకరాదటే చిలుకా!')**

***

"అమ్మా, నేను అత్తయ్య ఇంటికి వెళుతున్నా!" అని ఓ కేక పెట్టి జడవెనక్కి వేసుకుంటూ ఓసారి నిలువుటద్దంలో చూసుకంది సీత. పాపిడి చేరు, నడుముకు మువ్వల వడ్డాణం, చెవులకు బుట్టలు, అంచున్న జరీ పరికిణీ, వోణీ. "బంగారుతల్లిలా మెరిసిపోతున్నావే" అనే మేనత్త మాటలతో పాటు, పోయినసారి వచ్చినప్పుడు బావ "ఏమిటీ గంగిరెద్దు వేషం? పట్నంలో అమ్మాయిలు ఎంత షోగ్గా ఉంటారో తెలుసా?" అని వెక్కిరించటం, తను మేనత్త ఒళ్ళో దూరి వెక్కివెక్కి ఏడవటం గుర్తొచ్చింది. గబగబా నగలూ, లంగావోణీ తీసేసి, బట్టల రాజయ్య దగ్గర తీసుకున్న డాలర్ అంచున్న సిల్క్ చీర కట్టుకుని, మస్తాన్ కొత్త నమూనాలో కుట్టిన బుట్ట చేతుల జాకెట్ వేసుకుంది. ఒక్క జడ విప్పేసి, ఆ మధ్య పక్కింటికి వచ్చిన పట్నంపిల్ల దగ్గర నేర్చుకున్న పాకెట్ రెండుజడలు వేసుకొని, వేళ్ళాడే జుంకీలు పెట్టుకుని అద్దంలో సంతృప్తిగా చూసుకుని అత్తింటికి పరిగెత్తింది.

వంటింట్లో కొడుకుకు ఇష్టమని అరిసెలు చేస్తున్న అత్త, "బావ పొద్దుననగా వస్తే ఇప్పుడొస్తున్నావా పిల్లా?" అంటూ తలెత్తి చూసి, "కోడల కోడలా ఈ అవతారమేమమ్మా ఆహుమ్మ్... ఆహుమ్మ్" అంటూ ఫక్కున నవ్వింది.

"నీ కొడుకు కోరిన అవతారమే అత్తా ఆహుమ్మ్... ఆహుమ్మ్" అని అత్తకు ధీటుగా జవాబిచ్చింది సీత.

"బాగుందమ్మా సంబడం. పైన డబ్బాలోని చక్కిలాలు, ఈ అరిసెలు

తీసుకెళ్ళి బావకియ్యి. పైన ఉన్నాడు” అంది అత్త.

చక్కిలాలు, అరిసెలు తీసుకొని, ‘సంవత్సరం తరువాత చూస్తున్న బావ ఎట్లా ఉన్నాడో! నా ఈ చీర అదీ చూసి ఏమంటాడో!’ అనుకుంటూ పైకెళ్ళగానే, కనిపించిన బావను చూసి అడుగులు తడబడ్డాయి. ఏవేవో భావనలు ఉక్కిరిబిక్కిరి చేసాయి. అంతలోనే బావ వెక్కిరింత గుర్తొచ్చి ఉక్రోషం వచ్చేసి పలహారాలు గట్టు మీద పెట్టి వెనుతిరిగిన సీతను చూసి నవ్వుకుంటూ, “పలుక రాదుటే చిలుకా, ఈ కోపమేలనే?” అని ఉడికించాడు వేణు.

ఆ వేసవిలోనే వేణూకు, సీతకు రంగరంగ వైభోగంగా పెళ్ళి జరిగిపోయింది. కాలం చకచకా ముందు జరిగి సీత ఓ కూతురికి, ఓ కొడుకుకు తల్లయ్యింది. కొడుకు, కూతురు మంచి చదువులు చదువుకొని సాఫ్ట్ వేర్ ఇంజనీర్లయ్యారు. కూతురి పెళ్ళి చేసి అత్తగారు, ఆలస్యం కాకుండా అమ్మమ్మ కూడా అయిపోయింది. ‘అమ్మయ్య కూతురి బాధ్యత తీరింది’ అని కొడుకు పెళ్ళి చేసి సాఫ్ట్ వేర్ కోడలును కూడా తెచ్చేసుకుంది.

కొడుకు కొత్తకాపురం చూడాలని హైదరాబాద్ వచ్చారు వేణు, సీత. అందంగా, ఆధునికంగా ఉన్న మూడు బెడ్‌రూమ్‌ల అపార్ట్మెంట్ కలయ చూసి ముచ్చట పడిపోయింది సీత. ముఖ్యంగా మోడరన్ కిచెన్ చూసి సంబరపడిపోయింది. ఫ్రెషప్ అయ్యి వచ్చిన వాళ్ళకు హోటల్ పాకెట్స్ విప్పి దోశెలూ, ఇడ్లీలూ వడ్డించింది కోడలు షామిలి. ఫ్లాస్క్ లో నుంచి కాఫీ తీసి కప్పుల్లో పోసాడు వైభవ్. అందరూ తినటం అయ్యాక “ఆంటీ, మీకు లంచ్ ఆర్డర్ చేసాను. పన్నెండు వరకూ వస్తుంది. ఫరవాలేదుగా” అని చెప్పి హడావిడిగా ఆఫీస్‌లో మీటింగ్స్ ఉన్నాయని పరిగెత్తారు. తిరిగి రాత్రికెప్పుడో వచ్చారు ఇద్దరూ. హాల్‌లో కూర్చొని ఉన్న అమ్మానాన్నలను

చూసి "మీ కోసం డిన్నర్ పంపాను తిన్నారా డాడీ?" అడిగాడు వైభవ్. కాసేపు నీరసంగా అక్కడే కూర్చొని లోపలికెళ్ళిపోయాడు.

మూడురోజులు అలాగే గడిపోయాయి. ఆ రోజు శనివారం. ఆఫీస్ లేదని చిన్నగా లేచారు షామిలి, వైభవ్. అమ్మయ్య ఈ రోజు ఇంట్లో ఉంటారేమో హాయిగా కాస్త వండిపెడుదామని కోడలితో "షామిలీ, ఇవన్నీ ఎలా వాడాలో చూపించమ్మా. ఈ రోజు నుంచి నేను వంట చేస్తాను. నువ్వు నీ ఆఫీస్ పని చూసుకో" అంది.

"వద్దాంటీ, ఈ రోజు మీకు అవన్నీ చూపించే ఓపిక నాకు లేదు. అయినా ఎందుకాంటీ, మీకేమి కావాలో చెప్పండి తెప్పిస్తాను. హాయిగా ఎంజాయ్ చేయండి ఆ వంట బాదరబందీ లేకుండా" అంది షామిలి. "డాడీకి అరిసెలు, చక్కిలాలూ ఇష్టం. ఈ రోజు స్వగృహ నుంచి అవి తెప్పించు" అన్నాడు వైభవ్.

స్వగృహ నుంచి ఫలహారాలు, హోటల్ నుంచి భోజనమా? వాళ్ళ మాటలు విని బిత్తరపోయింది సీత. తమ ఇంటికి ఏ సమయంలోనైనా, ఎందరొచ్చినా వండి వార్చిన చేతులు తనవి. అత్తయ్యా, తనూ ఏ పండగైనా, పేరంటమైనా పొద్దునైతే అందరూ చూస్తారని, ఆచేతా ఈచేతా ముట్టుకుంటారని రాత్రంతా కూర్చొని ఫలహారాలు వండేవారు. ఏనాడైనా బయట కొని తెచ్చుకున్నారా? రుబ్బురోల్లోనే పచ్చడులు, గారెల పిండి అన్నీ చేసుకునేవారు. కట్టెల పొయ్యి నుంచి, కిరసనాయిలు స్టవ్, గాస్ స్టవ్ వచ్చాయి తమ వంటింట్లో. ఈ రోజు ఇక్కడ ఇన్ని ఆధునికమైన వంట సామానులూ, నిమిషాలల్లో వండేందుకు కావలసినవన్నీ ఉన్నాయి. అయినా ఎప్పుడో తప్ప వండుకోరట. వీటి మీద వంట చేసుకునే సమయం లేదా? బయట నుంచి తెప్పించుకుంటారా? ఆ బయట తిండ్లు తినే ఇలా శరీరాలు అదుపూ ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్నాయి. ఆరోగ్యాలేవి

కావాలి?  అనుకుంటూ ఏదో అనబోయిన సీతను మాట్లాడవద్దన్నట్లు కనుసైగ చేసాడు వేణు.

జాగింగ్‌కు వెళుతున్నాము అని చెప్పి కొడుకూ, కోడలు వెళ్ళారు. ఇంకా తనను మాట్లాడనీయని వేణు మీద కోపంతో మూతి ముడుచుకున్న సీతతో "కాలంతో పాటూ మనమూ మారాలి. వాళ్ళ ఇంట్లో వాళ్ళ ఇష్ట ప్రకారమే ఉండాలి" అంటూ 'పలుకరాదుటే చిలుకా?' అని పాడుతూ సీత చుబుకం పట్టుకొని తన వైపు తిప్పుకున్నాడు వేణు. భర్తను మురిపెంగా చూస్తూ ముచ్చటగా మూతి తిప్పింది సీత.

***

# 43. ఆత్మీయబంధం

"ఈ రోజు వంట మరీ లగుడుమారిగా వుంది" విసుక్కున్నాడు శరత్. కళ్ళల్లో తిరిగే నీళ్ళు కనిపించకుండా తల వంచుకుంది శారద.

"మరీ ఇంత పిచ్చితనమైతే ఎలా శారదా. కొంచెం కంట్రోల్ చేసుకో. రెక్కలు వచ్చిన పక్షులు ఎగిరిపోకుండా గూటిలోనే వుంటాయా? వాళ్ళ బతుకులు వాళ్ళు చూసుకోకుండా నీ దగ్గరే ఉండిపోతారా? దీపూ వెళ్ళినప్పటి నుంచి మరీ పిచ్చిదానివైపోతున్నావు" సున్నితంగా మందలించాడు శరత్.

"అది కాదండి ఇక్కడలేవా అవకాశాలు? ఇక్కడా బోలెడు కంపెనీలున్నాయి. ఉద్యోగాలు దొరుకుతున్నాయి. బాగానే పే చేస్తున్నారు కదా!" గొంతులో దుఃఖం సుళ్ళుతిరుగుండగా అన్నది శారద.

"ఎంతసేపూ అలాగే ఆలోచిస్తావు. వాళ్ళకు అక్కడ భవిష్యత్తు బాగుంటుందని కదా వెళ్ళారు. పిల్లలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేదాకానే మన బాధ్యత. ఆ తరువాత వాళ్ళు అడిగితేనే మనం ఇన్వాల్వ్ అవ్వాలి. మన గురించి కూడా మనం ఆలోచించుకోవాలి కదా! చూడు బొత్తిగా నన్ను పట్టించుకోవటం లేదు. అసలు ఏ పని మీదా ధ్యాస లేకుండా అయ్యావు. బయటకు వెళ్ళటమే మానేసావు. దేని మీదా శ్రద్ధ లేకుండా అయ్యావు. ఇట్లా ఐతే కష్టం" అని లేచి వెళ్ళాడు.

ఏమి చేయాలి? ఎంత ఆపుకుందామనుకున్నా దుఃఖం ఆగటం లేదు. వంట చేద్దామని వంటింట్లోకి వెళుతే ఏది చేయబోయినా పిల్లలు గుర్తొస్తారు. వాళ్ళ కిష్టమైనవని ఎన్ని రకాలు వండేది! ఇప్పుడు అన్ని రకాలు ఎవరు తింటారని ఏదీ వండ బుద్ధి కావటం లేదు. అసలు వంటే చేయాలనిపించక ఏదో వండి పడేస్తోంది. ఇంక ఊరుకోలేక ఈ రోజు

శరత్ మందలించాడు. అదీ నిజమే కదా, ఇంకెన్ని సంవత్సరాలు ఈ దిగులు? అనుకుంటూ మథన పడిపోతోంది శారద.

శరత్ ఆఫీస్‌కెళ్ళిపోయాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. తన హృదయ దర్పణం డైరీ తీసింది. రోజూ శరత్ ఆఫీస్‌కెళ్ళిపోగానే డైరీ తీసి పాతవి చదువుకోవటం కొత్తది వ్రాయటం అలవాటైపోయింది. ఈ రోజు దీపు మరీ మరీ గుర్తొస్తున్నాడు. 'మామ్, మాతాశ్రీ' అంటూ నోటికే పేరొస్తే ఆ పేరుతో పిలుస్తూ వెనకెనకే తిరుగుతూ ఉండేవాడు. "కన్నా ఎంత దూరంలో ఉన్నావు? పిలిస్తే, 'హా మాతే!' అంటూ రాలేవు కదా! నీకు గుర్తుందా, నువ్వు ఫిఫ్త్ క్లాస్‌లో ఉండగా అనుకుంటా స్కూల్‌నుంచి ఎక్స్ కర్షన్‌కు వెళ్ళావు. ముందు అసలు వెళ్ళనని గొడవ చేసావు. డాడీ, ఫ్రెండ్స్ , టీచర్ అందరూ చెప్పగా వెళ్ళావు. వారం రోజులు నీకోసం రోజులు లెక్క పెట్టుకుంటూ ఎదురు చూసాను.

రాగానే నన్ను చుట్టుకుపోయావు. 'అమ్మా రాత్రి పడుకోగానే నువ్వు గుర్తొచ్చి ఎంత ఏడ్చానో! పైకి వినిపిస్తే టీచర్ కోపం చేస్తుందేమో, ఫ్రెండ్స్ నవ్వుతారేమోనని లోపల లోపలే ఏడ్చాను. ఐ మిస్ యు మామ్' అంటూ ఏడ్చేసావు. చిన్నప్పుడు స్కూల్‌కు వెళటానికి కూడా రోజూ ఏడ్పే! జవాన్ సైకిల్ మీద తిరిగి తిరిగి చూస్తూ, ఏడుస్తూ వెళ్ళేవాడివి. నువ్వు కనిపించేవరకూ నిన్నుచూసి, కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళేదానిని. 'రోజూ ఇద్దరూ ఇలా ఏడుపులు పెడితే వాడికి చదువు వచ్చినట్లే. స్కూల్‌కు పంపకుండా నీ చుట్టూ తిప్పుకుంటూ బుద్ధూను చేస్తావా అని డాడీ కోపం చేసేవారు. ఎట్లా ఉంటున్నావు నన్నొదిలి? నాదేముంది, రోజంతా నిన్నూ, అక్కనూ తలుచుకుంటూ వుండటమే కదా...'

రాస్తూ రాస్తూ సోఫాలో పడుకుండిపోయింది శారద.

ఆఫీస్ నుంచి వచ్చిన శరత్ కు శారద సోఫాలో నిద్రపోతూ కనిపించింది. తడిచిన కనురెప్పలు, వాడిపోయిన మొహం చూస్తూ పక్కన వున్న డైరీ తీసాడు. దీపూ కు వ్రాసినది చదివాడు. ముందు పేజీలలో అంతా వ్రాసి వుంది. పేజీ వెనకకు తిప్పి చూసాడు.

"బంగారు తల్లి, ఎలావున్నావురా? స్కూల్‌నుంచి వస్తూనే గలగలా ఆ రోజు బస్ ఎక్కినప్పటి నుంచి జరిగిన సంగతులన్నీ చెప్పేదానివి. పనిలో వుండి వినకపోతే అలిగేదానివి. మళ్ళీ ఆ విశేషాలన్నీ పూసగుచ్చినట్లు తమ్ముడికి, డాడీ కి కూడా చెప్పేదానివి. అసలు నీకు నోరు నొప్పి పుట్టదా అని నవ్వేవాళ్ళము. ఉడుక్కునేదానివి. ఆ అలకంతా ఓ క్షణమే! పెద్దవవుతున్న కొద్దీ ఎన్ని సందేహాలో! నీ సందేహాలు తీర్చటం కష్టమైపోయేది. బాల్కనీ లో కూర్చొని టీ తాగుతూ ఎన్ని కబుర్లో! కాలేజీలో అబ్బాయిలు పేర్లు పెట్టటం, అమ్మాయిలు అబ్బాయిలను ఏడిపించటం, ఒకటా రెండా... అబ్బ ఎన్ని ముచ్చట్లు చెప్పేదానివి! ఏదీ దాచుకోవటం రాదు. ఇంత అమాయకంగా ఎలా బతుకుతావోనని నీ గురించి చాలా దిగులు పడేదానిని. ఏవీ ఆ కబుర్లు? ఇల్లంతా నిశ్శబ్దం. మీ సంగతులు తలుచుకుంటూ, మురిసిపోతూ, దిగులు పడుతూ ఉన్నాను...

డైరీలో అంతా ఇలాగే పిల్లలకు ఉత్తరాలు రాసుకుంది. సాలోచనగా శారదని చూసాడు. చాలా చిక్కిపోయింది. మొహములో ఇది వరకటి ఉషారు లేదు. ఏదో పోగొట్టుకున్నట్లు వుంది. 'ఇలాగే ఉంటే మూలన పడుతుంది, ఏదైనా చేయాలి' అనుకున్నాడు.

ఆ రోజు ఇంటికి వస్తూ శరత్ ఓ ఐదేళ్ళ బాబుని తీసుకొచ్చాడు. ఎవరీ అబ్బాయి అని ప్రశ్నార్థకంగా చూసింది శారద. "ఇతని తల్లి మా ఆఫీస్‌లో అటెండర్‌గా చేస్తుండేది. కొద్దికాలంగా జబ్బుతో బాధపడుతూ, ఈ మధ్యనే చనిపోయింది. బంధువులున్నారు కాని వీడి బాధ్యత

తీసుకోవటానికి ఎవరూ తయారుగా లేరు. మనం పెంచుకుందామని తీసుకొచ్చాను. దత్తతకు కావాలసిన ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసే తీసుకొచ్చాను. ముందు వీడికి అన్నం పెట్టు" అన్నాడు.

శారద ఆ అబ్బాయిని పరిశీలనగా చూసింది. జుట్టు దుబ్బుగా పెరిగిపోయి వుంది. పాత చొక్కా, లాగూ వేసుకొని వున్నాడు. బీదరికం కనిపిస్తోంది. బెదురు బెదురుగా చూస్తున్నాడు. భర్త చేసిన పని శారద కి నచ్చలేదు. అయినా ఏమనక "లోపలి కి రా బాబూ" అన్నది. భయపడుతూ లోపలికి వచ్చాడు.

"భయపడకు. ఆమె ఇక నుంచి నీకు అమ్మ. నేను నాన్నను" అని చెప్పాడు శరత్.

అన్నం పెడుతూ "నీ పేరేమిటి?" అని అడిగింది శారద.

"ఇంతకు ముందు ఏదైనా ఇక నుంచి వీడి పేరు హరీష్. హరీ అని పిలుద్దాము" అన్నాడు శరత్.

"ఈ వయసులో నేను పిల్లలను పెంచగలనా? వీడి బాధ్యత మనం నెరవేర్చగలమా?" అంది శారద.

"ఇప్పుడేమంత వయసొచ్చిందని? వాడేమీ మరీ పసివాడు కాదు. వాడి పనులు వాడు చేసుకోగలడు. అంతగా నీకు చేతగాని రోజు సర్వెంట్ క్వాటర్‌లో చంద్రమ్మ వుండనే వుంది. వాడికి మనము, మనకు వాడు ఆసరా" నచ్చ చెప్పాడు శరత్.

"కానీయండి మీ మాట నేనెప్పుడు కాదన్నాను?" అంది శారద.

అన్నం తినేందుకు బిడియపడుతున్న హరిని బుజ్జగిస్తూ కొసరి

కొసరి తినిపించాడు. ఆ తరువాత బజారుకు తీసికెళ్ళి శుభ్రంగా హేర్‌కట్ చేయించి, కొన్ని జతల బట్టలు కొన్నాడు. ఇంటికి వచ్చాక స్నానం చేయించి కొత్త బట్టలు తొడిగాడు. మంచి హేర్‌కట్‌తో, కొత్త బట్టలలో శుభ్రంగా వున్నాడు. అంతా ప్రేక్షకురాలిలా గమనిస్తోంది శారద. రాత్రి పిల్లల గదిలో పడుకోబెట్టాడు శరత్.

ఓ రాత్రి పూట ఏవో చిన్న చప్పుళ్ళు వినిపిస్తుంటే లేచి చూసింది శారద. పక్కన శరత్ గాఢనిద్రలో వున్నాడు. చిన్నగా లేచి పిల్లల గదిలోకి చూసింది. భయపడ్డ పిల్లికూనలా మంచం మధ్యలో ముడుచుకొని పడుకొని చిన్నగా వెక్కుతున్నాడు హరి. వాడిని అలా చూడగానే జాలి వేసి వెళ్ళి వాడి పక్కన పడుకుంది. వాడి తల నిమురుతూ దగ్గరకు తీసుకుంది. వాడి మీద చేయి వేసింది. అమ్మ ఒడిలా అనిపించిందేమో, ఆమె దగ్గరకు జరిగి పడుకున్నాడు. దగ్గరకు పొదువుకుంది. అలాగే ఇద్దరూనిద్రపోయారు. పొద్దున్నే శరత్ వాళ్ళను అలా చూసి, 'అమ్మయ్య' అని నిశ్చింతగా నిట్టుర్చాడు.

పిల్లలు శ్రావణి, దీపక్‌ల కు కాల్‌చేసి "మా ఆఫీస్ అటెండర్ చనిపోతే, ఎవరూ లేరని ఆమె కొడుకును దత్తతకు తీసుకున్నాను. నిన్న ఇంటికి తీసుకొచ్చాను" అని చెప్పాడు శరత్.

పిల్లలు, "మీ ఇష్టం డాడీ! మీరేమి చేసినా ఆలోచించే చేస్తారు కదా మాకేమీ అభ్యంతరం లేదు" అన్నారు.

ఉదయం లేవగానే "హరీ" అంటూ ఆప్యాయంగా పిలిచాడు శరత్.

తనను కాదన్నట్లు ఎటో చూస్తూ నిలబడ్డాడు హరి.

దగ్గరగా వెళ్ళి తలమీద ప్రేమగా చేయి వేసి "హరీ నిన్ను ఈ రోజు స్కూల్‌లో చేరుస్తాను. వెళతావా స్కూల్‌కు?" అని అడిగాడు శరత్.

వెళతానన్నట్లు తలవూపాడు హరీ.

"శారదా నువ్వు కూడా రా. వీడికి స్కూల్ అలవాటయ్యే వరకు నువ్వు రోజూ లంచ్ బాక్స్ తీసుకెళుదువు గాని" అన్నాడు.

ప్రిన్సిపల్‌తో మాట్లాడి స్కూల్‌లో మొదటి తరగతిలో చేర్చాడు. కొన్ని రోజులు శారద మధ్యాహ్నం వచ్చి లంచ్ తినిపించేట్లుగా పర్మిషన్ తీసుకున్నారు.

ఆరోజు లంచ్ బాక్స్ తీసుకెళ్ళిన శారద కు, హరి ఓ చెట్టు కింద ఒంటరిగా కూర్చొని కనిపించాడు. దగ్గరకు వెళ్ళి "ఇలా ఒక్కడివే కూర్చున్నావేమిటి? ఎవరూ స్నేహితులు కాలేదా?" అని అడిగింది. మాట్లాడకుండా తల అడ్డంగా వూపాడు హరి. వాడికి కబుర్లు చెపుతూ అన్నం తినిపించింది.

రెండు మూడు రోజులుగా గమనించింది. ఇంట్లోనూ ఎవరితో మాట్లాడడు. పిలిస్తే పలకడు. ఓ పక్కగా కూర్చొని వుంటాడు. ఏమిచేయాలో తోచటం లేదు శారదకు. శరత్ తో చెప్పింది. కొత్త కదా అలవాటుపడతాడులే అంటాడు. తను ఇంట్లో ఉన్నంత సేపూ హరి బదులిచ్చినా లేకపోయినా ఎవో కబుర్లు చెపుతుంటాడు.

శారద కూడా వీలైనంతగా హరితోనే సమయం గడుపుతూవుంటుంది. స్కూల్‌నుంచి రాగానే వాడికి కావలసినవి అడిగి అడిగి మరీ చేసి పెడుతుంది. రాత్రి వాడి దగ్గరే పడుకొని కబుర్లు, కథలు చెపుతూ వుంటుంది. ఐనా వాడిలో బిడియం తగ్గలేదు.

హరిని నిద్రలేపి, బాత్ రూం లోకి పంపి, వంటింట్లోకి వెళ్ళి పాలగ్లాస్ తీసుకొని వచ్చింది శారద. హరి రూంలో ఎక్కడా కనిపించలేదు. ఇల్లంతా వెతికింది. వెనుక మెట్ల మీద దిగులుగా కూర్చొని వున్నాడు. వాడి పక్కన

కూర్చొని తల నిమిరింది. "ఎందుకమ్మా ఇక్కడ కూర్చున్నావు ?" లాలనగా అడిగింది.

"అమ్మ... అమ్మ" అని వెక్కి వెక్కి ఏడ్చాడు.

"అమ్మను దేముడు తీసుకెళ్ళాడుగా! నీకు తోడుగా వుండమని అమ్మ నన్ను, నాన్నను పంపింది. అలా ఏడవకూడదు. గుడ్‌బాయ్. ఈ పాలు తాగేసి స్కూల్‌కు తయారవ్వాలి. టైమయిపోతోంది మరి" బుజ్జగించి పాలు తాగించింది.

ఇంకా ఎట్లా వాడిని మచ్చిక చేసుకోవాలి అని దిగులుపడుతూ వుంటుంది. 'కొంచెం ఓపిక పట్టు' అంటాడు శరత్. ముందు హరిని పెంచుకోవటానికి అయిష్టత చూపించినా, వాడిని ప్రేమగా చూసుకుంటూ కొద్ది కొద్దిగా తన దిగులును మర్చిపోతున్న శారదను చూసి సంతోషిస్తున్నాడు శరత్.

బయట పిల్లలతో ఆడుకుంటూ ఉంటే అయినా దారిలో పడతాడేమోనని ఓ రోజు పార్క్ కు తీసుకెళ్ళింది. అక్కడా ఓ బెంచీ మీద కూర్చున్నాడే కాని ఎవరితోనూ కలవలేదు. ఇలా కాదని మరునాడు పార్క్ లో తనే పిల్లలందరినీ కూడేసి ఆడించింది. దీపూని తిప్పినట్లు వీడినీ తిప్పాలేమో అనుకొని నవ్వుకొంది. ఓ ఆదివారం లారెల్ అండ్ హార్డీ సినిమాకు తీసుకెళ్ళింది. లారెల్ అండ్ హార్డీ చేష్టలకు హరి పకపకా నవ్వటం చూసి అమ్మయ్య కొంచెం  కదలిక వచ్చింది అనుకొంది. తనతోపాటు లైబ్రరీ కి తీసుకెళ్ళి,  కార్టూన్ పుస్తకాలు ఇప్పించింది. వాటిని చదివించి, ఆ కథ చెప్పమనేది.

తమతో పాటు చుట్టాల ఇళ్ళకు ఫంక్షన్స్ కు తీసుకెళ్ళేవారు. అందరికీ మా పెంపుడు కొడుకు అని పరిచయం చేసేవారు. ఇద్దరు

పిల్లలుండగా ఈ వయసులో పిల్లవాడిని పెంచుకోవటమేమిటని ఎవరైనా అడిగినా నవ్వేసేవాడు శరత్.

ఇప్పటికి వాడు వచ్చి ఆరునెలలైంది. ఇంకా వాడు ముడుచుకొనే వున్నాడు. 'అమ్మగారు కాదు, సార్ కాదు అమ్మా, నాన్నా అనరా' అని పదేపదే చెప్పాల్సి వస్తోంది. ఇంకా ఎలా వాడి బెదురు పోగొట్టటం అని మథన పడుతోంది శారద. కొన్ని సార్లు విసుగు కూడా వస్తోంది. అదృష్టం చదువులో చురుకుగానే ఉన్నాడనుకొంది.

పడుకొని నవల చదువుకుంటోంది శారద. నవలలో లీనమైపోయిన శారదకు చిన్నగా చప్పుడు వినిపించింది. కాని పట్టించుకోలేదు. ఆ వెంటనే "అమ్మా" అని పిలుపు వినిపించింది. గబుక్కున తలెత్తి చూసింది. ఎదురుగా హరి నిలబడి ఉన్నాడు. శారద తలెత్తి చూడగానే, "అమ్మా ఆకలేస్తోంది" అన్నాడు.

చటుక్కున లేచి కూర్చొని సంతోషంగా వాడిని దగ్గరకు తీసుకొంది.

"ఏం చేసి పెట్టను నాన్నా?"

"పూరీ" అన్నాడు. గబగబా వాడికి పూరీ చేసి పెట్టి, శరత్‌కు కాల్‌చేసి, "ఈ రోజు హరి నన్ను అమ్మా అని పిలిచాడండి. ఆకలేస్తోంది, పూరీ చేసి పెట్టమన్నాడు" ఉద్వేగంగా చెప్పింది. "వెరీ గుడ్. అమ్మయ్య ప్రాబ్లం సాల్వ్ అయ్యింది" అని సంతోషించాడు శరత్.

ఆ క్షణం నుంచి శారదకు రోజులెలా గడిచిపోతున్నాయో తెలీదు. పొద్దున్నే హరిని లేపి తయారు చేసి, బ్రేక్ ఫాస్ట్ పెట్టి లంచ్ బాక్స్ ఇచ్చి, స్కూల్‌బస్ ఎక్కించిన తరువాతనే శరత్ పని. దీపూ, శ్రావణి ఫోన్ చేసినా సగం పైగా హరి ముచ్చట్లే! శరత్, శ్రావణి, దీపక్‌లు శారద పిల్లల నుంచి ధ్యాస మళ్ళించుకొని హరితో బిజీ కావటంతో హాయిగా ఊపిరి

పీల్చుకుంటున్నారు. రోజులు చకచకా గడిచిపోతున్నాయి.

"ఇంక ఎన్నేళ్ళు ఉద్యోగం చేస్తారు? హరిది కూడా ఈ సంవత్సరముతో ఇంజనీరింగ్ అయిపోతుంది. మొన్న వాడికి చెప్పాను, జి.ఆర్.ఈ, టోఫెల్ టెస్ట్ లు వ్రాయమని. ముగ్గురూ ఇక్కడకి వచ్చేయండి డాడీ. మా దగ్గరే సెటిలైపోదురు" అని పిలుస్తున్నాడు దీపు. ఉద్యోగం చేసే ఓపికైపోయింది మానేద్దామని అనుకుంటునే ఉన్నాడు కాని అక్కడికి వెళ్ళి ఉండే ఉద్దేశ్యం లేదు శరత్ కు. ఆవాతావరణంలో తాము ఇమడలేరు.

హరి కూడా అమెరికా వెళ్ళిపోతాడా? హరి వచ్చిన ఈ పదిహేనేళ్ళలో తమలో శారీరకంగా, మానసికంగా చాలా మార్పు వచ్చింది. ఏపని చేసుకుందామన్నా ఓపిక వుండటం లేదు. చాలా వరకు బయట పనులన్నీ హరే చేస్తున్నాడు. ఇంటి పనులల్లో కూడా వెంటవెంట ఉంటూ అన్నీ అందుకుంటున్నాడు. ఎంత పనివాళ్ళను పెట్టుకున్నా శ్రద్ధగా చేస్తారా? కొన్ని సార్లు మాట కూడా వినరు. పోనీ వృద్ధాశ్రమంలో ఉండటమంటే, ఆ మాట తలుచుకుంటేనే దుఃఖం వస్తోంది. ఎంతైనా స్వంత ఇంట్లో వున్నంత స్వతంత్రం వుండదుకదా! ఇప్పుడు ఈ వయసులో, చేతకాకుండా ఇద్దరూ ఎలా వుంటారు అని చింత మొదలైంది శారదకు.

"అప్పుడు నువ్వున్న పరిస్థితులలో నీకో వ్యాపకం అవసరమని వాడిని తీసుకొచ్చాను. సహజంగా నీకు పిల్లలంటే ఉండే ఇష్టంతో వాడికీ నీకూ ఆత్మీయబంధం ఏర్పడింది. అలా అని వాడి భవిష్యత్తు చూసుకోవద్దని అనలేము కదా! చూద్దాం ఏమవుతుందో" అంటాడు శరత్.

ఆ రోజు రాత్రి విపరీతమైన కడుపునొప్పి వచ్చింది శారదకు. నొప్పికి తట్టుకోలేక ఉండలు చుట్టుకుపోతోంది. హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. ఎపండిసైటిస్, ఎమర్జెన్సీ ఆపరేషన్ చేయాలన్నాడు డాక్టర్. పిల్లలకు

తెలిపి, వాళ్ళు వచ్చే వ్యవధిలేదు. ఏమి చేయాలో తోచలేదు శరత్‌కు. స్తబ్దుగా కూర్చుండిపోయాడు. హరే డాక్టర్‌తో మాట్లాడి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేసాడు. ఆపరేషన్ సకాలంలో చేయటంతో విజయవంతమైంది.

ఆ వెంటనే హరి దీపుకు, శ్రావణికి ఫోన్ చేసి సంగతి చెప్పాడు. ఇద్దరూ చాలా గాభరా పడిపోయారు. వాళ్ళకు టికెట్లు దొరికి వచ్చేసరికి రెండు రోజులైంది. ఈ రెండు రోజులూ ఆపరేషన్ అయిన తల్లిని, డీలాపడి వున్న తండ్రిని కంటికి రెప్పలా చూసుకున్నాడు హరి.

తమతో రమ్మని అమ్మానాన్నలను అడిగాడు దీపు. ఇప్పుడు ప్రయాణం చేసే ఓపిక లేదని వీలున్నప్పుడు వాళ్ళనే వచ్చి చూసి పొమ్మన్నాడు శరత్. వాళ్ళే వచ్చి ఉందామంటే వాళ్ళ పిల్లలు పెద్ద తరగతులకు వచ్చారు. అక్కడి ఎడ్యుకేషన్ సిస్టంకు, అక్కడి వాతావరణానికి అలవాటు పడ్డారు. ఇక్కడకొచ్చి ఉండలేరు. వాళ్ళ చదువులకు అంతరాయం కలిగించలేరు. ఏదీ చేయలేని పరిస్థితి. నెమ్మదిగా శారద కోలుకున్న తరువాత బాధగా వెళ్ళిపోయారు.

తను రిటైరైపోయినా, తమ సంస్థలో మంచి పదవి ఇచ్చి తనను ఇన్ని సంవత్సరాలూ అభిమానంగా, గౌరవంగా చూసుకున్న వారితో ఇంక పని చేసే ఓపిక లేదని చెప్పి, శరత్ పదవీవిరమణ చేసి, స్నేహితులతో పుస్తకాలతో కాలం గడుపుతున్నాడు. చూస్తుండగానే హరి ఇంజనీరింగ్ అయిపోయింది. ఓ రోజు వాడిని పిలిచి, "దీపూ అన్నయ్య రమ్మంటున్నాడు. మాకు అక్కడ సెటిల్ అయ్యే ఆలోచనలేదు. మేము ఇక్కడే వుంటాము. నీకు వెళ్ళాలని వుంటే చెప్పు, ఏర్పాట్లు చేస్తాను" అన్నాడు.

హరి ఏమి చెపుతాడా అని చూస్తోంది శారద. శారద దగ్గరకు వచ్చి నడుము చుట్టూ చేతులు వేసి, భుజం మీద తలానించి "నేను అమ్మను,

మిమ్మల్ని వదిలి ఎక్కడికీ పోను. అన్నయ్య వ్రాయమన్నాడని జి.ఆర్.ఈ, టోఫెల్ వ్రాసాను కాని నాకు ఇష్టం లేదు. గేట్ కూడా వ్రాసాను. మంచి రాంక్ వస్తే ఇక్కడే యం. టెక్‌లో చేరుతాను. యం.టెక్‌లో రాకపోతే, కాంపస్ ఇంటర్వ్యూలో వచ్చింది కదా ఆ జాబ్ లో చేరుతాను" అన్నాడు. "మా కోసం అని నీ భవిష్యత్తు పాడు చేసుకోకు హరీ" అంది శారద.

"లేదమ్మా. మీరెక్కడుంటే నేనూ అక్కడే. నేనెక్కడుంటే మీరు అక్కడే. మిమ్మల్ని, ఇండియాను వదిలి నేను వెళ్ళను" అన్నాడు హరి.

"ఇప్పుడు నీకు ఉండాలనే అనిపిస్తుంది. కాని ముందు ముందు నీ ఫ్రెండ్స్ అంతా స్టేట్స్ లో బాగా సంపాదిస్తూ ఉంటే నువ్వు ఫీలవుతావేమో. అప్పుడు వెళదామన్నా అవకాశాలు రావు కదా? ఆలోచించుకో" అన్నాడు శరత్.

"నాన్నా ఎక్కడో గాలిలో, ధూళిలో దిక్కులేకుండా కలిసిపోవలసిన నన్ను చేరదీసారు. మీ నీడలో హాయిగా పెరిగి ఇంతవాడినైనాను. ఇది నేను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఇంత అదృష్టం పట్టింది. ఈ అదృష్టం నాకు చాలు. ఇంతకు మించి నేనేమీ కోరుకోను. నన్ను మీ నీడలోనే ఉండనీయండి నాన్నా" అన్నాడు హరి.

"నీకు మా దగ్గర ఉండటం ఇష్టం కావచ్చు కాని రేపు నీ భార్య ఒప్పుకోకపోవచ్చు. ఆమెకు విడిగా ఉండాలనిపించవచ్చుకదా" అంది శారద.

"ఇక్కడ మీదగ్గర వుండటానికి ఒప్పుకునే అమ్మాయినే పెళ్ళి చేసుకుంటానమ్మా" అంటూ నవ్వాడు హరి.

"అదృష్టం నీది కాదురా, మాది. ఈ వయసులో స్టేట్స్ కు వెళ్ళి, అక్కడ ఇమడలేక, ఇక్కడ ఉండి పిల్లలను బాధ పెట్టకుండా, భగవంతుడు

మాకో ఆత్మీయబంధం వేసాడు" అంటూ హరిని దగ్గరకు తీసుకొని ముద్దాడింది శారద.

"ఈ బంధం వేసింది నాన్న... అమ్మా!" అంటూ నాన్న పక్కన చేరాడు హరి.

***

**(19-25 జనవరి 2015, జాగృతి వారపత్రిక)**

# 44. వాలుచూపుల వయ్యారి!

"ఆపండి... ఆపండీ" అంటూ పరిగెత్తుకొస్తున్న అమ్మాయిని చూసి, బస్ ఆపాడు కండెక్టర్. తలుపు దగ్గర నిలబడి ఉన్న హరి, ఆ అమ్మాయికి చేయి అందించాడు. కాలువ దాటి వచ్చిన ఆ అమ్మాయి, ఓసారి అతని వైపు వాలుగా చూసి, హరి చేతిని సుతారంగా అందుకొని, బస్ ఎక్కింది.

"ఏం రాధమ్మా, తోట నుంచి వస్తున్నావా?" అడిగాడు బస్‌లోని ఓ పెద్దాయన.

"అవును తాతా." జవాబిచ్చింది రాధ.

పల్లెటూరి అమ్మాయిలంటే లంగావోణీలతో ముద్దబంతిపూవులా ఉంటారు అనుకునేవాడు. కానీ ఈ అమ్మాయి పంజాబీ డ్రెస్‌లో నాజుకుగా సన్నజాజిమొగ్గలా ఉంది. మాట్లాడుతుంటే కోయిల పాటలా ఉంది అనుకుంటూ రాధ వైపు క్రీగంట చూసాడు. తననే వాలుచూపులు చూస్తున్న ఆ వయ్యారి రాధమ్మకు ఫిదా ఐపోయాడు హరి.

కళ్యాణ్ పెళ్ళిలో, అతని వెనకెనుకే తిరుగుతూ చాలా ఆక్టివ్ గా ఉన్న రాధ, కళ్యాణ్ బాబాయి కూతురని తెలియటంతో చాలా సంబరపడిపోయాడు.

"మా బాబాయి రాధకు ఆరు సంవత్సరాల వయసులోనే పోయాడు. అప్పటి నుంచి పిన్ని రాధను కంటికి రెప్పలా పెంచుకుంది. దాన్ని వదిలి ఉండలేక ఊళ్ళోనే హైస్కూల్‌లో, పక్క ఊళ్ళో ఉన్న కాలేజీలో చదివించింది. ఇద్దరికీ అటాచ్మెంట్ ఎక్కువ. వదిలి ఉండలేరు." అన్నాడు కళ్యాణ్.

"ఫరవాలేదు. అత్తయ్యగారు మాతోపాటే ఉంటారు. నో ప్రాబ్లం."

అని అప్పటికప్పుడే వరుస కలిపేసి మాటిచ్చేసాడు. మాట, మనసు ఇచ్చేసాక ఇక ఆలస్యం ఎందుకు? ఫెళ్ళున పెళ్ళైపోయింది. ఆ వెంటనే ఊటీకి హనీమూన్ వెళ్ళేందుకు టికెట్స్ కూడా కొనేసాడు.

"హరిగారూ, హరిగారూ! మా అమ్మను కూడా తీసుకెళుదామండీ." గోముగా అడిగింది. 'ఓసి తింగరిబుచ్చీ, హనీమూన్‌కు అమ్మను తీసుకెళ్ళరే' అని మనసులోనే తల కొట్టుకొని, మాట మరిపించి రాధతోనే ఊటీలో వాలాడు.

ఆడుతూ పాడుతూ ఓ రోజు గడిచిపోయింది. మరునాడు పొద్దున లేవగానే జుట్టు విరబోసుకొని, నైటీతో విచారంగా కూర్చున్న రాధను చూసి గాభరాపడి "ఏమైంది బంగారూ?" అడిగాడు.

"అమ్మ గుర్తొస్తోంది. ఊరికి వెళ్ళిపోదామండీ" కళ్ళనిండా నీళ్ళతో అంది రాధ.

"నా రాణీవి కదూ! నిన్ననేగా వచ్చాము. వారం రోజులకు అన్నీ అరేంజ్ చేసుకున్నాము కదా. సరదాగా ఎంజాయ్ చేసి వెళుదాము." బుజ్జగించాడు.

'బుజ్జి, కన్నా, తల్లీ!' అని ముద్దుముద్దుగా బతిమిలాడగా బతిమిలాడగా లేచి తయారయ్యింది. బ్రేక్‌ఫాస్ట్ తినిపించటం ఒక ప్రహసనం ఐపోయింది. కోరి చేసుకున్న గారాల భార్యను ఏమీ అనలేడు. భోజనము కూడా సరిగ్గా చేయలేదు. 'వెళ్ళిపోదామూ వెళ్ళిపోదామూ' అంటూ ఒకటే పాట! అమ్మో రెండో రోజుకే కళ్ళల్లో ప్రాణాలొచ్చేసాయి. ఇలాగే ఉంటే ఇంకేమైనా ఉందా అసలుకే అత్తయ్యగారు మేము వస్తుంటే దేవకన్యను ఎత్తుకుపోతున్న రాక్షసుడిలా నన్ను చూసారు. అప్పుడు అమ్మా, కూతురు కళ్ళు తుడుచుకుంటుంటే ఎప్పుడూ వదిలి ఉండక

బెంగేమో అనుకున్నాడు కాని ఇంత గాఢమైన సీనుందని తెలీలేదు. బాబోయ్ అని హడలిపోయి, ఓ ట్రావెలర్ చేతులూ గడ్డం పట్టుకొని టికెట్ సంపాదించాడు.

ఇంటికి చేరగానే అమ్మను వాటేసుకొని ఓసారి భోరుమని, ఆ తరువాత కిలకిలా నవ్వేసింది రాధమ్మ. ప్రేమయాత్రలో ప్రేమ ఏమోకాని ఏడ్చేపెళ్ళాన్ని, పుట్టబోయే పిల్లలను బతిమిలాడే అనుభవం సంపాదించేసాడు. అమ్మయ్య!

అత్తయ్యగారు ప్రేమారగా రకరకాల వంటలు చేసి కొసరికొసరి వడ్డిస్తే కడుపారా తిని భుక్తాయసంతో కూర్చున్న హరితో, "సన్నజాజి పందిరి కింద పక్క వేయించాను. రండి హరిగారూ" అని చేయి పెట్టుకొని, వాలుగాచూస్తూ వయ్యారంగా తీసుకెళ్ళింది రాధ. పుచ్చపువ్వులా ఉన్న వెన్నెలలో, పందిరి నిండా విచ్చుకొని సువాసనలు వెదజల్లుతున్న సన్నజాజుల పరిమళం, తెల్లని పక్క మనోహరంగా ఉంది.

"కాశ్మీరు లోయలో కన్యాకుమారితో" అని హనీమూన్ చేసుకుందామనుకున్నాను. వెధవ టెరరిస్ట్ ల గోలతో ఆ చాన్స్ పోయింది. పోనీలే ఊటీలో ఝూమ్మంటూ తిరుగుదామనుకుంటే చివరకు "సన్నజాజి పందిరి కిందా" అని పాడుకోవలసి వచ్చింది విరక్తిగా అనుకున్నాడు పాపం హరి!

**(ఫేస్‌బుక్‌లోని ఓ సాహితీసమూహంలో చిట్టి కథ రాయమన్నప్పుడు, ఓసారి మా స్నేహితులము పెళ్ళైన కొత్తల్లో ఏమండీకి భయపడుతూ, అమ్మను తలుచుకొని ఏడుస్తూ ఎంత అమాయకంగా ఉండేవాళ్ళమో కదా అని తలుచుకొని నవ్వుకున్నది గుర్తొచ్చి ఈ చిట్టికథ రాసాను)**

***

# 45. మంచు తుఫాన్‌లో బామ్మా, మనవరాలు!

అలారం చప్పుడుకు చిన్నగా కళ్ళు తెరిచి, సెల్ ఆఫ్ చేయబోయింది కాళింది. అంతలోనే, 'అమ్మో ఈ రోజు కస్టమర్ కాల్, ఆ తరువాత వరుసగా మీటింగ్స్ ఉన్నాయి. ఇప్పుడు లేవక పోతే అత్తగారికి, ఆద్యకు వంటచేసి ఉంచలేదు. అసలు ఇప్పటికే బామ్మామనవరాళ్ళిద్దరూ లేచి వంటింట్లో వెతుక్కుంటున్నారేమో...' అనుకుంటూ, కంఫర్టర్ జరిపి లేచింది. పక్కన సౌరభ్ మంచి నిద్రలో ఉన్నాడు. కాళింది ఫ్రెషప్ అయ్యి కిందికి వెళ్ళింది. కాఫీ కలుపుకొని కిటికీ దగ్గరకు కుర్చీ జరుపుకొని కూర్చుంది. బయట ఇంకా మబ్బు మబ్బుగానే ఉంది. స్ట్రీట్‌లైట్ వెలుగులో తెల్లగా, చిన్నచిన్న తుంపరలుగా పడుతున్న మంచు మెరుస్తూ కనిపిస్తోంది. కిటికీ గ్లాస్‌డోర్‌లో నుంచి బయటకు చూసింది. ఆ చిరుచీకటిలో, స్ట్రీట్‌లైట్ వెలుగులో రోడ్ అంతా తెల్లగా కనిపిస్తోంది. సన్నగా పడుతున్న మంచు బిందువులు మల్లెల వాన కురిపిస్తున్నట్లుగా ఉన్నాయి. 'మంచు కురిసేవేళలో మల్లె విరిసేనెందుకో' అని కూనిరాగం తీస్తూ వెచ్చని కాఫీని ఆస్వాదిస్తోంది.

"ఆ... ఆ... మల్లెలే కురుస్తున్నాయి. సాయంత్రం నుంచి రెండురోజులు స్నో స్టార్మ్ ఉంది ఇంక అప్పుడేమి కురుస్తాయో" అన్నాడు సౌరభ్ కాఫీ కలుపుకుంటూ.

"ఏంటి సౌరభ్ కాస్త పాటైనా పాడుకోనీయవు?" అని గుణిసింది గారాబంగా కాళింది.

"సరే సరే తల్లీ నీ ఇష్టం ఎన్ని పాటలైనా పాడుకో. నేను ఈ తుఫాన్ తగ్గే వరకూ హోటల్‌లో ఉంటాను చెప్పానుగా? వీళ్ళిద్దరూ ఇంకా

లేవలేదా?" అడిగాడు.

"రాత్రంతా పాటలూ డాన్స్ లు చేసుకుంటూ ఉన్నారు. ఇక అప్పుడే లేస్తారా?" అంటూ ఓసారి అత్తగారి గదిలోకి తొంగి చూసింది. బామ్మా మనవరాళ్ళిద్దరూ హాయిగా నిద్రలో ఉన్నారు. ఆద్య బామ్మ పక్కన ఎక్కడ ముడుచుకొని ఉందో కనిపించలేదు. 'ఆద్యను విడిగా పడుకోనీయండి దాని రూం లో' అంటే ఇద్దరిలో ఎవరూ తన మాట వినరు. 'నేను ఇక్కడున్నన్ని రోజులూ నా దగ్గరే పడుకోనీయి' అన్నారు అత్తగారు. ఆద్య కూడా రాదు. 'బామ్మా బామ్మా' అంటూ ఆవిడతోనే ఉంటుంది. ఓసారి వాళ్ళ వైపు చూసి వంటగదిలోకి వెళ్ళింది. సౌరభ్ కాఫీ తీసుకొని పైకి వెళ్ళినట్లున్నాడు.

కొద్దిసేపు తరువాత సురభి, వెనకాలే మూడేళ్ళ ఆద్య వచ్చారు.

వాళ్ళను చూస్తూనే "ఆంటీ, మైక్రోవేవ్ లో ఇడ్లీ ఉన్నాయి. మీరు తినేయండి. నాకిప్పుడు అరగంటలో కస్టమర్ కాల్ ఉంది. అదయ్యాక వచ్చి వంట చేస్తాను. ఆద్యా, ఇదో ఈ పాలు తాగేసి అల్లరి చేయకుండా ఆడుకో" అంది కాళింది.

సౌరభ్ ట్రావెల్ సూట్కేస్‌తో వచ్చి తల్లిని చూసి, "అమ్మా బయట ఊళ్ళో ఉన్న మా టీం వాళ్ళను నలుగురిని పిలిచాను. వాళ్ళు హోటల్‌లో ఉన్నారు. సాయంత్రం నుంచి రెండురోజులు స్నో స్టార్మ్ ఉంది. బయటకు వెళ్ళలేము. అందుకని నేను కూడా హోటల్‌లోనే ఉంటాను. నువ్వూ నీ మనవరాలూ అల్లరి చేయకుండా కాస్త బుద్ధిగా, జాగ్రత్తగా ఉండండి. ఏదైనా అవసరమైతే కాళింది చూసుకుంటుంది" అన్నాడు.

"అంటే బయటకు వెళ్ళలేమా?" అంటూ బయటకు చూసింది సురభి. బయట సన్నగా మంచు తుంపరలు పడుతున్నాయి. "మంచేమీ

ఎక్కువగా లేదు కదరా? బయటకు వెళ్ళ వచ్చేమో. ఓసారి బయటకు వెళ్ళి మంచు పట్టుకోనా?" చిన్నపిల్లలా సంబరపడుతూ అడిగింది.

"అవునా, ఎక్కువగా లేదా? అయితే ఓసారి బయటకు వెళ్ళిరా" అన్నాడు సౌరభ్ ఇడ్లీ తింటూ.

సురభి తలుపు దగ్గరకు వెళ్ళి తీయబోయింది. తెరుచుకోలేదు. గట్టిగా ఉంది. తలుపుకు ఉన్న గ్లాస్‌లో నుంచి ముందుకు వంగి చూసింది. తలుపు ముందు వరకూ మంచు తెల్లగా ఉంది. ఇంటి ముందు రోడ్ అసలు కనిపించటం లేదు. అంతా తెల్లగా మంచు పరుచుకొని ఉంది.

"ఇదేమిట్రా తలుపు తెరుచుకోవటము లేదు. నువ్వెట్లా వెళతావు? గ్యారేజ్ ముందు కూడా అంతా మంచు ఉంది"అంది గాభరాగా.

"తెలిసింది కదా?" నవ్వుతూ అని, "ఇప్పుడు అస్సలు బయటకు వెళ్ళలేమమ్మా. బయటకు వెళితే ఫ్రీజ్ అవుతాము. కనుగుడ్లు దెబ్బ తింటాయి. నువ్వు కష్టపడి తలుపు తీసి బయటకు వెళ్ళాలని చూడకు" అన్నాడు.

"మరి నువ్వెట్లా వెళుతావు?" అని అడుగుతుండగానే బయట ఏదో నీడ కదిలినట్లనిపిస్తే అటు చూసింది. మనిషి కనిపించకుండా వంటినిండా నల్లటి బట్టలు, తలకు పెద్ద నల్లటి మంకీ కాప్, కళ్ళకు పెద్దపెద్ద కళ్ళద్దాలు పెట్టుకున్న ఒకతను పెద్ద ఆయుధం లాంటిది ఏదో పట్టుకొని వరండా ఎక్కుతున్నాడు. అతన్ని చూడగానే ఒక్క క్షణం మంచులో ఉన్నట్లు బిగుసుకుపోయింది. నోట మాటరాలేదు. గబగబా సౌరభ్ దగ్గరకు వచ్చి "ఎవరో సినిమాలో చూపించే హంతకుడులాంటి వాడు వచ్చాడురా" అంది గుసగుసగా.

"హంతకుడా?" అని సౌరభ్ బిత్తరబోయి గబగబా తలుపు దగ్గరికి

వచ్చి చూసాడు. అక్కడ క్లీనర్ తలుపు దగ్గర, వరండాలో ఉన్న మంచును పెద్ద పారలాంటి దానితో జరిపి కిందకు, పక్కకు వేస్తున్నాడు.

సౌరభ్ వెనకాలే, "వద్దురా అటు వెళ్ళకు. పోలీస్‌కు ఫోన్ చేయి" అంటూ గాభరాగా వచ్చిన సురభితో "అతను కిల్లర్ కాదు. క్లీనర్" అని నవ్వాడు.

ఇంతలోనే 'డబ్ డబ్' అని చప్పుడు చేసుకుంటూ ఓ పెద్ద బుల్డోజర్ లాంటి వెహికిల్ వచ్చి, ఇంటి ముందున్న మంచును ఎత్తి పక్కకు వేస్తుంటే, వాళ్ళను వింతగా చూస్తూ "అబ్బా గుండె దడదడలాడిపోయింది. ఏమిటిరా మరీ అట్లా బందిపోటులా అంత ముసుగేసుకొని వచ్చారు. మున్సిపాలిటీ వాళ్ళా? మన దగ్గర చెత్త తీయటానికి వస్తారు. అట్లా వచ్చారా?" కుతూహలంగా అడిగింది సురభి.

"మున్సిపాలిటీ వాళ్ళు కాదు. మనము డబ్బులు ఇచ్చి పిలిపిస్తాము. ప్రతినెలా 500 డాలర్‌లు కడతాము. అతను నీకు బందిపోటు, హంతకుడిలా కనిపించాడా? మరి అంత కవర్ చేసుకోకపోతే ఈ మంచులో ఎట్లా వస్తాడు? " అన్నాడు సౌరభ్.

"అంటే మంచు కాలం కాకపోయినా, మంచు పడకపోయినా కడతావా?" అడిగింది సురభి.

"మంచు లేకపోయినప్పుడు, ఇంటి చుట్టూ గడ్డి తీసి, క్లీన్ చేయటమూ అదే లాన్ మూవింగ్ అవీ చేస్తారు. సంవత్సరమంతా ఏదో ఒక మేంటెనెన్స్ ఉంటుంది కదా! అన్నీ వాళ్ళే చేస్తారు. కొంత మంది ఒక ప్రైవేట్ అసోషియేషన్ లా ఉండి ఇవన్నీ చేస్తారు." అని తల్లికి వివరంగా చెప్పి, "గ్యారేజ్ ముందు క్లీన్ చేసారు కదా. ఇంక నేను వెళుతానమ్మా" అని చెప్పి వెళ్ళాడు సౌరభ్.

సౌరభ్ కార్ తీసి వెళ్ళాక, కాసేపు బయటవాళ్ళు చేస్తున్నది చూసి లోపలికి వచ్చింది సురభి.

కాల్ అయ్యాక వచ్చి వంటచేద్దామనుకుంది కానీ మళ్ళీ ఆ తరువాత మీటింగ్ లతో ఎంత టైం తీసుకుంటుందో వంట చేసి వెళితే ఓపనైపోతుంది అనుకొని తల్లీకొడుకుల సంభాషణ వింటూనే గబగబా వంట చేస్తోంది కాళింది.

కాళిందితో, "అయ్యబాబోయ్, ఇంటి ముందు క్లీన్ చేయటానికి నెలకు దాదాపు 25000 ఇస్తారన్నమాట" ఆశ్చర్యంగా అంది సురభి.

"ఇవ్వకపోతే మరి ఎవరు తీస్తారదంతా? అయినా మీరట్లా అన్నీ రూపాయల్లోకి మార్చుకొని చూడకండి ఆంటీ!" అంటూనే డైనింగ్ టేబుల్ సర్ది, హడావుడిగా వెళ్ళిపోయింది కాళింది.

మీటింగ్స్ నూ మిగితా ఆఫీస్ పని ముగించుకొని సిస్టమ్ మూసి, 'ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఈ అల్లరిగాంగ్ ఏదబ్బా?' అనుకుంటూ కిందికి వచ్చి "ఆద్యా ఎక్కడా? ఏం చేస్తున్నావు?" అని పిలిచింది.

"ఇక్కడ పౌడర్ రూములో మమ్మీ. బామ్మకు మేకప్ చేస్తున్నాను" అని జవాబిచ్చింది ఆద్య.

"బాత్‌రూములో మేకప్ ఏమిటీ?" అంటూ రెస్ట్ రూం తలుపు తీసి, అద్దం ముందు కౌంటర్ మీద కూర్చున్న ఆద్యను, ఎదురుగా నిలుచున్న అత్తగారిని చూసింది.

"నువ్వు ఈ బాత్‌రూమును పౌడర్ రూమంటారని చెప్పావుగా. అందుకని ఇక్కడ ఆద్య మేకప్ చేస్తానంటే సరేనన్నాను" అంటూ తన వైపు తిరిగిన అత్తగారిని ఓ క్షణం తెల్లబోయి చూసి, ఫక్కున నవ్వింది

కాళింది.

“ఎందుకట్లా నవ్వుతావు? ఏదో చిన్నపిల్ల దానికొచ్చినట్లు చేసింది” అంటూ అద్దం వైపు తిరిగి, అద్దంలో, తన మొహం నిండా ఉన్న పింక్ పౌడర్, పెద్దగా ఉన్న బొట్టు, కళ్ళ చుట్టూ మందంగా దిద్దిన ఐలైనర్, పెదాల నిండా రక్తం తాగినట్లున్న ఎర్రగా పులిమిన రెడ్ లిప్‌స్టిక్, విరబోసిన జుట్టుతో అచ్చం దయ్యంలా ఉన్న తన ఆకారం చూసుకుంటూ, “కడిగేసుకుంటానులే, నువ్వేమీ నవ్వక్కరలేదు” అంది ఉక్రోషంగా సురభి.

“కడిగేసుకుంటారా? ఆ మేకప్ పోవటానికి ఎన్ని నీళ్ళు కావాలో తెలుసా? అయినా ఇప్పుడు నీళ్ళు బంద్ అవుతే ఏం చేస్తారు?” అంటూ ఆద్యను తీసుకొని బయటకు వెళ్ళింది కాళింది.

శుభ్రంగా కడుక్కొని వచ్చి, “ఇక్కడ నీళ్ళు ఎప్పుడూ బంద్ అవవుకదా? నీళ్ళు బంద్ అవుతాయంటావేమిటి?” అడిగింది కోడలిని.

“ఎప్పుడూ కావాంటీ. కానీ ఈ మంచు తుఫాన్‌కు కరెంట్ ఫేల్ అవుతే, నల్లాలూ బంద్ అవుతాయి. ఇదో ఈ టార్చ్ లైట్ మీ దగ్గర ఉంచుకోండి. కరెంట్ పోతే భయపడకండి. ఇదో ఈ లైటర్ ఈ ఫైర్‌ప్లేస్ దగ్గర ఉంచుతున్నాను. కరెంట్ పోతే ఇది వెలిగిస్తాను” అంది కాళింది.

“కరెంట్ పోతుందా? అయినా ఒక్క పూట పోతే ఏమవుతుంది. మా ఇండియాలోనైతే ఎప్పుడూ పోతూనే ఉంటుంది. నాకలవాటేలే, ఏమీ భయపడను” అంది సురభి.

“అక్కడ కరెంట్ పోతే తలుపులు తీస్తాము, గాలి వస్తుంది. ఇక్కడ తలుపులు తీయలేము. తలుపు తీస్తే గడ్డకట్టిపోతాము. ఒక్క నీటి చుక్క కిందికి పడేలోపు మంచుగడ్డ అయిపోతుంది. నీళ్ళు ఈ చలికి పైపుల్లో

గడ్డకట్టిపోయి, పైపులు పగిలిపోతాయి. ఎక్కువ సేపు గాలి లేకుండా ఇంట్లోనే ఉంటే మనుషులు చచ్చిపోతారు. ఇక్కడ ఈ సీజన్‌లో కరెంట్ పోతే అంత కష్టం" అని కాళింది చెపుతుండగానే పెద్దగా సైరన్ ఇస్తూ, ఇంటి పక్క నుంచి పోలీస్ వాన్, దాని వెనుక ఫైర్ ఇంజన్ వెళ్ళాయి. ఉలిక్కి పడి "ఇదేమిటి?" అంది భయం భయంగా సురభి. ఆద్య కాళిందిని గట్టిగా కరుచుకుంది.

"ఎక్కడైనా ఈ మంచు మీద కార్‌లు జారి పడిపోతుంటాయి. అందుకని ఏ కార్ అయినా జారి పడిపోయిందేమోనని చూసుకుంటూ అట్లా గస్తీ తిరుగుతుంటారు పోలీసులూ, ఫైర్ డిపార్ట్మెంట్ వాళ్ళు. ఏ ఆక్సిడెంట్ జరగకుండా ముందు జాగ్రత్త." అని చెప్పింది కాళింది.

అయిదింటికే పూర్తిగా చీకట్లు కమ్ముకున్నాయి. దట్టంగా మంచు కురుస్తోంది. డిన్నర్ రెడీ చేసి పిలవటానికి వస్తే బామ్మామనవరాళ్ళిద్దరూ బిక్కుబిక్కుమనుకుంటూ మంచం మీద కూర్చొని బయట పడుతున్న మంచును చూస్తున్నారు. సురభి హనుమాన్ చాలీసా చిన్నగా చదువుకుంటోంది.

హడావుడిగా ఎప్పుడూ ఏదో అల్లరి చేస్తూ ఉండే వాళ్ళిద్దరూ అట్లా కూర్చొని ఉండటము చూస్తుంటే 'మరీ భయపెట్టానా?' అని ఓ పక్క జాలి, ఓ పక్క నవ్వూ వచ్చాయి కాళిందికి. "ఇప్పుడేమీ ప్రమాదం జరగలేదు, కాస్త రిలాక్స్ అవ్వండి ఇద్దరూ. హాయిగా డిన్నర్ తిని పడుకోండి" అంది నవ్వుతూ.

రెండోరోజు సాయంకాలానికి మంచు తుఫాన్ వెలిసింది. మామూలుగా సన్నని మంచు పడుతోంది. సౌరభ్ ఇంటికి వచ్చాడు. సౌరభ్ ను ఆత్రంగా పట్టుకొని "అక్కడ మీకేమీ ఇబ్బంది కాలేదు కదా నాన్నా?" అడిగింది సురభి.

"ఒక అయిదు నిమిషాలు కరెంట్ పోయింది. అందరినీ రూముల్లోనుంచి లాంజ్‌లోకి రమ్మని అనౌన్స్ మెంట్ చేసారు. అందరమూ లాంజ్‌లోకి వచ్చాము. కరెంట్ రాగానే మా రూముల్లోకి వెళ్ళిపోయాము. హోటల్‌లో పోలీసులు, ఫైర్ ఇంజన్, అంబులెన్స్ అన్నీ రెడీగా ఉంచారు. అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు" అన్నాడు.

"అమ్మయ్య ఈ మంచు తుఫాన్ ఏ ఇబ్బందీ పెట్టకుండా వెళ్ళిపోయింది" అంది సురభి గుండెల మీద చేయి వేసుకొని.

"ఎలక్ట్రిక్, వాటర్, పోలీస్, ఫైర్ ఇన్ని డిపార్ట్మెంట్‌ల వాళ్ళు కలిసి మనకే ఇబ్బందీ లేకుండా చేసారు. అందరి సహకారముతో అంతా క్లియర్ అయ్యి, మనము మాములుగా తిరగ గలుగుతున్నాము. ఏ ఒక్కరూ సరిగ్గా చేయలేకపోయినా, ఒకరికొకరు సహకరించుకోలేకపోయినా జనజీవనం అస్త్యవ్యస్తమయ్యేది. మరి నీ మంచు మురిపెం తీరిందా?" అడిగాడు సౌరభ్.

కొడుకు మాటకు జవాబివ్వకుండా బయటకు చూసింది సురభి. జల్లులా మంచు ఉండీ ఉండీ కురుస్తోంది. వెనుక ఉన్న పెద్దపెద్ద చెట్ల మీదంతా తెల్లని దూది రాశులుగా పోసినట్లు అందంగా కనులకింపుగా ఉన్నాయి ఆ చెట్లు. మధ్యాహ్నం రోడ్ అంతా క్లీన్ చేసినట్లున్నారు, రోడ్‌కు రెండు వైపులా మంచు కొండలా పడి ఉంది. ఆ రెండు కొండల మధ్య రోడ్ నల్లగా మెరిసిపోతూ శుభ్రంగా ఉంది. తెల్లగా, నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉన్న ఆ ప్రకృతిని చూస్తూ, "బయట చూడు ఎంత బాగుందో! ఆ చెట్లను చూస్తుంటే హిమాలయాలల్లో తపస్సు చేసుకుంటున్న మునీశ్వరులలాగా ఎంత నిశ్చలంగా, గంభీరంగా ఉన్నాయో! హిమాలయాలను చూడాలన్న నా కోరిక ఇట్లా తీరింది. ఎంత చూసినా ఆ మురిపెం తీరదురా. ఈ సారి మీ డాడీని కూడా రమ్మనాలి" అంది పరవశంగా ఆ

మంచును చూస్తూ. అత్తగారి పరవశం చూస్తూ 'హిమగిరి సొగసులూ, మురిపించెను మనసులూ' అని రాగం తీసింది కాళింది.

***

**(అముద్రితం)**

# 46. దరిద్రం వదిలింది

"ఇల్లు జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది నా కలలసౌధం" అంది పద్మ, సరోజతో.

"మా ఇల్లన్నంత జాగ్రత్తగా చూసుకొంటాను. మీరు దిగులు పడకండి" అభయమిచ్చింది సరోజ.

కొత్త రంగుల సువాసనతో, అందంగా, శుభ్రంగా తళతళలాడుతున్న ఇంటిని మరోసారి కలయజూసి, తప్పనిసరై బయటకు నడిచింది పద్మ. సొంత ఇంటి మీది కోరికతో, "పిల్లలు చిన్నవాళ్ళు. వాళ్ళ చదువులు, అవసరాలు ఉంటాయి. పైగా నాది  బదిలీలు అయ్యే ఉద్యోగము. ప్రతి మూడేళ్ళకూ  ఊరు మారుతుంటాము. ఇప్పుడు అప్పు తీసుకొని ఫ్లాట్ కొనటము అవసరమా?" అన్న ప్రదీప్ మాటలకు, "మనమేమన్నా దానికి డబ్బులు పెట్టాలా? దాని అప్పు దానికొచ్చే అద్దె డబ్బులతో అదే తీర్చుకుంటుంది. మీరు రిటైరయ్యి మనము వచ్చేనాటికి అప్పు తీరిపోతుంది. అప్పుడు ఎక్కడుండాలాని వెతుక్కోకుండా హాయిగా మనింట్లో మనం ఉండవచ్చు" అని ప్రదీప్‌ను ఒప్పించి మరీ ఈ టూబెడ్ రూం ఫ్లాట్ కొనిపించింది పద్మ. గృహప్రవేశం చేసుకొని, తెలిసినవారి ద్వారా వచ్చిన సరోజావాళ్ళకు ఫ్లాట్ అద్దెకిచ్చారు. భారమైన మనసుతో వదలలేక వదలలేక ఇంటిని వాళ్ళకు అప్పగించి వారి ఉద్యోగపు ఊరికి వెళ్ళారు.

రెండేళ్ళ తరువాత సరోజావాళ్ళు వేరే చోటికి వెళుతున్నామని చెపితే, ఫ్లాట్ ను తీసుకోవటానికి వచ్చిన పద్మకు దాని పరిస్థితి చూసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇల్లు మారేటప్పుడు ఇంటిని శుభ్రం చేయకూడదట చాలా సామానులు అటూఇటూ పడేసి ఉన్నాయి. గోడలకు మేకులు కొట్టారు. బాత్ రూముల్లో నల్లాలు పాడైపోయాయి. మొహమాటంతో

ఏమనలేక ఫ్లాట్ హాండోవర్ చేసుకున్నారు.

ఫ్లాట్‌ను బాగు చేయించి, తప్పక ఇంకొకరికి, బోలెడు జాగ్రత్తలు చెప్పి అద్దెకు ఇచ్చి వెళ్ళారు. ఎన్ని జాగ్రత్తలు చెప్పినా అద్దెల వాళ్ళు ఇంట్లో చెత్తాచెదారం తీసుకెళ్ళకూడదు, శుభ్రం చేసి వెళితే దరిద్రం వెంట బెట్టుకెళ్ళటం అవుతుంది అని అట్లాగే వదిలేసి వెళ్ళేవారు. నానా చెత్తా చెదారంతో కంగాళీ చేసేవారు. ప్రతిసారి ఫ్లాట్ బాగు చేసి మళ్ళీ అద్దెకు ఇవ్వటమూ, వాళ్ళు ఖాళీ చేసినప్పుడు అదే కథ పునరావృత్తం అవుతోంది. ఈ సారైతే పాతచీరలు, కర్టెన్స్, పాత పేపర్లూ, ఎంత పారేయవచ్చో అంత మూలలు కూడా వదలకుండా వెదజల్లేసారు. అంతే కాకుండా బాత్ రూం అద్దం నిండా స్ఫోటకం మచ్చలలా బొట్టుబిళ్ళలు అంటించారు. వంటింట్లో దేవుడి గూడంతా నల్లగా మసి బారిపోయింది. గోడలన్నీ కమురు పట్టిపోయాయి. ఒక్క నల్లా కూడా సరిగ్గా లేదు. అసలు కమోడ్స్ అంత అసహ్యంగా వాళ్ళైనా ఎట్లా వాడుకున్నారో!

ఆ అద్దెవాళ్ళు వీళ్ళు రావటానికి ఆలస్యం అవుతుందని తెలిసిన వారిని పంపితే వారికి తాళాలు ఇచ్చి వెళ్ళారు. తాళం తీసి లోపలికి వస్తూనే ఆ ఇంటి పరిస్థితి చూస్తూనే బోరుమని ఏడుస్తూ హాల్ మధ్యలో కూలబడిపోయింది పద్మ.

ఎంతో ముచ్చటపడి భర్తను ఒప్పించి కొనుకున్న ఇంటిని ఆ విధంగా చూస్తే కన్నీళ్ళు ఆగలేదు పద్మకు. ఇదేమిటి? చదువుసంస్కారం ఉన్నవాళ్ళు చేసే పద్ధతి ఇదేనా? ఎంత అద్దె ఇంటిని శుభ్రం చేయకూడదనే నమ్మకం ఉన్నంతమాత్రాన ఇంత చెత్త ఈ విధంగా పడేసి, పాడు చేసి వెళ్ళాలా? అప్పటికిక మనసు ఆగక వాళ్ళకు ఫోన్ చేసి "ఇదేమిటమ్మా ఇంత చెత్త పడేసి, ఇల్లు ఇంత అధ్వానంగా చేసారు?" అని అడిగింది.

"అయ్యో ఆంటీ, పనమ్మాయికి వందరూపాయలిచ్చి ఇల్లు బాగు

చేయమని చెప్పానే! చేయలేదా? ఉండండి కనుక్కుంటాను." అని మరో మాటకు అవకాశం ఇవ్వకుండా సెల్ ఆఫ్ చేసింది.

దగ్గర ఉండి చూస్తుంటేనే పనివాళ్ళు సక్రమంగా ఊడవరు. ఇక లేకుండా చేయమంటే చేస్తారా? అదీ వందరూపాయలిస్తే. వీళ్ళే అమెరికాలో అద్దె ఇళ్ళు చచ్చినట్టు బాగుచేసి వెళుతారు. అక్కడ ఏమాత్రం పాడైయినా ఓనర్స్ ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తారట. అక్కడ ఈ నమ్మకాలేమీ పనిచేయవు. ఆ విధానం ఇక్కడ కూడా ఉంటే ఎంత బాగుండు. అధ్వానంగా ఉన్న ఇంటిని చూస్తూ కళ్ళల్లో నుంచి కారుతున్న నీటిని కూడా తుడుచుకోకుండా, "చెత్త కుండీ కాదు, డంప్ యార్డ్ చేసారు" ఇల్లంతా పారేసి ఉన్న పాత బట్టలూ, కాగితాలూ, తుక్కూ చూస్తూ అంది పద్మ.

"మేస్త్రీ ఇల్లు బాగుచేయటానికి రెండు లక్షలవుతుందన్నాడు. ప్రతిసారీ ఇప్పటికే చాలా పెట్టాము. మనము వచ్చేసరికి ఫ్లాట్ ఏ స్థితిలోఉంటుందో? ఇంకా ఎంత డబ్బు ఖర్చవుతుందో చెప్పలేము. పైగా మూడునెలల అద్దె టాక్స్ కట్టాలి. పిల్లల కాలేజీకి ఫీజులు, కొద్దో గొప్పో వాళ్ళ అవసరాలు ఇలా చాలా ఖర్చులున్నాయి. మనం ఎంత పొదుపుగా ఉన్నా అన్ని సర్దుకోలేము. అమ్మేద్దాము. వచ్చిన డబ్బుతో అప్పు తీర్చేస్తే మనకూ ఇబ్బంది ఉండదు" నిస్సహాయంగా  అన్నాడు ప్రదీప్.

ఇంకేమనగలదు? కంటి ముందు కనిపిస్తుంటే ఇంకేమనగలదు? ఇల్లు కట్టుకున్నవాడికంటే, ఆ ఇంట్లో అద్దెకున్నవాడు తెలివికలవాడు అని అందుకే అంటారు. తన కలలసౌధం తన కళ్ళ ముందే కూలిపోయింది!

విచారంగా కూర్చున్న తల్లితో, "బాధపడకమ్మా. నా చదువైపోగానే కాంపస్ సెలక్షన్స్ లో తప్పకుండా ఉద్యోగం వస్తుంది. నాకు ఉద్యోగం రాగానే మంచి ఫ్లాట్ కొనుక్కుందాము. కాసేపు యూట్యూబ్ లో ఏదైనా

పాత సినిమా చూడు. లేదా నీకిష్టమైన పాత పాటలేమైనా విను” అనునయంగా అని కొడుకు హర్ష లాప్‌టాప్ తెచ్చి యూట్యూబ్ తీసిచ్చాడు.

యూట్యూబ్ తీయగానే ఏదో టీ.వీ ఛానల్లో యాంకర్, అక్కడున్నావిడను “అమ్మా, అద్దె ఇల్లు మారేటప్పుడు ఏమేమి వదిలేయాలంటారు?” అని అడుగుతోంది.

అందుకు ఆవిడ “అద్దె ఇంట్లో నుంచి చెత్తాచెదారం అలాంటివి తీసుకెళ్ళకూడదు. తీసుకెళితే దరిద్రం చుట్టుకుంటుంది. ఆ దరిద్రం వదిలేయాలి. మాకలాంటి నమ్మకాలు లేవు అనే వాళ్ళకు నేనేమీ చెప్పలేను. కాకపోతే మరీ ఆ విధంగా వదిలేస్తే ఇంటివాళ్ళు శాపనార్థాలు పెడతారు. అందుకని పనిమనిషికి ఓ వందనో, కాదులే ఈ కాలంలో వందకెవరు చేస్తారు కాని ఓ అయిదొందలు ఇచ్చి, మరురోజు బాగు చేయమని చెపితే సరి. ఇంక ఏమేమి వదిలేయాలంటే...”

అది వింటుంటే ఆవేశం ఆపుకోలేక పోయింది పద్మ. అంటే ఇల్లు కష్టపడి కట్టుకొని, అవసరానికి అద్దెకిచ్చిన పాపానికి అద్దెకున్నవాళ్ళ దరిద్రం ఓనర్స్ కిచ్చిపోతారన్నమాట. ఘాటుగా అక్కడ కామెంట్ పెడుదామనుకుంది కానీ వాళ్ళు కానీ జవాబిస్తారా? ఇవ్వరు. డిలీట్ చేసినా చేసేస్తారు. అయినా ఊరుకోలేక, “నమ్మకం లేని వాళ్ళకు మీరేమి చెప్పక్కరలేదు. ఎవరి నమ్మకాలు వారివి కానీ వారి నమ్మకాలతో ఎదుటివాళ్ళకు కష్టం, నష్టం కలుగచేయకూడదు. అంతగా తీసుకెళ్ళకూడదు అనుకుంటే ఏ చిన్న కాగితమో ఏదో, ఎక్కడో ఓ మూల పడేసి వెళ్ళమనండి. అంతే కానీ మూఢనమ్మకాలను ఇంకా ఇంకా ప్రజలలో పెంచి పోషించకండి” అని కామెంట్ పెట్టి, ఎవరి దరిద్రం వదిలింది ఛానల్ తిప్పింది.

అక్కడ ఆంకర్, అక్కడున్న ఓ లాయర్‌ను "లాయర్‌గారూ, అద్దెకున్నవాళ్ళకు ఎన్ని సంవత్సరాలుంటే ఆ ఇల్లు సొంతమవుతుంది?" అని అడుగుతోంది.....

***

**(అముద్రితం)**

# 47. మహామాయ

స్థలం : జబల్పూర్
కాలం: 1979

అలారం మోతకు బద్ధకంగా కళ్ళు తెరిచి, మీదనున్న పరుపును కష్టంగా పక్కకు జరిపి, సైడ్ టేబుల్ మీదున్న గడియారంలో టైం చూసాను. నాలుగయ్యింది. 'అబ్బా లేవాలా, ఇంకాసేపు పడుకుంటే... అమ్మో! పిల్లలకు ఆలస్యమౌతుంది' అని గబుక్కున లేవబోయాను. హుం మీదనున్న పరుపు అంత తొందరగా లేవనిస్తుందా? ఈ ఊరొచ్చిన కొత్తల్లో ఏమండీ ఇవి కుట్టిస్తుంటే, "మనకు పరుపులున్నాయిగా. కొత్తవెందుకు?" అని అడిగితే, "ఇవి పరుపులుకావు, వీటిని రజాయ్ లంటారు కప్పుకోవటానికి" అన్నారు. 'అబ్బా ఇవి కప్పుకోవాలా?' అనుకున్నాను కానీ ఈ చలికి అవీ సరిపోవటం లేదు. అయినా ఇప్పుడవన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే పనులు అయినట్లే! తప్పదన్నట్లు లేచి, పిల్లల గదిలోకి తొంగి చూసాను. పక్కన మంచం మీద ఆడపడుచు, డబల్ డెక్కర్ మంచం మీద పైన అమ్మాయి, కింద అబ్బాయీ రజాయ్ లు కప్పుకున్నా ముడుచుకొని పడుకొని ఉన్నారు. "వదినా రేపు టెస్ట్ ఉంది. నువ్వు లేచినప్పుడే నన్నూ లేపు" అంది కాని అలా మంచి నిద్రలో ఉన్న తనను లేపాలనిపించలేదు.

వంటింట్లో కెళ్ళి, కిరోసిన్ స్టవ్ వెలిగించి పెద్దగిన్నెలో నీళ్ళు పెట్టాను. అవి కాగేటప్పటికి కనీసం అరగంట పడుతుంది. రాత్రి నానబెట్టిన చన్నా తీసి కుక్కర్‌లో వేసి గాస్ మీద పెట్టి, ఫ్రెషప్ అవుదామని వెళ్ళాను. తిరిగి వస్తూ చూస్తే పిల్లలు ఇంకా మంచి నిద్రలో ఉన్నారు. ఆ డబుల్ బెడ్‌పై దాని మీద పడుకునేందుకు ఇద్దరికీ గొడవే. వాళ్ళ గొడవ వాళ్ళ డాడీనే తీర్చి ఇద్దరినీ బారీబారీ అని పడుకోపెడుతుంటారు. 'నీళ్ళు కాగాక లేపుదాములే' అని మురిపెంగా నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్ళాను.

కిరోసిన్ వాసన గుప్పు మని కొట్టింది. కిరోసిన్ వాసన పోవాలని కిటికీ తలుపు తీసి బయటకు చూసాను. పౌర్ణమి రోజులేమో పెరడంతా వెన్నెల వాన కురుస్తున్నట్లు తెల్లగా మెరిసిపోతోంది. చల్లటి గాలి వణికిస్తున్నా ఆ పెరటి అందాన్ని అలా చూసూ ఉండిపోయాను. ఇంతలో జరజరా ఏదో పాకినట్లు శబ్దం వచ్చింది. అప్రయత్నంగా నిన్న మిసెస్ మాన్ ఇంటికి వెళుతున్నప్పుడు జరిగిన అనుభవం గుర్తొచ్చింది

ఇంట్లో పనయ్యాక, అల్లుతున్న స్వెట్టర్, ఊలు, నీడిల్స్ హాండ్‌బాగ్‌లో వేసుకొని మిసెస్ మాన్ ఇంటికి బయలుదేరాను. రోజూ ఎవరో ఒకరింట్లో లంచ్ టైం దాకా అందరమూ కూర్చొని, ఏవో అల్లుకోవటమో, కుట్టుకోవటమో చేసుకుంటూ కబుర్లు చెప్పుకుంటాము. చిన్నగా చుట్టుపక్కలకు చూసుకుంటూ నడుస్తున్న నాకు రోడ్ పక్క నున్న పెద్ద చెట్టు మీద ఏదో కదిలినట్లనిపించి తలెత్తి పైకి చూసాను. సరిగ్గా నా తలపై నున్న కొమ్మకు ఓ పాము చుట్టుకొని, పైకీ కిందికీ ఊగుతోంది. అదెప్పుడు కిందికి దూకుతుందో అన్నట్లుంది. గబుక్కున వెనక్కి అడుగేసాను. ఇంకా నయం చూసుకున్నాను. లేకపోతే అమ్మో నిన్న మిసెస్ పాఠక్ పిల్లలను లేపుదామని, వాళ్ళ రూం లోకి వెళ్ళి, కర్టెన్ జరుపుతే, కర్టెన్ రాడ్ మీద నుంచి ధనామని ఆమె భుజం మీద పాము పడి, ఆమె తేరుకునే లోపలే కిందకు దూకి జరజరా బయటకు వెళ్ళిపోయిందిట. ఆ షాక్ నుంచి తేరుకోవటానికి ఆమెకు చాలా సమయం పట్టిందిట. అట్లా ఇప్పుడు ఇది నా నెత్తిన పడేది. ముందుకు ఎట్లా వెళ్ళను? ఏం ఊరు బాబూ ఇది ఇన్ని పాములు! అసలు ఇది ఒకప్పుడు నాగలోకమేమో! ఇప్పుడేమి చేయాలి? పోనీ వెనక్కి వెళ్ళిపోనా? ఆలోచిస్తూనే అనుకోకుండా తల పైకెత్తి చూసాను...

ఆ పాము గోధుమ రంగులో చాలా అందంగా ఉంది. అది నావైపు ఊగినప్పుడు దాని పడగ మీద ఉన్న నామాలు కనిపించాయి.

గోధుమవన్నె తాచు అంటే ఇదేనా... దాని కళ్ళు మెరుస్తున్నాయి... అది సూటిగా నా కళ్ళలోకి చూస్తోంది... ఏమిటిది... అట్లా చూస్తోందేమిటి... వెనకకి పోనా... కాళ్ళు కదలటం లేదేమిటి?

అలా దాన్ని చూస్తున్నానా... ఏదో మాయ కమ్మినట్లయ్యింది...

అబ్బ! ఎంతందంగా ఉంది... ఏమి ఆ వయ్యారం... దాన్ని ముట్టుకోవాలనిపిస్తోంది... అలా... అలా... కళ్ళప్పగించి చూస్తూ ఉన్నాను....

ఛన్‌మని నా ముందు పడింది... దాన్ని పట్టుకుందామని కిందికి వంగాను... నా చేతికి చిక్కలేదు. ముందుకు... ముందుకు... పాకుతూ పోతోంది... ఏమందం... ఏమందం... ఆగవే... ఆగవే...

దాని వెనుకే దాని అందానికి మైమరిచిపోతూ వెళుతున్నాను...

ఏదో ట్రాన్స్ లో ఉన్నట్లు దాని వెనకే చకచకా నడుస్తున్నాను...

దాని స్పీడ్ అందుకోలేక పోతున్నాను...

అబ్బా... కాలికి రాయి కొట్టుకుంది...

ఉలిక్కిపడి స్పృహలోకి వచ్చాను... చుట్టూ చూసాను...

దాదాపు కాంప్ చివరకు వచ్చాను...

నా ముందు ఆ పాము ఎదురుగా ఉన్న పొదలోకి దూరింది...

ఏమిటి? నేనేమి చేస్తున్నాను? ఎక్కడికొచ్చాను? అమ్మో ఏమిటీ పాము వెనకాలపడి ఇలా వచ్చేసాను. వణికిపోతూ వెనక్కి తిరిగి మాన్ ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చి పడ్డాను...

అక్కడ మిసెస్ మాన్, మిసెస్ పాఠక్, మిసెస్ బెనర్జీ, మిసెస్ భట్నాగర్ వరండాలోనే ఎండకు కుర్చొని ఉన్నారు. వణికిపోతూ పరిగెత్తుకుంటూ వచ్చిన నన్ను చూసి గాభరా పడ్డారు.

“మిసెస్ కుమార్ వాట్ హాపెండ్?” అని అడుగుతూ నన్ను పట్టుకొని కూర్చోపెట్టింది మిసెస్ పాఠక్.

కాస్త తేరుకున్నాక జరిగింది చెప్పాను. “అవునట పాములు హిప్నటైజ్ చేస్తాయని, పగ పడతాయనీ మా ఊర్లో అనుకుంటుంటే విన్నాను” అంది మిసెస్ భట్నాగర్.

‘థాంక్ గాడ్ ఏదైతేనేమీ ఆపద తప్పింది’ అన్నారు అందరూ గుండెల మీద చేయేసుకొని. ఇంటికొచ్చాక ఏమండీకి ఇలా జరిగింది అని చెప్పాను. అంతా విని “నీ మొహం. పాములు హిప్నటైజ్ చేయటమేమిటి? పగ పట్టటం ఏమిటి? పిచ్చిపోరిలా మాట్లాడకు. ఇంకా నయం దాని వెనుక పడి ఆ పొదలో దూరలేదు” అని తీసిపారేసారు. హుం ఎప్పుడూ ఇంతే. నేనేది చెప్పినా నమ్మరు. పైగా చిన్నపోరిని చేసి మాట్లాడుతారు. రేపు అందరినీ ఆట పట్టిస్తారేమో! అసలుకే ‘ప్రతిదీ మీ ఏమండీకి చెపుతావు’ అని తిడతారు మా ఫ్రెండ్స్. ఇప్పుడేమంటారో దేవుడా!

మళ్ళీ పెరట్లో నుంచి ఏదో చప్పుడు వస్తే, ఆలోచనల నుంచి తేరుకొని అటువైపు చూసాను.

అక్కడ...

కిరోసిన్ వాసన పోవాలని కిటికీ తలుపు తీసి బయటకు చూసాను. పౌర్ణమి రోజులేమో పెరడంతా వెన్నెల వాన కురుస్తున్నట్లు తెల్లగా మెరిసిపోతోంది. చల్లటి గాలి వణికిస్తున్నా ఆ పెరటి అందాన్ని అలా

చూసూ ఉండిపోయాను...

మళ్ళీ పెరట్లో నుంచి ఏదో చప్పుడు వస్తే, ఆలోచనల నుంచి తేరుకొని అటువైపు చూసాను.

అక్కడ... గోధుమరంగు తాచు చుట్ట చుట్టుకొని, తల పైకెత్తి, పాములవాడు బుట్టలో నుంచి ఆడుతున్నట్లు ఆడుతోంది! వెన్నెలలో దాని కళ్ళు మెరుస్తున్నాయి. నేను కళ్ళు తిప్పుకోలేక అలా చూస్తుండగానే, పక్కనున్న పుట్టలోనుంచి నల్లగా, లావుగా, బలంగా ఉన్న పెద్ద పాము బయటకు వచ్చింది. అదీ దీని పక్కన చుట్టుకొని కాసేపు తలాడించింది. ఆ తరువాత రెండూ పొడుగ్గా సాగి ఒకదానితో ఒకటి పెనవేసుకున్నాయి. రెండూ కలిసి పైకి లేచాయి....

కిందికి దిగాయి...

అలా పెనవేసుకొనే దొర్లాయి...

తెల్లని వెన్నెల కిరణాల్లో మెరిసిపోతున్నాయి. రకరకాల విన్యాసాలు చేస్తున్నాయి...

ఎంత కదులుదామనుకున్నా కిటికీ దగ్గర నుంచి కదలలేక పోతున్నాను...

కళ్ళప్పగించి అట్లా చూస్తున్నాను వాటిని...

గుండెలదురుతున్నాయి...

ఇంతలో నల్లటిపాము ఒక అబ్బాయిలా మారిపోయింది...

గోధుమవన్నెతాచు అందమైన అమ్మాయిలా మారిపోయింది...

వాళ్ళిద్దరూ పెనవేసుకొని విన్యాసాలు చేస్తున్నారు...

వాళ్ళను అలా గుడ్లప్పగించి చూస్తుంటే నా ఒళ్ళంతా వణికిపోతోంది...

నాకేమవుతోందో తెలీటం లేదు....

ఇంతలో నా భుజం మీద ఏదో పడింది...

కెవ్వ్ మని అరవబోయాను...

ఏమండి నా నోరు మూసి, కిటికీ తలుపేసి, నన్ను తీసుకొచ్చి హాల్‌లో కూర్చోబెట్టారు. ఆయనా కాసేపు మౌనంగా కూర్చున్నారు. ఆ తరువాత లేచి అంత చలిలోనూ చమటతో ముద్దైపోయిన నా మొహం టవల్‌తో తుడిచి, ఫాన్ వేసారు. లోపలికెళ్ళి కుక్కర్ ఆఫ్ చేసి, రెండు కప్పుల కాఫీ తీసుకొచ్చారు. భయం భయంగా చూస్తున్న నా చేతిలో కప్ పెట్టి “తాగు” అన్నారు.

మాట్లాడకుండా కంపిస్తున్న చేతులతో కప్ అందుకున్నాను. ఇద్దరమూ మౌనంగా కాఫీ తాగుతున్నాము.

“అదేమిటీ అట్లా కూర్చున్నారు? వదినకేమయింది?” అన్న మా ఆడపడుచు మాటలతో ఈ లోకంలోకి వచ్చాము.

“వదినకేమీ కాలేదు కానీ, నువ్వు కాఫీ తెచ్చుకో” అన్నారు ఏమండి.

“అబ్బా కిరోసిన్ వాసన. కిటికీ తలుపు తీయలేదెందుకు?” అన్న ఆడపడుచు మాట వినగానే “కిటికీ తీయకు” గట్టిగా అరిచాను.

బెదిరిపోయి “ఏంటొదినా?” అని ఒక్క గెంతులో మా దగ్గరకు

వచ్చింది. తనను పట్టించుకోకుండా ఇంకా వణికిపోతున్న నన్ను తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టి “కళ్ళు మూసుకొని పడుకో. ఏమీ ఆలోచించకు. తరువాత మాట్లాడుకుందాము. పిల్లలను నేను చూసుకుంటానులే” అని రజాయ్ కప్పి వెళ్ళారు ఏమండి.

“మమ్మీ ఈ రోజు ఛోలే భటూరా చేస్తానన్నది. నువ్వు ఆమ్లెట్ చేసావు డాడీ”

“ఇప్పుడు మమ్మీకి కొంచెం బాగాలేదు. లంచ్ కు ఛోలే భటూరా చేస్తుందిలే. ఇప్పుడివి తినేయండి.”

“అన్నయ్యా ఉప్మా చేస్తున్నాను.”

అందరి మాటలూ లీలగా వినిపిస్తున్నాయి. కానీ లేద్దామన్నా లేవలేని అశక్తత! స్పృహ ఉండీ లేనట్టుంది. చిన్నగా కళ్ళు మూసుకున్నాను!

కొద్దిసేపు తరువాత ఏమండీ వచ్చి “మాలాలే. బ్రేక్‌ఫాస్ట్ చేసి, స్నానం చేసి పడుకో” అని లేపారు.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. అందరూ వెళ్ళిపోయినట్లున్నారు. ఏమండీ కూడా ఆఫీస్‌కు వెళ్ళేందుకు రెడీ అయ్యి ఉన్నారు. ఉప్మా తింటూ, “ఏమండీ అట్లా పాములు మనుషులుగా మారుతాయా?” కొద్దిగా కంపిస్తూ అడిగాను.

“పాములు మనుషులుగా మారటమేమిటి?” అడిగారు.

“అదేమిటి అట్లా అడుగుతారు? మీరు చూసారుగా?” ఆశ్చర్యంగా అన్నాను.

“మనుషులను చూడటమేమిటి?” అన్నారు.

"మరి మీరక్కడ ఏమి చూసి కిటికీ తలుపు వేసి, నన్ను లోపలికి తీసుకొచ్చారు?" అయోమయంగా అన్నాను.

"అక్కడ నల్లటిపాము వెన్నెలలో ఆడుతోంది. దాన్ని చూడగానే కొంచెం బెదిరాను. నువ్వు బాగా భయపడి వణికిపోతున్నావు దాన్ని చూసేగా?" అన్నారు.

"నాకు రెండు పాములు, అమ్మాయి, అబ్బాయిగా మారిపోయి కనిపించాయి. మరి మీరు అలా చూడలేదా? ఒక్క పామునే చూసారా?" అపనమ్మకంగా అన్నాను.

"మన పెరట్లో ఆ నేరేడు చెట్టుకింద ఉన్న పుట్టలో నల్లతాచుపాము ఉందని సర్వెంట్ క్వాటర్‌లో ఉండే జాన్ చెప్పాడు. నువ్వు పిల్లలు వచ్చేలోపలే ఆ పుట్ట కొట్టిద్దామనుకున్నాను. కానీ ఎవరూ కొట్టేందుకు రాలేదు. జాన్ కూడా 'మేము చాలా ఏళ్ళ నుంచి ఇక్కడే ఉన్నాము సార్. ఆ పామును చూస్తూనే ఉంటాము. ఎవరినీ ఏమీ చేయదు. మా పిల్లలు కూడా బయట ఆడుకుంటూనే ఉంటారు' అన్నాడు. అయినా పెరట్లో నుంచి లోపలికి వచ్చే గేట్ పెద్ద చెక్కతో మూయించాను. ఇంట్లోని నీళ్ళ తూములన్నీ సిమెంట్‌తో మూయించాను. మిమ్మల్ని పెరట్లోకి వెళ్ళ వద్దని చెప్పాను. ఆ పామే బయటకు వచ్చినట్లుంది. రెండుపాములు, అవి అమ్మాయి, అబ్బాయి కావటం నీ భ్రమేమో. నిన్న ఆ గోధుమరంగు పామేదో చూసానన్నావుగా. అది కూడా వచ్చినట్లు భ్రమపడ్డావేమో" అన్నారు.

"అవునా? అంతేనా? మరి మీకూ ఆ పామును చూస్తేనే భయం వేసిందా?" ఇంకా నమ్మలేక అడిగాను.

"నిన్న నేను ఆఫీస్‌కు వెళ్ళటప్పుడు రోడ్‌కు అడ్డంగా ఒక పెద్ద పసుపురంగు పాము వెళ్ళింది. అది వెళ్ళిపోయే వరకు స్కూటర్ ఆపాను.

అది రోడ్‌కు అవతల ఉన్న ఒక ఇంటి వెనకకు వెళ్ళింది. అది ఒక ఫోర్‌మాన్ ఇల్లు. రోజూ ఆ ఇంటి ముందు ఇద్దరు చిన్నపిల్లలు ఆడుకుంటుండటము చూస్తాను. నేను వెంటనే వెళ్ళి ఆ ఇంటి తలుపు కొడితే, ఆ ఇంటావిడ తలుపు తీసింది. ఆమెకు చెప్పాను ఇంటి వెనుకకు పెద్ద పాము వెళ్ళిందని, అటెవరూ వెళ్ళకండి, దాన్ని పట్టటానికి  ఎవరినైనా తీసుకొస్తాను అని. ఆమె 'అది అక్కడే మా పెరట్లోనే ఉంటుంది ఏమీ చేయదు' అంది. అప్పటికీ మనసాగక ఆఫీస్‌కు వెళ్ళాక ఆ ఫోర్‌మాన్ ను పిలిచి చెప్పాను. అతనూ అదే అన్నాడు. ఇంటికి రాగానే నువ్వు ఓ పామెనకాల వెళ్ళానని చెప్పావు. పొద్దున మనింటి పెరట్లో ఆ పాము అలా కనిపించేసరికి కొద్దిగా భయపడ్డాను" అన్నారు.

"ఇదేం ఊరు బాబూ. ఊరు కాదు నాగులకోనలా ఉంది. ఎక్కడ చూసినా పాములే కాళ్ళకి అడ్డం పడుతూ. అయినా ఎవరినడిగినా అవేమీ చేయవు అంటారు. కుక్కలను పెంచినట్లు పాములను ఇళ్ళల్లో పెంచుతున్నారా? ఎప్పటికైనా భయమే కదా?" భయంగా అన్నాను.

"మనకు ఆర్మీ క్వాటర్ ఎలాట్ అయ్యింది. అక్కడైతే జవాన్స్ ఎప్పటికప్పుడు పొదలు కొట్టేస్తూ ఎలర్ట్ గా ఉంటారు. నెక్స్ట్ వీక్ షిఫ్ట్ అవుదాము. అప్పటి వరకూ వెనకకు ఎవరూ వెళ్ళకండి" అన్నారు.

***

అప్పుడు మా ఏమండి జబల్ పూర్  ordinance factory కి డెప్యుటేషన్ మీద వెళ్ళారు. అక్కడ ఆర్మీ క్వాటర్స్ నాలుగే ఉండేవి. అందువలన మాకు ఫాక్టరీ క్వాటర్స్ లోనే ఎలాట్ చేసారు. ఆ తరువాత ఆర్మీ క్వాటర్‌కు మారాము. అక్కడంతా చాలా చెట్లూ, పొదలూ ఉండేవి. వాటిల్లో పాములు యథేచ్ఛగా తిరుగుతుండేవి. మరి ఎందుకో ఎవరూ భయపడ్డట్టు కానీ, వాటిని చంపినట్టు కానీ వినలేదు.

1984లో ఏమండీ ఆర్మీ నుంచి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాక, హైదరాబాద్‌లో సెటిలయ్యాము. అప్పుడు మా ఇంటి దగ్గర ఉన్న R.K లైబ్రరీ నుంచి నవలలు తెచ్చుకొని చదువుతుండేదానిని. అప్పుడే లల్లాదేవిగారు పాముల మీద వ్రాసిన నవలలు చదివాను. నవల పేరు గుర్తులేదు కానీ, అందులో పాములు హిప్నటైజ్ చేస్తాయనీ, మనుషులుగా ఆకారాలు మార్చుకుంటాయని చాలా నమ్మకంగా వ్రాసారు. అది చదివినప్పటి నుంచి మళ్ళీ నా బుర్రలో "అయితే అప్పుడు ఆ పాము నన్ను హిప్నటైజ్ చేసిందా? పెరట్లో ఆ రెండుపాములు మనుషులుగా మారింది చూడటము నిజమేనా?" అని ఓ అనుమానం పురుగు తొలుస్తూ ఉంటుంది. ఏమైనా అప్పటి నుంచి నాకు పాములంటే, అసలు పాము అన్న పేరు వింటేనే వణుకొచ్చేస్తుంది. ఇప్పటికీ బయట నుంచి ఇంటికి వచ్చి, తాళం తీయగానే లోపల నాలుగు పక్కలా పామేదైనా ఉందా అని చూస్తాను :) అసలందుకే ఇన్నేళ్ళూ ఈ ఇన్సిడెంట్ గురించి ఎక్కడా రాయలేదు.

మరి ఇప్పుడెందుకు రాసానంటే, నాలుగు రోజుల క్రితం వాకింగ్‌కు వెళ్ళినప్పుడు, లేక్ దగ్గర ఒక నల్లపాము కనిపించినంది. గుండె చిక్కబట్టుకొని ఇంటి కొచ్చి, మా అబ్బాయితో చెప్పాను. వాడేమో "ఇక్కడ పాములేమీ చేయవు. అవి పాయిజన్ కూడా కావు మాతే" అన్నాడు.

"అవునురా అవి ఏమి చేయవని నీకు తెలుసు కానీ నాకూ, దానికీ తెలియదుగా" అన్నాను.

"అసలు నీకెందుకు మమ్మీ పాములంటే ఇంత భయం? అప్పుడు AWHO లో కూడా పాము కనిపించిందని వచ్చేసావు" అని అడిగాడు.

అప్పుడు ఈ స్టోరీ అంతా చెప్పి పనిలోపని రాసేసానన్నమాట!

***

# 48. ఆమె ఎవరు?

ఈ కథాకాలం: 1974.

స్థలం: సిలిగురి - సేవక్ రోడ్.

అప్పుడే పాకిస్తాన్ యుద్ధము ముగిసి, బంగ్లాదేశ్ విడిగా ఏర్పడిన రోజులు. మా ఏమండీగారు అప్పుడు అక్కడే ఉండేవారు. యుద్ధం అయిపోయి, శాంతి నెలకొన్నాక అక్కడే ఉన్న దట్టమైన అడవిలో సేవక్ రోడ్ అని చిన్న కాలనీ గా ఫామిలీ క్వాటర్స్ కట్టారు. దాదాపు ఆఫీసర్స్, జేసిఓస్, జవాన్స్ అందరివీ కలిపి ఓ 200 వరకు క్వాటర్స్ ఉండేవి. వివిధ యూనిట్‌ల వాళ్ళు ఉండేవారు. మా ఏమండీ అప్పటికే అక్కడ రెండేళ్ళుగా ఉంటుండటముతో మాకు ఫస్ట్ ఎలాట్మెంట్‌లోనే ఇల్లు దొరికింది. ఆయన యూనిట్‌లో ఇద్దరే ఆఫీసర్‌లు. ఒకరు ఆఫీసర్ ఇన్ కమాండ్ (OC), మేజర్. షేర్‌గిల్, రెండో ఆఫీసర్ టువైసీ ( సెకండ్ ఇన్ కమాండ్) మా ఏమండి కాప్టెన్ కుమార్. ఇలా అక్కడక్కడ చాలానే యూనిట్‌లు ఉండేవి. మా ఇద్దరికీ క్వాటర్స్ దొరికాయన్నమాట. వాళ్ళకు ఇద్దరు అబ్బాయిలు, మాకు ఒక అమ్మాయి, అబ్బాయి. పిల్లలూ సేం ఏజ్ గ్రూప్. మా అమ్మాయికి మూడు సంవత్సరాలు, అబ్బాయికి మూడు నెలలు. ఇద్దరమూ బాగా స్నేహంగా ఉండే వాళ్ళం. ఎక్కడికెళ్ళినా పిల్లలనూ, వాళ్ళతో పాటూ పనిపిల్లలనూ తీసుకొని వెళ్ళేవాళ్ళం. యూనిట్‌లో సినిమా అయితే మా దగ్గరే నులక మంచాలేసి పిల్లలను పడుకోబెట్టేవాళ్ళం. మెస్‌లల్లో అయితే లేడీస్‌రూం లో ఉంచేవాళ్ళం. అన్నీ చిన్నచిన్న యూనిట్‌లు కాబట్టి అప్పుడప్పుడు అందరూ కలిసి ఏదో ఒక మెస్‌లో పార్టీలు చేసుకుంటుండేవాళ్ళం. ఆ యూనిట్లు కూడా ఆ అడవిలో దూరం దూరంగా ఉండేవి. ఇక వాతావరణం దట్టమైన అడవి కాబట్టి ఎప్పుడు వాన వస్తుందో, ఎప్పుడు ఎండ వస్తుందో తెలియదు. పిల్లలకు తరచుగా జ్వరాలు వస్తుండేవి. ఇక ఏనుగులు, పాములు,

నక్కలు మా దోస్త్ లు! ఇదీ నేపథ్యం! ఇక కథలోకి పదండి.

పాప సోఫాలో, బాబు నా ఒడిలో పడుకొని నిద్రపోతున్నారు. పనమ్మాయి గీత సోఫా పక్కన ముడుచుకొని కూర్చొని కునికి పాట్లు పడుతోంది. కిటికీ పక్కన నక్క గట్టిగా అరిచింది. పిల్లలు ఉలిక్కిపడ్డారు. నేను ఆలోచనల నుంచి తేరుకొని, వెధవ నక్కలు చిరాకు పుట్టిస్తున్నయి అనుకొని కిటికీ తలుపువేద్దామని, చిన్నగా బాబుని పక్కకి పడుకో పెట్టి లేచాను.

"దీదీ."

"ఏంటి గీతా?"

"టైం ఎంతయ్యింది?"

గడియారం వైపు చూసాను. ఇంకా ఎనిమిది గంటలే అయ్యింది. ఏమండి సత్నాలో పార్టీ వుందని వెళ్ళారు. పిల్లలు కొద్దిగా నలతగా వున్నారని నేను ఆగి పొయాను. లేకపోతే అందరమూ వెళ్ళే వాళ్ళము. పిల్లలని లేడీస్‌రూంలో ఉంచే దానిని!

గాలికి పరదాలు చిన్నగా వూగుతున్నాయి. లేచి కిటికి తలుపులు వేస్తూ బయటకి చూసాను. ఎనిమిది గంటలకే చీకటి పడిపోయింది. బయట రోడ్ పక్కన జవాను నెగడు వెలిగిస్తున్నాడు. అడవి కదా ఏనుగుల బెడద ఎక్కువ. అందుకని ఈ నెగడు వెలిగించటము. కొంచము ఈదురుగాలి మొదలయిందంటే ఆరిపోతాయి. అయినా మధ్యమధ్య నెగడు ఎగదోస్తూ, కాంప్ చుట్టూ గస్తీ తిరుగుతుంటారు జవాన్లు. కిటికీ తలుపులు వేసి, పరదాలు వేసాను. లేకపోతే తలుపు దగ్గరికి మూతి పెట్టి మరీ అరుస్తాయి నక్కలు. ఇక్కడికి వచ్చిన కొత్తలో కుక్కలేమిటి ఇలా ఉన్నాయనుకున్నాను. అవి కుక్కలు కావని నక్కలని తెలిసుకొని

విస్తుపోయాను. కుక్కల లాగే కాంప్ అంతా ఊళ పెట్టుకుంటూ తిరుగుతుంటాయి.

దీపాలు డిమ్‌గా వెలుగుతున్నాయి... అప్పుడప్పుడు బయట జవాన్ కేక తప్ప ఏ చడీచప్పుడు లేదు. అంతటా నిశ్శబ్దం...

నేను రానంటే వినకుండా నిన్న యూనిట్‌లో 'ఓ కౌన్ థీ' సినిమా కి తీసుకు పోయిన మిస్సెస్ షేర్గిల్‌మీద చాలా కోపం వస్తోంది. 'తుసీ చలో నా జీ ' అంటూ నా ప్రాణాలు పీకింది. కాలేజీలో ఉన్నప్పుడు 'ఆమె ఎవరు?' సినిమా వస్తే ఫ్రెండ్స్ ఎంత బలవంతపెట్టినా వెళ్ళలేదు. ఇప్పుడేమో మా ఏమండీగారి బాస్‌గారి పెళ్ళాంగారి ఒత్తిడికి లొంగాల్సి వచ్చింది. అసలే ఇలాంటి సినిమాలన్నా, కథలన్నా చాలా భయం. హుం తప్పలేదు. మొహమాట మోక్షాలు... నా చుట్టూ సాధన 'నైనా బరిసే' అని తెల్లచీర కట్టుకొని, జుట్టు విరబోసుకొని తిరుగుతున్నట్టుగానే అనిపిస్తోంది. దానికి తగ్గట్టు వాతావరణమూ అలాగే వుంది. ఏదైనా బుక్ చదువుదామంటే గుడ్డి దీపాలు. అబ్బ ఎంతసేపటికీ టైం గడవటము లేదు. ఏమండీ వెళ్ళి అరగంట కూడా కాలేదు. కనీసము పన్నెండు అయితే కాని రారు. నిశ్శబ్దం అయినా తగ్గుతుందని రేడియో ఆన్ చేసాను. వెంటనే. 'నైనా బరిసే, రిమ్మ్ జిమ్మ్ రిమ్మ్ జిమ్మ్' అని మొదలయింది. 'ఓరి దేవుడా ఇక్కడా ఇదే పాటా?' అని తిట్టుకుంటూ వెంటనే బంద్ చేసాను.

టిక్... టిక్... టిక్...

గడియారం ముల్లు శబ్దం కూడా భయంకరంగా వినిపిస్తోంది.

"దీదీ..."

"క్యా గీతా?"

“డర్ లగరై.”

“ఉండవే తల్లీ, నేనే ఛస్తుంటే నువ్వొదానివి... మాట్లాడకుండా పడుకో.”

టైం ఎంతకీ గడవదు. ఇంతా చేస్తే ఇప్పటికి ఎనిమిదీ పది అయ్యింది అంతే.

టక్... టక్... టక్...

ఉలిక్కి పడ్డాను. ఏమిటీ శబ్దం? ఆ... ఏదో ఆలాపన ఏమోలే అనుకొని ఊరుకున్నాను.

అసలు నేనూ పిల్లలని తీసుకొని వెళ్ళాల్సింది. అక్కడే పడుకోబెడితే అయిపోయేది... మళ్ళీ

టక్... టక్... టక్...

ఇంత రాత్రి ఎవరొచ్చారబ్బా!

“గీతా జావ్ దేఖో”’

“నై దీదీ మేరాకొ డర్ లగరా”

మళ్ళీ...

టక్... టక్... టక్...

భయపడుతూ వెళ్ళి తలుపు తీసాను. ఎదురుగా....

చిక్కటి చీకటిలో, కొద్ది దూరములో వెలుగుతున్న నెగడు వెలుగులో, తెల్ల చీర కట్టుకొని, మోచేతులవరకు తెల్ల జాకెట్ వేసుకొని, మోకాళ్ళ

వరకు జుట్టు విరబోసుకొనివున్న ఒక ఆకారము నిలబడి వుంది. తలుపు తీసిన నా చేయి ఎత్తి అలాగే వుంది. నిశ్చేష్టురాలనయి, కొయ్యబారిపోయి అలాగే నిలుచుండిపోయాను. ఇంతలో వెనక నుంచి గీత అరుపులు.

కెవ్వ్ కెవ్వ్...

టక్... టక్... టక్...

చప్పుడు విని తలుపు తీసిన నాకు, ఎదురుగా చిక్కటి చీకటిలో, కొద్ది దూరములో వెలుగుతున్న నెగడు వెలుగులో, తెల్ల చీర కట్టుకొని, మోచేతులదాకా తెల్ల జాకెట్టు వేసుకొని, మోకాళ్ళవరకు జుట్టు విరబోసుకొని కనిపించిన ఆకారము నన్ను చూడగానే మొహము లో తెల్లని పళ్ళు మెరుస్తుండగా నవ్వుతూ చేయి కొద్దిగా ముందుకు జాపుతూ, గీత అరుపులు వినగానే బెదిరి పోయి వెనకకి అడుగు వేసింది. ఇంతలో జీప్ డ్రైవర్ రాంసింగ్ పక్క నుంచి వచ్చి, "మేంసాబ్ ఇనో కల్నల్‌సాబ్ కి బేటీ హై" అన్నాడు. ఎప్పుడు లేచి వచ్చిందో పాప, "హాయ్ ఆంటీ" అంటూ ఆ అమ్మాయి వైపు చేయి చాపింది. అప్పటి కి నా బుర్ర మాములు అయ్యి, పార్టీకి వెళుతూ ఏమండి 'ఈ రోజు ఉదయము కల్నల్ పాల్ కూతురు వచ్చింది. ఆ అమ్మాయీ ఒక్కతే మెస్‌లో వుంటుంది కాబట్టి మన ఇంటికి పంపుతాను' అని చెప్పిన విషయము గుర్తుకు వచ్చింది. అప్పటికే తను 'హాయ్ స్వీటీ!' అంటూ సంజుతో చేయి కలుపుతోంది. నన్ను చూస్తూ, "మిసెస్ కుమార్ అయామ్ నీతూ పాల్!" అంది.

నీతూ చేయి అందుకొని "ప్లీజ్ కమిన్" అన్నాను.

ఇంకా భయం భయంగా గుడ్లప్పగించి చూస్తున్న గీతని చూసి, "ఎందుకు నన్ను చూసి అరిచింది?" అన్నది ఆశ్చర్యంగా.

"ఒక్కసారి వెనకకి చూడు" అన్నాను. వెనక్కి చూసింది.

నల్లగా చీకటి. ఉండనా, ఆరనా అన్నట్లు కొరివి దయ్యాల్లా ఊగుతున్న నెగడు మంటలు. వాటి నీడలు పడుతూ వెనుక జుట్టు విరబోసుకున్నభూతాల్లా పెద్ద పెద్ద చెట్లు భీకరంగా, భీతి కలిగించేలా ఉన్నాయి. అదే సమయంలో ఊఊఊఊ అని ఊళ వేసుకుంటూ ఒక నక్క అటుగా పరుగెత్తింది. అదంతా చూసి "అమ్మో" అని లోపలికి ఒక్క గెంతులో వచ్చేసింది.

"చూసావుగా ఈ వాతావరణంలో నువ్వు తెల్లచీర కట్టుకొని, జుట్టు విరబోసుకొని ఇట్లా వస్తే... అందులోనూ నిన్న మేము 'ఓ కౌన్ థీ' చూసాము. భయపడమా తల్లీ! కాస్తో కూస్తో గుండె గట్టిది కాబట్టి ఇలా నిలబడ్డాము"

"సారీ ఇలా అనుకోలేదు. డాడీ పశుపతి నుంచి ఈ షాంపూ శాటిన్ చీర తెచ్చారు. కొత్తది అని కట్టుకున్నాను" నాతో అని, "డర్ గయే క్యా సారీ" అని గీత చేయి పట్టుకుంది. గీత మొహమాటంగా నవ్వింది.

అమ్మయ్య! ఇంకో మనిషి ఉంటే కాస్త సందడిగా ఉంటుందనుకొని, నీతూ చేయి పట్టుకొని లోపలికి తీసుకెళ్ళాను. పాప మా వెనకాలే తిరుగుతుంటే, బాబుతో గీత కూర్చుంటే, ఇద్దరము కలిసి వంట చేసుకొని, తిని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము. "అవును మాలా, ఇక్కడ కుక్కలేమిటి ఇలా వున్నాయి? పొద్దున వాటిని చూడగానే చాలా భయం వేసింది" అంది.

"అవి కుక్కలు కావు నక్కలు. ఇక్కడ అవి, ఏనుగులు చాలా ఎక్కువ. కొంతమంది ఇళ్ళలో కుందేళ్ళని కూడా పెంచుతున్నారు. మిసెస్ దివాన్ అయితే అడవి లోపలి దాకా వెళుతుంది ఎవైనా డ్రై ఫ్లవర్స్ దొరుకుతాయేమోనని. అస్సలు భయం లేదు. ఈ పూలు ఆమె ఇచ్చినవే. నాకైతే చాలా భయం, అడవి లోపలికి వెళ్ళాలంటే. పాములూ

తిరుగుతుంటాయట. వేరే జంతువులేవీ ఉన్నట్లు లేవు కాని ఏనుగులు చాలా ఎక్కువగా ఉన్నాయి. అందులోనూ అడవి ఏనుగులు. సర్కస్ ఏనుగులలా ట్రైనింగ్ ఇచ్చినవి కావు కదా చాలా వైల్డ్ గా బిహేవ్ చేస్తాయి. ఇక్కడ అరటి పళ్ళు, అనాస పళ్ళు బాగా పండుతాయి. రకరకాల అరటిపళ్ళు ఉన్నాయి. అందులో ఎర్రటి అరటి పళ్ళంటే నాకు చాలా ఇష్టం. ఇంత జాగా ఉంది కదా చక్కగా అరటి చెట్లు పెంచుకుందామనుకున్నాను. అందులో నాకు అరటి చెట్లంటే చాలా ఇష్టం. కాని ఏనుగులు వచ్చి పడతాయని మా ఏమండీ వద్దన్నారు. వాటికి అరటి చెట్లంటే ఇష్టంట. నిన్న ఓ గమ్మత్తు జరిగింది. ఘూర్ఖా రెజిమెంట్ దగ్గర ఒక జవాను రెడ్ అరటి పళ్ళు కొన్ని పక్కన పెట్టుకొని తింటున్నాడట. ఇంతలో ఎవరో భుజం మీద తట్టినట్టు అనిపించి అరటిపళ్ళు ఎవరైనా అడుగుతున్నాడేమో అనుకొని జావ్ జావ్ అంటూ వెనుకకి చూస్తె ఏనుగు నిలబడి వుందిట. అంతే అతను పరుగో పరుగు" అన్నాను. అతనిని తలుచుకొని నవ్వుకున్నాము.

"నువ్వెప్పుడన్నా ఏనుగులను చూసావా?" అని అడిగింది.

"ఆ చూసాను. ఓసారి జీప్‌లో వెళుతుంటే రోడ్‌కు అడ్డంగా ఏనుగుల గుంపు వెళ్ళింది. అవన్నీ అక్కడినుంచి వెళ్ళిపోయే దాకా జీప్ ఆపేసాడు డ్రైవర్. గుంపే కాదు ఒక్క ఏనుగు రోడ్‌మీద నుంచి వెళుతున్నా మనం అది వెళ్ళేదాకా ఆగాల్సిందేనట. కొద్దిగా చప్పుడైనా అది ఎట్లా ప్రవర్తిస్తుందో చెప్పలేము జీపు ఎత్తి పారేసినా పారేస్తుంది అన్నాడు డ్రైవర్" అన్నాను.

కొద్దిసేపట్లో మాకు ఏనుగు ఇచ్చే షాక్‌ను ఊహించని మేము అక్కడ జరిగిన ఏనుగు అనుభవాల గురించి విన్నవి చెప్పుకుంటూ కూర్చుంటే కాలము ఎంత గడిచిపోయిందో కూడా తెలీలేదు. సడన్‌గా టైం చూస్తే టు ఓ క్లాక్ అయ్యింది. ఇంకా వీళ్ళు రాలేదేమా అనుకుంటుండగానే

వచ్చారు. కల్నల్ పాల్ లోపలికి వస్తూనే, “ఉయార్ వెరీ లక్కీ, గాడ్ సేవ్డ్ అజ్, గాడ్ ఈజ్ గ్రేట్“ అన్నాడు కొద్దిగా వణుకుతూ. ఏమండి పిల్లలిద్దరినీ ఆరాటంగా దగ్గరికి తీసుకున్నారు. ఏమయిందో అర్థం కాక నేనూ, నీతూ అయోమయంగా చూస్తూ నిలబడ్డాము. కొంచము తేరుకున్నాక వాళ్ళు చెప్పిన సంగతి...

మెస్ దగ్గర లేడీస్‌రూమ్ పక్కనున్న నీళ్ళ టాంక్‌లో నీళ్ళని ఏనుగులు పాడుచేసి పోతున్నాయని, నీళ్ళ టాంక్ దగ్గర మైల్డ్ గా కరెంట్ కనెక్షన్ ఇచ్చారట. ఈ రోజు సాయంకాలము ఓ పిల్ల ఏనుగు అక్కడికి వచ్చి నీళ్ళు తాగబోతే దానికి షాక్ కొట్టిందట. ఇక అది వెళ్ళి మిగతా ఏనుగు గుంపును తీసుకొచ్చిందట. పార్టీ మొదలయిన కొద్దిసేపటికే ఏనుగుల మంద వచ్చి లేడీస్‌రూమ్‌ని నేల మట్టము చేసేసాయట. వాటి ని ఎవరూ నిలవరించ లేకపోయారట. అందరూ చూస్తూ నిలబడి పోయారట. అదృష్ట వశాత్తూ వీళ్ళ వైపు రాకుండా చేయగలిగారు. ఎప్పుడు పార్టీలైనా పిల్లలని తీసుకెళ్ళి లేడీస్ రూంలో పడుకో పెడతాము. పిల్లల జ్వరము మూలంగా ఆరోజు వెళ్ళలేదు. నేను వెళ్ళలేదని మిసెస్ షేర్గిల్ కూడా వెళ్ళలేదు. లేకపోతే పిల్లలు నలుగురు, వాళ్ళ పనమ్మాయి, మా పనమ్మాయి ఏమైపోయేవారో! ఆ ఆలోచనతోనే వణుకొచ్చి పిల్లలను ఎత్తుకొని ఉన్న ఏమండీ దగ్గరకు వెళ్ళి చుట్టేసాను.

అందరమూ కొద్దిసేపటికి ఆ షాక్‌నుంచి తేరుకున్నాము.

“కొంచెం వేడిగా కాఫీ తీసుకురా” అన్నారు ఏమండి.

కాఫీ తాగి కాసేపు ఏనుగుల సంగతులూ, ఆ రోజు తప్పిన ప్రమాదము గురించీ మాట్లాడుకొని కల్నల్ పాల్, నీతు వెళ్ళిపోయారు.

దయ్యాలూ, భూతాలూ అంటూ ఏమీ ఉండవు. అవన్నీ మన

ఊహలే. మన బాల్యంలోనో, ఎప్పుడో ఏవో జరిగిన విషాద సంఘటనలో, భయపెట్టే సంఘటనలో జరిగినప్పుడు, అవి మన మనసు పొరల్లో నిక్షిప్తమైపోయి అప్పుడప్పుడు ఇలా భయపెడుతుంటాయి. అవన్నీ మన ఊహలే. అదంతా ట్రాష్!

అవును నిజమే అది మనం కాదలేము. కానీ...

***

# 49. అత్తగారి బ్లాక్ మనీ

"పండగకు కొత్తల్లుడు అత్తవారింటికి వచ్చాడు. కొత్తల్లుడు కదా అత్తగారు ప్రేమారగా బోలెడు పిండి వంటలు చేసి అల్లుడిగారికి కొసరి, కొసరి వడ్డించారు. అల్లుడుగారు అత్తగారి అభిమానాన్నీ , పిండివంటలనూ కడుపారా ఆస్వాదించారా... అదేమిటోనండి కాసేపటికే కడుపులో నొప్పితో విలవిల్లాడిపోయారు. ఇంటిల్లి పాదీ 'ఇదేమిటిరా భగవంతుడా!' అని హడలిపోయి డాక్టర్ దగ్గరకు పరుగుపరుగున తీసుకెళ్ళారు. వెంటనే డాక్టర్ అల్లుడికి ఆపరేషన్ చేసి, అల్లుడి కడుపులో నుండి, బొబ్బట్లూ, అరిసెలూ, గారెలూ వగైరా తో పాటు కొన్ని చిల్లర నాణాలు కూడా తీసి చూపిస్తాడు. 'ఆ డబ్బులు ఎక్కడవా?' అని అందరూ విస్తు బోయి చూస్తుంటే, మామగారు "నీ దాపరికము మండా, చిల్లర డబ్బులు పప్పుల డబ్బాల్లో దాస్తావు. ఇప్పుడు చూడు ఏమైందో" అని అత్తగారి మీద ధుమధుమలాడుతాడు."

ఆగండాగండి ఇది మా కథ అని ఫిక్సైపోకండి. మా మనవడు వాళ్ళ స్కూల్లో ఈ నాటకం వేస్తున్నారని, అన్ని పాత్రలూ వాడే చేసి చూపిస్తుంటే నవ్వు ఆపుకోలేక మాకు కడుపులో నొప్పొచ్చేసింది. దానితో పాటు రింగులు తిప్పుకుంటూ బ్లాక్ అండ్ వైట్ కాలానికి వెళ్ళిపోయాను. మరి నాతో పాటు మీరూ వచ్చేయండి.

అది 1969 వ సంవత్సరము. నా పెళ్ళై రెండు నెలలైన రోజులు, నన్ను వంట నేర్చుకోమని మా ఏమండి వాళ్ళ అమ్మ దగ్గర వదిలి పటియాలా వెళ్ళిన రోజులు... నేను భయం భయంగా, బెరుకుగా ఉన్న రోజులు. ఆ రోజులలో... ఓరోజు మా అత్తగారు ఒక 100 రూపాయల నోటు నా చేతికి ఇచ్చి , బాంక్‌కి వెళ్ళి మార్చుకు రమ్మన్నారు. మా ఆడపడుచును నాకు బాంక్‌దారి చూపించటానికి, నాకు తోడుగానూ

పంపారు. ఇద్దరమూ కోఠీ ఆంధ్రాబాంక్ కి వెళ్ళి, అక్కడ కౌంటర్‌లో చిల్లర ఇవ్వమని ఇచ్చాము. అతను మమ్మల్ని, నోటునూ ఎగాదిగా చూసి "నీకెక్కడిది అమ్మాయ్ ఈ నోటు?" అని అడిగాడు.

నేను, "మా అత్తగారు ఇచ్చారండి" అని బుద్ధిగా చెప్పాను. "అక్కడ కూర్చోండి, ఇస్తాను!" అన్నాడు. ఇద్దరమూ ఆయన ఎదురుగా కూర్చున్నాము. ఆయన ఎవరినో పిలిచి దాన్ని చూపించాడు. అతను ఆ నోట్‌నూ , మమ్మలినీ మార్చి మార్చి చూసి, వెళ్ళి ఇంకెవరినో తీసుకొచ్చాడు. అలా... అలా బాంక్‌లో ఉన్న వాళ్ళంతా అక్కడ చేరి, మమ్మల్నీ, ఆ నోట్‌నూ ఒకటే చూడటము. ముందు ఏమనుకోలేదు కాని, అందరూ చేరి అలా శల్య పరీక్షలు చేస్తుంటే చాలా భయం వేసింది. ఇక ఆడపడుచేమో, "వదినా వెళ్ళి పోదాము పద!" అంది. కాని నాకేమో చిల్లర తీసుకొని వెళ్ళక పోతే అత్తయ్య గారు ఏమంటారో నని భయం. ఇక వుండలేక ఏమవుతే అదైందని అతని దగ్గరికి వెళ్ళి "మాకు చిల్లర వద్దండి. మా నోట్ ఇచ్చేయండి. వెళ్ళిపోతాము" అని వినయంగా అడిగాను. ఆయన "ఉండమ్మాయ్, మా మేనేజరు గారు వస్తున్నారు. ఆయన రాగానే చిల్లర ఇస్తాను" అంటుండగానే, మేనేజరుగారు వచ్చారు. ఆయన ఇక ప్రశ్నలు మొదలు పెట్టాడు.

"నీకు పెళ్ళైందా? మీ వారు ఏం పని చేస్తున్నారు? ఈ నోట్ నీకెక్కడిదీ?" ఇలా సాగిపోయింది. ఇక ఏడుపే తక్కువ. కాళ్ళూ, చేతులూ గజగజ వణికి పోతున్నాయి. ఆయన కాషియర్ వైపు తిరిగి "వీళ్ళిద్దరూ చిన్నపిల్లలు" అంటూ ఏదో చెప్ప బోతుండగా, మా ఆడపడుచు ఉక్రోషంగా, "మేమేమీ చిన్నపిల్లలం కాదు. నేను రోజరీ కాన్వెంట్‌లో ఎయిత్ క్లాస్ చదువుతున్నాను. మా అన్నయ్య మిలిట్రీ లో కాప్టెన్" అని గడగడా చెప్పింది.

నేనేమో ఏడుపు, బిక్క, దేభ్యం ఎన్నిరకాల మొహాలున్నాయో అవన్నీ వేసుకొని, "ఇదెక్కడి గొడవరా దేవుడా!" అని మథన పడుతూ, ఏమి చేయాలో దిక్కు తోచక ఉన్న పరిస్థితుల్లో, మా అదృష్టవశాత్తూ ఓ ముసలాయన అక్కడికి వచ్చాడు. ఆయన సంగతి విని, ఆ నోట్‌ను చూసి "ఇది మా చిన్నప్పటి నోట్ అండి. మంచిదే" అన్నాడు. ఈ లోపల వాళ్ళూ కన్‌ఫర్మ్ చేసుకొని, చిల్లర ఇచ్చేసారు. బ్రతుకు జీవుడా అనుకుంటూ ఇంటికి వెళ్ళి మా అత్తగారికి ఇచ్చి, జరిగిన హడావుడి చెపుతుండగా, మా మామగారు వచ్చారు.

ఆయన అచ్చం మా మనవడు నాటకంలో చెప్పిన మామగారిలాగానే మా అత్తగారితో "నీ దాపరికం మండా. ఇంత పాతది ఎక్కడి నుండి తీసావు? పైగా ఆడపిల్లలిద్దరినీ పంపావా? దొంగ నోట్ అనుకొని ఏ పోలీస్‌లకో అప్పచెప్పలేదు. ఇంకా ఏమైనా వుంటే బయటకు తీయి" అని కోపం చేసారు. మరి మా అత్తగారు తీసి ఇచ్చారా? లేదా? ఇస్తే ఎన్ని ఉన్నాయి? వగైరా నాకు తెలియదు. ఎందుకంటే మామగారు అరుస్తున్నప్పుడు అక్కడ ఉండకుండా తప్పుకున్నానన్నమాట!

ఆ విషయము గుర్తొచ్చి నవ్వుకుంటుంటే ఏమండి, "ఏమిటి సంగతి?" అని అడిగారు. అప్పుడు ఈ సంగతి చెప్పగానే ఏమండి, "అప్పుడు కాబట్టి అంత తర్జన భర్జన పడ్డారు. ఇప్పుడైతే దాన్ని మధ్యకు చింపేసి మిమ్మలిని లాకప్‌లో పెట్టేవారు!" అన్నారు. అయ్యబాబోయ్ ఎంత ప్రమాదం తప్పింది!

అప్పుడే ఫ్లాష్ బాక్ అయిపోలేదు. ఓ సారేమయ్యిందంటే ఏమండిని దేనికో డబ్బులు అడుతుంటే మా అత్తగారు విని, ప్రతి పైసా అడగటమేమిటని, నాకు ఏమండి నెలకు 10 రూపాయలు ఇచ్చే ఏర్పాటు చేసారు. అదేమిటో మా ఏమండికి అప్పటికీ ఇప్పటికీ ఏ డబ్బులు

గుర్తుండవు కాని, నాకిచ్చినవి మాత్రము గుర్తుండి తీసేసుకునేదాకా తోచదు! అలా ఒకసారి ఆయన అడుగుతుండగా మా అత్తగారు విని, "వాడు అడగగానే నీదగ్గర వున్న డబ్బులు ఇచ్చేయకు. ముందు ముందు పిల్లలు పుట్టినప్పుడు చాలా ఖర్చులు వుంటాయి. ఆడపిల్లైతే ఎక్కువ వుంటాయి. మగవాళ్ళకు అన్ని తెలీవు. మనము పెట్టే ప్రతి ఖర్చూ దండగ అనుకుంటారు. నీ దగ్గర లేవంటే, అవసరమైతే బయట తెచ్చుకుంటాడు. బయట వాళ్ళకైతే తిరిగి ఇచ్చేస్తాడు. నీకైతే ఇవ్వడు. వాడు నీకు 10 రూపాయలివ్వగానే సగము తీసి జాగ్రత్తగా దాచు" అని హితబోధ చేసారు. అదో అలా నా బ్లాక్‌మనీ ప్రహసనం మొదలయ్యిందన్నమాట!

ఇహ డబ్బులు ఎక్కడ దాచాలి? నా పెట్టెలో పెట్టుకుంటే ఏమండీకి తెలుస్తుంది. దానికి కూడా మా అత్తగారే ఉపాయం చెప్పారు. ఆవిడ అలమారలో, ఎవరికీ కనిపించని చోట, ఎవరికీ చెప్పకుండా, చివరకు ఆవిడకు కూడా చెప్పకుండా దాచమని. మా ఏమండి ఆయన సంపాదన మొదలుకాగానే, ఓ పట్టుచీర, అది పెట్టుకునేందుకు ఓ పెద్ద గాడ్రెజ్ అలమారా వాళ్ళ అమ్మకు కొనిచ్చారుట. అందులో ఆవిడవి ఓ నాలుగైదు చీరలు, మిగతా ఇంటిల్లిపాదీ ఖజానా ఉండేది. మొదటి ఐదు రూపాయలు చేతి లో పట్టుకొని, అలమారా తలుపు తీసి ఎక్కడ దాచాలా అని తెగ చూసాను. మా ఏమండి కోటు జేబులో లాభం లేదు. ఆయన సూట్ రెగ్యులర్‌గా వేసుకుంటారు. మా మామగారి కోట్ కూడా లాభం లేదు. ఎందుకంటే ఆయన డబ్బులు, ఇంకా ఏవేవో ఆయనవన్నీ అందులోనే దాచుకుంటారు. మా మరిదిగారి కోట్ ఐతే బెస్ట్. ఏదో మా పెళ్ళికి మా ఏమండి కుట్టిస్తే, బలవంతం మీద మా పెళ్ళిలోవేసుకున్నారే కానీ ఆ తరువాత ఎప్పుడూ వేసుకోలేదు. అందుకని నేను పూనా నుండి వచ్చినప్పుడల్లా నేను దాచుకున్న నా బ్లాక్‌మనీ అందులో దాచేదానిని. అలా ఒకసారి వచ్చినప్పుడు చూద్దునుకదా నా డబ్బులు మటుమాయం!

మా అత్తగారిని అడిగితే ఆవిడ "వదిన డబ్బులు తీసుకున్నావారా?" అని మరిదిగారిని అడిగారు.

"నాకేం తెలుసు? నా కోట్ జేబులో వుంటే నావనుకొని తీసేసుకున్నాను. నా కోట్ జేబు లో వున్నాయి కాబట్టి అవి నావే. నేను ఇవ్వను. అయినా ఖర్చైపోయాయ్" అన్నాడు.

నా ఏడుపు మొహం చూసి "పిచ్చిదానా, నాకైనా చెప్పొద్దా?" అన్నారు ఆవిడే చెప్పొద్దు అన్నది మర్చిపోయి!

ఆ తరువాత మా అత్తగారికే దాచమని ఇవ్వటము మొదలు పెట్టాను. నా బ్లౌజ్ పీస్ లోనిదే కొంత ముక్క తెచ్చి ఆవిడకు ఇస్తే అందులోనే కట్టి, మా ఏమండి మొదటిసారిగా నాకు గిఫ్ట్ ఇచ్చిన చాకొలెట్ బాక్స్ లో, పెట్టి అలమారాలో ఎక్కడో దాచేవారు. మా మామగారేమో నాతో నారాయణగూడా కోపరేటివ్ బాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేయించారు. అప్పటికి నా పాకెట్ మనీ 50 రూపాయలకు పెరిగిందిలెండి. దాని తో 10 రూపాయలు మా అత్తగారి ఆధ్వర్యంలో, 10 రూపాయలు మా మామగారి ఆధ్వర్యంలో కోపరేటివ్ బాంక్‌లో దాచేదానిని. నేను సిలిగురి వెళ్ళాక ఆ దాపుడు ఆగిపోయింది. ఆ తరువాత ఇంకా బోలెడు బాంక్‌లలో దాచాను. ఆ బాంక్‌ల కథ ఇంకోసారి.

మా అత్తగారు మరణించాక ఆవిడ సామానులు తీసినప్పుడు, అప్పుడు నేను ఆవిడకు దాచమని ఇచ్చిన డబ్బులు అలాగే ఆ మూటలోనే, ఆడబ్బాలోనే బయటపడ్డాయి. మొత్తం 120 రూపాయలు వున్నాయి. అప్పుడు అక్కడ వున్న పిల్లలకు మా అత్తగారి బ్లాక్‌మనీ కథ చెప్పి, ఆ గుర్తుగా తలా పది రూపాయలు ఇచ్చాను. 40 రూపాయలు అప్పటికింకారాని, రాబోయే నా మనవళ్ళూ, మనవరాళ్ళ కు జ్ఞాపకముగా ఇవ్వటానికి దాచాను. నేను వాళ్ళకు ఇవ్వగలిగిన సిరులు ఈ జ్ఞాపకాలే!

అది గుర్తుచేసుకుంటూ మ మనవళ్ళకు, మనవరాళ్ళకు నా అలమారాలో నుంచి వాళ్ళ కోసం పదిలంగా దాచిన ఈ నోట్స్, అదో థంబ్ నేయిల్ కనిపిస్తున్నాయి చూడండి అవి ఇస్తే వాళ్ళు చాలా థ్రిల్ అయిపోయారు. అంత పెద్ద 10 రూపాయలా అని హాశ్చర్య పోయారంటే నమ్మాలి మీరు.

అత్తగారి దగ్గర బ్లాక్‌మనీ ఎలా దాచుకోవాలో చెప్పానుగా, వచ్చే కథలో మామగారి దగ్గర బాంక్‌లలో ఎలా దాచాలో నేర్చుకున్నది చెపుతాను.

***

**(సాహితి – ప్రభాతకమలం యూట్యూబ్ ఛానల్)**

# *50*. మామగారూ - బాంక్ ఎకౌంట్స్

"నీకేమమ్మా? మీ ఆయన నెలకు 50 రూపాయలు పంపిస్తారు. హాయిగా నెలకో చీర 15 రూపాయలదీ కొనుక్కుంటావు, 20 రూపాయలైనా కొనగలవు. వారానికో సినిమా చూడగలవు. మమ్మల్నీ సినిమాకు తీసుకెళ్ళొచ్చు కదా, సుదర్శన్ వాడు ఆడవాళ్ళకు 50 పైసలకే టికెట్ పెట్టాడట. ముందుగా వెళితే టికెట్ దొరుకుతుంది" అని మా ఫ్రెండ్ స్వర్ణ నస పెడుతుంటే, "సరేలే నేను ఇంటికెళ్ళి, అత్తయ్యగారికి చెప్పి, మా ఆడపడుచును తీసుకొని వస్తాను నువ్వు రా" అన్నాను.

సినిమా ప్రోగ్రాం వాసన పీల్చి జుబేదా, లలితా వాలిపోయారు. చేసేదేముంది. వాళ్ళనూ రమ్మన్నాను. ఇంతలో రెష్మీ, సుష్మ చేరిపోయారు. పైగా వాళ్ళెళ్ళేటప్పుడు నన్ను జమురూధ్ తీసుకెళుతానని బేరం పెట్టారు. సరే కానీయండని ఇంటికెళ్ళాను. అసలు సంగతేమిటంటే ఏమండీగారు కోర్స్ తరువాత ఫీల్డ్ కు పోస్టింగ్ వచ్చి వెళితే నేను నా బీ.యే రెడ్డీ కాలేజ్‌లో కంటిన్యూ చేస్తున్నన్నమాట. సరే మొన్నటి అత్తగారి బ్లాక్‌మనీలో చెప్పానుగా మా ఏమండీ నాకు 50 రూపాయలు పాకెట్ మనీ ఇచ్చేవారని, ఇంక మా కాలేజ్ చుట్టుపక్కల అప్పుడే బోలెడు సినిమా థియేటర్‌లు వచ్చాయి. వాటిల్లో పాత తెలుగు సినిమాలు మార్నింగ్‌షో 10.30 కు వేసేవారు. కాలేజ్ పోరగాళ్ళు సినిమాలకు వెళ్ళి చెడిపోతారనేమో మా కాలేజ్ గేట్ పొద్దున కాలేజ్ మొదలు కాగానే మూసేసేవారు. మళ్ళీ 11 గంటలకు తీసేవారు. నాకేమో మా పాప చిన్నదని మధ్యమధ్య ఇంటికి వెళ్ళి చూసుకునేందుకు పర్మిషన్ ఇచ్చారన్నమాట. అయితే నేను వెళ్ళి ముందుగా టికెట్ తీసుకుంటే మా ఫ్రెండ్స్ వస్తారన్నమాట. ఓ అరగంట సినిమా పోతే ఏమవుతుందిట. అంతేగా. అప్పుడే మా ఆడపడుచు టెంత్ ఎగ్జాంస్ అయి కాలేజ్ సీట్ కోసం ఎదురుచూస్తూ ఇంట్లోనే ఉంది. ఇంటికొచ్చి తనను కూడా తీసుకుపోయేదానినన్నమాట. బాగ్రౌండ్

తెలిసిందిగా! ఇక అసలు విషయంలోకి పోదాం.

ఇంటికి వెళ్ళగానే వరండా లోనే మామయ్యగారు ప్రత్యక్షం! "అప్పుడే వచ్చేసావు కాలేజ్ లేదా?" అని అడిగారు. "ఇప్పుడు క్లాస్ లేదండి. పాపను చూసి వెళుదామని వచ్చాను" అని చెప్పి చిన్నగా లోపలికి జారుకొని, అత్తయ్యగారికి సినిమా ప్రోగ్రాం గురించి రహస్యంగా (అనుకున్నాను) చెప్పి, ఆడపడుచును రమ్మని నేను బయటపడ్డాను. సినిమా అయ్యాక తిరిగి ఇద్దరమూ విడివిడిగానే ఇంటికి వచ్చాము. అమ్మయ్య నాలుగు రూపాయలతో ఫ్రెండ్స్ కి సినిమా పార్టీ ఇచ్చి, వాళ్ళ బారినుండి తప్పించుకున్నాను. మామయ్యగారి కంట పడకుండా కూడా తప్పించుకున్నాను. ఎంత తెలివో కదా!

మరునాడు "అమ్మాయ్ నీ దగ్గర 10 రూపాయలున్నాయా?" అని మామయ్యగారు అడుగగానే, "ఉన్నాయండి" అంటూ తీసుకెళ్ళాను. అవి తీసుకొని, "నాతో రా" అని, ఇంటికి దగ్గరలో ఉన్న కోపరేటివ్ బాంక్‌కు తీసుకెళ్ళి , ఎకౌంట్ ఓపెన్ చేయించి, ప్రతినెలా అందులో పది రూపాయలు డిపాజిట్ చేసి తనకు చూపించమని ఆర్డర్ పాస్ చేసారు. ఆ మరునాడు మా మామగారికి తెలిసిన ఒకాయన వచ్చి, "కాచిగూడాలో ఇండియన్ బాంక్ బ్రాంచ్ పెడుతున్నాము, మీరేమైనా ఎకౌంట్ ఓపెన్ చేస్తారా" అని అడిగారు.

వెంటనే మా మామగారు, "మా కోడలితో ఓపెన్ చేయిస్తానండి" అని నేను, 'ఇదేమిటీ?' అని తేరుకునేలోగానే అప్పటికప్పుడు అక్కడ నెలనెలా ఓ పదిరూపాయలు డిపాజిట్ చేసే ఏర్పాటు చేసేసారు. అదీ సినిమా దెబ్బంటే!

వచ్చే 50 రూపాయలలో 10 మా అత్తగారికి పాకెట్ మనీ ఏమండి బదులు నేనివ్వాలి. అది మా వారి హుకుం. 10 ఇండియన్ బాంక్‌లో,

10 కోపరేటివ్ బాంక్‌లో కట్టాలి. అది మామగారి ఆర్డర్. 10 నా బ్లాక్‌మనీ కింద అత్తగారికివ్వాలి. అది అత్తగారి ఆజ్ఞ. ఇక మిగిలినవి 10 రూపాయలు. దానిలోనే నా చదువు, సినిమాలు, బట్టలు, మా అమ్మాయి ఖర్చు అంతా వెళ్ళాలి. ఆడపడుచును తోడు తీసుకొని ఆబిడ్స్ లో ఉన్న గ్రిండ్లే బాంక్‌కు వెళ్ళి తెచ్చుకోవటమూ, సాయంకాలము లోపల ఎక్కడివక్కడ పంచేసి, మిగిలిన పదిరూపాయలకు బడ్జెట్ వేసుకోవటము... ఆ పదిరూపాయలు ఖర్చైపోతే నెల ఎలా గడుపుకోవాలి అని ఖర్చు పెట్టటానికి అసలు ప్రాణమే ఒప్పేది కాదు!

సందడిలో సటాకు అన్నట్లు, మా మరిదిగారు, " వదినా! మీరు అన్నయ్య చెక్ కోసం ఎదురుచూడటమెందుకు? అది జాయింట్ ఎకౌంట్ కదా మీరే చెక్ సైన్ చేసి తెచ్చుకోవచ్చు" అని బత్తీ పెట్టారు. 'హన్నా ఇన్ని రోజులు నాకు తెలియదే ఈ సంగతి. ఎంత కుట్ర!' అనుకొని ఏమండి సెలవలో వచ్చినప్పుడు, అడుగితే, "అంత దూరం ఎందుకులే, చిక్కడపల్లిలో సిండికేట్ బాంక్‌లో తీసుకో" అని అక్కడ ఉన్న ఆయన అకౌంట్ మా జాయింట్ ఎకౌంట్ చేసేసారు. ఆగాండాగండి అప్పుడే ఐపోలేదు.

ఓ నాలుగు సంవత్సరాల తరువాత... మేము సైనిక్‌పురిలో ఉన్నప్పుడు ఓరోజు మామయ్యగారు ఒకాయనను వెంటపెట్టుకొనివచ్చి, "స్టేట్ బాంక్‌లో కొత్తగా కిడ్డీ బాంక్ అని మొదలుపెట్టారు. ఇదిగో పిల్లలిద్దరి కోసం రెండు తీసుకొచ్చాను. రోజూ చిల్లర డబ్బులు ఇందులో వేయి. మొదటి తారీకున ఈయన వచ్చి, వీటి తాళాలు తీసి ఆ డబ్బులు తీసుకెళ్ళి పిల్లల ఎకౌంట్‌లో జమ చేస్తాడు" అని చెప్పారు. అదైందా ... ఓ పది సంవత్సరాల తరువాత నా పార్లర్ కోసం లోన్ ఇస్తారని, బాంక్ ఆఫ్ బరోడాలో కరెంట్ ఎక్కౌంట్ ఓపెన్ చేయించారు ఏమండి. అదీనూ మా మామగారి సలహాతో. అమ్మయ్య అనుకుంటున్నారా అమ్మయ్య

కాదండీ బాబూ పూర్తి కహానీ వినండి.

ఓసారి పార్లర్‌కి ఒకాయనను వెంట పెట్టుకొని మా మామగారు రాగానే నాకు ప్రమాద ఘంటికలు వినిపించనే వినిపించాయి. "ఇదిగో అమ్మాయ్, ఇతనూ రోజూ నువ్వు పార్లర్ మూసే సమయానికి వస్తాడు. ఎంతో కొంత జమచేయి" అంటూ నారాయణగూడా విజయా బాంక్‌లో ఎకౌంట్ ఓపెన్ చేయించారు. అప్పుడే షాప్‌లకు వచ్చి మనీ తీసుకెళ్ళే స్కీం కొత్తగా మొదలుపెట్టారట. అంటే ఏ బాంక్‌లో ఏ స్కీం మొదలుపెట్టినా మా మామగారికి నేనే గుర్తొస్తాననమాట. దేవుడా! ఇన్ని బాంక్‌లల్లో కట్టలేక కొన్ని రోజులయ్యాక కాస్త ధైర్యం తెచ్చుకొని "మామయ్య గారూ నాదగ్గర ఏమైనా లక్షలు మూలుగుతున్నాయా? ఇన్ని బాంక్‌లలో ఎకౌంట్‌లు ఎందుకండీ?" అంటే, "లక్షలే కాదమ్మాయ్ పైసలు కూడా దాచాల్సిందే" అనేసారు. ఇంకా అయిపోలేదండీ బాబూ! ఆ తాత వారసుడు మా అబ్బాయి సలహాతో, మా కోడలు మా ఇద్దరి పేరు మీద, ఆంధ్రా బాంక్‌లో జాయింట్ ఎకౌంట్ ఓపెన్ చేసింది. ఇప్పటికి ఎన్ని బాంకుల పేరులు చెప్పాను? గుర్తు పెట్టుకున్నారా లేదా???

మా మామగారు మేన్ ఖజానా అదో అక్కడ గోడ మీద కనిపిస్తోందే ఆయన కోటు అందులో డబ్బులూ, ఇంకా బోలెడు ఏవేవో పేపర్‌లూ అబ్బో అదో మహా సముద్రం అనుకోండి. అందులో లేనివి లేవు. ఇంకా ఆ పెట్టె ఏమిటంటారా? అందులోనూ ఏవేవో ఉండేవి. పొద్దున్నే దాన్ని మంచం కింద నుంచి బర్ర్ మని లాగి, ఏవేవో సద్దుతుండేవారు. ఎవరికి అవసరమైనా డబ్బులు అందులో నుంచే పంపిణీ అవుతుండేవన్నమాట! ఎక్కువగా అందరి తరఫునా  మా అత్తగారే అడిగి తీసుకునేవారనుకోండి. అందులో నుంచే బాంక్ పుస్తకాలు తీసి రోజూ పొద్దునే బాంక్స్ అన్నింటికీ వెళ్ళేవారు. అలాగే మా మామగారు నాతో ఎకౌంట్‌లు తెరిపించిన బాంక్స్ అన్నింటికీ రోజూ కాకపోయినా వారానికోసారి నేనూ తిరిగేదానిని.

ఇంక తిరిగే ఓపిక లేక ఓ ఐదారు సంవత్సరాల కిందట అనుకుంటాను ఒక రోజు అన్ని బాంక్‌లకు వెళ్ళి ఎకౌంట్స్ అన్ని క్లోజ్ చేసాను. పాపం అందరూ "ఎందుకు మేడం క్లోజ్ చేస్తున్నారు? కావాలంటే మా శ్రీనగర్ బ్రాంచ్ కి ట్రాన్స్ఫర్ చేస్తాము" అని తెగ బతిమిలాడారు! ఈ ప్రక్రియలో కాచిగూడా ఇండియన్ బాంక్ కనపడనే లేదు. నేను ఊళ్ళు తిరుగుతున్నప్పుడు అది ఎప్పుడో ఎక్కడికో షిఫ్ట్ చేసేసారట! అందుకే మా అత్తగారిలాగా నాకూ బాంకుల మీద నమ్మకం లేదు!

ఇంక కొసమెరుపేమిటంటే : నా డిగ్రీ పూర్తికాగానే, స్టేట్‌బాంక్‌లో పని చేసే మా ఏమండి ఫ్రెండ్ కాప్టెన్. నగేష్, "నారాయణగూడా లో స్టేట్‌బాంక్ బ్రాంచ్ ఓపెన్ చేస్తున్నాము. మాలాకు ఉద్యోగం ఇస్తాము. పంపుతారా?" అని మా మామగారిని అడిగారు. కాని పిల్లలు చిన్నవాళ్ళని, ఏమండీకి పీస్ స్టేషన్‌కు ట్రాన్స్ఫరైతే వెళ్ళాలి కదా అనీనూ నేను ఉద్యోగంలో చేరలేదు. అలా బాంక్ ఉద్యోగం కూడా వచ్చిందన్నమాట! కాకపోతే అప్పుడప్పుడు నేనూ, నాతోపాటు నగేష్ మా ఏమండిని సాధించటానికి మాత్రము పనికి వస్తోంది!

మరి మా అత్తగారు బ్లాక్‌మనీ దాచి, మా మామగారు బాంక్‌లలో ఎకౌంట్స్ ఓపెన్ చేసి డబ్బులు పొదుపు చేయటమూ నేర్పారు కదా, మరి నేనెలా దాచుకున్నానో కూడా చెప్పాలిగా! అది వచ్చే కథలో కోడలి పొదుపు పథకంలో చెపుతాను సరేనా? అందాకా సెలవా మరి నమస్తే.

***

**(సాహితి – ప్రభాతకమలం యూట్యూబ్ ఛానల్)**

# 51. అత్తగారి మాట పట్టుచీరల మూట!

మా మామగారు అన్ని బాంక్స్ లల్లో ఎకౌంట్ చేయించినా, అదేమిటో నండి మా అత్తగారిలాగా నాకూ బాంక్‌లంటే నమ్మకం లేదు అని చెప్పానా? మరి నా డబ్బులు ఎక్కడ దాచాలీ అంటే బ్లాక్‌మనీ అత్తగారి దగ్గర దాస్తున్నానా, మరి వైట్‌మనీ ఎక్కడ పెట్టాలా అని తెగ ఆలోచించీ మా అత్తగారినే సలహా అడిగాను. అప్పుడావిడ ఒక ఇత్తడి బొట్టుపెట్టె, అది ఆవిడకు వాళ్ళ మూడో అన్నయ్య పెళ్ళిలో ఇచ్చారట అది ఇచ్చారు. అప్పటికీ ఇప్పటికీ అదే నా గల్లాపెట్టి. నాకే కాదు మా పిల్లలు ఉద్యోగాలల్లో చేరినప్పుడు వాళ్ళ జీతం కూడా తెచ్చి అందులో వేసేవాళ్ళు. ఏమండీ సరేసరి అలా అందరూ అందులోనే వేసి, దానిలోనుంచే తీసి వాడుకోవటం అలవాటైపోయింది. మా అత్తగారు అభిమానంతో ఇచ్చిన ఆ బొట్టుపెట్టె అంటే నాకు చాలా ఇష్టం. దానికి మా ఏమండి పాలిష్ చేయిస్తానంటే, దాని ఆంటిక్‌లుక్ పోతుందని నేను వప్పుకోలేదు. అలాగే భద్రంగా దాచుకున్నాను. నేనైతే మామగారితో వెళ్ళటమే కానీ ఆ తరువాత బాంక్‌ల జోలికి వెళ్ళిందే లేదు.

ఏళ్ళు గడిచాక ఏమండీ, "ఇది నీ ఎకౌంట్, ఇది నీ కార్డ్!" అని చెపితే విని ఊరుకున్నాను. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ ఓ సంతకం పెట్టటం వరకే నా పని. ఏమండీనే అన్నీ ముందేసుకొని ఏవో తిప్పలు పడుతూ ఉంటారు. అసలు ఇంతవరకు ఏ.టి.యం ఎలా ఉంటుందో కూడా చూడలేదు. నాకు అవసరమున్నప్పుడు ఏమండీని డబ్బులు తెచ్చి ఇచ్చేవరకూ సతాయించటమే నా పని. ఏమండి డబ్బులు ఇచ్చాక అందులో నుంచి కాస్త హడావుడిగా తీసేసి ఓ అక్కడ, వైట్‌మనీ ఈ గల్లాపెట్టెలో పెడతానన్నమాట. పోయిన నెల ఏమండీ ఏదో పనిలో ఉండి, హెల్పర్స్ కు ఇచ్చేందుకు చెక్‌మీద నన్ను సంతకం చేసి ఇయ్యమన్నారు. టేబుల్ ముందు, కళ్ళజోడు పెట్టుకొని, చకచకా

రెండు సంతకాలు పడేసేసరికి ఓ ఐఏయస్ ఆఫీసర్ ఫీలింగ్ వచ్చేసి, ఇదేదో బాగుందే అనుకొని ఎడాపెడా అందరికీ చెక్‌లు రాసి ఇచ్చేసాను. స్వీపర్‌కు కూడా చెక్ ఇద్దామనుకున్నాను కాని "100 రూపాయలకు చెక్ ఎందుకమ్మా?" అని దీనంగా అడిగేసరికి పోనీ అని డబ్బులు ఇచ్చేసాను. మోడీ ధర్మమా అని బోలెడు చెక్‌లు సంతకం చేసాను.

పొద్దున ఏమండీతో, "నాలుగో తారీకు వచ్చేసింది. అందరికీ జీతాలు ఇవ్వాలికదా చెక్‌లు రాసి ఇవ్వనా?" అని సంబరంగా, మొహం అంతా నవ్వు పులిమేసుకొని అడిగాను. "దేనిమీద రాస్తావు, పోయినసారి తెగ చెక్‌లు ఇచ్చేసావు కదా, చెక్‌లీవ్స్ అన్నీ అయిపోయాయి" అని తాపీగా చెప్పారు. "మరి ఎట్లా?" అంటే "నాకు పని ఉంది, చెక్‌బుక్ కోసం ఈ అప్లికేషన్ బాంక్ లో ఇచ్చి, డబ్బుల కోసం ఏ.టియం లైన్‌లో నిలబడు" అని మరింత తాపీగా చెప్పి చెక్ చెప్పారు. "ఏ.టి యం లో 2000 లే ఇస్తున్నారట  కదా ఎన్ని సార్లు వెళ్ళాలి అంటే కాదు 4500 దాకా ఇస్తున్నారట!" అన్నారు. అదైనా ఎన్ని సార్లకు సరిపోతుంది? అయినా అలవాటులేని పన్లు. మా ఫ్రెండ్  చెప్పినట్లు ఇస్ ఉమర్ మే క్యా సీకేంగే యార్?

అప్పుడు అలా జరిగిందా?  మొన్నామధ్య ఏమండి "మాలా ఓ వెయ్యిరూపాయలు అప్పిస్తావా?" అని అడిగారు. "అమ్మో వెయ్యే, నా దగ్గర లేవు" అన్నాను నేను ఏమండీ వైపు చూడకుండా జాగ్రత్త పడుతూ.

"ఏమండీ డాడీ, మాలా మమ్మీ దగ్గర చాలా రూపాయలుంటాయి లేవని అబద్ధం చెబుతోంది" అన్నాడు ఉక్రోషంగా అంతకు ముందే అడిగి లేవనిపించుకున్న సుపుత్రుడు.

అంతకన్నా పౌరుషంగా "నేనేమీ అబద్ధం చెప్పటంలేదు కావాలంటే చూసుకోండి!" అని నా అలామారా తాళం చేతులు నిర్లక్షంగా, కొద్దిగా

భయంగా ఇచ్చాను.

అంతే తండ్రీ కొడుకులు నా అలమారాలోని చీరలన్నీ తీసి, వెతికి నా కళ్ళ ముందే రూపాయలు తీసారు ఎంతంటే అక్షరాలా లక్ష! వాళ్ళే కాదు 'ఇంత ఉన్నాయా?' అని నేనూ బిత్తరపోయాను సుమండీ!

"పిచ్చిపోరీ! నాకియ్యకపోతే పోయావు. ఇంత డబ్బు ఇంట్లో ఉంచుకుంటారా? అసలే రోజంతా ఒక్కదానివే ఉంటావు" అని కోపం చేసి, ఆ తరువాత వడ్డీతో సహా బాంక్‌కు తీసికెళ్ళి యఫ్.డి నాపేరు మీదే వేసేసారు.

అంతటి ఘనచరిత్ర ఉన్న నేను, "అమ్మో మాలా దగ్గర బ్లాక్‌మనీ లక్షరూపాయలు ఉన్నాయట" అని ఫ్రెండ్స్ సర్కిల్‌లో హీరోయిన్‌గా వెలిగిన నేను నాలుగు రోజులు నుంచీ అలమారా అంతా కిందా మీదా చేసినా ఒక్కటంటే ఒక్కరూపాయి బ్లాక్‌మనీ దొరకలేదు అదేమిటో మరి. అసలే ఎవరో కాల్ చేసి, "మీ దగ్గర బ్లాక్‌మనీ ఉందా? ఉంటే చెప్పండి ఎంతైనా కొంత పర్సెంటేజ్ తీసుకొని వైట్ చేసి పెడతాము" అని అడుగుతున్నారట! అట్లా ఎవరైనా నాకు ఫోన్ చేసి అడిగితే "నా దగ్గర బ్లాక్‌మనీ లేదు" అని చెప్పాలంటే ఎంత అవమానం? ఎంత అదీ, ఎంత ఇదీ!

హేమిషో ఇలా అయిపోయింది. అసలుకే మా అత్తగారు, "ఇల్లన్న చోట ఓ పదిరూపాయలు, ఓ మనిషి అన్నం ఎప్పుడూ ఉండాలే కమలమ్మా" అని చెప్పారు. మా అత్తగారి కాలంలో పదిరూపాయలైతే నా కాలంలో పదివేల రూపాయలు ఉండాలి కదా! అందుకే మళ్ళీ బ్లాక్‌మనీ చూసుకోవాలి. ఎంతైనా అత్తగారి మాట పట్టుచీరల మూట అవునంటారా? కాదంటారా? మీరేమంటారు?

ఇంక కొసమెరుపేమిటంటే మేము అప్పుడెప్పుడో ఉండి వచ్చిన ఇంటికి, మా అత్తగారికీ, నాకూ ఆంధ్రాబాంక్ వాళ్ళు, "మీ ఎకౌంట్ వాడక చాలా ఏళ్ళైయింది అందుకని మూసేస్తున్నాము, మీరు వచ్చి చూసుకోండి" అని ఉత్తరాలు రాసారు. అవి నా చేతికి వచ్చేసరికి వాళ్ళిచ్చిన గడువు అయిపోయింది. మా పిల్లలేమో, "నీవీ, బామ్మవీ బ్లాక్‌మనీ అందులో ఉన్నాయేమో! అయ్యో మిస్సైపోయావే!" అని తెగ జోకేసారనుకోండి.

ఇవండీ బ్లాక్‌మనీ, నా గల్లాపెట్టి గలగలలు! నేను మా అత్తగారి దగ్గర, మా మామగారి దగ్గర నేర్చుకున్న పొదుపు పథకాలు మా పిల్లలకు ఎలా నేర్పానో కూడా చెప్పాలిగా. ఆ విశేషాలు వచ్చే కథలో 'కిడ్డీ బాంక్'లో చెబుతాను. సరేనా?

***

**(సాహితి – ప్రభాతకమలం యూట్యూబ్ ఛానల్)**

# 52. కిడ్డీ బాంక్

"అమ్మా యాభై పైసలకు పది రూపాయలిస్తే చిల్లరెక్కడినుంచి తేనమ్మా?" పూలతని మాటలకు, మళ్ళీ లోపలొకసారి వెతికి ఎక్కడా చిల్లరపైసలు కనపడక, "నీ దగ్గర ఉంటాయి చూడు" అన్నాను. లేవని అతని సంచీ చూపించి, "రేపియ్యమ్మా" అని వెళ్ళిపోయాడు.

"అదేమిటి? యాభై పైసలు లేవా? అవి కూడా నీ బ్లాక్‌మనీలోకి చేరిపోయాయా?" వేళాకోళమాడారు ఏమండి.

"హుం. చిల్లర డబ్బులు నా బ్లాక మనీ దాకా ఎక్కడ వస్తున్నాయి?" నిట్టూర్చాను.

"అక్కడా ఇక్కడా ఎప్పుడూ ఉండేవి కదా? ఈ మధ్య నాకూ దొరకటం లేదు. మరి అవేమవుతున్నాయి?" ఆశ్చర్యంగా అన్నారు ఏమండి.

నాకూ తెలుసు మీరూ మా ఏమండీలాగే ఆ చిల్లరంతా నా బ్లాక్‌మనీ లోకి చేరిపోయి ఉంటాయనుకుంటున్నారని. అవునులెండి పోయిన వారమేగా నా దగ్గర బ్లాక్‌మనీ లేదని వాపోయాను. అందుకే నా మీదే అపోహ పడుతున్నారు. కాదండీ బాబూ నా పని అస్సలు కాదు. మరి అవేమవుతున్నాయో చెపుతాను సావధానంగా వినండి.

నా చిన్నప్పుడు డబ్బులు దాచుకోవటానికి మట్టి ముంతలు దొరికేవి. మా అమ్మ అది కొనిచ్చి, అందులో దాచుకోవటానికి అప్పుడప్పుడు చిల్లర పైసలు ఇచ్చేది. ఇంకా మానాన్నగారు ఇచ్చిన దీపావళి హారతి డబ్బులల్లో నా వాటా మా అత్తయ్య ఇవ్వగానే అందులోనే వేసేదానిని. నా పుట్టినరోజుకు కొత్త బట్టలతో పాటు ఓ అయిదు రూపాయలు

నాన్నగారు ఇచ్చేవారు. అవీ అందులోనే చేరిపోయేవి. ఇహ ఆ కుండను రక రకాల రంగులు వేసి, డిజైన్స్ వేసి ముస్తాబు చేసేదానిని. దానిని చాలా అపురూపంగా దాచుకునే దానిని. ఆ కుండ నిండాక బుక్స్ కొనుక్కోవటము మా అమ్మ అలవాటు చేసింది.

నేనూ ఆ ఆనవాయితీ పోనీయకుండా, ఓ శుభముహూర్తాన, మా పిల్లలిద్దరికీ చెరొక ముంత కొనిచ్చాను. నాలాగే మా అమ్మాయి దానికి చాలా ముస్తాబులు చేసి, మురిసిపోయేది. అమ్మలాగే నేనూ వాళ్ళకు పాకెట్‌మనీగా అప్పుడప్పుడు చిల్లర ఇస్తుండేదానిని. అవి కాకుండా ఏ డ్రసింగ్ టేబుల్‌మీదనో, సైడ్ టేబుల్స్ దగ్గరో చిల్లర పెట్టి మర్చిపోయామో అంతే సంగతులు. అవి పిల్లలిద్దరిలో ఎవరు ముందు చూస్తే వారి ముంతలో చేరిపోయేవి. ఇద్దరూ ఒకేసారి చూసారో నిశ్శబ్ద పోరాటాలు జరిగేవి. ఇప్పుడు అర్థమయ్యిందిగా చిల్లర డబ్బులన్ని ఎక్కడకి చేరిపోతున్నాయో!

ఈ గాంగ్ వార్‌లు సరిపోనట్లు మా మామగారు స్టేట్‌బాంక్‌వాళ్ళు కొత్తగా పరిచయం చేసిన కిడ్డీ బాంక్స్, మా పిల్లలిద్దరికీ ఇచ్చారా? ఇహ చూసుకోండి. ఆ ఏముంది ఇంక చూసేది అనకండి వినండి మరి.

పిల్లలు ముంతలతోపాటు కిడ్డీ బాంక్‌లల్లో కూడా నింపటం లో బిజీ బిజీ. నాకైతే ఇంట్లోకి ఏ అవసరం వచ్చినా కిడ్డీ బాంకైతే తాళం తీసి వాడుకుంటాము, ముంతలైతే అంత తొందరగా పగులకొట్టము కదా అనిపించి ఎక్కువగా ముంతలలోనే డబ్బులు వేసేదానిని. ప్రతి నెల మొదటి తారీకున ఇద్దరి ముంతలు తీసి, 'బాంక్ ఆఫ్ బరోడా' లోని వాళ్ళ ఎకౌంట్‌లో వేసేసేదానిని. మేము వేరే ఊళ్ళలో వున్నప్పుడు, హైదరాబాద్ వచ్చేటప్పుడు, మూడు రోజుల ప్రయాణములో ఖర్చు పెట్టుకోవటము కోసము ఏమండి పిల్లలిద్దరికి చెరి పది రూపాయలు

ఇచ్చేవారు. మేము హైదరాబాద్ చేరుకున్నాక కూలీకి ఇవ్వటానికి వాళ్ళ దగ్గరే ఆ పది రుపాయలు అప్పుచేసేవారు ఏమండి. వాళ్ళు యు.యస్ వెళ్ళేటప్పుడు ఆ మనీ తీసి ఇస్తే ఎంత సంబరపడిపోయారో! దాదాపుగా వాళ్ళ టికెట్ ధరలో సగము వచ్చాయి. చినుకు చినుకూ కలిస్తేనేగా చెరువు నిండేది! అందుకే చిల్లర మాలక్ష్మిని చిన్న చూపు చూడకండి. అవసరానికి ఆదుకుంటుంది.

ఇంక కొసమెరుపేమిటంటే, మా అబ్బాయైయితే ఖర్చు దగ్గర కూడా మహా పీనాసి. అందుకే ఏమండి ముద్దుగా 'డబ్బులుగా' అని, 'రామనాథ్ గోయింకా' అని పిలుచుకుంటారు. ఇప్పుడైతే డబ్బులన్నీ బాంక్‌లోనే వుంటాయి. ఎప్పుడైనా అడిగితే, గిడుగుతే "పర్స్ లో లేవు మాతే ఏ. టి .యం కెళ్ళి తేవాలి. ఇప్పుడైతే నువ్విచ్చేయ్, తరువాత ఇస్తాను" అంటాడు. ఎప్పుడూ ఆ ప్లాస్టిక్ మనీ తప్ప, నోట్ మనీ వుండనే వుండదు. "అత్యవసరమైతే ఎలారా?" అంటే, "నువ్వున్నావుగా!" అంటాడు.

"ఒరేయ్ బేటా, మీ ఆవిడకి పూలు కొనియ్యటనికి నువ్వేమీ శోభన్‌బాబు కాలం వాడివి కాదు కాని కనీసము మొక్కజొన్న పొత్తులు కొనివ్వటానికైనా దగ్గర కాసిని డబ్బులుంచుకోరా!" అంటే చిద్విలాసంగా నవ్వేస్తాడు. ఈ కాలంలో అందరూ క్రెడిట్‌కార్డ్ లూ, ఏ. టి .యం లూ అంటారు. అక్కడ దొంగల చేతికి చిక్కని మాట నిజమే కాని అత్యవసరమైతే మన చేతికి చిక్కేదెలా? ఈ మధ్య బందులతో ఏ.టి.యం లు కూడా బందే వుంటున్నాయి. అప్పుడు పిల్లల కిడ్డీబాంక్‌లే శరణ్యం. చిల్లర ఎన్ని వండర్‌లైనా చేస్తుంది. పిల్లలకు చిన్నపటినుండే పొదుపు అలవాటు చేయాలి. డబ్బులు కూడబెట్టుకొని, కొనుక్కోవటములోని ఆనందాన్ని అనుభవించనీయాలి... అంటాను నేను. మరి మీరేమంటారు?

మా పిల్లల గల్లాపెట్టి గలగలలు విన్నారుగా!. ఇన్ని చెప్పిన దానిని

ఏమండీగారి మనీ మానేజ్మెంట్ కూడా చెప్పాలిగా. అది వచ్చే కథలో చెపుతాను.

***

**(సాహితి – ప్రభాతకమలం యూట్యూబ్ ఛానల్)**

# 53. ఏమండి బడ్జెట్ సమావేశం!

"టైర్ పంచర్ పదిరూపాయలు, పొల్యూషన్ చెక్"

"అట్లా నోటిలెక్కలు కాదు. కాగితం మీద రాసి తీసుకురా."

బయట నుంచి డ్రైవర్, ఏమండీ మాటలు వినిపిస్తుంటే ఏమండీగారి బడ్జెట్ సమావేశం మొదలయ్యింది అనుకుంటుండగానే "మణీ" ఏమండీగారి పిలుపు వినిపించింది. మణి చేతులు తుడుచుకుంటూ వెళ్ళింది.

"నిన్న కూరగాయలు తేవాలని డబ్బులు తీసుకెళ్ళావు. ఏమేమి తెచ్చావు? ఎంత ఖర్చయ్యింది? మిగిలిన పైసలేవి?" ఏమండీ ప్రశ్నల వర్షం కురిపించారు.

"ఉల్లిపాయలు అయిదురూపాయలు, పాలకూర"

"నీకెన్ని సార్లు చెప్పాను బిల్ తేవాలని? బిల్స్ ఏవి?" ఏమండి గద్దించారు.

"సార్ కూరగాయలవాడు బిల్ ఇవ్వడు కదా సార్" బిక్క మొహంతో అంది మణి.

"వాడు బిల్ ఇవ్వడు సరే, నీకు ఒక నోట్‌బుక్, పెన్ ఇచ్చాను అందులో లెక్క వ్రాయమని, నెల మొదట్లోనే ఆ నెలకేమేమి సామానులు కావాలి? ఎంతెంత కావాలో కూడా నువ్వూ, మేడం చూసుకొని రాయమని చెప్పానా? ఏం చేసావు ఆ పుస్తకం? మీరు చదువుకున్నారు కదా! ఆ మాత్రం రాయలేరా? లేక ఓపిక లేదా?" ఇక ఆ తరువాత నావంతేనని అక్కడికి వచ్చిన నావైపు, లెక్క రాసి తీసుకొచ్చిన డ్రైవర్ వైపు

కూడా చూస్తూ సీరియస్‌గా అన్నారు ఏమండి.

ప్రతి జనవరి మొదటి తారీఖున ఏమండీ రెండు డైరీలు, కొన్ని నోట్‌బుక్స్, పెన్స్ తెస్తారు. తేగానే డైరీ మొదటిపేజీలో ఆయన పేరు, ఫోన్ నంబర్స్, అడ్రెస్, ఏమండి బ్లడ్ గ్రూప్, ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు అన్నీ రాసుకుంటారు. డైరీలో ఆ సంవత్సరము వచ్చే అందరి పుట్టినరోజు, పెళ్ళిరోజు తారీఖులు, ముఖ్యమైన పండుగలు మొదలైనవటికి గుర్తులుగా చిన్నచిన్న రంగురంగు బుక్‌మార్క్ లు అతికిస్తారు. ఆ తరువాత ఏవైనా పెళ్ళిపిలుపులు లాంటివి వచ్చినప్పుడు గుర్తుగా వాళ్ళు పిలిచి వెళ్ళగానే బుక్‌మార్క్స్ పెట్టేస్తారు. అలాగే నాకూ ఒక డైరీ ఇచ్చి రాసుకోమంటారు. కాకపోతే మొదటిపేజీ ఒక్కటే రాసుకుంటాను. మిగతావి నాకు ప్రత్యేకంగా ఏమీ ఉండవుగా ఏమండీ డైరీ చూస్తే సరి అని బద్ధకిస్తాను. ఉష్ ఇది రహస్యం.

ఇంక నోట్‌బుక్స్ రోజువారీ జమాఖర్చులవన్నమాట. అవి నాకొకటి, మా వంటమనిషికొకటి సరఫరా చేయబడతాయి. జనవరిలోనే ఆ సంవత్సరం ప్రయాణాలకు, బట్టలకు ఇలా కొన్నింటికి వార్షిక ప్రణాళిక వేయబడుతుంది. ఇక నెలవారీ ఖర్చులకు, ప్రతి నెల మొదటి తారీఖున ఆ నెల బడ్జెట్ వేసుకుంటారు. ఎవరెవరికి ఎంత ఇవ్వాలి? ఏఏ బిల్స్ కట్టాలి? ప్రొవిజన్స్ కు, గిఫ్ట్స్ కు, ఇలా ప్రతిదానికి ఇంత అని ఆనెల బడ్జెట్ నిర్ణయించబడుతుంది. ముందు నెల ఖర్చులని చూసుకొని ఎక్కడ ఖర్చు ఎక్కువయ్యింది? ఎక్కడ తక్కువయ్యింది? ఎక్కువ అవుతే ఎందుకెక్కువైయింది? తక్కువవుతే ఎందుకు తక్కువయ్యింది చూసి మరుసటి నెల ప్రణాళికలో అడ్జెస్ట్ చేస్తారు. ప్రతిరోజూ సాయంకాలము కానీ, సాయంకాలం టైం లేకపోతే మరునాడు పొద్దున కానీ ఇదో ఇలా బడ్జెట్ సమావేశం ఏర్పాటు చేసి ఆ రోజు ఏమండి ఎవరెవరికి ఎంత కాష్ ఇచ్చారు? వాళ్ళు ఏమి ఖర్చు చేసారు అన్నది వారికి ఇచ్చిన నోట్‌బుక్‌లో

రాసి చూపించాలి. సరిగ్గా చెప్పలేదో తన పర భేదం లేకుండా అందరికీ దొబ్బులు పడిపోతాయి!

ఏమిటీ, ఇదంతా విని మా ఏమండీ ఎంత పీనాసో అనుకుంటున్నారా? కాదండీ బాబూ కాదు. లెక్కలు రాయటములో ఎంత పట్టింపో ఖర్చుపెట్టటములోనూ అంతే పట్టింపు. బట్టలు రిలయెన్స్ లోనే కొంటారు. చెప్పులు, షూస్ బాటాలోనే ఇలా ఏదైనా బ్రాండెడ్‌వే కొంటారు. నా చీరలైనా సరే సేల్స్ లో కొన్నానో ఇక అంతే సంగతులు. ఓసారి యూ.యస్ వెళ్ళినప్పుడు, ఆయన వాచ్ ఆగిపోతే, మా అబ్బాయి "ఇక్కడ బాగు చేయరు డాడీ, కొత్తది కొనిస్తాను" అంటే వినలేదు. ఇండియా వచ్చాక నల్లకుంటలో వాచ్ షాప్‌కు వెళ్ళి బాగు చేయించుకున్నారు. ఇక ఏమండీ బట్టలు కుట్టించుకోవటానికి ఏమండీతో ఓసారి వెళ్ళి ఆ షాప్ చూసి నోరెళ్ళబెట్టానంటే నమ్మండి. ఆబిడ్స్ లో అలా ఒక అండర్ గ్రౌండ్ టైలర్స్ షాపింగ్ మాల్ ఉందని నాకస్సలు తెలియనే తెలియదు. అక్కడ అందరూ టైలర్స్ నే. అక్కడ సరైన కొలతలతో, తక్కువ రేట్స్ కు చాలా బాగా కుడతారట. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడే కుట్టించుకుంటున్నారట! ఏమండి బాగా డ్రెసప్ అవుతారని పేరు. అలాగే ఏవి కొన్నా బేరమాడ కుండా కొనరు. అది రిలయన్స్ షాప్ అయినా, ఏర్పోర్ట్ లో షాప్ అయినా సరే సగానికి సగం బేరమాడే కొంటారు. అదేమిటో వాళ్ళూ అలాగే ఇస్తారు. ఎంత ఓపికనో!

ఇక ఈ సమావేశం అదన్నమాట! వంటమనిషి, డ్రైవర్ లెక్క చూసి, రాసుకోవటము అయ్యాక నావైపు చూసారు.

"ఈనెల నీ లైబ్రరీ లెక్క రాలెదేమిటి?" అడిగారు.

"బాబోయ్ నేను ఆ లెక్క చెప్పకుండా దాచలేదండి, ఈ కొత్తింటి

దగ్గర రెంటెడ్ లైబ్రరీలేవీ లేవు. అందుకే ఆ లెక్క రాలేదు" జవాబిచ్చాను కంగారుగా.

నా వైపు సాలోచనగా చూసి "ఈ నెల నుంచి నీకు నెలకు 500ల రూపాయలు బుక్స్ కోసం సాంక్షన్ చేస్తున్నాను. ఇంక రెంటెడ్ లైబ్రరీల చుట్టూ తిరగకుండా నీకు కావలసిన పుస్తకాలు కొనుక్కో" అన్నారు.

ఒక్క క్షణం బిత్తరపోయి "ఎందుకండీ అంత డబ్బు. అనవసరమైన ఖర్చు. ఇంకెవరినైనా అడుగుతాను ఇక్కడికి దగ్గరలో ఏమైనా రెంటెడ్ బుక్‌షాప్ ఉందేమో. మొన్నెవరో అన్నారు రోజూ రెంట్‌కు ఇంటికి తెచ్చిస్తారని. అది కనుక్కుందామనుకుంటున్నాను" అన్నాను.

"ఇప్పుడు అంత అవసరం ఏముంది? నీకు ఉన్న వ్యాపకం పుస్తకాలు చదవటమొక్కటే. వేరే ఏమీ ఖర్చులు చేయవు. నీకు కావలసిని కొనేసుకో" అన్నారు ఇంకో మాటకు అవకాశము ఇవ్వకుండా.

అప్పుడే కాదు ఈ మధ్య "మన ఎంటర్టేన్మెంట్ ఖర్చు పెంచుతున్నాను" అన్నారు ఉరుములేని పిడుగులా.

"అదేమిటీ ఎందుకు?" అడిగాను.

"ఇన్ని సంవత్సరాలూ బాధ్యతలని, పొదుపు చేసి మన ఖర్చులు తగ్గించుకున్నాము. ఇప్పుడు మనకేమీ బాధ్యతలు, బరువులు లేవు. మనము దాచి పిల్లలకు ఇవ్వాల్సిన పనీ లేదు. ఇప్పుడు ఉన్న డబ్బులు మన శేషజీవితానికి సరిపోతాయి. ఇప్పుడు మనకు కావలసింది మానసికంగా, శారీరకంగా రిలాక్సేషన్. నువ్వు కూడా ఇరవైనాలుగు గంటలూ ఆ లాప్‌టాప్ ముందు కూర్చోకు. నాతోపాటు క్లబ్ కు రా. కార్డ్స్ ఆడు, ఫ్రెండ్స్ తో వెళ్ళు. ఇవేవీ దండగ ఖర్చులు కావు. మనకోసం అంటూ కొంత ఖర్చు పెట్టుకొని, మనలని మనం ఉత్సాహపరుచుకుంటున్నాము"

అన్నారు.

సో అవసరమైన చోట ఖర్చు పెట్టి, తగ్గించే చోట తగ్గించి, మనకోసం అంటూ కొంత మనం ఖర్చు పెట్టుకోవాలన్నమాట. కొసమెరుపేమిటంటే నేను బ్లాక్‌మనీ దాస్తానని ఏమండీగారికి తెలుసు, ఏమండీకి తెలుసని నాకూ తెలుసు. అదీ సంగతి.

ఇవండీ మా ఇంటి గల్లాపెట్టి గలగలల కబుర్లు.

***

# స్పందనలు

**'చాందినీ' కథపై విశ్లేషణ - మంథా భానుమతి (ప్రఖ్యాత సీనియర్ రచయిత్రి):**

కన్నపిల్లలమీద ఎంత ప్రేమ ఉన్నా తమ అలవాట్లను, వ్యసనాలను వదిలించుకోలేరు కొందరు తల్లిదండ్రులు. తల్లులకేం వ్యసనం అనుకుంటాం... కానీ పిల్లలు పిలుస్తున్నా వినిపించుకోకుండా పుస్తకాలు పట్టుక్కూర్చోడం, ఇంటిపనులని గాలికొదిలి టీవీ చూస్తూ కూర్చోడంవంటివన్నీ మానసిక బలహీనతలే.

ఇంక తండ్రుల విషయానికొస్తే, అలవాట్లేంఖర్మ... వ్యసనాలే కోకొల్లలు. ఒకటో తేదీనాడే జీతం అంతా పేకాటకి అర్పణం చేసి ఇల్లు చేరే వాళ్ళు నాకు నలుగురైదుగురు తెలుసు. ఇంక మందుబాబులు, బియ్యం నిండుకున్నా సిగరెట్ పెట్టెకి తగలేసే వాళ్ళు... లాటరీ టికెట్ల మోజుతో కోటీశ్వరులవాలనుకునే వాళ్ళు, నష్టాలొచ్చినా షేర్లమార్కెట్లో లక్షలు పోగొట్టుకొనేవాళ్ళు ఎంతమందో! పెళ్ళాం, పిల్లలు 'అలో లక్షణా!' అని గోలెడుతున్నా వాళ్లకేం పట్టదు.

ఒక కొత్తరకం వ్యసనానికి అలవాటుపడ్డ తండ్రి శ్రీహర్ష. పుట్టిన క్షణంనుంచే కూతుర్ని ఎంతో ఎత్తుకు తీసుకెళ్ళాలని కలలు కంటాడు. అపురూపంగా పెంచాలనుకుని ఒక్క కూతురే చాలనుకుంటాడు. మొదట్లో ఎంతో సంతోషంగా, కూతురే లోకంగా గడుపుతూ, ఆ పాప ఉన్నతికే అహర్నిశలూ శ్రమించే తండ్రిని మహమ్మారిలాంటి వ్యసనం తగులుకుంది. రూపాయి ఖర్చు లేకపోయినా అది కూతురి భవిష్యత్తుకి ముప్పు కలిగించేది. అనుకోకుండా భార్య కంట పడిన శ్రీహర్ష తత్తరపాటుతో అరిచి ఆవిడ నోరు మూయిస్తాడు.

కూతుర్ని తీసుకుని ఇల్లు విడిచిపోయిన తల్లి, ఆ సమస్యని పరిష్కరించిన విధానం మనసుకి హత్తుకుంటుంది. అయితే దానికి ఆ తండ్రి కూడా మనఃస్ఫూర్తిగా సహకరిస్తాడు. మళ్లీ ఆ ఇంట ఆనందాలు వెల్లి విరుస్తాయి. భయంకరమైన ఊబిలోకి పడాల్సిన తమ చిన్నారి పాపని రక్షించుకుంటారు.

శ్రీమతి కమలా పర్చా గారి కలం నుండి వెలువడిన, తండ్రీ కూతుళ్ళ బంధంలో ఒక కొత్త కోణం చూపించే కథ “చాందినీ”.

**‘గుండెకీ దిగులెందుకు?’ కథ పైన విశ్లేషణ: డా. మంథా భానుమతి:**

పిల్లలు చిన్నతనంలో ఎన్ని గారాలు పోయినా ఎదిగాక తల్లి దండ్రులతో స్నేహితుల్లాగానే మెలగాలి. ముఖ్యంగా తల్లీకూతురు, తండ్రీకొడుకులు ఏ అరమరికలూ లేకుండా... అవసరమైనప్పుడు స్నేహితుల్లాగానే అర్థం చేసుకుందుకు ప్రయత్నించాలి. ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి ప్రయత్నించాలి. ఈ విధమైన స్నేహబంధాన్ని తల్లీకూతుళ్ళ మధ్య చూపించారు మాలాకుమార్.

సుజాతకి చిరాకు, కోపం ఎక్కువయ్యాయి. సాధ్యమైనంతవరకూ అర్జున్ భార్యను అర్థం చేసుకుందుకే ప్రయత్నిస్తాడు. కానీ ఏం మాట్లాడినా విపరీతార్థాలు తీస్తూ, నెత్తిన నీళ్లకుండ పెట్టుకుని సాధిస్తున్న సుజాతను ఏ విధంగా సముదాయించాలో అర్థం కాక సతమతమైపోతుంటాడు అర్జున్. కూతురు అఖిలతో తన అసహాయతని చెప్పుకుంటాడు.

ఆడవాళ్లకి నడి వయసులో వచ్చె సహజమైన శారీరక మార్పుల వల్ల, ఇంటా బైటా అందరూ తనని పట్టించుకోవట్లేదనే అభద్రతా భావం తల్లిని మాంద్యానికి లోను చేస్తోందనీ, ఏదైనా కొత్త వ్యాపకం కల్పించుకుంటే ఆ స్థితి నుంచి బయట పడుతుందనీ తండ్రికి ధైర్యం చెప్పి, అమ్మని

పలకరించడానికి వెళ్తుంది అఖిల.

ఇక్కడే తల్లీకూతుళ్ళ మధ్య ఉన్న, ఉండాల్సిన స్నేహబంధాన్ని చక్కగా చూపిస్తారు రచయిత్రి. భార్యాభర్తల మధ్యనుండాల్సింది కూడా స్నేహబంధమేనని, అర్జున్ పడిన వేదనలో భార్యను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంలో సూచనప్రాయంగా తెలియ జేస్తారు.

కమలా పర్చాగారు నాలుగైదు సంవత్సరాలనుండి బ్లాగును నిర్వహిస్తున్నారు. ఇప్పుడిప్పుడే మంచి మంచి కథావస్తువులను తీసుకుని, కథలు రాస్తున్నారు. సులభమైన శైలిలో, పాఠకుల హృదయాలను స్పృశించే నేర్పు ఉన్న రచయిత్రి. వీరి కలం నుండి మరిన్ని కథలు రావాలని ఆశిద్దాం.

**భారతి రామచంద్రుని (రచయిత్రి, పొన్నాడవారి పున్నాగవనం సాహితీ సమూహంలో కథల విభాగం నిర్వాహకురాలు):**

శ్రీమతి మాలాకుమార్ గారి కథలు హృదయానికి హత్తుకునేలా ఉంటాయి. పాఠకులను ఏకబిగిన చదివించగలవు. అది ఆమె కథాకథన వైదుష్యమని చెప్పవచ్చు. తమ జీవితంలో జరిగిన సంఘటనలను యథాతథంగా మనకు చెప్తున్నట్లే అనిపిస్తుంది కాని చెప్పే తీరు అద్భుతం. చదివేటప్పుడు మనం ఆ సన్నివేశాలను అనుభూతి చెందుతున్న భావన కలుగుతుంది. వారి 'ఏమండీ' కథలు ఇంచుమించు అందరి జీవితాలలో జరిగేవే అయినా వారి నెరేషన్ లో ఒక వింత అందం గోచరిస్తుంది.

ఈ కథాసంకలనంలోని శీర్షిక కథ 'నీ జతగా నేనుండాలి' చాలా అద్భుతమైన కథ. కథా నాయకుడు ప్రకాష్ పాత్రను ఎంతో ఉదాత్తంగా తీర్చిదిద్దారు. గౌరి సమస్యను సహృదయంతో అర్థం చేసుకుని

పరిష్కరించడం గొప్ప ముగింపు.

'మాయాజాలం' కథలో డ్రగ్స్ ఎలా అలవాటు చేస్తారో ఎలా బానిసలౌతారో శకుంతల, రాధికల పాత్రలు చెపుతాయి. చక్కని సందేశాత్మక కథ. 'గుండెలో గుండెదడ' కథలోఅమెరికా ప్రయాణంలో అలేఖ్యకు భర్త అభితో పాట్లు తమాషాగా రాసారు. సున్నితమైన హాస్యం తొంగి చూస్తుంది వీరి కథలలో. ' హైస్కూల్ స్వీట్ హార్ట్స్', 'మౌంట్ రష్మోరాలో రాధామాధవులు' కథలు హృదయాన్ని హత్తుకునేలా ఉంటాయి.

వీరి కథలు చాలావరకు మిలిటరీ అనుభవాలనుండి పుట్టినవి. ఇలా ఈ పుస్తకంలోని అన్ని కథలు అమృతగుళికలే. రచయిత్రి మాలా కుమార్ గారి రచనా శైలి ప్రత్యేకమైనది. ఒక్కమాటలో చెప్పాలంటే మాలాకుమార్ గారి కథలు ఒకసారి చదివితే చాలదు. మళ్ళీ మళ్ళీ చదవాలనిపిస్తుంది. వారి కథలు పుస్తక రూపం దాల్చడం ముదావహం. రచయిత్రికి హృదయపూర్వక అభినందనలు.

**రమ్య ఉద్దంటి (రచయిత్రి, యూట్యూబర్):**

మాలాగారి 'నీ జతగా నేనుండాలి' కథల ద్వారా, ఫేస్బుక్ కథల ద్వారా సైన్యం గురించి సైనికుల జీవన విధానం గురించి, యుద్ధ సమయాల్లో సైనికుల కుటుంబాల మానసిక పరిస్థితుల గురించి, సైకాలజీ గురించి ఇలా ఎన్నో విషయాలు మనం తెలుసుకోవచ్చు. ఫేస్బుక్ కథల సమూహాల్లో ఇచ్చిన టాపిక్స్ కి విభిన్నంగా ఆలోచించి, ఏ విషయాన్నైనా కొత్త కోణంలో ఆలోచించి, పాజిటివ్ ఎండింగ్ తో,

పాఠకులకి ఒక మెసేజ్ ఇస్తూ కథ రాయడం మాలాగారి రచనా శైలి. పరిష్కారం అంటూ లేని సమస్యే ఉండదు అని చెప్పే మాలాగారి కథలు మీరంతా కూడా తప్పక చదివి, 'నీ జతగా నేనుండాలి' పుస్తకాన్ని ఘన విజయం చేయాలనీ... మాలా గారు ఇలాంటి మంచి మంచి కథలు మరెన్నో మాలాంటి పాఠకులకి అందించాలని కోరుకుంటున్నాను.

**గోమతి (సుమచంద్ర) - (రచయిత్రి- యూట్యూబర్):**

'మాలాకుమార్' గారి ఏ రచన అయినా చాలా సున్నితంగా, చిరుహాస్యంతో, చిన్న - చిన్న సరదా సంభాషణలతో సాగుతూ... ముగింపు మాత్రం పాజిటివ్ గానే ఉంటుంది. సైకాలజీ చదివిన కారణంగా ఏమో, పాత్రల మనస్తత్వాలను ఎంతో చక్కగా మన ముందు ఉంచుతారు. భార్య - భర్తలు ఒకరితో ఒకరు ఎలా ఉండాలో చాలా చక్కగా చెబుతారు. మాలాగారు చాలా నెమ్మదస్తురాలు. అందుకే ఏమో, వారి రచనల్లోని ఏ పాత్ర కూడా దుష్టపాత్రగా ఉండదు.

తన ఏమండీ తోనే తన ప్రయాణం... ఆ ప్రయాణాన్ని తను ఎంతో చిలిపిగా, అందంగా, ఆరాధనగా అనుభవిస్తూ, మనకు అదేవిధంగా అందిస్తారు.

"ఏం చేయలేవా?" అనే ఒక్క మాటతోనే పౌరుషాన్ని నింపుకుని సాధించేస్తారు... 'పౌరిషిణి'లా. ఈ పదప్రయోగం నాది కాదండోయ్. మాలకుమార్ గారిదే.

వారిలాగే వారి కథలు కూడా మంచిని, పాజిటివ్ దృక్పథాన్ని పెంచుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మన కమల పరచ గారికి, వారి ఏమండీ గారు 'మాల'గా ఏ శుభముహూర్తాన నామకరణం చేశారో

కానీ, 'మాలాకుమార్' గారి రచనలు అన్నీ కలిపితే అందంగా అల్లిన పారిజాత సుమాల కథామాల.

**జగర్లపూడి భార్గవీ స్వరూప్ (సీనియర్ ప్రఖ్యాత రచయిత్రి, Admin of మన కథలు - మన భావాలు (తెలుగు రచయితల వర్క్ షాప్):**

'కమలా పరచ' ఇది మొట్టమొదటి సారిగా ఫేస్ బుక్ లో నాకు పరిచయమైన మన 'మాలా కుమార్ గారి' పేరు. నేను చదివిన వారి మొట్టమొదటి రచన వారి 'ఏమండి గారి కథలలో' ఒకటి.

ఈ ఫేస్ బుక్ సాహిత్య గ్రూపులలో సాధారణంగా వర్ధమాన రచయితలే ఎక్కవగా రాస్తుంటారు. ఎక్కువగా కుటుంబ కథలు, ప్రత్యేకమైన శైలి లేని, అనేక కథారచన లోపాలతో ఉండే రచనలే అక్కడ చూస్తుండే నాకు, 'కమల పరచ' (మాలాకుమార్) గారి రచన అద్భుతంగా అనిపించింది. వారి రచనలపై ఆసక్తి కలగడంతో వారి రచనలు చదవడం ప్రారంభించాను.

'మాలగారి' ఏ రచన అయినా, చక్కని విషయావగాహనతో, విశ్లేషణతో, లాజికల్ గా, సహజంగా, ఆయా పాత్రల మనస్తత్వాలను వారి పరిస్థితుల ఆధారంగా రూపొందింపబడి ఉంటుంది. వీరి రచనలో నాకు నచ్చే మరొక ప్రత్యేకత ఏంటంటే హాస్యం, చమత్కారం, చతురత. వీరి కథలలో ఆయా పాత్రల మాటల్లో, ప్రవర్తనలో అలవోకగా కనిపించే సున్నితమైన హాస్యం పాఠకుల ముఖాలపై నవ్వులు పూయిస్తుంది. ఆ హాస్యం కథలో అంతర్లీనంగా ఇమిడి సాగిపోతుంది తప్ప, ప్రత్యేకంగా పాఠకులను నవ్వించాలనే ప్రయత్నం కాదది.

ఈ సెన్సాఫ్ హ్యూమర్ వీరి పతిదేవులు, మేజర్ ప్రభాత్ కుమార్

గారిలో సహజంగా ఉందన్నది, మాలగారి 'ఏమండి' కథలలో బాగా అర్థమౌతుంది. వారి సాహచర్యంలో అది కాస్తా 'మాలగారికీ' అంటుకుందనిపించింది.

'మాలగారి' ఏ రచన అయినా, చక్కని విషయావగాహనతో, విశ్లేషణతో, లాజికల్ గా, సహజంగా, ఆయా పాత్రల మనస్తత్వాలను వారి పరిస్థితుల ఆధారంగా రూపొందింపబడి ఉంటుంది.

'నీ జతగా నేనుండాలి!' అనే ఈ కథాసంచికలోని మొదటి కథ 'నీ జతగా నేనుండాలి' మొదలుకొని నలభై ఏడవ కథ 'మంచు తుఫాన్ లో బామ్మా మనవరాలు' వరకూ ప్రతి కథా విభిన్నమైనది.

వారికే పరిచయం లేని 'మాలగారి' లోని రచయితను, వెలికి రప్పించిన వారి లెక్కలు మేస్టారు 'రాజుగారు' మొదలు, వీరి రచనలకు కథా వస్తువై, విశ్లేషకులై, వీరి రచనలకు మెరుగులు దిద్దిన వీరి 'ఏమండిగారు'... ఆమె అభిరుచిని గౌరవించి, బ్లాగ్స్ క్రియేట్ చేయడం దగ్గర నుండి బుక్ ప్రింటింగ్ వరకూ తోడుండి ప్రోత్సాహంతో పాటూ సహాయ సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, స్నేహితుల వరకూ అంతా వారి అభిమానులే.

ఇందరి అభిమానం పొందగలగడానికి కారణం 'మాలగారి' మాట తీరు, వ్యక్తిత్వం. ఈ కథాసంపుటిలోని కథలన్నీ పాఠకుల మనసు దోచుకుంటాయన్నది సత్యం.

'మాలాకుమార్ గారికి' శుభాభినందనలు.

***